ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2010 Q4 అక్టోబరు - డిసెంబరు ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


ఉద్యమంలో చదువులు
తదుపరి కార్యక్రమం..?
చురుక్కుమనిపిస్తున్న కిరణ్
రైల్ రోకో వాయిదా లెందుకు..?
తలిదండ్రుల ఘోష
గ్రేట్ ఆంధ్రాకు రాయకూడదా...?
స్వామిగౌడ్ సడన్ జ్ఞానోదయం
తెలంగాణ పేరెంట్స్ సంఘానికో వినతి
48 గంటల్లో ఏమౌతుంది?
50  వేలు కూడా రాలేదా?
ఓ శకునీ, ఓ కృష?దూ
సమ్మె సక్సెస్ - మ్యాప్ గాయబ్
ధర్మపురివిజయం (అను) పళ్లెరాన్ని గోడకు చేర్చిన కథ
హమ్మయ్యా... తేటపడుతోంది
భిన్నస్వరం
స్వరం పెంచిన టిడిపి
అక్కడ కలుస్తారు.. యిక్కడ కలవరేం?
కార్తీకపూర?మి తర్వాతట...
కొండంత రాగం తీసి..
స్పీకరు పడిగాపులు...
రమణ హంసగీతం - శ్రీరామరాజ్యం
జగన్ ఎమ్మెల్యేలు జారుకుంటున్నారా?
మాయావతి తెలంగాణకు మేలు చేశారా?
ఈ చితి ఆరనివ్వరు...
కంఠశోషేనా..?
రిటైల్‌లో ఎఫ్‌డిఐ
విశ్వాసం నెగ్గిన జగన్
విద్రోహదినం ఏది? 9 లేదా 23..?
కుంభకరు?డు ఉరేసుకుంటాడా?
తుపాకీని గోడెక్కించినదెవరు?
తెలంగాణ ఆత్మహత్యలపై ప్రశ్నలూ, ఓ కథా
బోనులో న్యాయవ్యవస్థ
బోనులో న్యాయవ్యవస్థ
'సెటిలర్' తెలంగాణ అధినేత కాకూడదా?

## అక్టోబరు 2011 ఎమ్బీయస్ : ఉద్యమంలో చదువులు

ఉద్యమంలో చదువులు దెబ్బ తినడం గురించి అందరికీ బాధగానే వుంది. కానీ యిది తప్పదు అని ఓర్చుకుంటున్నారు. ఎంత చదివినా ఉద్యోగాల కోసమే కదా, ఆ ఉద్యోగాలే దొరకనప్పుడు చదివి ప్రయోజనం ఏముంది? అందువలన ఉద్యమం కారణంగా ఉద్యోగాలు వస్తాయన్నపుడు కొద్దికాలంపాటు చదువులు దెబ్బ తింటేమాత్రం నష్టమేముంది? అని కొందరు వాదిస్తారు. విద్యార్థుల పట్ల ఉత్తుత్తి జాలి చూపించేబదులు ఉద్యమం విజయవంతమై రాష్ట్రవిభజన జరగాలని కోరుకోండి అని యితరులను ఎత్తిపొడుస్తారు.

విద్య ఉద్యోగాలకు మాత్రమే అనుకోవడం చాలా పాత కాన్సెప్ట్. గతంలో అయితే ఉద్యోగాలైతే పదిలం, బిజినెస్ అయితే రిస్కు అనుకునే పరిస్థితి వుండేది. పోనుపోను ఉద్యోగాల కూడా రిస్కే అనే స్థితి వచ్చేసింది. ఎవరూ ఏ ఉద్యోగంలోనూ స్థిరంగా వుండరు. మీరు బాగా టేలెంటెడ్ అయితే మీరే ఉద్యోగం వదిలేస్తారు, తక్కువ టేలెంటెడ్ అయితే వాడు పొమ్మంటాడు. మూడేళ్లు ఉద్యోగం చేసి, బయటకు వచ్చేసి మీరే ఆ కంపెనీనుండి ఓ ప్రాజెక్టు తెచ్చుకుని యింకో ఇద్దరితో కలిసి చేసుకుని జీతానికి బదులు కాంట్రాక్టుగా యింత డబ్బు అని తీసుకుంటున్నారు. కంపెనీలు కూడా ఔట్సోర్సింగ్ మరిగాయి.

ఇలాగ ప్రతివాళ్లూ ఓ మినీ ఎంట్రప్రెనార్ అవుతున్నారు. లేదా సెల్ఫ్-ఎంప్లాయిడ్ ప్రొఫెషనల్ అవుతున్నారు. కంపెనీ పెద్ద జాబ్‌ను చిన్న చిన్న తునకలుగా విడగొట్టి ఔట్సోర్సింగ్‌కు కాంట్రాక్టు బేసిస్ మీద యిస్తూన్నపుడు వాడు పని సరిగ్గా చేస్తాడా లేదా, టైముకి డెలివర్ చేస్తాడా లేదా , రేటు రీజనబుల్‌గా వుందా లేదా అని చూస్తాడు తప్ప అగ్రవర?స్తుడా, దళితుడా, మన రాష్ట్రం వాడా, మన ప్రాంతం వాడా.. యివేమీ పట్టించుకోడు. వాడు పని చేయగలగాలి. అంటే కాలేజీలో విద్య క్షుణ?ంగా నేర్చుకుని, దాన్ని ఆచరణలో కూడా (అప్లికేషన్) చేసి చూపించగలిగే ఓర్పు, నేర్పు సంపాదించుకోవాలి.

అందువలన ఏదో బెదిరించో, బతిమాలో కాపీ కొట్టి, పట్టా చేతపట్టి ఏదో గవర్నమెంటు ఉద్యోగంలో ఓ మూల సీటు సంపాదించి 30-35 ఏళ్లు కాలక్షేపం చేసేద్దామంటే జరిగే రోజులు కావు. గవర్నమెంటు ఉద్యోగాలే తక్కువ. వాళ్లూ ఔట్సోర్సింగ్ మరిగారు. రిటైరవుతున్నవారి స్థానాల్లో ఉద్యోగాలు ఓ పట్టాన వేయటం లేదు. బజెట్ ఎలాకేషన్ లేదంటున్నారు. తాత్కాలిక పద్ధతిలో ఎవర్నైనా వేసుకుని పని సాగించండి అని పైవాళ్లు చెపుతున్నారు. ఇలా బయటినుండి వచ్చి పనిచేసేవాళ్లు బుద్ధిగా వుంటారు కాబట్టి అధికారులకీ యిది బాగానే వుంది. గతంలో అధికారులు గవర్నమెంటు పోస్టుల్లో తమ మేనల్లుళ్లనో, బావమరిదినో టెంపరరీగా ఉద్యోగిగా కూర్చోబెట్టి ఐదు పదేళ్ల తర్వాత పెర్మనెంటు చేయించేసేవారు. ఇప్పుడు ఆ మేనల్లుళ్లు, బావమరదులకు గవర్నమెంటు ఉద్యోగాల మోజు పోయింది. ఐటీకో, కార్పోరేట్లకో, మరో దానికో పరుగులు పెడుతున్నారు. అందువలన ఈ అధికారులు ఔట్సోర్సింగులో వచ్చిన ఉద్యోగులను ప్రోత్సహిస్తున్నారు. మొన్ననే రాశాను కదా, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లోనే 3 లక్షల ఖాళీలున్నాయని ఎవరో చెప్పారు.

ఇలాటి పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయనే ఆశతో ఏ విద్యార్థియైనా వుంటే అతనిపై మనం జాలిపడాలి. రాష్ట్రాన్ని విడగొట్టి తెలంగాణ రాష్ట్రం ఏర్పరచాక మొదట ఎన్ని ఉద్యోగాలు మిగులుతాయో చూడాలి. హైదరాబాదులో ఇప్పుడున్న ఉద్యోగాలు మొత్తం రాష్ట్రానికి సంబంధించినవి. రాష్ట్రం చీలిన తర్వాత మూడింట రెండువంతులు జనాభా వున్న ప్రాంతాలకు ఆఫీసులో అధికభాగం తరలిస్తారు కదా. మూడో భాగం ఉద్యోగాలు మాత్రమే మిగులుతాయి. అందునా రిటైరయితే ఏర్పడే ఖాళీలు ఆంధ్రప్రాంతంలో ఎక్కువ వుంటాయి తప్ప తెలంగాణలో తక్కువే కావచ్చు. 1975 ప్రాంతంలో రిక్రూట్ అయినవారు యిప్పుడు రిటైరవుతారు. అప్పట్లో ఆంధ్రప్రాంతంవారే ఎక్కువ ఉద్యోగాలు తెచ్చుకున్నారు. తెలంగాణ ప్రాంతంవారికి క్రమక్రమంగా విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు పెరిగాయి. వారంతా రిటైరవడానికి కనీసం ఓ 5-10 ఏళ్లు పడుతుంది. ఈ లోగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగాలు కల్పించగలగాలి. కోటి ఉద్యోగాలు యిస్తాం, ఇంటింటికో ఉద్యోగం యిస్తాం, అని వాగ్దానాలు చేయడం యీజీయే. అమలు చేయడమే కష్టం.

ఉద్యోగాలంటూ ఏర్పడితే నేటివిటీ వున్నవారికే యిస్తామన్నా, నేటివిటీని నిర్వచించడం కష్టం. 14 ఎఫ్ గురించి రాసినప్పుడు రాశాను కదా, వరుసగా నాలుగేళ్ల విద్యాభ్యాసం, విరామాలతో అయితే ఏడేళ్ల నివాసం నిరూపించగలిగితే చాలు. ఈ విధంగా అయితే యిప్పుడున్న దాని కంటె పోటీ ఏ మేరకు తగ్గుతుంది? మహా అయితే ఏ పదిశాతమో తగ్గవచ్చు తప్ప, స్థానికులకే అన్ని వుద్యోగాలూ దక్కుతాయని ఎలా చెప్పగలం? ఇక ప్రయివేటు ఉద్యోగాలలో కూడా 610 జీవో అమలు చేస్తాం, స్థానికులకు రిజర్వ్ చేయమంటాం, ముస్లిములకు చేయమంటాం, దళితులకు చేయమంటాం అని.. యివన్నీ ఎన్నికల వాగ్దానాలే తప్ప రాజ్యాంగరక్షణ లేనివి. ఎవరైనా నిజంగా బిల్లు పాస్ చేసినా కోర్టు కొట్టి పారేస్తుంది. పెట్టుబడి పెట్టేవాడికి ఉద్యోగిని ఎంచుకునే స్వేఛ్ఛవుండాలన్నది అందరూ ఆమోదించే సూత్రం. రాజకీయపరంగా మరీ ఒత్తిడి చేస్తే పరిశ్రమ యిక్కణ్నుంచి ఎత్తేస్తామని బెదిరిస్తే చాలు, నాయకులు గప్‌చుప్ అయిపోతారు. మహా అయితే అటెండర్ పోస్టులు యిప్పిస్తామంటారు. చదువుకున్నవాడికి అవెందుకు?

అందువలన ఉద్యోగాల కోసమే చదవాలి అన్న ఆలోచన వదిలిపెట్టి చదువు సబ్జెక్ట్ కోసం చదవాలి, ఒంటపట్టించుకుని, ఆ తెలివితేటలు వేరే రూపంగా అప్లయి చేయడానికి పనికి రావకోవడానికి చదవాలి అని ఫీలయిన నాడు ఉద్యమం వలన ఉద్యోగాలు వస్తాయా రాదా అన్న చింత వుండదు. విద్య, నైపుణ్యం, పనిచేసే లక్షణం వుంటే యిక్కడేమిటి, పొరుగురాష్ట్రంలో ఉద్యోగం చేసుకోవచ్చు

లేదా దూరదేశంలో వ్యాపారం చేసుకోవచ్చు అనే ధైర్యం వస్తుంది. కాంపిటీటివ్ పరీక్షల్లో పాసయితే ఎంతో పైకి వెళ్లవచ్చు. పెద్ద కాలేజీల్లో చదివితే కాంపస్ ఇంటర్వ్యూలలో వచ్చి కళ్లకద్దుకుని తీసుకెళతారు – అనే విషయాలు యిప్పటికే నిరూపితమయ్యాయి.

అందువలన ఉద్యమాలలో పాల్గొనే విద్యార్థులు ప్రత్యేక రాష్ట్రం తెచ్చిపెట్టే ఉద్యోగాలకోసం చేస్తున్నారంటే నమ్మబుద్ధి కాదు. వారికి కావలసినది విద్య. పోటీ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజయం సాధించిపెట్టే విద్య. అది ఉద్యమం కారణంగా దూరం అవుతోంది. ఒక పరిమితిలో వుంటే ఏ కష్టాన్నయినా ఓర్చుకోగలరు. పోయిన కాలాన్ని కూడదీసుకోగలం అనుకోగలరు. కానీ రోజుల తరబడి చదువులు పోతుంటే ఎలా?

"స్కూళ్లు మూసేసినా, కాలేజీలు మూసేసినా ఫర్వాలేదు. ఉద్యమలక్ష్యం సాధించాక అదనంగా క్లాసులు పెట్టి మేం కోర్సు పూర్తి చేసేస్తాం." అని హామీ యిస్తున్నారు తెలంగాణ ప్రయివేటు విద్యాసంస్థల నిర్వాహకులు. అదనంగా క్లాసులు పెట్టి నేర్పేస్తే నేర్చేసుకోవడం అంత సులభమేనా? ఏ రోజు పాఠాలు ఆ రోజు చదివితేనే బ్రహ్మపట్టనంత సిలబస్ మన రాష్ట్రంలో వుంది. పెళ్లిళ్లకు సకుటుంబంగా పిలిస్తే మా పిల్లల స్కూళ్లు పోతాయి, పాఠాలు పోతే కష్టం అంటూ తల్లులు పిల్లల్ని తీసుకురావడం లేదు. అలాటిది 20, 30 రోజులు పాఠాలు పూర్తిగా చెప్పడం మానేసి (చాలామంది విద్యార్థులకు యింత గ్యాప్ వస్తే అన్నీ మర్చిపోయి మళ్లీ మొదటికి వచ్చేస్తారు. అందుకనే సమ్మర్ క్లాసులకు పంపుతున్నారు తలిదండ్రులు) ఆ తర్వాత జ్ఞానం అంతా ఒకేసారి ధారపోసేస్తాం పట్టు అంటే పిల్లవాడి బ్రహ్మకేమైనా ఎక్కాలా వద్దా? సినిమాలో చూపిస్తారు చూడండి – కమండలంలో నీరు శిష్యుడి నోట్లో వంపితే లేదా గురువుగారి తలనుంచి ఓ కాంతిరేఖ శిష్యుడి తలలోకి దూరితే 64 కళలూ ఒక్కసారి వచ్చేస్తాయి. అలా వుంది వీళ్లు చెప్పేది!

ఇవన్నీ ప్రయివేటు విద్యాసంస్థలు చెప్పే మాటలు. ప్రభుత్వ విద్యాసంస్థలైతే యీ పాటి హామీ కూడా యివ్వవు. కోదండరాం 'స..' అనగానే ప్రభుత్వం గబగబా స్కూళ్లన్నీ మూసిపారేస్తుంది. కానీ ప్రయివేటు విద్యాసంస్థలు మాత్రం తమ విద్యార్థులకు సెలవులివ్వకుండా నూరుతూనే వున్నాయి. రేపు పోటీ పరీక్షల్లో ఆ విద్యార్థులతో ప్రభుత్వస్కూళ్ల విద్యార్థులు పోటీ పడినపుడు ఎవరిది పై చేయి అవుతుందో వేరే చెప్పనక్కరలేదు. అంతేకాదు, ఆంధ్రప్రాంత విద్యార్థులతో పోటీ పడితే అంతే సంగతులు ! ఎందుకంటే వాళ్లకు చదువులు పోలేదు కదా!

ఈ విషయంపై కంచ ఐలయ్యగారు రెండు వారాల క్రితం "చదువుకు సమ్మె వద్దు" అనే పేరుతో జ్యోతిలో వ్యాసం రాశారు. ఈ ఐలయ్య యూనివర్శిటీలో ప్రొఫెసర్. దళితమేధావి. అన్నీ దళితసులోచనాలతోనే చూస్తారు. కవిత టాంక్‌బండ్‌పై దసరారోజుల్లో బతకమ్మ అడడానికి అనుమతి తీసుకున్న తర్వాత కితం వారం బతకమ్మ పండగలో వున్న కులం కోణం గురించి రాశారు. అది బిసిల పండగ అనీ, రెడ్లు, వెలమలు, యితర అగ్రకులస్తులు ఎప్పుడూ దాన్ని పట్టించుకోలేదని, అలాటిది యీ రోజు రాజకీయకారణాలతో ఆ బతుకమ్మను కూడా బిసిలనుండి లాక్కున్నారని వాపోతూ రాశారు. (ఈయన రాశాక మరొకరు స్పందిస్తూ, బిసిలు దళితులనుండి బతుకమ్మ పూజ లాక్కున్నారని రాశారు). నైజాం తెలంగాణలో రెడ్లు, దొరలు బిసిల చేత బలవంతంగా బతకమ్మ ఆడించి తమ కామత ృష? తీర్చుకునేవారని, బతకమ్మ పాటల్లో చాలా పాటలు వాటి గురించి చెపుతాయని గుర్తు చేస్తూ 'ఈనాడు ఓ దొరసాని బతుకమ్మ ఆడుతోంది' అంటూ కవిత గురించి రాశారు.

ఈ 'చదువుకు సమ్మె వద్దు' వ్యాసంలో ఆయన జీవితంలో అనుభవించిన కొన్ని వాస్తవాలు రాశారు. తెలంగాణలో ముందునుండీ భూస్వామితత్వం ఎక్కువ కాబట్టి, వాళ్లు దళితులు చదువుకోవడాన్ని ప్రోత్సహించేవారు కాదు. వాళ్లా చదువుకి పోతే మాకు కూలీవాళు దొరికేదెట్లా? అనే ఆలోచన వారిది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, ఊరూరా బడులు పెట్టినా, ఊళ్లో దొరలు ఎలిమెంటరీ స్కూలు టీచర్లను పాఠాలు చెప్పవద్దని, జీతం తీసుకుని బడి మూసేసి యింట్లో కూర్చోమని చెప్పేవారట. దొరలు లేని వూళ్లలో కొద్దో గొప్పో స్కూళ్లు నడిచేవి. దొర వుంటే ఊళ్లో స్కూలు నడపనివ్వడు. తన పిల్లల్ని మాత్రం పెద్ద వూళ్లో పెట్టి చదివించేవారు. (ఈనాడు 50 ఏళ్ల వయసులో వున్న అనేకమంది తెలంగాణ నాయకులు స్వంతవూరు ఎక్కడున్నా హైదరాబాదులో చదివినవారే, గమనించండి). పరిస్థితి యిలా వుండగా 1969 తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఐలయ్య అప్పుడు 11 వ తరగతి చదువుతున్నారు. ఉద్యమం కారణంగా ఓ ఏడాది చదువు కోల్పోయారు. ఉద్యమం వలన చదువు పాడైంది కదాన్న జాలితో టీచర్లు ఉదారంగా మార్కులు వేయడం, కాపీ కొట్టినా చూసి ఊరుకోవడం మొదలుపెట్టారు. దానివలన తెలంగాణలో చదువు క్వాలిటీ అధ్వాన్నమైంది.

దీని గురించి ఆయన స్వయంగా రాసినది యిది – "1969 తర్వాత మా జీవితంలో కాపీ కొట్టి పరీక్ష రాయడం మొదలైంది. ఈ క్రమంలో పంతుళ్లకు మార్కులు యివ్వడం, విద్యార్థులకు పుచ్చుకోవడం అలవాటైంది. చదివి పరీక్ష రాసేవాళ్లను పిచ్చివాళ్లుగా చూడడం, పేపర్లు చదివి మార్కులిచ్చే పద్ధతి లేకపోవడం, విద్యార్థుల జీవితంతో ఆడుకోవడం అలవాటైపోయింది. దాదాపు 1980 దాకా యీ పద్ధతి ఏ ఆత్మవిమర్శ లేకుండా నడిచింది. 1980 నుండి 1996 భువనగిరి తెలంగాణ సదస్సు వరకు ఈ అంశంపై బాయ్‌కాట్‌లు జరగక కాస్త నిలకడగా స్కూళ్లు నడిచాయి. ఈ కాలంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్న పిల్లలే గ్రామాల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. కొందరు విదేశాల్లో కూడా వున్నారు. కానీ ఇదే దశలో కమ్యూనిస్టు, మావోయిస్టు ఉద్యమానికి తెలంగాణ కేంద్రబిందువై పోయింది. 1969 నుండి తెలంగాణ ఉద్యమం, మావోయిజం విద్యారంగాన్నే టార్గెట్ చేశాయి. "ఈ చదువులన్నీ బూర్జువా చదువులు" అనేవారు. చదువుకోకపోతే ఎట్లా? అని అడిగేవారిని భూస్వాముల తొత్తులుగా, బూర్జువా తొత్తులుగా ముద్ర కొట్టేవారు. వందలాదిమంది స్కూళ్లు, కాలేజీలు వదిలి మావోయిస్టులయ్యారు.

''1990 దశకంలో వచ్చిన తెలంగాణ ఉద్యమం ప్రపంచీకరణతో కలిసి వచ్చింది. అన్ని తరగతుల కులాల ప్రజలకు పోటీపడి విద్య నేర్చుకోవలసిన అవసరం వచ్చిపడింది. ఈ ఆధునిక తరంలో విద్య ఒక్కటే వాళ్లను దారిద్ర్యం నుంచి,ఈ దశలో ప్రయివేటు, ప్రభుత్వ స్కూళ్లకు ఎనలేని అఘాతం ఏర్పడింది. ఊళ్లల్లో మళ్లీ బాయ్‌కాట్లు, మొక్కుబడి పరీక్షలు, ఏం రాసినా మార్కులు యివ్వడం పద్ధతి స్కూళ్లనుండి కాలేజీలకు పాకింది. గత రెండేళ్లలో అసలు క్లాసురూంలో పాఠాలు చెప్పడం పంతుళ్లకు, వినడం విద్యార్థులకు అలవాటు తప్పినంత పనైంది. అన్ని ఉద్యమాలకు యూనివర్శిటీ, కాలేజీ, స్కూలు టీచర్లు సిద్ధాంత నాయకులయ్యారనేది ఓ వాస్తవం. (ఇది కరక్టు. కోదండరాం మాత్రమే కాదు, టీవీ చర్చల్లో కనబడేవాళ్లల్లో కూడా టీచర్లే ఎక్కువ) వీరందరికీ తాత్కాలిక, దీర్ఘకాలిక అవసరాలుంటాయి. అందుకు ఉపయోగపడే కేంద్రాలుగా విద్యాలయాలను మార్చి వాటిని బాయ్‌కాట్ చేయించి, లేదా సమ్మెలద్వారా మూసివేయించడం అత్యవసర కర్తవ్యంగా చేస్తున్నారు. దీనికి తీవ్రంగా బలయ్యేది విద్యాలయాల్లో అడుగుపెట్టే మొదటితరంవారు. ఈ ఆధునిక దశలో విద్య ఒక్కటే దారిద్ర్యం నుండి, రోగాల నుండి, మూఢనమ్మకాల నుండి బయటపడవేయగలదని మనకి తెలుసు.'' అన్నారు.

1969, 1972 నాటి రోజులకు యిప్పటి రోజులకు చాలా తేడాలున్నాయని గతంలో కూడా వ్యాసాల్లో రాశాను. అప్పట్లో ఆ సమ్మె అని, యీ సమ్మె అని నెలల తరబడి కాలేజీ మానేసి యింట్లో కూర్చునేవాళ్లం. చదువు పూర్తయినా ఉద్యోగం రాదన్న నిరాశ ఒకటి. విదేశాలకు వెళ్లే పోటీ పరీక్షల పేర్లు కూడా వినని పరిస్థితి. తలిదండ్రులు కూడా మమ్మల్ని చూసి నిట్టూర్చి వూరుకునేవారు. ఈ రోజు పరిస్థితి అలా కాదు. 8 వ తరగతి నుండి విద్యార్థి భవిష్యత్తు పట్ల తలిదండ్రులు ఎంతో ప్లాన్ చేస్తున్నారు, ఎన్నో త్యాగాలు చేస్తున్నారు. విద్యార్థులకు కూడా చదువులు అబ్బుతున్నాయి. గ్రామీణ, వెనుక బడిన కులాల పిల్లలు కూడా ఒక్కడికి చదువు అబ్బితే కుటుంబం ముఖచిత్రం మొత్తం మారిపోతోంది. డాలర్ల వర్షం కురుస్తోంది. విదేశీయాత్రలు, పటిష్టమైన యిల్లు కట్టుకోవడాలు, భాషలో, దుస్తుల్లో, జీవనశైలిలో కొండంత మార్పు – ఒకటా, రెండా! బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ఏర్పడిందే దానికి కారణం మన ప్రభుత్వాలు, సిఎంలు కాదు, మన విద్యార్థులే. మన యువత తమ చదువులతో, పనిచేసే స్వభావంతో అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చారు. సరిగ్గా యీ వర్గాన్నే తెలంగాణ ఉద్యమం దెబ్బ కొడుతోంది.

రాష్ట్రవిభజన వంటి అంశం ఓ పట్టాన తేలేది కాదు కదా, ఉద్యమం పేరుతో రోజుల తరబడి స్కూళ్లను బంద్ చేయడమేమిటని ఐలయ్య ప్రశ్నించారు. నువ్వు బడిలో వుంటే తెలంగాణ ఎట్లా వస్తుంది? అని విద్యార్థిని ప్రశ్నించడాన్ని తప్పు పట్టారు. 'ప్రభుత్వ స్కూళ్లలో పాఠాలు లేని విద్యార్థులు నామమాత్రపు పడబోతలతో యూనివర్శిటీలకు వస్తున్నారు. ఇక్కడ కూడా మార్కులు యిచ్చి పుచ్చుకోవడం మామూలు చేశాం.' అని ఒప్పుకున్నారు. 'విద్యను ఎస్సెన్షియల్ సర్వీసు అని ఎందుకనకూడదు? టీచర్ల సమ్మెను ఎందుకు నిషేధించకూడదు?' అని అడుగుతూనే టీచర్లను ఎండగట్టారు. 'తమ పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లలో చదివించే ప్రభుత్వ స్కూళ్ల టీచర్లు తమ స్కూళ్ల ప్రయివేటీకరణను అడ్డుకుంటారు. (తమ ఉద్యోగం పోతుందని). వీళ్ల స్కూళ్లలో చదివే పిల్లల టీచర్లు పేదలు, కింది కులాలవారు. గత రెండేళ్లలో ఉద్యమం పేరిట ఎన్నో రోజులు మూసి వుంచినా వీరిని వారు నిలదీయలేరు. అదే ప్రయివేటు స్కూళ్లను ఒక రోజు మూసేసినా యీ టీచర్లు వెళ్లి వాళ్లను నిలదీస్తారు.' అంటూ వారి డబుల్ స్టాండర్డ్స్‌ను నిలదీశారు.

తెలంగాణ రావాలి, ఈ దేశంలో విప్లవం కూడా రావాలి. వాటికి పిల్లల భవిష్యత్తుతో ఆడుకోని పోరాట రూపాలు ఎంచుకోవాలి. అని రాస్తూనే ఐలయ్య 'కిందికులం వారిని కొత్తతరం జీతగాళ్లుగా తయారుచేసుకునేందుకు వీలుగా ప్రభుత్వ స్కూళ్లను మూసెయ్యడానికి ఉద్యమం ఎత్తుగడ యిది' అని సందేహాన్ని వెలిబుచ్చారు. కిందికులం అనే బదులు, కిందివర్గం అంటే సరిపోతుందని నా ఉద్దేశం. దళితుడిగా ఆయన అనుభవాలు ఆయనవి కనుక ఆయనకు ఆ రకమైన దృక్పథం ఏర్పడి వుంటుంది. మనం వాదించలేం. నేనా జీవితాన్ని చూడలేదు కాబట్టి ఆ రకమైన అనుభవం, అనుభూతి లేదు కాబట్టి నా ఆలోచన యీ రీతిగా వుండవచ్చు. కానీ ఏది ఏమైనా ఐలయ్య చాలా మంచి పాయింటు లేవనెత్తారు. ఈ మధ్యే ఒక పిల్లవాడి తండ్రి నాకు మెయిల్ రాశారు. మా పిల్లవాడి స్కూలు చాలాకాలంగా మూసేశారు. విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించారు కాబట్టి, యిలా మూసేయడం వలన మా వాడి ప్రాథమిక హక్కుకి భంగం కలిగిందని కేసు వేయవచ్చునా? అని. వేసి చూడండి అన్నాను. ఏమవుతుందో చూడాలి.

నేను యింతకుముందు వ్యాసాల్లో కూడా రాశాను. 1956 తర్వాత కొద్దిగా, వెంగళరావుగారి పీరియడ్ నుండి బాగా, ఎన్టీయార్ కాలం నుండి యింకా బాగా తెలంగాణలో బిసి, యితర అణగారిన వర్గాలు బలపడుతూ వచ్చాయని, విద్యపరంగా, ఆర్థికపరంగా, రాజకీయపరంగా చరచరా పైకి ఎగబాకుతున్నారని ! కెసియార్ ఉద్యమం కారణంగా వాళ్లు మళ్లీ వెనుకబడే ప్రమాదం వచ్చిందని, రాష్ట్రవిభజన అనంతరం వారు నష్టపోయే ప్రమాదం వుందని నేను భయపడుతూ వచ్చాను. కెసియార్, హరీష్‌రావులకు నిరంతరం ఆంధ్ర ప్రయివేటు విద్యాసంస్థలను తిట్టడమే పని. కెసియార్ పిల్లవాడు, డి శ్రీనివాస్ పిల్లవాడు మా దగ్గరే చదివారు అని విజ్ఞాన్ రత్తయ్యగారు ఎబిఎన్ ఛానెల్‌లో యీ మధ్య చెప్పారు. హరీష్‌రావు పిల్లలు విజయవాడలో చదువుతున్నారని అంటారు (నాకు తెలియదు). కావచ్చు. హిందీ రాష్ట్రాలలో నాయకులు తమ రాష్ట్రంలో ఇంగ్లీషు మీడియం స్కూళ్లు తీసిపారేసి అందరూ హిందీ చదవాలంటారు. తమిళ రాష్ట్రాలలో నాయకులూ డిటో, తమిళమీడియమే అంటారు. మళ్లీ వీళ్లు తమ పిల్లల్ని బయట పెట్టి ఇంగ్లీషు మీడియం స్కూళ్లల్లో చదివిస్తారు.

గట్టిగా అడిగితే మా ఆవిడ నిర?యం అది. కుటుంబ వ్యవహారాల్లో నేను కలగజేసుకోను. నా జీవితాన్ని ప్రజలకే అంకితం

చేశాను కాబట్టి కుటుంబం గురించి పట్టించుకోను అని దబాయిస్తారు. అవును మరి, సామాన్యుడు కూడా బాగా చదువుకుంటే వాళ్ల పిల్లల ఘనత ఏం మిగులుతుంది? ఇప్పుడు తెలంగాణలో గొడవలుగా వున్నాయి కాబట్టి యిక్కడి తలిదండ్రులు విజయవాడ పరిసర ప్రాంతాల్లో పిల్లల్ని పెట్టి చదివిస్తున్నారని అక్కడ అడ్మిషన్లు 30% పెరిగాయని, ఆంధ్రప్రాంతంవారు తమ పిల్లల్ని ఇంజనీరింగ్‌కై తమిళనాడు, కర?టక పంపించారని, హైదరాబాదు పంపలేదు కాబట్టి యిక్కడి కాలేజీలో ఖాళీగా వున్నాయని అంటున్నారు. ఇలా పంపగలిగే స్తోమత ఎంతమందికి వుంటుంది చెప్పండి. డబ్బుండాలి, విజయవాడలో పరిచయస్తులుండాలి, ఇక్కడ ప్రాంతీయ భేదాలు ముదిరిన కొద్దీ అక్కడ పిల్లవాణ్ని పట్టుకుని కొట్టరన్న ధైర్యం వుండాలి, పిల్లవాడు చెడిపోవడన్న నమ్మకం వుండాలి. వీటిలో ఏది లేకపోయినా వాడు ఉద్యమానికి గురి కావలసినదే కదా!

రేపు జాతీయస్థాయిలో వాడు పరీక్షల్లోనో, ఇంటర్వ్యూలోనో ఫెయిలయినప్పుడు "మరి జండా పట్టుకుని తిరిగాను కదండీ.. కాలేజీ మూసేశారు కదండీ... రాజకీయ కారణాల వలన టీచర్ల సమ్మె కదండీ.." వంటి కారణాలు చెపితే ఎవరైనా జాలిపడి సెలక్టు చేస్తారా? వాడి విజయం వెనుక వాడి తల్లిదండ్రుల కనీసం పదేళ్ల చెమట వుంటుంది, వాడి అపజయం వెనుక పదేళ్ల కన్నీరు వుంటుంది. తెలంగాణ వస్తే మాత్రం వీళ్లలో ఎంతమందికి జీవనాధారం చూపించగలరు యీ ఉద్యమనాయకులు? వాళ్ల పిల్లలకు చదువులు కావాలా ఏమన్నానా? కేకే గారి కుమారరత్నం హంతకుడని విన్నాం, జానారెడ్డి కుమారుడు సెటిల్‌మెంట్లలో దిట్ట అని విన్నాం, ఇక కెటియార్ చదువుకుని అమెరికాలో వుద్యోగం చేస్తూ తండ్రి వారసత్వం హరీష్ పట్టుకుని పోతాడేమోనన్న భయంతో పరిగెట్టుకుని వచ్చేశారంటేనే తెలుస్తోంది ఆయన ఉద్యోగానికి యిచ్చిన విలువ.

చదువు అనేది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి పాలిట మంత్రదండం. బాగా చదువుకుంటే జై పాతాళభైరవి అన్నట్టు పదేళ్లలో అందలం ఎక్కించగలదు. నేను మధ్యతరగతివాణ్ని కాబట్టి చదువుకే పెద్దపీట వేస్తాను. చదువుకునే అవకాశం అందరికీ అందాలని కోరుకుంటాను. అందకుండా అడ్డుపడేవాళ్లను యిష్టపడను. తెలంగాణ ఉద్యమకారులు కావచ్చు, సమైక్య ఉద్యమకారులు కావచ్చు, ఎవరు చేసినా అడ్డుపడితే తప్పే! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

## అక్టోబరు 03 ఎమ్బీయస్ : తదుపరి కార్యక్రమం..?

తెలంగాణ ఉద్యమం కీలకదశ చేరిందన్న మాట ఆర్నెల్ల క్రితం నుండీ పదే పదే వింటున్నాం. ఎవరైనా తెలంగాణ అభివృద్ధి చెందింది కదా, వేర్పాటు ఎందుకు? అని అడిగితే 'ఉద్యమం యీ దశకు చేరినతర్వాత, అటువంటి సున్నితమైన అంశం గురించి అనవసర చర్చలు జరిపి తెలంగాణ ప్రజల మనోభావను దెబ్బ తీయకండి, చర్చల స్థాయి దాటిపోయింది.' అని కొట్టి పారేస్తూ వచ్చారు. కానీ ఢిల్లీ అధినాయకులు అలాటి దశకు వచ్చినట్టుగానే ఏమీ అనుకోవటం లేదు. 'రాష్ట్రంలో ఒక్క పార్టీ వారు అనగా కాంగ్రెస్‌వారితో మాత్రమే మాట్లాడాం. జాతీయస్థాయిలో అందరితోనూ మాట్లాడాలి. చర్చలు కుదరవరవంటే లాభం లేదు, చర్చించి తీరాలి' అని ఆజాదు, 'రాష్ట్రస్థాయిలో నాలుగు పార్టీలతో మాట్లాడాలి. అందరికంటె ముందు మా పార్టీ వాళ్లే ఏమీ తేల్చడం లేదు. వాళ్ల అభిప్రాయాలు చెప్పాకనే అఖిలపక్షం ఏర్పాటు చేస్తాను' అని చిదంబరం చెప్పారు. సకల జనుల సమ్మె తీవ్రంగా సాగుతోంది కదా మరి నిర?యం వెంటనే తీసుకోవాలని అనిపించడం లేదా? అని అడిగితే 'అయితే సమ్మె మానేయండి' అంటున్నారు. తెలంగాణ గొంగళి 2004 నుండి ఏడేళ్లలో ఎన్ని అంగుళాలు ముందుకు నడిచింది చెప్పండి.

డిసెంబరు 9 న పది అడుగులు ముందుకు వెళితే 23 కి మళ్లీ ఆ పది అడుగులూ వెనక్కి లాగేశారు. కృష? కమిటీని దానిమీద కూర్చోబెట్టి ఎక్కడికీ కదలకుండా చేసేశారు. ఇన్నాళ్లకి ఆజాద్ యిరుప్రాంతాల నాయకులతో మాట్లాడారు. అదీ విడివిడిగా, కలివిడిగా కూర్చోబెట్టి ముఖాముఖీ చర్చలు జరపనే లేదు. ఇంకేం లాభం? జ్యోతివాళ్లు ఆజాద్ మూడు ప్రతిపాదనలు ముందు పెట్టారని, మూడిట్లోనూ హైదరాబాదు యూటీ చేయాలనే ప్రతిపాదన వుందనీ అంటోంది. యూటీ అంటే మజ్లిస్ వద్దని ఎందుకు అంటోంది అని ఆశ్చర్యపడ్డాను కదా. ఎమ్. సిద్దారెడ్డి అనే పాఠకుడు ఓ ప్రతిపాదన చేశారు. 'యూటీ అనగానే సెంట్రల్ గవర్నమెంటు ఎస్టాబ్లిష్‌మెంట్స్ జోరుగా వస్తాయి. వాటితో బాటు ఉత్తరభారతం నుండి హిందూ ఉద్యోగులు వచ్చి యిక్కడ స్థిరపడతారు. ఢిల్లీలో అలాగే జరిగింది. దేశంలోని అన్ని ప్రాంతాలవారూ వచ్చి స్థానికంగా వున్నవారిని ముంచెత్తేశారు. అక్కడ యుపి కల్చర్ కంటె పంజాబీ కల్చరే ఎక్కువ కనబడుతుంది. కొన్ని ప్రాంతాల్లో సౌత్ ఇండియన్ కల్చర్! హైదరాబాదులో ఉత్తరాది హిందువుల ప్రాబల్యం పెరిగిన కొద్దీ యిక్కడి ముస్లిములు భయపడతారు. ఎందుకంటే ఉత్తరాన మతకలహాలు, హిందూ–ముస్లిం వైషమ్యాలు ఎక్కువ. నిజాం రాజ్యంలో హిందువులు నలగడం చేత ముస్లిములంటే వాళ్లకి భయం. ఎవర్ని చూసినా రజాకార్లేనేమోనన్న శంక.

'అందుకే ముస్లిం బూచి చూపించి తెలంగాణలో ప్రాబల్యం సంపాదించుకోవడానికి బిజెపికి అవకాశం చిక్కింది. కోస్తా, సీమల్లో ముస్లింలు మెజారిటీలో వున్న ప్రాంతాల్లో సైతం బిజెపి వ్యాప్తి చెందలేకపోయింది. ఎందుకంటే అక్కడ మతవైషమ్యం లేదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడేందుకు ముందు హైదరాబాదులో మతకలహాలు లేవు, కోస్తా, సీమ వాళ్లు వచ్చాకనే యిక్కడ మతకలహాలు అని అనడం హాస్యాస్పదం. అదే నిజమైతే ముందుగా కోస్తా, సీమ ప్రాంతాల్లో మతకలహాలు జరగాలి. అక్కడ ఎవరు ముస్లిమో, ఎవరు హిందువో చెపితే తప్ప తెలియనంతగా కలిసిపోయారు. నిజాం హైదరాబాదులో నిజాం నియంతగా వున్నాడు కాబట్టి మతకలహాలు జరగలేదు.

హిందువులను యిస్లాంలోకి మతపరివర్తన చేయించినా గట్టిగా నోరెత్తే ధైర్యం హిందువులకు అప్పట్లో లేకపోయింది. ఆర్యసమాజ్ వారు మాత్రమే కాస్త ఎదిరించేవారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణ హిందువులకు ధైర్యం పెరిగి తమ తడాఖా చూపిద్దామని ఉబలాటపడ్డారు. అప్పణ్నుంచే మతకలహాలు జరిగాయి. అవి తెలంగాణ హిందువులకు, తెలంగాణ ముస్లిములకు తప్ప వాటిలో కోస్తా, సీమవారి ప్రమేయం లేదు. వినాయకచవితి ఉత్సవాలు గతంలో యింత ఉధృతంగా వుండేవి కావు. గత 30 ఏళ్లగా మాత్రమే ఏటేటా పెంచుతూ వచ్చారు. దీనికి పోటీగా మజ్లిస్ వారు పంఖా వూరేగింపులని కొద్దికాలం చేశారు కానీ ఓపిక లేక మానేశారు. ఇప్పటికీ వినాయక నిమజ్జనం రోజు అందరికీ టెన్షనే. నిమజ్జనం శుక్రవారం వచ్చిందంటే ఏ మసీదు దగ్గరో ఊరేగింపు ఆపేసి, బాజాలు వాయించడం, మసీదులోంచి రాళ్లు పడడం జరుగుతాయేమోనని పోలీసులు బిక్కుబిక్కుమంటూనే వుంటారు.

ఈ వాతావరణం మజ్లిస్‌వారికి నచ్చని వ్యవహారం. నిజంగా మెజారిటీ మతస్తులు హింసకు దిగితే వాళ్లు సరిపోరని వాళ్లకూ తెలుసు. ముస్లిముల అభద్రతాభావమే పెట్టుబడిగా వాళ్లు రాజకీయంగా నిచ్చెనమెట్లు ఎక్కుతూ వచ్చారు. కానీ నిజంగా మతకల్లోలాలు జరిగి ముస్లిములను కాపాడుకోలేకపోతే ఆ నిచ్చెన ఒక్కసారిగా కూలిపోతుందని తెలుసు. కోస్తా, సీమ ప్రజలతో వాళ్లకు పేచీ లేదు. ఎందుకంటే వాళ్లు నిజాం పాలనలో మతవివక్షతకు గురయినవారు కారు, రజాకార్ల చేతిలో వాళ్లు హింసించబడలేదు. అందువలన వాళ్లకు ముస్లిముల పట్ల ప్రత్యేకమైన భావం – అభిమానం గాని, ద్వేషం గాని – లేవు. అందువలననే మజ్లిస్ 1969లో కూడా సమైక్యనినాదానికే కట్టుబడి వుంది. గత పదేళ్లగా కూడా సమైక్యమే అంటోంది. రాష్ట్రం విడగొడితే తెలంగాణ హిందువులు మతపరమైన భావనతో బిజెపికి ఎక్కువ సీట్లు యిచ్చి, బిజెపి బలపడుతుందని, తద్వారా తమకు ముప్పు కలుగుతుందని వాళ్లు బాహాటంగా చెప్తున్నారు. ఇప్పుడు ఉత్తరాది నుండి హిందువులు పెద్ద సంఖ్యలో వచ్చిపడితే తెలంగాణ హిందువులకు మంచి ఊతం కలుగుతుందని వాళ్ల భయం. బిజెపికి దక్షిణాన కంటె ఉత్తరాన ఎక్కువ పలుకుబడి వుంది కాబట్టి వచ్చినవాళ్లు బిజెపి సమర్థకులైతే ముప్పు యింకా పెరిగినట్లే!' ఇదీ అయన వాదన. వింటే సబబుగానే అనిపించింది.

ఆంధ్రజ్యోతి హైదరాబాదు యూటీ వాదనను ఉద్యమకారులు పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. ఎందుకంటే ఆజాద్ నివేదికలో అది వున్నట్టు వాళ్లకు సమాచారం ఏమీ వచ్చినట్టు లేదు. ఆయన వైయస్ పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ స్థితిగతుల గురించే రిపోర్టు తయారుచేసినట్టుంది. మరి యిరుప్రాంతాల నాయకుల వాదనలు విన్నదంతా ఏం చేశాడో ఏమో !

2

తెలంగాణ ఉద్యమకారులందరికీ ఎట్టకేలకు ప్రధానమంత్రి ఎపాయింట్‌మెంట్ సోమవారం సాయంత్రం దొరికింది. ఆయన ఎప్పటిలాగ 'అచ్ఛా' అనేసి వూరుకున్నాడు. ఏమీ హామీ యివ్వలేదని కెసియారే చెప్పేశారు. అయినా చెప్పవలసినది సోనియా అన్న విషయం వీళ్లకూ తెలుసు, ఆయనకూ తెలుసు. మూలపుటమ్మ దర్శనమే యివ్వలేదు. అందరూ పోలోమని వెనక్కి వచ్చిపడ్డారు. ఎవరు రమ్మన్నారో, ఎందుకు రమ్మన్నారో తేలలేదు. సాధించినది పూజ్యం. స్వామిగౌడ్‌పై హత్యాయత్నం అని హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి యింతమంది వెళ్లాలా? సిఎంపై ఫిర్యాదు చేస్తే పిఎం వింటాడా? అందునా ఒకే పార్టీ అయినపుడు..!ఏదో అవుతుందనుకుని వెళ్లి ఏమీ జరగకుండా వచ్చారన్నది సులభంగా వూహించవచ్చు.

అయితే అక్కడ జరిగినదేమిటంటే టికాంగ్రెస్ నాయకులపై విరుచుకుపడడం. మీరే మమ్మల్ని దింపారు, మీరు రాజీనామా చేయండి అంటూ స్వామిగౌడ్ జానారెడ్డిని తిట్టిపోశారు. 'నువ్వు రాజీనామా చేసి రా, అప్పుడు అడుగు' అని జానారెడ్డి తగులుకున్నారు. ఆయనెందుకు రాజీనామా చేస్తాడు? కోదండరాం చేశారా? ఏదో ప్రభుత్వోద్యోగంలో వుంటే యిలాటివి ఎన్ని చేసినా చెల్లుబాటు అవుతాయి కానీ రాజీనామా చేసి వస్తే ఏ పార్టీవాళ్లయినా చేర్చుకుంటారా? అయినా మీరే మమ్మల్ని దింపారని ఉద్యోగి నాయకులు కాంగ్రెస్‌వారిని నిందించడం అన్యాయం. వాళ్లెక్కడ దింపారు? స్వంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేయమని వాళ్లు ప్రోత్సహిస్తే హై కమాండ్ వాళ్ల తాట తీస్తుంది. స్వామిగౌడ్ కూడా మేం సమ్మె చేయం, నాయకులను రాజీనామాలు చేసి ముందువరుసలో నిలబడమనండి, వెనక్కాల మేం నిలబడతాం అంటూ వచ్చారు. అంటూనే మరి ఎవరి మాయలో పడ్డారో కానీ సమ్మె మొదలెట్టారు. దానికి జానారెడ్డినో, కేకేనో నిందించడం తప్పు. సమ్మె చేయండి, ప్రభుత్వం మీ కాళ్ల దగ్గరకు వస్తుందని ఊరించి ప్రోత్సహించిన తెరాస, జాక్ వాళ్లని దండించాలి వాళ్లు.

అసలు యూనియన్ వాళ్లు ఏదైనా సమ్మె నిర్వహించేముందు బ్యాలట్ నిర్వహించి, అందర్నీ సంప్రదించి సమ్మెలోకి దిగాలి. కానీ ఎవరూ అది చేయరు. యూనియన్ లీడర్లు తాము తలచుకున్నపుడు సమ్మె మొదలుపెట్టి, యిష్టం వచ్చినపుడు ఆపేస్తారు. గట్టిగా అడగడానికి ఎవరికీ దమ్ము చాలదు. ఎందుకంటే లీడర్లచుట్టూ ఓ గ్రూపు వుంటుంది. వాళ్లు నీకేం తెలుసు పోవోయ్ అని దబాయించేస్తారు. వర్కర్స్ యూనియన్ వాళ్లయితే తంతారు కూడా. అందునా మనమందరం సైలెంట్ మెజారిటీగాళ్లం. ఏది మంచిదో, ఏది చెడో ఖచ్చితంగా తెలియదు. ఏదీ పూర్తిగా తెలుసుకోం, దేనిమీదా ఖచ్చితమైన నిర?యం వుండదు. ఏదో యిది మంచిదే అంటున్నారుగా, చూదాం మంచి జరుగుతుందేమో అనుకుని ఛాన్సు తీసుకుంటాం. జరక్కపోతే కాస్సేపు మనను తిట్టుకుని, యూనియన్ లీడర్ల స్వార్థపరత్వాన్ని పక్కవాడితో కలిసి తిట్టిపోసుకుని, పోనీలే మనతోపాటు మన కొలీగ్స్ అందరూ నష్టపోయారు కదాని ఓదార్చుకుంటాం.

అందువలననే యూనియన్ లీడర్ల ఆటలు సాగుతాయి. వాళ్లు రాజకీయనాయకులకు ఒక మెట్టు మాత్రమే తక్కువ.

ఇప్పటిదాకా చేసిన సమ్మె వలన ఢిల్లీ అంగుళం కూడా కదలలేదని అర్థమైంది కదా. ఆజాద్ గారు త్వరలో.. అంటున్నారు తప్ప ఎంత వేధించినా టైము కమిట్ కావటం లేదు. గతంలో అన్నట్టు రెండు, మూడు నెలలు కూడా అనటం లేదు. ఇక కోదండరాం గారు యివాళ (మంగళవారం) పది, పన్నెండు రోజుల్లో పరిష్కారం వస్తుందంటున్నారు. నాయకులు అలాగ చెప్తూనే వుంటారు. 'ఇంకెంత అదిగో ఆ కనబడే మలుపు తిరిగితే, మన గమ్యస్థానమే, వచ్చేశాం. ఓపిక పట్టండి' అని చెప్తూనే వుంటారు. ఇంకో పది పన్నెండు రోజులంటే ఉద్యోగులు నెల్లాళ్లు సమ్మె చేసినట్టవుతుంది. ఈ సారి ఫెయిలయితే మళ్లీ యిప్పట్లో కోలుకోరు. కనీసం ఓ ఆర్నెల్లదాకా సమ్మె తలపెట్టే యోచన రాదు. ఇప్పటికే కొత్తగూడెం గనుల్లో హాజరీ శాతం పెరిగింది. కరీంనగర్‌లో కూడా పని చేయాలని చాలామంది రావడం, మావోయిస్టులు (అదే లెండి న్యూ డెమోక్రసీవారు) వాళ్లను అడ్డుకుని పంపివేయడం జరిగింది. (ఇటువంటి పనులే హోం మంత్రిత్వ శాఖ వారి అనుమానాలను మరింత పెంచుతాయి). దసరాకు యింట్లో పండగకళ లేక బోసిపోతే సాధించినది ఏముందన్న నిరాశానిస్పృహలు వ్యాపించడం ఖాయం.

అందుకనే సమ్మె ఉధృతం చేస్తామని కోదండరాం ప్రకటించారు. ప్రభుత్వోద్యోగులు యింతకంటె ఉధృతం చేయలేరు. ఆఫీసులకు వెళ్లటం లేదు కదా. ఇక వెళ్లిన వాళ్లను పట్టుకుని కొట్టాలంతే ! టీచర్లు ఏమీ చేయలేరు. ఎందుకంటే వెళ్లి గొడవ చేద్దామన్నా స్కూళ్లు లేవు. ఆర్టీసీ వాళ్లూ ఏమీ చేయలేరు. బస్సులే తిరగటం లేదు. ఇక చేయగలిగేదేమైనా వుందా అంటే ప్రయివేటు బస్సులను ఆపాలి. అదే చేశారు. అది కూడా ఆంధ్రప్రాంతం నుండి వచ్చే బస్సులను. తమాషా ఏమిటంటే విజయవాడ రూటులో వచ్చే బస్సులను మాత్రమే ఆపుతున్నారు. కర్నూలునుండి వచ్చేవాటి జోలికి పోవటం లేదు. అనంతపురం మీదుగా, కరా?టక మీదుగా వచ్చేవారినీ ఆపటం లేదు. కారణం ఏమిటంటారు? ఉద్యమకారులు నల్గొండలోనే వున్నారా? మెహబూబ్‌నగర్ జిల్లాలో లేరా?

ప్రయివేటు బస్సులను ఆపడంతో బాటు, పనిలో పనిగా ప్రయివేటు వాహనాలను ధ్వంసం కూడా చేస్తున్నారు. ఉద్యమం అన్నాక యిటువంటి హింసాత్మక సంఘటనలు తప్పవు. ఎవరు ఎక్కడ అదుపు తప్పుతారో తెలియదు. అంతా నాయకుల చేతిలో వుండదు. పోలీసులు కూడా అదుపు తప్పి చూడడానికి వచ్చినవారిని తన్నవచ్చు. చెప్పలేం. ఇలాటి నాలుగు సంఘటనలు జరిగితే అదే సాకుగా తీసుకుని ప్రభుత్వం సైన్యాన్ని దించినా దించవచ్చు. విద్యార్థులు, యువకులు కేసుల్లో యిరుక్కుని కోర్టుల చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేయాలో ఏమిటో ! గతంలో పెట్టిన కేసులే యింకా తెమల్చలేదు. ఈ నాయకులు మాత్రం తమ కేసులు ఎత్తివేయించుకుంటారు. ఢిల్లీ కేసులో హరీష్‌రావు బాధితుడితో రాజీపడి కేసు ఎత్తి వేయించుకుంటున్నారని విన్నాను. ఎంతవరకు నిజమో తెలియదు. రాజీపడడానికి వాళ్ల దగ్గర డబ్బు వుంది, పలుకుబడి వుంది, ఎదటవాడిని అడలగొట్టే సత్తా కూడా వుంది. ఈ మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుర్రాళ్ల దగ్గర ఏముంటుంది పాపం !

ఏది ఏమైనా తెలుగువారికి ఈ దసరాకు సరదా లేకుండా పోయింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

## అక్టోబరు 09 ఎమ్బీయస్ : చురుక్కుమనిపిస్తున్న కిరణ్

ఢిల్లీ పిలిచి కిరణ్‌కు తలంటారని సాక్షిలో చదివి వీళ్లిలా రాయడం మామూలేలే అని నోరు చప్పరించాను కానీ నిజమేనేమో ననిపించింది – ఢిల్లీ వెళ్లొచ్చిన కిరణ్ తీరు చూస్తే ! ఒక్కసారిగా వేడి పెంచారు. అందరికీ చురుక్కుచురుక్కుమని వేడి కిరణాలు తగులుతున్నాయి. ఉద్యమం పట్ల కాఠిన్యం వహిస్తున్నట్లు తేటతెల్లమౌతోంది. ఇలా చేయడం వలన ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని, పిలిచి మాట్లాడి, అనునయించి, బుజ్జగించి, సముదాయించాలి కానీ యిలా చేయడం చాలా తప్పని కేకేగారు అప్పుడే కేకలేస్తున్నారు. (సముదాయిస్తే సముదాయించ బడేట్లా వున్నారా? కనీసం కేకే?) గట్టున వున్నవాళ్లం ఎంతైనా చెప్పవచ్చు. కానీ యిలాటి పరిస్థితులను ఎలా హ్యేండిల్ చేయాలో ఖచ్చితమైన పద్ధతి (రూల్ ఆఫ్ థంబ్) వుండదు. ఎవరి పద్ధతి వారిదే. ఆ పద్ధతి కూడా ఎదుటివాళ్ల బట్టి మారుతూంటుంది. కాస్సేపు ఒకళ్లది పై చేయి అయితే, ఇంకాస్సేపు మరొకళ్లది.

వీటిలో ముఖ్యంగా కావలసినది ఓర్పు. ఫలానా రాజు పొరుగురాజ్యంలో ఫలానా కోటపై దండెత్తి వశపరచుకున్నాడు అని చరిత్రపుస్తకంలో ఓ లైనులో రాసేస్తే, సినిమాలో ఓ షాటులో చూపిస్తే – అంత త్వరగా కథ ముగిసిందనుకోకూడదు. కోటను లొంగదీసుకునేందుకు ముందు నెలల తరబడి ముట్టడి వేస్తారు. కోట చుట్టూ తమ సైన్యంతో గుడారాలు వేసుకుని వుంటారు. కోటలోపలి వారు బయటకు రానక్కరలేకుండానే లోపలే నెలల తరబడి జీవించడానికి వీలుగా ఏర్పాట్లు చేసుకుంటారు. ధాన్యపదార్థాలు నిలవ చేసుకుంటారు. కొన్ని కొన్ని కోటల్లో ఏడాది నిల్వలు వుండేవి. కూరగాయలు పండించుకుంటారు. బయటవున్నవారు విసుగెత్తి వెళ్లిపోయేదాకా వీళ్లు కాచుకుని వుంటారు. వీళ్లు విసిగిపోయి నీరసించేదాకా అవతలివాళ్లు వేచివుంటారు.

అంతేకాదు, కోటకు అనేక ప్రాకారాలు వుంటాయి. రాజనివాసం అన్నిటికి మధ్యలో వుంటుంది. ప్రాకారానికి ప్రాకారానికి మధ్య జననివాసాలు, పొలాలు వుంటాయి. అన్నీ పండించుకునే వీలుంటుంది. నీటి వసతులు వుంటాయి. అందుకే ఓ పట్టాన లొంగరు. చివరకి యీ 'వేరింగ్ ఔట్ గేమ్' (బలహీనపరచి లొంగదీసుకునే క్రీడ)లో ఎవరికి ఎక్కువ ఓపిక వుంటే వాళ్లు నెగ్గుతారు. ఈలోపుగా కోటలో వున్నవాళ్లలో దుర్బలమనస్కులను భయపెట్టో, భ్రమపెట్టో లొంగదీసుకునే బయటివాళ్లు చేస్తే, బయట కాపు వేసిన వాళ్లపై ఏ

అర్ధరాత్రో దాడి చేసే ప్రయత్నం కోటలో వాళ్లు చేస్తారు. అటూ యిటూ గూఢచారులు చాలా చురుగ్గా పనిచేస్తారు. లంచం తీసుకుని కోటగుమ్మం తెరిచే దౌరాగ్యుడు ఒకడు దొరికేవరకూ వెతుకుతూంటారు. కోటలోంచి ఒకడు బయటకు వచ్చి లొంగిపోయినట్టు నటించి శత్రువులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు కూడా చేస్తారు. అంతిమవిజయం ఎవరిని వరిస్తుందో, చివరకు సంధి కుదిరితే ఎటువంటి షరతులతో కుదురుతుందో భగవంతుడికే ఎక.

ఇంత విపులంగా ఎందుకు చెప్పానంటే సమ్మెలు, ఆందోళనలు చేసేవారి మధ్య, యాజమాన్యం లేదా ప్రభుత్వం మధ్య యిలాటి విన్యాసాలే జరుగుతాయి. ఎవరికి వారు బయటకు బింకంగా కనిపిస్తూనే, ధైర్యవచనాలతో అనుచరులను ఉత్సాహపరుస్తూనే ఎదుటివాళ్ల బలాబలాలను అంచనా వేసి, వాళ్లలో చీలికలు తెచ్చే వ్యూహాలు పన్నుతూనే వుంటారు. కాస్సేపు ఎగ్రెసివ్‌గా వుంటారు, కాస్సేపు డిఫెన్సివ్‌గా వుంటారు. నిదానంగా కూర్చుని ఇవన్నీ ఆలోచిస్తే ఇప్పటివరకు కిరణ్ అనుసరించిన వ్యూహం కానీ, నిన్నటినుండీ అనుసరిస్తున్న వ్యూహం కానీ ఆయన స్వకపోలకల్పితాలని అనుకోలేము. స్క్రీన్‌ప్లే హై కమాండ్ దే అయి వుంటుంది. సక్సెకయితే వాళ్లు క్రెడిట్ తీసుకునేవారు. కాకపోతే సిఎంను బాధ్యుణ్ని చేస్తారు. బాస్ ఎన్నడూ పొరబాటు చేయడన్నది మేనేజ్‌మెంట్ సూత్రం కదా! కిరణ్ యిప్పటివరకు అవలంబించిన పద్ధతి తప్పు అని గట్టిగా చెప్పగలమా అంటే లేదనే అంటాను.

మనం ఎదురుచూసిన బస్సు రావడం లేదని తెలియగానే "ఏమిటండీ ఈ తొక్కలో ప్రభుత్వం, ఈ సమ్మె చేసేవారందరినీ జైల్లో తీసుకెళ్లి పడేయక..?! ఏదో వాళ్ల జీతాల గురించి సమ్మె చేస్తే ఫరవాలేదు కానీ రాజకీయ కారణాలతో చేయడమేమిటి?" అని శివాలెత్తి పోవచ్చు కానీ ఆర్టీసీ ఉద్యోగులని గానీ, ప్రభుత్వోద్యోగులను కానీ తీసుకెళ్లి జైల్లో పడేయడం అంత సులభంగా కుదిరే పని కాదు. ఎందుకంటే ప్రభుత్వం ఏం చేయాలన్నా ఉద్యోగుల ద్వారానే చేయాలి. మీ కాళ్లూ, చేతులతో మీరు పోట్లాట పెట్టుకోగలరా? అందుకనే ఉద్యోగుల సమ్మె పట్ల ప్రభుత్వం కాస్త చూసీ చూడనట్లుగానే పోతుంది. ఎందుకంటే చర్యలు తీసుకోవాలని తయారుచేసిన ఫైలునే గల్లంతు చేయగల ఘనులు వారు. అయితే ఉద్యోగులు రాజకీయ కారణాలతో సమ్మె చేస్తే సహించాలా? అన్నది ప్రశ్న. 1969లోనూ, 1972లోనూ ఇలాగే చేశారు కదా! అప్పుడు మాత్రం రాష్ట్రప్రభుత్వం ఏం చేయగలిగింది? సమ్మె చేసిన ఉద్యోగుల కాళ్లు పీకేవరకూ ఆగింది తప్ప, ఉద్యోగాలలో చేరిన తర్వాత సమ్మె చేశారని చెప్పి ఉద్యోగాలు పీకేయలేదు.

కిరణ్ యిప్పటిదాకా ఉద్యమం పట్ల మెతకగానే వ్యవహరించారు. అది కూడా స్ట్రాటజీయే కావచ్చు. కఠినంగా వ్యవహరిస్తే అదిగో ఆంధ్రా సిఎం కాబట్టి తెలంగాణ వారిని అణిచేశాడని ఉద్యమకారులు అనేవారు. ఏం చేసినా, తనను వ్యక్తిగతంగా ఎంత తిట్టినా పద్దాడు కాబట్టి అంతకుమించి ముందుకు వెళ్లలేకపోయారు. ఉద్యమానికి వ్యతిరేకంగా నివేదికలు పంపుతున్నాడని యాగీ చేశారు. చేయలేదు మొర్రో, అయినా నేను నివేదిక పంపవలసిన అవసరం ఏముంది? వాళ్లకు కళ్లూ, చెవులూ లేవా? రోజుకి విద్యుత్ ఎంత తయారవుతోందో స్టాటిస్టిక్స్ తెలియవా? అని కిరణ్ లాజికల్‌గా మాట్లాడారు. విద్యుత్ కోతలు తెలంగాణలోనే అమలు చేస్తున్నారని అభాండాలు వేస్తే, కావాలంటే రాష్ట్రం అంతా కోతలున్నాయి చూడండి అని ఛాలెంజ్ చేశారు. అదనపు జలవిద్యుత్ తయారుచేసే సౌకర్యం వున్నా కావాలని ఉత్పత్తి చేయకుండా మాకు చెడ్డపేరు తెస్తున్నారని దుష్ప్రచారం చేస్తే, దాని యిన్‌చార్జ్ అధికారుల చేత ఉన్న నీరు యిప్పుడు వాడేస్తే భవిష్యత్తులో ఎలా? నీరు ఇన్‌ఫ్లో గురించి గ్యారంటీ యివ్వగలరా? అని సవాలు చేయించారు. **(సశేషం)**
**- - ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 10** **ఎమ్బీయస్ : చురుక్కుమనిపిస్తున్న కిరణ్ - 2/2**

ఇంత చేసినా పొన్నం ప్రభాకర్ 'ఏం నివేదిక పంపి మీరు సిఎం పోస్టు తెప్పించుకున్నారో చెప్తే అదే నివేదిక పంపి తెలంగాణ తెచ్చుకుంటాం' అని బహిరంగంగా వెక్కిరించి, సిఎంతో సమావేశంలో సిఎం నిలదీస్తే అలా అనలేదని చెప్పి, మళ్లీ బయటకు వచ్చి యింకోసారి అని.. యిలా చాలా అల్లరి పెట్టినా కిరణ్ ఓపిక వహించారు. తెలంగాణలో ఉద్యమం నడుస్తూండగా తన పని తనదే అన్నట్టు ఆంధ్రప్రాంతంలో విస్తృతంగా పర్యటిస్తూ అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీగా వున్నారు. ఇవాళ పేపర్లో వచ్చింది - ఏటా కేంద్రం నుండి వచ్చే నిధులలో 20% కోత వుంటేనే నిధులు ఖర్చు పెట్టలేక ఛస్తూ వుంటారట. ఖ్చ పెట్టకపోతే కేంద్రం తోలు తీస్తుంది, వచ్చే ఏడాది నిధులు తగ్గిస్తుంది. ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వం స్తంభించింది కాబట్టి అవి ఆంధ్రప్రాంతంలో ఖ్చ చేసైనా సరే కేంద్రం దగ్గర మాట దక్కించుకోవాలని చూస్తున్నారుట. అదే జరిగితే అక్కడ నిధులు ప్రవహించి, కిరణ్‌కు మంచి పేరు రావచ్చు కూడా. మంత్రులెవరూ సెక్రటేరియట్‌కు రాకపోయినా ఏదోలా బండి లాక్కుంటూ వస్తున్నాడు పాపం అని జాలి పడినా పడవచ్చు.

కిరణ్ బాగా నమ్ముకున్న సెక్టార్ - యువత ! లక్షలాది ఉద్యోగాలు యిప్పిస్తానని వాళ్లకు ఆశపెట్టారు. టార్గెట్ కూడా మరీ దూరంగా పెట్టకుండా డిసెంబరు అంటున్నారు. లక్షా పదహారువేల ఉద్యోగాలట. ఆర్థికశాఖ నుండి 30 వేల ఉద్యోగాలకు అనుమతి వచ్చేసిందట. ఇంకో 22 వేల ఉద్యోగాలకు అనుమతి పెండింగ్‌లో వుందట. ఇలాటి వార్తలకు నిరుద్యోగులకు ఎంత నోరూరిస్తాయో చూడండి. పోలీసు ఉద్యోగాల పరీక్షకు అడ్డంకి పెట్టిన 14 ఎఫ్ సవరింపు చేయించారు. గ్రూపు 1 పరీక్ష పెట్టడానికి వీల్లేదంటూ తెలంగాణ మంత్రులు చెపుతున్నా ఏం ఫర్వాలేదంటూ పరీక్ష నిర్వహించారు. బస్సుల్లేకపోయినా సగానికి పైగా అభ్యర్థులు హాజరయ్యారంటే అర్థం ఏమిటి? ఉద్యమం మాట ఎలా వున్నా, మాకు ఉద్యోగాలు కావాలని అభ్యర్థులు చాటి చెప్పినట్టే కదా. ఇప్పుడు గ్రూపు 2 కూడా

పెట్టేస్తానంటున్నారు. దానికి హాజరీ మరింత పెరిగితే ఉద్యమం మరింత బలహీనపడుతుందని ఉద్యమకారుల భయం. ఎందుకంటే విద్యార్థులందరూ "మాకు చదువులు కాదు ముఖ్యం, తెలంగాణయే ముఖ్యం" అంటున్నారని, నిరుద్యోగులందరూ "మాకు ఉద్యోగాలు ముఖ్యం కాదు, తెలంగాణయే కావాలి" అంటున్నారని వారు నమ్మబలుకుతున్నారు. ఇలా పరీక్షలకు హాజరయితే ఆ మాటకు విలువ లేకుండా పోతుంది. అందుకని ప్రభుత్వం చేతే దాన్ని వాయిదా వేయించాలని వాళ్ల ప్రయత్నం.

ఇక్కడ యింకో మెలిక కూడా వుంది. "ఉద్యోగాలు యిస్తాం కానీ అవి కావాలంటే మీ రికార్డు క్లీన్‌గా వుండాలి. మీరు ఉద్యమాలలో పాల్గొని కేసులు నెత్తిమీదకు తెచ్చుకుంటే ఉద్యోగాలు రాకపోవచ్చు, జాగ్రత్త" అని నిరుద్యోగులను ఉద్యమానికి దూరం చేసే యోచన కూడా వుంది. ఇలా సాఫ్ట్‌గానే యిప్పటిదాకా లాక్కుని వచ్చారు. న్యాయవాదులు కోర్టులకి తాళాలేసినా, రాస్తా రోకో ప్రకటించకుండా విజయవాడ రహదారిపై గంటల తరబడి వాహనాలు ఆపేసినా, సమ్మె చేసే ఉద్యోగులు పనిచేసే ఉద్యోగులను అడ్డుకుంటున్నా గట్టిగా చర్యలు తీసుకోలేదు. ఆఫీసులకు పోలీసు రక్షణ కల్పించలేదు. కనీసం అనేక ఆఫీసులున్న భవనసముదాయంలో కూడా పోలీసు క్యాంపు పెట్టలేదు. "సిఎం యిలా మెతకగా వుంటే లాభం లేదు. రాష్ట్రపతి పాలన రావాల్సిందే, కఠినంగా వ్యవహరించవలసినదే" అనే అభిప్రాయాన్ని సామాన్యప్రజల్లో కలిగించేదాకా హై కమాండ్ యిది సాగనిచ్చింది.

గవర్నరును, సిఎంను, డిప్యూటీ సిఎంను ఢిల్లీ రమ్మనడంతో యింకేముంది రాష్ట్రపతి పాలన వచ్చేస్తోందని అనుకోవడమూ జరిగింది. కానీ ఢిల్లీ లెక్కలేమిటో గాని రాష్ట్రపతి పాలన విధించలేదు. కఠినంగా వ్యవహరించడానికి రాజకీయ పార్టీల కుండే మొహమాటాలు గవర్నరుకి వుండవు కాబట్టి, ఇలాటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన పెట్టేసి ఉద్యమనాయకులను జైళ్లల్లో పెట్టేసి, సైన్యాన్ని పిలిచి ఉద్యమాన్ని అణిచివేయడం జరుగుతూంటుంది. ఆ నిర?యం కేంద్రంలో అధికారంలో వున్న పార్టీదే అయినా ఆ పాపం రాష్ట్రపతి ఖాతాలో పడుతుందని వాళ్ల నమ్మకం.

అయితే కాంగ్రెస్ ఈ నిర?యాన్ని తీసుకోలేదు. ఎందుకంటే రాష్ట్రపతి పాలన విధించగానే సరిపోదు. వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలం పుంజుకోవాలి. ప్రస్తుతం కిరణ్ పరిస్థితి బలహీనంగా వుందని అందరికీ తెలుస్తోంది. ఆజాద్ తన నివేదికలో కూడా అదే యిచ్చి వుండవచ్చు. ఆర్నెల్ల తర్వాత రాష్ట్రపతి పాలన ఎత్తివేసాక చూస్తే కాంగ్రెస్ యింకా వీక్‌గా కనబడితే..? అప్పుడేం చేయాలి? ఉద్యమాన్ని హ్యాండిల్ చేసిన ఘనత గవర్నరు పట్టుకుపోతే కాంగ్రెస్‌కి ఏం మిగులుతుంది? ఈ లోగా కాంగ్రెస్ పక్షాన ఎవరైనా బలమైన నాయకుడు తయారయ్యే అవకాశం వుందా? కిరణ్‌కు ప్రత్యామ్నాయం తయారయ్యే అవకాశం వుందా? లేదని తోచి వుంటుంది హై కమాండ్‌కు.

అందుకే కిరణ్‌కే ధైర్యం చెప్పి ఫ్రీ హ్యాండ్ యిచ్చి వెనక్కి పంపించి వుంటారు. ఆయన వస్తూనే కెసియార్‌ను, కోదండరాంను గట్టిగా విమర్శించారు. ఆర్టీసీ సమ్మె విరమింపచేయడానికి యూనియన్‌లో చీలిక తెచ్చారు. రైల్ రోకో అడ్డుకోవడానికి దృఢంగా నిశ్చయించుకున్నారు. అప్పుడు కొన్ని అరెస్టులు చేయించవచ్చు. సింగరేణిలో గత 28 రోజులుగా బొగ్గు ఉత్పత్తి 30, 40 వేల మెట్రిక్ టన్నులు దాటలేదు. కానీ నిన్న 63 వేల టన్నులు సాధించారంటే విశేషమే కదా ! విద్యాసంస్థల మూసివేత గురించి తలిదండ్రులలో ఆందోళన ప్రారంభం అయింది కాబట్టి దాన్ని ఉపయోగించుకుని విద్యాసంస్థలను తెరవాలని ఆదేశించవచ్చు.

ఇది హై కమాండ్ వ్యూహమే కావచ్చు. ఒకవేళ యివి సతాశీతాల నిస్తే ఊరుకుంటారు. ఒకవేళ ఎదురుతంతే అప్పుడు యివన్నీ కిరణ్ నిర?యాలని అంటూ తప్పు అతనిపై నెట్టేసి దింపేసి, యింకోళ్లను ఎక్కించవచ్చు. అప్పుడు కాంగ్రెస్‌ను తెలంగాణ వ్యతిరేకి అని ఎవరూ అనలేరు. అయితే గియితే కిరణ్‌పైనే ఆ ముద్ర పడుతుంది. దానికి కిరణ్ సిద్ధపడ్డారు. కనీసం ఉద్యమాన్ని వ్యతిరేకించే వారి దృష్టిలో హీరో అవుతారు కదా ! రాజకీయాల్లో ఆ మాత్రం రిస్కు తీసుకోకపోతే లాభం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 12** **ఎమ్బీయస్ : రైల్ రోకో వాయిదా లెందుకు..?**

రైల్ రోకో 8,9,10 న అన్నారు. ఆ రోజున ప్రయాణాలు పెట్టుకున్నవాళ్లు అర్జంటుగా యీ మూడురోజులు అయ్యాక వెళ్లవచ్చులే అని వాయిదాలు వేసేసుకున్నారు. ఎందుకంటే రైల్ రోకో అని ఉద్యమకారులు అనడానికి ముందే రైల్వేవారు రైళ్లు కాన్సిల్ చేసేస్తున్నారు. ఈ సారీ అంతే అనుకుని ఆ రోజుల్లో బుక్ చేసుకున్న టిక్కెట్లు కాన్సిల్ చేశారు. తీరా చూస్తే రైల్ రోకో 8,9,10 ల నుండి మార్చేశాం, 11, 12, 13 ల్లో పెడతాం అన్నారు. ఎందుకంటే సింగరేణి గనుల దగ్గరకు యాత్ర పెట్టుకున్నాం అన్నారు. అందరూ నాయకులు కట్టకట్టుకుని అక్కడికే వెళ్లాలా? కొందరు అటూ, కొందరు యిటూ వెళ్లవచ్చుగా !

రైల్ రోకో విజయవంతం చేయాలంటే నాయకులు సరిపోరుట. ఒంటెత్తు పోకడలు పోతే అదే జరుగుతుంది. 'సకల జనుల సమ్మె' అని పేరు పెట్టుకోగానే సరిపోదు. అందర్నీ కలుపుకుని పోవాలి. ఇది తెరాస, బిజెపి, మావోయిస్టులు మాత్రమే చేస్తున్న ఆందోళన. వారికి తోడుగా ప్రభుత్వోద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు. తెలంగాణా ప్రజాప్రతినిధుల్లో 85% మందిని అందించిన కాంగ్రెస్, టిడిపిలకు దీనిలో చోటు లేదు. వాళ్లూ వుండి వుంటే యిలా నాయకుల కొరత వచ్చేది కాదు.

అయినా సింగరేణికి వెళ్లి వీళ్లు చేసేదేముంది? అక్కడ సమ్మె విరమించి డ్యూటీలో చేరదామని ఎవరైనా ప్రయత్నిస్తే తాట

తీయడానికి మావోయిస్టులు ఎలాగూ కాపు వేసి వున్నారు. వీళ్లు వెళ్లి కొత్తగా చేసేదేముంది? అలా అనుకునే పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఇంతకీ సింగరేణి యాత్ర పేరు చెప్పి 11,12,13 లకు వాయిదా వేశారు. మొదటి టిక్కెట్లు కాన్సిల్ చేసి ఆ రోజుల్లో బుక్ చేసుకున్నందుకు లెంపలేసుకుని ఎందుకైనా మంచిదని ఓ రోజు మార్జిన్ యిచ్చి 15 నుంచి బుక్ చేసుకున్నారు కొందరు. అంతలో "అబ్బెబ్బే, 11,12,13 కాదు, 15,16,17 ల్లో వుంటుంది" అన్నారు జాక్ వారు. ఈ సారి ఎందుకంటే – బాన్సువాడ ఉపయెన్నికట. దాని సంగతి ముందే తెలుసుగా ! ఆ తేదీలు వ్యవహారం ఎప్పుడో ప్రకటించారు. ఇవాళ కొత్తగా తెలిసినదేముంది? 11–13 ఎనౌన్సు చేసినప్పుడే చూసుకోవలసినది ! ఇప్పుడు 15 నుండి వున్న టిక్కెట్లు కాన్సిల్ చేయాలా వద్దా అని సలహా అడిగాడు ఓ మిత్రుడు.

"శ్రీవారికి ప్రేమలేఖ" సినిమా గుర్తుకు వచ్చింది. దానిలో హీరోయిన్ పెళ్లి జరుగుతుందా? లేదా అని డోలాయంలో పడుతుంది. పెళ్లికి వచ్చిన ఒకావిడకు పట్టుచీర సమస్య. పెళ్లి వుందంటే కట్టాలి, లేదంటే విప్పేసి మరోటి కట్టుకోవాలి. పెళ్లి ఆగిపోయిందన్నప్పుడల్లా 'అయితే పట్టుచీర యిప్పేయనా?' అని వచ్చి అడుగుతూ వుంటుంది. 'పెళ్లి ఆగదు' అని వార్త రాగానే అయితే కట్టుకోవచ్చన్నమాట అని సంబరపడుతుంది. ఈ రైల్వే టిక్కెట్ల బుకింగ్ ప్రహసనం అలా తయారైంది. ఎప్పుడూ లేనిది యిన్ని వాయిదాలేమిటి? అని ఆలోచిస్తే ఒకటి తడుతుంది. రైల్వేవాళ్లు ఉద్యమకారులను ఎదిరించడం మొదలుపెట్టారు. ఇన్నాళ్లూ వీళ్లు వాళ్లని భయపెట్టేవారు. ఇప్పుడు వాళ్లు వీళ్లని అడల గొడుతున్నారు. పోలీసులను పెడతాం, సైన్యాన్ని దింపుతాం అంటూ. కోట్లాది ప్రజల ముందు వందలాది సైన్యం ఏ పాటికి? అని కెసియార్ హుంకరిస్తున్నారు కానీ ఒకవేళ వాళ్లంతా పట్టాల మీదకు రాకపోతే...? అన్న అనుమానం మనసులో పీడిస్తోంది. అందుకే రైల్ రోకోకు సన్నద్ధం కావడానికి కాస్త సమయం కావాలంటున్నారు. ఉద్యమం పతాకస్థాయికి వచ్చేసింది, పారాడే పాపనుండి పళ్లూడిపోయిన ముసలవ్వదాకా అందరూ ఉద్యమంలో వున్నారు, రేపోమాపో తెలంగాణ వచ్చేస్తుందని ఢిల్లీ నుండి కపోతసందేశం వచ్చింది అని చెపుతూ వుండే యీ దశలో ఇంకా కార్యకర్తలను పోగు చేసుకోవడానికి టైమెందుకు?

వాళ్లు ఏం చెప్పినా ఒకటి మాత్రం వాస్తవం – రైల్ రోకోకు పిలుపు నిచ్చినపుడు రైల్వేవాళ్లు యిలా అడ్డం తిరుగుతారని జాక్ అనుకోలేదు ! కథ యిలా ఎందుకు అడ్డం తిరిగినట్టు? రైల్వే శాఖ పూర్తిగా కేంద్రం అధీనంలో వున్న శాఖ. ఉద్యమం పట్ల కేంద్రం ధోరణి కఠినమౌతోందనడానికి యిది సంకేతమా? తెలంగాణ యువకులు ప్రత్యక్ష చర్యకు దిగితే, రైల్వే రక్షణ బృందంతో, సైన్యంతో తలపడి దెబ్బలు తినడం ఖాయం. బాష్పవాయు ప్రయోగాలు, లాఠీచార్జిలు, కాల్పులు జరిగి ఒకరిద్దరు పోయినా పోవచ్చు. ఈ హింసకు కిరణ్ ప్రభుత్వానిదే బాధ్యత అని ఉద్యమకారులు ప్రకటించబోతారు కానీ ఉద్యమనాయకుల స్ట్రాటజీ పట్ల కార్యకర్తలకు సందేహాలు వస్తాయి. కేంద్రం తెలంగాణ యిచ్చేస్తుందని తెరాస, టి కాంగ్రెస్ వాళ్లు చెపుతూ వస్తున్నారు. మరి తెలంగాణ యిచ్చేసేవాళు ్లు యింత కాఠిన్యంతో వ్యవహరిస్తారా? అన్న సందేహం వారికి వచ్చి తీరుతుంది.

ఇన్నాళ్లకి కాంగ్రెస్ హై కమాండ్ ఇరుప్రాంతాల వారినీ విడివిడిగా కలుసుకుని అభిప్రాయాలు సేకరించింది. సేకరించిందేమిటిలెండి నా తలకాయ, అవేమైనా పెద్ద రహస్యాలా? వాళ్లు బహిరంగంగా ఎప్పణ్నుంచో చెపుతున్నవే ! ఇద్దర్నీ కలిపి కూర్చోబెట్టి డిస్కస్ చేయించి వుంటే అది ముందడుగుగా అనుకునేవాళ్లం. ఆ ముచ్చట జరగలేదు. ఇవన్నీ పట్టుకెళ్లి ఆజాద్ ప్రణబ్‌కు ఓ నివేదిక యిచ్చారు. ప్రణబ్ తన పరిశీలనలు కూడా కలిపి ఇంకో నివేదిక చేసి సోనియాకు యిచ్చారు. మినీ కోర్ కమిటీ, కోర్ కమిటీ, మళ్లీ మినీ కోర్ కమిటీ... ఇలా అంచెలంచెలుగా వైకుంఠపాళీలో పావులా పైకి కిందకీ అడుతోంది. ప్రణబ్‌గారి పథకం అంటే మనం గతంలోనే రుచి చూశాం. కఱ్ఱ విరగకుండా, పాము చావకుండా డ్రాఫ్టింగ్ చేయడంలో ఘనుడు. 2004లో యుపిఏ – 1 వారి సిఎంపి (కామన్ మినిమమ్ ప్రోగ్రాం)లో, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ గురించి ఎలా రాశాడో చూడండి – బై కాన్సెన్సస్ (ఏకాభిప్రాయం కాదు కానీ, అత్యధికుల అభిప్రాయం) అండ్ ఎట్ ఎప్రాప్రియేట్ టైమ్ (సరైన సమయం) అంటూ రాశాడు. ఇంకేముంది తెలంగాణ యిచ్చేశారు అని తెలంగాణ వాదులు చంకలు గుద్దుకున్నారు. ఇంగ్లీషు వచ్చినవాళ్లు నవ్వుకున్నారు – భలే టోకరా అని.

ఇప్పటికి కూడా కొందరు తెలంగాణ వారు 'కాంగ్రెస్ యిస్తానని ఎప్పుడో చెప్పింది, 2004, 2009 మ్యానిఫెస్టోల్లో పెట్టింది, సిఎంపిలో రాసింది, రాష్ట్రపతి ప్రసంగంలో చేర్చింది, దాన్ని బట్టే తెలుస్తోంది హై కమాండ్ అభిప్రాయం, ఏదో సీమాంధ్రులు అడ్డుపడుతున్నారు కాబట్టి వాళ్లను కాస్త బుజ్జగించి యిచ్చేస్తుంది' అని నమ్ముతూంటే, నమ్మబలకడానికి ప్రయత్నిస్తూంటే నాకు భలే నవ్వు వస్తుంది. ఇకపై కాంగ్రెస్ ఏమైనా యిస్తే యివ్వవచ్చేమో కానీ, ఇప్పటిదాకా ఏమీ యివ్వలేదు. సిఎంపిలో రాసినది చూశాం, 2004లో ఏం చేశారు? తెరాసతో రెండో ఎస్సార్సీని ఒప్పిస్తూ సంతకాలు పెట్టించి తీసుకుని మరీ పొత్తు పెట్టుకున్నారు. (మొదటి ఎస్సార్సీని గౌరవిస్తాం అని చేర్చారు, గౌరవం ఎవడికి కావాలి, ఆచరణ తప్ప!) 2009లో ఎన్నికల ముందు అసెంబ్లీ తీర్మానంలో కాని, మ్యానిఫెస్టోలో కానీ ఎక్కడా తెలంగాణ యిస్తామని చెప్పలేదు. ఈ విషయమై గాదె వెంకటరెడ్డి అనుకుంటా తెలంగాణ వాదులను అప్పుడే ఛాలెంజ్ చేశారు. తెలంగాణలో ఎన్నికలు పూర్తయిన మరుక్షణమే అప్పటిదాకా లౌక్యంగా వ్యవహరించిన వైయస్, విభజనకు వ్యతిరేకంగా బహిరంగంగా ఎన్నికల సభలో మాట్లాడారు. దానికి ముందు కూడా తెలంగాణసభలో సోనియా చేత 'జై ఆంధ్రప్రదేశ్' అనిపించారు. మనం యివన్నీ మర్చిపోయామని ఈ టికాంగ్రెస్ నాయకులు అనుకుంటున్నారా?

2009లో రాష్ట్రవిభజనకు పడిన ఓట్లు అంటే తెరాస, బిజెపిలకు పడిన ఓట్లు మాత్రమే లెక్కించాలని నేనంటే 'కాదు, కాంగ్రెస్,

టిడిపి కూడా తెలంగాణ యిస్తానని అన్నాయి కాబట్టి వాటినీ కలపాలని కొందరు పాఠకులు వాదిస్తారు. అదే నోటితో కాంగ్రెస్, టిడిపిలను తెలంగాణ ప్రజలు నమ్మలేదని కూడా అంటారు. కాంగ్రెస్ ఏం చేసిందో అందరికీ తెలుసు. టిడిపి ప్రణబ్ కమిటీకి లేఖ యిచ్చినా ఉత్తుత్తినే యిచ్చిందని, 2004లో కాంగ్రెస్ తెరాసతో ఎలా వ్యవహరించిందో, తామూ అలాగే వ్యవహరిద్దామనే దురూహతో 2009లో పొత్తు పెట్టుకుందని అనుకున్నారే తప్ప నిజంగా టిడిపి విభజనకు అనుకూలం అని అప్పుడూ అనుకోలేదు, యిప్పుడూ అనుకోలేదు. అప్పట్లోనే చంద్రబాబును 'విభజించాలనుకుంటున్నారు కదా, మరి హైదరాబాదును ఏం చేయాలి?' అని స్పష్టంగా అడిగితే అవన్నీ విభజన కమిషన్ చూసుకుంటుంది అంటూ సమాధానాలు దాటవేశారు తప్ప తెరాస వారిలా హైదరాబాదుతో కూడిన తెలంగాణ యిచ్చి తీరాలి అని స్పష్టంగా చెప్పలేదు. ఏతావాతా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నాం (ఏ విధానాలతో అన్న విషయమేమీ చెప్పలేదు) అన్న ఆశాజనకమైన స్టేటుమెంటు ఒక్కటే ఒక్కటి – డిసెంబరు 9 న విడుదలైంది. అది యిచ్చిన హై కమాండే దాన్ని డిసెంబరు 23తో నీరుకార్చింది.

ఇన్నాళ్లకు సీరియస్‌గా కూర్చున్నారు. ఇప్పుడు ఏమంటున్నారు? రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో చర్చలు పూర్తయ్యాయి అని ప్రకటించారు. ఇకపై కాంగ్రెస్ జాతీయనాయకులతోనట. ఆపై రాష్ట్రంలో అఖిలపక్షమట. ఆ తర్వాత యుపిఏ భాగస్వాములతోనట. ఆ తర్వాత పార్లమెంటుకి బిల్లు పంపుతారట. ఇక అక్కడ అది ప్రతిపక్షాల పాలబడుతుంది. రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ నాయకులు ఏమంటారో చూసి అప్పుడు మీరూ రియాక్టవండి అన్నారు బాబు తన టి సహచరులతో. అప్పటిదాకా గప్‌చుప్. అఖిలపక్షం సమావేశంలో అవునూ కాదూ చెప్పేస్తారు అనుకోవడానికి ఏమీ లేదు. బాయ్‌కాట్ చేయకుండా వుంటేనే ఆశ్చర్యపడాలి. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు అన్న ఒక్కమాట చాలు మీటింగు ఎగ్గొట్టడానికి ! ఇలాటి పరిస్థితిలో అంతిమ నిర?యం యిప్పట్లో వస్తుందని ఎంతటి ఆశావాది కూడా ఆశ పెట్టుకోలేడు. వాళ్లే చెపుతున్నారు, అక్టోబరు నెలాఖరుకి, దీపావళికి.. అంటూ. కోదండరాంగారు యివాళ నవంబరు ఫస్ట్‌వీక్‌దాకా తోసేశారు. ఇలాటివి కెసియార్ చెప్పి చెప్పి విశ్వసనీయత పోగొట్టుకున్నారు. అందుకని యీసారి యీయన చేత చెప్పించారేమో !

సరే నిజంగానే నవంబరు మొదటివారంలోనే కబురు వచ్చిందనుకోండి. అది తీపి కబురో, చేదు కబురో, వగరు కబురో ఎవరికి తెలుసు? అది మనకు రుచిస్తుందని ఎవరైనా గ్యారంటీ యివ్వగలరా? 1969, 1972 ఉద్యమాలు నడిచేటప్పుడు కూడా మధ్యమధ్యలో ఢిల్లీవారు ఏవేవో ఫార్ములాలు రూపొందించడం, ఉద్యమకారులు వాటిని ఆమోదించకపోవడం, ఆందోళన కొనసాగించడం జరిగాయి. ఈ సారీ అలా జరగవని హామీ ఎవరిస్తారు? అందువలన నవంబరు మొదటివారంలో వచ్చే పరిష్కారం ఉద్యమకారులను తృప్తి పరచదని కామన్ సెన్స్ వున్నవారెవరైనా ఊహిస్తారు. దానిపై ఇంకా ఆందోళన యింకా కొనసాగుతుంది. నవంబరు నెలాఖరుకు హై కమాండ్‌కో, ఉద్యమకారులకో ఎవరికో ఒకరికి కాళ్లు పీకుతాయి. అప్పటిదాకా ఆందోళన లాక్కురావడం కష్టమే. కోటలో వున్నవారు తమ వనరులను జాగ్రత్తగా వాడుకుంటూ యుద్ధం కొనసాగించినట్టు, ఉద్యమకారులు కూడా తమ శక్తియుక్తులను కాస్త చూసి వాడుకుంటున్నారు. రైల్ రోకోను అడ్డుకుంటామని రైల్వేవారు ప్రకటించగానే తమ బలాబలాలు అంచనా వేసుకుని ఇప్పుడున్న శక్తి చాలదనుకుని వాయిదాలు వేస్తున్నారు.

ఇది కరక్టు స్ట్రాటజీయే కానీ యిక్కడ కూడా తెరాస ఆధిపత్యధోరణి కనబడుతోంది. 15,16,17 తేదీలకు బిజెపి అడ్డు చెప్పింది. న్యూ డెమోక్రసీ కూడా. అద్వానీ రథయాత్ర బిజెపివారికి ముఖ్యం. ఇప్పుడు వద్దు అన్నారు. న్యూ డెమోక్రసీవారు వారి కారణాలతో వారూ అడ్డు చెప్పారు. తెరాస వారి మాటను మన్నించవలసినది. ఇప్పటికే కాంగ్రెస్, టిడిపివారిని దూరం చేసుకున్నారు. ఇటీవలి ఉద్యమంలో బిజెపి, ఎబివిపి కార్యకర్తలు, మావోయిస్టులు చురుగ్గా పాల్గొంటున్నారు. తెరాస కార్యకర్తలు అన్ని చోట్లా లేరు కానీ దశాబ్దాల తరబడి పని చేసే కార్యకర్తలు ఆ రెండు పార్టీలకు వున్నారు. వారు తమ పార్టీ ఆదేశాల మేరకు రైల్ రోకోకు దూరంగా వుంటే ఆ వెలితి కనబడవచ్చు. కాస్త ఆలస్యంగానైనా రైళ్లు నడిచాయంటే రైల్వేవారు మీసాలు మెలేస్తారు. ప్రభుత్వశాఖలన్నిటికీ ధైర్యం వస్తుంది. డ్యూటీలో చేరకపోతే ఖబడ్దార్ అని తాఖీదులు పంపుతారు. రైల్ రోకోలో పాల్గొంటామని టి కాంగ్రెస్ ఎంపీలు యివాళ అంటున్నారు. మళ్లీ ఎమ్మెల్యేలు వారితో చేరటం లేదు. టి కాంగ్రెస్ ఎంపీలకు వున్న ఫాలోయింగ్ ఎంతో అవేళ తేలిపోతుంది. ఒకవేళ వాళ్లు ఎక్కువమందిని సమీకరించలేకపోతే హై కమాండ్ వద్ద చులకన అయ్యే ప్రమాదం వుంది. కొన్ని స్టేషన్లలో ఆపగలిగితే ఆ ఘనత తెరాసకు పోతుంది. అందువలన కాంగ్రెస్ ఎంపీలు తాము స్వంతంగా కొన్ని స్టేషన్లను ఎంచుకుని వాటిలో ఆందోళన చేసి తమ బలాన్ని నిరూపించుకుంటే మంచిది. చూదాం, 15 న ఏమవుతుందో ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 14** **ఎమ్బీయస్ : తలిదండ్రుల ఘోష**

తెలంగాణ ఉద్యమంలో ఇప్పటిదాకా ఎదురుచూడని కోణం ఎదురైంది. విద్యార్థుల తలిదండ్రులు గళం విప్పారు. మూడు నాలుగు రోజులుగా వారు స్కూళ్ల దగ్గరకు వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు, టీవీ చర్చల్లో పాల్గొంటున్నారు. ప్రశ్నలు సంధిస్తున్నారు. వారి ప్రశ్నల్లో ముఖ్యమైనవి –

01. ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యాసంస్థలు సమ్మె ప్రకటించేముందు విద్యార్థుల తలిదండ్రులను సంప్రదించారా? మా అభిప్రాయం

తెలుసుకున్నారా? వేలకు వేల ఫీజులు పుచ్చుకున్నారే, రాజకీయ కారణాల వలన చదువులు చెప్పకుండా మానేస్తే ఎలా?

02. తెలంగాణ వస్తే మా పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని చాలా ఓర్చుకున్నాం. ఇంకా ఓ వారమో, పదిరోజులో అంటే ఓర్చుకుంటాం. కానీ నిరవధికంగా ఓర్చుకోమంటే మా వలన కాదు. నిర?యం ఇప్పట్లో వచ్చే సూచనలు కనబడటం లేదు. మీరు పతాకస్థాయికి చేరాం, నిర?యం ఇవాళో, రేపో అంటున్నారు. కానీ మాకు నమ్మకం కుదరటం లేదు.

03. సకలజనుల సమ్మె అంటున్నారు కానీ చాలా వర్గాలు సమ్మెలో లేవు. కేంద్రప్రభుత్వోద్యోగులు, ప్రయివేటు యాజమాన్యాలు, కార్పోరేట్లు, దుకాణాలు, ఫ్యాక్టరీలు.. ఎవరూ లేరు. ఎంతసేపు చూసినా ప్రభుత్వోద్యోగులు, సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులు (వారిలో కూడా ఓ వర్గం జారుకుంటోంది) వీళ్లే కనబడుతున్నారు. రాజకీయనాయకులు రాజీనామాలు చేయకుండా ఆటలాడుతున్నారు. జనజీవితం స్తంభించలేదు. మీకు బాగా లోకువగా దొరికిందెవర్రా అంటే విద్యార్థులు.

04. ముచ్చటగా రెండు మూడు రోజుల సమ్మె అంటే సరేలే అనుకుంటాం. కానీ యిదేమిటి, నెలల తరబడి పాఠాలు చెప్పకపోతే ఎలా? సినిమా హాళ్లు ఓ రోజు మాత్రం మూశారు. ఆటోల సమ్మె రెండు రోజులకు మించి సాగలేదు. రెండోరోజు మధ్యాహ్నానికే ఆటోలు తిరిగాయి. బార్లు బార్లా తెరిచే వుంచారు. రెండు రోజులు మూసేసరికి తిరుగుబాటు వచ్చేసింది. రెండో రోజు చీకటి పడుతూనే ఆవురావురుమని తెరిచేశారు. ఎక్సయిజ్‌వాళ్లు సమ్మె అంటే ఆంధ్రానుండి సరుకు తెచ్చి పోస్తున్నారు. వాళ్లను ఆపే దమ్ము మీకు లేదు. బళ్లు మాత్రం మూయించేస్తున్నారు. మా ఒత్తిడికి లొంగి విద్యాలయ నిర్వాహకులు తెరవబోతూ వుంటే మీరు అడ్డుపడుతున్నారు. సినిమాలు, బార్లు, ఆటోలు ముఖ్యం అనుకునే మీ కంటికి విద్య అనేది అంత తేలికగా కనబడుతోంది.

05. మేమంతా ఉద్యమిస్తే ఆంధ్ర కార్పోరేట్ కాలేజీ సంస్థలు ఆడిస్తున్న తోలుబొమ్మలం అంటున్నారు. కార్పోరేట్ కాలేజీలు పెట్టవద్దని తెలంగాణ వారిని ఎవరైనా ఒత్తిడి చేశారా? బార్లు, సినిమాహాళ్లు కట్టినవారు ఆ చేత్తోనే ఓ రెండు బళ్లు కూడా కట్టకపోయినారా? తెలంగాణ స్కూళ్లయితే మా పిల్లలను పంపమని మేం చెప్పామా? మా పిల్లల భవిష్యత్తును ఉద్యమం కోసం త్యాగం చేయాలంటున్నారు. దేనికైనా ఓ హద్దుంటుంది. బళ్లు తెరిచాక మీరు సెలవులు లేకుండా ఊదరగొట్టి పాఠాలు చెప్పేస్తామంటున్నారు. చెప్పినా వాళ్లకు బుర్రకు ఎక్కాలా అక్కరలేదా? పదిరోజుల అన్నాన్ని మీరు ఒక్కరోజులో తినగలరా? సెప్టెంబరు 10 నుండి నెలల తరబడి స్కూళ్లు లేక పిల్లలు యింట్లో కూర్చుని టీవీలు చూస్తూ చదివిన చదువులే మర్చిపోయారు. మళ్లీ ట్రాక్‌లోకి రావడానికే టైము పడుతుంది. ఇక మీరు రోజుకి 12 గంటలు పాఠాలు చెపితే పిచ్చెక్కిపోరా?

06. ఇలా ప్రిపేరయిన వాళ్లు అన్నీ సవ్యంగా జరిగినవాళ్లతో పోటీ పడగలరా? ఆంధ్రప్రాంతంలో సిలబస్ పూర్తయి, రివిజన్ కూడా అయిపోతోంది. మా వాళ్లకు క్వార్టర్లీ పరీక్షలే కాలేదు. వారితో వీరు పోటీపడి నెగ్గుకు రాగలరా? మీరు స్కూళ్లు తెరవడం ఆలస్యం చేస్తున్నారు బాగుంది. జాతీయ స్థాయి పరీక్షలు మీకోసం ఆలస్యం చేస్తారా? వాళ్ల పాటికి వాళ్లు పరీక్షలు నిర్వహిస్తే మా వాళ్ల ఛాన్సులు చెడిపోయినట్లే కదా! మెడికల్ ఎంట్రన్సులు ఎమ్‌సెట్‌నుండి తీసేసి జాతీయస్థాయిలో పెడుతున్నారు. మా వాళ్లు నెగ్గగలరా?

07. హైదరాబాదులోని అయిదారు కార్పోరేట్ కాలేజీలపైననే ఎక్కుపెట్టారు. ఉత్తరాదివాళ్లు నడిపే స్కూళ్ల జోలికి వెళ్లలేదు. ఐయస్‌సి, సిబిఎస్‌ఇ స్కూళ్ల జోలికి వెళ్లలేదు. కేవలం స్టేటు సిలబస్ వాళ్లమీదే పడ్డారు. విద్యార్థులు ఐచ్ఛికంగా ఉద్యమంలో పాల్గొనటం లేదు. స్కూళ్లు మూసేసి వాళ్లపై బంద్ రుద్దారు. పేరెంట్స్ స్కూలు వాళ్లను బతిమాలుకుని తెల్లవారురుఝామున పాఠాలు పెట్టించుకున్నా ఉద్యమకారులు వచ్చి బెంచీలు, కుర్చీలు విసిరేసి విద్యార్థులను భయభ్రాంతులను చేస్తున్నారు. ఉద్యమకారులకు యితరులపై దౌర్జన్యంగా తమ ఉద్దేశాలను రుద్దే హక్కు ఎక్కడిది? అదీ పాక్షికంగా, కొన్ని స్కూళ్లపైననే..?

08. అందరూ నష్టపోతున్నారన్నమాట ఉత్తిది. ఉద్యోగులకు, టీచర్లకు జీతాలు యివాళ యివ్వకపోయినా రేపు యిచ్చేస్తారు. ఆర్టీసీ వాళ్లకు చూడండి – సమ్మె విరమించినవాళ్లకు బోనసులు, జీతాలు. సమ్మెకాలాన్ని స్పెషల్‌గా పరిగణించడం..! గని కార్మికులకు రెట్టింపు జీతాలు. ఇక రాజకీయనాయకుల సంగతి చెప్పనే అక్కరలేదు. రాజీనామాలు చేశామంటారు, జీతాలు, భత్యాలు పుచ్చుకుంటారు. రేపు మంత్రిపదవులూ పొందుతారు. ఏ పరిహారం లేకుండా నష్టపోయేది విద్యార్థులు మాత్రమే. ముఖ్యంగా టెన్త్, ఇంటర్ విద్యార్థులు. మా తలిదండ్రులం యీరోజు రోడ్డుమీదకు రాకుండా వుంటే, రేపు మా పిల్లలు రోడ్డుమీద పడతారు. మేం ఒత్తిడి చేసి స్కూళ్లు తెరిపిస్తే ఉద్యమకారులు వచ్చి మూసేయమని స్కూలువాళ్లని బెదిరిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యమా?

సమంజసమైన ఈ ప్రశ్నలన్నిటికీ సమ్మె చేసే ఉపాధ్యాయుల, లెక్చరర్ల, కోదండరాం వద్ద, తెరాస నాయకుల వద్ద ఒకటే సమాధానం – 'ఇలా అడిగేవాళ్లు తెలంగాణ వాళ్లు కాదు. తెలంగాణవాళ్లకు పుట్టినవాళ్లు కారు. తెలంగాణ వాళ్లయితే యిలా మాట్లాడరు.'

ఇక్కడ నా అనుభవం ఒకటి చెప్పాలి.

'మీ ఆంధ్రావాళ్లు, మా తెలంగాణ వాళ్లను...' అంటూ నాకు ఒకతను ఈ మెయిల్ రాశాడు. ''నేనెవరో తెలియకుండా ఎందుకిలా రాస్తారు? అసలు ఆంధ్ర ఎవరో, తెలంగాణ ఎవరో నిర్వచనం చెప్పండి ముందు, మహామహా తెలంగాణ నాయకులు ఎలాగూ చెప్పటం లేదు. ఎందుకంటే నిర్వచనం అంటూ ఒకటిస్తే దాని ప్రకారం 90–95% మంది తెలంగాణ వాసులందరూ తెలంగాణ వాళ్లనే తేలుతుంది. అప్పుడు విభజన తర్వాత కూడా యథాతథ స్థితే వుండబోతుందని తెలిసిపోతుంది, ఉద్యమం నీరు కారిపోరుతుంది.

అందుకని వాళ్లు నోరు విప్పటం లేదు. కనీసం మీరైనా చెప్పండి..” అని జవాబు రాశాను. ఆ పాయింటు టచ్ చేయకుండా ఏదేదో రాశాడు. మళ్లీ అదే ప్రశ్న వేశాను నేను. దానికి అతడి జవాబు ఒకటే – “నువ్వు ఆంధ్ర, నేను తెలంగాణ…అంతే ! ” అదేదో సినిమాలో తనికెళ్ల భరణి చేసినట్టు ‘గట్ల డిసైడ్ చేసిండు..’ –

అసలు నేనేమిటి? ఎక్కడ పుట్టాను? ఎక్కడ పెరిగాను? నా స్కూలు, కాలేజీ చదువులు, ఉద్యోగం, స్థిరనివాసం ఎక్కడివి? నేను ఏ ప్రాంతంలో నా ఓటుహక్కు వినియోగించుకుంటున్నాను? ఏ ప్రాంతీయులకు ఓటేశాను? ఏ ప్రాంతం అభివృద్ధితో నా భవిష్యత్తు, నా భావితరాల భవిష్యత్తు ముడిపడి వుంది? నా భార్యాపిల్లలు ఎక్కడ చదివారు? ఎక్కడ పెరిగారు? కాలేజీ ఎడ్మిషన్లలో ఏ ప్రాంతీయులుగా గుర్తింపబడ్డారు? – ఇవేమీ అతగాడికి తెలియవు, పట్టవు. అతనికి నేను లేవనెత్తిన పాయింటు నచ్చలేదు, వెంటనే నేను ఆంధ్ర అని ముద్ర కొట్టాడు. తను మాత్రం తెలంగాణ అట. నేనెందుకు కాదుట?

కాను, కానేరను. ఎందుకంటే అతని వాదనతో ఏకీభవించలేదు కదా, అందుకు ! నా పాఠకుడు ఏదో అమాయకుడు అనుకోవచ్చు. ఏదో డిగ్రీ చదువుకుని ఉద్యోగం చేసుకునే యువకుడు కావచ్చు. కానీ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, లెక్చరర్లు కూడా యిలాగే మాట్లాడితే మనం ఏడవాలా? నవ్వాలా? టీవీలో తలిదండ్రులు అడిగే ప్రశ్నలకు తల్లకిందులై పోయి, సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరై పోయి ‘ఇది 60 ఏళ్లగా జరుగుతున్న ఉద్యమం, దీనికోసం మీరు త్యాగం చేయాలండి.’ అన్నారు.

త్యాగం అనే పదం చాలా వింతగా వినిపించటం లేదూ? మన ప్రస్తుత సమాజంలో ఈ పదానికి అర్థం ఎవరికైనా తెలుసా? ఇప్పుడున్నది పోటీ ప్రపంచం. ‘ఎలాగోలా చీటింగ్ చేసైనా సరే నెగ్గు. నెగ్గినవాడే మొనగాడు. వెనుకబడినవాడు నికృష్టుడు. నువ్వు వాడిలో వుండకు. విజయానికి ఆరు మెట్లు చెపుతాను, ఏడు చిట్కాలు చెపుతాను. నా దగ్గరకు వస్తే సక్సెసే సక్సెసే. నీ తర్వాతి వాడిని దరిదాపుల్లోకి రాకుండా మెట్లమీదనుండి తోసేయ్. దానికోసం శ్రమించు. గ్రూపు డిస్కషన్లలో ఎదుటివాణ్ని అదలగొట్టు. కానారేన్సుల్లో నీ కంటె బాగా పేపరు సబ్మిట్ చేసిన వాటి థీసిస్‌లో రంధ్రాన్వేషణ చేసి వాణ్ని దిగలాగు.

నీ బాగే నీకు ముఖ్యం. తల్లి లేదు, తండ్రి లేదు. ఈ బంధాలు తెంచుకో. విదేశాలకు వెళ్లిపో. పుష్కలంగా ఆర్జించు. నీ కెరియర్‌కు నీ గృహస్థ జీవితం అడ్డువస్తే దాన్ని తొలగించుకో. పరుగులు పెట్టు. నువ్వు యిప్పుడే కాదు, ఎల్లప్పుడూ నెంబర్ వన్‌గానే వుండాలి. దానికోసం ఎల్లప్పుడూ మెలకువగా వుండు. ఒకటినుండి పది స్కేలుపై 1 నుండి 7 దాకా నువ్వే వుండు. నీ పోటీదారులెవరూ నిన్ను కన్నెత్తి చూడలేనంత వున్నతస్థానంలో వుండు. పోటీదారు కంపెనీలో నీ ఏజంట్లను ప్రవేశపెట్టు. వాడి రహస్యాలు కనుక్కో. వాడి కంటె తక్కువ రేటుకి టెండరు వేసి, వాడిని పడగొట్టు. అది సాధ్యం కాకపోతే వాడి కంపెనీని డబ్బిచ్చి కొనేయ్. ఏకఛత్రాధిపత్యం వహించు.’ ఇదేగా మనం నేర్పుతున్నది.

త్యాగం గురించి బోధిస్తున్న కార్పోరేట్ కాలేజీ జాక్ నిర్వాహకులు సాటి కాలేజీల విషయం పట్ల వుదారంగా వుంటున్నారా? బాగా చదివే కుర్రవాణ్ని ఎగరేసుకుని పోవడంలో ఎన్ని చీప్ ట్రిక్స్ ప్రయోగిస్తున్నారో చూడడం లేదా? విద్యార్థులను తమ స్కూళ్లల్లో, కాలేజీల్లో చేర్పించాక ఎన్‌సిసిలో చేరమంటున్నారా? సోషల్ సర్వీసు, మోరల్ టీచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారా? (నా స్కూలు డేస్‌లో, కాలేజీ డేస్‌లో యివన్నీ మాకు పీరియడ్స్‌గా వుండేవి) దేశసేవ కోసం సైన్యంలో చేరమని ఎవరినైనా ప్రోత్సహిస్తున్నారా? పోనీ చదివిన చదువును దేశం కోసం వినియోగించడానికి దేశంలోనే ఉద్యోగాలు చేయమని ఎపుడైనా చెప్పారా? లేదు, లేదు, లేదు. అసలు ఈ స్కూళ్లల్లో, కాలేజీల్లో ఆటస్థలాలే లేవు. ఇంకెక్కడి ఎన్‌సిసి? సోషల్ సర్వీసు మాటే లేదు. ఎంతసేపూ చదువు, చదువు. నువ్వు ఫస్టు రావాలి, నీకు ర్యాంకు రావాలి, ఐఐటి చదవాలి, ఫారిన్ వెళ్లాలి. ఇదే కదా నేర్పిస్తున్నది !

అంతేకాదు, తెలంగాణ విద్యార్థులకు ఏం చెపుతున్నారు? ప్రత్యేక రాష్ట్రం వస్తే ఆంధ్రావాళ్లని తరిమేస్తాం. మీకు అర్హత వున్నా లేకపోయినా ఏమీ అడక్కుండా కేవలం ప్రాంతీయత ఆధారంగా బోల్డన్ని ఉద్యోగాలు యిచ్చేస్తాం అనే కదా నూరిపోస్తున్నారు. ఓ పక్క యిలా స్వార్థం నేర్పుతూ ఇప్పుడు హఠాత్తుగా తెలంగాణ భవిష్యత్తు కోసం, తెలంగాణలో రాబోయే తరాల ఉద్యోగాల కోసం త్యాగాలు చేసేయమంటే చేసేస్తారా? 60 ఏళ్లగా ఎలాగూ చేస్తున్నారుగా పోనీ వచ్చే ఏడాది మా చదువులు అయిపోయాక చేసుకోండి అని వీళ్లంటారు. ‘ఎప్పుడో ముందుతరాల అగ్రవరా?లవారు దళితులను అణగదొక్కారని చెప్పి యిప్పుడు అగ్రవరా?లను వెనక్కుపెట్టి దళితులకు, బిసిలకు అన్నీ కట్టబెడుతున్నారు. అలాగే 60 ఏళ్ల క్రితం ఎక్కువుంటంతా యిప్పుడే సెటిల్ చేయాలా? మేం ఏ అమెరికాయో వెళ్లిపోయాక చేసుకోండి’ అని అనరా?

45 రోజులుగా స్కూళ్లు లేవు, చదువులు పోయాయి అని తలిదండ్రులు చెప్తూవుంటే ‘అబ్బే, అంతా వుట్టిది. కేవలం 11 రోజులే అంటున్నారు టీచర్లు. మిగతావన్నీ ప్రభుత్వం యిచ్చిన సెలవులు అంటున్నారు. సెలవులు ఎందుకు యివ్వాల్సి వచ్చింది? మీ బంద్‌లు, సమ్మెల వలన కాదా? సరిగ్గా ఎన్ని రోజులు నష్టపోయారో తేల్చాలంటే ఆంధ్రప్రాంతంలోని స్కూళ్లలోనో, తెలంగాణలో ఉద్యమకారులు దాడి చేయని స్కూళ్ల వర్కింగ్ డేస్‌తోనో పోల్చి చూడాలి. ‘మాకు మాత్రం పిల్లలు లేరా? వాళ్లకు చదువులు వద్దా? మేమూ తలిదండ్రులమే..’ అంటున్నారు టీచర్లు. యూనియన్ లీడర్ల పిల్లలు, రాజకీయనాయకుల పిల్లలు చదువుల బాటే పట్టాలని లేదు. వాళ్లకు వేరే మార్గాలు ఎప్పుడూ తెరిచే వుంటాయి. ‘పిల్లలకు ఎలా పాఠాలు చెప్పాలో మాకెవరూ పాఠాలు చెప్పనవసరం లేదు. సంక్రాంతి సెలవులు మానేసి, శని ఆదివారాలు మానేసి వాళ్లకు పాఠాలు చెప్పేసి కాళికామ్మవారు తెనాలి రామలింగడి నాలిక మీద రాసేసినట్టు, చదువులు రాసేసి పండితులను చేసేస్తాం’ అంటున్నారు. సరిగ్గా చెపితేనే రిజల్ట్స్ ఎలా వుంటున్నాయో చూస్తున్నాం.

ఇలా అడ్డదారుల్లో చెపితే ఎంత అధ్వాన్నంగా వుంటాయో ఏమో !

ఇలా చెప్పి మార్కులు తక్కువ వస్తే 'పేపర్లు దిద్దినవారు ఆంధ్రా టీచర్లు, అందుకే తక్కువ వేశారు' అని గొడవ మొదలెడతారేమో ! గతంలో టీచర్లనే కొట్టారు కదా ! మరి జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో తక్కువ వచ్చాయి కదా వాటి మాటేమిటి? అంటే 'లగడపాటి అక్కడికి డబ్బు సంచులతో వెళ్లి అక్కడి నార్త్ యిండియన్ టీచర్లను కొనేసి తెలంగాణ బిడ్డలకు అన్యాయం చేశాడు' అంటారు. ఏదైనా అనగలరు, అడ్డుకునే వాడు లేడు.

కెటియార్ చూడండి – నెహ్రూ నిజామాబాద్ స్పీచ్ గురించి అవాస్తవాలు చెప్పి, సుష్మా చేత కూడా పార్లమెంటులో చెప్పించారు. అలా ఎక్కడుంది సాక్ష్యాలు చూపు అని లగడపాటి టీవీ చర్చలో అడిగితే 24 గంటల్లో చూపుతాను అంటూ తప్పించుకున్నారు. సాక్ష్యంగా కూర్చున్న సీనియర్ పాత్రికేయులు కూడా మేమూ మా రికార్డులు వెతకాలి అన్నారు. 24 రోజులు దాటినా వారుకానీ, వీరుకానీ సాక్ష్యాలు బయటకు లాగలేదు. కెటియార్ మళ్లీ దానిమీద నోరెత్తలేదు. 'రాజాజీ ఆంధ్రావాళ్లను 24 గంటల్లో మద్రాసు ఖాళీ చేయమన్నాడు' అని కెటియార్ గతంలో చేసిన ప్రకటన మీద ఎవరైనా యీ తరహాలో బహిరంగంగా ఛాలెంజ్ చేస్తే అదీ కట్టుబడుతుంది. ఇవాళ టి కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద తాజా ఆరోపణ చేశారు. ఎందుకంటే వాళ్లు టికాంగ్రెస్ ఎంపీలలా రైల్ రోకోలో పాల్గొంటామని అనలేదు. నేను యిందాకా చెప్పిన పాఠకుడు నా గురించి చేసిన వర్గీకరణ లాగానే, కెటియార్‌ది కూడా సింపుల్ సిద్ధాంతం. వాళు ్ల థూ పొమ్మంటున్నా కాళ్లావేళ్లా పడి వాళ్ల రైల్‌రోకోలో పాలుపంచుకుంటే నిజాయితీపరులు! పాలుపంచుకోమంటే లంచగొండులు !

అయినా అందరికీ వచ్చే ఓ అనుమానం వుంది – తలిదండ్రులు కోరినట్టు ఉద్యమం నుండి బార్లను, హోళ్లను మినహాయించినట్టు బళ్లనూ మినహాయిస్తే నష్టమేముంది? అప్పుడు సమ్మె విరమించమని ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యమంలోనుండి మేజర్ చంక్ జారిపోతుంది. ఇప్పటికే ఆర్టీసీ విషయంలో దెబ్బ తినేశారు. క్రమేపీ ఆర్టీసీ బస్సుల రాకపోకలు పెరిగాయి. ఇవాళ జంటనగరాల్లో 30% బస్సులు తిరిగాయి. జిల్లాల్లో నామమాత్రంగా నడుస్తున్నా, ప్రయాణీకులకు పోనుపోను ధైర్యం పెరిగితే బస్సులు ఎక్కువచ్చు. రేపు ఉపాధ్యాయులలో కూడా యిలాటి చీలిక వచ్చి కొన్ని స్కూళ్లు తెరిస్తే..? అన్న భయం వుంది.

విద్యార్థుల తలిదండ్రులు మా పిల్లల చదువులు పోయాయి మొర్రో అంటూంటే కోస్తాలో వరదలు వచ్చినపుడు వాళ్లకు స్కూళ్లు పోవా? ఇదీ అలాగే అనుకోండి అంటున్నారు ఓ తెరాస నాయకుడు. ఎన్నాళ్లు పోతాయి స్వామీ, యిలా నెలల తరబడి పోతాయా? తలిదండ్రుల తరఫున గళమెత్తిన వారిపై దుమ్మెత్తి పోస్తున్నారు తెరాస వారు, టీచర్లు. ఒకామె టీవీ చర్చల్లో పాల్గొంటే ఆమె పేరు మార్చుకుందని, కాంగ్రెస్ నేత అని, ఆంధ్రా మహిళ (కెసియార్ అనుచరురాల నంటోందామె) అని ఆరోపణలు. ఆవిడ పాయింటుతో సంబంధమా? పేరుతో సంబంధమా? ఆంధ్ర మహిళ అయితే మాత్రం..? ఆవిడ పిల్లల్ని యిక్కడే చదివిస్తోందిగా ! తెలంగాణ విద్యార్థి పేరెంటుగా ఆమెకు అడిగే హక్కు లేదా? ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం తోచక ఆవిడ పేరు గురించి, ఊరు గురించి, చీర గురించి మాట్లాడితే ఎలా? ఆవిడలాటి వారి ధాటీకి తట్టుకోలేక టీచర్లు 15 వ తారీకున సమావేశం పెట్టుకుని ఒక నిర?యం తీసుకుంటాం అని టీవీ చర్చల్లో ఒప్పుకున్నారు. 15 వ తారీకున బోల్డన్ని నిరసన కార్యక్రమాలు పెట్టుకున్నారు. వాటిల్లో దీనికి టైము కేటాయించేదెవరు?

ఈ లోపున ఇలా అడిగిన తలిదండ్రులందరూ ఆంధ్రావాళ్లంటూ ఆరోపణ చేస్తూ 'మా పిల్లల భవిష్యత్తు ఏమైనా ఫర్వాలేదు, రాష్ట్రం స్కూళ్లు తెరవకండి' అని నినదించే పోటీ తలిదండ్రుల సంఘాన్ని తయారుచేశారు. వాళ్లూ వీళ్లూ కలహించుకోవాలన్నమాట – తెరిస్తే చంపుతామని ఒకరు, తెరవకపోతే చావగొడతామని ఇంకోరూ..! ఎమ్మెల్సీ మోహనరెడ్డి తెలంగాణ తలిదండ్రులకు శాపనార్థాలు పెట్టారు కూడా – స్కూళ్లు తెరిచినా, తెలంగాణ రాకపోతే మీ పిల్లలకు ఉద్యోగాలు రాకుండా అఘోరిస్తారని. ఏం మాటలవి? ఇప్పుడు తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా లేదు. అయినా తెలంగాణ విద్యార్థులకు దేశవిదేశాలలో ఉద్యోగాలు రావడం లేదా? చదువుకుంటే వుద్యోగాలు వస్తాయి తప్ప ప్రత్యేకరాష్ట్రాలు వస్తే రావు.

కొన్ని విద్యాసంస్థలు పండగలయ్యాక తెరుస్తామని పాపం ఉబలాటపడ్డారు. కానీ ఠక్ వీల్లేదని కోదండరాం డిక్టాట్ పాస్ చేశారు. అదే సుగ్రీవాజ్ఞ మరి. కోదండరాం గారు తను పాఠాలు చెప్పరు, ఇంకోర్ని చెప్పనీయరు. అలాగని ఉద్యోగమూ వదలరు, ఉద్యమాన్నీ వదలరు. అన్నిందాలా లాభం అంటే ఆయనదే ! ఈ తలిదండ్రులు ఆయనమీదా పడ్డారు, యితర నాయకుల మీదా పడ్డారు. వాళ్ల పిల్లలు ఎక్కడ చదువుతున్నారో చెప్పండి అంటూ నిలదీస్తున్నారు. ఇవి ప్రజల్లో బాగా నాటుకున్నాయి. ఇది అందరిలో వున్న ఆవేదన కాబట్టే నా 'ఉద్యమంలో విద్య' వ్యాసావళి కూడా చాలామందికి నచ్చింది. మధ్యతరగతి వారి పట్ల విద్య ఓ పాతాళభైరవి, ఒక్కడు విద్యావంతుడైతే చాలు కుటుంబం ముఖచిత్రం మారిపోతుంది, స్థితిగతులు మారిపోతాయి అని రాసినదానికి ఎంతోమంది అది నిజం, మేమే ఉదాహరణ అంటూ రాశారు.

'భార్యా రూపవతీ శత్రుః' అనే శ్లోకంలో ఆ ఒక్క పాదాన్నే అందరూ మాటిమాటికీ కోట్ చేస్తారు కానీ దానిలో మిగతా పాదాలన్నీ కూడా గొప్పవే. అప్పులు చేసిన తండ్రి, చదువురాని కొడుకూ కూడా శత్రువులే అంటుంది ఆ శ్లోకం. ఎంత నిజం ! కొడుక్కి చదువు వస్తే తండ్రి చేసిన అప్పులన్నీ తీర్చేయగలడు. చదువు అబ్బని కొడుకుని చూసి రోదించని తండ్రి వుండడు. సమ్మె పేరు చెప్పి పిల్లలు రోడ్లమీద బలాదూరుగా తిరుగుతూ లేదా టీవీ చూస్తూ కూర్చుంటే తలిదండ్రులు ఎంత విలపిస్తారో వూహించండి. నేను స్కూలులో

చదివినపుడు, కాలేజీలో చదివినపుడు ఎన్ని సమ్మెలు చేశామో నాకే గుర్తు లేదు. కనీసం పదైనా చేసి వుంటాం. రాష్ట్రంలో ఓ మూల వూళ్లో ఏ స్టూడెంటో బస్సు టిక్కెట్టు కొనకపోతే కండక్టరు కొట్టేవాడు. దానితో ఆ వూళ్లో కాలేజీలన్నీ బంద్. ఆ జిల్లాలో బంద్. పక్కజిల్లా వాళ్లు మాకెందుకులే అని కూర్చుంటే వాళ్లకు పోస్టులో గాజులు వచ్చేవి. మా మగతనానికి ఎక్కడ లోటొచ్చిపడుతుందేమోనని మేమూ సమ్మె చేసేవాళ్లం. కారణాలు కూడా మాకు సరిగ్గా తెలియవు.

నేను సమ్మె అంటూ యింట్లో కూర్చుంటే మా అమ్మానాన్నా ఏం ఏడ్చుకున్నారో, ఎలా బాధపడ్డారో నాకు తెలియదు. అయినా అప్పట్లో దైవాధీనం పద్ధతి మనుష్యులు ఎక్కువ. 'చదువు రాకపోతే పొలం దున్నుకుంటాడు, లేకపోతే ఓ కొట్టు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటాడు.' అని దేవుడి మీద భారం వేసి కూర్చునేవారు. (ఇప్పుడు పోటీ తెలంగాణ పేరెంట్స్ సంఘం వాళ్లు యీ బాపతే అనుకుంటా. రాష్ట్రం సాధించేవరకూ చదువులు అక్కరలేదట) ఇక మేమంటారా? చదువులు అయ్యాక ఏ ఉద్యోగం వస్తే దానిలో దూరిపోవడమే. ఛాయిసే లేదు. ట్రాన్స్‌పోర్టు కంపెనీలో లెక్కలు రాయడానికీ రెడీ. కోర్టు ఆవరణలో టైపు కొట్టడానికీ రెడీ. ఇప్పట్లా యింత జీతం యిస్తేనే చేరతాను అని బేరాలు లేవు. కాలేజీ రోజుల్లోనే వచ్చి ఎగరేసుకుని పోవడాలు లేవు.

'ఐ బెగ్ ఫర్ ఏ జాబ్' అంటూ ఉద్యోగానికి అప్లికేషన్ మొదలుపెట్టి 'నా సీనియర్స్ తృప్తిపడేట్లా చచ్చేట్లా పనిచేస్తాను' అని రిటెన్‌గా కమిటయి, 'యువర్స్ మోస్ట్ ఒబీడియంట్లీ' అని ముగించేవాళ్లం. 'యువర్స్ ఫెయిత్‌ఫుల్లీ' అనో, 'యువర్స్ ట్రూలీ' అనో రాస్తానంటే చంపేస్తానేవాళ్లు యింట్లో పెద్దవాళ్లు. నీలాటి పొగరుబోతుకి ఒక్కనాటికి ఉద్యోగం యివ్వరు అనేవారు. ఇంటర్వ్యూకి వెళితే కాళ్లమీద పడడానికి రెడీగా వెళ్లేవాళ్లం. కూర్చోమంటేనే కూర్చోడం. జీతం ఎంత యిస్తారని అడిగే ప్రశ్నే లేదు. వణుకుతూ కూర్చుని, చేతిలో పట్టుకున్న ఫైలును కింద పారేసే కాండిడేట్లు ఎందరో. ఇప్పుడు ఉద్యోగానికి అప్లయి చేసేటప్పుడూ, ఇంటర్వ్యూకి వెళ్లినపుడూ దర్జాగా, ధైర్యంగా ప్రవర్తిస్తున్నారు. ఎందుకీ తేడా అంటే విద్య ! మాకు చదువులు లేవు. ఏదో డిగ్రీ అయిందనిపించి గుమాస్తా వుద్యోగాలకు ఎగబడ్డాం. ఇప్పటివాళ్లు చక్కగా చదువుకుని నచ్చిన ఉద్యోగాన్ని ఎంచుకుంటున్నారు.

రెండు చిన్నా, చితకా ఉద్యోగాలు చేశాక నాకు బ్యాంకు ఉద్యోగం వచ్చింది కాబట్టి ఒడ్డున పడ్డాను. ఒడ్డున పడక సంసారసాగరంలో మునిగిపోయిన మిత్రులెందరో ! ఎందుకంటే అందరూ ఒకలాటి డిగ్రీలే చదివేవాళ్లం. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు రాష్ట్రం మొత్తం మీద గుప్పెడు వుండేవి కావు. బాగా డబ్బున్నవాళ్లే మణిపాల్, తుమకూర్ (కరా?టక) పంపించి పిల్లల్ని చదివించేవారు. మా చదువులకు ఏ ప్రత్యేకతా లేదు కాబట్టి మా ఫిజిక్స్ లెక్చరర్ అనేవారు – ఫ్యాక్టరీలో సబ్బుబిళ్లల్లా కాలేజీలనుండి గ్రాజువేట్స్‌ను తయారుచేస్తున్నాం అని. మాకు దేనిలోనూ ప్రావీణ్యత లేదు కాబట్టి ఏ ఉద్యోగం దొరికితే అది చేయడానికి సిద్ధపడేవాళ్లం. లేళ్లపల్లి లక్ష్మీనారాయణ గారు రాసిన 'ఉద్యోగపర్వాలు' అనే పుస్తకం చదవండి. ఆనాటి నిరుద్యోగుల బతుకులు తెలుస్తాయి. మా ముందు తరం వాళ్లవి చదవాలంటే కొడవటిగంటి కథలు చదవండి.

నా మట్టుకు నేను ఓ సారి మా మామయ్య ఫ్రెండు తండ్రి సనత్‌నగర్ రైల్వే స్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్‌గా పనిచేస్తూంటే ఆయన్ను వెళ్లి ఉద్యోగం అర్థించాను – చుట్టుపట్ల వున్న ఫ్యాక్టరీలు మీ స్టేషన్ ద్వారానే సరుకులు రవాణా చేస్తారు కదా, వారెవరికైనా చెప్పి వుద్యోగం యిప్పించండి అని. ఆయన నిస్పృహగా మా స్టేషన్‌లో కూలీ ఉద్యోగాలు తప్ప వేరేవీ లేవు అన్నాడు. దానికైనా నేను రెడీ అన్నాను. ఆయన నిరౌంతపోయాడు. 'మీరు సైన్సు గ్రాజువేట్, టైపిస్టు. మంచి ఫ్యామిలీ. ఇలా మాట్లాడతారేం?' అన్నారు. 'అవసరం' అన్నాను నేను క్లుప్తంగా. నిరాశపడకండి అని ఓదార్చి పంపించేశాడాయన. ఇలాటి అనుభవాలున్నాయి కాబట్టే "ప్యాసా" సినిమా హీరోతో 1970లలో ఉద్యోగాలు వెతుక్కున్న మాలాటివారు ఐడెంటిఫై అయ్యాం. మా ముందుతరం వారు రెండో ప్రపంచయుద్ధం తర్వాత వ్యాపించిన అరాచక పరిస్థితులను చూశారు కాబట్టి "ఆవారా" హీరోతో ఐడెంటిఫై అయ్యారు.

క్రమేపీ మార్పు వచ్చింది. మనవాళ్లలో విద్య – అంటే సాంకేతిక విద్య పెరిగింది. కూలీలుగా దుబాయి వెళ్లడం మాని, ఉన్నత విద్యావంతులుగా అమెరికా వెళ్లసాగారు. మా వరప్రసాద్ అంటూంటాడు – 'అమెరికాలో విద్యను గౌరవిస్తారు. సరస్వతిని ఆరాధిస్తారు కాబట్టే వాళ్లకు లక్ష్మీకటాక్షమైంది.' అని. ఏ దేశం వాడైనా సరే, విద్యావంతుడైతే వాళ్లు వాటేసుకుంటారు. మనవాళ్లు విద్యావంతులయ్యారు కాబట్టే వాళ్ల మన్ననలందారు. బ్రాండ్ ఇండియాను డెవలప్ చేశారు.

అందుకే నాకు యిప్పటితరాన్ని చూస్తే ముచ్చట. చదువుకునేవాళ్లంటే ప్రేమ, గౌరవం. మంద కృష? మాదిగ సిద్ధాంతాలు కానీ, విధానాలు కానీ నాకు ఏ మాత్రం నచ్చవు. కానీ ఇప్పుడు అతను దళిత విద్యార్థుల గురించి, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువు కోల్పోతున్న వారి గురించి గళమెత్తుతున్నాడంటే గౌరవిస్తున్నాను. ఎందుకంటే నేనూ అలాటి స్కూళ్లల్లో, కళాశాలల్లో చదివినవాణ్నే కాబట్టి వాళ్లతో ఐడెంటిఫై చేసుకోగలను. మా తలిదండ్రులు మమ్మల్ని వేల రూపాయల ఫీజులు కట్టి చదివించలేదు. నేను కాలేజీలో చదువుకునేటప్పుడు హాఫ్–ఫీ కన్సెషన్ సౌకర్యం అనుభవించినవాణ్నే. మెరిట్ మార్కుల వలన స్కాలర్‌షిప్పులు సంపాదించి చదువుకున్నవాణ్నే. అప్పటి నాలాటి యువకులు యిప్పుడు యీ ఉద్యమాల హోరులో పడి వెనుకబడిపోతారన్న భయం నాది. ఉద్యోగాల వేటకు వచ్చేసరికి అప్పట్లో అందరూ నాలాటి వాళ్లే కాబట్టి పోటీలో నెగ్గుకు వచ్చి బ్యాంక్ ఉద్యోగం సంపాదించుకోగలిగాను. కానీ యీ నాడు విపరీతంగా చదివేసి, పోటీపడే తరంలో యీ యువతీయువకులు వెనుకబడ్డారంటే జీవితంలో పట్టుబడిపోయినట్టే. ఆటలో ఓడిపోయినట్టే.

ఒక్క పదిరోజుల స్కూళ్లు మూసేస్తేనే కొంపలు మునిగిపోయినట్టు ఫీలయిపోతున్నావే అని తిట్టకండి. ఇది యింకో పదిరోజులు

సాగుతుందో, పది నెలలు సాగుతుందో ఎవడు చూడవచ్చాడు? దీపావళి తర్వాత నిర?యం వెలువడితే అది టీచర్లకు నచ్చుబాటుగా వుంటుందని ఎవడు చెప్పగలడు? నచ్చకపోతే మళ్లీ కొనసాగించవచ్చు. కొనసాగించలేని పరిస్థితి దాపురించి పాఠశాలలకు వచ్చి ఆ నిరాశానిస్పృహలను విద్యార్థులపై చూపవచ్చు. విద్యార్థులు సాఫ్ట్ టార్గెట్లు. వాళ్లను రెచ్చగొట్టవచ్చు. వాళ్లు బదులు మానేసి మావోయిజం వైపు మళ్లవచ్చు. తలచుకున్న కొద్దీ భయంగా వుంది. ఇవేమీ జరగకుండా వుంటే అంతే చాలు.

దీనితో బాటు యింకో మాట – ఈ విషయంగా విద్యార్థుల తలిదండ్రులు చూపిన చైతన్యం బాగుంది. ఇదే చైతన్యం విద్యార్థులకు సంబంధించిన యితర విషయాల్లో కూడా చూపిస్తే బాగుంటుంది. అనేక కార్పోరేటు కాలేజీలు ఫీజుల రూపంలో వేలకు వేలు గుంజుతున్నారు. తీసుకున్న మొత్తానికి రసీదు యివ్వడం లేదు. కాలేజీలో ఆటస్థలాలు లేవు, లాబ్స్ లేవు, పిల్లలలో కొంతమందినే ఎంపిక చేసుకుని వాళ్లకు బాగా తరీఫీదు యిస్తున్నారు. తక్కినవాళ్లని పట్టించుకోవడం లేదు కానీ వాళ్ల దగ్గర ఫీజు పూర్తిగా వసూలు చేస్తున్నారు. కాలేజీవాళ్లు ఏ ప్రాంతం వాళ్లు అన్నది యిక్కడ అప్రస్తుతం. ఎక్కడి వారైనా సరే అన్ని జిల్లాలవారినీ విద్యపేర దోపిడీ చేస్తున్న దోపిడీదారులు వాళ్లు. దాన్ని అరికట్టాలి. అరికట్టడానికి తలిదండ్రులు సంఘటితం కావాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

## అక్టోబరు 18 ఎమ్బీయస్ : గ్రేట్ ఆంధ్రాకు రాయకూడదా...?

గ్రేట్ ఆంధ్రా ఎడిటర్ అరెస్టు వార్త రాగానే నాకు మెయిల్స్ రావడం మొదలెట్టాయి. నా రాతలు నచ్చనివారు 'తర్వాతి వంతు నీదే' అంటూ రాస్తే, మరి కొందరు 'ఇలాటి వెబ్‌సైట్‌లో మీరింకా రాయాలా?' అంటూ వాపోయారు. ఇప్పటికైనా మానుకోమని హితోక్తులు పలికారు. అసలు దీని గురించి ఇంత చర్చ ఎందుకు జరుగుతోందో నాకు అర్థం కావటం లేదు. మీడియాలో వున్నవారికి యిలాటి కేసులు, అరెస్టులు, బెయిళ్లు – ఆక్యుపేషనల్ హజార్డ్స్. వృత్తిరీత్యా వచ్చే ఆపదలు. సర్కస్‌లో పనిచేసేవాడికి కిందకు జారిపడే ప్రమాదం వున్నట్టు పత్రికారంగంలో వున్నవాడికి యీ కేసుల బెడద తప్పదు. అందుకే పత్రికలలో ఏడాదికోసారి ఎడిటర్ పేరు, పబ్లిషర్ పేరు, ప్రింటర్ పేరు, ఎడ్రసు వేస్తూ డిక్లరేషన్ ముద్రిస్తారు. వ్యాసకర్తల అభిప్రాయాలు స్వంత అభిప్రాయాలే తప్ప ఎడిటర్ అభిప్రాయాలు కావు అనే లైను కూడా కనబడుతుంది.

ఎడిటర్ అరెస్టు అయితే కాబట్టి నేను వాళ్లకి రాయడం మానేయాలి అంటే రాయడానికి పత్రికలు మిగలవు. ఈనాడు, సాక్షి, జ్యోతి, భూమి, వార్త, సూర్య, స్వాతి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, విమన్స్ ఎరా... వీళ్లందరిపైనా కేసులు నడుస్తూనే వుంటాయి. కానీ వీళ్లందరికీ నేను రాస్తూనే వున్నాను/వుంటాను. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో జరిగిన గొడవకు 'పెద్దల గలభా' అని కాప్షన్ పెట్టినందుకు రామోజీరావుగారిపై ఏళ్ల తరబడి కేసు నడిచింది. మేర్లపాక మురళి సీరియల్‌లో అశ్లీలత వుందని ఎవరో ఫిర్యాదు చేస్తే, స్వాతి బలరాం గారిని అరెస్టు చేసి కేసు నడిపారు.

ఇలా చెప్పుకుంటే పోతే వందలాది కేసులు తగులుతాయి. రచయితలుగా కూడా కేసులు ఎదుర్కోవలసి రావచ్చు. నా ఐడియా కాపీ కొట్టావని ఎవరైనా సరే కేసు పెట్టవచ్చు. 'రోబో' సినిమా కథ నా నవల నుండి కాపీ కొట్టారని మైనంపాటి భాస్కర్ రోబో యూనిట్‌పై కేసు పెట్టలేదా? టీవీ ఛానెల్స్‌పై వున్న కేసులకు లెక్కే లేదు. వీళ్లు వేసే సినిమా క్లిప్పింగ్స్‌కు అనుమతి లేదంటూ సినిమా హక్కులున్నవారు కేసులు పెడుతూనే వుంటారు. సినిమాలలో కూడా ఫలానా కమ్యూనిటీని అవమానపర్చారని, ఫలానా మతాన్ని కించపరిచారని ఏవో కేసులు పెడతారు. అశ్లీలత, అసభ్యత (వీటిని నిర్వచించడం చాలా కష్టం. ఒకరికి అశ్లీలంగా తోచినది మరొకరికి అలా తోచకపోవచ్చు) అనే కారణాలపై ఎడాపెడా కేసులు వచ్చిపడుతూనే వుంటాయి.

ఇలాటి పరిస్థితుల్లో గ్రేట్ ఆంధ్రా డాట్‌కామ్‌పై యిది తొలికేసు కావడం నాకు ఆశ్చర్యంగానే వుంది. ఈ పాటికే ఎందరో కేసులు వేసే వుంటారనుకున్నాను. సైట్ తనను తాను వరి?ంచుకోవడంలోనే 'స్పైసీ గాసిప్స్' అని చేర్చుకున్నాక అవి పుకార్లనే చెపుతున్నారు కదా, యింకేం కావాలి? 'మేం రాసేదంతా అక్షరసత్యాలు. సిబిఐ విచారణకు ఆదేశిస్తే ఆధారాలు బయటపెడతాం' అని రాజకీయనాయకుల్లా బుకాయించడం లేదు కదా. గాసిప్స్ అని వీళ్లే చెప్పుకున్నాక యింకేం వుంటుంది కేసు వేయడానికి?

అయినా వీళ్లలా రాసేవాళ్లు ఒకళ్లా, యిద్దరా? ఏ వీక్లీ తీసినా సినిమాబిట్స్ అంటూ కనబడుతున్నవి యివే కదా ! ఫలానా తారా, తారడూ కలిసి జీవిస్తున్నారా? విడిపోయి కలుస్తున్నారా? ఫలానా తారతో తిరుగుతున్న మంత్రిగారి కొడుకు ఎవరు? తెలుగు వీక్లీలే కాదు, డెక్కన్ క్రానికల్, టైమ్స్ ఆఫ్ ఇండియా లలో అనుబంధంగా వచ్చే సప్లిమెంట్స్‌లో యివే కదా న్యూస్ ! వాటన్నిటినిండా అర్ధనగ్న చిత్రాలే కదా! పేజీ త్రీ అంటూ సోషల్ బటర్‌ఫ్లయ్‌ల క్లీవేజ్ ఫోటోలే కదా ! హిందీ తారల గురించి వచ్చే ఇంగ్లీషు మ్యాగజైన్లు మరీ ఘోరం. ప్రింట్ మీడియా యిలా వుందంటే యిక విజువల్ మీడియా సంగతి చెప్పనే అక్కరలేదు. వాళ్లూ ఫిల్మీ న్యూస్ పేర ఎన్ని గాసిప్స్ చెప్తారో ! రాత్రి 10 దాటిన తర్వాత ఏ ఛానెల్ పెట్టినా యివే వార్తలు.

ఇక ఇంటర్నెట్ నిండా యిలాటి వార్తలే వుంటాయి. వాటికి అదుపు లేదు కాబట్టి మరీ చెలరేగిపోతాయి. ఫోటో కింద రాసే కాప్షన్లు మరీ ఘోరంగా వుంటాయి. మన దేశానికే యిది పరిమితం కాదు. ఇంగ్లండు, అమెరికా వంటి దేశాల్లో కూడా యివే పాప్యులర్. టాబ్లాయిడ్ అంటే యిలాటి న్యూస్ మీదే బతుకుతాయి. మర్డోక్ న్యూస్ పేపర్ల గ్రూప్ యిలాటి వార్తలతోనే అత్యంత

ప్రజాదరణ పొందింది. అత్యధిక సర్క్యులేషన్ వున్న పత్రికలు అలాటివే. వార్తా సేకరణలో మరీ నీతితప్పి ప్రవర్తించడంతో వాటిలో ఒకటి మూతపడింది యిటీవల. మిగతావి కొనసాగుతూనే వున్నాయి. తాము పనిచేసే దేశంలో ఎవణ్నో పట్టుకుని వాణ్ని తాగించి వాగించిన కబుర్లను అమెరికా దౌత్య ఉద్యోగులు తమ దేశానికి పంపితే వాటిని బహిరంగపరచి వికీలీక్స్ అసాంజే ప్రపంచమంతా పేరు తెచ్చుకున్నాడు. ఆ సొల్లు కబుర్లలో పొల్లెంతో, గట్టి ఎంతో దేవుడికే తెలియాలి.

ఇక అశ్లీలత, అసభ్యత గురించి మన కొలబద్దలు మారుతూ వచ్చాయి. 20 ఏళ్ల క్రితం ఏ సర్టిఫికెట్టు యిచ్చిన సినిమాలను ఇప్పుడు చూసి ఇందులో ఏముందని అడల్ట్ సర్టిఫికెట్టు యిచ్చారని మనమే ఆశ్చర్యపడుతున్నాం. దేశవిదేశాల టీవీ ఛానెల్స్ మన ముంగిట్లోకి వచ్చిపడ్డాక టాప్‌లెస్‌లు, మంచంమీద నగ్నంగా పొర్లాడే దృశ్యాలు, ఫ్యాషన్ షోలలో దేవతావస్త్రాలు ధరించిన భామలు, ఇంటర్నెట్ తెరిస్తే చాలు వేలాది పోర్నో సైట్లు, మీ పాటికి మీరు మెయిల్ ఓపెన్ చేస్తే అంగం పొడవు పెంచుతామంటూ, రాత్రి గడపడానికి తోడు వస్తామంటూ ఆఫర్లు .. ఎటు చూసినా అశ్లీలమే.

తెలుగు తలిదండ్రులలో కూడా ఎంత మార్పు వచ్చింది ! స్థూలకాయులైన గృహిణులు కూడా వ్యాంప్ పాటలకు అభినయం పడుతూ ఒళ్లు వూపుతున్నారు. తమ పిల్లలను షోలకు పంపి వాళ్ల చేత అతి తక్కువ బట్టలు వేయిస్తూ, పెల్విక్ జెర్క్స్ చేయిస్తున్నారు. పెద్ద డాన్సర్లయితే చెప్పనే అక్కరలేదు – కటి ప్రాంతాన్ని ఏ మాత్రం వూపకపోయినా జడ్జిలు తిట్టిపోస్తున్నారు. 'సిగ్గుపడ్డావు', 'ఫీల్ లేదు'.. అంటూ.

ఇక అసభ్యత గురించి చెప్పాలంటే – టీవీలో ఇంగ్లీషు సినిమా చూడబోతే సబ్ టైటిల్స్‌లో ప్రతీ నాలుగు డైలాగుల్లోనూ చుక్కలు (ఫోర్ లెటర్ వర్డ్స్) కనబడతాయి. తెలుగు సినిమాలో అయితే సౌండ్ మ్యూట్ చేస్తున్నారు. అవి విలన్ డైలాగ్స్ అయితే సర్దుకుపోవచ్చు, హీరో డైలాగుల్లో కూడా మ్యూట్ చేస్తున్నారంటే హీరోని ఎలా చూపిస్తున్నారో చూడండి. హీరో అంటే అందరూ అనుసరించేవాడు, అనుకరించేవాడు. అలాటివాడే బూతులు మాట్లాడుతున్నాడు. ఇదివరకు పెద్దలముందు మాట్లాడడానికి కూడా జంకే పదాలను యథేఛగా వాడుతున్నారు. 'దొబ్బడం' అనే మాటను ఏ అర్థంలో వుపయోగిస్తున్నారో చూస్తున్నాం. ఎల్ బి శ్రీరాం వంటి పల్లెటూరి పాత్ర నోటివెంట మొదలుపెట్టి యిప్పుడు ఐపియస్ అధికారి ఐన హీరో పాత్ర చేత కూడా అనిపిస్తున్నారు.

హీరోయిన్ పాత్రకు వ్యక్తిత్వం పోయి దశాబ్దాలు దాటింది. వ్యాంప్‌లకన్నా అధ్వాన్నమైన బట్టలు వేసుకుని, హీరో కంటబడితే చాలు అతడి మీదకు పాకేస్తూన్నట్టు చూపిస్తున్నారు. ఇవన్నీ సహించడమే కాదు, వాళ్లని అనుకరించి టీవీషోల్లో బహుమతులు తెచ్చుకోమని పిల్లలను ప్రోత్సహిస్తున్న జాతి మనది. త్యాగరాజ కీర్తనను అపానవాయువుతో పోలుస్తూ సినిమాను తీసిన నిర్మాతను ఫాల్కే ఎవార్డుతో సత్కరించుకున్నాం. విరేచనాలు చూపిస్తూ వాటి గురించి సినిమా (ఢిల్లీ బెల్లీ) తీస్తే ఓహోహో అని మెచ్చుకుని సీక్వెల్ తీయిస్తున్నాం. మనమా సభ్యత గురించి మాట్లాడేది?

సమాజహితం గురించి మాట్లాడేటప్పుడు వీటన్నిటి గురించి మాట్లాడాలి. గొంగళిలో తింటూ వెంట్రుకలు ఏరితే ఎలా అనేది సామెత. మనం గొంగళిలో తినకపోయినా గొంగళి మన చుట్టూ ఆవరించివుంది. కప్పేసింది. ఇష్టం వున్నా లేకపోయినా తల వంచుకుని బతుకుతున్నాం. నిస్సహాయంగా వున్నాం. ఇలాటి పరిస్థితుల్లో ఈ గ్రేట్ ఆంధ్రా ఒక్కటే పతిత అయినట్టు, తక్కినవన్నీ పతివ్రత లయినట్టు పోజు పెడితే మహా చికాకు వేస్తుంది.

దీన్ని బట్టి గ్రేట్ ఆంధ్రాలో గాసిప్స్ నేను సమర్థిస్తున్నానని అనుకోవద్దు. దానిలో గాసిప్సే కాదు, వీక్లీలో బాక్స్ కట్టి వేసే గాసిప్స్ కూడా నేను చదవను. ఇప్పుడు లైమ్‌లైట్‌లోకి వచ్చిన మధు యాష్కీ న్యూస్ ఐటమ్ కానీ, శివాజీ ఐటమ్ గానీ నేను చదవ లేదు. ఆ సైట్‌లో ఎప్పుడైనా సినిమా రివ్యూలు చదువుతానంతే. నా ఫోకస్ అంతా సీరియస్ స్టఫ్ మీద. నాకు కావలసిన మెటీరియల్ ఆ సైట్‌లో దొరకదు. కానీ చాలామందికి కావలసిన మెటీరియల్ అక్కడ దొరుకుతుంది. అందుకే దాన్ని పాప్యులరైజ్ చేసి ఎలెక్సా రేటింగులో 2 వేల చిల్లరకు తెచ్చారు.

ఈ దిక్కుమాలిన సైట్‌లో రాయకపోతే నీకు పొట్ట గడవదా? అని అడుగుతారు కొందరు. రాసినది పదిమందికి చేరాలనే ప్రతీ రచయితా కోరుకుంటాడు. అందుకే పుణ్యపురుషులైన పివిఆర్‌కె ప్రసాద్ గారి లాటి వాళ్లు కూడా "స్వాతి" వీక్లీకి రాస్తారు, "స్వాతి" మంత్లీకి కాదు. ముళ్లపూడి రమణగారు తన ఆత్మకథ వీక్లీకై రాశారు. అంతమాత్రం చేత వీక్లీలో వున్న స్టఫ్ అంతటినీ వారు ఆమోదించారని కాదు. ఈనాడుకి గాని, సాక్షికి గాని – మనం కథో, వ్యాసమో రాసినప్పుడు వారి రాజకీయ అభిప్రాయాలతో ఏకీభవించామన్న అర్థం రాదు. మనం రకరకాల పత్రికలకు రాస్తాం. ఆ యా పత్రికాధిపతులు తమ వ్యాపార వ్యవహారాల ద్వారా ఎటువంటి పనులు చేశారు అని చూడడం మొదలెడితే తెల్లారిపోతుంది. ఆయన తన భార్యను వదిలేశాడా, ఇన్‌కమ్ టాక్సు కట్టాడా లేదా, చిట్‌ఫండ్ కంపెనీ పెట్టి బోర్డు తిప్పేశాడా, స్థలాలు కబ్జా చేశాడా, ఎవరినైనా బ్లాక్ మెయిల్ చేశాడా, దొంగబాబా కాళ్లమీద పడ్డాడా – యిలా వాళ్ల జీవితాలలోకి తొంగిచూస్తే కుదరదు.

మనకు సంబంధించినంత వరకు పత్రికకు సర్క్యులేషన్ వుందా లేదా, సభ్యత హద్దుల్లో వుందా లేదా, మనం అనుకున్నది అనుకున్నట్టు రాసేందుకు స్వేఛ్ఛఏ మేరకు యిస్తున్నారు?, పారితోషికం ఎలా వుంది? – యివే పరిగణిస్తాం. పత్రికాధిపతులకు తమ తమ అభిమాన రాజకీయ పార్టీలుండవచ్చు. వాళ్లకి విరాళాలు యివ్వవచ్చు. ఆ పార్టీల గురించి తమ పత్రికలో బాగా రాయవచ్చు. అది వాళ్ల యిష్టం. ఆ పార్టీకి వ్యతిరేకంగా మనని రాయనిస్తున్నారా లేదా అనేదే చూడాలి. తెలుగునాట ప్రింట్ మీడియాలో ఆ స్వేఛ్ఛ

పరిమితం. టీవీ మీడియాలో కూడా.

గ్రేట్ ఆంధ్రాకు సంబంధించినంత వరకు నేను ఆ స్వేఛ్ఛాపూర్తిగా అనుభవిస్తాను. నేను రాసిన ఒక్క అక్షరం కూడా మారకుండా అలాగే అప్‌లోడ్ అవుతుంది, టైపింగు పొరపాట్లతో సహా ! ఈ సైట్‌కు నేను కనీసం ఐదేళ్లగా రాస్తున్నానా, ఎడిటర్ వెంకట్‌రెడ్డి ఎన్నడూ ఇలా రాయండి, అలా రాయండి అని నాకు సూచించలేదు. ఎవరిద్వారానో నా గురించి తెలుసుకున్నారు. నాకు మెయిల్ పంపి మాకు రాస్తారా అన్నారు. సరే అన్నాను. రాస్తున్నాను, దానికి పారితోషికం చెల్లిస్తున్నారు. ఈ సబ్జక్ట్‌పై రాయండి అని కూడా ఆయన అనడు. నాకు పాఠకులతోనే బంధం. నేను ఏదో అంశంమీద రాసి, బాగుందా, కంటిన్యూ చేయనా అని పాఠకులనే అడుగుతాను. వాళ్ల సూచనలు, అభిప్రాయాలు నాకు ఉపకరిస్తాయి. ఈ సౌలభ్యం ప్రింట్ మీడియాలో లేదు. పాఠకులు ఎడిటర్‌కే ఉత్తరాలు రాస్తారు. ఎడిటర్‌కు తనకు తోచిన ఉత్తరాలు ప్రచురిస్తాడు.

ప్రింట్ మీడియాకు చాలా లెక్కలుంటాయి. బైబిల్ గురించి రాస్తానంటే ఎవడికి కావాలండీ అంటారు. ప్రాణ్ గురించి రాస్తానంటే వాడెవడు? నాకే తెలియదు అంటాడు అక్కడి సబ్ ఎడిటర్. ఎల్‌టిటిఇ చంపిన రాజీవ్ గురించి రాస్తానంటే తమిళులు నొచ్చుకుంటారు వద్దు అంటారు, నిజాం గురించి రాస్తే ముస్లిములు పగబడతారంటారు. నచ్చిన కథ గురించి రాస్తానంటే 'కథ అయితే చదువుతారు కానీ కథ గురించి ఎవరు చదువుతారు?' అంటారు. ఇక రాజకీయపరమైనవైతే చెప్పనే అక్కరలేదు. ఇలా రాస్తే అవతలివాళ్లు వచ్చి మా ఆఫీసుపై దాడి చేస్తారు.., ..యాడ్స్ ఆపేస్తారు, .. ఆయన మా ఎండీకి ఫ్రెండ్... ఫలానా వాక్యాలు తీసేయండి, నిడివి తగ్గించండి.. ఇలా లక్ష ఆంక్షలు. పోనీ యిలాటి విజ్ఞానాన్ని టీవీల కార్యక్రమాల ద్వారా పంచుదామా అని చూస్తే 'విజువల్స్ మాటేమిటి?' మధ్యలో సినిమా బిట్స్ వేయాలంటే లింకు ఎలా కలుపుతారు? అని అడుగుతారు. ఆడమ్ అండ్ ఈవ్ కథకు విజువల్స్ ఏం చూపిస్తాం? వీరాస్వామిగారి కాశీయాత్రకు బొమ్మలు ఎక్కణ్నుంచి పట్టుకుని వస్తాం?

ఈ వెబ్‌సైట్‌కు రాసి మీరు పేరు పోగొట్టుకోకండి. కావాలంటే స్వంతంగా బ్లాగ్ పెట్టుకోండి, వెబ్‌సైట్ పెట్టుకోండి అని సలహాలు యిస్తూ వుంటారు. ఇవన్నీ చెప్పడం సులభమే, చేయడం కష్టం. నేను బ్లాగర్‌ను కాను. ఫేస్‌బుక్‌లో లేను. ఆ కల్చర్ నా వంటికి పడదు. వెబ్‌సైట్ మేన్‌టేన్ చేయడానికి చాలా టైము ఖర్చవుతుంది. ఆర్టికల్స్ రాయడానికే నాకు టైము చాలటం లేదు. ఇక ఆ సాంకేతిక విషయాలు కూడా ఎక్కడ చూసుకోను? పోనీ అన్ని పనులూ మానేసి వెబ్‌సైటే పెట్టుకున్నాననుకోండి. కానీ దానికి వచ్చేవారెవరు? అది వుందని ఎంతమందికి తెలుస్తుంది? తెలిశాక వచ్చి చూసినా రోజూ చూస్తారన్న నమ్మకం ఏముంది? నా సంగతి నాకు తెలుసు. నేను ఒక తరహా పాఠకులను మాత్రమే మెప్పించగలను. అ పాఠకులు కూడా రోజంతా నావే చదవరు. తక్కినవి కూడా చదువుతూ మధ్యమధ్యలో నావి చదువుతారు. నావి ఒకటే రుచి. తక్కిన రుచులన్నీ ఎక్కణ్నుంచి పట్టుకురాను?

నిజానికి "హాసం" పత్రిక పెట్టినపుడు వరప్రసాద్ నన్నే ఎడిటరుగా వుండమన్నాడు. కానీ నా పరిమితులు నాకు తెలుసు కాబట్టే రాజాగారిని సంపాదకుడిగా వుండమన్నాను. ఎందుకంటే జనరంజకం చేయాలంటే పాఠకులకు సినిమావాళ్ల విషయాలు చెప్పాలి. నాకు సినిమాలలో కొన్ని విషయాలే క్షుణ?ంగా తెలుసు. ఈనాటి నటీనటుల్లో చాలామందిని నేను గుర్తుపట్టలేను. ఇక వారి యిష్టాయిష్టాలు, వ్యక్తిగత వివరాలు నాకేం తెలుస్తాయి? రాజాగారికి తెలుసు. అందుకే ఆయన్ను ఎడిటర్ చేసి, నేను మేనేజింగ్ ఎడిటర్‌గా వున్నాను. ఆయనను పంపించివేసే సందర్భం వచ్చినపుడు పత్రిక మూసేశాం తప్ప, నాకు తెలిసిన విషయాలతోనే పత్రిక నడుపుదామనుకోలేదు. ఎందుకంటే సాధారణ పాఠకుడికి కావలసిన స్పైస్ నేనందించలేనని నాకు బాగా తెలుసు. గ్రేట్ ఆంధ్రాలో ఆ స్పైస్ అందించేవారు వేరు కాబట్టి దానికోసం వచ్చినవాళ్లు పనిలో పనిగా నాదీ చూసి మెచ్చుకుంటున్నారు తప్ప కేవలం నా మొహం చూసే రారని నాకు తెలుసు.

ఇలాటి మీమాంస ఎందరో పెద్దవాళ్లకు వచ్చింది. "బ్లిట్జ్" పత్రిక వీక్లీ టాబ్లాయిడ్‌గా వచ్చేది. ఆర్ కె కరంజియా ఎడిటర్‌గా వుండి ఇలాగే రూమర్లతో పత్రిక నడిపేవాడు. అవినీతిని ఘాటుగా విమర్శిస్తూ, ప్రజలను మేల్కొల్పుతూ, ఒక ఛాంపియన్‌గా వుండేవాడు. 'టుమారోస్ న్యూస్ టుడే' అనే శీర్షికతో పుకార్లను అచ్చేసేవాడు. అతనికంటూ కొందరు ఫేవరేట్స్ వుండేవారు, కొందర్ని అసహ్యించుకున్నాడు. ఏమున్నా దాచుకోకుండా తీవ్ర పదజాలంతో రాసేవాడు. ఆ టాబ్లాయిడ్ ఆఖరి పేజీలో ఓ అర్ధనగ్న సుందరి ఫోటో వేసి కింద చమత్కారంగా వ్యాఖ్య రాసేవాడు. ఆ బొమ్మలు సంఘాన్ని చెడగొడుతున్నాయంటూ కేసులు పెట్టేవారు. ఇతను కోర్టులో పోరాడి గెలిచాక మళ్లీ ఆ ఫోటోను వేసి మీసం మెలేసేవాడు. అతనికి చక్కటి మీసం వుండేది. ఆ ఆఖరిపేజీలోనే కె.ఎ. అబ్బాస్ వారం వారం రాసే వ్యాసం వుండేది.

కెఎ అబ్బాస్ గురించి వినే వుంటారు. వామపక్ష భావాలున్న రచయిత, ఉర్దూ, ఇంగ్లీషుల్లో రాసేవారు. సినిమా రచయిత (రాజ్ కపూర్ సినిమాలు చాలావాటికి రాశారు) దర్శకుడు, నిర్మాత. అమితాబ్ బచ్చన్‌ను సినిమా రంగానికి పరిచయం చేసినది ఆయనే. ఆయన బ్లిట్జ్ ఇంగ్లీషు ఎడిషన్‌కు 'ది లాస్ట్ పేజ్' అనే పేరుతో, ఉర్దూ ఎడిషన్‌కు 'ఆజాద్ కలమ్' పేరుతో శీర్షికలు నిర్వహించేవారు. ఆయన ఓ సారి రాశారు – "బ్లిట్జ్‌లో అర్ధనగ్న చిత్రాలు వేసే పేజీలోనే నా వ్యాసం వేస్తూండడం నాకు కాస్త బాధగా వుండేది. ఓ సారి కరంజియాకు చెప్పాను – అక్కడ కాకుండా వేరే చోట వేయమని. అతను నవ్వి అన్నాడు – "మీకు తెలుసా? నా పత్రికలో అన్నిటికంటె ఎక్కువమంది చూసేది ఆ పేజీయే. అక్కడ వేయడం వలననే మీ కాలమ్ పాప్యులర్ అయింది" అని.

ఇదీ ఫ్యాక్ట్ ఆఫ్ లైఫ్. గ్రేట్ ఆంధ్రాలో నా వ్యాసం చూసి కొందరు "మీరేమిటి? ఇక్కడ..? మీలాటి వారు రాయవలసిన సైట్

కాదిది" అంటారు. మరి తమరు మాత్రం ఎలా వచ్చారు స్వామీ? ఎందుకు వచ్చారట? ఇక్కడ ఆధ్యాత్మిక ప్రసంగాలుంటాయని వచ్చారా? అలాటి వాళ్లను నేను ఒకటే అడుగుతాను – నేను "నేటి విద్యార్థి", "విద్య", "నడుస్తున్న చరిత్ర" పత్రికలలో రాస్తే మీకు తారసిల్లేవాడినా? అని. మీరు వాటి జోలికి పోనే పోరు. అసలలాటివి వున్నాయనే మీకు తెలియదు. ఈ ఏడాది స్వాతి వీక్లీ నిర్వహించిన హాస్యకథల పోటీలోను, సరసమైన కథలపోటీలోనూ రెండింటిలోనూ నాకు ఫస్ట్ ప్రైజులు వచ్చాయి. (ఒక్కో దాంట్లో ఐదుగురేసికి ఫస్ట్ ప్రైజులు యిచ్చారు). నా హాస్యకథ చదివిన వారికంటె, సరసకథ చదివినవారే ఎక్కువున్నారు. "మీ సరసకథ చదివాను, బాగుంది' అన్నవారందరినీ అడిగాను – 'మరి హాస్యకథో?' అని. "చూడలేదండీ. ఏ యిస్యూలో వచ్చింది?" అని అడిగారు. ఇదీ వరస. భారతీయులం, అందునా తెలుగువారం, యిలా వున్నాం. ఇలాటి పరిస్థితుల్లో జడ్జిమెంట్లు పాస్ చేయగలమా?

ఏతావాతా గ్రేట్ ఆంధ్రా నాకు యిచ్చిన యీ పాప్యులర్ వేదికను వదులుకునే వుద్దేశం నాకు లేదు. దీని ద్వారా ఎందరో మేధావుల దృష్టిని నేను ఆకర్షించగలిగాను. ఎందరో వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులు, విద్యాధికులు, ఉన్నతోద్యోగులు యీ సైట్‌కి వస్తారని, నా వ్యాసాలు చదువుతారని, నాకు వచ్చిన మెయిల్స్ ద్వారా తెలుసుకుని నేనే ఆశ్చర్యపడ్డాను. ఆధునిక సాంకేతిక విజ్ఞానమే నన్నూ, సప్తసముద్రాల అవతల వున్నవారినీ కలుపుతోంది. నా గురించి వారికి చెపుతోంది. ఈ కేసులు మబ్బుల వంటివి. తొలగిపోతాయి. గ్రహణం కూడా కొన్ని గంటలపాటే వుంటుంది. వీటి కారణంగా సైట్ స్వరూపస్వభావాలలో మార్పు వస్తే రావచ్చు. నాకు సంబంధం లేదు. నా కబుర్లలో మాత్రం మార్పు రాదు. అలా రాయాలి, యిలా రాయాలి అని నా పై ఒత్తిడి వచ్చిన రోజున మాత్రమే వైదొలగే ఆలోచన చేస్తాను. అప్పటివరకు ప్రస్తుత పరిస్థితే కొనసాగుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

## అక్టోబరు 21 ఎమ్బీయస్ : స్వామిగౌడ్ సడన్ జ్ఞానోదయం

శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశంలో వినేవాళ్ల తల గుండ్రంగా తిరిగేట్లా స్వామిగౌడ్ విరుచుకు పడ్డారు – "ఇది సకల జనుల సమ్మె కాదు, సకల ఉద్యోగుల సమ్మె. మమ్మల్ని ముందుకు తోసి ఈ రాజకీయనాయకులు వేడుక చూస్తున్నారు. మేం పండక్కి పిల్లలకు బట్టలు కొనలేకపోయాం. జీతాలు పోగొట్టుకున్నాం. కానీ వారు త్యాగాలు చేయలేదు. ఉదయం కాస్సేపు హంగామా చేసి మధ్యాహ్నం నుండి తమ వ్యాపారాలు చూసుకుంటున్నారు. ఒక్కరోజు పోలీసు స్టేషన్‌లో వున్నా మా ఉద్యోగం ఖళాస్. అదే రాజకీయనాయకులైతే ఎన్ని కేసులుంటే అంత ఘనత.." అని.

ఈ జ్ఞానోదయం స్వామిగారికి హఠాత్తుగా ఎందుకు కలిగిందో నాకు అర్థం కావటం లేదు. సకల జనుల సమ్మె కాదు, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల, ఆర్టీసీ, స్కూళ్ల, సింగరేణి వారి సమ్మె మాత్రమే అని నా బోటి వాడికే తెలిసింది. ఆయన యింకోలా ఎందుకు అనుకున్నారో ! సమ్మె ప్రారంభానికి ముందే ఆయన యీ మాటలు చెప్పారు. మా భుజంమీద తుపాకీ పెట్టి కాల్చకండి. మీరు ముందు వుండండి, లేకపోతే సమ్మెలో దిగం అని గట్టిగా చెప్పారు. అలా చెప్తూనే సమ్మెలోకి దిగారు, ఎవరి మత్తులో పడ్డారో కానీ ! ఇప్పుడు మత్తు దిగిపోయినట్టుంది. రంకెలు వేస్తున్నారు. చచ్చేదాకా, తెలంగాణ వచ్చేదాకా సమ్మె చేస్తాం అని అలాయ్–బలాయ్ రోజున అన్నట్టే గుర్తు. ఇంతలో ఏమొచ్చిందో ఏమో !

అన్నట్టు కెటియార్ ఆరోపణ వచ్చిందండోయ్, రైల్ రోకోకు టి కాంగ్రెస్ ఎంపీలు మద్దతిస్తూ వుంటే ఎమ్మెల్యేలు మాత్రం మద్దతివ్వం అన్నారు. పైగా వారిలో కొందరు సమ్మెనుండి విద్యాసంస్థలను మినహాయించమంటూ విజ్ఞప్తి చేశారు. దీనికంతా కారణం తలో పాతిక లక్షలూ ముట్టడమే అని తెలియపరచారు కెటియార్. ఆధారాలు సిబిఐ ఎదుట బయటపెడతానన్నారు. సమ్మెకు మద్దతివ్వం అంటేనే పాతికైతే, సమ్మె మానేస్తాం, మాన్పించేస్తాం అంటే ఎంత వస్తుందో మరి ! స్వామి గౌడ్ కిరణ్‌గారికి ఆశపెట్టి చూశారో, లేక తనను సమ్మెలోకి దింపినవారిని భయపెట్టి చూశారో !

ఆ మధ్య ఢిల్లీ వెళ్లినపుడు జానారెడ్డితో పోట్లాట వేసుకున్నారు – రిజైన్ చేయండి అంటూ ! ఈయనకేం పోయింది చెప్పడానికి ! జానారెడ్డిగారు ఎంత సమర్థుడైనా, 2004 కాబినెట్‌లో హెూం మంత్రి చేసినా 2009 కాబినెట్‌లో ఏ పదవీ యివ్వకుండా మాడ్చారు. మాడ్చి మాడ్చి యిన్నాళ్లకు ఒకటి కట్టబెట్టారు. అదేం దుర్ముహూర్తమో అప్పణ్నుంచి టి మంత్రులు రాజీనామా చేయాలి చేయాలి అంటూ ఒకటే గోల. సరిగ్గా సీట్లో కూర్చుని రాజ్యం చేయనే లేదు. స్వామిగౌడ్ చెప్పారు కాబట్టి రాజీనామా చేయాలట. చేస్తే మళ్లీ ఈయన యిప్పిస్తాడా? ఇప్పిస్తా, తెలంగాణ రానీ అంటారు స్వామి. తెలంగాణ రావాలి, ఎన్నికలు జరగాలి. ఈయన మళ్లీ నెగ్గాలి. ఈయన పార్టీ నెగ్గాలి. ఇంత కథ జరగాలి. అది వస్తుంది కదాని చేతిలో వున్నది ఎవరైనా వదులుకుంటారా? జానారెడ్డి అదే గట్టిగా అరిచి చెప్పారు.

అసలు సమ్మె మొదలవడానికి ముందే టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడిగారు – మమ్మల్ని రాజీనామా చేయమనడానికి యీ స్వామి గౌడ్ ఎవరు? ఈయన మాకు టిక్కెట్టు యిచ్చాడా? మాకు ఓట్లేశాడా? మమ్మల్ని గెలిపించాడా? అని. వీటన్నిటికీ సమాధానం చెప్పకుండానే యీయన సమ్మెలోకి దిగాడు, దింపాడు. అర్జునుడికి కురుక్షేత్ర సంగ్రామం మొదట్లోనే సందేహాలు వచ్చాయి కాబట్టి కృష?డు ఘంటసాల గొంతుతో శ్లోకాలు పాడి, గ్రాఫిక్స్‌లో విశ్వరూపం చూపించి కళ్లు మిరుమిట్లు గొల్పించి యుద్ధానికి సిద్ధం చేశాడు. ఏ 12 వ రోజునో సందేహం వెలిబుచ్చివుంటే కృష?డు కూడా బుర్ర గోక్కునేవాడు – 'ఈ ద్రోణుడి వరస చూస్తే భీష్ముడి

కంటె అన్యాయంగా వున్నాడయ్యా, నాకూ అదే సందేహం వస్తోంది. ఆయనకు బంధుప్రీతియైనా వుంది. ఈయనకు కీర్తి కండూతి తప్ప మరేమీ కనబడటం లేదు. ఎలాగైనా మీ అందర్నీ చంపేసి హై కమాండ్ దుర్యోధనుడి చేత మెప్పు పొందాలని చూస్తున్నాడు, ఈయనతో వేగడం కష్టం, విజయం సాధిస్తామంటావా..?' అని గొణిగేవాడు. మన స్వామి గౌడ్ గారికి కృష్ణ?డంటూ ఎవరూ లేరు. ఆయనే గీతోపదేశం చేయాలి, ఆయనే వినాలి. కృష్ణ?డికి అన్ని విద్యలూ వచ్చు. త్యాగరాజ స్వామి చెప్పినట్టు సమయానికి తగు మాటలు మాటలాడగలడు.

కిరణ్‌గారు పాత కిరణ్ కాదని ఆయన గ్రహించేశారు. ప్రభుత్వోద్యోగుల సమ్మె కంటె సామాన్యులను బాగా ప్రభావితం చేసినది ఆర్టీసీ సమ్మె. ఎన్ఎమ్‌యు వాళ్లు సమ్మె వాయిదా వేశామనగానే కెసియార్ హుంకరించారు. ఆ మెహమూద్ రాయలసీమ వాడన్నారు. సమ్మె చేసినంతకాలం తెలంగాణ వాడే కానీ, వాయిదా వేయగానే రాయలసీమ వాడయ్యాడు. ఆర్టీసీలో తెలంగాణ ఫోరం రద్దు చేయడానికి కిరణ్‌కు అమ్ముడుపోయిన ఆయనెవడు? రాష్ట్రం వచ్చేదాకా మేం సమ్మె కొనసాగిస్తాం అని ఆర్టీసీ నాయకులు చేసిన ప్రతిజ్ఞలు చెవుల్లో గింగురుమంటూండగానే యివాళ సాయంత్రానికి సమ్మె విరమణ అని స్క్రోలింగ్ వచ్చేసింది.

కోదండరాం గారు చెప్పారని విరమించారట. హెచ్చుతగ్గులు లేని వాయిస్‌లో చచ్చేదాకా సమ్మె కొనసాగిస్తామని చెప్పిన కోదండరామే సమ్మె విరమిస్తున్నారని ప్రకటించారు. అప్పుడూ ఎమోషన్ లేదు, యిప్పుడూ ఎమోషన్ లేదు. ఇప్పుడు నాకు డౌటు వస్తోంది – ఒకవేళ కోదండరాం కూడా రాయలసీమా అని ! తక్కిన ఆర్టీసీ నాయకులను మెహమూద్‌గారు మేలమాడుతారేమో – మీరూ నా రేటుకే అమ్ముడుపోయారా? ఎక్కువేమైనా గిట్టిందా? అని. ఆర్టీసీ వ్యవహారం స్వామిగౌడ్ గారికి చూచాయగా తెలిసి వుంటుంది.

సోమవారం నుండి తెరవని విద్యాసంస్థలకు రికగ్నిషన్ రద్దు అన్న కిరణ్ హెచ్చరిక విని స్కూళ్లు తెరిస్తే తెలంగాణయే కావాలి తప్ప బోడి చదువులు ఎవడికి కావాలి అంటున్న తెలంగాణ పేరెంట్సు అసోసియేషన్ వారు వారి పిల్లల్ని బళ్లకు పంపిస్తారో లేదో చూడాలి. కొంపదీసి పంపిస్తారేమోనని స్వామిగౌడ్‌కు అనుమానమనుకుంటా.

ఇవాళ రైల్ రోకో జరిగింది.  మొదట్లో బీరాలు పలికిన రైల్వే వారు రైళ్లు రద్దు చేసి రోకోకు పూర్తిగా సహకరించారు. అలా సహకరిస్తూనే మెల్లమెల్లగా రైళ్లను బయటకు తీశారు. సాధారణంగా 72 గంటల సమ్మె అంటే మూడో రోజు సాయంత్రం 4 గంటలనుండి రైళ్లు బయలుదేర తీస్తారు. కానీ యీ సారి మొదటి రోజునే కొన్ని సర్వీసులు పునరుద్ధరించారు. చిత్రం ఏమిటంటే హుసేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌లో 80% మంది పాసింజర్లు టిక్కెట్లు కాన్సిల్ చేసుకోలేదట. సమ్మె అణచగలదని ప్రభుత్వంపై అంత విశ్వాసమా !? ఎక్కణ్నుంచి వచ్చిందీ సాహసం !? రైలు పట్టాల జోలికి వస్తే ఖబర్దార్ అని తొడగొట్టిన దినేష్ రెడ్డి గారికి ప్రతాపం చూపించే ఛాన్సు లేకుండా పోతుందని టి కాంగ్రెస్ ఎంపీ పొన్నం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పట్టాల మీద కూర్చున్నారు. అమ్మయ్య అనుకుని వాళ్లను పట్టుకుని రిమాండ్‌కు తోలారు. 12 గంటలపాటు పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టి రిమాండుకు పంపారట. రేపు ఆదివారం. మరి బెయిల్‌లో ఎలా వస్తారో ఏమో. ఇదేదో నిరసన తెలిపి అరెస్టయ్యామంటూ టీవీ కెమెరాల ముందు వ్యానెక్కి పక్కసందులో దిగిపోయి మళ్లీ యింకో ఆఫీసు ముందు ధర్నా చేసి మళ్లీ అరెస్టయ్యి.. డబుల్ డబుల్ పబ్లిసిటీ కొట్టేసే సందరాలేలా లేవు.

తెరాస నాయకులనూ అరెస్టంటూ నిజంగా తీసుకెళ్లి పోలీసు స్టేషన్‌లో పూటల తరబడి కూర్చోబెట్టారట. కేకే గారు బయటే వుండిపోయారు. ఇంకా 48 గంటల టైముంది. ఆయనా రేపు ఏదో చేసి రిమాండ్‌కి వెళితే పొన్నం గారికి కంపెనీ వుంటుంది. కేకే గారి శిష్యరికం చేస్తే పొన్నంకు ఉభయభాషాప్రావీణ్యం కూడా అబ్బుతుంది. కేకే గారు 'ఆందోళనకారులకోసం వి టేక్ ద బుల్లెట్' అని గుండె చరిచి మరీ చెప్పారు. అచ్చట పుట్టిన చిగురుకొమ్మయైనను చేవ అన్నట్టు కేకే గారి యింట్లో అడుగుపెట్టినవాళ్లకు కూడా ఆ ధైర్యం ఆటోమెటిక్‌గా వస్తుంది. అందుకే వాళ్ల అబ్బాయి స్నేహితుడు 'టుక్ ద బుల్లెట్' !

కిరణ్‌గారు టి మంత్రుల చేతనే సమ్మెను వాయిదా వేసుకోమని పిలుపు నిప్పించారు. అలా యిచ్చినందుకు మధు యాష్కీ జానారెడ్డిగారిని నిలదీశారు, నువ్వేం నాయకుడవని ! జానారెడ్డిగారు రిజైన్ చేస్తానని ఎప్పుడైనా ఖచ్చితంగా చెప్పారా? తననే నాయకుణ్ని చేయమని బతిమాలారా? వీళ్లే ముందుకు తోశారు. జానారెడ్డి గారింట్లో టి మంత్రుల సమావేశం పెడితే యిద్దరు మంత్రులు మాత్రం వచ్చారట. టి మంత్రుల సమావేశానికి హాజరీ – ముత్యాల ముగ్గులో చెప్పినట్టు  – నానాటికీ కుళాయిధార సన్నగిల్లినట్టు సన్నగిల్లుతోంది.

నా అనుమానం స్వామి గౌడ్‌కు యీ విషయాలపై ముందే ఉప్పందిందేమో ! మనం ఎంతకాలం సమ్మె చేస్తే యీ రాజకీయజీవులకు వెన్నెముకలు వస్తాయి అని దిగాలు పడి వుంటారు. తాబేలు మోసినట్టు వీళ్లందరినీ మోసుకుంటూ ఎన్ని నెలలు తిరగాలి? ఉద్యోగులకు కూడా నెల జీతాలు రాలేదు. క్రెడిట్ కార్డుల పేమెంట్ ఓవర్ డ్యూ అయిపోయి వడ్డీలు పడుతున్నాయి. కిరణ్ ఎస్మా అంటున్నాడు. ఏమైనా అంటే కోర్టువారు చెప్పారని వాళ్ల మీదకు నెట్టేస్తున్నాడు. సమ్మెలో కొత్త వికెట్లు వచ్చి చేరకపోగా ఒక్కో వికెట్టూ పడిపోతోంది. "మనం ముందు నడుద్దాం. తక్కినవాళ్లు మన వెనకే వస్తారు." అని స్వామిగౌడ్ ఉద్యోగులను ఊదరగొట్టి లాక్కుని వచ్చారు. తక్కినవాళ్లు వెనక రాలేదు సరికదా, సందుల్లోకి పారిపోయారు. "మీరు మాత్రం తిన్నగా వెళిపోతూనే వుండండి. నూతులు వచ్చినా, గోతులు వచ్చినా బెదరకండి" అని ధైర్యం చెపుతున్నారు.

స్వామి గౌడ్ శుక్రవారం అలా మాట్లాడారు కదాని శనివారం చర్చల్లో జావకారి పోలేదు. టి రోడ్‌మ్యాప్ తయారుచేసేదాకా సమ్మె

విరమించమని గట్టిగా చెప్పారు. అక్కడకి ఆ రోడ్ మ్యాప్ రాష్ట్రంలో తయారవుతున్నట్టు ! రాష్ట్రంలో తయారవ్వాలంటే నీ సోదరుడితో కలిసి కూర్చోవాలి. వాడు పనికి రాడంటూ ఢిల్లీకి వెళ్లినది మీరే. ఇక యిక్కడేం చేస్తారు? మ్యాప్ కోసం ఎదురుచూస్తూ కూర్చోవడం తప్ప ! శుక్రవారం స్వామిగౌడ్ వ్యాఖ్యలకు అర్థం సమ్మె విరమిస్తామని కాదు, కాంగ్రెస్, టిడిపిలలో కొందరు నాయకులు ఉద్యమంలోకి రాలేదన్న ఆవేదనతో అన్న మాటలవి అని ఆయన అనుచరుడు వ్యాఖ్యానించారు. స్వామిగౌడ్ గారికి జ్ఞానోదయం కలిగి 'సెర్మన్ ఆన్ ద మౌంట్' యివ్వడం, అప్పుడే ఆ ప్రసంగానికి వ్యాఖ్యానం చెప్పే మల్లినాథ సూరి తయారవడం – ఎంత విశేషం ! వ్యాఖ్యానం చెప్పందే మనకు అర్థం కాని లెవెల్లో స్వామిగౌడ్ మాట్లాడారన్నమాట.

ఆయన ఢిల్లీ వెళ్లినప్పటినుండి టోపీ ధరించి తిరుగుతున్నారంటే అక్కడ ఆయనకెవరో టోపీ వేసి పంపారనుకున్నాను. కానీ అది గాంధీ టోపీ అనీ, భారతీయ రాజకీయ నాయకుల ట్రేడ్‌మార్క్ అనీ యిప్పుడు గుర్తుకు వచ్చింది. తన మీద జరిగిన లాఠీ చార్జి ప్రభుత్వం చేసిన హత్యాయత్నం అని తెరాస నాయకులను, ఉద్యమకారులను నమ్మించగలిగినపుడే నాకు అర్థమైంది ఆయన ప్రజ్ఞ. ఇప్పుడిలా పైకి ఒకలా, లోపల మరోలా సూచించే ఉపన్యాసాలు యివ్వడం ద్వారా ఆయన అడుగులు రాజకీయాలవైపు వడిగా పడుతున్నాయని అర్థమైంది. శుభస్య శీఘ్రం ! గతంలో కూడా ఎన్‌జీవో లీడరు – కె ఆర్ ఆమోస్ యిలాగే రాజకీయాల్లోకి వచ్చి ఇప్పటికీ పదవులు అనుభవిస్తున్నారు. సీనియర్ కాంగ్రెస్ లీడరు అనిపించుకుంటున్నారు. ఎక్కడో కేరళలో పుట్టి వెల్లోడి ప్రభుత్వంలో యిక్కడకు వచ్చి పడి యిక్కడ ఎన్‌జీఓ లీడరైన ఆమోస్‌కే అలాటి అడ్వాంటేజి రాగా లేనిది, యిక్కడ పుట్టి, యిక్కడే సర్వీసులో చేరిన స్వామి గౌడ్‌కు యింతకంటె మంచి అవకాశం రాదా?

ఈ ఆమోస్, స్వామినాథన్ వంటి మలయాళీలు, తమిళులు ఉద్యోగరీత్యా యిక్కడకు వచ్చి స్థానికులకు నాయకులుగా ఎదిగినవారే. తెలంగాణాపై పోలీసు చర్య జరిగిన తర్వాత ఎం.కె. వెల్లోడి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పరచారు. అప్పుడు మద్రాసు ప్రభుత్వం నుండి, బొంబాయి ప్రభుత్వం నుండి ఉద్యోగస్తులను తెచ్చి హైదరాబాదు రాష్ట్రాన్ని పాలించమన్నారు. వాళ్లు స్థానికంగా వున్న ఉద్యోగులపై పెత్తనం చేసి 'మీ విధానాలన్నీ తప్పు, బ్రిటిషు వారినుండి మేం నేర్చుకున్న విధానాలే మీరు అవలంబించాలి' అంటూ ధాష్టీకం చేస్తే దానికి వ్యతిరేకంగా 'ఇడ్లీ, సాంబార్ గో బ్యాక్' అనే ఆందోళన చేశారు స్థానిక ఉద్యోగులు. మద్రాసు రాష్ట్రం నుండి వచ్చినవారిలో తమిళులు, మలయాళీలు ఎక్కువ కాబట్టి 'ఇడ్లీ సాంబార్' అన్నారు.

దీన్ని కేసియార్ వక్రీకరించి 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' అన్నది ఆంధ్రప్రాంతపు ఉద్యోగాలకు వ్యతిరేకంగా అని ప్రచారం చేశారు. (అదే అయి వుంటే గోంగూరా గో బ్యాక్ అనేవారు, ప్రాస కూడా బాగా కుదిరేది) కెసియార్ రాజకీయనాయకుడు పోన్లే అనుకుంటే వనం జ్వాలా నరసింహారావు గారి వంటి సీనియర్ జర్నలిస్టు కూడా ఆ మధ్య ఓ వ్యాసంలో అప్పుడు వచ్చిన ఉద్యోగుల 'ఆంధ్ర ప్రాంతీయుల'ని రాయడం ఆశ్చర్యం! అప్పట్లో ఉద్యోగస్తులలో అత్యధికులు తమిళులు కావడం సహజం. ఈనాటికీ హైదరాబాదులో కొన్ని ప్రాంతాలలో నివాసమున్న, కొన్ని విభాగాలలో ఉద్యోగం చేస్తున్న తమిళ, మలయాళీ కుటుంబీకులను గమనించినా యీ విషయం బోధపడింది. ఇడ్లీ సాంబార్ గ్యో బాక్ అన్నా వాళ్లు గో బ్యాక్ కాలేదు సరికదా తెలంగాణ ఉద్యోగుల నాయకులయ్యారు. స్వామినాథన్, ఆమోస్ అలాటివారే. 1969లోనే కాదు, యిప్పుడూ ఆమోస్ ప్రత్యేక తెలంగాణకు గట్టి మద్దతుదారు. ఆయన బర్త్ సర్టిఫికెట్టు అడిగేవారు లేరు. ఇలాటివాళ్లే తెలంగాణలో రాజకీయనాయకులుగా వెలగగా లేనిది, స్వామిగౌడ్ వెలగకపోతారా? ఎందుకు పెట్టారో కానీ గాంధీ టోపీ బాగా అమిరింది ఆయనకు. లెటజ్ విష్ హిమ్ ఆల్ ద బెస్ట్ యిన్ పాలిటిక్స్ ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 27** **ఎమ్బీయస్ : తెలంగాణ పేరెంట్స్ సంఘానికో వినతి**

వారం రోజుల క్రితం విద్యాలయాలను సకలజనుల సమ్మెనుండి విరమించాలని ఉద్యమించిన తలిదండ్రులకు పోటీగా టీవీల్లో కనబడిన తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యుల నుద్దేశించి యిది రాస్తున్నాను. ఆ రోజు వారు 'తెలంగాణ రాష్ట్రం వచ్చేవరకు మా పిల్లల్ని బడికి పంప'మని భీషణ ప్రతిజ్ఞ చేశారు. మాకు రాష్ట్రం ముఖ్యం తప్ప పాఠాలు ముఖ్యం కాదన్నారు. రాష్ట్రం రాకపోతే మా పిల్లలు చదువుకున్నా నిరుద్యోగులే కదా, యిక చదవాల్సిన పనేముంది అన్నారు. వారందరికీ చేతులు జోడించి విన్నపం చేసుకుంటున్నాను – టీచర్లు, నిర్వాహకులు సమ్మె సడలించి విద్యాలయాలు తెరిస్తే దయచేసి మీ పిల్లలను స్కూళ్లకు, కాలేజీలకు పంపండి. పంతానికి పోయి యింట్లో కూర్చోబెట్టకండి అని.

సకల జనుల సమ్మెలోంచి ప్రభుత్వోద్యోగులు తప్ప సకల జనులు క్రమేపీ తప్పుకుంటున్నారు. టీచర్లు సగం రోజు పాఠాలు, మిగతా సగం ప్రదర్శనలు అని ఆదివారం అన్నారు. హాజరుపట్టీలో సంతకాలు పెట్టం అన్నారు. సోమవారం నాడు విద్యామంత్రి, ఉపముఖ్యమంత్రి వద్ద జరిగిన చర్చల్లో చాలా ఒప్పందాలు జరిగాయి. 32 రోజుల సమ్మెలో 16 రోజుల పనిదినాలున్నాయట. వీటిని సర్దుబాటు చేయడానికి ఆదివారాలు, పండుగ సెలవులు వదులుకుంటామని టీచర్లు అంటే అలా అయితే సమ్మెకాలంలో పూర్తి వేతనం యిస్తాం అంది ప్రభుత్వం. నాకు యిక్కడ ఓ సందేహం వచ్చింది. పాఠాలు 12 రోజుల కంటె పోలేదు అంటున్నారు ఉపాధ్యాయ సంఘాలు. ఈ ఒప్పందం ప్రకారం ఉపాధ్యాయులకు 16 పనిదినాలు పోయాయంటున్నారు. అంటే 16 రోజుల పాఠాలు

పోయి వుండాలి కదా ! లేకపోతే వచ్చిన ప్రతిరోజూ పాఠాలు చెప్పే ఆనవాయితీ లేదా? 75% రోజులు మాత్రమే పాఠాలు చెప్తారా?

మధ్యాహ్నాలు స్కూలు ఎగ్గొట్టి ఉద్యమాలు చేస్తే పనిదినాలు యింకా తగ్గిపోతాయనుకున్నారో ఏమో దరిమిలా చేసిన ప్రకటనలో మధ్యాహ్నం కార్యక్రమాల వూసు లేదు. అంటే మామూలుగా.. సారీ జోరుగా.. పాఠాలు చెప్పుకుపోతారన్నమాట. సోమవారం నుండి ప్రయివేటు స్కూళ్లు తెరవకపోతే రికగ్నిషన్ రద్దు చేస్తామని మంత్రి శనివారమే హెచ్చరించారు. మాకేం లెఖ్క లేదు అంటూనే స్కూళు తెరవడానికి వాళ్లు ఒప్పుకున్నారు. మీరు చెప్పారు కాబట్టి తెరవటం లేదు. మా ప్రొఫెసర్ కోదండరాం చెప్పారు కాబట్టి.. అని చేర్చారు. సోమవారం తెరవకపోతే.. అని బెదిరించారు కదా, చూస్కోండి అవేళ తెరవం. మంగళవారం తెరుస్తాం అన్నారు. రాను రానంటూనే చిన్నదీ.. రాములోరి గుడికి వచ్చిందన్నట్టు.. బెట్టు విడవడంలో కూడా బింకం చూపారు.

వాళ్లకీ తెలుసు – ఏ విద్యాలయానికీ రూల్సు ప్రకారం వుండవలసిన హంగులన్నీ వుండవనీ, ఆ కారణం చెప్పి మూయించేయవచ్చనీ... స్కూలు మూసేస్తే వేలకొద్దీ ఫీజులు కట్టిన తలిదండ్రులు స్కూలు వాళ్ల తాట తీస్తారు. సమ్మె నడిచిన రోజుల్లో కూడా యీ కాలేజీల వాళ్లు మెరిట్ వున్న విద్యార్థులను విజయవాడ, గుంటూరు పంపి చదివిపించారట. మన పిల్లల్లాటి అమాంబాపతుగాళ్లను గాలికి వదిలేశారు – ఫీజులు మాత్రం వాళ్లతో సమానంగా గుంజుతూనే ! ఆ కడుపుమంట యీ తలిదండ్రులందరికీ వుంది, పైకి ఏమీ అనలేకపోయినా. దానికి తోడు స్కూలు ఎత్తేశాం అన్నారంటే చితక్కొట్టేస్తారు. 'మేం సమ్మె విరమించామనుకోకండి. ఉద్యమస్వరూపాన్ని మారుస్తున్నాం. స్కూళ్లు యివాళ తెరిచినా రాజకీయ జెఎసి చెప్పిన ప్రకారమే నడుస్తాం' అని స్పష్టీకరించి మరీ తెరిచారు.

పిల్లల చదువులు పోతున్నాయని కోదండరాం గారికి హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. ఆయనది ఎప్పుడూ నిదానమే. మాటే కాదు, ఆలోచనా అంతే. రైల్ రోకో రెండు రోజులు జరిగాక గానీ ప్రయాణీకులు యిబ్బంది పడుతున్నారన్న మాట తెలిసి వచ్చింది. 72 గంటల రోకో ఏకధాటీగా ఎనౌన్సు చేసినపుడు ఆ ముక్క తెలియదా? రోకోను ఎదిరించి రైల్వేవాళ్లు రైళ్లు కొద్దికొద్దిగా నడపడం మొదలుపెట్టడంతో అప్పుడు తెలిసింది. 15 నుండి రైల్ రోకో వద్దు అని బిజెపివాళ్లు అన్నా ఏడిశారులే అని ధీమాగా మొదలెట్టారు. రెండో రోజు సాయంత్రానికి మళ్లీ వాళ్ల బాటనే నడిచారు. బడుల విషయంలో కూడా పిల్లల్ని మినహాయించండి అన్న మాట వారం రోజుల క్రితం తలిదండ్రులు టీవీల్లో చెప్తే తిట్టిపోశారు.

కెసియార్ కుటుంబసభ్యులు చదువుతున్న స్కూళ్లను సమ్మెనుండి మినహాయించారేం? చదువులు వాళ్లకే వుండాలా? మాకు వుండకూడదా? అని అడిగిన పాపానికి ఆ పాయింటు ఎత్తినవారిని అతి క్రూరంగా, కుడీఎడమా లేకుండా 'ఆంధ్రా" అనే రెండక్షరాల మాటతో దుమ్మెత్తిపోశారు కూడా. (ఇంగ్లీషులో నాలుగు అక్షరాలలో చెప్పేవన్నీ తెలుగులో రెండు అక్షరాల్లోనే యిమిడిపోతాయి. మనది సూక్ష్మంలో మోక్షం. అందువలన ఇంగ్లీషు ఫోర్ లెటర్ వర్డ్స్ మన తెలుగుకి వచ్చేసరికి రెండక్షరాల మాటలవుతాయి) ఆవిడెవరో పేరు మార్చుకుందనీ, కాంగ్రెస్‌లో తిరిగిందనీ కూడా బయటపెట్టి అల్లరి పెట్టారు. ఆవిడ చెప్పిన పాయింటే వారం తిరక్కుండా కోదండరాం అన్నా ఆయన్నెవరూ 'ఆంధ్రా' అని తిట్టలేదు. ఐ ప్రొటెస్ట్ ! పురుషులకు ఒక కొలబద్దా, స్త్రీలకు మరో కొలబద్దా? మంద కృష్ణ? మాదిగ యిదే పాయింటు లేవనెత్తితే ఆంధ్రావాదనలేక ఆంధ్రా పెట్టుబడిదారుల తొత్తు అన్నారు. కోదండరాం అదే మాట చెపితే ఆయనను అలా అనలేదు. దళితులకు ఓ రూలూ, రెడ్లకు మరో రూలా?

వామపక్షవాది ఐన కోదండరాం గారికి అటువంటి వ్యత్యాసం వుండకపోవచ్చు. ఎటొచ్చీ ఎవరు ఏ మాట అనాలో వారే అనాలని ఆయన భావం. ప్రతివాడూ రాజు వేషం వేస్తానంటే ఎలా? భటుల్లేందే రాజు ఎలా వెలగగలడు? వెనుకటికి ఓ ముష్టాడు ముష్టికొస్తే కోడలు పొమ్మన్నదట. అది చూసి అత్తగారు వెనక్కి రమ్మంది. ఆశగా వచ్చిన ముష్టాణ్ని "ఇప్పుడు చెపుతున్నాను, పో. పెట్టడానికైనా, పొమ్మనడానికైనా అత్తగారిగా నాకు అధికారం వుంది కానీ కోడలు పీనుగ అదెవత్తి చెప్పడానికి.." అందిట అత్తగారు.

అలాగ విద్యార్థులు చదువులు లేక పాడై పోతున్నారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక దాన్ని తెరాస ఆధ్వర్యంలో పునర్నిర్మించడానికి విద్యావంతులు అవసరమనీ గుర్తించి సమ్మె విరమించమని విజ్ఞప్తి చేసే హక్కు కోదండరాం గారికి వుంది కానీ వేలకొద్దీ ఫీజులు కట్టినంత మాత్రాన తలిదండ్రులకు ఎక్కణ్నుంచి వస్తుంది? అందుకే కోదండరాం గారు అవేళ అలా తీసిపారేశారు. నాలుగు రోజులు పోయాక అదే పోర్షన్ అప్పచెప్పారు. అదే విద్యార్థులు, అవే స్కూళ్లు, అదే లాజిక్. కానీ కోదండరాం గారు చెప్పడంతో టీచర్ల మనసు కరిగింది. పెద్దలు వూరికే అన్నారా, శంఖులో పోస్తే గానీ తీర్థం కాదని. దండగరాముళ్లు ఎంతమంది వున్నా కోదండరాం కోదండరామే !

మనసు కరగని ఇంటర్ లెక్చరర్లు కూడా వున్నారనుకోండి. వాళ్లకూ ఎక్కడో వేడి తగిలాక నెయ్యి కరిగినట్టు కరుగుతారనే అనుకుందాం. ఆర్టీసీ కార్మికుల్లో ఓ సెక్షన్ యిలాగే కాస్త బెట్టు చేసి ఆ తర్వాత మెహమూద్ చూపిన బాటలోనే నడిచారు. సింగరేణివాళు తవ్వకాలు మొదలెట్టేశారు. ఈ ఏడాది లక్ష్యం చేరకపోతే బోనస్సులుండవంటే అదనంగా కూడా పనిచేస్తారో ఏమో. ఇక మిగిలినవాళ్లెవరయ్యా అంటే ప్రభుత్వోద్యోగులు. వికెట్ పడిపోయింది పడిపోయింది అని పాడు మీడియా పాట పాడుతూంటే లేదు లేదు అంటున్నారు స్వామిగౌడ్ అండుకో. రాష్ట్రం వచ్చేదాకా కాకపోయినా రాష్ట్రానికి రోడ్ మ్యాప్ యిచ్చేదాకానైనా చేస్తారట. క్లాస్ ఫోర్ ఉద్యోగులు సమ్మె విరమించి ఒకరొకరూ ఉద్యోగాల్లో చేరుకుంటున్నారని వినగానే నాకో జోక్ గుర్తుకు వచ్చింది.

ఓ రాజుగారి కోటపై ముట్టడి జరిగింది. సైనికులందరూ పారిపోతున్నారు. రాజుగారు ఒక్కరూ తన అభ్యంతరమందిరంలో కూర్చుని వున్నారు. పరుగులు పెడుతున్న సైనికుల సవ్వడి వినబడుతున్నకొద్దీ ఆయనకు ఆందోళన పెరుగుతోంది. అయినా బింకం

సడలకుండా ''ఎవరక్కడ?'' అని అరిచారు. పారిపోవడానికి అంతా రెడీ చేసుకున్న గుమ్మం దగ్గర కాపలా కాసే భటుడు యీ కేకతో ఓ సారి లోపలికి తొంగి చూసి ''తమరే ప్రభూ!'' అనేసి పరుగు పెట్టాడట. అంటే పోతూ పోతూ తన డ్యూటీ నిర్వర్తించి పోయాడట. అందులోనూ రాజుగారికి తన పరిస్థితిని గుర్తించమన్న హెచ్చరికా వుంది. మీ మాట వినేందుకు యిక్కడ ఎవ్వరూ లేరు, మీ సేవలు మీరే చేసుకోవాలి సుమా అని చెప్పడమూ వుంది.

స్వామిగౌడ్ గారు ఆ రాజుగారిలాగే వున్నారు. ఒకరొకరూ బోటు విడిచి ఒడ్డుకు యీదుకుంటూ పోతున్నారు. ఈయన మాత్రం కాసబియాంకాలా కాలిపోయే ఓడ డెక్ మీద వుండిపోయారు. తెలిసో తెలియకో దిగబడిన ఊబిలోంచి మర్యాదగా బయటపడడానికి ఆయన ప్రయత్నాలు ఆయనా చేస్తున్నాడని ఇవాళ జానారెడ్డిగారు చెప్పేశారు. స్వామిగౌడ్, యితర నాయకులు వెళ్లి జానారెడ్డిని కోరారట – ఢిల్లీ నుంచి ఏదో ఒక ప్రకటన చేయించి, పిలుపు నిప్పిస్తే విరమిస్తామని. కెసియార్ చేత సిఫార్సు కూడా చేయించారు. ఇంత చేస్తే జానారెడ్డి ప్రయత్నం బెడిసికొట్టింది. తొందరపాటు తప్ప ఆలోచన లేని టికాంగ్రెస్ ఎంపీలు జానారెడ్డిని బండబూతులు తిట్టేశారు. స్వామిగౌడ్ బ ృందానికి ఆ ద్వారం ముగిసిపోయింది. ఇక యిప్పుడు ఏదో ఓ బొత్సా యిచ్చిన పిలుపుకే స్పందించి విరమించుకోవాలి.

పరిస్థితి యిలా వుంటే సమ్మె ఎలా సాగుతుంది చెప్పండి. సమ్మె ప్రారంభించినపుడే నేను రాశాను – సమ్మెకు సరైన సమయం కాదిది. సోనియా, ప్రధాని ఎవరూ దేశంలో లేరు. ఎవరిపై బాణం ఎక్కుపెడతారు? అని. సమ్మె విఫలం కాలేదు, ఉద్యమస్వరూపం మారుస్తామంతే అని గంభీరప్రకటనలు చేసినా అసలు విషయం బయటపడుతూనే వుంది. ఢిల్లీ తెలంగాణ యిచ్చేట్లా లేదు, ఇచ్చినా యిప్పట్లో యివ్వదు, ఒత్తిడికి లొంగి యిచ్చామన్న యింప్రెషన్ రానీయదు – అనేవి గోడమీద రాతలు. ఇవి చదవకుండా రాష్ట్రం వచ్చేదాకా మా పిల్లల్ని బడులకు పంపం అని మీరంటే ఏం న్యాయం? మీలో కొందరు టిజాక్ వద్దకు వెళ్లి చర్చలు జరిపారని స్క్రోలింగ్స్ వచ్చాయి. వాళ్లేమి సలహా యిచ్చారో పేపర్లలో రాలేదు. నన్నడిగితే మీరు సంప్రదించవలసినది పాఠాలు చెప్పడం మర్చిపోయిన కోదండరామ్ గారిని కాదు, పాఠాలు చదవవలసిన మీ పిల్లల్ని ! రాష్ట్రం వచ్చాక ఓ రెణ్నెళ్ల చదువు ఒకేసారి ఔపోసన పట్టేయగలరా? అని పిల్లల్ని అడిగి చూడండి. 'మీ కోసమే..., మీ భవిష్యత్తు కోసమే మేము మిమ్మల్ని బడికి పంపకుండా టీవీ ముందు కూలేస్తున్నాం. తెలంగాణ రాగానే చదివేసుకుని యిక్కడే ఉద్యోగాలు తెచ్చేసుకుందురుగాని. అప్పుడు బోల్డు ఉద్యోగాలు'' అని చెప్పండి.

వాళ్లు సరేనంటేనే బడికి పంపకుండా యింట్లో పెట్టుకోండి. ''నేను చదివి ఫారిన్ వెళ్లి ఉద్యోగం చేస్తాను నాన్నా. కనీసం బెంగుళూరు, పూనా, బొంబాయి, చెన్నయ్, కలకత్తా వెళ్లి మంచి ఉద్యోగం తెచ్చుకుంటా. ఈ హైదరాబాదులో ఏముంది నాన్నా? ఉన్నదంతా ఊడ్చుకుపోతోందిగా..'' అన్నాడనుకోండి, కాస్త గట్టిగా ఆలోచించండి. ఈ లోకులున్నారు చూశారూ, చదువుకున్నవాడే కావాలంటారు. ఉద్యమస్ఫూర్తి ఎంత వున్నా వద్దుట. చదువూ సంధ్యా లేకుండా 'ఇంటి భాష' చక్కగా మాట్లాడినా వద్దుట.

ఇంకో మాట చెప్పనా? ఈ పిల్లలున్నారు చూశారూ, వాళ్లు వట్టి విశ్వాసఘాతకులు. ఈ రోజు బడి వద్దన్నారు కదాని బడి మాన్పించి క్రికెట్ ఆడుకోరా అని యింట్లో కూర్చోబెట్టి సుఖపెడతామా? ఇదంతా అనుభవించి, రేపు ఉద్యోగం రాకపోతే (..పోతే ఏమిటి, చదువు రాకపోతే ఎలా వస్తుంది?) అప్పుడు మనని తిడతారు – 'చిన్నపిల్లవాణ్ని చేసి మోసం చేశావ్. వేలకొద్దీ ఫీజులు కట్టాలి కదాని నా చేతనే బడి అక్కరలేదని చెప్పించి, దగా చేశావ్. తెలిసీ తెలియని వయసులో నేనేదో కూస్తే, అదే రాజశాసనం అన్నట్టు బడి మాన్పించేస్తావా?' అని.

మన తలిదండ్రులు మనల్ని ఏం చేసినా మనం నోరెత్తేవాళ్లం కాదు. గొణుక్కోవడం తప్ప మనకేమీ రాదు. కానీ యీ తరం వాళ్లున్నారు చూశారు, వాళ్లు చిన్నప్పటినుండీ డిమాండింగ్ గాళ్లే. 'ఇలా ఎందుకు చేశావ్? రేట్లు తక్కువున్నపుడు జూబిలీ హిల్స్‌లో ఓ ప్లాటు కొని పడేయలేదేం? అయ్యప్ప సొసైటీలో కబ్జా చేయకుండా గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నావేం? నువ్వు ఏ ఎమ్మెల్యేనో అయితే నాకు చదువు, ఉద్యోగం లేకపోయినా నిన్ను సతాయించేవాణ్ని కాదు కదా, నాలుగు సెటిల్‌మెంట్లు చేసుకుని బతికేవాణ్ని కదా' యిలా దండిస్తారు. అందుకని ముందు జాగ్రత్తగా హెచ్చరిస్తున్నాను. తెలంగాణ యిప్పట్లో రాదు అనుకుని పిల్లలను బడికి పంపించేయండి. ఒకవేళ వచ్చిందనుకోండి, మరీ సంతోషం. హోప్ ఫర్ ద బెస్ట్, ప్రిపేర్ ఫర్ ద వరస్ట్ అన్న సూక్తి బంగారం. – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

## అక్టోబరు 29 ఎమ్బీయస్ : 48 గంటల్లో ఏమౌతుంది?

కేకే గారింట్లో జరిగిన సమావేశం తర్వాత జానారెడ్డిగారు తామేం చేసినా తెలంగాణ యిప్పట్లో వచ్చేట్లా లేదనేట్లా గంటసేపు మనందరికీ అర్థమయ్యేలా మాట్లాడాక (నేను రాజీనామా చేస్తే నెలలోనో, మూణ్నెల్లలోనో తెలంగాణ వస్తుందని ఎవరైనా హామీ యిస్తే నేను యిప్పుడే రిజైన్ చేయడానికి సిద్ధం) అందరం పెదవి విరవబోతూ వుంటే కేకే గారు ఓ చిచ్చుబుడ్డి పేల్చారు – '48 గంటల్లో ఓ సంకేతం రాబోతోంది' అని. మేం అందరం కలిసి ఓ పథకం వేసుకున్నాం. కానీ అది బయటపెట్టటం లేదు. అది అమలు చేయడానికి 48 గంటలు పడుతుంది. ఆ సంకేతం వచ్చాక అప్పుడు బయటపెడతాం, కార్యాచరణకు ఉపక్రమిస్తాం అన్నారు.

దాంతో ఏదో జరగబోతోందని ఊహాగానాలు మొదలయ్యాయి. కొందరు కాంగ్రెస్‌వారు తెరాసలో చేరతారని కొందరంటే, అబ్బే తెరాసే కాంగ్రెస్‌లో విలీనమవుతుందని కొందరంటున్నారు. సాధారణంగా యీ సంకేతాల సిగ్నల్స్ అందుకునే యాంటెన్నా కెసియార్ యింట్లో వుండేది. ఇప్పుడు అది కేకే యింటికి షిఫ్టయినట్టుంది. కెసియార్ యింట్లో వున్నంతకాలం అది ఎప్పుడూ రాంగ్ సిగ్నల్సే యిచ్చేది. తెలంగాణ అర్నెల్లనీ, ఆరువారాలనీ.. ఈ మధ్య రెండు వారాలని కూడా చెప్పేసింది. వాస్తుదోషమో ఏమో ! కేకే గారింటికి మార్చాక ఏకంగా రెండు రోజుల్లోకి తీసుకొచ్చేసింది. అక్కడ వాస్తుదోషం లేదనీ, సిగ్నల్ కరక్టుగానే రిసీవ్ చేసుకుందనీ ఆశిద్దాం.

నిజానికి కేకే గారింటికి టికాంగ్రెస్ ఎంపీలు కత్తులు నూరుతూ వెళ్లారు. జానాగారి పని అయిపోయిందే అనుకున్నాను. సమ్మె విరమించమని ఉద్యోగులకు పిలుపు నిచ్చినందుకు గాను మధు యాష్కీ జానాను చెడామడా బహిరంగంగా తిట్టేసి వున్నారు. తనను అరెస్టు చేసినందుకు గాను రాజీనామాలు చేసి కిరణ్ ప్రభుత్వాన్ని కూలదోయకుండా యింకా కాబినెట్‌లో కొనసాగుతున్నందుకు పొన్నం రుసరుసలాడుతున్నారు. ఆయన అరెస్టుకు కారణం రైల్ రోకో అనుకున్నాను నేను, కాదుట. అడ్డదారిలో సిఎం అయ్యావని వెక్కిరించినందుకు కిరణ్ నన్ను జైల్లో తోయించాడు అని పొన్నం బయటపెట్టారు.

కిరణ్ అంత కసి పెట్టుకున్నారన్న సంగతి చాలా రోజుల కితమే తెలిసింది. పొన్నం, యితరులు వెళ్లినపుడు కిరణ్ డైరక్టుగా అడిగేశారు. అబ్బే నేనెక్కడన్నాను? అని యీయన నాలిక మడతేసి, మళ్లీ బయటకు వచ్చి అంటాను, అలాగే అంటాను, మళ్లీ అంటాను వ్వెవ్వెవ్వే.. అన్నాడు. ఇంత తెలిసి రైల్ రోకో అని బయలుదేరారు. దాని బదులు ఢిల్లీలో ఎపి ఎక్స్‌ప్రెస్ బయలుదేరకుండా పట్టాలు పీకి వుంటే బాగుండేది. ఢిల్లీ పోలీసుల సత్కారమే లభించి వుండేది. ఇక్కడ చేసి పోయిపోయి తెలుగుపోలీసుల పాలబడ్డారు. ఏ మాట కా మాట చెప్పుకోవాలి, తెలుగు పోలీసులు పొన్నంకు మాత్రమే తడాఖా చూపించారని అనలేం. కవిత, విమలక్క వగైరాలను రైల్వే కోర్టుకి తీసుకెళ్లడానికి 17 గంటలు జాప్యం చేశారు. చివరకు తెల్లవారు ఝామున 4 గంటలకు బెయిలు యిచ్చారు. విజయశాంతి దినేష్ రెడ్డిగారికి ఛాలెంజ్ విసిరి, రైలును ఆపి, ఆవిడను పట్టుకోబోయిన పోలీసమ్మాయితో కర్తవ్యం స్టయిల్లో కుస్తీ పట్టి ఫామ్‌లో వున్నానని చూపించారు కాబట్టి ఆవిడ స్టామినాకు మరింత పరీక్ష పెట్టారు.

పొద్దున్న అరెస్టు చేసినవారు 12 గంటల తర్వాత రాత్రి 10 గంటలకు బోయిగూడాలో రైల్వే కోర్టుకి తీసుకువచ్చారు. ఓ గంట అక్కడ కూర్చోబెట్టి మేజిస్ట్రేటు రావడం లేదన్నారు. అక్కడకి వెళ్లాక వైద్యపరీక్షలు చేయించాలంటూ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి తెల్లవారు ఝామున 2 గంటలకు తీసుకుని వచ్చారు. మేజిస్ట్రేటు గారు న్యాయవాదుల వాదనలు విని నోరు చప్పరించి, ఎఫ్ ఐ ఆర్ సరిగ్గా లేదని పోలీసులకు అక్షింతలు వేసి కోర్టులో కలుద్దాం పొమ్మన్నారు. పొద్దున్న 6.30 కి కోర్టుకి తీసుకువచ్చాక మరో 5 గంటల తర్వాత మేజిస్ట్రేటుగారు 11.30కి కోర్టుకి వచ్చి వాదనలు విని మధ్యాహ్నం 1 గంటకు షరతులతో బెయిల్ యిచ్చారు. విజయశాంతిగారికి 26 గంటల ట్రాజెడీ సినిమా చూసినంత పని అయింది. అదే కనక సినిమాతెరపై అయితే ఒక్క డైలాగు చెప్పి పోలీసులనందరినీ తుక్కుతుక్కుగా కొట్టేసి వుండేవారు. నిజజీవితం కాబట్టి నిద్రచాలక, ఆవులిస్తూ వాళ్లు తిప్పినచోటకల్లా తిరుగుతూ, అవస్థ పడ్డారు.

ఇక పొన్నం, జీవన్‌రెడ్డిలనైతే ఎప్పుడో శనివారం అరెస్టు చేసినవారు ఆదివారం ఉదయం కరీంనగర్ జిల్లా జైలుకి తీసుకుని వచ్చారు. అక్కడి దాకా వచ్చాక ముఖ్యమైన పేపర్లు మర్చిపోయామంటూ జైలు ముందు 40 నిఎఎలు నిలబెట్టేశారు. వాళ్లిద్దరూ అందగాళ్లు కాదు కాబట్టి సరిపోయింది, అదే విజయశాంతి వంటి గ్లామరున్న హీరోయిన్లయితే జనం మూగిపోయేవారు. ఈటెల రాజేందర్ నయితే మంగళవారం కూడా రిమాండులోనే వున్నారు. రైల్ రోకోలో మేము రైల్వే ఆస్తికి నష్టం కలిగించకపోయినా అరెస్టు చేశారే అని కేకే వాపోయారు. అయ్యా, రైళ్లు రద్దు చేసి టిక్కెట్లపై ఆదాయం పోగొట్టుకుంటే అది నష్టంగా కనిపించలేదా మీకు? నష్టాలొచ్చాయంటూ యిప్పుడు టిక్కెట్లు ధరలు పెంచబోతున్నారు రైల్వేవారు.

తనను రైల్ రోకో పేరు చెప్పి అరెస్టు చేయగానే టిమంత్రులందరూ రాజీనామా చేసేసి సంక్షోభం సృష్టిస్తారని పొన్నం ఆశపెట్టుకున్నారో ఏమో మంగళవారం కేకే యింట్లో సమావేశానికి మంచి కాక మీద వచ్చారు. అందరూ కలిసి జానాపై విరుచుకు పడ్డారు. సమ్మె విరమించమని ప్రకటన ఎందుకు చేశారు? అని నిలదీశారు. జానాగారు మంచి జాణ. వాళ్లను ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టారు. కెసియార్ సిఫార్సు మేరకే అలా చేశానన్నారు. ఇంకేముంది, వాళ్ల అధినాయకుడు, స్ఫూర్తిదాత పేరు తీసుకున్నాక యిక నోరు పెగలలేదు. స్వామిగౌడ్ అండుకోలు ఆ సిఫార్సుతో వచ్చి అడిగితే ఆజాద్‌కు ఫోన్ చేశాననీ, 'నేను కశ్మీర్‌లో వున్నాను, ఢిల్లీ వచ్చాక మాట్లాడతాన'ని ఆయన అంటే 'సరే పోనీకదా, వాళ్లు మర్యాదగా నిష్క్రమించడానికి (ఆనరబుల్ ఎగ్జిట్) మార్గం చూపానని జానా ఎదురుదాడి చేశారు. అయితే యిప్పుడేం చేద్దామంటూ మూడున్నర గంటలు చర్చించారు. చివరకు కొన్ని విషయాలు తేటతెల్లమయ్యాయి.

వాటిలో అతిముఖ్యమైనది – ఢిల్లీయే యిదంతా చేయిస్తోందని యిన్నాళ్లకు వాళ్లు గ్రహించారు. కిరణ్‌ను ఢిల్లీకి రప్పించి, ఉద్యమం పట్ల ఇనుపచేత్తో (ఐరన్ హ్యాండ్‌కు తెలుగు) వ్యవహరించకపోతే పురచేత్తో తీసిపారేస్తామని చెప్పారని గ్రహింపుకు వచ్చింది. నేను విన్న యింకో సమాచారం ఏమిటంటే – బొత్సకు కూడా బాగా క్లాసు తీసుకోవడం జరిగిందట. నువ్వు రాష్ట్రం విడిపోయినా తప్పులేదంటూ స్టేటుమెంట్లు యిచ్చి, తెలంగాణవారి మద్దతు పొంది, కిరణ్‌కు సహకరించకుండా అతన్ని విలన్‌గా చిత్రీకరించి, ఫెయిల్యూర్‌గా చూపించి, తెలంగాణవారికి ఆమోదయోగ్యమైన వ్యక్తిగా గద్దె నెక్కుదామని చూస్తున్నావేమో, అదేం కుదరదు. ఆర్టీసీ సమ్మెను విరమింపచేయలేకపోయావు కాబట్టి నువ్వూ అంతటి అసమర్థుడి కిందే లెక్క వేస్తున్నాం. కిరణ్‌తో బాటు నువ్వూ యింటికి వెళ్లాలి జాగ్రత్త అని చెప్పారట. అందుకే బొత్స ఢిల్లీనుండి వస్తూనే ఆర్టీసీ సమ్మె విరమణకు మెహమూద్‌ను ఒప్పించారుట. అంటే

ఘటనాఘటన సమర్థులన్నమాట. ఇక కిరణ్‌కు కూడా యిన్నాళ్లూ లేని గుండెలు యిప్పుడెక్కడనుండి వచ్చాయట? అంటే యిదంతా ఢిల్లీవారి తోలుబొమ్మలాటే. ఎవర్ని ఎలా ఆడించాలంటే అలా ఆడించగలరు. అందువలన పోరాడగలిగితే ఢిల్లీతో పోట్లాడాలి. ఇక్కడ కిరణ్‌ను, టిజి వెంకటేష్‌ను, రాజగోపాల్‌ను, చంద్రబాబును తిట్టడం శుద్ధ వేస్టు.

ఇంకో విషయం కూడా గమనించారు వాళ్లు. సమైక్యవాదులందరూ, పార్టీ జెండాలు పక్కన పెట్టి ఒకే వేదికపై కూర్చుంటున్నారు కానీ తెలంగాణ వాదులు ఆ పని చేయడం లేదు. ఇక్కడ ఎవరి కుంపటి వారిదే. పక్కవాళ్లను రానిస్తే వాళ్లకూ పేరు పంచాల్సి వస్తుందని చింత. ముఖ్యంగా తెరాస ఒంటరిపయనం చేస్తోంది. తన కంటె చిన్నవారిని సహిస్తోంది కానీ పెద్దవారినీ పక్కకు నెట్టేస్తోంది. ఇప్పుడు రిజైన్ చేయని కాంగ్రెస్ వాళ్లను తన్నమంటోంది. టిడిపి వాళ్లను తన్నమనే పాత పిలుపుకి యిది పొడిగింపు. ఆ తర్వాత తీర్మానాలు చేసుకున్నారు – స్పీకర్ వద్ద ధర్నాలు వేస్టు. అసెంబ్లీ, పార్లమెంటు శీతాకాల సమావేశాలకు వెళ్లాలి అని. అలా అంటూనే జానారెడ్డి వంటి ఓ అయిదుగురు ముఖ్యమైన మంత్రులు రాజీనామా చేస్తే తక్కినవాళ్లూ చచ్చినట్టు చేస్తారని అన్నారు.

తీర్మానం చేసి పావుగంట కాకుండానే జానారెడ్డి బయటకు వచ్చి నేనెందుకు చేయాలి? చేస్తే తెలంగాణ వస్తుందా అని తెలివైన ప్రశ్న అడిగారు. కోమటిరెడ్డిని రాజీనామా చేసి నువ్వు సాధించేముంది? అని అడిగారు. జూపల్లి రాజీనామా కేసూ డిటోయే. మొదటిసారి రిజైన్ చేసినపుడు యీ తెలివి ఏమైంది అని అడగకూడదు. ఎందుకంటే కేకే గారు చెప్పివుంటారు. నాకు సంకేతం వచ్చింది, నువ్వు రిజైన్ చేయగానే ఢిల్లీ తెలంగాణ యిచ్చేస్తుంది. నీ వల్లనే వచ్చిందని చెప్పుకోవచ్చు అని. ఆ ప్లాను చీదేయడంతో యిప్పుడు జానా నిదానిస్తున్నారు. ఇక తక్కిన మంత్రులు ఏం చేస్తారో వేచి చూడాల్సిందే. మంత్రులను ఒక్కతాటిపై నడిపించలేకపోయానని ఒప్పుకుంటూనే జానా కేకేను మెచ్చుకున్నారు. ఎంపీలందరినీ సమైక్యంగా వుంచగలిగారని. మంత్రుల్లో సారయ్య మొహం చాటేస్తున్నారని చెప్పారట.

అసలు చాలామంది ముఖ్యులు సమావేశానికి రానే లేదు. కమిటీ సభ్యులే ఎగ్గొట్టేశారు. ఎంపీలదే అడావుడి. ఎమ్మెల్యేలు అర్ధమనస్కంగా( హాఫ్–హార్టెడ్ ) అన్యమనస్కంగా ఉద్యమంలో వున్నారు. చూశారా, ఎంపీల్లో కూడా మంత్రి (జయపాల్) రాజీనామా చేయడం లేదు. ఉన్నవాడు వదులుకోవడానికి యిష్టపడడు. ఏమీ లేనివాడే త్యాగాల గురించి మాట్లాడతాడు. అందునా ఈ ఎంపీల్లో యిద్దరు ముగ్గురైనా తెరాస తరపు కోవర్టులనీ, ఎప్పుడైనా కంచె దాటేయవచ్చనీ మా చెడ్డ పుకారుగా వుంది. కెటియార్ కూడా ఆ పుకారుకి ఆజ్యం పోస్తున్నారు. అటు టిడిపి నుండి, యిటు కాంగ్రెస్ నుండి నాయకులను లాగేస్తూ 'రండి, కలిసి పోరాడదాం' అని పిలుపు నిస్తే ఆ పార్టీవాళ్లకు మండదూ ? అందుకే బొత్స, చంద్రబాబు చెప్తున్నారు – విడిగా ఉద్యమాలు చేసుకోండి. తెరాసతో కలవకండి అని. పైగా బొత్స దానంపై దాడిని ఖండించి తన అరెస్టును ఖండించలేదు పొన్నం వ్యథ. ఫన్నీగా వుంది. దానంపై దాడి చేసినది తెరాసవారు. వారిని ఖండిస్తారు కానీ పొన్నంపై దాడి చేసిన ప్రభుత్వ యంత్రాంగాన్ని బొత్స ఎలా ఖండించగలరు?

దానం నాగేందర్ ఫోటో ఓ తమాషా. మంత్రులు ఎక్కడికి వెళ్లినా వీడియో తీస్తారుకదా, ఆయన లాఠీతో నడుస్తున్న ద ృశ్యం వీడియో తీయలేకపోయారా? వీడియో తీయడానికి సెల్‌ఫోన్ చాలే ! కనీసం ఒక్క రిపోర్టర్ దగ్గరైనా సెల్‌ఫోన్ లేకుండా పోయిందా? ఆ మధ్య ఒవైసీ ఎన్నికల బూత్ వద్ద బడితె తిరగేసినప్పుడు వీడియోలు తీశారే ! తెరాసవారు దానంను అడ్డుకుంటారని ముందు తెలిసినా, కోడిగుడ్డు సొన పడిన ఆయన కారు అద్దాన్ని ఫోటో తీసినవారు, మంత్రిగారు లాఠీ పడితే అది వీడియో తీయవలసిన ద ృశ్యంగా అనిపించలేదా? ఆంధ్రజ్యోతిలో వేసిన ఫోటోషాపింగ్ మాజిక్ అంటున్నారు దానం. అవునో కాదో ఫోటో ఎన్‌లార్జ్ చేసి చూసి చెప్పగలరనుకుంటా.

ఈ మధ్యలో దళితుల గొడవొకటి. దానం కొట్టినవాడు దళితుడట. మొహం చూడగానే ఎలా తెలుస్తుంది?రాళ్లు, గుడ్లు వేసేవారు దళితులేనని ఏమైనా రూలుందా? హరీష్ ఎపిసోడ్‌లో అవతలి వ్యక్తి దళితుడు కాబట్టి కేసు గట్టిగా నడుస్తోంది. ఈ దళిత కేసులు ముదిరి పాకాన పడుతున్నాయి. ఇక జనాలంతా కలిసి దళితులు ప్రత్యేక దుస్తులు ధరించి తిరగాలని, అలాగైతేనే వాళ్ల జోలికి రామని పట్టుబడతారేమో. గతంలో యూదులు ఇలాగే వాళ్ల మతసంకేతమైన నక్షత్రం బిళ్ల ధరించి తిరగాలని హిట్లర్ చట్టం చేశాడు. దానం బిసి కావడం వలన బిసి వెర్సెస్ దళిత్ అయ్యి కేసు వీగిపోయింది. పాపం హరీష్ బిసి కాకపోవడం వలన కేసు నడుస్తోంది.

ఏది ఏమైనా దానం పై చూపిన శ్రద్ధ తమపై చూపలేదని పొన్నం, యితర టి కాంగ్రెస్ ఎంపీలు అసంతృప్తితో రగులుతున్నారన్నది వాస్తవం. అయితే పార్టీకి రాజీనామా చేసి విడిగా పార్టీ పెట్టేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. పార్టీ నడిపేటంత దమ్ము, ధనం వారిలో ఎవరికీ కనబడటం లేదు. నాగం జనార్దనరెడ్డిగారి ఉదాహరణ కళ్లల్లోకి మరీ గ్లేర్ కొడుతోంది. ఆయన వెంట నడిచినవారు కూడా తెరాస దారి పడుతున్నారు. మరి 48 గంటల తర్వాత కేకే కార్యాచరణ ఎలా వుంటుందో, కెసియార్ యింటివైపే అడుగులు పడతాయేమో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 30** **ఎమ్బీయస్ : 50 వేలు కూడా రాలేదా?**

బాన్సువాడ ఉపయెన్నికల ఫలితాలు చూసి సంతోషించాలో లేదో తేల్చుకోలేని పరిస్థితి ఉద్యమకారులది. సకల జనుల సమ్మె యింత తీవ్రంగా వున్న సమయంలో, ఎటూ తేల్చకుండా కాంగ్రెస్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న సమయంలో కాంగ్రెస్‌కు

డిపాజిట్ దక్కడమేమిటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఓటింగ్ శాతం 77% వుంది కాబట్టి పోచారం లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారనే అనుకున్నారు ఉద్యమకారులు. ఎందుకంటే 2010 జులైలో ఉపయెన్నికలు జరిగిన 12 స్థానాల్లో 8 వాటిల్లో 50 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. 40 వేలకు తక్కువ మెజారిటీ 3 స్థానాల్లో రాగా 40–50 మధ్య ఒక స్థానంలో వచ్చింది. అప్పుడు కాంగ్రెస్, టిడిపి కూడా పాల్గొన్నాయి కాబట్టి కొన్ని ఓట్లు అటూ యిటూ పోయాయి. ఈ ఎన్నికలో తెరాస, కాంగ్రెస్ ముఖాముఖీ పోటీ. టిడిపి పోటీలో లేదు. టిడిపికి ఎప్పుడూ వేసేవాళ్లు కూడా తెలంగాణవాదానికి అనుకూలంగా యిటే వేస్తారని, అందుకని లక్ష మెజారిటీ ఖాయమనీ అనుకున్నారు. లక్ష కాదు, అరలక్ష కూడా రాకుండా ఆగిపోయింది.

పోలయిన ఓట్లలో మూడింట రెండు వంతులు మాత్రమే (67%) పోచారంకు దక్కాయి. అంటే 83,245 ఓట్లు. తెలంగాణ అంశంపై కాంగ్రెస్ చూపుతున్న నిర్లక్ష్య వైఖరి తేటతెల్లంగా తెలుస్తోంది. ఎన్ని నెలలు సమ్మె చేసినా మాకేమిటి, మేం అనుకున్న దారికి మీరు రావలసినదే అనే ధోరణే ప్రస్ఫుటంగా కనబడుతోంది. తెలంగాణ మంత్రులు అపాయింట్‌మెంట్ అడిగితే సోనియా యివ్వటమే లేదు. ఇప్పుడు కాదు, నెలల తరబడి. కాబినెట్‌నుండి రిజైన్ చేస్తే ఆమోదించేయమంటున్నారు. కోమటిరెడ్డి, జూపల్లి వ్యవహారం చూశాం. దసరా తర్వాత ఉద్యమం పట్ల కాఠిన్యం వహించమని కిరణ్‌కు చెప్పి పంపించారని బహిరంగ రహస్యమే.

ఉపయెన్నికలో పోటీ చేయడానికి టిడిపి వణికిపోయింది. జులై 2010 ఉపయెన్నికలలో అన్ని చోట్లా డిపాజిట్టు పోగొట్టుకున్న భయం వెంటాడింది. ఫలితాలు చూశాక నాలిక కరుచుకుని, అప్పటికీ యిప్పటికీ పరిస్థితి మారిందని గ్రహించి, ఈ సారి నుండి అన్ని చోట్లా పోటీ చేస్తామని బాబు ప్రకటించారు. ఇక కాంగ్రెస్ కూడా తీసిపోలేదు. పిసిసి అధ్యక్షుడు దగ్గర్నుంచి ఉపయెన్నికలలో పోటీ చేయవద్దని హై కమాండ్ కి లేఖలు రాశారు. ఆ విధంగా తెలంగాణ వాదులను తృప్తిపరచేరేమో కానీ అధిష్టానం దగ్గర పరువు పోగొట్టుకున్నారు. వీరి సలహాను బుట్టదాఖలు చేసి క్యాడర్ పోకూడదు, ఓటుబ్యాంక్ పోకూడదు, ఎవర్నో ఒకర్ని నిలబెట్టండి అన్నారు వారు. అప్పుడు వీళ్లు కాండిడేట్లు లేరని మొండికేశారు. చివరికి ఓ అనామకుణ్ని పట్టారు. కాన్వాసింగ్ జోలికి పోలేదు. పిసిసి ప్రస్తుత అధ్యక్షుడు కాదు కదా, యిప్పుడు ఎమ్మెల్సీ సీటుకోసం పైరవీలు చేస్తున్న మాజీ అధ్యక్షుడు కూడా అటు తొంగిచూడలేదు. (వెళ్లి వుంటే యిప్పుడు దర్జాగా క్లెయిమ్ చేసి వుండేవారు. కానీ ప్రజలకు వీళ్లపై వున్న నమ్మకంలో సగం కూడా వీళ్లపై వీళ్లకు లేదు). కాండిడేటే అన్ని వూళ్లూ తిరగలేదు. అయినా కాంగ్రెస్‌కు 27% ఓట్లు అనగా 33,356, అనగా డిపాజిట్ అర్హత కంటె 13 వేల ఓట్లు ఎక్కువ.. వచ్చిపడ్డాయి. ఏమిటీ మాయ!?

టిడిపి, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని తెరాస ఆరోపించింది. అది నిజమే అని నేనూ అనుకుంటున్నాను. 2009లో పోచారం వెనక్కాల తెరాసకు వ్యతిరేకంగా టిడిపి జెండా పట్టుకుని తిరిగి, అతనితో బాటు గోడదూకని కార్యకర్తలను టిడిపి విస్మరించింది. వాళ్ల కాండిడేటును నిలబెడితే అతనికి ఓటేసేవారు. టిడిపి వాళ్లను ఖాతరు చేయలేదు కాబట్టి తెరాసకు ఓటేయలేక, ఈ ఓట్లతో నెగ్గడన్న ధైర్యంతో కాంగ్రెస్ కాండిడేట్‌కు వేశారు. పై వర్గాలలో లోపాయికారీ ఒప్పందం వుండవచ్చు, ఉండకపోవచ్చు. ఉన్నా ఆశ్చర్యమేముంది? ఆంధ్రప్రాంతంలో జగన్‌ను అరికట్టడానికి టిడిపి, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని చాలా చోట్ల స్పష్టమైంది. తెలంగాణలో తెరాసను అరికట్టడానికి అదే పని చేయకూడదా? చేయరా? రేపు జనరల్ ఎన్నికలలో కూడా ఎన్నికలముందు పరిస్థితి బేరీజు వేసుకుని జగన్, తెరాస ఉధృతంగా వుంటే యీ పని రాష్ట్రమంతా చేయవచ్చు. ఎవరి కెక్కడ విజయావకాశాలున్నాయో చూసుకుని, ఎదుటివాళ్ల స్థానాల్లో తమ తరఫున బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టి తెరాస, జగన్‌లను ఓడించే ప్రయత్నం చేయవచ్చు.

కొన్ని పత్రికలు మరింత లోతుగా విశ్లేషించి ఆంధ్రప్రాంతం నుండి వచ్చి స్థిరపడిన ప్రాంతాలలో, మైనారిటీలు (అనగా ముస్లిములు) వున్న ప్రాంతాల్లో కాంగ్రెస్‌కే ఓట్లు ఎక్కువ పడ్డాయని తేల్చారు. అలాటి రెండు మూడు చోట్లలో 24 గంటల్లో తెలంగాణ వదిలి వెళ్లండంటూ తెరాస కార్యకర్తలు వాళ్ల యిళ్లముందు ధర్నాలు కూడా చేశారట. తెలంగాణ యిస్తానని బిజెపి ప్రతిజ్ఞలు చేస్తున్నకొద్దీ ముస్లిములు వణుకుతున్నారు. నిజానికి మజ్లిస్ తప్ప తెలంగాణలోని ముస్లిములంతా విభజన కోరుతున్నారంటూ తెరాస చెప్పుకుంటోంది. వాళ్ల వేదికలపై రూమీ టోపీల వాళ్లూ కనబడుతున్నారు. కానీ తెరాస బిజెపికి రోజు రోజుకీ చేరువౌతున్నకొద్దీ ముస్లిములు దూరం కావచ్చని అనిపిస్తోంది, యీ ఫలితం చూస్తే. ఇవాళే విజయశాంతి నినాదం యిచ్చారు – 'తెలంగాణ యిచ్చేది బిజెపి, తెచ్చేది తెరాస, చచ్చేది కాంగ్రెస్' అని. అడ్వాణీగారు మన రాష్ట్రంలోకి వచ్చాక అవినీతినిరోధం గురించి కంటె తెలంగాణ గురించే ఎక్కువ మాట్లాడారు.

ముస్లిములకు బిజెపిని చూస్తే భయం. వాళ్లు అధికారంలోకి వస్తే తమను సరసరా నరికేస్తారని అనుకుంటారు. నిజానికి బిజెపి అధికారంలోకి వచ్చిన ఉత్తరాది రాష్ట్రాలలో కానీ, పశ్చిమ రాష్ట్రాలలో కానీ ముస్లిములకు పెద్దగా హాని ఏదీ జరగలేదు. అనేక దశాబ్దాలలో గోధ్రా ఒక్కటే సంఘటన. అది కూడా బిజెపిలో, గుజరాత్‌లో మోదీ తన స్థానాన్ని పదిలపరచుకోవడానికి ఆడిన అత్యంత హేయమైన, క్రూరమైన నాటకం. ఆ నాటకం సమాప్తి అయ్యాక మళ్లీ అలాటిది మోదీ జరగనీయలేదు. గుజరాత్‌లో ముస్లిముల సంఖ్య గణనీయంగానే వుంది. వాళ్లపై ఆ తర్వాత ఏ అత్యాచారమూ జరగలేదు. అయినా మేధావి వర్గాలు, మీడియా, ముస్లిం నాయకులు ముస్లిములను ఊచకోత కోయడం తప్ప బిజెపికి వేరే పని లేనట్టు చిత్రీకరిస్తారు. అక్షరాస్యత తక్కువైన ముస్లిం వర్గాల్లో యిది చొచ్చుకుపోయింది. అందువలన బిజెపి తెలంగాణ యిస్తానంది అనగానే దాన్ని అనుమానంతో చూస్తున్నారు. 2010 జులై ఉప ఎన్నికలలో నిజామాబాద్ అర్బన్ లో ముస్లిములు కూడా డి శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా బిజెపికి ఓటేశారంటే యీ ఫీలింగు లేదన్నమాట అనుకున్నాను. కానీ అది మళ్లీ యిప్పుడు తలెత్తిందంటే – పార్లమెంటులో బిజెపి దీనికి నాయకత్వం వహించడం

కారణం కావచ్చు. మజ్లిస్ ప్రచారం కూడా ప్రభావితం చేస్తోందేమో.

ఇక ఆంధ్రప్రాంతం నుండి తరలి వచ్చినవారి ఓట్లు. తెలంగాణ ఎన్నికలలో యిది చాలా కీలకమైన ఓటుబ్యాంక్ కాబోతోందని నేను ఎప్పుడో రాశాను. దీన్ని తెరాసవారు యిప్పటిదాకా పట్టించుకోకుండా వారిని భయభ్రాంతుల్ని చేసి దూరం చేసుకున్నారు. ఇటీవలే హరీష్‌రావు ఆ పొరబాటు గుర్తించి, ఓ సభలో వారినీ అక్కున చేర్చుకుంటామని, సెటిలర్లు అనే పదం వాడబోమనీ వాగ్దానం చేశారు. ఆంధ్రప్రాంతం నుండి తెలంగాణకు శతాబ్దాలుగా, దశాబ్దాలుగా వచ్చి స్థిరపడుతూ వున్నారు. తమాషా ఏమిటంటే వాళ్లలో కొంతమంది తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర వహిస్తున్నారు. 1969లో కూడా యిదే జరిగింది. 1934 ప్రాంతాల్లో గుంటూరు జిల్లా నుండి తెలంగాణకు తరలి వచ్చిన వి.బి.రాజు గారు ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రముఖ నాయకుడు. ఇప్పుడు అలాటి ఉదాహరణ కావాలంటే ఆంధ్రజ్యోతి పబ్లిషర్ రాధాకృష?గారు. కృషా?జిల్లానుండి నిజామాబాద్ జిల్లాకు తరలివచ్చిన అనేక కుటుంబాలలో వారిదీ ఒకటి. తను నిజామాబాద్‌లో పుట్టి పెరిగాడు కాబట్టి తెలంగాణ వాణ్నని ఆయన అనుకుంటారు. రాష్ట్రాన్ని విభజించి తీరాలంటారు. ప్రత్యేక ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు.

ఇదంతా రైల్వే కంపార్టుమెంటాలిటీ. రైల్వే కంపార్టుమెంటులోకి దూరదామనుకున్నవాణ్ని లోపలున్నవాళ్లు రానీయరు. బయటివాళ్లలో కొందరు తెలివైనవాళ్లు ఎలాగోలా దూరిపోతారు. తర్వాతి స్టేషన్ వచ్చేలోపున యిద్దరూ కలిసిపోయి, తర్వాతి స్టేషన్‌లో ఎక్కేవాణ్ని ప్రతిఘటిస్తారు. మొదటినుండీ కంపార్టుమెంటులో వున్నవాడి కంటె కొత్తగా తోసుకుని ఎక్కినవాడున్నాడు చూశారా, వాడే ఎక్కువ ప్రతిఘటిస్తాడు. అందరూ తమలాగే ఎక్కేస్తే ఇక తమకు చోటుండదని భయం. కూకట్‌పల్లిలో రాజు అని వున్నారు. సెటిలర్స్ సంఘం అని పేరు పెట్టుకుని తెలంగాణ ఉద్యమానికి సమర్థనగా పత్రికలో ప్రకటనలు గుప్పిస్తారు. ఆ సంఘంలో యితర సభ్యుల పేర్లు ఎన్నడూ వినలేదు. ఏదో ఈ రూపేణా పేరు తెచ్చుకుని రేపు తెలంగాణ వస్తే తెరాస ద్వారా ఓ కౌన్సిల్ సీటుకైనా టిక్కెట్టు తెచ్చుకోవచ్చు. రాధాకృష?గారు ఉద్యమానికి యింత చేసినా తెరాసవారు ఆయన్ని 'ఆంధ్రుడి'గానే పరిగణిస్తారు. అదీ ట్రాజెడీ. తెరాసవారి కొలబద్ద ఏమిటో వారికే తెలియాలి. కెసియార్, విజయశాంతి మూలాలు తెలంగాణలో వున్నాయా? ఆంధ్రలో వున్నాయా అని అడిగితే ఎఙీఙీషిమూలంలోకి వెళ్లకూడదంటారు.

ఏది ఏమైనా 'ఆంధ్ర' వారిని తరిమేస్తామని చెపుతూ వారు తెలంగాణలో నివసిస్తూ 'ఆంధ్ర ప్రాంతపు' మూలాలున్నవారిని అదలగొట్టి దూరం చేసుకున్నారు. కెసియార్ ఒకసారి తెలంగాణలో పుట్టినవారందరూ తెలంగాణవారే అని వాళ్లని అక్కున చేర్చుకోబోయారు కానీ హ్రస్వదృష్టిగల ఆయన అనుచరులు కాదు కాదంటూ ఆయన్ను వెనక్కి లాగి చెడగొట్టుకున్నారు. మా రాజ్యం రానీ, నిన్ను తరిమేస్తాం, నీ ఆస్తులు లాగేసుకుంటాం, నీ ఉద్యోగాలు పీకేస్తాం అని ఓటర్లలో కొంతశాతాన్ని భయపెట్టడం ఏమి విజ్ఞత? ఈ విధానం వలననే తెరాస హైదరాబాదు కార్పోరేషన్ ఉపఎన్నికలలో పోటీ చేయలేకపోయింది. డిసెంబరు 9 తర్వాత పరిస్థితి మారిపోయింది, ఇప్పుడు నిలబడగలదు అనుకుంటే – నిన్న ఎన్నికలలో తను నిలబడకుండా బిజెపిని నిలబెట్టి సమర్థిస్తే వాళ్లకు 400 ఓట్లు వచ్చాయి. టిడిపి కాండిడేట్ గెలిచారు. 'ఆంధ్ర'వ్యతిరేక విధానం వలన యిలా నష్టపోతున్నాం కాబట్టి కాస్త మెత్తగా మాట్లాడాలి అని చూస్తే వరంగల్, కరీంనగర్‌లలో ఏమౌతుందో తెలియదు. 2010 ఉపయెన్నికలలో ఆ జిల్లాలలో అన్ని సీట్లలోనూ 50వేలకు పైగా మెజారిటీ వచ్చింది. రెండింటి మధ్యా బాలన్స్ చేయడం చాలా కష్టం.

వేరే ప్రాంతం నుండి వచ్చి స్థిరపడినవారికి సర్వైవల్ యిన్‌స్టింక్ట్ కారణంగా స్మార్ట్ నెస్ ఎక్కువ వుంటుంది. పంజాబీల్లో, సింధీల్లో యిది చాలా చూస్తాం. తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రప్రాంతీయులు కూడా యిలాటి తెలివితేటలే చూపవచ్చు. తెలంగాణ ఏర్పడి ఎన్నికలు వస్తే 'మేము గుత్తగా ఓట్లేస్తాం. మా వర్గానికి ఎన్ని సీట్లు యిస్తారు? ఎన్ని కాబినెట్ పోస్టులిస్తారు?' లాటి బేరాలు సాగించవచ్చు. అన్ని పార్టీలు ముస్లిములను బుజ్జగించి, బుజ్జగించి తలకాయనొప్పి తెచ్చుకున్నాయి. వాటికి తోడు తెలంగాణ ప్రాంతంలో యిదో కొత్త లాబీ ఏర్పడవచ్చు. ఈ వర్గాన్ని ఎలా హేండిల్ చేయాలో తెలంగాణలోని పార్టీ నాయకులందరూ ఆలోచన చేయాలి. నిజానికి నేను ఎప్పుడో రాశాను – టిడిపి – కిం కర్తవ్యం? అనే వ్యాసంలో ! టిడిపి తనది సమైక్యవాదం అని ప్రకటించి యిలాటి వర్గాలకు అండగా నిలిస్తే ఆ ఓటుబ్యాంక్ అంతా వారిదే అని. చిరంజీవి కూడా అదే చేయవచ్చని సూచించాను. మన సలహాలు ఎవడికి కావాలి, ఎవరి పాలసీలు వాళ్లవే. బద్ధకిస్టు చిరంజీవి కాంగ్రెస్ చేతివేళ్లకు ఉంగరంలా అమిరారు. బాబు హంప్టీ డంప్టీలా గోడమీద కూర్చుని ఎప్పుడు ఎటు పడతారో తెలియకుండా వున్నారు.

నేను మాత్రం బాన్సువాడలో 27% ఓట్లు ముస్లిము ఓట్లు, ఆంధ్రప్రాంతీయుల ఓట్లు అనుకోవడం లేదు. ఇవి సమైక్యవాదానికి పడిన ఓట్లు అనుకుంటున్నాను. తెరాస వేర్పాటువాదానికి ప్రతిగా సమైక్యంగా వుండదలచినవారందరూ కాంగ్రెస్ కాండిడేటుకి వేసి తమ అభిప్రాయాన్ని చాటారని అనుకుంటున్నాను. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ కాండిడేటు ప్రజలకు చేసిందీ లేదు, కాంగ్రెస్ ప్రచారమూ చేసింది లేదు. తెలంగాణ యిస్తానని కాంగ్రెస్ కూడా చెప్పింది కదా అంటే పసిపాప కూడా వాళ్ల మాటలు నమ్మదని అందరికీ తెలుసు. ఇస్తానేవన్నీ పైపై మాటలే, నోటితో లేదనకుండా చేత్తో లేదంటోందని అందరూ హెూరెత్తించేస్తూ వుంటే కాంగ్రెస్ తెలంగాణ యిస్తుందన్న భ్రమ ఎవరికీ లేదు. ఇంతమంది ఉద్యోగులు, ఆర్టీసీవారు, ఉపాధ్యాయులు సమ్మె చేస్తూ వుంటే కిమ్మనకుండా కూర్చున్న కాంగ్రెస్‌కు 27% ఓట్లు పడ్డాయంటే అవి వాళ్ల ఓట్లు కావు. వేర్పాటువాదాన్ని వ్యతిరేకించేవారి ఓట్లు.

కాంగ్రెస్ వాళ్లు ఏ మాత్రం కాస్త కృషి చేసి వున్నా అది 30% దాకా వెళ్లి వుండేవి. ఇప్పుడు తెలంగాణలో ఎన్నికలు జరిగితే

పరిస్థితి ఎలా వుంటుందో మనకు ఒక అంచనా వచ్చేందుకు యిది సహకరిస్తుంది. తెరాసతో పొత్తుపెట్టుకున్న టిడిపి ద్వారా గెలిచిన పోచారం, తెరాసలోనే చేరి మళ్లీ నిలబడితే 67% ఓట్లతో ఆగారు. తెరాస, టిడిపి ఓడిపోయిన 55 చోట్ల పరిస్థితి ఏమిటి? ఉద్యమం అన్ని జిల్లాలలోనూ ఒక్క తీరుగా లేదని అందరికీ తెలిసున్న విషయమే. మొన్న సోమవారం బంద్ హైదరాబాదులో ఘోరంగా విఫలమైంది. పాతబస్తీలో బందా? అదేమిటి? అనేసారు. ఇవాళ మద్యం షాపులు కూడా హైదరాబాదులో తెరిచే వున్నాయి. పేపర్లలో ఏమైనా రానీయండి గాక, గ్రౌండ్ రియాలిటీ యిది. సమైక్యవాదానికి తెలంగాణలో కొన్ని చోట్ల 25%, మరి కొన్ని చోట్ల 30%.. అలా లెక్కవేసుకుంటూ 50% ఓట్లుకూడా పడే అవకాశం వున్న నియోజకవరాలూ వున్నాయని అనిపిస్తోంది. ఎన్నికలవేళ ఎవరు నిల్చుంటారు, వారి శక్తి సామర్థ్యాలేమిటి, ఆనాటి పరిస్థితి ఏమిటి అన్నదానిపై గెలుపోటములు ఆధారపడి వుంటాయి.

ఇవేమీ లెక్కలోకి తీసుకోకుండా తెలంగాణలో నాలుగు కోట్ల లేదా నాలుగున్నర కోట్ల మంది ముక్తకంఠంతో ప్రత్యేక తెలంగాణ కోరుతున్నారు అని చెప్పుకుంటే ఎలా వుంటుందంటే – 'గ్రేట్ ఆంధ్రా వెబ్‌సైట్ కు రోజూ వచ్చే పాఠకులు ఏడునుండి ఎనిమిది లక్షలు. వాళ్లంతా నా కాలమ్ చదువుతారు. చదివిన వారంతా నా అభిప్రాయంతో ఏకీభవిస్తారు' అని నేను చెప్పుకున్నట్టు వుంటుంది. గ్రేట్ ఆంధ్రాలో ఇంగ్లీషు వెర్షన్ చదివేవారు ఎక్కువ. తెలుగు వెర్షన్‌కి వచ్చి, మసాలా వార్తలన్నీ చదివేశాక టైముంటే నావి చదువుతారు అన్న స్పృహ లేకుండా యిలా మాట్లాడితే ఎంత తీరుగా వుంటుందో అది కూడా అంత తీరుగానూ వుంటుంది. ఎన్నికలు చాలా దూరమున్నాయి. ప్రత్యేక తెలంగాణ కోరేవారందరూ తెలంగాణలో నివసించే అన్నివర్గాల వారి మనోభావాలనూ తెలుసుకుని, వారి భయాలనూ పోగొట్టకపోతే, ఇన్‌క్లూజివ్ పాలిటిక్స్ ప్లాన్ చేయకపోతే – బాన్సువాడలోలాగ అనుకున్న మెజారిటీలో సగం కూడా రాదు ! – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

## అక్టోబరు 32 ఎమ్బీయస్ : ఓ శకునీ, ఓ కృష్ణుడూ

"మాయాబజార్" సినిమా తొలిసారి చూస్తుంటే ప్రియదర్శినిలో కృష్ణుడికి శకుని కనబడినపుడు తెరమీదివారితో బాటు నేనూ ఉలిక్కిపడ్డాను. శకుని విలన్ కదా, కృష్ణుడుకి ఆత్మీయుడెలా అవుతాడు? అని. పెద్దయ్యాక పురాణాలతో, పుక్కిటిపురాణాలతో, జనశ్రుతంగా వచ్చే కథలతో పరిచయమయ్యాక అర్థమైంది. ఇద్దరూ ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నారు కాబట్టి వారిద్దరి మధ్య ఓ బంధం, అనుబంధం వుందని. భూభారాన్ని తగ్గించడానికి జనక్షయం కావాలి. అది కావాలంటే దేశంలో వున్న రాజులందరూ తమ తమ సైన్యాలతో సహా పాల్గొనే మహాసంగ్రామం రావాలి. వాళ్లు కదిలి రావాలంటే అప్పటికి దేశంలో వున్న అతి పెద్ద రాచకుటుంబంలో ముసలం పుట్టి, కొందరూ అటూ యిటూ చేరి యుద్ధం చేయాలి. ఏదో చిన్న రాజ్యంలో సంక్షోభం అయితే వాళ్లలో వాళ్లే కొట్టుకుని ఛస్తారు. పక్కవాడు తొంగి చూడడు. కానీ పెద్ద రాజ్యం అయి, స్టేక్స్ భారీగా వుంటేనే అందరికీ ఆసక్తి పుడుతుంది.

ఆనాటికి ఓ పాటి పెద్దరాజ్యం కురురాజ్యం. అదృష్టవశాత్తూ వారసత్వం గురించి అక్కడో లిటిగేషన్ కూడా వుంది. రాజ్యం ఏలుతున్నాయన గుడ్డివాడు. ఆయన సవతి తమ్ముడు (తండ్రి ఒక్కడే, తల్లులు వేరు) సమర్థుడే కానీ రాజ్యం గురించి ఆశ లేనివాడు. రాజ్యాలు సంపాదించి అన్నగారి దోసిట్లో పోసి, అడవులకు వెళ్లాడు. అయితే అక్కడ చనిపోవడంతో ఆయన భార్యల్లో ఒకరు సహగమనం చేసి, మరొకరు రాజధానికి వచ్చారు. ఆవిడకు రాజ్యకాంక్ష వుంది. తన పిల్లలకు రాజ్యం దక్కాలని ఆశ. నిజానికి ఆ పిల్లలలో కురురక్తం లేదు. వాళ్లు పాండురాజుకి పుట్టినవారు కారు. అయితే వాళ్లలో సామర్థ్యం వుంది. ఇక గుడ్డిరాజు కొడుకుకయితే అత్యాశే వుంది. తండ్రి పేరు మీద రాజ్యం చేస్తూ, ఈ కజిన్స్ (కజిన్స్ అనడానికీ లేదు. వాళ్లతో యితనికి రక్తసంబంధం లేదు. పినతండ్రి భార్యలకు ఎవరెవరి వల్లనో పుట్టినవారు) న్యూసెన్సు వదిలించుకోవాలని చూస్తున్నాడు. తమ్ముడు విస్తరించి పెట్టిన రాజ్యం కదాని వాళ్ల నాన్నకు కాస్త ప్రేమ, బోల్డంత లోకభీతి వున్నాయి. ఈ సినారియోలో శకుని, కృష్ణుడూ చొరబడ్డారు. తమాషా ఏమిటంటే వాళ్లు ఎవరి పక్షాన నిలబడ్డారో వాళ్లకే నష్టం కలిగించారు.

శకుని విషయంలో విపులంగా చెప్పనక్కరలేదు. "శ్రీకృష్ణపాండవీయం" సినిమాలో విపులంగా చూపించారు. (శకుని మెతుకుల కబళం ఉదంతానికి భారతం ఆధారం కాదు) కృష్ణుడి విషయమే కాస్త చెప్పాలి. కృష్ణుడు ఏం చేశాడు? కుంతితో వున్న దూరపు బంధుత్వం ఆసరాగా చేసుకుని లిటిగేషన్‌లో బలహీనంగా వున్న పాండవుల పక్షం వైపు చేరాడు. వాళ్లల్లో గట్టివాడైన అర్జునుడికి తన చెల్లెల్ని యిచ్చి (అదీ దొంగతనంగా) పెళ్లి చేసి బంధుత్వం కుదుర్చుకున్నాడు. రాజసూయం అంటూ తనకు శత్రువులుగా వున్న రాజులందరినీ భీమార్జునులతో చంపించాడు. కురురాజ్యాన్ని పెద్దది చేశాడు. జనక్షయం భారీగా జరగాలంటే లిటిగేషన్‌లో వున్న ఆస్తి పెరగాలి కదా ! మాయాద్యూతం సంగతి శకుని చూసుకుంటే, అరణ్యవాసంలో అర్జునుడు శస్త్రాస్త్రాలు సమకూర్చుకుని మరింత బలపడేట్లా చూసుకున్నాడు కృష్ణుడు.

ఇక అజ్ఞాతవాసం అయ్యాక రాయబారం నడిపాడు. కృష్ణరాయబారం చూసినవాడెవడికీ అతను శాంతి కోరుతున్నాడని అనిపించదు. పాత విషయాలు తవ్వి ఆ ఛాలెంజ్ లేమిటి, నీ తొడలు విరుగుతాయి చూడు అని దుర్యోధనుణ్ని హెచ్చరించడం ఏమిటి? వెళ్లేందుకు ముందే ద్రౌపదికి చెప్పాడు – శాంతి జరగకుండా చూస్తానులే అని. కర్ణుణ్ని ఓ సారి గిల్లి చూసి, దుర్యోధనుడి పక్షాన మరింత అంకితభావంతో యుద్ధం చేసేట్లా చూసుకున్నాడు. ఇక యుద్ధంలో తన పక్షంలోనే తర్వాత్తర్వాత తనకు ప్రమాదంగా

పరిణమించగల అభిమన్యుణ్ని, ఘటోత్కచుణ్ని, అతని కొడుకుని మట్టుపెట్టించాడు. 18 అక్షౌహిణుల సైన్యం రాజులతో సహా నాశనమైంది. కురువంశం సర్వనాశనమైంది. ఉపపాండవులు, పాండవుల సేనానితో సహా చచ్చారు. యాదవుల రాజ్యానికి హస్తినరాజ్యమే కాదు, మరే యితర రాజ్యం నుండీ బెడద లేకుండా పోయింది. ''పాండవులు సంపాదించినది కౌరవుల తద్దినాలకే సరిపోయింది'' అని సామెత. (దుర్యోధనాదులు వందమంది కదా) అందువలన కృష్ణుడు సాధించి పెట్టించినది ఏమిటో గట్టిగా చెప్పలేం. అదీ కాక పోతూ పోతూ అర్జునుడి శక్తి కూడా గుంజుకుపోయాడట. అతని గాండీవం వట్టి వెదురుబద్ద అయిపోయిందట.

ఇదంతా గుర్తుకు రావడానికి కారణం – కెసియార్, లగడపాటి. కెసియార్ తెలంగాణ ఉద్యమానికి పిత. అది పీతలా వక్రగతిలో నడవడానికి కారకుడు కూడా. రెండువారాలలో వస్తుందని ఆశలు పెంచుతారు, అంతలోనే 2014 ఎన్నికల దాకా రాదని ప్రకటించి వాటిని తుంచుతారు. అందరూ కలిసి రావాలంటారు. ఎవరైనా వస్తే ఆంక్షలు విధించి దూరం పెడతారు. అన్ని రంగులవారూ కలిసి ఉద్యమిస్తే తెలంగాణ వస్తుంది కదా, ఆ తర్వాత జుట్టూజుట్టూ పట్టుకున్నా తప్పులేదు అని నిజమైన తెలంగాణవాదులు కలలు కంటే వాటిని భగ్నం చేస్తారు. పొత్తు పెట్టుకుంటారు, తనే చిత్తు చేస్తారు. అనేకసార్లు రాజీనామాలు చేయించి సెల్ఫ్‌గోల్ చేసుకున్నారు.

ఉద్యమానికి మేధావులను దూరం చేస్తారు. తెలంగాణకోసం ఆయనతో కలవనివాడు లేడు, విడిపోనివాడు లేడు. ఆయన కుటుంబసభ్యులు మాత్రమే ఆయనతో కలిసి వున్నారు. కోదండరాం వున్నారు కదా అనవచ్చు. ఒక్కోప్పుడు ఆయన్నీ తీసిపారేసినట్లు మాట్లాడతారు. మిలియన్ మార్చ్ సమయంలో, మొన్న రైల్ రోకో విషయంలో ఉద్యమకారులందరిదీ ఓ మాట, యీయనది మరో మాట. మాట్లాడవలసిన టైములో నోరు విప్పకుండా కూర్చుంటారు. (వ్యూహాత్మకమౌనం అని ఆయన భక్తులు దాన్ని వర్ణిస్తారు) తెలంగాణ రాకపోతే కెసియార్ చచ్చుడే అంటారు, మళ్లీ ఎంతమంది చచ్చినా అది రాదన్న దిగులు పుట్టిస్తారు.

అందరూ రాజీనామాలు చేస్తే తెలంగాణ వస్తుందని అంచనాలు వేస్తున్నవారికి పాఠం చెప్పడానికి రాజీనామాలు చేయించి, అవి వేస్ట్ అని అనిపించారు. అందరూ కలిసి సమ్మె చేస్తే వచ్చేస్తుంది అని వాదించేవారికి బుద్ధి గరపడానికి రాంగ్ టైమ్‌లో, అందర్నీ కలుపుకోకుండా సమ్మె మొదలుపెట్టించి ఆ అస్త్రమూ వృథా అనిపించారు. సకలం అని పేరు పెట్టినా, అన్ని వర్గాలవారినీ కలుపుకోలేదు. పట్టూ విడుపూ లేకుండా సమ్మె నడిపి వాళ్లు మళ్లీ యిప్పట్లో తలెత్తకుండా చేశారు. ఓ వారం రోజులు చూసి, స్పందన లేదని గ్రహించి ప్రజలు యిబ్బంది పడుతున్నారు కాబట్టి, ప్రస్తుతానికి విరామం అని వుంటే తెలంగాణ ప్రజలు అమ్మయ్య అనుకునేవారు. సమ్మె కొనసాగించారు. రాస్తారోకోలో, రైల్ రోకోలో కెసియార్ ఎన్నడూ ముందు నిలబడలేదు. ఇప్పుడు అందరి ఓపికా హరించేసి, సమ్మె అంటే బాబోయ్ అనిపించాక, త్వరలో మరింత ఉధృతం చేస్తాం అంటే ఎలా?

ఇక మిగిలిన అస్త్రం ఆయన నిరాహారదీక్ష. ఇప్పుడు కూనంనేని చేసిన దీక్ష చూశాం. విరమించిన విధానమూ చూశాం. దీక్షకు ముందు, తర్వాత పరిస్థితిలో ఏమైనా మార్పు వుందా? రేపు కెసియార్ చేసినా ఇంతే కదా! డిసెంబరు 9 న రాలేదా అంటే అప్పటికి ఢిల్లీవారికి తెలుగువాడి చదరంగం అర్థం కాలేదు. ఇప్పుడు అదలెత్తిపోయి తెలుగువాళ్ల సబ్జక్ట్ అంటేనే 'నేనెరుగ, నేనెరుగ, యింకోణ్ని అడుగు' అంటున్నారు. నా ఉద్దేశం కెసియార్ త్వరలోనే నిరాహారదీక్ష కూడా చేసేసి అమ్ములపొది ఖాళీ చేసేసి 'ఇంకేం చేస్తాం? 2014 దాకా ఆగుదాం అనవచ్చు'.

అందుకే 'తెలంగాణకు బలమూ, బలహీనతా కెసియారే. ఆయన వ్యవహారశైలి బాగా వుండి వుంటే ఉద్యమం ఎంతో వూపు అందుకునేది. ఉద్యమం బలపడే సమయంలో ఢిల్లీలో లాబీయింగ్ అంటూ దాన్ని చంపేశారు. సహచరులందరినీ తరిమేశారు. స్వంత ఎజెండా తప్ప తెలంగాణ ఎలా రావాలన్న చింత లేదాయనకు. తెలంగాణ వస్తే మొదట బాధపడే వ్యక్తి కేసియారే. వస్తే ఆయన అస్తిత్వం మర్చిపోతారని భయం. అడలగొట్టి డబ్బు సంపాదించే  మార్గం పోతుందని భయం. అందుకే ప్రత్యేక తెలంగాణ పట్ల జనాల్లో అపనమ్మకాన్ని కలిగించి,' అని జనసామాన్యంలో (ప్రత్యేక తెలంగాణ కావాలని ప్రగాఢంగా కోరుకునేవారిలో సైతం) ఓ మాట వ్యాపించడానికి కారణం. దానికి తోడు యీ మధ్య ప్రధాని తనను కలిసిన తెలంగాణ బృందం ముందు కెసియార్‌ను చూపించి, 'మేం చేసేవన్నీ ఆయనకు తెలుసు' అన్నారన్న వార్త రావడంతో ఈ అనుమానం మరింత బలపడింది.

ఇక లగడపాటి – ఆయన సమైక్యం సమైక్యం అంటారు కానీ అందర్నీ కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేయరు. తెలంగాణ కాస్త ప్రశాంతంగా వుందంటే చాలు, ఈయన ఏదో స్టేటుమెంటు యిచ్చి రెచ్చగొడతారు. ఆ స్టేటుమెంటు యిచ్చేముందు సాటి ఆంధ్రప్రాంతీయులను కలుపుకుని యివ్వరు. తాను ఒక్కడే వెలగాలి. రేపు రాష్ట్రం విడిపోయి, ఆంధ్ర ఏర్పడితే 'ఆంధ్రవీరుడి'గా చెప్పుకోవడానికి తనే వుండాలి. పోటీదారులు ఎవరూ వుండకూడదు. సమైక్యరాష్ట్రంలో అయితే ఛాన్సు లేదు. ఆంధ్రరాష్ట్రం విడిపోతేనే, రాజధాని విజయవాడ, గుంటూరు మధ్య ఏర్పడితేనే లగడపాటికి గ్లామర్. తక్కినవాళ్లందరూ భయపడే రోజుల్లో ఆయనే తెలంగాణవారిని పొద్దుకులా తిట్టి తిట్టి అదే ఆంధ్రపౌరుషానికి ప్రతీకగా నిలిచారని పేరు సంపాదించారు.

2009 డిసెంబరులో రాష్ట్రం విడిపోతుందనిపించినపుడు ఆయన బాగా ఖర్చు పెట్టి, టీవీ యాడ్స్ యిచ్చి, తనను తాను బాగా ప్రొజెక్టు చేసుకున్నారు. పోనుపోను ఆ భయం వెనకపడి, రాష్ట్రం సమైక్యంగా నిలిచేట్లా కనబడడంతో ఆ పెట్టుబడి వేస్టనుకున్నారు. కృష్ణ కమిటీకి యిచ్చిన రిపోర్టులు పుస్తకాలుగా వేసి లక్షలాది కాపీలు రాష్ట్రమంతా పంపిణీ చేస్తానన్న మాట, ఐడియా అటకెక్కించి డబ్బు మిగిల్చారు. అయినా సమైక్యవాదానికి నిలబడిన వారందరికీ లగడపాటి కట్టలు కట్టలుగా డబ్బులు వెదజల్లుతున్నారన్న యింప్రెషన్ కలిగింది. నాకూ చాలామంది మెయిల్స్ రాశారు, ఎంత పంపించారని. ఎర్ర ఏగానీ పంపలేదు. నిజానికి సమైక్యవాదులందరికీ

డబ్బు పంచడం మొదలెడితే ఆయన ల్యాంకో 'హిల్స్' కరిగిపోయి గుట్ట, మిట్ట అయిపోయేది.

ఆయన ముఖ్యమంత్రి అయ్యే సందర్భం రావాలంటే రాష్ట్రం విడిపోవాలి. విడిపోవాలంటే తెలంగాణవారు ఛస్తే కలిసుండం అని గట్టిగా చెప్పాలి. చెప్పాలంటే వాళ్లని రెచ్చగొట్టాలి. 'ఏహెయ్, ఇది యిప్పట్లో వచ్చేదీ లేదు, చచ్చేదీ లేదు, అవతల ఆంధ్రాలో దీని గురించి ఆలోచించకుండా ఎవరి పని వాళ్లు చూసుకుంటూ డబ్బు చేసుకుంటున్నారు. చల్, మనం కూడా మన పని మనం చూసుకుందాం.' అని సాధారణ తెలంగాణ పౌరుడు అనుకుంటూండగానే లగడపాటి ఏదో ఒకటి అని వాళ్లని ఉడికిస్తారు. దానికి పిసిసి అధ్యక్షుడి అనుమతి తీసుకోరు, ఎవరితోనూ సంప్రదింపులూ చేయరు. ఇక అప్పణ్నుంచి తెలంగాణ నుండి కుప్పలుతిప్పలుగా ప్రకటనలు. లగడపాటిని మూర్తీభవించిన ఆంధ్ర అహంకారంగా వర?ంచి ఆయన పేరు పెట్టి కోట్లాది ఆంధ్రప్రాంతీయులను తిట్టిపోస్తారు. టీవీ చర్చల్లో 'మీ లగడపాటి యిలా అన్నాడు, దానికేమంటావ్?' అంటూ సమైక్యవాదాన్ని సమర్థించేవారిని నిలదీస్తారు.

లేటెస్టుగా బాన్సువాడ ఉపయెన్నిక ఫలితం తర్వాత లగడపాటి స్టేటుమెంటు చూడండి – ఉద్యమం నీరుకారుతోంది అన్నాడాయన. అదే మాట ఏ రాజకీయ విశ్లేషకుడో, సంపాదకీయం రాసే పాత్రికేయుడో అంటే మరోలా వుంటుంది. లగడపాటి అనడంతో దానికి మరో రంగు పులుముతారు. ఉద్యమం నీరుకార్చడానికి లగడపాటి ఢిల్లీలో వాళ్లందరినీ తడుపుతున్నాడని తెలంగాణ ఉద్యమకారులందరికీ ప్రగాఢ విశ్వాసం. హైదరాబాదునుండి పెట్టుబడులు తరలించేసిన ఆయన కంత అవసరం లేదని నా ఉద్దేశం. సమైక్యంగా వుంటే ఆయనకు వ్యక్తిగతంగా కలిసి వచ్చేదేముంది? ఆయన ఎమ్మెల్యే అయి వుంటే, ఆయనకంటూ ఓ వర్గం వుంటే ముఖ్యమంత్రిగా అయ్యే ఛాన్సుండేది. ఇప్పుడు కిరణ్‌ను మార్చినా ఏ తెలంగాణ వ్యక్తికో, ఏ బిసికో యిస్తారు. లగడపాటి రెండూ కాదు. ఆయన ఓ ఎంపీ. ఆయన వెంట నడిచే మరో ఉన్నట్టు తోచదు. రాయపాటి, కావూరి, పురంధరేశ్వరి – ఎవరికి వారే, ఎవరి ఆశలు వారివే!

ఉపయెన్నికలో కాంగ్రెస్ నెగ్గలేదన్న విషయం గుర్తించైనా లగడపాటి కాస్త నిదానించవలసింది. కాంగ్రెస్ అభ్యర్థికి, ప్రత్యర్థికి 40% ఓట్లు వార వున్నపుడు ఉద్యమం నీరు కారుతోంది అని ఎలా అంటాం? ...కారేందుకు ఛాన్సుంది, ...కారవచ్చు అంటే కాస్త ఓ మోస్తరు. దీనికి తోడు 'సమ్మె తెలంగాణ ఉద్యోగులకు వరప్రసాదంగా (సమ్మె చేసే ఉద్యోగిని రెచ్చగొట్టడానికి, అవమానించడానికి యింతకంటె దగ్గర మార్గం వుందనుకోను), ప్రజల పాలిట శాపంగా మారింది కాబట్టి ప్రజాగ్రహం తట్టుకోలేక కోదండరాం సమ్మె విరమింపచేస్తున్నార'ని అన్నారు. యుద్ధంలో పరాజితుడిని సైతం మర్యాదగా చూస్తారు. మరీ అవమానిస్తే మళ్లీ పుంజుకుని కసితో చావుదెబ్బ తీస్తాడని. మొదటి ప్రపంచయుద్ధంలో ఓడిపోయిన జర్మనీని అగ్రరాజ్యాలు అవమానించాయి కాబట్టే రెండో ప్రపంచ యుద్ధం లేవనెత్తి జర్మనీ వాళ్లందర్నీ దుంప తెంపింది. సమ్మె కొనసాగించలేక చర్చలకు వచ్చిన ఉద్యోగుల పట్ల కూడా ప్రభుత్వం దురుసుగా వ్యవహరించదు. కేసులు ఎత్తివేస్తుంది, జీతాలు యిచ్చివేస్తుంది. ఇకనైనా కలిసి పనిచేద్దాం అని చేయిచాస్తుంది. ఇది విజేత బాధ్యత. కిరణ్, ఆయన సహచరులు సంయమనంతో వ్యవహరిస్తున్నారు. తను వున్నంతసేపైనా రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలన్న తాపత్రం కాబట్టి !

లగడపాటికి అది నచ్చదు. అందువలన కెసియార్‌ను ఎలక్షన్ – కలక్షన్ అంటూ వెక్కిరించారు. ఉద్యమం ఆగిపోతే ఆదాయం పడిపోతుందని కెసియార్ భయం అన్నారు. ఇదేదో గాసిప్స్ వెబ్‌సైట్‌లో ఐటమ్‌గా వేసుకుంటే ఫర్వాలేదు కానీ ఓ ఎంపీ సాటి ఎంపీపై యిలాటి అభాండం వేయడానికి ముందు చాలా ఆలోచించాలి. తెలంగాణలో ఎంతో గౌరవమర్యాదలు పొందుతున్న కెసియార్‌ను అనబోయే ముందు ఆధారాలు బయటపెట్టి అంటే అదో పద్ధతిగా వుండేది. వీటన్నిటితో బాటు యీ నెలాఖరులోగా తెలంగాణపై తుది నిర?యం వెలువడుతుందన్న చిలకజోస్యం జోడించారు. అది శుద్ధ గ్యాస్ అని ప్రధాని యివాళ్టి ప్రకటనలో తేలిపోయింది. చర్చలు సాగుతున్నాయి అని ఆయన అన్నారు. శీతాకాల సమావేశాలు పూర్తయ్యాకనే (అంటే డిసెంబరు నెలాఖరుకి) కాంగ్రెస్ దీనిపై దృష్టి పెడుతుందని పత్రికలు అంటున్నాయి. అంటే కనీసం రెండునెలల తర్వాత అన్నమాట. కానీ లగడపాటికి అవేమీ పట్టదు. తను న్యూస్‌లో వుండడం ఎలా అనేదే ఆయన చింత. ఆయన ఎజెండా ఆయనది.

ఇంత విపులంగా చెప్పాను కాబట్టి శకుని ఎవరో, క ృష?డెవరో మీకు మీరే తేల్చుకోండి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 40 ఎమ్బీయస్ : సమ్మె సక్సెస్ – మ్యాప్ గాయబ్**

'సకల' జనుల సమ్మెలో ఆఖరి వికెట్టు కూడా పడిపోయింది. ప్రభుత్వోద్యోగులు కూడా సమ్మె విరమించారు. అయితే విరమిస్తూ మిస్తూ చేసిన గంభీరోపన్యాసాలు మాత్రం నన్ను కదిలించాయి. సమ్మె సక్సెసట. అదుతే విజయమట. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొద్దు నిద్ర వదిలించిందట. ఆజాద్ చేత ఆ 'మహత్తర' స్టేటుమెంటు చేయించిందట. అందువలన యివాళ ఆఫీసులకి తిరిగి వెళ్లేటప్పుడు ఉద్యోగులు ఆనందతాండవం చేసుకుంటూ వెళ్లాలట. ఈ సెల్ఫ్‌హిప్నాటిజం బాగానే వుంది కానీ మధ్యలో తెలంగాణ రోడ్ మ్యాప్ ఏమైందో చెప్పలేదు.

ఉద్యోగులు మొదట మంత్రిగారితో మాట్లాడినపుడు మూడు ప్రధాన డిమాండ్ల వద్ద కథ ఆగింది – సమ్మెకాలంలో జీతాలు, ఉద్యోగులపై కేసులు, తెలంగాణ ఏర్పాటుకై రోడ్ మ్యాప్. ముఖ్యమంత్రితో మాట్లాడి యివి ఫైనలైజ్ చేయబోతున్నారని స్త్రోలింగులు

వచ్చాయి. నిజానికి ఆర్టీసీలో రెండో వర్గం వారు కూడా సమ్మె విరమించినప్పటి నుండి వికెట్లు పడడం మొదలుపెట్టాయి. అయినా యీ ఉద్యోగులు మాత్రం యింకో వారం లాక్కుని వచ్చారు. ఎందుకంటే తెలంగాణ రోడ్ మ్యాప్ సంగతి తేల్చందే వదలమన్నారు. మొదట్లో తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టేవరకూ.. అన్నారు. దీపావళి తర్వాత శీతాకాల సమావేశాలలో గాని పెట్టలేరు కాబట్టి అప్పటిదాకా ఆగుతారనుకున్నాను. తర్వాత మ్యాప్ ఒకటి యిచ్చేస్తే చాలన్నారు. ఆ మ్యాప్ కూడా ఢిల్లీలో కోర్ కమిటీవాళ్లు తమతో చెప్పాలన్నారు. కిరణ్‌గారు ఢిల్లీ తీసుకెళతామని ప్రామిస్ చేసారు కానీ కోర్ కమిటీ సంగతి అడగవద్దన్నారు. ఢిల్లీలో ఎవరితో మాట్లాడిద్దామనుకున్నారో చెప్పలేదు. ఢిల్లీ వెళ్లినదాకా వుండి ఢిల్లీ రోడ్ మ్యాప్ చేతిలో పెడితే...? అన్న అనుమానం నాకు వచ్చింది.

చివరకు ముఖ్యమంత్రితో మాట్లాడాక సమ్మె విరమణ.. సారీ వాయిదా.. అన్నారు. డిమాండ్ల సంఖ్య పెరిగింది. కానీ వాటిల్లోంచి అతి ప్రధానమైన రోడ్ మ్యాప్ డిమాండ్ జారిపోయింది. అయినా సమ్మె సక్సెస్ సక్సెస్ అని ఆనందించేశారు. టి ఛానెల్‌లో పాటలు, న ృత్యాలు కూడా ప్రసారం చేశారు. కానీ అదేమిటో తమాషా సమ్మె వాయిదా అని ప్రకటిస్తూ నలుగురు ముఖ్యమైన నాయకులు గంటసేపు మాట్లాడినా, ఒక్కరి మొహం మీదా చిరునవ్వు లేదు. వెనక్కాల నిలబడ్డవారూ మొహాలు గంటుపెట్టుకుని వున్నారు. దాన్ని ఫోటో తీసి పంపిస్తే ఏదో సంతాపసభ తాలూకు ఫోటో అనుకుంటారు తప్ప కార్మికవిజయోత్సవం తాలూకు ఫోటో అనుకోరు. ఇది యిలాగే ముగుస్తుందని తమకు ముందే తెలిసినట్టు మాట్లాడారు స్వామిగౌడ్. తెలంగాణ తెస్తామని తాము ఎన్నడూ చెప్పలేదట. (అవునా!? మరి ఏం తెస్తామన్నారు? కేసులా?) తమకు తెచ్చే శక్తి లేదని ఎప్పుడో తెలుసుట. అది రాజకీయనాయకులు చేయవలసిన ప్రక్రియట. ఉద్యమానికి తాము చేసినది ఉడతసాయంట. తాము దివిటీ వెలిగించి రాజకీయనాయకుల చేతిలో పెట్టేసి ఆఫీసులకు వెళ్లిపోతున్నారట. ఇక దివిటీ అందుకుని ముందుకు వెళ్లవలసిన పని నాయకులదేట.

వాళ్ల దగ్గర దివిటీలు లేకపోతే కదా స్వామిగౌడ్ వద్ద తీసుకోవలసిన అవసరం పడుతుంది ! వాళ్లు ఎప్పుడో దివిటీలు చేతపట్టి దిగి, అవి ఆర్పేసి కూర్చున్నారు. చేతులు ఖాళీ లేవు. స్వామిగౌడ్ మొదట్నుంచీ చెప్పినదేమిటి? 'నాయకులారా మీరు ముందు వుండి నడిపించండి. మేం వెనకాల వుంటాం.' అని. అలా అంటూనే వాళ్ల కంటె ముందు గోదాలోకి వురికేశారు. ఇప్పుడు మళ్లీ నాయకులను తమ వారసులుగా భావించి 'దివిటీ మీకిస్తున్నాం. ఆరిపోకుండా చూసుకోండి' అని అప్పగింతలు పెడుతున్నారు. అసలు యిప్పటికే వాళ్లు ఉద్యమంలో దిగి చేతులు కాల్చుకున్నారు. అరచేతులు వూదుకుంటూ కూర్చున్నారు. ఇప్పుడు వేడి వేడి దివిటీ అందుకోమంటే అందుకుంటారా? వాళ్లు అందుకునేదాకా ఆగకుండా ఉద్యోగులు దివిటీ ఓ మూల పడేసి చేతులు దులిపేసుకున్నారు. రిలే రన్నింగ్ రేస్‌లో బ్యాటన్ చేతులు మారుతూ వెళుతుంది. మధ్యలో పారేస్తే కుదురుతుందా? తర్వాతివాడు అందుకునేదాకా ముందువాడు ఆగాలిగా!

తన ప్రకటన విని, దానిలోంచి తెలంగాణ యిచ్చేస్తున్నామన్న అర్థం లాగిన మన ఉద్యోగుల ప్రతిభను చూసి ఆజాద్‌గారు మురిసి మూర్ఛపోయి వుంటారు. 'ఇదా నేనన్నదానికి అర్థం? ఇలా అయితే బోల్డు రాష్ట్రాలు యిచ్చేద్దునే..' అనుకుంటారు. అలాటి ప్రకటనలు గత మూణ్నెళ్లుగా ఆయన చేస్తూనే వున్నారు. దేనికీ యింత స్పందన రాలేదు. ముత్యపుచిప్పలో పడిన స్వాతివాన చుక్క మాత్రమే ముత్యం అవుతుంది. తక్కినవన్నీ సముద్రం పాలే. అలాగ ఆజాద్ యీ ప్రకటన మాత్రమే యింతటి పరిణామాన్ని తెచ్చిపెట్టింది. అలనాడెప్పుడో డిసెంబరు 9 నాడు చిదంబరం ఒక్క ప్రకటన చేస్తే రాజీనామాలు కుప్పలుతిప్పలుగా వచ్చిపడ్డాయి. మళ్లీ యిన్నాళ్లకు ఆజాద్‌గారు ఓ ప్రకటన చేస్తే సమ్మెలు టకటకా కట్టేశాయి.

ఇంకోటి చూశారా, ఉద్యోగుల సమ్మె వారం రోజులుగా అయిపోయింది అయిపోయింది, ఇవాళో రేపో అంటూ వచ్చారు. కానీ నిన్నటిదాకా కొనసాగింది. ఎందుకో ఎవరైనా చెప్పగలరా? బేతాళుడు యీ ప్రశ్న అడిగితే విక్రమార్కుడు నోరుమూసుకుని వుండేవాడు. బేతాళుడికి మళ్లీ చెట్టెక్కే అవకాశం దక్కేది కాదు. ఎందుకంటే తమ సమ్మె లక్ష్యం సాధించామంటూ స్వామి గౌడ్ చెప్పిన అంశాలు – తెలంగాణ ఉద్యమశక్తులన్నిటినీ ఏకం చేయడం, ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పడం, కేంద్రం నాయకులచేత చర్చల ప్రక్రియను ప్రారంభింపచేయడం – యీ మూడూ ఎప్పుడో జరిగిపోయాయి. సమ్మె మొదలుపెట్టిన మూడువారాలకే యివన్నీ సాధించేశారు. మరో మూడు వారాలు వుట్టిపుణ్యాన సాగించినట్టయింది. దసరా నుండి దీపావళి దాకా ఉత్తినే చేసినట్టయింది. దసరా తర్వాత కిరణ్ వైఖరి మారిందని గ్రహించాకనైనా ఎంతకాలం సాగదీసినా యిదే ఫలితం అని గుర్తించవలసినది. ఒక్కొక్క సంఘం సమ్మెనుండి జారుకుంటూ వుంటే ఆఖరి వారం ఏదో కొసరు సమ్మెలా చేసినట్టయింది.

.ఇక్కడో జోక్ గుర్తుకు వస్తోంది. ఒకడన్నాట్ట – 'నాకు నూరేళ్ల మూణ్నెళ్లు బతకాలని వుందిరా..' అని. "రౌండుగా నూరేళ్లు అనవచ్చుగా.. ఆ పై మూణ్నెళ్లు ఎందుకు?' అని అడిగాట్ట ఫ్రెండు. "నూరేళ్లు బతికినందుకు ఉత్సవాలు, సన్మానాలూ అవీ వుంటాయిగా.." అన్నాట్ట వీడు కాస్త సిగ్గుపడుతూ. అలాగ వీళ్లు కూడా "తక్కిన అందరూ మానేసినా మేము కొసరుగా యింకోవారం చేశాం" అని చెప్పుకోవడానికి కాకపోతే ఎందుండీ చేయడం? ముందుగా ముగించి వాళ్లు పోగొట్టుకున్నదేముంది? పొడిగించి వీళ్లు సాధించినదేముంది?

ఇంతకాలం చేసి చరిత్ర స ృష్టించాం అని గొప్పగా చెప్పుకుంటున్నారు. విజయం సాధిస్తే చరిత్ర కెక్కుతుంది తప్ప, లక్ష్యం విఫలమయ్యాక చరిత్ర కెక్కి ప్రయోజనమేముంది? ఇన్నాళ్లు సమ్మె చేసినా చలించలేదు అని ఆ క్రెడిటేదో సోనియా ఎక్కవుంటులో పడుతుంది. రెండు మూడు వారాల తర్వాత సమ్మె విరమించి వుంటే మళ్లీ కోలుకునేందుకు శక్తి మిగిలి వుండేది. ఇప్పుడు పూర్తిగా శక్తి తోడేసి, సమ్మె అంటే తెనాలి రామలింగడి పిల్లిలా భయపడి చచ్చేట్లా చేశారు నాయకులు.

సమ్మె మొదలుపెట్టిన సమయమే సరైన సమయం కాదని నేనూ, మీరూ అనుకోవడమే కాదు, స్వామిగౌడ్ స్వయంగా అన్నారు. ముందు మీ రాజీనామాలు ఆమోదింప జేసుకుని రండి, అప్పుడు మీ వెనక్కాల మేం వస్తాం అని రాజకీయనాయకులకు చెప్తూనే ఉద్యోగులను సమ్మెలోకి దింపారు. ఇప్పుడు సమ్మె విఫలమయ్యాక అంటున్నారు – ఉద్యమంలో రాజకీయ నాయకులను ఏకం చేశారట, తమ సమ్మె ద్వారా ! ఆయనకు అలా ఎలా అనిపిస్తోందో కానీ, వివిధ పార్టీల తెలంగాణ నాయకులందరూ కలిసి పనిచేస్తున్నారని నాకు మాత్రం అనిపించడం లేదు.

స్వామిగౌడ్‌కు ముందు మాట్లాడిన కోదండరాం 'ఈ సమ్మె కారణంగా పార్టీల్లో ఎవరు ఎటువైపు వున్నారో స్పష్టంగా తేలిపోయింది.' అన్నారు. అంటే తెరాస, బిజెపి మాత్రం ఉద్యోగుల సమ్మెకు మద్దతు పలకగా కాంగ్రెస్, టిడిపిలు సహకారం అందించలేదని ప్రకటించారు. కాంగ్రెస్ మంత్రులైతే సమ్మె మానేయమన్న సలహా కూడా యిచ్చారు. ఇప్పటికైనా తెలంగాణ కోరుకునేవారందరూ ఎమ్మెల్యే పదవులనుండి రాజీనామాలు చేయాలట.

ఇది పాత డిమాండే కదా, కొత్తదేముంది అనుకుంటున్నారా? ఉంది. వాళ్లు రాజీనామాలు చేయడమే కాదట, పార్టీ కూడా వీడాలట. ఇది తెరాస ఎమ్మెల్యేలకు వర్తించదండోయ్. వాళ్లు పదవికి రాజీనామాలు చేస్తే చాలు. పార్టీకి చెయ్యనక్కరలేదు. కాంగ్రెస్, టిడిపిలు మాత్రం పార్టీలకు రాజీనామా చేసి నాగం జనార్దనరెడ్డిగారిలా ఫ్రీ మాలిక్యూల్‌గా తిరగాలి. అప్పుడు వాళ్లను తెరాస ఆకర్షిస్తుందన్నమాట. ఈ పథకానికి ఒప్పుకోనివారు తెలంగాణ ద్రోహులు. వారిని నాలుగున్నరకోట్ల తెలంగాణ ప్రజలు క్షమించరు. వారి తరఫున 20,30 మంది తెరాస కార్యకర్తలు వచ్చి వారి కార్లపై కోడిగుడ్లు విసురుతారన్నమాట. ఈ స్కీములో తమ పార్టీనుండి రాజీనామా చేసిన కాంగ్రెస్, టిడిపివారు బిజెపిలో చేరకూడదు. తెరాసవారు సహించరు.

2012 జనవరికల్లా తెలంగాణ యిచ్చేయవచ్చని ప్రకటించినా అద్వానీ గారిని టి ఛానెల్ అక్కున చేర్చుకున్నట్టు లేదు. ఆయన రథయాత్ర కవరేజి లేదట. అంతకంటె ఈటీవీ మేలు. 9 గంటల వార్తల్లో ఓ అయిదునిమిషాలు లైవ్ చూపించారు. పాత పరిచయం కొద్దీ విజయశాంతి వెళ్లి కలిశారు తప్ప కెసియార్ కలిసినట్టు లేదు. బిజెపి తెలంగాణ యివ్వదని తెరాస లీడరు ఒకాయన అంటే ఖండించిన తెరాస పెద్దలు లేకపోయారు. తెలంగాణ యింకా రానేలేదు కానీ నాయకత్వంలో తాము తప్ప వేరెవరూ వుండకూడదని తెరాస భావిస్తున్నట్టుంది. బిజెపిని కూడా దూరం చేసుకుంటే దురదృష్టమే. మొన్న బాన్సువాడ ఉపయెన్నికలో ముస్లిం ఓట్లు పడలేదన్నారు. దానికి బిజెపితో సాన్నిహిత్యమే కారణం అనుకుంటున్నారో ఏమో ! లేకపోతే వాళ్లను దూరం చేసుకోవడంలో విజ్ఞత లేదు. కానీ కెసియార్ గారు కలవకపోవడం అద్వానీగారికి లాభించింది. ఎందుకంటే ఎంత కాదనుకున్నా కెసియార్ గారికి పోలవరం బురద కాస్త అంటింది.

అవినీతి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని నా ఉద్దేశం. ఏ పార్టీలో చూసినా, ఏ నాయకుణ్ని చూసినా అవినీతే. అందుకని కెసియార్ భాగస్వామికి పోలవరం కాంట్రాక్టుతో గల సంబంధం గురించి మాట్లాడడం నాకు పెద్దగా యిష్టం లేదు. ఇవన్నీ ఊహాగానాలతో చెప్పాల్సిందే. రాజంగారు, కెసియార్ గారు నమస్తే తెలంగాణలో భాగస్వాములు. అంతవరకు తేటతెల్లమే. ఇక రాజంగారు స్యూ కంపెనీలో 3% వాటాదారు అంటున్నారు. ఆయన పేర వున్నది 3% కావచ్చు. ఆయన బంధుమిత్రుల పేర ఎంత వుందో తెలియదు. ఆ కాంట్రాక్టులో యీయన స్టేక్ ఎంతో తెలియదు.

ఏమి తెలియకపోయినా ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలియవచ్చింది. ''ఆంధ్రోళ్లతో కలిసి కూర్చునే ముచ్చట లేదు. ఆఫీసుల్లో గ్రూపులుగా విడిపోయారు. మానసికంగా దూరమై పోయారు.'' అని తెలంగాణ నాయకులు చెప్పే మాటలన్నీ నీటిమూటలని మళ్లీ తేలింది. కెటియార్‌కు ఆంధ్రప్రాంతీయులతో భాగస్వామ్యం వుందని ఆయనే ఒప్పుకున్నారు. ఇప్పుడు నమస్తే తెలంగాణ పేరుతో ప్రత్యేక ఉద్యమానికి బాసటగా నిలిచిన వ్యక్తి కూడా ఆంధ్రప్రాంతీయులతో కలిసి వ్యాపారం చేస్తున్నారు. ఇక ఆంధ్ర, తెలంగాణ రాజకీయ నాయకుల కుటుంబాల మధ్య వియ్యాల సంగతి చెప్పనే అక్కరలేదు. అంటే యీ విడిపోవడాలు, కొట్లాటలు, తిట్టుకోవడాలు అంతా బూటకం అన్నమాట. సామాన్యులలో విద్వేషం రగిల్చే నాటకమన్నమాట.

రాజం గారు నాకు సన్నిహితుడు కాదని కెసియార్ అనలేరు. నమస్తే తెలంగాణను 'మా పేపరు' అనే అంటున్నారాయన. ఎవరికి ఎవరు బినామీయో తెలియదు. తెరాస ప్రతిఘటించే పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు చేజిక్కించుకోవడం యిలా బయటపడడంతో కెసియార్ యిరకాటంలో పడ్డారనే చెప్పాలి. బాబ్లీని టిడిపి ప్రతిఘటిస్తూండగానే టిడిపి వారే బాబ్లీ కాంట్రాక్టర్లని తెరాస బయటపెట్టి టిడిపిని ఎండగట్టింది. తెల్లారి లేస్తే ఆంధ్ర పెట్టుబడిదారులని అనునిత్యం తిడుతూనే వుండే తెరాస మూలస్తంభాలే యిలాటి వ్యాపారాలలో మునిగి తేలుతుంటే ప్రజలకు ఏం చెప్తారు?

వ్యాపారాలు చేసుకోవడం తప్పుకాదని తెరాస ఒప్పేసుకుంటే యిబ్బంది లేదు. కానీ యితరులను అదే పాయింటుపై తిడుతూ తాము అదే పనికి ఒడిగడితే ఎలా? కెసియార్ దీన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలని కోరడం హాస్యాస్పదంగా వుంది. లంచం తీసుకుంటూ పట్టుబడిన వ్యక్తి ఆ లంచం వెనక్కి యిచ్చేస్తానని, తనపై కేసు పెట్టవద్దని బతిమాలడంలో వింతేమీ లేదు. ఆ కాంట్రాక్టు విషయం బయటపడితే ఎలా? అన్న విషయం ఆలోచించి దానికి మొదటే దూరంగా వుంటే సరిపోయేది.

అసలు కెసియార్ యీ ఉద్యమం ఎందుకు మొదలుపెట్టారా అన్నదానిపైననే చాలా చర్చలు జరుగుతున్నాయి. ఆయన ధోరణి ఎవరికీ అంతుపట్టకపోవడం వలన రకరకాల పుకార్లు చెలరేగుతున్నాయి. ఈ కాంట్రాక్టు టిడిపికి ఆయుధాన్ని అందించినట్టయింది.

వాళ్లు కసితీరా వాడుతున్నారు. ఓ పక్క సమ్మె జరుగుతున్నా ప్రభుత్వం అడావుడిగా ఆ ఫైలు కదపడం, అదే సమయంలో ఉద్యోగుల సమ్మె విరమణ – యివన్నీ కలగలిపి చూసి కెసియార్‌కు కాంగ్రెస్‌కు కుదిరిన బేరం యిది అనేస్తున్నారు.

గతంలో చెన్నారెడ్డి వుదంతం చూసిన తెలుగు ప్రజలు, ఈయనే అదే బాపతు కావచ్చని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఆ నింద పోగొట్టుకోవడానికే యింకొన్నాళ్లు పొడిగించారేమో. లేదా స్వామిగౌడ్ వంటి నాయకులపై కేసులు కూడా వుండి వుండవచ్చు. యూనియన్ లీడర్లపై కేసులుండడం అబ్బురం కాదు. అధికారం, నిధులు పోగుపడినచోట పొరపాట్లు జరుగుతూంటాయి. జరగకపోయినా ప్రత్యర్థులు –అనగా ప్రభుత్వం, వీళ్ల చేతిలో ఓడిపోయిన నాయకులు – ఆధారాలు లేకపోయినా ఏవో కేసులు పెట్టకమానరు. వాటిపై బేరసారాలు సాగడంలో ఆలస్యమై వుండవచ్చు.

ఏది ఏమైనా మూడువారాల్లో ముగియవలసిన సమ్మె ఆరువారాలు సాగింది. ఉద్యోగులు కూడా విసిగిపోయి వుంటారు. ఉద్యమంలో పాల్గొని జైల్లో కూర్చుంటే అదో కాలక్షేపం. ఆఫీసుకి వచ్చి ఓ రెండు మూడు గంటలు కూర్చుని లంచ్ టైముకి వెళ్లిపోయి వుంటారు. కబడ్డీ ఆడడం, ముగ్గులేయడం, బతకమ్మ లాడడం వీటన్నిటికీ ఫిజికల్ ఫిట్‌నెస్ కావాలి. ఏదో టీవీ కెమెరాలముందు ఓ పావుగంట అంటే ఫర్వాలేదు కానీ వాళ్లు వెళ్లిపోయాక కూడా ఆడమంటే మాటలా? సినిమాహాళ్లు, బార్లు తెరిచి వుంచారు కాబట్టి అవి కాస్త ఆదుకున్నాయి. అవి కూడా సమ్మె అని వుంటే వీళ్లు సమ్మె మానేసేవారు. ఇంటికెళితే పెళ్లాం 'స్కూళ్లు బందయి పిల్లలు టీవీ చూస్తూ కూర్చుంటున్నారు. వాళ్లకు చదువు చెప్పమ'ని వేధించవచ్చు. ఈ కాలపు పిల్లలకు చదువులు చెప్పడం కంటె రిస్కు లేదు. మన అజ్ఞానం బయటపడితే వున్న కాస్త గౌరవం కూడా వూడ్చిపెట్టుకుపోతుంది. అందుకని పెళ్లాన్ని పుట్టింటికి పంపిన ఏ కొలీగ్ యింట్లోనో పేకాట వేసుకోవాలి. వారానికి ఓ సారి ఆడితే హుషారే కానీ వారాల తరబడి, రోజంతా ఆడడం బోరు కొట్టేస్తుంది. పైగా ఎవడి దగ్గర క్యాష్ ఆడక అంతా అరువు ఖాతాలే.

ఈ పరిస్థితుల్లో యివాళ ఆఫీసులకు నవ్వుకుంటూ పనిలోకి వెళ్లినా ఆశ్చర్యం లేదు. అవి విజయోత్సాహపు నవ్వులని స్వామిగౌడ్ భాష్యం చెప్పినా చెప్పవచ్చు. నేను బ్యాంకులో చేరేముందు ఓ పేపరు మిల్లులో కొన్ని నెలలు పనిచేశాను. అక్కడ చీటికి మాటికి సమ్మెలు చేసేవారు. యూనియన్ లీడరు సిపిఐ పార్టీవాడు. మేనేజ్‌మెంటుతో కుమ్మక్కయి సమ్మెలు చేయించి ప్రొడక్షన్ బోనస్ రాకుండా చేసేవాడని చెప్పుకునేవారు.

నిజానిజాల మాట ఎలా వున్నా మా సీనియర్ కొలీగ్ మిత్ర అనే ఆయన చెప్పాడు – "వీళ్లు జీతాలు పెంచాలంటూ ఓ సమ్మె చేస్తారండి. ఓ యిరవై రోజులు చేశాక సమ్మె విఫలమవుతుంది. పనిలో చేరతారు. సమ్మెకాలానికి జీతం యివ్వమని అడుగుతారు. మేనేజ్‌మెంట్ యివ్వం అంటుంది. అప్పుడు మళ్లీ రెండో సమ్మె. ఓ వారం అయ్యాక సరే యిస్తాం రండి అంటుంది మేనేజ్‌మెంట్. 'చూశారా, యిది కార్మికవిజయం, సమ్మె సఫలం. మేనేజ్‌మెంట్ మెడలు వంచాం' అని యూనియన్ లీడర్లు విజయధ్వానాలు చేసి అందర్నీ బుట్టలో పెట్టేస్తారు. మనబోటి వాడు – జీతాలు పెంచాలన్న మన ఒరిజినల్ డిమాండ్ అలాగేవుంది కదా – అంటే కార్మికద్రోహి, మేనేజ్‌మెంటు తొత్తు, బూర్జువా అంటూ మన నోరు నొక్కేస్తున్నారు."

ఇవాళ మన స్వామిగౌడ్ మాటలు వింటూ వుంటే అతని మాటలే గుర్తుకు వస్తున్నాయి. సమ్మె కాలానికి జీతం బదులు లీవు తీసుకుంటామంటే, అడ్వాన్సు యిచ్చి తర్వాత చూసుకుందామంటే ఇది విజయమా? సమ్మె మొదలుపెట్టడానికి కారణమైన అసలు డిమాండ్ – తెలంగాణ ఏర్పాటు – ఏమైంది? పోనీ రోడ్ మ్యాపయినా దొరికిందా? చూపించారా? కౌబాయ్ సినిమాల్లో ట్రెజర్ హంట్ సినిమాలుంటాయి. నిధి దాచిన చోటుకి ఓ మ్యాప్ గీసి మూడు ముక్కలు చేసి ఒక్కో ముక్కా ఒక్కోరికి యిస్తారు. అన్నీ అతికితేనే దారి తెలుస్తుంది. కానీ వాళ్లు కలవరు. ఒకళ్ల నొకళ్లు చంపుకుంటూ ముందుకు సాగుతారు.

తెలంగాణ రోడ్ మ్యాప్ కూడా అంతే. ముక్కలు ముక్కలుగా వుంది. తెలంగాణ కోరుకునేవారందరూ కలిస్తేనే మ్యాప్ అతుక్కుంటుంది. కానీ ఎవ్వరూ కలిసిరారు. టీవీ చర్చల్లో చూడండి. వేర్వేరు పార్టీల నుండి కూర్చోబెట్టిన నలుగురూ తెలంగాణా వారే అయినా భీకరంగా కొట్టేసుకుంటూ వుంటారు. వీళ్లందరూ కలిసి జెండాలు పక్కన పెట్టి తెలంగాణ తెస్తే అది ప్రపంచపు ఎనిమిదో వింత అవుతుందనిపిస్తుంది. 1969లో, 1972లో ఉద్యమాలు ఏకోన్ముఖంగా సాగాయి. అన్ని పార్టీలవారూ కలిసి ఉద్యమించారు. (సిపిఐ తప్ప) అయినా ఉద్యమాలు సఫలం కాలేదు. మరి యిప్పుడు యిలా కొట్టుకుంటే ఎలా? పులిస్వారీ చేస్తున్నాం. సమ్మె ఆపేస్తే మనది కుక్కబతుకే అంటూ కెసియార్ భయపెడుతూ వచ్చారు. మరి యీ రోజు సమ్మె ఆపేసి ఆఫీసులకు వెళితే ఎవరైనా వెక్కిరిస్తారా? చూడాలి. ఎవరూ వెక్కిరించకపోతే కెసియార్ తన మాట వెనక్కి తీసుకోవాలి. అనవసరంగా రెచ్చగొట్టానని ఒప్పుకోవాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 43** **ఎమ్బీయస్ : ధర్మపురివిజయం (అను) పళ్లెరాన్ని గోడకు చేర్చిన కథ**

ఎట్టకేలకు కౌన్సిల్ సీటు ధర్మపురి శ్రీనివాస్‌గారిని వరించింది. ఈలోగా అనేకమైన పేర్లు వినబడ్డాయి. కౌన్సిల్ రాజుగారికి సీటు ఖరారు అనేశారు కూడా. పీఆర్పీ నుండి వచ్చి చేరిన కోటగిరికీ ఛాన్సుంది అన్నారు. అటు తిరిగి యిటు తిరిగి డియస్‌కు వళ్లో వచ్చి

పడింది. ఇంతకుముందుసారి ఖాళీలు వచ్చినపుడు ఆయన పైరవీలు చేసుకున్నా దీనికి తగడు అన్నారు. పాపం ఆయన రాజ్యసభ సీటుకి కూడా పైరవీ చేసుకున్నారు. ఈ సారి పేద్ద లేఖ కూడా రాశారట. ఏం చేసినా, దేనికి చేసినా రెండు సార్లు ఎన్నికల్లో ఓడిపోయినవాడికి యివ్వం అనేశారుట. దాన్ని బట్టి యీసారి ఆయన ఎన్నికలలో నెగ్గడం చేత యిచ్చారనుకుంటే అంతకంటె పొరబాటు వుండదు. అప్పుడెలా వున్నారో, యిప్పుడూ అలాగే వున్నారు. అప్పుడు పనికి రాలేదు, యిప్పుడు పనికి వచ్చారు. మరి అప్పటికి యిప్పటికి తేడా ఏమిటంటే – తెలంగాణ ఉద్యమ ఉధృతి.

తెలంగాణ నుండి ఎన్నికైన శాసనసభా ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎంపీలు రాజీనామాలు చేశారు. అవి వుత్తుత్తివే అని అందరికీ తెలుసు. అయితే కొందరు మాత్రం గట్టిగా నిలబడ్డారు – జూపల్లి, కోమటిరెడ్డి వంటి వారు. తెలంగాణ ఎంపీల్లో కూడా నలుగురైదుగురు తీవ్రవాదులున్నారు. హై కమాండ్ తను చేయదలచుకున్నది చేయదలచినప్పుడు చేద్దామనుకుంటోంది. అయితే వీళ్లు వాళ్లని ఊదరగొట్టేస్తున్నారు – ఏదో ఒకటి త్వరగా చేయండి అని. లేకపోతే అది చేస్తాం, యిది చేస్తాం అంటున్నారు. హై కమాండ్ తెలంగాణ గురించి ఏం చేసినా చేయకపోయినా తెలంగాణ గురించి నిలదీసేవారిని మాత్రం ఏదో ఒకటి చేయాలనుకుంటోందని మాత్రం స్పష్టంగా కనబడుతోంది. అందుకే జూపల్లి రాజీనామా ఆమోదించారు, తాజాగా కోమటిరెడ్డిది కూడా...

ఎంపీల్లో కల్లా గొంతు చించుకుంటున్న పొన్నం ప్రభాకర్ హై కమాండ్ ఏరికోరి సెలక్టు చేసిన కిరణ్‌ను చడామడా తిట్టేస్తున్నారు. అందుకని ఆయనకూ ఓ పాఠం గరపుదామనుకున్నారు. రైల్‌రోకో సందర్భేగా పొన్నంపై కేసు బుక్కయింది. రోజంతా కోర్టు చుట్టూ, పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పారు. మర్నాడు జైలు కూడా చూపించారు. జైలు చూపించడమే కాదు, పార్టీలో తన స్థానం ఏమిటో కూడా చూపించారు. పెద్ద తలకాయలేవీ ఆయన అరెస్టును నిరసించలేదు. ఖండించలేదు. ఆయనతో బాటు తిరిగేవాళ్లు తప్ప, వేరెవరూ నోరెత్తలేదు. అది తలచుకునే పొన్నం బహిరంగంగా వాపోయారు.

నోరెత్తేవారికే యిలా మొట్టికాయలు వేస్తూ, నోరెత్తనివారికి తాయిలాలు యివ్వడానికి హై కమాండ్ నిశ్చయించుకుంది. అందుకనే డియస్‌కు కౌన్సిల్ సీటు యిచ్చింది. తెలంగాణ మంత్రులు ఖాళీ చేసిన కాబినెట్ బెర్తులున్నాయి. చక్కగా ఓ బెర్త్ ఎలాట్ చేయవచ్చు. అయితే గియితే, కిరణ్ చేతులెత్తేస్తే ముఖ్యమంత్రి కావచ్చు. కనీసం అవుతాడన్న భ్రమలు ఉద్యమవాదుల్లో కలిగించవచ్చు. తెలంగాణకు భారీ ప్యాకేజి యిస్తామంటున్నారు కదా. దాన్ని అమలు చేసే బాధ్యత నీదే ననవచ్చు. ఆ ప్రాంతీయ కమిటీకి చైర్మన్‌ను నువ్వే సెలక్టు చేయి అనవచ్చు. తెలంగాణనుండి ఉపముఖ్యమంత్రి యిచ్చినా ఆయన పాత్ర పరిమితమే. ఈ ముక్క నీలం సంజీవరెడ్డిగారు ఎప్పుడో చెప్పారు. 'నేను బెజవాడ గోపాలరెడ్డిగారి వద్ద డిప్యూటీ సిఎంగా చేశానుగా, ఏ ప్రత్యేక అధికారాలూ వుండవు. ఒట్టి ఆరోవేలు లాటిదే' అని. అలా చెప్పి పెద్దమనుష్యులు ఒప్పందంలో ఆ క్లాజును ఉల్లంఘించాడు. ఆ తర్వాత వచ్చిన చాలామంది అదే బాట పట్టారు. దానివలన తెలంగాణకు ఘోరమైన అన్యాయం జరిగినట్టు ఉద్యమకారులు అల్లాడిపోయారు.

సరే యిన్నాళ్లకు ఆ పదవేదో తెలంగాణ వ్యక్తి దామోదర రాజనరసింహకు యిచ్చారు. తెలంగాణ పరిస్థితి యింతకుముందు కంటె బాగుపడిందా? లేదనే అంటారు ఉద్యమకారులు. మరి ఆ మాత్రం దానికి యింత అడావుడి ఎందుకు? ఇచ్చినా ఏదీ ఊడిపడనప్పుడు, యివ్వకపోతే ఏం కొంప మునిగిపోయిందట? కావలసినది ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు. అవి తెలంగాణవారికి ఎప్పుడూ దక్కుతూనే వున్నాయి. అందుకే వాళ్లు వూరుకున్నారు. దక్కాక వాళ్లు తమ ప్రాంతానికి ఏం చేశారు అని అడగవద్దు. తక్కినవాళ్లు ఏం చేశారో వాళ్లూ అదే చేశారు. ఆంధ్రప్రాంతం వాళ్లూ తమ ప్రాంతాలను బాగు పరచలేదు. పరచి వుంటే యిప్పటికీ ఆ ప్రాంతీయులు ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం తెలంగాణకు రావలసిన అవసరమే వుండేది కాదు.

నేను చెప్పదలచినది ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కంటె డియస్‌కు ఎక్కువ అధికారం కట్టబెట్టే ఛాన్సుంది అని. తెలంగాణ గురించి హై కమాండ్ తీసుకోబోయే నిర?యాన్ని తెలంగాణ కాంగ్రెస్ వాదులకు నచ్చచెప్పి ఒప్పించే బాధ్యత ఆయనపై పెట్టవచ్చు. ఎందుకంటే 2009 ఎన్నికలలో టిక్కెట్లు పంచినది ఆయనే కనుక ఆయనతో వాళ్లందరికీ సత్సంబంధాలున్నాయి. హై కమాండ్‌కు ఆయన దగ్గర అన్న యిమేజ్ కూడా వుంది. 2009 ఎన్నికల తర్వాత తనకు పోటీదారుగా ఎదుగుతాడనే భావంతో వైయస్ ఆయన్ని ఓడించారనే ఓ పుకారు ప్రచారంలో వుంది. దాన్ని హై కమాండ్ నమ్మిందన్న పుకారూ వుంది. తను నెగ్గి వుంటే వైయస్ హఠాత్తుగా పోయిన తర్వాత ఆ పదవి తననే వరించేదని డియస్ ఆత్మీయులతో చెప్పుకుని బాధపడ్డారన్న పుకారూ వుంది. 2010లో తనకు యిష్టం లేకపోయినా హై కమాండ్ మాటకు తలవొగ్గి ఉపయెన్నికలలో ఓడిపోయి పరువు పోగొట్టుకున్నారన్న సింపతీ మనకున్నా లేకపోయినా హై కమాండ్‌కి వుందట. అందుకనే హై కమాండ్ డియస్ పట్ల సానుకూలత ప్రదర్శించి, తమ రూలు తామే పక్కనపెట్టి కౌన్సిల్ సీటు యిచ్చిందట.

2009లో ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడిగా డియస్ చేసినదేమీ లేదు. బొత్స యిప్పుడు చూపిస్తున్న చురుకుదనంలో పావు వంతు కూడా ఆయన చూపలేదు. భారీగా అడుగులేసుకుంటూ నవ్వు మొహాన్న పులుముకుని అస్పష్టమైన సమాధానాలు యివ్వడం తప్ప ఎవర్నీ ఉత్తేజపరచలేదు. మరి అలాటి ఆయన తెలంగాణపై హై కమాండ్‌కు అనుగుణంగా టికాంగ్రెస్ నాయకులను ఎలా మలచగలడు? ఎలా అంటే తన ఉదాహరణ చెప్పి ! ''చూడండి, 2010 ఉపయెన్నికలలో నేను ఓటర్లకు ఏం చెప్పాను? నన్ను గెలిపిస్తే తెలంగాణను బంగారు పళ్లెరంలో తెచ్చి యిస్తా..అని. వాళ్లు గెలిపించలేదు. నేను ఆ పళ్లెరాన్ని గోడకు చేర్చి పెట్టేశాను. అసలు ఎంత బంగారు పళ్లెరానికైనా గోడ చేర్పు అవసరమయ్యా. పెద్దలు అదే చెప్పారు. ఆ గోడ ఏమిటి? మన హై కమాండ్.

తెలంగాణ పల్లెరాన్ని హై కమాండ్ చేతిలో పెట్టి వూరుకోండి. అలా చేర్చినందుకే నాకు యీ కౌన్సిల్ సీటు దక్కింది. అలాక్కాదు, ఆ పల్లాన్ని చూపిస్తూ వీధులెంట తిరుగుతానంటారా, కోమటిరెడ్డిలాగ నిరాహారదీక్షలోనో, పొన్నం లాగ జైల్లోనో తేలతారు." అని ధర్మపురి విజయగాథను వినిపించి వాళ్లకు విశదీకరిస్తారు. తన స్వీయానుభవం జోడించి చెపితే విననివాళ్లుంటారా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 49** **ఎమ్బీయస్ : హమ్మయ్య... తేటపడుతోంది**

హమ్మయ్య, కాంగ్రెస్ నుండి కూడా తెరాసలోకి వలసలు ప్రారంభమయ్యాయి. ఇలా క్లారిటీ వస్తూంటే చాలా హాయిగా, సుఖంగా వుంది. వరదలు వచ్చినపుడు నదిలో బురదనీళ్లు వస్తాయి. పైనుండి వచ్చేటప్పుడు ఆ నది ఎక్కడెక్కడో తిరిగి వస్తుంది కాబట్టి నానారకాల పదార్థాలనూ వెంటబెట్టుకు వస్తుంది. చిన్నచిన్న గులకరాళ్ల దగ్గర్నుంచి, మట్టీ మశానంతో సహా అన్నిటికి పట్టుకుని వచ్చి మన కుండలో చేరుస్తుంది. ఆ నీళ్లలో పారదర్శకత వుండదు. కుండ అడుగున ఏముందో ఆనదు. ఆ నీళ్లు నోట్లో పెట్టుకోవచ్చో, పెట్టుకోకూడదో తెలియదు. అలాటప్పుడు యిండుపకాయ అరగదీసి కలుపుతారు. కాస్సేపటికి మట్టి, నీళ్లు వేరుపడతాయి. మంచినీరు పైకి తేలుతుంది. మట్టి కిందకు చేరుతుంది. అప్పుడు నీళ్లు పారదర్శకంగా కనబడతాయి. అందుకే ఓర్చుకున్న అమ్మకు తేటనీరు అనే సామెత వచ్చింది. ఓపిక పడితే వేటికవి వేరుపడి దూధ్ కా దూధ్, పానీ కా పానీ అనే సామెతను నిజం చేస్తాయి. (ఉత్తినే అన్నా, ఆ సామెత నిజం చేయాలంటే మన తాతలు, లేదా హంసలు దిగిరావాలి)

అయితే యిండుపకాయ కలపకపోతే ఆ నీళ్లు ఎప్పటికీ బురద బురదగా వుండి నీళ్లెంతో, మట్టి ఎంతో ఎప్పటికీ తేలదు. ఇప్పటిదాకా తెలంగాణ కాంగ్రెస్ స్వరూపం అస్పష్టంగానే వుంది. తెలంగాణ యిచ్చి తీరాలనే విషయంలో మితవాదులు, అతివాదులు, అత్యంతవాదులు.. అన్ని రకాలూ చేరి గందరగోళ పరిచారు. కాస్సేపు నానా అడావుడి చేసి, ఇంకాస్సేపు ఏమీ చేయకుండా వున్నవాళ్లున్నారు. ఎంపీలు ఒకవైపు, ఎమ్మెల్యేలు యింకోవైపు. మంత్రులు మరీ యింకోవైపు. ఎంపీల్లో కూడా హాక్స్ (డేగలు) వున్నారు, డవ్స్ (పావురాలు) వున్నారు. పార్లమెంటుకి అస్సలు వెళ్లనివారున్నారు, వెళ్లి సంతకం పెట్టి వచ్చేసినవారున్నారు. సంతకంతో పాటు ఓటేసి వచ్చేసినవారున్నారు. కాబినెట్‌లో వుండి లాబీయింగ్ చేసేస్తున్నా కాబట్టి రాజీనామా చేయలేనన్నవారున్నారు, రైల్ రోకోలకు దిగి జైలు కెళ్లినవారున్నారు, సిఎంను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టినవారున్నారు. సిఎం ఏం చేస్తాడు పాపం అని వూరుకున్నవాళ్లున్నారు.

రాష్ట్రమంత్రుల్లో సచివాలయానికి వెళ్లినవారున్నారు, యింటి దగ్గర్నుంచే దస్తాలు దస్తాలుగా దస్త్రాలు చూసినవారున్నారు, రాజీనామా చేసి పాదయాత్రకు దిగినవారున్నారు, (అలా నడుచుకుంటూ వెళ్లి దారిలో తెరాస భవనం కనబడితే లోపలికి దూరిపోయారు) ఎమ్మెల్యేలలో మళ్లీ రాజీనామా చేసినవారున్నారు, తల్లికి అనారోగ్యమంటూ చేయనివారున్నారు, చేయక్కరలేదని చెప్పి చేయకుండా కూర్చున్నవాళ్లున్నారు, ఆమోదించలేదేమని స్పీకరుపై విరుచుకుపడిన వారున్నారు, సమావేశాలు రానివాళ్లున్నారు, వచ్చి నిలదీసేవారున్నారు, రైలు రోకోలో పాల్గొని అరెస్టయినవారున్నారు. జగన్ కోసం రాజీనామా చేశామంటూనే తెలంగాణ పక్షాన నిలిచినవారున్నారు. ఓ రాజీనామా జగన్‌కోసం, మరో రాజీనామా తెలంగాణకోసం అనేవారున్నారు.

ఇలాటి వారినందరినీ విడగొట్టడానికి కాబోలు కాంగ్రెస్ తెలంగాణపై నిర?యం అనే యిండుపకాయ గంధం కలపాలనుకుంది. అందుకని సానపీటమీద యిండుపకాయ వేసి నూరడం మొదలుపెట్టింది. నూరుతోంది, నూరుతోంది, నూరుతోంది. దాంతో బురదనీళ్లకే ఓర్పు పోయింది. ఈ గంధం ఎప్పుడు కలుపుతుందో ఏమో అనుకుని కుండలో కుండలోనే విడిపోయే ప్రాసెస్ ప్రారంభించేసింది. అదీ కాంగ్రెస్ 'హస్త'వాసి ! గంధం కలపకుండానే పని జరిగిపోతోంది. ఎందుకంటే ఆ నూరే విధానంలోనే తెలిసిపోతోంది – యిది ఇప్పట్లో తేలేది కాదని. ఇవాళ చిదంబరంగారు చెప్పారు – తెలంగాణ నిర?యం దిశగా కదలిక వుందని. రేపు కదలిక దిశగా ఆలోచన వుందని, మర్నాడు ఆలోచన దిశగా దృష్టి వుందని చెప్తారు, ఆ మర్నాడు దృష్టి దిశగా నిర?యం వుందని, ఆ తర్వాత ఆ దృష్టి నిర?యం దిశగా కదలిక వుందని... అయ్యా యిది అనంతం !

పంచపాండవులంటే మంచంకోళ్లలా ముగ్గురు అంటూ ఒకావిడ రెండువేళ్లు చూపించబోయి... అనే సామెత చెప్పినట్టు, అక్టోబరు నెలాఖరులోగా తెలంగాణపై నిర?యం ఎలాగూ వస్తోంది, ఈలోగా సమ్మె ఎందుకు అంటూ చెప్పిన ఢిల్లీ నాయకులు యిలా రోజురోజుకి వెనక్కి నెట్టేస్తే ఏమిటి దాని కర్థం? దసరా అన్నారు, రంజాన్ అన్నారు, దీపావళి అన్నారు, ఇప్పుడు బక్రీద్‌ట. అమావాస్యకు, అత్తరు సాయిబుకి సంబంధం ఏమిటన్న పాత సామెతలాగ బక్రీద్‌కీ తెలంగాణ నిర?యానికీ సంబంధం ఏమిటండి? నాకైతే ఒకటే సంబంధం కనబడుతోంది. బక్రీద్‌లో మేకలు బలవుతాయి. ఇక్కడ మన తెలుగువాళ్లమందరం బలి ఔతున్నాం. సామూహిక బలి. అవైతే తినడానికి పనికి వస్తాయి. మనం దానికీ పనికిరాము. మరి ఎందుకు బలి వేస్తున్నారో తెలియదు.

మనం ఎవరైనా ఫ్రెండ్ యింటికి వెళ్లామనుకోండి. అతను భోజనానికి వుండమని బలవంత పెడతాడు. లోపల కిచెన్‌లో గిన్నెల చప్పుడు వినబడుతోంది. మనవాడు అది వినడు కానీ మనకు వినబడుతుంది. ఎందుకులే, వచ్చేసారి తప్పకుండా వస్తాగా అంటాం. కానీ అతను వినడు. చివరకు వంటింట్లోంచి "ఏవండీ, మిమ్మన్నే.." అని కేక వినబడుతుంది. కాస్సేపటికి వాడు బయటకు వచ్చి

మోహాన నవ్వు పులుముకుని "నువ్వు ఎలాగైనా భోజనానికి వుండాలంటోంది మా ఆవిడ." అంటాడు. ఆవిడా బయటకు వచ్చి "అన్నయ్యగారూ, మొహమాటం వద్దు" అని మొహమాటానికి అనేసి లోపలకి వెళ్లిపోతుంది. ఎప్పటికీ బయటకు రాదు. మనవాడు కబుర్లలో పెట్టి వుంచుతాడు. మధ్యమధ్యలో లోపలకి వెళ్లి వస్తాడు. ఖాళీ గిన్నెల చప్పుడు, గరిటెలు కింద పడేసిన చప్పుడు, గొణుగుళ్లు, సణుగుళ్లు.. యథావిధిగా సాగుతాయి.

మనకు అర్థమై "నాకు బస్సు మిస్సవుతుంది, ఈ సారికి నన్ను వెళ్లనీ.. మళ్లీసారి తప్పకుండా.." అన్నా వీడు చేయి పట్టుకుని వెళ్లనీయడు. ఎందుకంటే వాడికి ప్రెస్టేజి క్వశ్చన్. "నీకెందుకురా సందేహం? ఆవిడే స్వయంగా వచ్చి పిలిచింది కదా.." అంటాడు. "ఏం పిలుపు? నా తలకాయ పిలుపు. మొక్కుబడిగా అంది కానీ దానికి ఫాలోఅప్ లేదు కదా.." అని మనకు లోపల ఫీలింగ్. అంతలో వీడికి పిలుపు వస్తుంది లోపల్నుంచి. వడ్డిస్తాను, కాళ్లు, మొహం కడుక్కోమంటోందేమోనని మీరు కళ్లజోడు తీసి జేబులో పెట్టుకుంటూ వుంటే వాడు బయటకు వచ్చి అమృతాంజనం సీసా లోపలకి పట్టుకెళ్లి యిచ్చి వచ్చి "పాపం తలకాయ నొప్పి, వంటమీద కాన్సన్‌ట్రేట్ చేయలేకపోతోంది." అంటాడు. ఆ తర్వాత ఇంకో అరగంటకు ఆవిడ భుజంమీద తువ్వాలు వేసుకుని, బుర్రున చీదుతూ, జుట్టు చెదరగొట్టుకుని మీ ఎదుటే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుంటుంది. "కాస్త రెస్టు తీసుకుంటానంది. దానికేముందిలే, కాస్త ఆలస్యమైనా మంచి వంటకాలతో పెట్టమన్నాను" అని మీవాడు అంటాడు. ఈ పరిస్థితిలో మీరేం చేస్తారు? ఇంకా అవేళ ఆ యింట్లో భోజనప్రాప్తి వుందనే నమ్ముతారా? లేక ఏదో అర్జంటు కాల్ వచ్చినట్టు నటించి బయటకు పారిపోయి వేరే పనులు చూసుకుంటారా? తెలంగాణ కథ యింతకంటె తేడాగా ఏమైనా వుందా చెప్పండి.

మాటవరసకి వెలువడిన డిసెంబరు 9 ప్రకటన తప్ప తెలంగాణపై ఆశ పెట్టుకోవడానికి ఏమైనా ఆధారం వుందా? యుపిఏ మాట యిచ్చిందిగా, వెనక్కి ఎలా వెళుతుంది? అని యీ నాయకులు ఆశ్చర్యపడతారు. వీళ్లేదో సత్యహరిశ్చంద్రుళ్లలా ! మాటంటే మాటే అని ఫీలయ్యే రాజకీయనాయకులు యిప్పటిదాకా కనబడలేదు. మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ చేసేస్తే వచ్చే ఎన్నికలకు పాయింట్లు లేకుండా పోతాయి వీళ్లకు. యూపిఏ 1 2004లో రాష్ట్రపతి ప్రసంగంలో చేర్చలేదా? కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెట్టలేదా? అంటున్నారు. ఆనాటి ప్రసంగంలో, ఆ సిఎంపిలో పెట్టిన తక్కిన అంశాలన్నీ నెరవేర్చేసినట్టు, యిదొక్కటే మిగిలినట్టు వీళ్లు మాట్లాడతారు. ఈ రాష్ట్రపతి ప్రసంగాలు, గవర్నరు ప్రసంగాలూ అవన్నీ ఎవరం వినం. ఎందుకంటే దారిద్ర్యాన్ని రూపుమాపుతామని, పేదలను ఉద్ధరిస్తామని, అవినీతిని పారద్రోలుతామని.. యిలాటి డచ్చా కబుర్లే వుంటాయి వాటిల్లో. తెలంగాణ విషయంలో అలాటి ప్రామిస్ కూడా చేయలేదు. కాన్సెన్సస్‌తో, ఎప్రాప్రియేట్ టైమ్‌లో (సరైన టైములో, అధికజనుల ఆమోదంతో) యిచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

'సరైన టైములో సరైన నిర?యం' అనే పదబంధం తెలంగాణ విషయంలో అతిగా వాడడం వలన నవ్వు పుట్టించే పదం అయిపోయింది. జీవితచరిత్ర పేరుతో దగ్గరైన లక్ష్మీపార్వతి ఎన్టీయార్ భార్యగా తేలడంతో అప్పట్లో రొమాన్సు చేయడానికి 'జీవితచరిత్ర రాసుకోవడం' అనే పేరు పెట్టి సినిమాల్లో పేరడీ చేశారు. ఇప్పుడు 'స.టై.స.ని.' కూడా అలాగే తయారైంది. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకుల నోట అది వినబడుతూంటే భలే నవ్వు వస్తుంది. 'కాంగ్రెస్ తెలంగాణ యిచ్చేస్తుంది. ఆ మాటకొస్తే యిప్పటికే యిచ్చేసింది కూడా. ఇక పట్టుకుని రావడమే మిగిలింది. మధ్యలో ఆ సీమాంధ్రులు అడ్డు తగులుతున్నారు. వాళ్లకు రాజధాని ఏదో చెప్పి పంపేసి, పట్టుకుని వస్తున్నారు. కాస్త ఓపిక పట్టండి' అనే పాట టికాంగ్రెస్ నాయకులు ఏళ్ల తరబడి పాడుతూ వుంటే వీళ్లు నిజంగా తెలంగాణ తెస్తారని నమ్మే ప్రజలుంటారా?

మొన్న బాన్సువాడలో కాంగ్రెస్ కాండిడేటుకు ఓట్లేసినవారు తెరాసకు వ్యతిరేకంగా వేసినవారు తప్ప కాంగ్రెస్ తెలంగాణ యిస్తుందన్న నమ్మకంతో కాదు అని నేను రాస్తే కొందరు నాతో విభేదించారు. లేదు లేదు, కాంగ్రెస్ తెలంగాణ యివ్వనని చెప్పలేదు కదా అని. నోటితోనే చెప్పాలా స్వామీ, చేత్తో చెపితే చాలదూ? ఆ ఆశాజీవులకు ఓ దణ?ం పెట్టి పూరుకుంటున్నాను. అయితే ఈ ఆశాజీవులకు వున్నంత ఆశ టి కాంగ్రెస్ నాయకులు కొందరిలో లేకపోవడం వలన వాళ్లు గోడ దూకుతున్నారని గ్రహించాలి.

టిడిపి విషయంలో కూడా యిదే లాజిక్ పనికి వస్తుంది. వాళ్లూ తెలంగాణ యివ్వం అని చాటి చెప్పలేదు. ఆ మాటకొస్తే వాళు
్లు కాంగ్రెస్ కంటె యీ విషయంలో ఓ మెట్టు పైనే వున్నారు. 'తెలంగాణ గురించి ఏ విషయం చెప్పనివాళ్లలో మా పార్టీ కూడా వుంది' అని చిదంబరం బహిరంగంగా చెప్పారు. టిడిపి అయితే ప్రణబ్ కమిటీకి లేఖ యిచ్చారన్న క్రెడిటైనా తీసుకోవచ్చు. ఆ లేఖ వెనక్కి తీసుకోలేదు. ఆ కమిటీ మురిగిపోయిందన్నది వేరే విషయం. కాంగ్రెస్ ఆ లేఖ కూడా యివ్వలేదు కదా. 2009 మ్యానిఫెస్టోలో టిడిపి స్పష్టంగా చెప్పింది – తెలంగాణ యిస్తామని, కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో అదీ చెప్పలేదు. టిడిపి ఇంత చేసినా అది తెలంగాణ యిస్తుందన్న నమ్మకం ఆ కార్యకర్తలకు లేదు, నాయకులకు లేదు. అందుకనే వాళ్లూ కంచె దాటి వచ్చేసి తెరాసలో దూరుతున్నారు.

కాంగ్రెస్ నుండి అయిదారుగురు ఎంపీలు, అంతకు రెట్టింపుమంది (అనగా పదిపన్నెండు) ఎమ్మెల్యేలు తెరాసవైపు రావచ్చని అంచనాలున్నాయి. కాంగ్రెస్ హై కమాండ్ కూడా యీ సంఖ్యకు సిద్ధపడి వుంది. ఆ మాటకొస్తే ఎప్పుడో సిద్ధపడింది కాబట్టే పీఆర్పీని కలుపుకుని కూర్చుంది. మజ్లిస్‌ను దువ్వుతూ కూర్చుంది. జగన్‌కోసం రాజీనామాలు యిచ్చినవాళ్లు గట్టిగా పట్టుపట్టరని అనుకుని వుంటారు. నిజంగా పట్టంటూ పడితే వాళ్ల పని పట్టడానికి జగన్‌పై సిబిఐ దాడులు ముమ్మరంగా సాగించి, ఆయుధాలు చంకలో పెట్టుకుని కూర్చున్నారు.

ఇంతమంది పోయినా ఫర్వాలేదు కానీ తెలంగాణ యిస్తామని అనకూడదు అని కాంగ్రెస్ హఠం వేసుకుని కూర్చుంది అనే విషయం తేటతెల్లం. దసరా నుండి దూకుడుగా వెళ్లమని కిరణ్‌కు ఆదేశాలిచ్చారు కాబట్టే సమ్మెలు టకటకా కట్టేశాయి. ఎవర్ని ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కి వుంటారు. సమ్మె చేసిన ఉద్యోగులకు జీతాలు యిచ్చేస్తారని మొదట్లో పుకార్లు వచ్చాయి కానీ అవేమీ జరగలేదు. నో వర్క్, నో పే అని ఖచ్చితంగా తేల్చారు. కావాలంటే జీతం అడ్వాన్సుగా యిస్తాం, మళ్లీ రాబడతాం అంటున్నారు. సింగరేణి వాళ్లకు కూడా సమ్మెకాలం బదులు సిక్ లీవుగా పరిగణిస్తారట. అంటే ఆ మేరకు లీవు పోయినట్టేకదా !

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇంకో అనుబంధ ఎమ్మెల్యే తెరాసలో చేరారు. తర్వాతి కాండిడేటు కోమటిరెడ్డి కావచ్చు. ఆయన తన వెంట ఒక ఎంపీ, యిద్దరు ఎమ్మెల్యేలు వున్నారంటున్నారు. ఇప్పటిదాకా టిడిపి వారు చేరారు. ఇకపై కాంగ్రెస్‌వారు చేరతారు. ఇది జరగడం చాలా మంచిదవుతోంది. ఎందుకంటే తెలంగాణ కోసం నిలబడే ఏకైక పార్టీగా తెరాసనే ప్రజలు గుర్తించారు. కాంగ్రెస్, టిడిపి రాష్ట్రవిభజనకు అనుకూలం కాదని, వాళ్లు చెప్పే మాటలన్నీ పైపై కబుర్లే అనీ అందరికీ తెలుసు. ఒకరినొకరు ఎద్దేవా చేసుకోవడం తప్ప వాళ్లకు ప్రత్యేక తెలంగాణపై చిత్తశుద్ధి లేదు. ప్రత్యేక ఉద్యమం తెరాస పతాకం కిందనే జరగడం న్యాయం. ఆ పతాకం కింద ఎంతమంది చేరదలచుకున్నారో వారందరూ చేరిపోతే తెరాస బలం ఎంతో క్లియర్‌గా తెలిసిపోతుంది. అప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో, ఎలా పోరాడాలో యితర పార్టీలలో స్పష్టత వస్తుంది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో తెరాసకు ప్రజల నుండి అదుతేమైన మద్దతు వున్నట్టు మీడియా చిత్రీకరిస్తోంది. అది చూసి గందరగోళపడిన కాంగ్రెస్‌లో, టిడిపిలో వున్న తెలంగాణ లీడర్లు వాళ్ల వాళ్ల అధినాయకత్వాలపై వొత్తిడి తెస్తూ వాళ్లనీ గందరగోళ పరుస్తున్నారు. తెలంగాణ యిస్తే ఆ లాభం తెరాసకు పోతుందేమో, అదేదో మనమే యిచ్చేస్తే మంచిది అని నొక్కి చెప్తున్నారు. 2009లో కడియం, ఎర్రబెల్లి వంటి నాయకులు చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చారు – మీరు తెలంగాణకు సై అంటే చాలు, తెరాసతో పొత్తు పెట్టుకుంటే చాలు, మనదే అధికారం అని. బాబు ప్రలోభపడ్డారు. ఎన్టీయార్ ప్రవచించిన సమైక్యవాదాన్ని తుంగలో తొక్కి ప్రత్యేకవాదాన్ని తలకెత్తుకున్నారు. చివరకు ఏం దక్కింది? బాబు సమైక్యవాదాన్నే అంటిపెట్టుకుని వుండి వుంటే డిసెంబరు 9 ప్రకటన తర్వాత ఆంధ్రప్రాంతంలో టిడిపికి ఎదురు లేకుండా వుండేది. తెలంగాణలో అంతో యింతో బలం మిగిలేది. కానీ డిసెంబరు 10 నుండి సాగిన ఆంధ్రప్రాంతీయుల రాజీనామాల పాపాన్ని బాబు నెత్తికి చుట్టేసి తెరాస అల్లరి పెట్టడంతో తెలంగాణలో బాబు అంటే రోత పుట్టింది. అసలు దోషి అయిన కాంగ్రెస్ కంటె బాబుకే చెడ్డపేరు వచ్చింది. ఇప్పుడు ఆంధ్రలో టిడిపి బలం మూడోవంతు సీట్లు మాత్రమే. తెలంగాణలో ఏ పదో వంతో !

తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తమ అధిష్టానాన్ని ఎన్నిసార్లు తప్పుదోవ పట్టించారో చెప్పనే అక్కరలేదు. తెలంగాణ యిస్తే చాలు, తెలంగాణలో సీట్లన్నీ మనవే అనీ, కెసియార్ మన పార్టీలో చేరతాడనీ, యివ్వకపోతే తిరుక్షవరం అయిపోతామనీ (బాన్సువాడలో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ దక్కి యింకా పైగా ఓట్లు వచ్చినందుకు వీళ్లెంత దుఃఖించి వుంటారో వూహించవచ్చు) తమకు వూళ్లల్లో తిరిగే పరిస్థితి లేదనీ (గత రెండేళ్లగా వీళ్లు స్వంత వూళ్లు వెళ్లలేదని రాసి యివ్వగలరా?) .. యిలా ఏవేవో చెప్తూ వచ్చారు. వీళ్ల మాటలు విని గందరగోళపడిన అధిష్టానం కాస్సేపు విభజనకు అనుకూలంగా ప్రవర్తించి, మరి కాస్సేపు వెనక్కి వెళ్లి రకరకాల సంకేతాలు యిచ్చింది.

చివరకు ఓ నిశ్చయానికి వచ్చి తెలంగాణ యిప్పట్లో యివ్వకూడదని తేల్చుకున్నట్టుంది. అందుకే నెలల తరబడి సమ్మెలు జరిగినా చలించకుండా, బెదరకుండా కూర్చుంది. ఐరన్ హ్యాండ్‌తోనే డీల్ చేస్తూ రైల్ రోకోలో స్వంత పార్టీ ఎంపీలనే అరెస్టు చేయించి జైలుకి పంపింది. తెరాస ద్వారా టిడిపిని కబళించవచ్చని నమ్మిస్తూ వచ్చిన టి కాంగ్రెస్ నాయకులు, తెరాస తమ పార్టీ వాళ్లనే కబళించడం మొదలుపెట్టడంతో ఏం చెప్పుకోవాలో తెలియని దురవస్థలో పడ్డారు. దానికి తగ్గట్టు ముగ్గురు ఎమ్మెల్యేలు చేరిన జోష్‌లో కెసియార్ 'కాంగ్రెస్సే తెరాసలో విలీనం అవుతుందంటూ' గొప్పలకు పోయారు. ఇక తెరాసను భుజాన మోస్తూ వచ్చిన కేకే ప్రభృతులు డిఫెన్సులో పడ్డారు. 'తెలంగాణ యిస్తే మన పార్టీలో విలీనం అవుతాడని చెప్తూ వచ్చిన కెసియారేనా యితను?' అని అధిష్టానం వెక్కిరిస్తే ఏం చెప్తారు పాపం!

పాత కథ ఒకటి వుంది. ఒకతను ఎవడికో అప్పు ఎగ్గొట్టాడు. అవతలివాడు కేసు పడేస్తే యితను లాయర్ని ఆశ్రయించాడు. లాయరు ఐడియా చెప్పాడు – "కోర్టులో ఏం అడిగినా వెర్రివాలకం వేసుకుని బ్బెబ్బెబ్బే అను. తర్వాత నేను చూసుకుంటాను." అని. వీడు అలాగే అన్నాడు. లాయరు వాదించాడు – "చూశారా, మై లార్డ్, మా క్లయింటు ఉట్టి అమాయకుడు. ఏమీ తెలియనివాడు. సరిగ్గా మాట్లాడడం కూడా రానివాడు. అలాటివాడి చేత అన్యాయంగా ప్రోనోటుమీద సంతకం చేయించేసుకుని కేసు పెట్టారు." అని. జడ్జిగారికి నిజమేననిపించి కేసు కొట్టేశారు. లాయరు వీడి దగ్గరకి వచ్చి "చూశావా, నా ప్రజ్ఞ, కేసు ఎలా కొట్టించేశానో, నా ఫీజు యిచ్చేయ్" అన్నాడు. వీడు లాయరుకేసి చూసి 'బ్బెబ్బెబ్బే' అన్నాడు. "ఇదేమిటయ్యా? నాకూ 'బ్బెబ్బెబ్బే'నా?" అన్నాడు లాయరు తెల్లబోతూ. "నీకూ 'బ్బెబ్బెబ్బే', నీ బాబుకీ 'బ్బెబ్బెబ్బే'" అన్నాడు మన గడసరి.

అలాగ టిడిపి ఎమ్మెల్యేలను తెరాస కలిపేసుకుంటూన్నంతసేపూ కాంగ్రెస్ చంకలు గుద్దుకుంటూ వుంది. కేకే, కెసియార్ తెగ మంతనాలాడేశారు. టిడిపిపై ప్రయోగించిన చిట్కాయే యిప్పుడు కాంగ్రెస్‌పై ప్రయోగించింది తెరాస. అందరూ రాజీనామాలు చేయాలి అన్న డిమాండు నుండి తమ తమ పార్టీలకు రిజైన్ చేయాలి అన్న డిమాండు కూడా గత వారం నుండీ మొదలుపెట్టారు.

(ఈ షరతునుండి తెరాసవారికి మినహాయింపు వుంది). తెరాస ఉద్దేశం స్పష్టం. తెలంగాణ రావడం మాట ఎలా వున్నా తాను రాజకీయంగా బలపడాలి. తెలంగాణలో తన పార్టీకి ఎదురు వుండకూడదు. ప్రజాబలం వున్నవారందరూ తమ యితర పార్టీలు వదిలి తమ జెండా కిందకే రావాలి. 2014 ఎన్నికలలో తాము ఒక గణనీయమైన శక్తిగా నిలబడాలి. అందుకే కెసియార్ 2014 ఎన్నికల గురించి మాట్లాడుతున్నారు. ఇది పెర్‌ఫెక్ట్‌లీ ఓకే. తప్పు పట్టవలసినది ఏమీ లేదు. కాంగ్రెస్ కానీ, టిడిపి కానీ తెరాస వారెవరైనా తమ పార్టీలోకి వస్తూ వుంటే వద్దంటారా? ఆపరేషన్ ఆకర్ష్ అంటూ అందర్నీ లాక్కుని వస్తారు. అదే వికర్ష్ అయితే గగ్గోలు పెడతారు. అందువలన వాళ్ల కాకిగోల మనం పట్టించుకోనక్కరలేదు.

తెరాస యిలాగే ముందుకు సాగాలని నా కోరిక. నాగం జనార్దనరెడ్డిగారు కూడా సరిగ్గా బేరమాడుకుని తెరాసలో చేరిపోతే యిక చిక్కు వుండదు. ఆయన వెనక్కాలవాళ్లు యిప్పటికే తెరాస దారి పట్టారు. ఈయనదే ఆలస్యం. ఈ విధంగా తెరాస బలం ఏ 40కో చేరితే వాళ్లూ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు. ఇప్పుడు చాలా తక్కువ సీట్లు వున్నాయి కాబట్టి యిష్టం వచ్చినట్టు వాగ్దానాలు చేసేస్తున్నారు. తెలంగాణ వస్తే అవి యిస్తాం, యివి యిస్తాం, వీళ్లని తరిమేస్తాం, వాళ్లని తరిమేస్తాం అంటున్నారు. ఓ 40 దాకా సీట్లు చేతిలో వుంటే ఆ పైన 30 సీట్లు ఎలా పొంది ప్రభుత్వం ఏర్పరచుకోవాలి, ఎవరితో పొత్తు కుదుర్చుకోవాలి? పొత్తు కుదుర్చుకోవాలంటే ఏయే అంశాలపై రాజీ పడాలి? సమాజంలో ఎన్ని వర్గాలకు హామీలివ్వాలి? వాళ్లను ఎలా శాంతపరచాలి? అని సీరియస్‌గా ఆలోచిస్తారు. ఆరెస్సెస్ వాళ్లు తక్కువ సంఖ్యలో వుంటారు కాబట్టి మైనారిటీ పట్ల వారి పదజాలం చాలా తీవ్రంగా వుంటుంది. అదే బిజెపి అయితే సంఖ్యాపరంగా చాలా పెద్దది కాబట్టి, అధికారానికి చేరువలో వుంది కాబట్టి కాస్త మోడరేట్‌గా, అనునయంగా మాట్లాడతారు. తక్కినవాళ్ల మాట కూడా మన్నిస్తారు.

అందువలన ఏదైనా పార్టీ పెద్దదవుతున్నకొద్దీ దాని ఐడియాలజీ యొక్క ఆమోదయోగ్యత పెరుగుతుంది. విపక్షంలో వుండగా నిప్పులు చెరిగినవారు కూడా అధికారపక్షంలోకి వచ్చిన తర్వాత కాస్త శాంతించడానికి కారణం యిదే. ఎందుకంటే అధికారం అంటే బాధ్యత. విపక్షంలో వుండగా రైతులకు లక్షకోట్లు, నిరుద్యోగులకు లక్షకోట్లు, మహిళలకు లక్షకోట్లు బజెట్‌లో కేటాయిస్తామని ఎడాపెడా చెప్పేయవచ్చు. కానీ అధికారంలోకి వచ్చాక తెలుస్తుంది, బజెట్‌లో అంత అవకాశం లేదని. స్కూలులో చూడండి బాగా అల్లరి చేసే కుర్రవాడికే క్లాసు లీడర్‌షిప్ అప్పగిస్తారు. వాడిలో ఆటోమెటిక్‌గా వినయం వచ్చి తక్కినవాళ్ల మాట వినడం మొదలుపెడతాడు. లేకపోతే లీడర్‌షిప్ అతని చేతిలోంచి జారిపోతుంది. అందువలన తెరాస పెద్దదవుతున్న కొద్దీ వారిలో యితరులపట్ల బాధ్యతగా ప్రవర్తించే గుణం పెరుగుతుంది. ఇష్టం వచ్చినట్టు మాట్లాడే లక్షణం మోడరేట్ అవుతుంది.

ఇలా వ్యాప్తి చెందడం తెరాసకు మంచిదే కానీ యీ పరిణామం వుంటే కాంగ్రెస్‌కు రుచిస్తుందా? అది సహిస్తుందా? తెరాస చిన్నగా వున్నపుడే అది సందేహిస్తోంది – తెలంగాణ యిస్తే దాని బెనిఫిట్ వాళ్లు పట్టుకుపోతారని. వామనుడు త్రివిక్రముడైనట్టు తెరాస యిలా భూమ్యాకాశాలు ఆక్రమిస్తే భయపడదూ? తెలంగాణ యిచ్చి బావుకునేదేముంది? అంతకంటె ఏమీ చేయకుండా కూర్చుంటే యింతకన్నా వచ్చే ముప్పేముంది? అన్న ఆలోచన చేస్తే...?

ఈ భయం తెరాసకూ వుండవచ్చు. కానీ ఎదిగే వాతావరణం వచ్చినపుడు ఎదగకుండా ఎలా వుంటుంది? 2014 నాటికి కాంగ్రెస్‌తో సమానస్థాయిలో బలం పుంజుకుంటే ఫిఫ్టీ–ఫిఫ్టీ బేసిస్‌లో టిక్కెట్లు పంచుకోవచ్చేమో ! మానిఫెస్టోలో క్లియర్‌గా తెలంగాణ యిస్తామని రాయించి పుచ్చుకుంటారేమో ! చూదాం. కథ ముందు ముందు ఎలా నడుస్తుందో ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 52** **ఎమ్బీయస్ : భిన్నస్వరం**

సకలజనుల సమ్మెలో విద్యను చేర్చకూడదంటూ కంచె ఐలయ్యగారు రాసిన వ్యాసం గురించి ప్రస్తావిస్తూ రాసినపుడు ఆయన వుద్దేశాన్ని సమర్థించాను కదా. ఆయన గత మంగళవారం ఆంధ్రజ్యోతిలో "గమ్యం చేరని ఉద్యమం" అంటూ వ్యాసం రాసి తెలంగాణ ఉద్యమంలో భిన్నస్వరం వినిపించారు. దానిపై ఉద్యమకారులు చాలా ఆందోళన చెందారు. ఎందుకంటే అవే మాటలు ఏ లగడపాటో, కావూరో అంటే ఎడాపెడా ఉతికేయవచ్చు. వాళ్ల ఆఫీసుల మీదకు దాడి వెడలవచ్చు. కానీ అన్నది – విద్యాధికుడు, తెలంగాణవాది, దళితప్రవక్త, పైగా వృత్తిరీత్యా రాజకీయనాయకుడు కాదు. అందువలన ఆయనపై పళ్లు నూరుకున్నారు తప్ప దాడికి వెళ్లలేదు. ఆయన వ్యాసం ప్రచురించిన ఆంధ్రజ్యోతే తన టీవీ ఛానెల్ ద్వారా ఆ సాయంత్రమే చర్చావేదిక ఏర్పాటు చేసి తెరాస నాయకుడు శ్రవణ్, లెక్చరర్స్ నాయకుడు విఠల్‌లను ఆహ్వానించి మాట్లాడమంది. ఐలయ్యకూడా చర్చలో పాల్గొన్నారు.

వ్యాసంలో ఐలయ్య లేవనెత్తిన అంశాలపై వాళ్లు నిలదీశారు. అవేమిటంటే – ''ఈ ఉద్యమం తన తైనాతీ అయిన తెరాస ద్వారా కాంగ్రెస్ చేయిస్తున్నదే ! జగన్‌నుండి ప్రజల దృష్టి మరలించడానికి, రాష్ట్రముఖచిత్రంలో వైయస్ ఖాళీ చేసిన జాగాను చంద్రబాబు పూరించకుండా కట్టడి చేయడానికి కాంగ్రెస్ డిసెంబరు 9 ప్రకటన చేసింది. దెబ్బకి రాష్ట్ర నాయకులందరూ ప్రాంతాల వారీగా విడిపోయారు. తెలంగాణలో వైయస్ అభిమానులు జగన్ వైపుకి వెళ్లకుండా ఆగిపోయారు. చంద్రబాబు డిఫెన్సులో పడిపోయారు. దీనికి కాంగ్రెస్ వాడుకున్న ఆయుధం తెరాస. తెరాస కాంగ్రెస్‌కు ఎప్పుడూ శత్రువు కాదు. కాంగ్రెస్ కనుసన్నలలోనే అది ఆడుతోంది.

2014 ఎన్నికలలో తెలంగాణలోని సీట్లన్నీ తెరాసకు వచ్చినా దాని నాయకులను అక్రమాస్తులార్జన పేరుతో బెదిరించి కాంగ్రెస్ తనవైపు తిప్పేసుకోగలదు. 1969 ఉద్యమంలో డబ్బు, వ్యాపారం కనబడలేదు. ఇప్పటి వుద్యమంలో వున్నవి అవే. కట్టలు కట్టలు సంపాదిస్తున్నారు. మీడియా పెట్టి ఆంధ్రులనుండి యాడ్స్ తెచ్చుకుంటున్నారు. ఉద్యమ అధికారంతో 'ముడుపుల పాయ'ను తయారుచేసుకుంటున్నారు. అందువలన తెరాస వాపు, కాంగ్రెస్‌కు బలుపు అని చెప్పాలి.

''...అయితే బడుగు జీవులు యిది అర్థం చేసుకోవడం లేదు. టిడిపి వెంటనున్న బిసిలు యిప్పుడు తెలంగాణ మత్తులో పడి తెరాస వెనుక చేరారు. వారిలో మొదటితరం విద్యావంతులను ఉద్యమకారులు ఉరికి పురికొల్పుతున్నారు. విద్యారంగంలో తమ కర్తవ్యాన్ని ఎప్పుడూ సీరియస్‌గా నిర్వహించని మేధావి బృందం రెండు ప్రాంతాల్లో కట్టలు సంపాదిస్తున్నారు. బిసి, ఎస్సీ, మైనారిటీలు చదువుకునే విద్యాసంస్థలను నిరంతరంగా మూయిస్తున్నారు. ఉద్యమం ఊపు తగ్గితే చావులు పెరుగుతున్నాయి. ఊపు పెరిగితే చావులు తగ్గుతున్నాయి. ఇది ప్రపంచంలోనే వింత. మన శవాలను మన మీడియాలో చూసుకుని బడుగు మేధావులు సైతం స్వాతంత్ర్యం వచ్చేసినట్టు ఉపన్యసిస్తున్నారు. తెలంగాణ రాదని వాళ్లకు అర్థమైనా కానట్టు ప్రభుత్వంపై రెండు రాళ్లు వేసి, అలా వేయనివారిని తిడుతున్నారు. తెలంగాణ వానరసేనకు చావులొచ్చినాయి, కేసులొచ్చినాయి, నాయకులుగా వున్నవారికి, కొత్తగా ఎదిగినవారికి ఆంధ్రోళ్లు అడిగినన్ని చందాలిచ్చి తెలంగాణ కూడా యివ్వరుకదా !' ఇలా రాసుకుని వచ్చి చివరి పేరాలో ఐలయ్యగారు యిలా రాశారు –

'తెలంగాణ యింక రాలేదు. వచ్చే అవకాశం కూడా లేదు. ఉద్యమాలు మాత్రం నడుస్తూనే వుంటాయి. ఈ పోరాటం 2014, 2019, 2024.. ఎన్నికల గుండా పయనిస్తూనే వుంటుంది. దాని అసలు లక్ష్యం ఈ ప్రాంతంలోని సకల బడుగుజీవుల చదువుల్ని, అభివృద్ధిని సంపూర?ంగా చంపేయడం.' అని ముగించారు. ఆఖర్న రాసినది సినికల్‌గా అనిపించినా, పైన చెప్పిన దాంట్లో కాస్త హేతుబద్ధత వుందనిపిస్తుంది. ఈ వ్యాసం రాగానే ఉద్యమకారులు ఎందుకు ఆందోళన చెందారో అర్థమైంది కదా. టీవీ స్టూడియోలో ఐలయ్యగారి మీద విరుచుకు పడిపోయారు – 'మీరు కన్‌ఫ్యూజై, యితరులను కన్‌ఫ్యూజ్ చేస్తున్నారు... ఉద్యమానికి తోడ్పడకపోతే మానె, యిలా అడ్డు తగలకండి. తెలంగాణ ఉద్యమం వూపులో వుంది, రేపోమాపో తెలంగాణ వచ్చేట్టుంది, ఇలాటి సమయంలో యిలాటివి చెప్పి ఉద్యమాన్ని నీరుకార్చకండి. ఉద్యమంలో లోపాలున్నాయనుకుంటే మీరు ఆల్టర్నేటివ్‌గా దళిత నాయకత్వంలో తెలంగాణకోసం ఉద్యమం చేయండి, మద్దతిస్తాం, అంతేగాని యిప్పుడు కులాల పంచాయితీ పెట్టి లక్ష్యాన్ని దెబ్బ తీయకండి' అని.

'కులాల పంచాయితీ అక్కరలేదనుకుంటే మీ కెసియార్ దళితుణ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఎందుకన్నాడు? ముస్లిం డిప్యూటీ సిఎం అని ఎందుకన్నాడు? కులాల కోణం కూడా విస్మరించకూడదు. మంద కృష?మాదిగపై నాకు గౌరవం, మాదిగలకు విలువ తెచ్చాడని. మీరేం చేశారు? బడి మూయించి వాళ్లను నాశనం చేస్తున్నారు. వాళ్లను పైకి రానీయకుండా తొక్కేస్తున్నారు. మీ నాయకత్వంది అగ్రకుల అహంకారం. నాది అచ్చ తెలంగాణ పేరు – ఐలయ్య అని. మీ నాయకుడి కొడుకు పేరు తారకరామారావు. మీరు రాముణ్ని పూజించే, చండీయాగాలు చేసే మనువాదులు. మేము బౌద్ధులం. మా దళితులు చదువుకుని పైకి వచ్చి నాయకత్వం వహించేదాకా మాకు తెలంగాణ అక్కరలేదు... టైము పడుతుందంటారా..? పట్టనీయండి. ఓ ఆంబేడ్కర్, ఓ కాన్షీరామ్, ఓ మాయావతి ప్రభవించడానికి శతాబ్దాలు, దశాబ్దాలు పట్టలేదా? నేను దళితులకు నాయకత్వం వహించనవసరం లేదు. చదువుకుని పైకి వచ్చాక వాళ్లే నన్నూ, నిన్నూ నడిపిస్తారు. మీ కాలేజీ బందుల వలన వాళ్లు పైకి రాకుండా చేస్తున్నారు. ఆత్మహత్యల పేర చచ్చేవాళ్లందరూ వాళ్లే. మీ నాయకుల పిల్లల్లో ఒక్కడు చావడు. ఈ చంపుళ్ల తెలంగాణ నాకు వద్దు." అని ఐలయ్య గట్టిగా తగులుకున్నారు.

శ్రవణ్, విఠల్ తెల్లబోయారు. "మీరు లగడపాటిలా మాట్లాడుతున్నారు." అన్నారు. "ఐ డోంట్ కేర్ ఎబౌట్ హిమ్" అన్నాడీయన. "నాకు తెలంగాణ రావాలి కానీ సామాజికన్యాయం వున్న తెలంగాణ కావాలి. ఇప్పుడు సమైక్యరాష్ట్రంలో దళితులు పెనం మీద వున్నారు. మీరు యిప్పుడు తెలంగాణ తెస్తే వాళ్లు పొయ్యిలో పడతారు. అందుకే నేను ప్రతిఘటిస్తున్నాను." అన్నాడు.

ఇవే మాటలు వేరే ఏ సమైక్యవాదియైనా అని వుంటే యీ పాటికి దిష్టిబొమ్మలు తగలబడేవి, తిట్లు, శాపనార్థాలు వర్షించేవి. అతని పేరు చెప్పి యావన్మంది ఆంధ్రప్రాంత ప్రజలకీ పిండప్రదానాలు జరిగేవి. కానీ అన్నది – ప్రత్యేక తెలంగాణవాది, దళితుడు, అందుకని ఆ చర్చను అంతటితో సరిపెట్టారు. దానిపై చర్చ చేసి రచ్చ చేసినకొద్దీ ఐలయ్యగారి అభిప్రాయాలకు ప్రజలందరిలో ప్రతిధ్వని వస్తే యింకా ప్రమాదం అనుకున్నారు కాబోలు. పట్టించుకోకుండా వదిలేతేనే మంచిదనుకున్నారు. మళ్లీ యింకెక్కడా చర్చ వచ్చినట్టు లేదు.

ఏదో మాటవరసకి అన్నాను కానీ ఎవరైనా సమైక్యవాది హైదరాబాదులో వుంటూ బహిరంగంగా ఐలయ్యగారంత ఘాటుగా విమర్శించగలడా? అంత గట్స్ ఎవరికి వున్నాయి? ఒకవేళ వున్నా పోలీసులు ప్రదర్శించనిస్తారా? విశాలాంధ్ర సమితో ఏదో పెట్టి పరకాల ప్రభాకర్, నల్లమోతు చక్రవర్తి వాళ్లు ప్రెస్ క్లబ్‌లో మీటింగు పెట్టి బార్లు, సినిమాహాళ్లు తెరిచివుంచి బళ్లు మాత్రం మూసేశారే అంటే రిపోర్టర్లే మీద పడి కరిచేశారు. అక్టోబరు నెలాఖరులో మీటింగు పెడతామంటే శాంతిభద్రతలకు విఘ్నం కలుగుతుందంటూ పర్మిషన్ యివ్వలేదు. బహిరంగ సమావేశంలో ఆంధ్రా వాళ్లని భాగో అన్నా, రక్తపుటేరులు పారిస్తామన్నా, పండక్కి వెళ్లిన రానివ్వమని ప్రతిజ్ఞలు చేసినా, రాజీనామా చేయని వాళ్లను నరికి పోగులు పెడతామన్నా, వాళ్లను కొట్టండి, తరమండి అని పిలుపు నిచ్చినా శాంతిభద్రతల సమస్య రాదు – పోలీసుల దృష్టిలో ! కానీ ఎవరైనా సమైక్యవాది – కలిసి వుండడానికి నా తరఫు వాదన వినిపిస్తా

అని అంటే వీల్లేదు అనేస్తారు పోలీసులు. వాళ్లు పర్మిషన్ యిచ్చినా పది, పదిహేనుమంది వచ్చి అల్లరి చేస్తారు – 'ఈ గడ్డమీద వుంటూ, విభజనకు అంగీకరించక పోవడానికి ఎంత ధైర్యం? అంటూ. వాళ్లు రావడం కాస్త లేటైన పక్షంలో విలేకరులే గోల చేస్తారు (చక్రవర్తిగారి పుస్తకావిష్కరణ సభ గుర్తుకు తెచ్చుకోండి)

ఆంధ్రప్రాంతంలోని సమైక్యవాదుల నుండి తెలంగాణ ప్రాంతంలోని సమైక్యవాదులకు లభించే మద్దతు గుండుసున్న. వాళ్లు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి వీళ్ల ఆస్తులకు, ప్రాణాలకు ముప్పు తేవడం తప్ప చేసేదేమీ లేదు. ఇక తెలంగాణ ప్రాంతంలోని సమైక్యవాదులు నోరెత్తాలంటే – పైన చెప్పినట్టు భయం. అందువలన ప్రత్యేక ఉద్యమంలో లోటుపాట్ల గురించి చెప్పగలిగేది ఇక్కడ వున్న తెలంగాణవాదులే. అటువంటి భిన్నస్వరం వినిపించాలంటే చాలా ధైర్యం కావాలి. ఐలయ్యగారి భావాలతో మనం ఏకీభవించినా ఏకీభవించకపోయినా ఆయన ధైర్యం మాత్రం మెచ్చదగినది. ఆయన ప్రతిపాదించిన థియరీ – కాంగ్రెసే కావాలని యిదంతా చేస్తోంది అన్నది – కూడా కాస్త ఆలోచించదగ్గదే ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**అక్టోబరు 53** **ఎమ్బీయస్ : స్వరం పెంచిన టిడిపి**

చంద్రబాబు మాంచి అప్‌బీట్ మూడ్‌లో వున్నట్టున్నారు. గతవారమే తెరాస నాయకులను తిట్టిపోశారు. వసూల్‌రాజా లన్నారు. మేమే అధికారంలో వుంటే రెండు నిమిషాల్లో తెలంగాణ సమస్య పరిష్కరించేసేవాళ్లం అన్నారు నిన్న. అధికారంలో వుండి పదవులు అనుభవించగల అవకాశం వున్న కాంగ్రెస్ నాయకులే తెరాసకు వలసలు ప్రారంభించిన యీ దశలో యీయనకు యింత ధైర్యం రావడం విశేషం.

ఎందుకంటే ఆయన పార్టీలోని తెలంగాణ నాయకులు ప్రతిపక్షంలో వున్నారు. పదవులు వచ్చే ఛాన్సు లేదు. తెరాస తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతోంది. అందరి కంటె ఎక్కువగా తిట్టేది – కొత్తగా వీడివెళ్లిన నాగం బృందం! వారు సోనియాను తిట్టడం తక్కువ, బాబును తిట్టడం ఎక్కువ. టిడిపి వాళ్ల కార్యక్రమాలకు తెరాస, బిజెపి వారు – వారి సంఖ్యాబలం పదో, పాతికో అయినా సరే – అడ్డు తగులుతున్నారు. వాటికి మీడియా విశేషప్రచారం కలిగిస్తోంది. టిడిపి నుండి వలస వెళ్లినవార్ని తెరాస ఉపయెన్నికలలో నిలబెట్టి మంచి మెజారిటీతో గెలిపించుకుంటోంది. ఇలాటి సమయంలో జారుకునేవారు కాంగ్రెస్ కంటే టిడిపివారే ఎక్కువమంది వుండవచ్చు. అయినా సరే అలాటి భయసంకోచాలు లేకుండా బాబు ధైర్యంగా 'అలా ముందుకు వెళుతున్నార'ంటే గొప్పే ! ఆ ధైర్యాన్ని యిచ్చినది బహుశా తమ రెండు కళ్ల పంథా కరక్టని నిరూపించబడిందన్న ఒక తృప్తి కావచ్చు. తెరాస చేతిలో తామే కాకుండా కాంగ్రెస్ కూడా దెబ్బ తింటున్నందుకు సంతోషం కావచ్చు. దసరా తర్వాత ప్రభుత్వం తీరు చూసి కాంగ్రెస్ తెలంగాణ యివ్వదని గట్టిగా నమ్మడం చేత కావచ్చు. కాంగ్రెస్ యిచ్చేట్టు లేదని ఆయనకు ముందునుండీ సందేహం వుండడం చేతనే ఆయనా నానుస్తూ వచ్చారు.

ఒకలా ఆలోచించి చూడండి – కాంగ్రెస్ విభజనకు అంగీకరించిందని చెప్పేసిన తర్వాత టిడిపి 'మేమూనూ..' అంటే అంతా నవ్వి వుండేవారు. గుడ్డికన్ను మూస్తే ఎంత, తెరిస్తే ఎంత అని. ఇక్కడా, అక్కడా అధికారంలో వున్న పార్టీ ఒప్పుకున్న తర్వాత యీ పార్టీ చేయగలిగేదేముంది? అసెంబ్లీలో తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసేటంత దమ్ము లేదని అందరికీ తెలుసు. పార్లమెంటులో ఎలాగూ పెద్దగా బలం లేదు. అందువలన అటువంటి పరిస్థితుల్లో టిడిపి 'మేమూ విభజనకు ఒప్పుకుంటున్నాం. కానీ ఏ ప్రాంత ప్రజలకూ అన్యాయం జరగకుండా శాస్త్రీయపద్ధతిలో విభజన జరగాలి.' అని కాంగ్రెస్ నిర?యాన్ని ఫైన్ ట్యూనింగ్ (తెలుగులో సన్నాయి నొక్కులు అనవచ్చా?) చేయడానికి చూసేది. అంతకుమించి వాళ్లు చేయగలిగేది లేదు. ఈ ఫైన్‌ట్యూనింగ్ వలన కోస్తా, సీమల్లో టిడిపిపై గౌరవం పెరిగేది కానీ తెలంగాణలో ఏదో విధంగా బాబు అడ్డుపడుతున్నారన్న భావం కలిగేది.

అందువలన కాంగ్రెస్ విభజనకు అంగీకరించకపోవడమే టిడిపికి కావలసినది. అప్పుడు తప్పు వాళ్లమీద నెట్టవచ్చు. తెలంగాణలో తాము సింపతీ పొందవచ్చు. ఈ ప్లాను డిసెంబరు 9 వరకు పారింది. కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను ఏమారుస్తూనే వుంటుందన్న ధైర్యంతోనే తెలంగాణకు ఓఖే అన్నారు బాబు. తీరా చేసి వాళ్లు యిచ్చేస్తామన్నారు. దెబ్బకి బాబు పరపతి అటూ, యిటూ కూడా పోయింది. కాంగ్రెస్‌కు తెలంగాణలో పరపతి పెరిగిందికానీ అది తాత్కాలికమే అయింది, డిసెంబరు 23 న వెనక్కి మళ్లడంతో. తమాషా ఏమిటంటే ఆ తర్వాత కాంగ్రెస్ కంటే ఎక్కువ నష్టం టిడిపికే కలిగింది.

తెలంగాణ ప్రజలలో సోనియా కంటె బాబుకే ఎక్కువ పలుకుబడి వుండేది. డిసెంబరు 23 తర్వాత బాబుమీదే ఎక్కువ కోపం వచ్చింది. ఎందుకంటే సోనియాకు చుట్టూ కోటరీ వుందని, వాళ్లను ఆంధ్ర పెట్టుబడిదారులు వశపరుచుకున్నారని, పాపం సోనియాకు అభమూశుభమూ తెలియక మోసపోతోందని ఆవిడకు బెనిఫిట్ ఆఫ్ డౌట్ యిచ్చారు. కానీ బాబు విషయంలో అలా ఎలా యివ్వగలరు? రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గమూ, దానిలోని నాయకులూ, వారి మనోభావాలూ ఆయనకు కరతలామలకమే. ఇన్ని తెలిసి 'మనవాడనుకున్న' బాబు యిలా ప్రవర్తించడమేమిటని వాళ్లకు కడుపుమంట.

తెరాస, దాని అనుయాయులైన ఉద్యమకారులు యీ పరిస్థితిని పూర్తిగా వినియోగించుకున్నారు. టిడిపిని పూర్తిగా ఫినిష్ చేసి దాని స్థానాన్ని ఆక్రమించడానికి యిదే అదను అనుకున్నారు. కాంగ్రెస్ వారికి పూర్తి మద్దతు యిచ్చింది. మీడియా సరేసరి. టీవీ

చర్చల్లో కూర్చున్న ప్రతీ తెలంగాణవాదీ బాబును ఎద్దేవా చేయడమే. స్వంతంగా ఎన్నికలలో నిలబడితే వంద ఓట్లు కూడా తెచ్చుకోలేనివాడు సైతం బాబు పేరు చెప్పి 'ఆయన అభిప్రాయం చెప్పమనండి', 'ఆయనను లేఖ యిమ్మనమనండి' అంటూ ప్యానెల్‌లో వున్న టిడిపి లీడరును వెక్కిరించడమే. వీళ్ల యిరకాటం చూసి యికిలించేవారిలో కాంగ్రెస్‌వాళ్లుండడం భలే వింత. 'మీరూ అంతేగా..' అంటే 'లేదు, లేదు డిసెంబరు 9 ప్రకటన యిచ్చాంగా..' అంటారు వాళ్లు. 'మరి డిసెంబరు 23 మాట ఏమిటి?' అని ఉద్యమకారులు గట్టిగా అడగరు. ఎందుకంటే దాన్ని ప్రజలకు గుర్తు చేయడం వాళ్లకిష్టం లేదు. అది గుర్తు చేస్తే తెలంగాణ రాదన్న సంకేతం వెళ్లి దిగాలు పడిపోతారని వీళ్ల భయం.

ఇప్పుడు కూడా చూడండి – "మీరు విశ్వాసం నిరూపించుకోండి.." అని కాంగ్రెస్‌ను గట్టిగా అడిగేబదులు 'మీరు అవిశ్వాస తీర్మానం పెట్టండి' అని టిడిపిని ఛాలెంజ్ చేస్తున్నారు. నా కర్థం కాదు – ఎవరో చెపితే వీళ్లెందుకు చేయాలండి? వీళ్ల అదను, పదును చూసి దాని వలన లాభనష్టాలు బేరీజు వేసుకుని తీర్మానం పెట్టాలో వద్దో వాళ్లు చూసుకుంటారు. ప్రభుత్వాన్ని పడగొట్టేసి ఎన్నికలకు వెళ్లడానికి ప్రతిపక్షం వాళ్లు సిద్ధంగా వుండి వుండకపోవచ్చు. అంతమాత్రాన వాళ్లు ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారని, డబ్బు తినేశారని అనుకోవడానికి లేదు. 'నువ్వు ఒకందుకు పోస్తున్నావు, నేను మరో అందుకు తాగుతున్నాను' అన్నట్టుగా అవిశ్వాసం పెట్టకుండా లాక్కుని వస్తున్నారు. అయినా అవిశ్వాస తీర్మానం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు.

1979లో మొరార్జీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో లాంఛనానికి అవిశ్వాస తీర్మానం పెడితే ఆ ప్రభుత్వంలో వున్న అసంతృప్త ద్రావణాలు యిటువైపు జారాయి. అందరి కంటె క్లాసిక్ కేస్ జార్జ్ ఫెర్నాండెజ్‌ది. ప్రభుత్వాన్ని వెనకేసుకుని వస్తూ అత్యద్భుతమైన ఉపన్యాసం యిచ్చి ఆ మర్నాడే గోడదూకేశాడు. చూస్తూండగానే యిటు బలం పెరిగిపోయి మొరార్జీ ప్రభుత్వం పుసుక్కున పడిపోయింది. ఎవరూ ఎన్నికలకు రెడీగా లేరు. గందరగోళం అయిపోయి, చరణ్‌సింగ్ నేతృత్వంలో ఆపద్ధర్మ ప్రభుత్వం నడిచి జనతాపార్టీలోని అస్మదీయులు, తస్మదీయులు అందరూ ఓడిపోయి శంకరగిరి మాన్యాలు పట్టవలసి వచ్చింది. అందువలన యివి మొదలుపెట్టేవరకే మన చేతిలో వుంటాయి తప్ప తర్వాత కథ ఎన్ని మలుపులు తిరుగుతుందో చెప్పలేమని చరిత్ర చెపుతోంది. ఇవన్నీ తెలిసిన బాబు వీళ్లు అడిగారు కదాని మొహమాటానికి పోయి తీర్మానం పెట్టేసి, యీ తరుణంలో ఎన్నికలకు వెళ్లరు.

అలా వెళ్లరని తెలిసే తెరాసవారు, తెలంగాణ మేధావులు (టీవీ చర్చల్లో, పత్రికల వ్యాసాల్లో దర్శనమిచ్చే జర్నలిస్టులు, ప్రొఫెసర్లు) బాబును ఉడికిస్తున్నారు – తీర్మానం పెట్టకపోతే మీరు కిరణ్ కొమ్ము కాస్తున్నారనే అంటాం అని. చూసి చూసి రేవంత్ రెడ్డికి అనుమానం వచ్చింది – తెరాసకు ఫండ్స్ అవసరం పడిందేమోనని. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ వాళ్లను గెలిపించడానికి ముగ్గురు తమ ఎమ్మెల్యేలను అరువిచ్చి సంపాదించుకున్నారు కదా అని దృష్టాంతం చెప్పారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసిన వారిని గుర్తించాం, పార్టీనుండి బహిష్కరిస్తాం అంటూ హంగామా చేసి తర్వాత చప్పబరిచేశారు. ఉద్యమపార్టీ అలా వూరుకోవడమేమిటి? అని కొందరు కెసియారే పంపించి డబ్బు చేసుకున్నారు అని కొందరూ అన్నారు. 'ప్రజలు తెలంగాణ సెంటిమెంటుతో గెలిపించిన ఎమ్మెల్యేలనే కాపాడుకోలేనివాడివి, యితర పార్టీల ఎమ్మెల్యేలను గుంజుకుని ఏం చేస్తావ్?' అని మేలమాడినా కెసియార్ కిమ్మనకపోవడం యీ ఊహలకు బలం యిచ్చింది.

ఇప్పుడు టిడిపి అవిశ్వాసం పెడితే అప్పుడు కాంగ్రెస్ వారు తెరాసకు ఆఫర్ యివ్వవచ్చు. 'మీ పార్టీవారు మాకు ఓట్లేసి ప్రభుత్వాన్ని కాపాడండి, లేదా ఓటింగుకి గైరు హాజరు కండి. దానికి గాను యిదిగో ప్రతిఫలం' అంటుందని రేవంత్‌కి అనుమానం. అదే వెలిబుచ్చారు. వీళ్లేమన్నా తెరాస ఉడికిస్తూనే వుంటుంది. మీడియా వాళ్లకే ఎక్కువ కవరేజి యిస్తుంది. ఉడికిస్తే ఉడుక్కోవడానికి ఎర్రబెల్లి వంటి టిటిడిపి నాయకులున్నారు. రైల్ రోకోలో మేం కూడా చేరతాం అంటూ తెరాస వారిని దేబిరించారు. అయినా వాళ్లు దూర్ హటో, దూర్ హటో, మీతో కలిస్తే మా పాతివ్రత్యానికి భంగం కలుగుతుంది అన్నారు.

ఇలాటి పరిస్థితినుండి టిడిపి హఠాత్తుగా బయటపడి తెరాసపై ఎదురుదాడికి దిగింది. పోలవరం టెండర్ల విషయంలో కెసియార్ వాటాదారు దొరకడంతో ! కెసియార్ ఏం సమాధానం చెప్పినా కన్విన్సింగ్‌గా తోచలేదు. స్యూ కంపెనీలో మెయిన్ కాంట్రాక్టర్లు బాబు బంధువులన్నారు. బంధువులెలా? అంటే ఒకే కులం అంటున్నారు. ఏడిసినట్టుంది. కులాంతర, మతాంతర వివాహాలు పెరుగుతున్న యీ రోజుల్లో జాగ్రత్తగా కలుపుకుంటూ పోతే ఒబామాకు, నాకు కూడా బంధుత్వం కుదరవచ్చు. బంధువన్నప్పుడు ఎలా బంధువో చెప్పాలి కదా. టిడిపిని కాంట్రాక్టర్ల పార్టీ అంటూ తెరాస యీసడించింది, అదేదో చాలా తప్పు పని అయినట్టు. కాంట్రాక్టు చేపట్టడం నాకు తెలిసి చట్టవ్యతిరేకమైన పని కాదే ! గతంలో టిడిపిని, యిటీవల పీఆర్పిని సినిమావాళ్ల పార్టీ అన్నారు. సో వాట్!? కాంగ్రెస్ తొలిదినాల్లో లాయర్ల పార్టీ. రంగాగారి పార్టీ (ఏదంటే చప్పున చెప్పలేను, చాలా పార్టీలు పెట్టించి గిట్టించారాయన) రైతుల పార్టీ. కమ్యూనిస్టు పార్టీ శ్రామికుల పార్టీ.

ఏదో ఒక వృత్తి చేసి ఆదాయం తెచ్చుకోకుండా కేవలం రాజకీయాల్లోనే డబ్బు సంపాదించాలన్న రూలుందా? స్వాతంత్ర్యోద్యమంలో పట్టాభిగారి మీద (భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు) ఇన్సూరెన్సు ఏజంటుగా పని చేసి డబ్బు గడిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. గాంధీగారు అడిగితే ఆయన అదే చెప్పాడు – చదువులు మానేయమన్నారు, ఉద్యోగాలు మానేయమన్నారు, ఏదీ చేయకుండా కూర్చుంటే ఎలా? మేం జైలుకి వెళ్లినపుడు యింట్లో వాళ్లకు తిండి గడవాలి కదా అని. ఉద్యమానికి విఘాతం కలిగించకుండా ఏదో ఒక పని చేసుకుంటే మీకు అభ్యంతరాలెందుకు? అని. ఆయనే ఆంధ్రా బ్యాంకు స్థాపించారు. కొందరు స్వాతంత్ర్యయోధులు

పాత్రికేయులుగా, మరి కొందరు రచయితలుగా జీవిక సాగించారు. కమ్యూనిస్టు పార్టీ నిషేధించినపుడు వాళ్లంతా సినిమాల్లో చేరి పాటలు రాసి, వేషాలు వేసి డబ్బు గడించుకుని బతికారు. శ్రీశ్రీ లాటి వాడికి మామూలు వ్యాపారస్తుడు ఎవడైనా ఉద్యోగం యిస్తాడా? సినిమాల్లోకి వచ్చాడు కాబట్టి బతికిపోయాడు. ''మరి కాపిటలిస్టు తీసిన సినిమాకు పాటలు రాసావేం? అది మానేసి రక్తంతో గీతాలు రాసుకో'' అని అంటే ఎంత ఫన్నీగా వుంటుంది?

పార్టీలో కాంట్రాక్టర్లు వున్నంత మాత్రాన టిడిపి మహాపరాధం చేసినట్టు బిల్డప్ ఏమిటో నాకు అర్థం కాదు. అలా అయితే తెరాస మద్దతుదారు రాజం కూడా కాంట్రాక్టు కంపెనీలో భాగస్వామి. పత్రికలో పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారు. దీనికి సమాధానంగా బాబు తెరాస వారిని వసూల్ రాజాలనేశారు. దానికి చాలా ధైర్యం వుండాలి. లోకసత్తా జెపి గారు ఆ అర్థం వచ్చేట్టు అంటేనే అసెంబ్లీ ఆవరణలో దాడి జరిగింది. బాబు గారికి అలాటిది జరగకపోవచ్చు ఎందుకంటే ఉద్యమపార్టీకోసం వసూళ్లు తప్పు కావని కెసియార్ తనయ కవిత సర్టిఫై చేశారు. ఎటొచ్చీ వసూల్ 'రాజా' అని ఒక జెండర్‌కే పరిమితం చేసినందుకు చికాకు పడివుంటారు. పార్టీ కోసం తన సోదరుడు మాత్రమే శ్రమిస్తున్నాడని, తాను ఏ చందాలూ వసూలు చేసి పెట్టడం లేదన్న అర్థం సూరేస్తోందనీ ఆవిడ బాధపడి వుంటారు. బాబుగారి స్పీచ్ రైటర్స్ అన్ని వర్గాలనూ కలుపుకుపోయేట్లు ఉపన్యాసాలు రాయాలని గుర్తించాలి.

తను అన్న కామెంట్‌కు తీవ్ర ప్రతిస్పందన రాకపోవడంతో బాబుగారికి హుషారు వచ్చేసింది. వెనకటికి ఓ చిల్లర దేవుడు 'పూజా, పునస్కారం లేక యిలా పడి వున్నాను కానీ, నైవేద్యం పెట్టు, నా తడాఖా చూపిస్తా' అన్నాట్ట. అలాగ బాబుగారు 'మాకు అధికారం లేదు కానీ లేకపోతే తెలంగాణ సమస్యను రెండు నిమిషాల్లో పరిష్కరిస్తా' అన్నారు. అక్కడికి తెలంగాణ అంటే అదేదో టూ మినిట్స్ నూడిల్స్, ఇన్‌స్టంట్‌గా కుక్ చేసి పడేయవచ్చు అన్నట్టు ! ఇలా అనుకునే చిదంబరం గారు డిసెంబరు 9 న తెలంగాణ యిచ్చేశాం జోరుగా ప్రకటించేశారు. ఆ తర్వాత ఎంత బెదిరిపోయారంటే ఆ పేరెత్తితే చాలు పారిపోతున్నారు. తెలుగు మీడియా కనబడితే మొహం చిట్లించేస్తున్నారు. నిన్న చూడండి – ఇంకో ప్రశ్న వేస్తే 'నేను చెప్పాల్సింది ఇంతే, వెళ్లి రండి' అని ఎంత చికాకు పడ్డారో. ఇవన్నీ చూసైనా బాబుగారు అర్థం చేసుకోవాలి. అయినా అధికారంలో వుంటే.. అంటున్నారు. అధికారం ఎక్కడ కావాలి స్వామీ తమకు? రాష్ట్రంలో వుంటే సరిపోదు. ఇది కేంద్రం సబ్జక్ట్. విదర్భ అసెంబ్లీ తీర్మానం కేంద్రంలోనే చాలా ఏళ్లుగా పడి వుందట.

అందువలన కేంద్రంలోనే మీకు అధికారం వుండాలి. కేంద్రంలో మీ అంతట మీరు అధికారంలోకి వచ్చే సీనుందా? రాష్ట్రం దాటితే మీ పార్టీకి శాఖలు లేవు కదా ! పార్లమెంటు మొత్తం సీట్లలో పదోవంతైనా గెలుచుకోలేని మీరు అధికారంలోకి ఎలా వస్తారు? పోనీ యితరులతో చేతులు కలిపి కూటమి ఏర్పాటు చేస్తారా? అప్పుడైనా మీరు మెయిన్ పార్టీ కాలేరు కదా. దానికి మద్దతు యిచ్చే పది పార్టీల్లో మీరొకరు. మీరు వాళ్లందరినీ తెలంగాణకై ఒప్పించగలరా? ఎన్‌డిఏ వుండగా అన్ని సీట్లున్న బిజెపి స్నేహితుల్లో పదోవంతు బలం లేని మిమ్మల్ని కన్విన్స్ చేయలేక చతికిల పడింది కదా. ఇవాళ మీరు చెప్పగానే వాళ్లు సరేననేస్తారా? ఎందుకొచ్చిన కబుర్లివి?

'డిసెంబరు 7 న తీర్మానం చేసినా, డిసెంబరు 9 తర్వాత తెలంగాణ సున్నితమైన అంశం అయిపోయింది. అందువలన యూ టర్న్ తీసుకోవలసి వచ్చింది' అని అదే సమావేశంలో ఓ పక్క చెపుతూ ''మేమే అయితే రెండు నిమిషాల్లో నిర?యం తీసుకునేవారం.'' అనడం ఎలా పొసుగుతుంది? అంటే కాంగ్రెస్ వారి కంటె అన్యాయంగా ఎవర్నీ సంప్రదించకుండా నిర?యం తీసుకుని మాపై రుద్దేవారా? తెలంగాణ సమస్యలోని జటిలత్వాన్ని అర్థం చేసుకుని అన్ని వర్గాల వారినీ సంప్రదించి యీ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టగలిగేవారే మాకు కావాలి. మీరు ఆ ప్రక్రియలో విశ్వాసం లేనట్టు తోస్తోంది. చిటికెలో పరిష్కరించేసి పేరు తెచ్చుకోవడమే మీ ఉద్దేశమైతే (నాకు కీర్తి కండూతి ఎక్కువ అని మీరు కనొసే చేయడం చాలా ముచ్చటగా వుంది) మీరు వున్నచోట్లోనే అందంగా వున్నారు. అక్కడే వుండండి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2011)**

**నవంబరు 11** **ఎమ్బీయస్ : అక్కడ కలుస్తారు.. యిక్కడ కలవరేం?**

తెలంగాణ ఉద్యమకారులందరినీ వేధించే ప్రశ్న ఒకటి వుంది. దాన్ని వాళ్లు పైకి వ్యక్తపరుస్తారు కూడా. 'సమైక్యవాదం అనగానే ఆంధ్రాలో అన్ని పార్టీల వాళ్లూ ఒకే వేదికమీద కనబడతారు. అందరూ కలిసికట్టుగా వుంటారు. ఇక్కడ తెలంగాణలో మాత్రం ఎవరి జండా వారిదే, ఎవరి ఎజెండా వారిదే. జండాఎజెండాలను పక్కన పెట్టి ఉద్యమంకోసం అందరూ ఏకం కావాలని అన్నవాళ్లు కూడా కలిసి నిలబడరు. దీనివలననే తెలంగాణ వెనక్కి వెళుతోంది. సమైక్యవాదులు పట్టు సాధించి, ఢిల్లీలో లాబీయింగ్ చేయగలుగుతున్నారు. ఎందుకిలా జరుగుతోంది?' అని.

ఇది మర్యాదగా వాపోవడం. కొందరు ఉద్యమకారులు 'ఆంధ్రాలో వివిధ పార్టీలవాళ్లు సమైక్యవాదం వచ్చేసరికి ఒకళ్లు దీక్ష చేస్తే మరొకళ్లు వచ్చి ముద్దులెట్టేసుకుంటారు' అనేస్తారు. రాజగోపాల్‌కి రాజకుమారిగారు పెట్టిన ముద్దు గురించి యిప్పటికీ రాద్ధాంతం జరుగుతూనే వుంది. 'అతను నా కంటె చిన్నవాడు. బంధువు. కొడుకు వరుస. అనేకమంది మా పార్టీ నాయకులు వెళ్లి అతన్ని అభినందించారు. దీక్షలో కూర్చున్నతన్ని ఆశీర్వదిస్తూ నేను వెళ్లి బుగ్గమీద ముద్దు పెట్టినదానిపై ఇలాటి వ్యాఖ్యలు రావడం శోచనీయం' అంటారు నన్నపనేని. తెలుగుభాష భలే తమాషా అయిన భాష. ఆవిడ అతన్ని ముద్దుపెట్టుకున్నారు అంటే సవ్యంగానే వుంటుంది.

ఒకళ్లనొకళ్లు ముద్దులెట్టేసుకున్నారు అంటే అసభ్యంగా తోస్తోంది. ఏకవచనం బదులు బహువచనం వాడితే వచ్చే ముప్పు యిది.

ఆంధ్రప్రాంతం నుండి అన్ని పార్టీల పెట్టుబడిదారులు డబ్బు సంచీలు ఢిల్లీకి తీసుకుని వెళ్లి సోనియా కోటరీని ప్రభావితం చేస్తున్నారని ఉద్యమకారులు అనుకుంటున్నారు, అంటున్నారు. ఢిల్లీ వారు యితర వర్గాల నుండి కూడా సమాచారం సేకరిస్తారన్న సంగతి వీళ్లకు తట్టదు. 2009 డిసెంబరు 9 తర్వాత మూకుమ్మడి రాజీనామాల ద్వారా చంద్రబాబు, రోశయ్య ఒకే తానులో గుడ్డలని తేలిందని తెరాస అంటుంది, దొంగలూ దొంగలూ ఏకమయ్యారన్న టోనులో ! డిసెంబరు 23 తర్వాత తెలంగాణ నుండి ఎన్నికైన ప్రజాప్రతినిథులందరూ రిజైన్ చేశారుకదా, వారిలో అన్ని పార్టీల వారూ వున్నారు కదా, కెసియార్ ఏకంగా బహిరంగంగా జానారెడ్డి యింటికి వచ్చి తెలంగాణ జాక్ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు కదా. దానిలో వీరికి ఎబ్బెట్టుతనం కనబడలేదా? అదే సంవత్సరంలో కొన్ని నెలల క్రితం ఎన్నికలలో కాంగ్రెస్, తెరాస భీకరంగా తలపడ్డారు కదా. అంతలోనే కలిశారే ! ఆ కలవడం తెలంగాణ కోసం కాబట్టి తప్పేమీ లేదని వీరి భావన. అదే విధంగా సమైక్యాంధ్ర కోసం అక్కడ కలుస్తూంటే మాత్రం తప్పు కనబడుతోంది. సరిగ్గా చెప్పాలంటే అక్కడ కలుస్తున్నారన్న దుగ్ధ ఒకటి తినేస్తోంది. అలాగే మనమూ కలిస్తే ఏదైనా సాధించవచ్చు కదా అన్న ఆలోచన తొలిచివేస్తోంది. అవును ఎందుకు కలవకపోవాలి?

ఎలా కలుస్తారు కనక? ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న తెరాసకు ఎవరి పొడా గిట్టదు. జాక్ పెట్టినంత సేపు పట్టలేదు, దాన్లోంచి కాంగ్రెస్, టిడిపిలను పంపించి వేయడానికి. ఇప్పుడు దానిలో తోడుగా మిగిలినది బిజెపి, న్యూ డెమోక్రసీ మాత్రమే. బిజెపితో కూడా లుకలుకలు ప్రారంభమయ్యాయి. మొన్న రైల్ రోకోకు బిజెపి దూరంగా వుంది. బిజెపి వచ్చినా తెలంగాణ యివ్వదంటూ ఓ తెరాస నాయకుడు చేసిన వ్యాఖ్యను తెరాస పెద్దలెవరూ ఖండించలేదు. సుష్మా స్వరాజ్ నల్గొండలో సమావేశం పెడితే జాక్ తరఫున కోదండరాం, తెరాస తరఫున నాయని నరసింహారెడ్డి వెళ్లారు తప్ప కెసియార్‌గాని, ఆయన కుటుంబసభ్యులు గాని ఎవ్వరూ వెళ్లినట్లు లేదు. చెల్లెలుగా చేసుకున్న విజయశాంతి కూడా... కొన్ని నెలల క్రితం పార్లమెంటులో సుష్మా తెలంగాణ గురించి అదరగొట్టేస్తూ మాట్లాడుతూంటే ఆమె వెనుక సైలెంటుగా నిలబడిన కెసియార్, విజయశాంతి కళ్లకు కడుతున్నారు. మరి ఈనాడు ఆమె మన రాష్ట్రానికి వస్తే వీళ్లకు తీరికే లేకపోయిందా? అడ్వానీ వచ్చినపుడు కెసియార్ వెళ్లలేదు సరికదా, టీ ఛానెల్‌లో ఆయన రథయాత్ర కవరేజి కూడా యిప్పించలేదుట.

తెలంగాణ వుద్యమానికి తనే గుత్తకు తీసుకున్నట్టు తెరాస ప్రవర్తిస్తున్నకొద్దీ తక్కినవాళ్లకు మంటగా వుంది. కొండా లక్ష్మణ్ బాపూజీగారు దీక్ష (అదేమి దీక్షో నాకు క్లారిటీ లేదు. పొద్దున్న పది గంటల నుండి సాయంత్రం 5 గంటలకు వరకు నడిచినదానిని నిరాహారదీక్ష అనవచ్చా? అందుకనే ఎవరో కానీ అది నిరసనే తప్ప నిరాహారదీక్ష కాదన్నారు) వలన ఏం సాధించారో నాకు తెలియదు. కానీ ఏదో పెద్దాయన. 96 యేళ్ల వయసులో అంతసేపు కూర్చున్నారు. దానికైనా మెచ్చుకోవచ్చు. బొత్తిగా పట్టించుకోక పోవడం దేనికి? పట్టించుకోలేదు సరికదా ఆఖరి రోజున యిక ఉండబట్టలేక 'ఆయన వెనుక తెలంగాణ ద్రోహులున్నారు కాబట్టి మేం మద్దతు యివ్వటం లేదు' అని తెరాస శాసనసభానాయకుడు ప్రకటించడం దేనికి?

ఈ తెలంగాణద్రోహులు ఓ గమ్మత్తయిన పదం. 'తెలంగాణేతరుడు' పదం లాగానే యీ 'తెలంగాణద్రోహి' పదం కూడా ఎవరిమీద పడితే వారిమీద ప్రయోగించవచ్చు. తెలంగాణలోని కాంగ్రెస్‌వారు, టిడిపి వారు, వారి పార్టీకి ఓట్లేసినవారు, తెలంగాణలో వుంటూ రాష్ట్రవిభజన కోరని వారు – వీళ్లందరూ తెలంగాణద్రోహులే అంటున్నారు ఉద్యమకారులు. ఆ లెక్కన తెలంగాణలో తెలంగాణద్రోహులే మెజారిటీలో వుండేట్లున్నారు. వీళ్ల నిర్వచనాలు వీరివి. అవతలివారి నిర్వచనాలు అవతలివారివి. తెరాస అంటే – ఓట్లు, సీట్లు, నోట్లు అనేశారు బాపూజీ. రాజకీయపార్టీ కాబట్టి మొదటి రెండిటిపై దృష్టి వుండడంలో తప్పేమీ లేదు కానీ మూడోదే కాస్త డామేజింగ్‌గా వుంది. అందులోను కెసియార్ ఉద్యమాన్ని నడిపిస్తున్న తీరును చూసి ఆయన లక్ష్యం గురించి అనుమానపడేవారు మరింత సందేహించేట్లు 'నోట్లు' కలిపారు. కెసియార్‌ను కొడుకు అంటూనే 'చెడ్డకొడుకు' అనేశారు. దానాదీనా టిడిపి వాళ్ల దృక్పథాన్నే ఆయన ప్రతిధ్వనించారు. అక్కడ టిడిపివాళ్లతో బాటు తటస్థంగా వుంటే చుక్కా రామయ్యగారు, కాంగ్రెస్ ఎంపీ మధు యాష్కీ యిత్యాదులు వున్నారు. వారందరూ బాపూజీ ఆలోచనలతో ఏకీభవించారని అనుకోవడానికి లేదు. అయినా ఉద్యమంలో ఆయనదీ ఓ పంథా అనే గౌరవంతో వచ్చారు. తెరాస కూడా అలాటి జెస్చర్ ఏదైనా చూపించి వుంటే యింత చిక్కు వచ్చేది కాదు.

అటు బాపూజీ దీక్ష చేస్తూ వుంటే యిటు కోమటిరెడ్డి చేశారు. ఈయనది కఠోరదీక్ష. పచ్చి మంచినీళ్లు కూడా పుచ్చుకోలేదని వారి సోదరుడు అన్నారు. అసలు నిరాహారదీక్షలు చేసే విధానం యిది కాదు. పొట్టి శ్రీరాములు వంటి గాంధేయవాదులు నిరాహారదీక్ష చేస్తూ మధ్యమధ్యలో ఏం పుచ్చుకునేవారో ఓ సారి విపులంగా రాశాను (కెసియార్ దీక్ష టైములో అనుకుంటా) అలా అయితే నెలల తరబడి చేయవచ్చు. ఇదేమిటి, యిలా ఏమీ పుచ్చుకోకుండా వుంటే అయిదారు రోజుల్లో కళ్లు తేలేయడం, నిమ్స్‌లో తేలడం ఖాయం. వైద్యులు సెలైన్ ఎక్కిస్తున్నా దీక్ష కొనసాగిస్తున్నాను అంటే కెసియార్ దీక్ష (వివరాలకు గోనెగారిని సంప్రదించవలెను)లా వుంటుంది. ఆసుపత్రిలో దీక్ష ఓ దీక్షే కాదని లగడపాటి శాస్త్రీయంగా నిరూపించారు.

కోమటిరెడ్డి దీక్షకు ఆయన పార్టీ వాళ్లు తప్ప తక్కినవాళ్లందరూ మద్దతు పలికారు. అరెస్టు చేసినపుడు బంద్‌కి పిలుపిచ్చి మానేశారనుకోండి. ఆయన పార్టీవాళ్లు దీక్ష మానేయమని విజ్ఞప్తులు చేశారు. కిరణ్‌కుమార్ గారు తొంగికూడా చూడలేదు. అవిశ్వాసతీర్మానం పెడితే గిడితే ఓ ఓటు తగ్గిపోతుందన్న భయమేనా లేదాయనకు. ఎవరైనా ఏమైనా అనుకుంటారన్న జంకు కూడా

లేదు. దసరా తర్వాత మరీ గిడసబారిపోయారు. ఆయన ధైర్యం చూసిన కొద్దీ ఢిల్లీవారు తెలంగాణ యిచ్చేట్టు లేరన్న సంకేతాలు బలపడి తెలంగాణ మంత్రులూ కోమటిరెడ్డిని పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలూ డిటో డిటో. ఇక కాస్త అయ్యోపాపం అన్నదెవరా అంటే తెలంగాణ ఎంపీలు. వారిలోనూ కొందరే. తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య దారులు చీలిపోయిన వాస్తవం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఎమ్మెల్యేలలో చాలామంది నోరెత్తటం లేదు.

మధ్యలో జిల్లా పాలిటిక్స్ ఒకటి. గతంలో ఆర్. దామోదరరెడ్డి తెగ మాట్లాడేవారు. సమన్వయ కమిటీ అంటూ ఏర్పడి జానారెడ్డికి ప్రాముఖ్యత పెరగడంతో ఆయనకు మండి, వెనక్కు వెళ్లిపోయారు. జానారెడ్డి కొద్దికాలం బాగానే వెలిగారు కానీ అర్ధమనస్కంగానే (గట్టిగా మాట్లాడితే పావుమనస్కంగా) నాయకత్వం వహించారని చెప్పుకోవాలి. సరైన టైములో ఊళ్లో వుండకపోవడం, ఏ విషయం తేల్చకపోవడం, ఏదీ స్పష్టంగా చెప్పకపోవడం – యీ లక్షణాలతో యీయన శల్యసారథ్యం చేస్తున్నారా అన్న సందేహం వచ్చింది. శల్యుడు కరు?డికి సారథిగా వుండి చేసిన నిర్వాకమే అందరికీ గుర్తుండిపోయింది కానీ మర్నాడు కౌరవసేనకు సేనాపతి అయ్యాడన్న విషయం చాలామందికి తెలియదు. కరు?డి చావుకి పలుకారణాలు చెప్తూ క ృష?దు పాడిన 'నా చేతను, నీ చేతను..' పద్యం వినకపోయినా దుర్యోధనుడికి కర?మరణంలో శల్యుని పాత్ర తెలుసు కదా అయినా గత్యంతరం లేక అతన్ని సేనాపతి చేశాడు. శల్యుడు సేనాపతిగా వున్నది ఒక్కరోజే! అయినా పోస్టు పోస్టే కదా!

జానారెడ్డి గారికి కూడా తనకు సిఎం పోస్టు రాకపోదని గట్టి నమ్మకం. కిరణ్ ప్రభుత్వంది కుంటినడక కాబట్టి అతన్ని తప్పక మారుస్తారని, మారిస్తే యీ సారి ఛాన్సు తెలంగాణ సీనియర్ లీడర్ (అనగా తను)కే ననీ అనుకున్నారు. అందుకే రిజైన్ చేయమని ఎందరు చెప్పినా, 'నేను సిఎం కాండిడేటును' అని వాదించి నోరు మూయించేవారట. నాయకత్వంలో మార్పు అనగానే 'తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, మంత్రులను తిరుగుబాటు చేయకుండా వాళ్ల లీడరుగా వుంటూ కట్టడి చేసినందుకు' బహుమతిగా సిఎం పోస్టు అడగడానికే ఆయన ఎదురు చూశారు. ఓ పక్క తెలంగాణ పాట పాడుతూనే, మరో పక్క సాఫ్ట్ పెడల్ చేస్తే లాభం అనుకున్నారు. ఇంతలో డి శ్రీనివాస్ మెరుపువీరుల్లా వచ్చిపడ్డారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి యిచ్చారు. మంత్రి పదవి, అయితే గియితే సిఎం పదవి , తప్పక యిస్తారని పుకార్లు గుప్పుమన్నాయి.

'నాలో లేనిది, ఆయనలో వున్నది ఏమిటి?' అని జానారెడ్డి ఆత్మపరిశీలన చేసుకున్నారు. జవాబు తోచింది – తను అటూ, యిటూ మాట్లాడుతూ ఎటూ తేల్చకుండా బండి నడుపుకుని వస్తున్నారు. కానీ డియస్‌కు అలాటి సంకోచాలు ఏమీ లేవు. తెలంగాణ బంగరు పళ్లెరాన్ని అధిష్టానపు గోడకు ఆన్చి పెట్టేసి ఏకగ్రీవంగా ఎమ్మెల్సీ అయిపోయారు. తెలంగాణ వాదినే కానీ, హై కమాండ్‌ను నమ్ముకున్నాను వాళ్లు ఏం చేసినా సమర్థిస్తాను అని ప్రకటించి సోనియా అభిమానాన్ని చూరగొన్నారు. శ్రీ మహావిష?వైనా అంతే. మొసలితో పోరాడుతూన్న కరిరాజు ఓపికున్నంత సేపు స్వంతంగా పోరాడుతూ మధ్యమధ్యలో దేవుణ్ని తలచుకున్నాడు. అప్పుడంతా దేవుడు స్పందించలేదు. చివరకు 'లా వొక్కింతయు లేదు' పద్యం పాడి, చివరిలో నీవే తప్ప యితఃపరంబెరుగ' అన్నాకనే పరిగెట్టుకుని వచ్చాడు. సోనియా కూడా అంతే. తన మీద అన్నీ వదిలేసినవాణ్నే, అన్యథా శరణం నాస్తి అన్నవాణ్నే కరుణిస్తుంది.

జానారెడ్డి గారికి యీ ధర్మసూక్ష్మం అర్థమయ్యాక అప్పుడు ఆయనా శ్రీనివాస్ బాట పట్టారు. ఈ మంత్రుల, ఎమ్మెల్యేల జంఝాటం వదుల్చుకుందామని తిరుపతికి వెళితే అక్కడ విలేకరులు అడిగారు. "రాష్ట్ర అవసరాలను, జాతీయ ప్రయోజనాలను ద ృష్టిలో పెట్టుకుని హై కమాండ్ ఏం చేసినా మహబాగే. సమైక్యాంధ్ర అన్నా సరేనంటాం." అనేశారు. తెలంగాణకోసం అడుగుతాం అంటూనే యిలా పార్టీ హై కమాండ్‌కు టోటల్‌గా సరెండర్ కావడం తెలంగాణ ఉద్యమకారులకు రుచించలేదు. పార్టీ అధిష్టానం పట్ల విధేయత అనేది ఎవరు చూపినా చూపకపోయినా టికాంగ్రెస్, టిటిడిపివారు చూపకూడదని వారి ఉద్దేశం. "డిసెంబరు 9 తర్వాత ఆంధ్రప్రాంతీయులు తమ తమ అధిష్టానం నిర?యాన్ని ధిక్కరించి రాజీనామాలు చేయలేదా? మీరు మాత్రం ఎందుకు విధేయులుగా వుండాలి?" అని వారి లాజిక్. పాయింటే మరి. అటువంటి అవిధేయత డిసెంబరు 23 తర్వాత తెలంగాణవారు చూపారు. ఆ తర్వాత జరిగినవన్నీ తెలంగాణ ఏర్పాటుకి వ్యతిరేకంగా జరగడంతో తిరుగుబాటు తెలంగాణలో మరీ ముదిరిపోయింది. ఆంధ్రప్రాంతీయులకు గట్టిగా అవసరం పడలేదు. బక్రీదు తర్వాత తెలంగాణ యిస్తానన్న ప్రకటన వెలువడ్డాక అవసరం పడుతుందేమో, అప్పుడు వాళ్ల విధేయత ఎంత గట్టిగా వుంటుందో చూడాలి.

ఏది ఏమైనా జానారెడ్డి ప్రకటన ఖండనమండనలకు గురయింది. కానీ గమనిస్తే రావలసినంత ఘాటు ప్రతిస్పందన రాలేదు. అందుకే జానారెడ్డిగారు 'విలేకరులు తప్పుగా రిపోర్టు చేశారు, నా అసలు ఉద్దేశం అది కాదు' వంటి ప్రకటనలు కూడా చేయనవసరం లేకపోయింది. ప్రత్యేక తెలంగాణ యివ్వకపోయినా, తెలంగాణ ప్రాంతీయ బోర్డు అంటూ పెట్టి ప్యాకేజి యివ్వవచ్చని అనుకుంటున్నారు. కిరణ్‌పై అధిష్టానం నమ్మకం పెరుగుతోంది కాబట్టి యిప్పట్లో కదల్చకపోయినా, కనీసం ఆ చైర్మన్ పదవికైనా డియస్‌ను పరిగణిస్తారనీ అనుకుంటున్నారు. మరి డియస్‌తో పోటీ పడాలంటే జానా ఆపాటి స్టేటుమెంటు యివ్వక తప్పదు. హై కమాండ్ ఉద్దేశం స్పష్టమౌతున్న కొద్దీ తెలంగాణ మంత్రులు మెత్తబడడం మొదలు పెట్టారు. ఎమ్మెల్యేలు సరేసరి. కొందరు ఎంపీలు మాత్రమే క్రూసేడర్స్‌లా మిగిలారు. వాళ్లల్లో కూడా కొంత మార్పు కనబడుతోంది. 'రాష్ట్రవిభజన అంటే కేక్ కట్ చేసినంత సులభం కాదు, కాగితం చించినంత ఈజీ కాదు' అన్న స్టేటుమెంటు యిచ్చినది ఏ లగడపాటో కాదు, కేకే ! కాలం గడిచేకొద్దీ ఆయనకూ కాలజ్ఞానం పెరుగుతోంది.

వీళ్లందరూ డిసెంబరు 9 కి ముందు తెలంగాణ గురించి ఏమంత గొప్పగా మాట్లాడారు కనుక? డిసెంబరు 9 తర్వాతనే,

తెలంగాణ కనుచూపు మేర దూరంలో వుందని అనిపించాకనే వీళ్లంతా తెలంగాణ కంకణబద్ధులయ్యారు. ఇప్పుడు మళ్లీ అది దూరమవుతూండడంతో చప్పబడుతున్నారు. మాది జాతీయపార్టీ, సమస్యను అన్ని కోణాలలో విశ్లేషించాలి అని మనకు నీతులు చెప్తున్నారు. మనకు స్పష్టంగా కనబడుతున్నదేమిటంటే – హై కమాండ్ ఆడనిచ్చినంత వరకే వీళ్లు ఆడతారు. ఒక్కసారి వాళ్లు కయ్ మంటే వీళ్లు కుయ్యో మంటారు. వీళ్లతో లాభం లేదు అని గట్టిగా అనుకున్నవాళ్లు తెరాస వైపు పయనిస్తారు. ఎవరి బాట కరక్టో ఎన్నికలే తేల్చాలి.

టిడిపిలో కాంగ్రెసంత స్వేఛ్ఛవుండదు. బాబు ఎంతవరకు అనుమతిస్తే అంతవరకూ టిటిడిపివారు మాట్లాడతారు. బాబుకి వీరి అనుమతి అక్కరలేదు. అందుకే రాష్ట్రావతరణం రోజున హఠాత్తుగా తెలుగువారి ఐక్యత గురించి చరిత్ర గుర్తు చేసుకున్నారు. 150 ఏళ్లు మాత్రమే విడిగా వున్నారని హఠాత్తుగా తోచింది. రాష్ట్రవిభజనకు సై అంటూ తీర్మానం చేసి, ప్రణబ్‌కు లేఖ పంపినపుడు ఆ చరిత్ర పుస్తకం ఎక్కడో పారేసుకున్నారు. ఇన్నాళ్లకు దొరికింది. సోనియా సమైక్యవాదం గురించి మాట్లాడదు కాబట్టి కాంగ్రెస్ వాళ్లకు సంజాయిషీ చెప్పుకోవలసిన అవసరం లేదు కానీ బాబు యిలా మాట్లాడుతూంటే టిటిడిపి వారు యిరకాటంలో పడతారు. ఆచితూచి మాట్లాడే బాబు అలా మాట్లాడారంటే కాంగ్రెస్ హై కమాండ్ తెలంగాణ యివ్వటం లేదన్న సంగతి ఆయనకు ఉప్పంది వుంటుందని వీరి అంచనా. తెలంగాణ యివ్వని పాపం కాంగ్రెస్ నెత్తిమీదకు తోసేయవచ్చన్న ధైర్యంతో వాళ్లు మరీ స్వరం పెంచుతున్నారు – ఇవ్వాలి, యివ్వాలి అని. వాళ్లు ఎంత గొంతు చించుకున్నా తెరాస నమ్మదు. బాబు చేత లేఖ యిప్పించలేనివాళ్లు బాపూజీ వెంటపడడం దేనికి అని వారి ఎద్దేవా. మీరూ, కాంగ్రెస్ కుమ్మక్కయి మమ్మల్ని అల్లరి పెడుతున్నారని టిడిపి అభియోగం. అదే మాట బాపూజీ చేత కూడా చెప్పించారు.

ఏతావాతా తెలంగాణ వాదుల్లో చీలికలు పెరుగుతున్నాయి తప్ప తగ్గటం లేదు. టీవీ చర్చల్లో చూస్తాం కదా – ఒక జర్నలిస్టు (వారు తటస్థంగా వుంటారని మనం ఆశించాలి కాబట్టి ప్రాంతం మాట ఎత్తలేము) పక్కన ముగ్గురు పానెలిస్టులుంటే నూటికి 80 కేసుల్లో ఆ ముగ్గురూ తెలంగాణవారే అయి వుంటారు. అయినా ముగ్గురూ కలియబడి కొట్టేసుకుంటూ వుంటారు. బిజెపివారుంటే కాస్త సౌమ్యంగా మాట్లాడతారు కానీ తెలంగాణకు చెందిన కాంగ్రెస్, టిడిపి, తెరాస నాయకులు మాత్రమే వుంటే మనకు చెవులు బద్దలై పోతాయి. ఒక్క ముక్క అర్థం కాకుండా అరుచుకుంటారు. ముఖ్యంగా తెరాస నాయకులు (ఒకరిద్దర్ని తప్పిస్తే) అవతలివాళ్లకు మాటమాటకూ అడ్డు తగులుతారు. వీళ్లందరూ కలిసి తెలంగాణ ఎలా తెస్తార్రా అని ఆశ్చర్యం వేస్తుంది మనకు.

మళ్లీ మొదటికి వచ్చాం. ఆంధ్రప్రాంతపు నాయకులలో యీ అనైక్యత కనబడదేం? సమైక్యవాదం వచ్చేసరికి వాళ్లు ఏకమవుతున్నారేం అన్న ప్రశ్న వుదయించక మానదు. నా ఉద్దేశంలో అక్కడి ఐక్యత కూడా వుట్టిదే. తెలంగాణ ప్రత్యేక ఉద్యమానికి కాస్తో కూస్తో ఉద్యమలక్షణాలున్నాయి. సమైక్య ఉద్యమానికి ఆ లక్షణాలు కూడా లేవు. ఎప్పుడో ఓ స్టేటుమెంటు, ఇంకెప్పుడో మానవహారం, దిష్టిబొమ్మల దహనం చేసినంత మాత్రాన ఉద్యమం వున్నట్టు కాదు. చిదంబరం చెప్పినట్టు బక్రీద్ తర్వాత తెలంగాణ యిచ్చేస్తున్నామని స్పష్టమైన ప్రకటన ఒకవేళ వస్తే అప్పుడు దాన్ని అడ్డుకోవడానికి ఉద్యమం రావచ్చు. ఆ ఉద్యమానికి నాయకత్వం ఎవరిది అన్న ప్రశ్న వుదయిస్తే అప్పుడు వారిలో వారికి కొట్లాటలు వస్తాయి. ప్రస్తుతానికి ఉద్యమం లేదు కాబట్టి అందరూ ఫ్రెండ్లీయే !

ఒకవేళ తెలంగాణ యిస్తున్నాం, దానికో రాజధాని, ఆంధ్రకు ఓ రాజధాని యిస్తున్నాం అన్నారనుకోండి. అప్పుడూ ఐక్యత భగ్నమే. ఆ రాజధాని మాకు రావాలంటే మాకు రావాలని భీకరంగా కొట్టేసుకుంటారు. ఆ మధ్య హైకోర్టు బెంచ్ కావాలంటూ గుంటూరులో సమ్మె చేసినపుడు చూశాం కదా, ప్రతీ జిల్లా వాళ్లూ మాకంటే మాకని గొడవ చేశారు. చివరకు ఎవరికీ యివ్వలేదు. చప్పబడిపోయింది. ఎవరికీ యివ్వకపోయినా ఫర్వాలేదు కానీ గుంటూరు వాళ్లకు మాత్రం యివ్వకూడదని మిగతావాళ్ల పంతం. ఆంధ్రకు రాజధాని అనగానే రాయలసీమ, ఉత్తరాంధ్ర వాళ్లు ఉభయగోదావరి, కృష్ణా? గుంటూరు జిల్లాల వాళ్లని దుమ్మెత్తి పోయడం ఖాయం. వాళ్లు పెద్దన్న తరహాలో ప్రవర్తిస్తారు కాబట్టి రాజధాని వాళ్లకు యివ్వకూడదని ఆందోళనలు చేస్తారు. ప్రాంతాల వారీ పోట్లాటలకు తోడు, పార్టీల వారీ పోట్లాటలు కూడా తోడవుతే ఈనాటి ఐకమత్యం గంగపాలు.

అక్కడైనా, యిక్కడైనా నాయకులు ఒక్కరకమే. ఏమీ లేనప్పుడే కలిసి వుంటారు. అమృతం బయటపడేవరకూ దేవతలు, రాక్షసులు యిద్దరూ కలిసే క్షీరసాగరమథనం చేశారు. అమృతం బయటపడ్డాకనే కొట్టేసుకున్నారు. ఒకరి నొకరు మోసాలు చేసేసుకున్నారు. పురాణకాలం నుండీ యిదే తంతు. అన్వయించుకుని చూసుకుంటే చాలు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

**నవంబరు 14** **ఎమ్బీయస్ : కార్తీకపూర?మి తర్వాతట...**

ఇన్ని పండుగలు వుంటాయనీ, పండగలకు యింత ప్రాధాన్యత వుంటుందనీ నేనెన్నడూ అనుకోలేదు. తెలంగాణపై నిర?యం తీసుకోవాలంటే ప్రతీదీ పండగే, ప్రతీ ఎన్నికా ముఖ్యమైనదే. ఎన్నేళ్లగా వింటున్న కథ యిది ! అసాంలో ఎన్నికలయిన తర్వాత కాంగ్రెస్ అధిష్టానం దీనిపై ద ృష్టి పెడుతుంది.. అబ్బే మణిపూర్‌లో మునిసిపల్ ఎన్నికల తర్వాత... కాదు, కాదు హిమాచల్ ప్రదేశ్‌లో మంచుకురవడం ఆగిన తర్వాత... పార్లమెంటు వర్షాకాల సమావేశాల తర్వాత... కాలు విరిగిన సోనియా గాంధీ వాళ్లమ్మగారు మంచం దిగాక.. రంజాన్ తర్వాత.. సోనియా గాంధీ స్వస్థురాలై తిరిగి వచ్చిన తర్వాత.. ఓణం.. హోలీ, దసరా, దీపావళి, బక్రీద్..

అట్లతద్ది.. క్షీరాబ్ది ద్వాదశి.. భీష్మ ఏకాదశి.. పోలాల అమావాస్య...మహావీర్ జయంతి.. పార్శీల సంవత్సరాది .. విశ్వకర్మ జయంతి.. అన్ని రాష్ట్రాల కాలండర్లు ముందేసుకుని ఒక్కో పండగా చెపుతూ పోతున్నారు..

ఆజాద్‌గారు యివాళ చెప్పారు – గురునానక్ జయంతి తర్వాత నిర?యం తీసుకుంటారట.. అంటే మన కార్తీక పూర?మి అన్నమాట.. ఆరనీకుమా యీ దీపం.. కార్తీకదీపం అని పాట కూడా పాడితే చక్కగా కుదురుతుంది – ఈ తెలంగాణ కాష్టం ఎన్నటికీ ఆరకుండా చూస్తున్నారు కాబట్టి... రాష్ట్రం విడిపోవాలా వద్దా అన్నదానిపై భిన్నాభిప్రాయాలున్నా తెలుగు ప్రజలంతా ఒక్క విషయంలో మాత్రం ఏకతాటిపై నిలిచారు, 'తెలంగాణ గురించి ఏదో ఒకటి చెప్పి చావండి బాబూ' అని ఢిల్లీని వేడుకోవడంలో. 'ఆ ఏదో ఒకటి'లోనే రెండు తాళ్లు వున్నాయనుకోండి. 'తెలంగాణ యిచ్చేస్తున్నాం' అని చెప్పాలని విభజనవాదులు, 'అరిచి గీ పెట్టినా తెలంగాణ యివ్వం' అని చెప్పాలని సమైక్యవాదులు కోరుకుంటున్నారు. కానీ ఢిల్లీ బొత్తిగా 'మొక్కిన వరమీయని వేల్పు' అయిపోయింది.

ఆజాద్‌గారు చర్చల కసరత్తు మొదలు పెట్టిన దగ్గర్నుంచి అక్టోబరు నాటికి ఆ ఏదో ఒకటి బయటకు వచ్చేస్తుందని తెలుగువాళ్లందరూ ఆశపెట్టుకున్నారు. ఆజాద్ చేంతాడంత లిస్టు చదివారు – 'తెలంగాణ వారితో చర్చలు, ఆంధ్రవారితో చర్చలు, ఇద్దరినీ ఒకేసారి కూర్చోపెట్టి చర్చలు, దేశంలోని యితర రాష్ట్రాల కాంగ్రెస్ నాయకులతో చర్చలు, రాష్ట్రంలోని అఖిలపక్షాలతో చర్చలు, యుపిఏ భాగస్వాములతో చర్చలు.. వీటన్నిటి తర్వాత కాంగ్రెస్ నిర?యం, దానికి యుపిఏ ఆమోదముద్ర, అప్పుడు మాత్రమే తెలంగాణపై నిర?యం వెలువడుతుంది' అని. దీనిలో మొదటి రెండు జరిగాయి. తక్కిన స్టెప్సన్నీ అలాగే వుండిపోయాయి. కోర్ కమిటీ మీటింగులంటూ కబుర్లు చెప్పారు. వాటిల్లో తెలంగాణ గురించి మాట్లాడారో, యింకేం మాట్లాడారో తెలియదు. ఏదీ బయటకు రాదు. సమావేశం జరిగిన ఐదు నిమిషాల కల్లా యిలా జరిగింది అలా జరిగింది అంటూ తెలుగు మీడియా కథనాలు  తప్ప!

అసలు సమావేశం జరిగాక లోపలి విషయాలు బయటకు పొక్కడానికి ఎంత టైము పడుతుందో కామన్‌సెన్స్‌తో ఆలోచించి చూడండి. వెళ్లినవారి పక్కన వున్నవాళ్లో, దర్శనమిచ్చినవారి పక్కన వున్నవాళ్లో, వాళ్లకు కాఫీ కప్పులు అందించినవాడో ఏకాంతంగా దొరకాలి. అతన్ని బతిమాలో, బామాలో, బెల్లించో కాస్త కాస్త కూపీ లాగాలి. దాన్ని క్రాస్ చెక్ చేసుకోవాలి. ఇదంతా కనీసం ఓ పూట పని. కానీ మనలాటి టీవీ ప్రేక్షకులం ఆతృతగా వుంటాం కదా, అప్పటిదాకా ఆగలేం. మనకేదో కూడు పడేయాలి. అందుకని మన టీవీ ఛానెల్స్ అక్కడున్న ప్రతినిధిని తోముతారు. అతను ఏదో కూయవలసి వస్తుంది. మరి అంచనాలన్నీ తప్పేయంటే తప్పవూ..! మామూలుగా సమాచారం అందించేవాళ్లు కూడా తెలుగు మీడియా అనగానే అడిలి చచ్చేటంత పేరు తెచ్చుకున్నాం మనం. ఆజాద్‌గారు ఎన్నోసార్లు మొత్తుకున్నారు – నేను అనని మాటలు టీవీల్లో వచ్చేస్తున్నాయి బాబోయ్ అని. పాపం ఎన్ని దిష్టిబొమ్మలు అనవసరంగా తగలడుతున్నాయో !

ఇవాళ ఆజాద్‌గారు 10 తర్వాత (12 అని కొన్ని పేపర్లు అంటున్నాయి) ప్రకటన రావచ్చు అని అన్నారు. చిదంబరంగారు 'బక్రీద్ తర్వాత నిర?యం దిశగా కదలిక..' అన్నట్టు ఆజాద్‌గారు '10 తర్వాత' అన్నారు కానీ, 20 లోపున అనలేదు. 10 తర్వాత అంటే – 12 కావచ్చు, 15 కావచ్చు, 25 కావచ్చు, మొహర్రం అయిదూ కావచ్చు.. పైగా అప్పుడైనా సోనియాగారు నిర?యం ప్రకటించరట. చిదంబరంగారు హోం శాఖ ద్వారా ప్రకటిస్తారట. కేంద్రప్రభుత్వ నిర?యమే, కాంగ్రెస్ నిర?యంగా అనుకోవాలట. యుపిఏ పక్షాలతో, దేశంలోని యితర కాంగ్రెస్ నాయకులతో, రాష్ట్రంలోని నాయకులతో చర్చలు చేయకపోవచ్చునట. అవి చేయకుండా కేంద్రం ఏదో నిర?యం ప్రకటిస్తే మళ్లీ యింకో డిసెంబరు 9 ప్రకటనలా తయారవ్వడానికా? డిసెంబరు 9 న చేసిన ప్రకటన పార్లమెంటులో పునరుదొటించినా, ప్రభుత్వమే దానిపై వెనక్కి వెళ్లిపోయిందే.. అలాటి మళ్లీ యింకో ప్రకటన చేయడం దేనికి? అంతకంటె రాజకీయ నిర?యం చేసినా సొగసుగా వుంటుంది కదా!

తెలంగాణపై అనేక పార్టీలు – మా పార్టీతో సహా – తమ అభిప్రాయం చెప్పలేదు అని చిదంబరంగారు కుండ బద్దలు కొట్టారు. కాంగ్రెస్ యిక నోరు విప్పవలసిన అవసరం వచ్చింది. ఇంత అవసరం వచ్చిపడ్డాక కూడా కాంగ్రెస్ నోరు విప్పదలచుకోలేదు. అందుకే యుపిఏను పిక్చర్‌లోకి లాక్కుని వస్తోంది. ఇక్కడ చాణక్యనీతి గుర్తుకు వస్తోంది. చాణక్యుడు అంటాడు – 'పన్నులు విధించాలంటే రాజు స్వయంగా ఆ ప్రకటన చేయకూడదట. మంత్రుల చేత చేయించాలట. అదైనా 10 రూ.ల పన్ను వేయాలంటే 15 రూ.లని చెప్పించాలి. అప్పుడు ప్రజలంతా గగ్గోలు పెడతారు. అప్పుడు రాజు రంగప్రవేశం చేసి మంత్రులను పబ్లిగ్గా మందలించి, '15 రూ.లు కాదు, 10 రూ.ల కంటె మించకుండా చూడండి. నా ప్రజలు కష్టపడితే నేను చూళ్లేను.' అనాలట. ప్రజలు మంత్రులను తిట్టుకుని, రాజుకి జేజేలు పలుకుతారు. ధర్మప్రభువంటూ కొనియాడతారు. గతంలో కంటె 10 రూ.ల పన్ను పెరిగిందన్న విషయం మర్చిపోతారు. ఈ పద్ధతే మన పాలకులు పాటిస్తూ వచ్చారు. సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి ప్రకటిస్తారు, పన్నులు శాఖాధిపతులు విధిస్తారు.

ఇప్పుడు తెలంగాణ గురించి నోరు విప్పవలసిన అవసరం వచ్చినపుడు సోనియా గాంధీ ఆలోచనలో పడ్డారు. కొన్ని పేపర్లు రాసేదేమిటంటే – 'తెలంగాణ యిచ్చి కాంగ్రెస్ బావుకునేది ఏమీ లేనప్పుడు రాష్ట్రాన్ని విభజించి కొత్త తలకాయనొప్పి తెచ్చుకోవాల్సిన అవసరం ఏముంది అన్న ఆలోచనలో వున్నారట ఆవిడ. ఊరుకున్నంత ఉత్తమం లేదు అని యిటాలియన్ భాషలో అనుకుని వుంటారు. ప్రస్తుతానికి వాయిదా వేసే మార్గం ఏదో ఒకటి ప్రకటించి వూరుకుందామని ఐడియాట. అది తెలంగాణ ఉద్యమకారులకు నచ్చని ప్రకటన కావడానికే 99% అవకాశం వుంది. అందుకే యుపిఏ ప్రభుత్వం చేత ఎనౌన్సు చేయిస్తున్నారు. వాళ్లకు నచ్చేదే అయితే తన యీ ఏడాది పుట్టినరోజున ప్రకటించి అభినందనలు అందుకునేవారు. ఇదీ నా లాజిక్. తెలంగాణ ఉద్యమకారులకు

రుచించని నిర?యం అని ఎందుకుంటున్నానంటే – తెలంగాణలో అదనపు బలగాల కదలిక చురుగ్గా సాగుతోంది కాబట్టి. హైదరాబాదులో ముళ్ల కంచెల ఏర్పాటు కూడా కనబడుతోంది. అంటే నిర?యం వెలువడగానే తెలంగాణలోనే నిరసన చెలరేగుతుందన్నమాట.

ఆ నిర?యం ఏం కావచ్చు? 'తెలంగాణ యివ్వం, ఏం చేస్తారో చేసుకోండి' అనేటంత ఘాటుగా వుండదు. అలా అంటే కోరి కొరివితో తల గోక్కున్నట్టే. తమ వైపు తిప్పుకున్న తెలంగాణ మంత్రులను, లెజిస్లేటర్లను ఉద్యమాగ్నికి ఆహుతి చేసినట్టే. ఉద్యమాగ్నిని చల్లార్చడమే తక్షణ కర్తవ్యం. ఇప్పట్లో రాదు అన్న సందేశం బలంగా జనాల్లోకి వెళ్లాలి. ఇప్పటికే చదువుకున్నవారిలో, పేపరు చదివి అంతరార్థం గ్రహించేవారిలో (బిట్వీన్ ద లైన్స్ చదివే బాపతు) తెలంగాణ రాదన్న గ్రహింపు వచ్చేసింది. ఎటొచ్చీ వాళ్లు ప్రత్యేక తెలంగాణ రావాలని గాఢంగా వాంఛించేవారయితే 'ఇప్పుడివ్వరు కానీ ఎన్నికల ముందు యిస్తారులే' అని తమను తాము సముదాయించుకుంటున్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయో, వచ్చినపుడు ఏ బలాలు ఎటు మోహరిస్తాయో, ఏ పార్టీ నాయకుడు ఏ జైలులో వుంటాడో, ఏ పార్టీకి ఎవరి మద్దతు అవసరం పడుతుందో.. ఎవరూ చెప్పలేరు. అప్పుడు ఏ అంశాలు బలంగా వుంటాయో, ఏవి వెనుకబడతాయో కూడా తెలియదు. అంత సుదీర్ఘంగా ఎవరూ ప్లాను చేయలేరు.

తెలంగాణ యిప్పట్లో రాదు, మీ దృష్టి వేరేవాటిపై మళ్లించండి అన్న సందేశం యివ్వాలంటే రెండో ఎస్సార్సీ ఒక సులభమైన మార్గం. కానీ రెండో ఎస్సార్సీ అంటే సిపిఎం మండిపడుతుంది. కానీ సిపిఎం యిదివరకటి సిపిఎం కాదు, కోరలు పీకేసిన పాములా వుంది. బుస కొట్టగలదు కానీ కరవలేదు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఎస్సార్సీ అంటుంది కాబట్టి తన సిద్ధాంతాలనుండి వెనక్కి మరలినట్టు కాదు. అన్నిటినీ మించి యుపిలో మాయావతిని చెక్ చేయడానికి కాంగ్రెస్ అక్కడ రెండో ఎస్సార్సీ మంత్రం పఠిస్తోంది. కాబట్టి ఆ పిడుక్కీ, యీ బియ్యానికీ ఒకటే మంత్రం వేయవచ్చని అంటున్నారు. మరి రాహుల్ గాంధీగారి 'బుందేల్ ఖండ్' కలకు కూడా యిదే మంత్రమా అని వేచి చూడాలి. మాయావతి రాష్ట్రవిభజనను అసెంబ్లీలో అంశంగా చేయబోతోంది. తన అవినీతి, అసమర్థపాలన నుండి దృష్టి మరల్చాలంటే యిదో ఉపాయం.

తమాషా ఏమిటంటే తెలంగాణకు వచ్చేసరికి బిజెపి 'చిన్న రాష్ట్రాలు' మంత్రం పఠిస్తుంది కదా, యుపికి వచ్చేసరికి ఆ మంత్రం మర్చిపోతుందట. యుపి వంటి అలవికాని రాష్ట్రంలో చిన్న ప్రాంతాలు విడగొట్టడానికి బిజెపి ఎప్పుడో ఉద్యమం నడపవలసినది. కానీ అక్కడ ఏమీ చేయదు. ఇక్కడే అదావుడి. కాంగ్రెస్ కానీయండి, బిజెపి కానీయండి, టిడిపి కానీయండి – అందరూ ఓ రోటికాడ ఆ పాటగాళ్లే. ఎవరూ ఓ సిద్ధాంతానికి కట్టుబడరు. కట్టుబడిన సిద్ధాంతం యిది బహిరంగంగా చెప్పరు. అధికారంలో వుండగా ఓ మాట, విపక్షంలోకి వస్తే మరో మాట. కఠినమైన నిర?యం తీసుకోవాలంటే బెదురు. అందుకే ఆజాద్ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ పార్టీ పటిష్టమయ్యే నిర?యం తీసుకుంటాం అని చెప్తున్నారు. సమైక్యవాదులు, విభజనవాదులు యింత గట్టిగా నిలిచినపుడు ఏ నిర?యం యిద్దరినీ తృప్తి పరుస్తుంది?

ఆజాద్ స్టేటుమెంటు అయోమయంగా వుందనిపిస్తోంది తప్ప ఆశాజనకంగా అనిపించలేదు – మీకూ నాకూ. కానీ కోమటిరెడ్డిగారికి దానిలో తెలంగాణ వస్తోందన్న ఆశాకిరణం తోచింది. (నీరసం వలన కళ్లు బైర్లు కమ్మితే అలాటి కాంతిరేఖలు కనిపిస్తాయి లెండి) అందుకని నిరాహారదీక్ష విరమించేశారు. పోన్లెండి, ఏదో ఒకటి. మానేసి మంచిపని చేశారు. ఆజాద్ కానీ మరొకరు కానీ దీక్ష విరమించమని తన పేర డైరక్టుగా విజ్ఞప్తి చేయకపోయినా కోమటిరెడ్డి దీనితోనే తృప్తి పడ్డారు. బతికిపోయారు. మనమూ బతికిపోయాం. ఆయనకు ఏదైనా అయివుంటే మారణహోమం జరిగి వుండేది. ఏమీ కాకుండా బయటపడ్డారు. ఇలాటిదేదో అవుతుందనే అనుమానంతోనే కాబోలు జాక్ వారు నల్గొండ బంద్‌ను బంద్ చేశారు. తన ప్రకటనకు యింత విలువ దక్కినందుకు ఆజాద్ ఉబ్బితబ్బిబ్బయి వుంటారు. ఏమీ లేని స్టేటుమెంటులో నుండి ఎంతో వూహించుకోగలిగిన తెలుగువారి కవితాశక్తికి జోహార్లు అర్పించి వుంటారు.

ఈ వ్యాసం పూర్తవుతుండగానే రెండో ఎస్సార్సీ గురించి కాంగ్రెస్ అధికార ప్రతినిధి, దిగ్విజయ్ సింగ్ అన్న వ్యాఖ్యలు బయటకు వచ్చాయి. తెలంగాణకు కూడా అవి వర్తిస్తాయో లేదో స్పష్టత లేదు. ఆజాద్‌గారే చెప్పాలట. చెప్పనీయండి. రెండో ఎస్సార్సీ అంటే అంతకంటె అన్యాయం మరొకటి లేదు. శ్రీకృష్ణ కమిటీ కంటె రెండో ఎస్సార్సీ ఏమైనా వూడబొడుస్తుందా? కావాలంటే కమిటీ రిపోర్టు మళ్లీ ఓ సారి చదవమనండి. కాదూ కూడదూ ఎస్సార్సీయే అన్నారంటే తెలంగాణ యివ్వం అని స్పష్టంగా చెప్పినట్టే లెక్క. ఇంకా ఆశ పెట్టుకుంటే అది మన అవివేకమే అవుతుంది. కానీ ఎస్సార్సీ అనేస్తే ఓ లాభం వుంది. కాంగ్రెస్ నుండి తెరాసకి వెళ్లేవాళ్లకు మార్గం సుగమం చేసినట్టవుతుంది. ప్రస్తుత పరిస్థితితో రాజీపడి ఉండేవాళ్లెవరో, కాదు ఎలాగైనా యిచ్చి తీరాలని పోట్లాడేవారెవరో తేలిపోతుంది. ఈ దోబూచులాట ఆగుతుంది. కాంగ్రెస్ వాళ్ల ముసుగు లాగేస్తే టిడిపి వారి ముసుగు కూడా జారుతుంది. అదొక్కటే రాష్ట్రానికి కలిగే లాభం. తక్కినవన్నీ నష్టాలే. వాయిదాలు వేస్తూ కూర్చుంటే నిప్పు ఎప్పటికీ చల్లారదు. అశాంతి వున్నంతకాలం అభివృద్ధి జరగదు. తెలంగాణపై తేల్చి చెప్పండి అంటూ ఆంధ్రప్రాంతంలో కూడా ఉద్యమం వస్తేనే ఢిల్లీ కదులుతుందేమో! సమైక్యవాదనాయకులు ఆ దిశలో ఆలోచించి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

**నవంబరు 19** **ఎమ్బీయస్ : కొండంత రాగం తీసి..**

కాంగ్రెస్ వాళ్లు రెండో ఎస్సార్సీ అంటే కొండంత రాగం తీసి కుసింత పాట పాడినట్టుంది అన్నారు కెసియార్. భలే చెప్పారు. అసలు నాకు కెసియార్ ఉపన్యాసాలంటే చాలా యిష్టం. ఇప్పుడున్న నాయకులందరిలో మంచి వక్త ఎవరంటే ఆయనే. తెలుగు జాతీయాలను ఎంత అందంగా వాడతారో చెప్పలేను. ఆ మధ్య ఒకసారి 'నిద్రపోతున్నవాణ్ని లేపి తన్నించుకున్నట్టుంది..' అన్నారు. కెసియారే కాదు, ఆయన కుమారుడు కెటియార్, కుమార్తె కవిత కూడా చాలా చక్కగా మాట్లాడతారు. రాష్ట్ర నాయకుల్లో మంచి యింగ్లీషు మాట్లాడేవారిలో ఒవైసీ సోదరులు, కెటియార్ ఎన్నదగినవారు.

కెసియార్ చెప్పినది అక్షరాలా నిజం. ఇప్పుడు రెండో ఎస్సార్సీ అంటే ఆంధ్ర, తెలంగాణ జనాలు యిద్దరూ కలిసి తన్నేట్టున్నారు. అందుకే నిన్న ఆజాద్ దాని మాట ఎత్తలేదు. జాతీయనాయకులతో చర్చలు సాగుతాయన్నారు. మన రాష్ట్రం అంటే బొత్తిగా లోకువై పోయింది ఢిల్లీకి. రెండో ఎస్సార్సీ, గిస్సార్సీ అంటే తుపానే అన్నారు కెసియార్. దాంతో ఢిల్లీవాళ్లు ఆ మాట కూడా అనడం మానేశారు. మొన్నటికి మొన్న 'చర్చలు పూర్తయిపోయాయి, ఇంకేం లేవు, గురుపూరి?మ తర్వాత హోం మినిస్ట్రీ ద్వారా ప్రభుత్వం ప్రకటన చేస్తుంది' అన్న ఆజాద్ ఇప్పుడు 'మళ్లీ జాతీయనాయకులతో చర్చల'ంటున్నారు. బొత్స గారు చూడాలి.. పార్లమెంటు సమావేశాలకు ముందో, వెనుకో ప్రకటన వస్తుందట. ప్రకటన రాకపోతే ప్రకటన ఎప్పుడు వస్తుందో ప్రకటన వస్తుందట. బొత్తిగా వెక్కిరింత అయిపోయింది. తెలంగాణ అంటే అంతు, పొంతులేని కథ మాత్రమే కాదు, పొంతన లేని ప్రకటనల కథ అయిపోయింది.

తెలంగాణ విషయంలోనే కాదు, యుపి విషయంలో రెండో ఎస్సార్సీ గురించి ఇప్పటిదాకా నిర?యం తీసుకోలేదన్నారు మనీష్ తివారీ! మాయావతి గుగ్లీకి అందరూ గింగరాలు తిరుగుతున్నారు. అడ్వానీగారి తడబాటు స్పష్టంగా కనిపించింది. చిన్న రాష్ట్రాల విషయంలో ఆదరాబాదరా నిర?యాలు తీసుకోకూడదట. చర్చలు జరపాలట. శాస్త్రీయంగా చేపట్టాలట. తెలంగాణ విషయంలో ఏ శాస్త్రీయ పద్ధతి ఉపయోగించారు స్వామీ తమరు? ఎవరితో చర్చలు చేశారు? మాట్లాడితే కాకినాడ తీర్మానం అంటారు, అది అటకెక్కించి ఎన్నాళ్లయింది? ఆ తర్వాత వచ్చిన మార్పులు, అభివ ృద్ధి గణాంకాలు లెక్కలో తీసుకున్నారా? తెలంగాణ గురించి అడిగితే 'ఆ సమస్య 25, 30 ఏళ్లగా వున్న సమస్య' అని దాటేశారు. మరి అంత పాత సమస్య అయితే తమరు పాలించినపుడు పట్టుబట్టలేదేం? అప్పుడు తెలంగాణ రాష్ట్రం అక్కరలేదని అడ్వానీ స్వయంగా అన్నారు. ఇప్పుడు టిడిపిపై నెపం నెట్టేస్తున్నారు. అంటే రాజకీయ పరిమితులకు లోబడే నిర?యం తీసుకున్నారు కదా, ఇప్పుడు కాంగ్రెస్, టిడిపి చేస్తున్నది అదే. మరి వాళ్లను తప్పు పట్టడం దేనికి?

బుందేల్ ఖండ్ విషయంలో ముందుకెళ్లిపోయిన కాంగ్రెస్ యుపిని విడగొడదామంటే బాబోయ్ అంటోంది. 75 జిల్లాలున్న రాష్ట్రాన్ని 25 జిల్లాలున్న మూడుగా విడగొట్టడం సమంజసంగానే తోస్తుంది. (మాయావతి బొత్తిగా 4 అంటున్నారు. అవధ్ జిల్లాలో 14 ట, పూర్వాంచల్‌లో 32 ట., బుందేల్‌ఖండ్‌కు యుపిలో 7 జిల్లాలట !) విస్తీర?ం, జనాభా సమానంగా వుండేట్లు మూడు ముక్కలు చేయడం న్యాయం అనిపిస్తుంది కానీ వీళ్లు రాజకీయాల్ని ద ృష్టిలో పెట్టుకుని చేస్తున్నారు. అసలు యీ పనిని సోషల్ సైంటిస్టులకు వదిలేయాలి. తెల్లవారితే అంబేడ్కర్ జపం చేసే మాయావతికి యుపిని మూడు ముక్కలు చేయాలని ఆయన 1956లోనే చెపితే దశాబ్దాలపాటు పరిపాలన చేశాక యిప్పుడు ఎన్నికలు వాకిట్లో వుండగా గుర్తుకు వచ్చింది. ఇది రాజకీయం కాక మరేమిటి?

కాంగ్రెస్ కొండంత రాగం తీసి, తుస్సుమనిపిస్తోంది అని కెసియార్ బాగానే అన్నారు కానీ ఆయన చేస్తున్నదీ అదే. పదేళ్లగా తెలంగాణను వార్తల్లో వుంచి, యిప్పుడు స్వప్రయోజనాల గురించి తుస్సుమనిపిస్తున్నారు. ఆయనే కనక సవ్యంగా వుండి అందర్నీ ఒక తాటిపై నడిపించి వుంటే తెలంగాణ ప్రాంత నాయకులంటే ఢిల్లీ భయపడేది. తెలంగాణ గురించి మాట్లాడాలంటే తెరాస గూటిలోంచే మాట్లాడాలి అన్న పరిస్థితి కల్పించి కెసియార్ అందర్నీ చెడగొట్టుకున్నారు. ఇప్పుడు తక్కిన పార్టీల తెలంగాణ నాయకులకు ఉద్యమం అంటే భయం పోయింది. అందుక 'ఉద్యమమూ చేశాను, ఫైళ్లూ చూశాను' అని జానారెడ్డి ధైర్యంగా స్టేటుమెంటు యివ్వగలిగారు.

తెలంగాణ ఎమ్మెల్యేలు తమ రాజీనామాల గురించి పట్టుబట్టరు అని బాహాటంగా చెప్పేసుకుంటున్నారు. తెలంగాణ మంత్రులందరికీ ధైర్యం వచ్చేసింది. 'కోర్ కమిటీ ఏం చెప్తే అదే' అంటున్నారు డియస్. కోమటిరెడ్డి దీక్ష చేస్తే ప్రభుత్వం తరఫున ఎవరూ తొంగి చూడకపోయినా (దానం నాగేందర్ వ్యక్తిగతంగా వెళ్లానన్నారు) ఏమీ కొంప మునగలేదు. చంద్రబాబు తెలుగువాళ్లంతా వేల సంవత్సరాలుగా కలిసి వున్నారంటూ బహిరంగ వేదికపై మాట్లాడారు. పోలవరం టెండర్ ఉదంతం తర్వాత టిడిపి వాళ్లకు ధైర్యం వచ్చేసి కెసియార్‌ను డైరక్టుగా విమర్శిస్తున్నారు. వీళ్లంతా మొన్నటిదాకా కొండంత రాగం తీసినవాళ్లే. ఇప్పుడు తెలంగాణ రాదన్న ధైర్యంతో వున్నట్టు కనబడుతోంది.

తెలంగాణ గురించి యింకా గట్టిగా మాట్లాడుతున్నవారెవరైనా వున్నారా అంటే ఐదారుగురు టికాంగ్రెస్ ఎంపీలు మాత్రమే. రేపు పార్లమెంటు సమావేశాల్లో గొడవ చేయబోయేది వాళ్లే. మధు యాష్కీ లాటి వాళ్లు కూడా చల్లబడ్డారు. వీళ్లను ఢిల్లీవాళ్లు నిలదీయడానికి మంచి సందరరే కలిగించింది తెరాసయే. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తనలోకి లాక్కుంటున్న కెసియార్‌కు లాభం కలిగేలా తెలంగాణ యిప్పుడు యిమ్మంటారా?" అని హై కమాండ్ అడిగితే వీళ్లు సమాధానం ఏం చెప్పగలరు? లేదు, లేదు తెలంగాణ యిస్తామనగానే తెరాస మనలో కలిసిపోతుంది అనో, తెలంగాణలో మనం స్వీప్ చేస్తాం అనో చెప్పుకోవాలి. ఓ పక్క కిరణ్ ప్రభుత్వం అధ్వాన్నంగా

వుంది. కాంగ్రెస్ చాలా వీక్ అయిపోయింది అని చెపుతూ, వచ్చే ఎన్నికలలో మనదే విజయం, తెలంగాణ యిచ్చాం కదాని తక్కిన కష్టాలన్నీ ఓటర్లు మర్చిపోతారు అంటే ఎంత సిల్లీ ఆర్గ్యుమెంట్ ! కాంగ్రెస్‌కో ఖత్మ్ కరో, తెలంగాణ హాసిల్ కరో అనే రణనినాదం యిచ్చిన కెసియార్ కాంగ్రెస్ వైపు వెళితే ఆయన క్రెడిబిలిటీ ఏమవుతుంది? వెంటనే టిడిపి ఆగమాగం చేసేయదా? అప్పుడు కాంగ్రెస్, తెరాస రెండూ దెబ్బ తిని టిడిపి బలపడదా?

ఏదో ఒకటి తేల్చేయండి అని మనం సులభంగానే చెప్పేస్తాం. ప్రతిపక్షాలూ చెప్పేస్తాయి. అధికారంలో వున్నవాడికే వంద కాలిక్యులేషన్స్. అంతెందుకు, బిజెపి రేపు అధికారంలోకి వచ్చినా తెలంగాణ ఛట్టున యిచ్చేస్తుందా? అలా యివ్వగలిగితే గతంలోనే యిచ్చి వుండేది. ఈ పాటికి రామాలయమే కట్టి వుండేది. ఇప్పుడు అధికారంలో వున్నది కాంగ్రెస్ కాబట్టి యీ తటపటాయింపు. తలో నాయకుడి చేతా తలో రకమైన ప్రకటన యిప్పిస్తూ వుంటారు. దేనికి ఎక్కువ సానుకూల స్పందన వచ్చిందో చూసి అప్పుడు అదే మా పంథా అంటారు. పరిస్థితులు తమకు అనుకూలంగా మారుతాయేమోనని ఆశిస్తూ అప్పటిదాకా వాళ్లు ఏదో రాగం – కూని రాగమో, ఖూనీ రాగమో – తీస్తూ వుంటారు.

ఇక్కడో ఎస్పీ బాలు గారి అనుభవం ఒకటి గుర్తుకు వస్తోంది. 1972 ప్రాంతంలో ఆయనకు సింగపూర్ ట్రిప్పు అవకాశం వచ్చింది. ఆయన అక్కడ తమిళపాటలు పాడాలని నిర్వాహకులు చెప్పారు. పెద్ద స్టేడియంలో బ్రహ్మాండమైన ఆడియన్సు మధ్య కార్యక్రమం ప్రారంభించబోతూ చూసుకుంటే ఆయన పాటలు రాసుకున్న పుస్తకం కనబడలేదు. ఆయన తను పాడాల్సిన తమిళ పాటల్ని తెలుగు లిపిలో రాసుకుని పెట్టుకున్న పుస్తకం హోటల్ రూములో మర్చిపోయి వచ్చారు. అది లేకపోతే పాడలేరు. పక్కన ఎవరైనా తమిళుడిని అడిగినా అతను తమిళలిపిలో రాసి యిస్తాడు. అది యీయనకు చదవడం రాదు. అందువలన ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పుస్తకం చేతికి రావలసినదే. కానీ ఈ లోపులే తెర తీసేశారు. ఏదో ఒక పాట పాడి తీరాలి. ఎలా?

బాలుగారు శేషగిరిరావు గారనే ఆయన్ని పిలిచి మీరు తక్షణం కారులో హోటల్‌కి వెళ్లి పుస్తకం పట్టుకురండి అన్నారు. "మరి అప్పటిదాకా ఎలా?" అన్నారు రావుగారు. "గంగై అమరన్ రాసిన 'రాగమో అదన్ నాదమో నాయగన్' అన్న పాట మాత్రం నోటికి వచ్చు. దాన్నే సాగదీసి పాడుతూ వుంటాను, మీరు వచ్చేదాకా.." అన్నారు బాలు. ఇక బాలు ఆ 'రాగమో..' పాటను పట్టించారు. రాగమో, ఆలాపనో, స్వరమో ఏదో ఒకటి సాగదీస్తూ, రావుగారు వచ్చేరేమోనని సైడ్ వింగ్‌లోకి చూస్తూ, తన బెదురు ప్రేక్షకులు గమనించకుండా జాగ్రత్తపడుతూ, పాటను మాత్రం ఆపకుండా, బోరు కొట్టించకుండా, ప్రేక్షకులకు అనుమానం రాకుండా రావుగారు వచ్చేదాకా పాడుతూనే వున్నారు. రావుగారు తిరిగి వచ్చి బాలు చేతికి ఆ పుస్తకం యివ్వడానికి 12 నిమిషాలు పట్టింది. ఓ సారి ఈ సంఘటన గురించి చెపుతూ బాలుగారు అన్నారు "రాగాలు తీస్తూ శ్రోతలను ఒకే పాటతో 12 నిమిషాల పాటు ఆకట్టుకోగలం అనే విషయం యీ ప్రయోగం ద్వారా నాకు తెలిసి వచ్చింది." అని.

పుస్తకం చేతికి వచ్చాక కానీ ప్రేక్షకులకు బాలు గారు అప్పటిదాకా కొండంత రాగం ఎందుకు తీశారో తెలిసిరాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా తెలంగాణ ఫార్ములా రాసి పెట్టుకున్న పుస్తకం పోగొట్టుకుంది. అందుకే బాలు బాటలో కొండంత రాగం తీస్తోంది. ఆయనైతే 12 నిమిషాల్లో ముగించారు. వీళ్లు 12 సంవత్సరాలు సాగదీసేట్టున్నారు. ఎటొచ్చీ మనం అప్పటిదాకా వాళ్లని వేదిక మీద కొనసాగిస్తామో లేదో డౌటు ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

## నవంబరు 21 — ఎమ్బీయస్ : స్పీకరు పడిగాపులు...

మొన్నటిదాకా ఎమ్మెల్యేలు స్పీకరు నిర?యం కోసం ఎదురు చూశామన్నారు. ఆయన దొరక్కపోతే నానా బీభత్సం చేసేశారు. నాగం గారైతే ఏకంగా కోర్టు తలుపు తట్టారు. తెలంగాణ కోసం, జగన్ కోసం మేమంతా రాజీనామాలిస్తే యీ స్పీకరు మా లక్ష్యసాధనకు అడ్డుపడుతున్నాడని మండిపడ్డారు, తిట్టిపోశారు, శాపనార్థాలు పెట్టారు.

ఆ పాపం వూరికే పోలేదు. ఇప్పుడు పడిగాపులు పడుతూ కూర్చోవడం స్పీకరు వంతయింది. మీ రాజీనామాలపై తేల్చేస్తాను, పట్టండి అని స్పీకరు బాసింపట్టు వేసుకుని కూర్చున్నారు. కానీ ఎమ్మెల్యేలే ఫికరు లేకుండా పోతున్నారు. గంప గోవర్ధన్, జోగు రాములుల గురించి నిన్న గంటన్నర కూర్చోవలసి వచ్చింది. ఇవాళ కాంగ్రెస్ నుండి తెరాసలో వెళ్లిన యిద్దరి గురించి కూర్చున్నారు. అందరికీ దొరికిన సాకు – తెరాస పాదయాత్ర ! 21, 22 తారీకుల్లో పాదయాత్ర గురించి ఐదారు రోజుల ముందునుండీ చేసే ఏర్పాట్లు ఏముంటాయి? పాదాలు ఆల్‌రెడీ వున్నాయి. బాటలున్నాయి. స్పీచులు ఎప్పణ్నుంచో రెడీ. రెండేళ్లగా వినివిని జనాలకు కంఠతా వచ్చేశాయి. వెనక్కాల జనాన్ని ఏర్పాటు చేసుకోవడం కష్టమా? మేం అనుకున్న దాని కంటె వందరెట్లు ఎక్కువమంది వస్తున్నారని కెటియార్ అంటున్నారు. మరి ఇంకేం ఏర్పాటు చేయాలిట? చింపడానికి దారిలో ప్రతిక్షకుల ఫ్లెక్సీలు లేవనా!?

అసలు పాదయాత్రలెందుకు పెట్టారో తెలియదు. మామూలుగా చూస్తే ఇది ఉద్యమంలో వేయాల్సిన తొలి అడుగు. వాళ్ల మాటల్లోనే చెప్పాలంటే – ఉద్యమం కీలక దశ (ఈ కీలకదశలోనే ఉద్యమం ఏళ్ల తరబడి పాతుకుపోయింది) చేరాక – యిప్పుడీ బుడిబుడి అడుగులేమిటి? నిజానికి మన్‌మోహన్ స్టేటుమెంటు చూశాక రాష్ట్ర విభజన కోరుకునేవారందరి గుండెలూ భగ్గుమనాలి. హోం మినిస్టర్ చేత ప్రభుత్వం తరఫున స్టేటుమెంటు యిప్పిస్తాం అంటూనే సాక్షాత్తూ ప్రధాని చేతనే తెలంగాణ ఆశలపై కుండెడు

చన్నీళ్లు కుమ్మరించారు. తెలంగాణ యిప్పట్లో యివ్వడం కుదరదు, యిస్తే యితర ప్రాంతాలలో (రాష్ట్రంలోనా, దేశంలోనా అని విశదంగా చెప్పలేదు) అశాంతి చెలరేగుతుంది అని వక్కాణించారు. అబ్బెబ్బే ఆయనకేం తెలియదు, కళ్లులేని కబోది, ఆయనకు దారి చూపించి నడిపించే సోనియాకు అన్నీ తెలుసు. ఆవిడ యిచ్చేస్తుంది అని ఉద్యమనాయకులు యింకా ఊరిస్తున్నారు.

మన్‌మోహన్ వొట్టి కీలుబొమ్మ, మరబొమ్మ అని ఓ పక్క అంటాం కదా! సోనియాను అడగకుండా ఆయన యింతటి ప్రాముఖ్యత గల అంశంపై యిలా మాట్లాడేస్తారా? సోనియాయే తన అభిప్రాయాలను విడివిడిగా అందరిచేతా చెప్పిస్తోంది అని అనుకోవడమే సబబు. రషీద్ ఆలీ, దిగ్విజయ్, ఆజాద్, ప్రణబ్, చిదంబరం.. ఒక్కరంటే ఒక్కరైనా ఆశాజనకంగా మాట్లాడుతున్నారా? మొన్న కోర్ కమిటీ మీటింగ్ జరిగాక ఎవ్వరూ ప్రెస్‌తో మాట్లాడకుండా వెళ్లిపోయారంటే ఏమనుకోవాలి? వైయస్ వున్నంతకాలం సోనియాకు తెరాసతో కలిసి ఊరేగాలని మహా ఉబలాటంగా వుండేది. అప్పుడు ఆయన అడ్డుపడ్డాడు. 2009 ఎన్నికల్లో పొత్తు అంటే నన్ను తప్పించి ఆ తర్వాత పొత్తు పెట్టుకోండి అన్నాడు.

వైయస్ పోయాక రోశయ్య హయాంలో ఆయనను లక్ష్యపెట్టకుండా డిసెంబరు 9 ప్రకటన చేయించింది. దెబ్బకి నసాళం అంటింది. ఇక అప్పణ్నుంచి అన్నీ వెనకడుగులే ! వెనక్కి వెనక్కి వెళ్లిపోతున్నారు. ఎలాగోలా యిచ్చేస్తుందేమోనన్న ఆశతోనే టి కాంగ్రెస్ వాళ్లు కాస్త అడావుడి చేశారు. హై కమాండ్ మనసును చదవగలిగినవారు ముందే జాగ్రత్త పడ్డారు. వాళ్లను అర్థం చేసుకోలేనివారు అటూయిటూగా మాట్లాడారు. వాళ్లను వంచగలమని భ్రమపడినవారు మరీ దూకుడుగా వెళ్లి యిప్పుడు చేదుమాత్రలు మింగుతున్నారు. రాజీనామాలు సమర్పించగానే ప్రభుత్వం తొట్రుపాటు పడలేదు. చూద్దాం అన్నట్టు కూర్చుంది. వెంటనే చర్యలు తీసుకుంటే వీళ్లు హీరోలు అయ్యేవారు. అలా చేయకుండా నానబెట్టింది. రాజీనామాల వలన భూగోళం బద్దలవదని అందరికీ పాఠం గరిపింది. మలిపాఠంగా సమ్మె జరగనిచ్చింది. కఠిన చర్యలు తీసుకోలేదు. నెల్లాళ్లపాటు సాగనిచ్చాక, అప్పుడు యిక ఊరుకోదు అనే సంకేతం పంపగానే సమ్మె నీరుగారిపోయింది.

ఇక మిగిలినది ఆమరణ నిరాహారదీక్షలు. కూనంనేని దీక్ష, కోమటిరెడ్డి దీక్ష చూశాం. ప్రభుత్వం తరఫునుండి పలకరింపులే లేవు. ఓపికున్నంత సేపు చేయించి ఆ తర్వాత ఆసుపత్రికి తరలించి సెలైన్ ఎక్కించేశారు. మానకపోతే గుటుక్కుమంటామేమోనని భయం కల్పించి విరమింపచేశారు. దీక్ష వలన సాధించింది ఏమిటో ఎవరికీ తెలియదు. ఇక మిగిలినది కెసియార్ చేయాల్సిన నిరాహారదీక్ష. ఎప్పణ్నుంచో చెప్తున్నారు – ఇంట్లో వాళ్లు వద్దంటున్నా చేసేస్తా అని. మన్‌మోహన్ స్టేటుమెంటు బయటకు రాగానే నిరాహారదీక్షకు మంచి కారణం దొరికిందనుకున్నాను. కానీ కెసియార్ దాన్ని వినియోగించుకోలేదు. ప్రజల్లో ఆ స్టేటుమెంటుకి రావలసినంత ప్రతిస్పందన రాకపోవడంతో నిదానించి వుంటారు.

నిజానికి మన్‌మోహన్ ప్రకటనకు స్పాంటేనియస్‌గా తెలంగాణ అంతా ప్రదర్శనలు, నిరసనలు, హర్తాళ్లు జరుగుతాయని అనుకున్నాను. అవేమీ జరగలేదంటే జనాలు నిరాసక్తంగా వున్నారని అర్థమైంది. ఇది మాకు ముందే తెలుసు అన్న భావనో, ఏం చేస్తే మాత్రం ఏం లాభం అన్న నిర్లిప్తతతో, రాజకీయనాయకుల ఆటలపై నిరసనో నాకు తెలియదు. జనాల్లో కదలిక లేదు. కెసియార్‌కు కూడా అదే తోచి వుంటుంది. అందుకని అప్పుడు మొదలుపెట్టలేదు. కోదండరామ్ చేత యాక్షన్ ప్రోగ్రాం పెట్టించారు. నిన్నటినుండి పాదయాత్రలు, మరోటీ అంటూ.. అంటే యిలా ఏర్పాటు చేస్తే తప్ప ప్రజలు వాళ్లంతట వాళ్లు చలించని స్థితి వచ్చేసిందన్నమాట. ఇలాటి పరిస్థితిలో రాజీనామాలు చేసి ఏం బావుకుంటాం అని లెజిస్లేటర్లు అనుకున్నారంటే అనుకోరా మరి!

అందుకే పాదయాత్రల పేరు చెప్పి స్పీకరును తప్పించుకుని తిరుగుతున్నారు. గంప గోవర్ధన్‌కు స్పీకరు కార్యాలయం నుండి సరైన కమ్యూనికేషన్ రాలేదు కాబట్టి వెళ్లలేకపోయారట. ఈ సెల్‌ఫోన్ రోజుల్లో కమ్యూనికేషన్ అంత కష్టమా చెప్పండి. ఎవరైనా ఫోన్ చేసే కనుక్కోవచ్చు – తర్వాత వస్తానని నేనన్నదానికి స్పీకరు రియాక్షన్ ఏమిటి అని. జోగు రాములు గారు యింటి కెళ్లి కలిశారట. అదేం సరదాయో ! ఆఫీసులో అయితే కష్టం, సుఖం చెప్పుకోవడం యిబ్బందనా? ఇన్నాళ్లూ స్పీకరుపై తొడగొట్టిన యోధులు యీనాడు యిలా మొహం చాటేయడం ఏమిటి చెప్పండి. తాము చేసేది ప్రజలు గమనించినా ఏమీ అనే మూడ్‌లో లేరు, కొంపేం మునగదు అనుకుంటున్నారంటే ఉద్యమం చల్లారిందన్న భావం రావటం లేదూ!?

స్పీకరు కూడా రాజకీయ నాయకుడే కాబట్టి వీళ్ల గేమ్ వీళ్లాడితే ఆయన గేమ్ ఆయన ఆడుతున్నాడు. ఇన్నాళ్లూ వూరుకుని యిప్పుడు ఉద్యమం చల్లారాక వీళ్లని ఎక్స్‌పోజ్ చేయడానికి సమకట్టారు. తెరాస వైపు వెళ్లినవాళ్ల పని పడుతున్నాడు. వాళ్లమీదే ఫోకస్. ఇక టిడిపి వాళ్ల అవస్థ చెప్పనలవి కాదు. నిజంగా రాజీనామాలు ఆమోదించేస్తే ఉపయెన్నికలకు వెళ్లాలి. తెరాసలో చేరినవారి గెలుపు ఖాయం అని ఎలా అనుకోవచ్చో, వీళ్ల ఓటమి కూడా అంతే ఖాయం అనుకోవాలి. ఎటొచ్చీ డిపాజిట్లు దక్కుతాయో లేదో అన్నదే చూడాలి. వీళ్లపై తెరాస కాండిడేట్లు నిలపడం ఖాయం. వీళ్లని ఖతం చేయడానికి చూడడం నిశ్చయం. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేలంటారా, వాళ్లు తమ రాజీనామాల కోసం పట్టుబట్టరు. ఎంత చెడ్డా స్పీకరు ఆ పార్టీ వాడే కాబట్టి వాళ్లని ఎక్స్‌పోజ్ చేయడు. వాళ్లని పిలవడు. వీళ్లు తమంతట తాము వెళ్లరు.

కాంగ్రెస్ పార్టీ వాళ్లందరినీ పిలవడని చెప్పలేం. జగన్‌వైపు వెళుతున్న కాంగ్రెస్ వాళ్లని మాత్రం పిలుస్తారు. సిబిఐ విచారణ ప్రారంభమయ్యాక జగన్ ప్రభ కాస్త తగ్గి వుండవచ్చనే భయం వాళ్లందరికీ వుంది. ఉపయెన్నికలలో వీళ్లల్లో నాల్గో వంతుమంది గెలవకపోయినా, పెద్దగా మెజారిటీ రాకపోయినా తమ పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న భయం జగన్ పార్టీకుంది. అందువలన

యిప్పటికిప్పుడు పరిస్థితిని ప్రెసిపిటేట్ చేయడం దేనికన్న లెక్క వుంది. జగన్ వర్గీయులు తమ నియోజకవర్గాల్లో పనులకై కాంగ్రెస్‌ను పట్టుకుని వేళ్లాడుతున్నారని అందరూ అంటున్నారు. హిందూలో కూడా కనీసం 15 మంది జగన్ లెజిస్లేటర్లు వెనక్కి వస్తారని రాశారు. అందువలన వాళ్లని కూడా ఓ వూపు వూపి చూస్తారు స్పీకరు గారు.

ఆ విధంగా తెలంగాణకోసం, జగన్ కోసం రాజీనామాలు చేసిన వారి చిత్తశుద్ధిని పరీక్షకు పెడుతున్నారు స్పీకరుగారు. ఈ రెండు విభాగాల్లోనూ సభ్యత్వం వున్న కోమటిరెడ్డి సోదరులకు మరింత అగ్నిపరీక్ష పెట్టారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణకోసం మంత్రి పదవికి రాజీనామా చేస్తే వెంటనే ఆమోదించేశారు. నిరాహారదీక్ష చేస్తే కిరణ్ గ్లాసుడు మంచినీళ్లు కూడా పంపలేదు. ఎందుకంటే కోమటిరెడ్డి సోదరులు జగన్ వర్గం అన్న అభిప్రాయం కాంగ్రెస్‌వారికి వుంది. ఇక తమ్ముడు రాజగోపాల్ రెడ్డి ఎంపీ పోస్టుకి కూడా ఎసరు పెట్టారు. తక్కినవారందరినీ వదిలేశారు కానీ రాజగోపాల్‌ను వచ్చి మాట్లాడమన్నారు, లోకసభ స్పీకరు. రాజగోపాల్ పట్టుబడితే ఆమోదించేసి యింటికి పంపేయవచ్చు కూడా. కాస్త అడావుడి చేసి హై కమాండ్‌పై ఒత్తిడి తెద్దామనుకునేవారి భారాన్ని కాంగ్రెస్ తగ్గించుకుంటున్నట్టుంది.

ఇక తక్కినవారి విషయంలో రాజీనామాలు ఆమోదించకపోవడానికి లోకసభ స్పీకరు కొన్ని పాయింట్లు లాగారు. వీళ్లందరూ తాము ఎంపీలుగా లేము అని మానసికంగా అనుకోలేదు. అందుకే జీతభత్యాలు తీసుకున్నారు. కొందరు పార్లమెంటుకు హాజరయ్యారు. కొందరు స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరయ్యారు, విదేశీ యాత్రలకు వెళ్లారు. ఇవన్నీ చేయడం ద్వారా రాజీనామాలు చిత్తశుద్ధితో చేయలేదని స్పీకరు అభిప్రాయం. ఫార్మాట్ విషయంలో పేచీ వుంది. అందరి ఫార్మాటూ ఒకటే అయినపుడు ఒక్కోరికి ఒక్కోలా ఎలా వుంటుంది అని గుత్తా యిత్యాదుల సందేహం. రాజీనామాల పత్రాల జిరాక్సులు వారుగానీ, వీరుగానీ ప్రెస్‌కు రిలీజ్ చేస్తే మనకే తెలిసిపోతుంది. కారణం చెప్పి రిజైన్ చేస్తే అది ఉత్తుత్తిదే. ఈ విషయంలో అనుభవజ్ఞులు కెసియార్‌ని అడిగితే బాగా చెప్పగలరు. ఉట్టినే ఎలా యివ్వాలో, గట్టిగా ఎలా యివ్వాలో వారికి తెలుసు. వారూ యీసారి ఉట్టిదే యిచ్చారంటున్నారు. ఆయన రియాక్షన్ యింకా బయటకు రాలేదు.

జీతభత్యాలు మా ఎక్కవుంట్లో వేసేస్తే మేమేం చెయ్యం? అంటున్నారు కాంగ్రెస్ ఎంపీలు. వెయ్యవద్దని విడిగా లేఖ రాయలేరా? తిప్పి పంపలేరా? ఎక్కవుంట్లో జమ వచ్చింది కాబట్టి వూరుకున్నారు, అదే నా అక్కవుంట్లో ఖర్చు మీ అక్కవుంట్లో వేస్తే వూరుకుంటారా? బ్యాంకు వాళ్లను నిలదీయరా? మీది కాని డబ్బు మీ అక్కవుంట్లో పడితే ఎత్తి చూపరా? ఎవరైనా ఉద్యోగి రాజీనామా చేస్తే అది ఆమోదించబడేదాకా పని చేసి జీతం పుచ్చుకోవలసినదే కదా అని లాజిక్ లాగుతున్నారు. మామూలు ఉద్యోగులైతే అలాగే చేస్తారు. కానీ అలిగి ఉద్యోగం మానేసినవాడు ఆఫీసుకి రావడం మానేస్తాడు. అప్పుడు అతని గైరుహాజరీని మెడికల్ లీవ్ వంటి వాటికి అడ్జస్టు చేసి ఉద్యోగం పీకేశాం పొమ్మంటారు. ఇక్కడ అలక ముఖ్యం. అదే టి కాంగ్రెస్ ఎంపీలలో లేదు.

ఇక్కడ యింకో పోలిక కూడా వుంది. భార్యాభర్తలిద్దరూ విడాకులకు అప్లయి చేశారు. కోర్టువారు ఆర్నెల్లు ఆగి రమ్మన్నారు. ఈ లోగా వాళ్లిద్దరూ సంసారం చేసేస్తున్నారనుకోండి. కోర్టు ఒప్పుకోదు. వాళ్లు విడివిడిగా వేర్వేరు యిళ్లల్లో వుండాలంటుంది. అప్పుడే విడాకులకు వీళ్లు మానసికంగా సిద్ధపడ్డట్టు లెక్కవేస్తుంది. మన కాంగ్రెస్ ఎంపీలు హాయిగా ప్రభుత్వంతో కాపురం చేసినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ బంగళాలలో వుంటూ, ప్రభుత్వ కార్లలో తిరుగుతూ, వారి ఖర్చుపై విమానాల్లో దేశవిదేశాల్లో విహరిస్తూ, జీతభత్యాలు పుచ్చుకుంటూ, పార్లమెంటుకు హాజరై ప్రశ్నలు వేస్తూ మామూలుగా వుంటే అలిగినట్టు ఎలా తోస్తుంది ఎవరికి మాత్రం? బయటకు వచ్చి మేం త్యాగం చేశాం, మాకు ఈ పదవి వెంట్రుక ముక్క బరాబర్ అంటారు. వీళ్లు యిప్పటిదాకా చేసిన త్యాగం ఏమిటి చెప్పండి !

అందరి కంటె హీరో కేకే. ఆయన 'నేను రాజీనామాను విసిరికొట్టి వచ్చినా' అని చెప్పుకున్నారు. చెత్తబుట్టలోకి విసిరికొట్టి వచ్చారో ఏమో, రాజ్యసభ కార్యాలయంలో ఆయన రాజీనామా లేఖే కనబడటం లేదుట. ఈయన దగ్గర జిరాక్సో, ఎక్నాలెజ్‌మెంటో వుంటుంది కదా, యీ పాటికి యిచ్చేయవద్దూ? ఇవ్వలేదంటే ఆయనది మరీ ఉత్తుత్తి రాజీనామా అన్నమాట. మన్‌మోహన్ సింగ్ ప్రకటన తర్వాత పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సోనియా కూడా యిలా చెప్పేస్తే పార్టీ విడిచిపెడతాం అన్నారు. ఆవిడ చెప్పనంతకాలం పార్టీలో వుంటారన్నమాట. ఆవిడ అవుననీ చెప్పదు, కాదనీ చెప్పదు. చేతల్లో చూపిస్తుంది. అయినా వీళ్లు పార్టీ విడిచిపెట్టరన్నమాట. కొత్త పార్టీ పెట్టేస్తారట అని పుకార్లే కానీ గుత్తాగారు యివాళ చెప్పేశారు – అబ్బే కొత్త పార్టీ ఆలోచనే లేదని. నిజానికి వరంగల్, కరీంనగర్ కాంగ్రెస్ నాయకులు పార్టీలోంచి పెద్ద సంఖ్యలో బయటకు వెళ్లి తెరాసలో కలుస్తారేమో ననుకున్నాను. కానీ అలా జరగలేదు. అంటే గ్రౌండ్ రియాలిటీ అలా వుందన్నమాట. ఇలాగే ఆటలాడినా ఏం ఫర్వాలేదన్నమాట !

వీళ్లు అడిగినప్పుడు రాజీనామాలు పరిశీలించకుండా వీళ్లకు యిబ్బంది వచ్చినపుడు, ఉద్యమం చల్లారాక పరిశీలించడం స్పీకర్ చేస్తున్న దుర్మార్గం అనుకోవచ్చు. చట్టపరంగా ఆయనకు ఎన్ని అధికారాలున్నా, నైతికంగా సరిగ్గా ప్రవర్తించలేదని విమర్శించవచ్చు. నిజమే కానీ మరోలా ఆలోచించి చూడండి – ఆయన అప్పుడు రాజీనామాలు ఆమోదించేసి వుంటే బోల్డు ఉపయెన్నికలు వచ్చి పడేవి. అవే కాండిడేట్స్, అదే ఎసెంబ్లీకి మళ్లీ ప్రవేశం, అదే ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రసాధన ఒక్క అడుగు ముందుకు పడకపోయినా, ప్రజాధనం ఎంతో వృథా అయ్యేది. స్పీకర్లు ఆ విషయంలో మాత్రం మనకు మేలు చేశారు. ఇప్పుడిక రాజీనామాల పేరుతో ఎవరైనా బెదిరిస్తే 'స్పీకరుగారు మిమ్మల్ని పిలుస్తున్నారండి' అని చెప్పి భయపెట్టవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

శ్రీరామరాజ్యం సినిమా ప్రివ్యూ మొన్న చూశాను. బాపుగారు ఆహ్వానించారు. కొంతమంది ఆయన సన్నిహితులతో కలిసి చూశాను. బాగుంది. గట్టిగా మాట్లాడితే నేను ఆశించినదాని కంటె బాగుంది. నేను బాపు, రమణల అభిమానినని, వారికి సన్నిహితుణ్నని తెలిసినవాళ్లు మొహమాటం కొద్దీ యిలా రాస్తున్నానని అనుకోవచ్చు. అందుకని క్లారిఫై చేస్తున్నాను – నేను అభిమానినే కానీ, తప్పొప్పులు తెలియనంతటి పాఠకుణ్నీ కాను, ప్రేక్షకుణ్నీ కాను. నాకు తోచినది నిరభ్యంతరంగా చెప్పే చనువు వారి దగ్గర వుంది కాబట్టే వారికి చేరువయ్యాను. ''ముత్యాలముగ్గు''లో భజంత్రీలు కారెక్టరు పెట్టిన బాపు, రమణలు నిజజీవితంలో కూడా పొగడ్తలు భరించలేరు. ''మీ పెళ్లికొడుకు సినిమా అస్సలు బాగాలేదండి.'' అనీ చెప్పాను. ''మీ సుందరకాండ చూడలేదండీ'' అనీ చెప్పాను. ''రాధాగోపాళం'' క్లయిమాక్స్ యింకోలా వుంటే బాగుపడేది'' అని కూడా చెప్పాను. ఆయన నొచ్చుకుని వుంటే మనని కట్ చేసి పడేసేవారు కదా. నాలాటి మిత్రులు వాళ్లకు చాలామంది వున్నారు. ''కోతికొమ్మచ్చి యీ వారం బాగా రాలేదని ఫలానా ఆయన అన్నాడు. మీకెలా వుంది?'' అని కూడా రమణగారు ఫోన్ చేసి అడిగేవారు. నా అభిప్రాయం నేను చెప్పేవాణ్ని.

అందువలన నేను శ్రీరామరాజ్యం బాగుంది అని అంటున్నానంటే నిజంగా ఒక ప్రేక్షకుడిగా అంటున్నాను తప్ప, ఆ సినిమాను ఎలాగోలా హిట్ చేసేసి రమణగారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కాదు. అయినా యిది రివ్యూ కాదు, నేను పదికి యిన్ని అని మార్కులు కూడా వేయబోవటం లేదు. 'మీరు సినిమా రివ్యూలు కూడా రాయవచ్చు కదా' అని అడుగుతూంటారు కొందరు. సినిమా చూడగానే అప్పటికప్పుడు సమీక్ష రాయడం నా వల్ల కాదు. ఆ సినిమా జ్ఞాపకాలతో నిద్రపోయి తెల్లవారి లేచాకనే సినిమా ప్రభావం నాలో పూర్తిగా యింకుతుంది. అప్పటికి కూడా నన్ను వెంటాడుతున్న ట్యూన్ వుందంటే ఆ పాట నచ్చిందని గ్రహిస్తాను. ఎడిటింగ్, ఫోటోగ్రఫీ, మేకప్, సౌండ్, లొకేషన్స్, సంగీతం యిలా ప్రత్యేక విభాగాలకు యిన్నేసి మార్కులంటూ వేసుకుంటూ వెళ్లి సరాసరి కట్టి పరీక్షాఫలితాన్ని యివ్వడం నా చేతకాదు. నేను ముఖ్యంగా చూసేవి కథను ఎలా చెప్పేరు, దాన్ని తారాగణం మనకు ఎలా అందించగలిగారు అన్నది. ఫలానా పాత్ర గడ్డం మరీ నల్లగా వుంది, మూడో రీలులో లైటింగ్ గ్లేర్ కొట్టింది, ఆకాశంలో ఎగిరేటప్పుడు నల్లదారం కనబడిపోయింది – యివన్నీ అప్రాధాన్యం.

''లవకుశ'' సినిమా సూపర్ డూపర్ హిట్. దాన్ని మళ్లీ తీయడం అంటే అపచారం అనుకునేవాళ్లు పుష్కలంగా వున్న రోజుల్లో, ఆ పాటలు యింకా మరుగున పడని రోజుల్లో యీ సినిమాను రమణగారు ఎలా మలుస్తారు అన్నదే నేను ప్రధానంగా చూసినది. ''లవకుశ'' సినిమా ఎంత బాగున్నా మళ్లీ మళ్లీ చూడడం కష్టమే. సిడి యింట్లోనే వుంది. చూసి రెండేళ్లు దాటింది. పాటలు వినవచ్చు. దాన్ని కొత్తతరానికే కాదు, మా బోటి పాతతరానికి కూడా అనువుగా మార్చి అందించారు బాపురమణలు. పద్యాలు తీసేయడం మంచిదైంది. ఆ పద్యాలు గొప్పవే. కానీ 'క్రమ్మర ఏలుకున్నవాడు', 'విమోహి' వంటి పదాలు యిప్పటివాళ్లకే కాదు, అప్పట్లో చాలామందికి కూడా అర్థం అయ్యేవి కావు. అలాగే పిల్లలు, రామానుజులు పాడుకున్న ఎత్తిపొడుపు పద్యాలూ తీసేశారు. వాటి భావాలను మాటల్లో చెప్పేశారు హాయిగా. లేకపోతే శ్రీకాంత్ లాటి వాళ్లు పద్యాలకు ఎలా లిప్‌మూవ్‌మెంట్ యిచ్చారో చూడడమే మనకు వేడుకగా వుండేది.

పాత సినిమాలో ముఖ్యమైనది ఏదీ పోనీయలేదు. అప్పట్లో అవసరంగా ఫీలయినవి, యిప్పుడు అనవసరం అనుకున్నవీ తీసేశారు. రేలంగి, గిరిజల సమూహగానాలు, హాస్యాలు, రమణారెడ్డి, సూర్యకాంతాల హాస్యం అన్నీ ఎగిరిపోయాయి. మొదట్లో చిత్రకారుడు చిత్రాలు చూపించడం, 'సందేహింపకుమమ్మా..' వంటి పాటలూ అవీ తీసేశారు. చివర్లో యుద్ధం కూడా మరీ ఎక్కువగా లేదు. సినిమాలో నాటకీయతను మాత్రం అలాగే వుంచారు. అందువలన రాముడు, సీతల మనోవేదన ప్రేక్షకులకు చక్కగా అందింది.

దీనితో బాటు రమణగారు రాముడి పాత్రను ఎలివేట్ చేయడానికి, తన భావాలను వ్యాప్తి చేయడానికి కొన్ని సంభాషణలు, పిట్టకథలు ప్రవేశపెట్టారు. 'రామరాజ్యం అంటే రాముడు సేవించిన రాజ్యం, ఆ తర్వాతనే రాముడు పాలించిన రాజ్యం' అనే డైలాగు రాముడి చేత పలికించి రాజధర్మం ఏమిటో చెప్పారు. మండోదరి రాముణ్ని కలవడానికి వచ్చి పరస్త్రీ వ్యామోహితుణ్ని చంపే సామర్థ్యం వున్నవాడు పరస్త్రీ ఛాయను సైతం తాకని వాడని ప్రశంసించి వెళుతుంది. చివర్లో సీత చేత వాల్మీకికి వందనం చేయించిన తీరు అమోఘం. రమణగారు తక్కువగా సంభాషణలు రాసే తీరు ఈ సినిమాలోనూ బాగా కనబడింది. హావభావాలతో చాలా చెప్పించేశారు. రామాయణం విశిష్టతను ''లవకుశ''లో ''జగదభిరాముడు శ్రీరాముడే..'' పాటలో చెపితే యిక్కడ లవకుశల నోటి ద్వారా వాల్మీకి చెప్పించారు. సినిమా చాలా చురుగ్గా, ఆధునిక ప్రేక్షకుడికి అనుగుణంగా సాగింది. అదీ ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. రచనలో రమణమార్కు సినిమా అంతా కనబడుతూనే వుంది.

ఇక అభినయం దగ్గరకు వస్తే – ''పాండురంగడు'' సినిమా చూసి బాలకృష్ణ పౌరాణికచిత్రం అంటే బెదిరిపోయాను. కానీ పోస్టర్లు అవీ చూసి, బాపుగారు ఓవరాక్షన్ చేయనీయరు కదా అనే ధైర్యంతో కాస్త ఓపెన్ మైండెడ్‌గానే చూశాను. బాలకృష్ణ బాగానే చేశారు. ఎన్టీయార్‌తో పోలిక అనివార్యమై పోయి, మార్కులు తక్కువ పడుతున్నాయి కానీ లేకపోతే బాగా చేశారనే అనవచ్చు. విషాద సన్నివేశాల్లో (అవే ఎక్కువ కదా) భావాలను బాగా పలికించారు. డైలాగులు కూడా తూకంగానే చెప్పారు. తొట్రుపాటు,

తొందరపాటు లేదు. సీతను అడవిలో విడిచి పెట్టి వచ్చే ఘట్టంలో శ్రీకాంత్ చాలా బాగా నటించారు. ఇక నాగేశ్వరరావుగారు వాల్మీకి పాత్ర మంచి హుందాగా నటించారు. మరీ నాగయ్యగారంత సౌమ్యంగా కాకపోయినా, ఎటువంటి మ్యానరిజమ్స్ లేకుండా సమర్ధవంతంగా నిర్వహించారు. వశిష్టుడిగా బాలయ్యగారి వాయిస్ (ఒకప్పుడు ఎంత బాగుండేదో)తో పోల్చి చూసినపుడు ఆయన కంటె పెద్దవాడైన నాగేశ్వరరావుగారి వాయిస్ ఎంత కమ్మగా వుందో ప్రస్ఫుటంగా తెలుస్తుంది. తక్కిన పాత్రధారులందరూ బాగా వేశారు. పిల్లలు సైతం ఓవరాక్షన్ చేయలేదు. బాపుగారు చేయనివ్వరు కదా.

ఇక సీత – నయనతార అదరగొట్టేసింది. సినిమా చూసి వచ్చాక యిది "సీతారాజ్యం" అనిపిస్తుంది.

ఈ సినిమాకు హీరోయిన్లుగా ఎవరెవర్ని అనుకున్నారో, ఎందుకు కాదనుకున్నారో రమణగారు ఎప్పటికప్పుడు చెపుతూనే వున్నారు. చివరకు నయనతార అనుకున్నపుడు "ఆవిడ కున్న పబ్లిక్ యిమేజ్‌కు యీ పాత్ర సూటవుతుందా?" అని అడిగాను కూడా. ఎందుకంటే నయనతారను అందాలతారగానే చూశాను తప్ప అభినయం గురించి (చంద్రముఖి వంటి సినిమాల్లో బాగా చేసినా) పెద్దగా ఆలోచించలేదు. నిజానికి "అరుంధతి" సినిమా వచ్చేవరకూ అనూష్క అభినయమూ నా కంటికి ఆనలేదు. కానీ నయనతార సీతమ్మ పాత్రలో ఒదిగిపోయింది. అంటే బాగుండదేమో కానీ, నాకు "లవకుశ"లో అంజలిగారి కంటె యీ సినిమాలో నయనతారే బాగా నచ్చింది. అంజలిగారిలో దైన్యమే ఎక్కువ కనబడింది. కానీ యీ సీత రమణగారి హీరోయిన్. పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలచుకునే స్థైర్యం వున్న నేటి మహిళ.

సినిమా చివర్లో రాముడికి, వాల్మీకికి ఆమె వీడ్కోలు చెప్పే తీరులో భేదం గమనిస్తే చాలు – రమణగారి మార్కు అర్థమవుతుంది. నిజానికి "ముత్యాలముగ్గు" సినిమాకు కూడా "లవకుశ"యే స్ఫూర్తి కదా. దానిలో సంగీత చేత చెప్పించారు కదా – "సిఫార్సులతో కాపురాలు చక్కబడవు" అని. నయనతార సూరేద్రూపం కొట్టవచ్చినట్టుగా కనబడింది. సినిమా మొదట్నించీ కూడా మేకప్ చాలా తక్కువ వేసి, ఆమె సహజసౌందర్యాన్ని మన ముందుకు తెచ్చారు. సహజంగా చిత్రకారుడైన బాపుగారు ఆమెనుండి గాంభీర్యం, వర్చస్సు, హుందాతనం, వినయం, పవిత్రత కెమెరా ద్వారా వెలికిదీశారు. ఇటీవలి కాలంలో ఆయన హీరోయిన్లను ప్రబంధ సుందరుల్లా అనేక పోజుల్లో చూపిస్తున్నారు. సాంఘిక సినిమాలు కాబట్టి అవి కాస్త ఎబ్బెట్టుగా కూడా అనిపిస్తున్నాయి. ఇది పౌరాణికమైనా సీతారాముల మధ్య శృంగార సన్నివేశాల్లో సైతం అలాటి ముద్రలు లేవు. సహజంగా కనబడేట్లు ఒక ముత్తయిదువలా తీర్చిదిద్దారు.

ఈ సినిమా ఆఖరి రోజున షూటింగులో నయనతార కళ్లనీళ్లు పెట్టుకుని అందరికీ వీడ్కోలు చెప్పిందంటూ ఓ వీడియో రిలీజైంది కదా. సినిమాలో చాలాభాగం దానిలో వున్నట్టుగానే – చాలా ఆత్మీయంగా – నయనతార కనబడింది. భర్త ఆంక్షల మేరకు ఆమె సినిమాలనుండి విరమిస్తుందన్న వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే నర్గీస్‌కు "మదర్ ఇండియా"లా యీమె "శ్రీరామరాజ్యం" హంసగీతంలా మిగిలిపోతుంది. బతికున్నంతకాలం గొప్పగా చెప్పుకోవచ్చు. ఎటొచ్చీ యీ సినిమా కూడా హిట్ కావాలి. అవుతుందేమో కూడా. ఎందుకంటే సినిమాలో అన్ని హంగులూ వున్నాయి. సెట్టింగ్స్ అవీ కళ్లు చెదిరేలా వున్నాయి. పాత ఇంగ్లీషు సినిమాల లెవెల్లో రాజప్రాసాదాలు, శిల్పాలు అవీ ఎంత పెద్దగా వున్నాయంటే వాటిముందు పాత్రధారులు చాలా చిన్నగా అనిపించారు. గ్రాఫిక్స్‌ని ఎలా వాడుకోవాలో అలా వాడుకున్నారు. డబ్బు బాగా ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. కానీ యిటీజ్ వెల్ స్పెంట్. ఈ నాటి అనేక సినిమాలో ఫారిన్ లొకేషన్స్ పేర డబ్బులు తగలేయడం కంటె యిలా ఖర్చు పెడితే సద్వినియోగం అయినట్టు అనిపిస్తుంది. ఫోటోగ్రఫీ కంటికింపుగా వుంది. కొట్టవచ్చినట్టుగా తోచలేదు, కంటికి శ్రమ కలిగించలేదు. భారీతనం నేచురల్‌గా అనిపించింది. ఇక ఆశ్రమాల సెట్టింగయితే కమనీయంగా వుంది.

ఇక సంగీతం – "లవకుశ"కు హైలైట్ సంగీతమే. పోలిక అనివార్యమైతే యీ సినిమా సంగీతం ఆ స్థాయిలో లేదనే చెప్పాలి. ఆడియో రిలీజైయ్యాక చాలామంది పెదవి విరిచారు. ఒకటి, రెండు పాటలు మాత్రం బావున్నాయన్నారు. నేను ఆడియో వినను. పాటను చిత్రీకరణతో సహా చూసి అప్పుడు బేరీజు వేయాలనుకుంటాను. విడివిడిగా చూస్తే పాట అందం ఆస్వాదించలేం. సినిమాలో చూస్తే పాటలన్నీ బాగున్నాయి. ఒక్కటి మాత్రం – పిల్లలు రామాయణం చెప్పేటప్పుడు మొదటిభాగం ట్యూన్ బాగాలేదు. ఏదో చర్చి పాటలా వుంది. నేపథ్యసంగీతం సరిగ్గా అమరలేదు. ఇళయరాజాకు ఏం పుట్టిందో వెస్టర్న్ మ్యూజిక్ చాలా వుపయోగించారు. కొన్ని చోట్ల సింఫనీ వింటున్నట్టుంది. లిరిక్స్‌లో మాత్రం వంక పెట్టడానికి ఏమీ లేదు. చాలా బాగా రాశారు జొన్నవిత్తుల. ఈ మధ్య వచ్చిన పౌరాణికాలు "అన్నమయ్య", "రామదాసు"లలో మ్యూజిక్కే ప్లస్ పాయింట్ అయింది. ఇక్కడ అది చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు.

ఈ సినిమా హిట్ అవుతుందా లేదా అన్నది నాకు తెలియదు. మహామహా బాక్సాఫీసు పండితులే చెప్పలేరు యిలాటివి. నేను మాత్రం మళ్లీ యింకోసారి టిక్కెట్టు కొని చూడడానికే నిశ్చయించుకున్నాను. ఎందుకంటే చాలాచోట్ల గుండె చెమర్చింది, కన్ను చెమర్చింది. కథ పాతదే, కొత్త ట్విస్టులు ఏమీ లేవు. లవకుశ బోల్డన్ని సార్లు చూసినదే. అయినా జేబులోంచి రుమాలు తీసి కళ్లు తుడుచుకోవలసి వచ్చిందంటే సినిమాకు కదలించే గుణం వుందన్నమాట. అది వుంటే ఏ కళారూపమైనా తన లక్ష్యాన్ని సాధించినట్టే. సినిమా హిట్ అయితే నిర్మాత కూడా సంతోషిస్తారు, ఉత్సాహపడతారు. రమణగారు యీ నిర్మాత సాయిబాబా గురించి చాలా బాగా చెప్పారు. బాపురమణల మార్కెట్ వేల్యూ గురించి పట్టించుకోకుండా, ఖర్చుకి వెనకాడకుండా ముందుకు వచ్చారు. పూర్తి సహాయసహకారాలు అందించారు. మంచి నిర్మాత వుంటే మంచి సినిమాలు వస్తాయి. వాళ్లే కదా మూలం. అందునా సంస్కారవంతులు కాబట్టే యీ సినిమాను రమణగారికి అంకితం యిచ్చారు. రచయితకు యింత విలువ నివ్వడం నిజంగా గొప్ప విషయం.

కథలో రమణగారు ఓ చిన్న మార్పు చేశారు. సీతను భర్తతో సహా అందరూ నట్టడవిలో వదిలేసినా ఆంజనేయుడు మాత్రం ఓ పిల్లవాడి రూపంలో వచ్చి ఆమెకు అండదండగా వుండడం, కబుర్లు చెప్పడం, లవకుశులు పుట్టాక వాళ్లని ఆడించడం – యివన్నీ పెట్టారు. అది చాలా బాగా నప్పింది. పిల్లలు పుట్టడానికి ముందు ఏ సైజులో వున్నాడో, వాళ్లు పెరిగి పెద్దవాళ్లయినా ఆంజనేయుడు అదే పిల్లవాడి రూపంలో ఫ్రీజ్ అయిపోయాడు. చిరంజీవి కదా!

నేను "మ్యూజికల్స్" సీరీస్‌లో "లవకుశ"ను పరామర్శిస్తూ "సీతమీద అపవాదు వచ్చిందనుకోండి, దానిమీద పంచాయితీ ఏర్పాటు చేసి వుంటే పోయుండేది. దాన్నిబట్టి శిక్ష వేసి వుంటే పోయి వుండేది. దేశబహిష్కార శిక్ష వేసి వుంటే ఆమెను పుట్టింటికి పంపివేసి వుండాల్సింది. కానీ అడవుల్లో విడిచి రమ్మనడం ఏమిటి? అప్పట్లో నీతి తప్పిన స్త్రీలకు అది శిక్షేమో! తర్వాతైనా రాముడు ఆరోపించినవాణ్ని పిలిపించినట్టు, మాట్లాడినట్లు చూపించలేదు. సీత అడవుల్లో ఏమయిందో వాకబు చేసినట్టు లేదు. పోనీ పెళ్లాం మీద మనసు విరిగిపోయిందనుకున్నా పిల్లా జెల్లా ఎవరైనా పుట్టారేమో చూద్దామన్న కుతూహలం కూడా కనబరచలేదు. లంకలో వుండగా భుజాన ఎక్కించుకుని వచ్చేస్తానమ్మా అంటూ వెంట తిరిగిన హనుమంతులవారైనా ఓ రౌండు కొట్టి ఏమైందో చూసినట్టు లేదు. రావణాసురుడి బంధుగణంలో ఎవరైనా మిగిలివున్నవాళ్లు సీతమీద కసి తీర్చుకుంటారేమోనన్న భయం లక్ష్మణుడికైనా వున్నట్టు లేదు. ఇంద్రుడితో పోయిన అహల్యను గౌతముడు గాలీ, ధూళీ భుజిస్తూ రాయిలా పడివుండమన్నట్టు, రాముడూ సీతకూ అదే శిక్ష వేసి వుంటాడు. ఆమె తరఫున ఏమీ వినకుండానే ఈ శిక్ష పడింది. రామరాజ్యం అంటే యిదే కాబోలు!" అని రాశాను. నా బోటివాళ్లకు యిలాటి సందేహాలు వస్తున్నాయనే కాబోలు రమణగారు ఆంజనేయుణ్ని సీతామ్మవారి వెంట పంపారు. మరి ఆ పదేళ్లు ఆయన రాములవారి సేవను వదిలిపెట్టినట్టే అనుకోవాలి.

"లవకుశ" సినిమాలో హనుమంతుడు రాముడి వెంటనే వుంటాడు. రాముడితో బాటు యుద్ధభూమికి వస్తాడు. హనుమంతుడి వీక్‌నెస్ లవకుశులకు తెలుసు కాబట్టి మునిబాలకులను పురమాయించారు. వాళ్లు 'శ్రీరామ పరంధామా' అంటూ భజన చేసుకుంటూ ఆశ్రమానికి వెళ్లారు. వాళ్ల వెనక్కాలే భజన చేసుకుంటూ హనుమంతుడూనూ. దీనివల్ల వచ్చిన ట్విస్టు ఏమిటంటే హనుమంతుడు సీతను గుర్తు పట్టాడు. ఎవరెవరో తెలిసింది. రాముడు తిరుగులేని రామబాణాన్ని ప్రయోగించే సమయానికి సీతామ్మవారిని యుద్ధరంగానికి తీసుకు వచ్చాడు. ఈ సినిమాలో అయితే మొదట్నుంచీ ఆవిడను వెంటనంటి వున్నాడు. ఆవిడ వ్రతానికి ఎక్కడెక్కడినుండో ఆకాశమార్గాన పుష్పాలు తెచ్చి యిచ్చాడు.

ఈ విధంగా కథలో మార్పులు చేయడం సమంజసమా అంటే అసలు "లవకుశ" కథకే సరైన ప్రమాణం, ఆధారం లేదని గుర్తు పెట్టుకోవాలి. ఇది వాల్మీకి రాసిన రామాయణంలో లేదు. వాల్మీకి రామాయణం రాముడి పట్టాభిషేకంతో అయిపోతుంది. తర్వాత జరిగిన కథంటూ మనకు తెలిసినది భవభూతి రాసిన 'ఉత్తర రామచరితం' అనే సంస్కృత నాటకం ద్వారా! ఆయన 7 వ శతాబ్దం వాడు. ఆయనకు థీమ్ ఎక్కడ దొరికిందిరా అంటే పద్మపురాణంలో జైమిని భారతంలో వుందిట. అది తీసుకుని ఈయన నాటకానికి అనువుగా అనేక డ్రమటిక్ ట్విస్టులు పెట్టేసి రాసేశాడు. ఆ తర్వాత తిక్కనగారు (నిర్వచన) ఉత్తరరామాయణం రాశారు. భవభూతి నాటకం రక్తి కట్టించాలని మూలకథకు చాలా మార్పులు చేసేశాడని తిక్కనగారు అనుకుని వుంటారు. తిక్కనగారు 13 వ శతాబ్దం వాడు. అంటే భవభూతి తర్వాత ఆరు వందల యేళ్ల తర్వాతన్నమాట.

భవభూతి అభూత కల్పనలు తీసేస్తే ఉత్తర రామాయణం కథ చిన్నదిగా వుందనిపించింది తిక్కనగారికి. అందుకని పూర్వ రామాయణం కథ అంటే రావణాసురుడి కథంతా చెప్పుకొచ్చాడు. నిర్వచనోత్తర రామాయణం మొత్తం 11 ఆశ్వాసాలుంటే 7 పూర్వరామాయణం కథ, 4 ఉత్తర రామాయణం కథ. తిక్కనగారు సీత అద ృశ్యంగా వెళ్లడం, లవకుశుల యుద్ధం అవన్నీ తన కావ్యంలో తీసుకోలేదు. కుశలవులను వాల్మీకి పరిచయం చేయగానే రాముడు వాళ్లను స్వీకరించినట్లు చూపించారు. మన నాటక కర్తలు డ్రామా పండాలంటే లవకుశులకు, రాముడికి యుద్ధం పెట్టి తీరాల్సిందే ననుకున్నారు. చిన్నపిల్లలు రాముడి సైన్యాన్ని ఓడించారంటే బలే హుషారుగా వుంటుంది కదా! అందువల్లనే ఈ యుద్ధ ఘట్టాలు నాటకాల్లో, సినిమాల్లోకి వచ్చాయి.

సినిమాకు డబ్బు రాకపోయినా ఫర్వాలేదు, మంచి సినిమా తీసిపెట్టండి చాలు అని నిర్మాత రమణగారి దగ్గర అన్నారో లేదో నాకు తెలియదు. అంటే మాత్రం రమణగారు తప్పకుండా మందలించి వుండేవారు. ఎందుకంటే "శ్రీనాథ" తీసినప్పుడు ఎన్టీయార్ అన్నారట – "సినిమా బాగా వచ్చిందండి. నాకు డబ్బు రాకపోయినా ఫర్వాలేదు." అని. అప్పుడు రమణగారు అన్నారట – "డబ్బు గురించి అలా మాట్లాడకండి. రూపాయి అంటే ప్రజలన్నమాట. ఎన్ని రూపాయలొస్తే అంతమంది ప్రజలు చూశారని అర్థం. ప్రజలు చూడడానికి కాకపోతే మనం సినిమా తీయడం దేనికి? మన పిల్లల్ని కూర్చోబెట్టి కథ చెప్పేసేయచ్చుగా ! ఇంత హంగూ, ఆరాటేం పెట్టి తీస్తున్నామంటే పదిమందీ చూడాలనే కోరుకోవాలి." అని. ఈ సినిమా కూడా ప్రజలందరికీ చేరితే బాగుంటుంది. ఎందుకంటే యిది రమణగారి హంసగీతం.

హంసగీతం అనేది ఒరిజినల్ ఇండియన్ ఎక్స్‌ప్రెషన్ కాదు. ఇంగ్లీషులో 'స్వాన్ సాంగ్' అని అంటారు. ఎవరైనా కళాకారుడి అంతిమ కళాసృష్టిని ఆ పేరుతో వ్యవహరిస్తారు. హంస చనిపోయేటప్పుడు పాట పాడి చనిపోతుందని పాశ్చాత్యుల నమ్మకం. దాన్ని మన భారతీయులు సంస్కృతంలోకి అనువదిస్తే తయారైంది 'హంసగీతం'. 'హంసగీతె' అని కన్నడంలో ఓ సినిమా కూడా వచ్చింది. "శంకరాభరణం"లో 'దొరకునా యిటువంటి సేవ..' పాట అలాటి హంసగీతమే నన్నమాట. రమణగారి చివరి రచన కాబట్టి యిది

ఆయన హంసగీతం అయింది. తమాషా ఏమిటంటే రమణగారి తొలి సినిమా రచన "రక్తసంబంధం", (ఇది రీమేక్) తొలి దైరక్టు సినిమా "దాగుడుమూతలు"లలో హీరో ఎన్టీయార్. ఆయన ఆఖరి సినిమాలో హీరో – ఎన్టీయార్ కుమారుడు బాలకృష్ణ. అలాగే ఎన్టీయార్ ఆఖరి సినిమా కూడా "శ్రీనాథ" రచన రమణగారిదే.

ఈ సినిమాను బాలకృష్ణ అభిమానులు ఆయన సినిమాగా ప్రచారం చేయవచ్చు, మనది హీరో బేస్డ్ సినిమా యిండస్ట్రీ కాబట్టి. (కానీ సినిమా చూశాక తెలుస్తుంది – యిది సామూహిక కృషి అని) సినిమా విజయవంతం అయితే బాలకృష్ణతో యింకా కొన్ని పౌరాణిక సినిమాలు ప్లాన్ చేసేయవచ్చు. "మగధీర" హిట్ కాగానే సోషియో ఫాంటసీలు తీయడం ఎలా ఎక్కువైందో, "శ్రీరామరాజ్యం" హిట్ కాగానే మళ్లీ పౌరాణికాలవైపు మళ్లవచ్చు కొంతమందైనా ! దానిలో ఓ ప్రమాదం వుంది. అందరూ భారవిగారి దగ్గరకు పరిగెట్టవచ్చు. పౌరాణికాలంటే యీ మధ్య ఆయనే చెలరేగిపోతున్నాడు. ఆయన స్క్రిప్టుల్లో వెకిలి శృంగారం, వెగటు హాస్యం దుతరేంగా వుంటాయి. "అన్నమయ్య" సినిమా ఆడిందంటే దానికి కారణం – సంగీతం, నాగార్జునలో భక్తుడిగా కనబడిన ఆర్తి. "రామదాసు"కి వచ్చేసరికే అది తగ్గిపోయింది. "పాండురంగడు"కి వచ్చేసరికి స్క్రిప్టు భ్రష్టు పట్టిపోయింది. పౌరాణికాలంటే మోహం మొత్తేసింది. అందువలన కాస్త సంయమనం పాటిస్తూ తీస్తేనే పౌరాణికాలు రాణిస్తాయి. పాతకాలం పౌరాణికాల్లా పద్యాలు అక్కరలేకుండా , మంచి టెక్నికల్ వేల్యూస్‌తో, మోడర్న్ ఔట్‌లుక్‌తో, రక్తి కట్టించే డ్రామాతో ఎలా తీయవచ్చో మహానుభావుడు రమణగారు మార్గం చూపించి వెళ్లిపోయారు. అది అనుసరిస్తేనే చాలు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

**నవంబరు 25** **ఎమ్బీయస్ : జగన్ ఎమ్మెల్యేలు జారుకుంటున్నారా?**

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అంటూ రాజీనామా చేసిన తెలంగాణ ఎమ్మెల్యేలు స్పీకరుకు మొహం చాటేయడం చూశాం. ఇప్పటిదాకా స్పీకరు మీద రంకెలు వేసినవారు ఎవ్వరూ ముందుకు వచ్చి పట్టుబట్టడం లేదు. స్పీకరు ఛాంబర్ లోకి వెళ్లి ఆమోదించవద్దని కొందరూ, ఏం విషయం తేల్చుకోవడానికి యింకా టైము కావాలని కొందరూ చెపుతున్నారట. అది అబద్ధం అని కొందరు వాదించవచ్చు. కానీ కళ్ల ఎదురుగుండా కనబడుతున్న వాస్తవం ఏమిటంటే నాగం జనార్దనరెడ్డిగారి రాజీనామా ఆమోదం తర్వాత వేరెవరూ వచ్చి స్పీకరు ఆఫీసు ముందు ధర్నాలు చేయడం లేదు. ఇక జగన్ ఎమ్మెల్యేల సంగతీ అలాగే వుంది. వైయస్ పేరు సిబిఐ చార్జిషీటులో కనబడిందంటూ అప్పట్లో రాజీనామాలు చేసేశారు. ఇప్పుడు రా రమ్మంటే వెనకాడుతున్నారు. అంటే అర్థం ఏమిటి? భావోద్వేగంతో చేసిన రాజీనామాలే యివి అని స్పష్టంగా కనబడుతోంది కదా. ఇదే మాట స్పీకరు అంటే యిది వరకు ఆయనపై మండిపడ్డారు.

తెలంగాణ ఎమ్మెల్యేల భావోద్వేగాలు చల్లబడడానికి హై కమాండ్ చాలా ఓపిక ప్రదర్శించింది. వాళ్లు తిట్టినా, తిమ్మినా పడింది. వాళ్ల ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినా సహించింది. అన్నీ అయ్యాక ఉద్యమం ఊపు తగ్గాక అప్పుడు వాళ్లకు వాస్తవ పరిస్థితి తెలిసి వచ్చేట్టు చేస్తోంది. వాళ్ల రాజీనామాల గురించి వాళ్ల నియోజక వర్గ ప్రజలు పట్టుబట్టడం లేదని, తమ తమ నియోజకవర్గాలలో తిరగలేని పరిస్థితి ఏమీ లేదనీ వాళ్లకు అర్థమయ్యేట్లు చేసింది. అల్లరి చేసేది పదుల సంఖ్యలో వుండే తెరాస, బిజెపి కార్యకర్తలేననీ, మెజారిటీ జనం కిమ్మనకుండా వున్నారనీ వాళ్లకు తెలిసి వచ్చింది కాబట్టే రాజీనామాల గురించి పట్టుబట్టడం లేదు. లేకపోతే వాళు ్లు యీ అవకాశాన్ని ఉపయోగించుకుని వెంటనే రాజీనామా చేసి ఊళ్లో కూర్చునేవారు.

అదే విధంగా జగన్ ఎమ్మెల్యేలను వెనక్కి తీసుకురావడానికి కిరణ్ కూడా చాలా ఓపిక ప్రదర్శిస్తున్నారు. వాళ్లను గోడకు నెట్టేయకుండా, 'కావాలంటే ఆ క్యాంప్‌లో వుండండి, మీ నియోజకవర్గం గురించి మా దగ్గరకు వచ్చి పనులు చేయించుకోండి' అని చెప్తున్నారు. అది వాళ్లకూ అనువుగా వుంది. ఓదార్పు యాత్రల్లో జగన్ వెనుక జనం కనబడుతున్నారు. వాళ్లంతా ఓటర్లుగా మారతారా లేదా అన్నది యిప్పుడప్పుడే తేలదు. కానీ జనం వున్నట్టు స్థానిక ఎమ్మెల్యేలకు తోస్తోంది. తమ నియోజకవర్గంలో జగన్ అభిమానులు ఎక్కువ సంఖ్యలో వున్నారు అనే అభిప్రాయం తోచి వాళ్లు జగన్‌కి జై అన్నారు. కానీ జగన్ యిప్పట్లో అధికారంలోకి వచ్చే సూచనలు లేవు. అతని వెనుకనున్న ఎమ్మెల్యేలు మూడంకెల సంఖ్యలో వుంటే అది జరుగునేమో. కానీ వున్నది రెండంకెల సంఖ్య మాత్రమే. ప్రస్తుతం అధికారంలో వున్నది కిరణ్. ఇటు ప్రజలను చూస్తే 'మాకు అది కావాలి, యిది కావాలి, పనులు చేసిపెట్టు' అని సతాయిస్తారు. కిరణ్‌ను ఆశ్రయించకపోతే పనులు జరగవు.

ఇది ఇవాళ, రేపటి మధ్య ఘర్షణ. జనాలొచ్చి పని చేసిపెట్టమని యివాళ అడిగితే రేపు చూదాం అంటే కుదురుతుందా? రేపటికి నువ్వుంటావో లేదో ! జనాలకు కావలసినది ఇవాళ పని జరగడం. అది నువ్వు చేయకపోతే వేరేవాడు చేయడానికి ముందుకు వచ్చి నీ పాప్యులారిటీ కాజేస్తాడు. నీ నియోజకవర్గంలోనే నీకు పోటీగా నీలాటి ఓ చురుకైన వాణ్ని పెట్టుకుని వాడి ద్వారా కిరణ్ జనాలకు కావలసిన పనులు చేస్తాడు. దాంతో జనాలు అవతలివాడివైపు మొగ్గుతారు. అందునా కిరణ్ రకరకాల పథకాలు ప్రవేశపెట్టి జనాలను ఊరిస్తున్నారు. ముఖ్యంగా లక్ష ఉద్యోగాలు మరీ ఆకర్షణీయంగా వున్నాయి. "నువ్వు కిరణ్‌కి దూరంగా వుండటం చేతనే మన నియోజకవర్గానికి దక్కవలసినన్ని ఉద్యోగాలు దక్కలేదు" అని ఎమ్మెల్యేని ఎవరైనా పుసుక్కున అనేయవచ్చు. అదీకాక, జగన్ వెంట తిరిగితే ప్రభుత్వాధికారులు కూడా పట్టించుకోవడం లేదేమో. కిరణ్ నుండి ఆ మేరకు ఆదేశాలు వెలువడ్డాయేమో !

జగన్ రేపు ఏమైనా కావచ్చు కానీ యివాళ మాత్రం ఏదీ కాదు. జగన్ వెనక్కాల తిరిగితే మహా అయితే సాక్షి పేపర్లో, సాక్షి టీవీలో

వాళ్ల గురించి బాగా రాయవచ్చు, చూపవచ్చు. అంతకుమించి ఒరిగేదేమీ లేదు. జగన్ దగ్గర కట్టల కట్టల డబ్బు మూలుగుతోందనుకున్నా అది ఎలక్షన్ టైములో బయటకు తీయవచ్చు తప్ప 'ఇదిగో ఈ డబ్బెట్టి మీ నియోజకవర్గంలో పనులు చేయించుకో, మంచి పేరు తెచ్చుకో..' అని ఎన్నటికీ యివ్వడు. అవన్నీ ప్రభుత్వధనంతో చేయించుకోవలసినదే. ప్రభుత్వాధికారుల ద్వారా చేయించుకోవలసినదే. ముఖ్యమంత్రితో తగాదా పెట్టుకుని సాధించేది ఏమీ లేదు. ఆ మాటకొస్తే తగాదా పెట్టుకోవడానికి కూడా పెద్ద కారణం కనబడటం లేదు. కిరణ్ వీళ్లపై చర్యలు తీసుకోవడం మొదలుపెడితే అప్పుడు వీళ్లు ఘాటుగా తిరగబడితే అర్థం వుండేది. కానీ కిరణ్ తెలివిగా ఏమీ చేయకుండా కావాలంటే వచ్చి పనులు చేయించుకోండి అంటూంటే ఏ కారణం చూపించి పోట్లాట పెట్టుకుంటారు?

వాళ్ల యిబ్బంది గ్రహించిన కిరణ్ విషయాలు ఓ కొలిక్కి రాకుండా, ఒడుపుగా లాక్కుని వస్తున్నారు. నా ద్వారా పనులు కావాలంటే జగన్‌ని తిడుతూ ఓ ప్రకటన చేయాలి వంటి షరతులేవీ పెట్టకుండా అనునయంగా మాట్లాడి ఆకట్టుకుంటున్నారు. ఇలాటప్పుడు మరీ దూకుడుగా వెళ్లడం దేనికి అని జగన్ వర్గీయులు ఆలోచనలో పడ్డారు. ఇప్పుడు అర్జంటుగా ప్రతిపక్షంతో చేతులు కలిపి అవిశ్వాసతీర్మానం నెగ్గించి కిరణ్‌ను గద్దె దింపేస్తే కలిసి వచ్చేదేముంది? జగన్ గానీ విజయమ్మగానీ ఎలాగూ సిఎం కాలేరు. చంద్రబాబు గానీ మరొకరు గానీ సిఎం అయితే వీళ్లను దగ్గరకు రానీయరు. అలాటప్పుడు అవిశ్వాసానికి ఓటేసి బావుకునేది లేదు. పైగా ఓటేస్తే పార్టీ ఫిరాయింపు చట్టం కింద అనర్హులుగా ప్రకటించబడే రిస్కుంది. ఇలాటి విషయాలలో స్పీకరుకి ఎంత పవరుందో యిప్పుడు బాగా తెలిసి వస్తోంది. ప్రసన్నకుమారరెడ్డిపై అనర్హత వేటు వేయమని టిడిపి కోరినా వేయలేదు, రాజీనామా అంగీకరించారు స్పీకరు. లోకసభలో కూడా అందరూ ఒకేలాటి రాజీనామా పత్రాలిచ్చినా రాజగోపాలరెడ్డి ఒక్కరికీ సెపరేట్ ట్రీట్‌మెంట్. ఏమైనా అంటే స్పీకరు ప్రత్యేకాధికారాలు అంటారు.

మామూలు రోజుల్లో కిరణ్‌ను మట్టి కరిపిస్తాం, మహానేతను మరిచిన కాంగ్రెస్‌వారికి బుద్ధి చెపుతాం వంటి పొలికేకలు ఎన్నయినా పెట్టవచ్చు. కానీ .. వెన్ చిప్స్ ఆర్ డౌన్, ఆటలో కూర్చునేటప్పటికి తెలిసి వస్తుంది. మనం కేకలేసిన వీజీ కాదని. అవిశ్వాసానికి మద్దతు తెలిపినా, కిరణ్ గట్టెక్కవచ్చు. చంద్రబాబు సాయపడవచ్చు – యిప్పట్లో ఎన్నికలంటే ఆయనకీ భయం కాబట్టి ! తెరాస సాయపడవచ్చు – తెలంగాణ ప్రకటిస్తాం అనే హామీ పుచ్చుకుని ! పార్టీ పరంగా కాకపోయినా ఎమ్మెల్యేలు కిరణ్‌కు కొమ్ము కాయవచ్చు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో చూశాం కదా ! అప్పుడు క్రాస్ ఓటింగ్ చేసినవారిపై తెరాస వేటు వేయకపోవడంతో కెసియారే దగ్గరుండి ఓట్లేయించారని అనుకున్నారు. ఇప్పుడు అవిశ్వాసం పెట్టమని టిడిపిని రెచ్చగొడుతున్నది కూడా మళ్లీ ధనార్జనకే అని టిడిపి ఆరోపణ. ఏది ఏమైనా అవిశ్వాసం వీగిపోయి కిరణ్ నిల్చిపోతారన్నది అందరికీ తెలిసిన విషయం.

ఇక ఆ కాడికి అవిశ్వాసానికి ఓటేయడం ఎందుకు, ముప్పు తెచ్చుకోవడం ఎందుకు అని జగన్ వర్గీయుల భావన. ఇవన్నీ ఛాలెంజ్‌లు చేసినప్పుడు తెలియవా? అని అడిగితే 'పూనకంలో వున్నపుడు ఏమైనా మాట్లాడతాం. ఢిల్లీ వెళ్లబోయేముందు జగన్ మాత్రం చాలా ప్రగలాలు పలకలేదా? ఢిల్లీ వెళ్లి వాళ్లు కోరకపోయినా యుపిఏకు మద్దతిస్తాం అనే ప్రకటించలేదా? అంతటి శక్తిమంతుడు, మా నాయకుడు జగనే అలా చేయగా లేనిది మేం మాత్రం రాజీ పడితే తప్పేముంది' అని వారికి వారు సర్ది చెప్పుకుంటారు. అయినా యివన్నీ వాళ్లని ఎవరూ డైరక్టుగా అడగరు. రాజకీయ నాయకులు ఎవరైనా అడిగినా వాళ్లు "వెంటనే మీరు మాత్రం అలా చేయలేదా? ఇలా చేయలేదా?" అని తిరిగి అడుగుతారు. వీళ్లూ ఆ బాపతే కాబట్టి మాట్లాడరు. ఇక పాత్రికేయులు ఎవరైనా అడిగితే "పోనీ ఏం చేయాలో మీరే చెప్పండి." అని ఎదురుప్రశ్న వేస్తారు. "కన్సల్టెంట్‌గా నెలకు లక్ష జీతం యిచ్చి పెట్టుకోండి చెబుతా" అని పాత్రికేయుడు చమత్కరిస్తే తెలిసి వస్తుంది.

అసలు వున్న యిబ్బంది ఏమిటంటే – వైయస్‌కి జనాల్లో వున్న అభిమానం అనే బ్యాంక్‌లో ఎంత బాలన్స్ మిగిలిందో ఎవరికీ తెలియదు. స్విస్ బ్యాంక్ ఎక్కవుంట్ల లాగానే యిదీ ఓ మిస్టరీ. ఫలానా వారికి ఎక్కవుంటు వుందని జనాల్లో అనుకుంటారు కానీ ఆ ఖాతాలో ఎంత వుందో తెలియదు. ఇప్పుడింకా వుంచారో, వూడ్చేశారో కూడా తెలియదు. వైయస్ బతికుండగా వైయస్ అభిమానం అనే బ్యాంకులో వున్న బాలన్స్ ఆయన పోయిన తర్వాత పదిరెట్లు పెరిగింది. ముఖ్యంగా రాష్ట్రం రాజకీయంగా, ఆర్థికంగా, అభివృద్ధి పరంగా అల్లకల్లోలం కావడంతో 'వైయస్ వుండి వుంటే యిలా జరిగేది కాదు' అనే భావం ప్రబలంగా జనాల్లోకి వెళ్లి బాలన్స్ అంతలా పెరిగింది. అయితే యిప్పుడు సిబిఐ విచారణ మొదలెట్టాక ఆ బాలన్స్ ఏ మేరకు తగ్గిందో ఎవరూ ఊహించలేకుండా వున్నారు. వైయస్ ఎంతో ఆత్మీయంగా చూసుకున్న గాలి జనార్దనరెడ్డిపై అనేక ఆరోపణలు నిర్ధారణ అవుతున్నాయి. వైయస్ ఆదరించిన అధికారులు నోరు విప్పినకొద్దీ వైయస్ ఇమేజి మసిబారిపోతోంది. ఈ మసి కాంగ్రెస్ హై కమాండ్‌కు అంటుతుందా, లేక జగన్‌కు అంటుతుందా అనేది వేచి చూడాలి. హై కమాండ్ మాట ఎలా వున్నా నిత్యం వైయస్ నామజపం చేసే జగన్‌కు అంటక మానదు.

పైగా జగన్‌కు అతని కంటె ఘనుడు ఆచంట మల్లన అనే యిమేజి వుంది. రాజకీయ జీవితం చివరిఘట్టంలో కానీ వైయస్‌కు అధికారం చేజిక్కలేదు. జగన్‌కు పాతికేళ్ల ముందే వచ్చేసింది. జగన్ అధికారంలోకి వస్తే అవినీతి విషయంలో తండ్రిని మించిపోతాడన్న భయం కూడా వుంది. జగన్‌మీద ఆరోపణలు ఎప్పణ్నుంచో వున్నాయి కానీ వాటికి యిప్పుడు సిబిఐ ఎప్రూవల్ స్టాంపు పడుతోంది. కోర్టులో విచారణ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియదు కానీ మీడియా ఎప్పుడో మొదలెట్టేసి దండన కూడా విధించేసింది. జగన్ జైలు జీవితం గురించి, అన్నం తిని కడిగేసిన పళ్లెం ఏ మూల బోర్లిస్తాడన్న విషయం దగ్గర్నుంచి ఈనాడులో కార్టూన్లు వచ్చేశాయి. వీటిల్లో ఎన్ని ప్రజల మెదళ్లలోకి ఎక్కి వుంటాయన్నది జగన్ ఎమ్మెల్యేల చింత. వైయస్ పథకాలన్నీ ఆపేస్తున్నారని సాక్షి ఎంత గగ్గోలు

పెడుతున్నా, ఆ పథకాలు కొనసాగించడానికి ఖజానాలో వైయస్ డబ్బు మిగల్చలేదన్నది కూడా క్రమంగా జనాలకు అర్థమవుతోంది. వైయస్ విధానాలు తప్పనీ, అతను పూర్తి అవినీతిపరుడనీ జనాలు నమ్మితే ఆ నాటికి ఆ అభిమాన బ్యాంకులో బాలెన్సు బొత్తిగా అడుగంటుతుందని భయం.

సిబిఐ చార్జిషీటులో వైయస్ పేరుందన్న కారణంగా కోపగించుకుని అవేళ జగన్ ఎమ్మెల్యేలు రిజైన్ చేశారు. ఈ రోజు ప్రతీ అధికారీ అప్రూవర్‌గా మారి వైయస్ ఒత్తిడి మేరకే మేం చేశాం అంటూంటే మరి చార్జిషీటులో పేరు పెట్టకపోతే ఏం చేస్తారు? అని జనాలనుకుంటున్నారన్న భయం యీ ఎమ్మెల్యేలకు పట్టుకుంది. ఆ నాడు బలంగా కనిపించిన ఆ కారణం, యీనాడు బలహీనంగా కనబడుతోంది కాబట్టే స్పీకరు వద్దకు వెళ్లి పట్టుబట్టడం లేదు. స్పీకరు ఆమోదించాక ప్రజల్లోకి వెళ్లి వైయస్ పేరుకు బురద పూశారు కాబట్టి నేను పదవి తిరస్కరించి వచ్చాను అంటే భేష్ అనేవాళ్లు వుంటారా? విచారణ ముగిసేదాకా ఆగలేకపోయారా అనరూ !

చంద్రబాబుపై సిబిఐ విచారణ అనగానే నిరసనగా టిడిపి ఎమ్మెల్యేలు ఎవరూ రిజైన్ చేయలేదు. ఒకవేళ జైలుకి గినా పంపితే చేస్తారేమో ! జగన్ విషయంలో అయితే అప్పుడే ప్లాన్ బి రెడీ అయిపోయిందంటున్నారు. జగన్ జైలు కెళితే పార్టీ పని ఆగిపోకుండా విజయలక్ష్మిగారు నడుపుతారని చెప్పుకుంటున్నారు. ఆవిడ కూడా యాక్టివ్‌గా వున్నారు. అన్నీ ఎంతో ప్రణాళికతో చేసే చంద్రబాబు యింకా జైలుదిశగా ఆలోచిస్తున్నట్టు లేదు. తన బదులు ఎవరినైనా కూర్చోబెట్టి వెళతారో, తన చెప్పులు సింహాసనంపై విడిచి వెళతారో చెప్పలేం. ఒకవేళ బాబు కూడా జైలుకి వెళితే జగన్ ఎమ్మెల్యేలకు ప్రజలకు సమాధానం చెప్పుకోవడం మరీ కష్టమౌతుంది. "అందరి మీదా విచారణ జరుగుతోందిగా, వైయస్ పేరు చార్జిషీటులో వున్నంత మాత్రాన మునిగే కొంపేమిటి?" అని వాళ్లడుగుతారు.

'ఇదంతా కాంగ్రెస్ వాళ్లు వాళ్లల్లో వాళ్లు ఆడుతున్న అంతర్నాటకం. జగనూ, కాంగ్రెసూ కలిసే మమ్మల్ని ఫినిష్ చేయడానికి చూస్తున్నారు' అని టిడిపి వారనవచ్చు. నా ఉద్దేశం – అదేమీ వుండి వుండదు. ఈ క్షణానికి ప్రభుత్వానికి మద్దతు యిస్తున్నారు. నియోజకవర్గంలో పనులు చేయించుకుంటున్నారు. రేపు ఎన్నికల వేళ జగన్‌కు మద్దతు ఎక్కువుందని అనిపిస్తే తోక ఝాడిస్తారు. ఎవర్నీ నమ్మడానికి లేదు.

అలాగ కిరణ్‌కు ప్రస్తుతం తన ప్రభుత్వం నిలబెట్టుకుని హై కమాండ్ చేత శభాష్ అనిపించుకోవాలన్న తాపత్రయం కాబట్టి (పైగా ఆయన గాడ్‌ఫాదర్ చిదంబరం పొజిషన్ యిప్పుడు మరీ నాసిగా తయారైంది) జగన్ ఎమ్మెల్యేలు దాసోహం అనకపోయినా, మొహం చూపించి వెళ్లిపోతానన్నా ఓకే అంటున్నారు. ఎలాగోలా యింకో ఏడాది ప్రభుత్వం లాగించేస్తే చాలని ఆశ – కుర్చీలో వున్నాడు కాబట్టి !

మరి కుర్చీలో లేని బొత్సకు యీ ఆలోచన ఎందుకు వుంటుంది? ఉండదు. జగన్ మనుష్యులు మనకు మద్దతు యిస్తాం అని ఒప్పుకుంటే చాలదు, లెంపలేసుకోవాల్సిందే, గాంధీభవన్‌లో కనబడాల్సిందే, నా దర్బారులో హాజరు వేసుకోవాల్సిందే అని హుంకరిస్తున్నారు. జగన్ మనుష్యులు పదిమంది నా వైపే, ఇంకో నలుగురు వస్తారు అని స్టేటుమెంటు యిచ్చి వాళ్ల మోరేల్ దెబ్బ కొడదామని చూస్తున్నారు. ఇది డేంజరస్ గేమ్ ! మరీ ఎక్కువగా ఒత్తిడి చేస్తే జగన్ ఎమ్మెల్యేలు ఎదురు తిరిగి మేం అటు రానే రాము, రిస్కు తీసుకుని యిటే వుంటాం, మా ప్రజలకు మేం నచ్చచెప్పుకుంటాం అనేయవచ్చు. ఇది తెలిసి కూడా బొత్స ఈ గేమ్ ఆడుతున్నారు.

ఎందుకంటే గేమ్‌లో వున్న డేంజర్ ఆయనకు కాదు, కిరణ్‌కి. రెచ్చగొట్టి దూరం చేసుకుని, ప్రతికూల ఎమ్మెల్యేల సంఖ్య పెంచితే పోయే పదవి – సిఎం పదవి తప్ప పిసిసి అధ్యక్షుడి పదవి కాదు. సిఎం పదవికి కిరణ్ నిభాయించుకోలేకపోయారు అనగానే ఆ రింగులోకి టోపీ విసిరే మొదటి వ్యక్తి బొత్స – పిసిసి అధ్యక్షుడి హోదాలో ! తెలంగాణ కోటాలో డియస్‌కో, జానాకో కట్టబెడితే ఏమో కానీ, మామూలు పరిస్థితుల్లో అయితే బొత్సకు మంచి ఛాన్సుండేది. తెలంగాణ కోటా వుందా లేదా అన్నది ఎవరికీ తెలియదు. ఉంటే గింటే రోశయ్య వారసుణ్ని ఎంపిక చేసినపుడే దాన్ని అమలు చేసి వుండాల్సింది. అప్పుడు చేయలేదు కాబట్టి యిప్పుడూ చేయరన్న ధైర్యం బొత్సది.

అందుకే ధైర్యంగా ఆయన జగన్ వర్గీయులపై కాలు దువ్వుతున్నాడు. జగన్‌పై యిష్టం వచ్చినట్లు కామెంట్స్ చేస్తున్నాడు. జగన్‌కు కోపం వస్తే అన్న భయం లేకపోవడమే కాదు, వస్తే మంచిదన్న భావంలో వున్నాడు. లేకపోతే తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో పాటిస్తున్న సంయమనం జగన్ వర్గీయుల విషయంలో ఎందుకు పాటించలేదు చెప్పండి. తెలంగాణ ఎమ్మెల్యేలు యిలా అన్నారు కదా, మీరేమంటారు అని అడిగితే అవన్నీ హై కమాండ్ చూసుకుంటుంది అని చెప్పేసి వూరుకుంటాడు. జగన్ విషయం కూడా హై కమాండే చూసుకుంటుందని వూరుకోవచ్చుగా. అబ్బే అలా క్కాదు. ఎందుకంటే తెలంగాణ ఎమ్మెల్యేలు పార్టీ వదిలిపోరని ధైర్యం. పోయేవాళ్లు ఎలాగూ పోతారు, ఊగిసలాట లేదు. జగన్ వర్గీయులదే వూగిసలాట అంతా.

తెలంగాణ ఎమ్మెల్యేలకు తెలంగాణ అనే ఒక ఆకర్షణీయమైన వేదిక వుంది. జగన్ వర్గీయుల క్యాపిటల్ అంతా వైయస్ పాప్యులారిటీయే. దాని షేర్ మార్కెట్ వేల్యూ తెలియదు. ప్రస్తుతం ఎంత వుందో, సమీప భవిష్యత్తులో ఎంత అవుతుందో ఏమీ తెలియదు. అందుకే వాళ్లతో బొత్స పాచిక లాడుతున్నాడు. గెలిస్తే జగన్ వర్గీయులను పంతం పట్టి కాంగ్రెస్ గూటికి చేర్చాడన్న పేరు దక్కుతుంది. పోతే కిరణ్ పోతాడు. దీన్నే 'చిత్ మై జీతా, పట్ తుమ్ హారా' పరిస్థితి అంటారు. పందెం వేసినప్పుడు 'బొమ్మయితే నువ్వోడిపోయినట్టు, బొరుసైతే నేను గెలిచినట్టు' అని చెప్పాట్ట ఎవడో వెనకటికి. బొమ్మా-బొరుసూ, ఓటమీ-గెలుపూ అనే విరుద్ధపదాలు వినబడ్డాయి కాబట్టి సరేనన్నాడు అవతలివాడు. కానీ రెండు నెగటివ్స్ వాడి తనకు పాజిటివ్‌గా మలుచుకున్నాడు యివతలివాడు. బొత్స గారి ఆట

అలాగే వుంది.

జగన్ వర్గీయులు యీ రోజు బొత్స హుకుంలకు తలొగ్గినా, కిరణ్‌కు మద్దతిచ్చినా నేను ఆశ్చర్యపడను. తర్వాత ఎన్నికల వేళ ఎలా ప్రవర్తిస్తారన్నదే చూడాలి. ఎన్నికల వేళ మాత్రమే కాదు, ఎన్నికల ఫలితాలు జగన్‌కు అనుకూలంగా వస్తే ఎన్నికలలో జగన్‌ను వ్యతిరేకించినవాళ్లు కూడా అతనివైపు గోడ దూకేస్తారు అని నేనంటే మీకు వెంటనే చంద్రబాబు గుర్తుకు రావచ్చు. 1983 ఎన్నికలలో కాంగ్రెస్ తరఫున ఎన్టీయార్‌ను ఎదిరిస్తానని బీరాలు పలికి, ఫలితాలు రాగానే టిడిపిలోకి దూరిపోయారు కాబట్టి ! కానీ నాకు గుర్తుకు వచ్చేది ఇందిరా గాంధీ టైములో పాత కాంగ్రెస్ వారి విన్యాసాలు.

వాటి గురించి ఎప్పుడైనా విపులంగా చెప్తాను కానీ యిప్పుడు సూక్ష్మంగా చెప్పాలంటే – ఇందిర కాంగ్రెస్‌ను చీల్చడానికి ముందు చాలా వీక్. ఆమెను సింహాసనంపై కూర్చోబెట్టి ఆమెను ఆడించాలని చూసిన గ్రూపును అప్పట్లో సిండికేట్ అనేవారు. ఇందిర క్రమేపీ బలపడి, సిపిఐ వాళ్ల సపోర్టు తీసుకుని వాళ్ల నెదిరించ సాగింది. కానీ సంస్థ అంతా వాళ్ల చేతిలోనే వుండేది. ఎన్నికల గుర్తు – కాడీ జోడెద్దులు కూడా వాళ్ల దగ్గరే వుండేది. ఇందిర వెనుక కొందరు యంగ్ టర్కులు మాత్రం వుండేవారు. కాంగ్రెస్ వాదుల్లో ఒకటే కన్‌ఫ్యూజన్ – అటా యిటా అని. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటి చర్యల ద్వారా ప్రజలలో ఇందిరకు పాప్యులారిటీ పెరిగింది అని ముందుగా గ్రహించినవారు యిటు వచ్చారు. ఏడిసింది, హేమాహేమీలంతా అటే వున్నారు అనుకున్నవారంతా అటు వున్నారు. ఇందిర కాంగ్రెస్ (ఐ) (సూక్ష్మంగా కాంగీ) అని పెట్టుకుంది. ఇండియా అని నా ఉద్దేశం అంది ఆవిడ, కాదు ఇందిర అని కిట్టనివాళ్లన్నారు. ఎప్పటినుండో వున్న కాంగ్రెస్‌కు పేరు కాంగ్రెస్ (ఓ) (సూక్ష్మంగా కాంగో) అన్నారు. ఓ అంటే ఆర్గనైజేషన్ అని వాళ్లన్నారు, కాదు ఓల్డ్ అని కిట్టనివాళ్లన్నారు.

బంగ్లాదేశ్ యుద్ధం (1971) తర్వాత కాంగ్రెస్ (ఐ) అప్రతిహతంగా ముందుకు సాగిపోయింది. కాంగోలో వుండి ఇందిరను పడతిట్టినవాళ్లంతా కాంగీలోకి దూకేశారు. కాంగీ నామావశిష్టమై 1977లో జనతా పార్టీలో కలిసి కనుమరుగై పోయింది. కాంగీయే ఒరిజినల్ కాంగ్రెస్ అని కోర్టు తీర్పు వచ్చేసి, వాళ్ల ఆస్తులన్నీ వీళ్లకు సంక్రమించాయి. 1977 ఎన్నికల తర్వాత ఇందిర ఓడిపోతే మళ్లీ కాంగీలోని పెద్దలే కాంగ్రెస్ ఆర్ (బ్రహ్మానంద రెడ్డి పేర రెడ్డి అన్నమాట) పేర ఆవూదూడా ఎన్నికల గుర్తు లాగేసుకుని ఆమెను బయటకు తరిమేశారు. 1980 ఎన్నికలలో హస్తం అనే కొత్త గుర్తుతో ఇందిర ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ ఆర్ మూతపడి ఇందిరను బహిష్కరించిన బ్రహ్మానంద రెడ్డే ఆవిడ పంచన చేరాడు. మళ్లీ ఇందిర నడిపిన పార్టీయే ఒరిజినల్ కాంగ్రెస్ ఆయిపోయి 'మాది 125 ఏళ్ల పార్టీ' అని చెప్పేసుకుంటోంది. ఖండించడానికి అవతలివైపు ఒక్కడూ మిగల్లేదు.

కథలో నీతి ఏమనగా – ఇందిర లాగ జగన్ ప్రజలను ఆకట్టుకోగలిగితే ప్రజలు అతని వెంట నిలిస్తే నాయకులన్నవాళ్లు సత్రకాయలు. వాళ్లే యితని వెంట పరిగెడతారు. ఇవాళ జగన్‌ను వదలి కిరణ్ వైపు వచ్చినంత స్పీడుగానూ తిరిగి వెళ్లిపోతారు. ఇవాళ జగన్‌ను తిట్టిపోస్తున్న బొత్సయే అతని పార్టీలో చేరడానికి క్యూ కడతాడు. అయితే జగన్ ప్రజలను ఆకట్టుకోగలడా? లేదా? ఆ కథ త్వరలో స్థానిక ఎన్నికల వెండితెరపై చూడవలసినదే ! ఆ సినిమా వేయించాలంటే యిప్పటివరకు కాంగ్రెస్‌కు భయం. తెలంగాణ అంశం చల్లబడుతోంది కాబట్టి, జగన్ ఎమ్మెల్యేలు తటస్థం అయిపోయారు కాబట్టి యికపై ధైర్యం చేయవచ్చు. (సమాప్తం)

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

**నవంబరు 28** **ఎమ్బీయస్ : మాయావతి తెలంగాణకు మేలు చేశారా?**

మాయావతి పంతం పట్టి యుపి విభజన బిల్లు ఎసెంబ్లీలో పాస్ చేయించారు. ఆవిడ రాజకీయ అవసరాలు ఆవిడవి. ఇన్నాళ్లూ ఆగి యిప్పుడు ఆవిడకు యీ విభజన అంశం హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. అంబేద్కర్ నామ నిత్యం స్మరిస్తూ కూడా చిన్న రాష్ట్రాలు మంచివని ఆయన చెప్పాడన్న విషయం కానీ, పరిపాలన సులభంగా చేయవచ్చన్న సంగతి గానీ అధికారంలో వున్నంతకాలం గుర్తే లేకపోయాయి. ఓ సారి వి.హనుమంతరావో, ఎమ్. సత్యనారాయణరావో గానీ వైయస్ గురించి అన్నారు – 'ముఖ్యమంత్రి సీటులో వున్నవాడికి రాష్ట్రాన్ని చీల్చి అధికారం సగం చేసుకోవాలని వుంటుందా? ఆయన సీటులో ఎవరున్నా తెలంగాణ విభజనను వ్యతిరేకిస్తారు' అని. తెరాస కాంగ్రెస్‌లో విలీనమైతే రేపు కెసియార్ సిఎంగా వున్నా 'తెలంగాణ యిచ్చేద్దాం కానీ, నా పదవీకాలం పూర్తయ్యాక...' అనవచ్చు. అలాగ మాయావతి యిన్ని రోజులూ పూర్తి రాష్ట్రం పాలించేసి, గాలికి పోయే పేలపిండి కృష్ణార్పణం అన్నట్టు, నా తర్వాత యింత పెద్దరాజ్యం పాలించే అర్హత మరెవ్వరికీ లేదు కాబట్టి అని చాటినట్టు, యిప్పుడు విభజన తీర్మానం చేయించేసింది.

ఆవిడ రాజకీయాన్ని తెలంగాణకు అన్వయించుకుని కెసియార్ గారు ఆవిణ్ని మెచ్చుకున్నారు.ధన్యవాదాలు చెప్పారు. అందరూ ఆవిడ బాటలో నడవాల్సిన అవసరం వుందన్నారు. నిజానికి జాతీయంగా, అంతర్జాతీయంగా ఏ సంఘటన జరిగినా తెలంగాణ ఉద్యమకారులు తమకు అన్వయించుకుని ఉప్పొంగుతున్నారు. ఆ మధ్య ఈజిప్టులో విప్లవం వస్తే తెలంగాణలో కూడా ఆ తరహా విప్లవం రావాలని పిలుపు నిచ్చారు. ఆ తర్వాత యింకో దేశంలో వస్తే ఆ తరహాలో అన్నారు. ఈ మధ్య లిబియాలో వస్తే.. దానికీనూ.. అక్కడి పరిస్థితులేమిటి? అక్కడ ప్రజాస్వామ్యం వుందా? సైనిక నియంతృత్వం వుందా అన్నది వీళ్లకు పట్టదు. అక్కడ అధికారంలో వున్నవాళ్లు కుప్పకూలారు. ఇక్కడా కూలాలి. ఇదే ఆకాంక్ష. అక్కడ నేలరాలేది నియంతలు. ఇక్కడ పాలిస్తున్నది –

మనమే ఎన్నుకున్న ప్రజాప్రతినిథులు. వీళ్లని ఎవరూ మన నెత్తిమీద రుద్దలేదు.

మాయావతి అసెంబ్లీ తీర్మానం చేసి తెలంగాణకు మేలు చేసినట్టా? నాకైతే అలా తోచటంలేదు. దీనివలన నిర?యం వాయిదా వేయడానికి కాంగ్రెస్‌కు మరో సాకు యిచ్చినట్టయింది. సాకులుంటేనే కాంగ్రెస్ నిర?యం వాయిదా వేస్తుందని నా అభిప్రాయం కాదు. సాకులు రెడీగా లేకపోతే తయారుచేయగలదు ఆ పార్టీ. బక్రీద్ అని, గురుపూరి?మ అని, మిజోరాంలో ఎన్నికలనీ, పార్లమెంటు సమావేశాలనీ, ఆజాద్‌కు నడుం నొప్పి అనీ, సోనియా గాంధీ తల్లికి వార్ధక్యమనీ.. ఏదైనా చెప్పగలరు. అయినా యిప్పుడు యుపి ఒకటి అనువుగా దొరికింది. ఇవాళే పేపర్లో వచ్చింది – యుపిలో ఎన్నికలు పూర్తయేవరకు కాంగ్రెస్ ఏ నిర?యమూ తీసుకోదని అనుకుంటున్నారు. హతోస్మి ! ఎప్పటి ఎన్నికలండీ బాబూ. అప్పటిదాకా మనం నోట్లో వేలు వేసుకుని కూర్చోవలసినదేనా?

కూర్చోవలసినదే అంటారు కాంగ్రెస్ నాయకులు. ''ఇప్పుడు మీకు తెలంగాణ యిచ్చేస్తే యుపిలో కూడా యిచ్చేయమని ఆందోళన వస్తుంది కదమ్మా.. అలా యిచ్చేస్తే మనం మాయావతి పన్నిన వలలో పడిపోయినట్లే కదా ! వచ్చేసారి మనం మళ్లీ అధికారంలోకి రావాలంటే యుపిలో మన పార్టీ బలపడాలి. రిస్కు తీసుకోలేం. విభజనకు సై అంటే మాయావతికే ఆ క్రెడిట్ పోతుంది. మనకు మిగిలేది గుండుసున్నే. అందుకే అక్కడ సెకండ్ ఎస్సార్సీ అంటున్నాం. అలాగే యిక్కడా అందామంటే మీరు ఒప్పుకోవడం లేదు. అందుని యుపి ఎన్నికలు కానీయండి'' అని వాళ్లు టి కాంగ్రెస్ నాయకులను బుజ్జగించేస్తారు.

''తెలంగాణకు, యుపికి సంబంధం లేదని ఆ రషీద్ గారే అన్నారు కదండీ'' అని వీళ్లు గుర్తు చేశారనుకోండి. ''సంబంధం లేదని మీకూ, మాకూ తెలుసు. కానీ ఆ యుపి ప్రజలున్నారు చూడు, వాళ్లు అర్థం చేసుకోరు. వాళ్లకు బొత్తిగా చదువులు లేవు, తలకాయలు లేవు. లేకపోతే ఎవరైనా మనని కాదని మాయావతిని ఎన్నుకుంటారా చెప్పు. మీ తెలుగువాళ్లయితే తెలివైనవాళ్లు కాబట్టి కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు. కాస్త ఆలస్యమైనా మీ వాళ్లు అర్థం చేసుకోగలరు. ఎందుకంటే మీ వాళ్లు.. అదేదో సినిమాలో ప్రకాష్ రాజ్‌లా 'టూ…యింటెలిజెంట్' !'' అని నచ్చచెపుతారు.

మనవాళ్లు ఏమంటారు? ఏమీ అనరు. బొత్తిగా అల్పసంతోషులు. అంబికా సోనీ కనబడి ''మీకు ప్రాంతీయ మండలే తప్ప ప్రత్యేకరాష్ట్రం లేద'ని చెప్పిందిట. వీళ్లు సోనియాను పార్లమెంటు హాల్లో కనబడి నమస్కారం పెడితే ఆవిడ చిరునవ్వు నవ్వి, అంతలోనే వేరేవారు కనబడితే వాళ్లతో మాటల్లో పడిందట. ఈ మాత్రం దానికే మందా జగన్నాథం గారు వెంటనే టీవీలోకి వచ్చేసి ''సోనియాగారు మాపై ఆగ్రహంతో వున్నారన్నది అబద్ధం. మేం నమస్కారం పెడితే ఆవిడ చిరునవ్వు నవ్వారు.'' అని చెప్పేసుకున్నారు.

దీనిలో మురిసి ముక్కలయ్యేందుకు ఏమైనా వుందా చెప్పండి. ఒకవేళ ఆగ్రహంతో వున్నా గదిలోకి పిలిచి మందలిస్తారు కానీ అందరిముందూ ఏమైనా అంటారా? నెలల క్రితం వీళ్లు ఎపాయింట్‌మెంట్ అడిగితే ఆవిడ యివ్వటం లేదు. కొత్తగా పార్టీలో చేరిన చిరంజీవికి యీ మధ్యే యిచ్చారు. దాన్ని బట్టే తెలుస్తోంది వీళ్ల విలువ. తిట్టకపోతేచాలు, ఎత్తుకుని బుజ్జగించినట్టు ఫీలయిపోతే ఏం చెప్పగలం? అందువలన కాంగ్రెస్ హై కమాండ్ వారికి మాయావతి మరో అస్త్రాన్ని యిచ్చినట్టయింది.

దీనితో బాటు ఆవిడ యింకో పని కూడా చేసింది. చిన్న రాష్ట్రాలే మా విధానం అని చెప్పుకుంటున్న బిజెపిని నగ్నంగా నిలబెట్టేసింది. యుపి అసెంబ్లీలో ఆ తీర్మానాన్ని విభేదించి వాళ్ల ద్వంద్వ విధానం చాటుకునేట్టు చేసింది. ఎపిలో చిన్న రాష్ట్రాలకోసం వీధిపోరాటాలు చేస్తున్న బిజెపి యుపి దగ్గరకు వచ్చేసరికి ప్లేటు ఫిరాయించి పరువు పోగొట్టుకుంది. 25 జిల్లాలున్న రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలట కానీ 75 జిల్లాలున్న రాష్ట్రాన్ని ఏకఖండంగా వుంచాలట. అర్రీబుర్రీగా విభజన చేయకూడదు అంటున్నారు అద్వానీ గారు. అర్రీబుర్రీ ఎందుకు యిన్నాళ్లు బిజెపి ప్రతిపక్షంలోనే వుంది కదా, శాస్త్రోక్తంగా యుపిని విభజించే ఓ విధానం రూపొందించ లేకపోయారా? అధికారంలోకి వచ్చే ఛాన్సు లేని చోట కొంప కూల్చాలి, ఛాన్సు వున్నచోట కొంప కాపాడుకోవాలి – యిదేగా బిజెపి పాలసీ !

నిజానికి తెలంగాణ ఉద్యమంలో యిటీవల బిజెపి చాలా చురుగ్గా పాల్గొంటోంది. తెరాస ఒంటె దూసుకు వెళ్లిపోతోంది. కాకినాడ తీర్మానం, మూడు రాష్ట్రాలు మేమే యిచ్చాం, అప్పుడు టిడిపి అడ్డుపడింది, తెరాసలా కాంగ్రెస్‌తో మాకు లాలూచీ లేదు, పార్లమెంటులో బిల్లు పెట్టమని నోటీసు యిచ్చాం, తెలంగాణ తల్లియే సుష్మా స్వరాజ్ రూపంలో అవతరించింది – అంటూ దూసుకుపోతోంది. మంచో చెడో ఓ స్టాండ్ తీసుకుంది, తెరాసకు లేని నైతికత వీళ్లకుందిరా బాబూ అనిపించేలా ప్రవర్తిస్తోంది. నిజానికి తెలంగాణ అంశాన్ని తెరాస నుండి బిజెపి హైజాక్ చేసే స్థితి వచ్చేసింది. తెరాసకు భయం పుట్టి బిజెపికి దూరంగా జరుగుతున్నట్టు తోస్తోంది కూడా.

ఇటువంటి పరిస్థితిలో మాయావతి వాళ్లను యిరకాటంలో పడేసింది. వాళ్లకు నిజాయితీ లేదని చాటి చెప్పింది. అదేదో జోక్ వుంది వినేవుంటారు. ఒకావిడ ఓ డెంటిస్టు వద్దకు వచ్చి మత్తుమందు లేకుండా పన్ను తీయగలరా? అంది. తీస్తాను కానీ చాలా నెప్పి వుంటుంది. చూడబోతే మీరు చాలా ధైర్యవంతుల్లా వున్నారే, రండి అన్నాట్ట డాక్టరు. 'నాక్కాదు, మా ఆయనకి..' అని చెప్పి 'ఏమండీ, మిమ్మల్నే, పిలుస్తున్నారు..' అని భర్తను పిలిచిందట. బిజెపి పని కూడా అలాగే వుంది చూడబోతే. తెలంగాణలో బలం లేదు కాబట్టి ఎంతటి సర్జరీకైనా సిద్ధం. యుపిలో బలం వుంది కాబట్టి అక్కడ వద్దంటోంది. జోక్‌లో భార్యలా తనది కాకపోతే తాటిపట్టెకు ఎదురు దేకమంటుంది. తెలంగాణలో బలం ఓ పిసరు అనుకుంటే ఆంధ్రప్రాంతంలో అసలే లేదు. ఆంధ్రప్రాంతంలో యిప్పటికే బిజెపిని విమర్శిస్తున్నారు. అక్కడ ప్రత్యేక ఆంధ్ర వుద్యమం మొదలుపెట్టి, తెలుగు ప్రజలు విడిపోతే తప్ప ఆంధ్రప్రాంతం బాగుపడదని చెప్పే

ప్రయత్నం చేద్దామని ప్లాను చేసింది బిజెపి.

కానీ వాళ్ల షెడ్యూలు ప్రకారం వ్యవహారం నడుస్తున్నట్టు లేదు. అక్కడి కార్యకర్తలకు స్థానిక ప్రజల ప్రశ్నలు తట్టుకోవడం కష్టంగానే వుంది. వాళ్లను ప్రశ్నించేవారికి యిప్పుడు మాయావతి మరో పెద్ద అస్త్రం సమకూర్చింది. ''యుపిలో విభజనను వ్యతిరేకిస్తున్నారెందుకు?'' అని అడిగితే ఆంధ్రప్రాంతపు బిజెపి నాయకులు నోరెత్తగలరా? ఆంధ్రప్రాంతంలో బొత్తిగా నూకలు చెల్లవని తేలితే బిజెపి తెలంగాణలో చురుగ్గా వుండగలదా? తెలంగాణలో సమైక్యవాదులు సైతం బిజెపిని నిందించరా? బిజెపికి మిగిలేదేమిటి? ఈ విధంగా తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన వున్న బిజెపిని మోరల్‌గా దెబ్బతీసింది. బిజెపిని సమర్థించే పత్రికలు సైతం సంపాదకీయాల్లో దాని డ్యూయల్ స్టాండ్‌ను విమర్శించే పరిస్థితి వచ్చిపడేట్లా చేసింది. రాజకీయపార్టీగా బిజెపి బతుకు ఏమైనా మనకేం కాదు కానీ తెలంగాణ ఉద్యమానికి మాత్రం దెబ్బే !

ఇవన్నీ ఒక యెత్తు. రాష్ట్రవిభజనను ఎన్నికల అంశం చేసి మాయావతి పెద్ద జూదం ఆడుతున్నారు. ఆవిడ ఐదేళ్ల పరిపాలన బాగాలేదన్న కారణంగా యుపిలో ఆమె పార్టీ ఓడిపోయిందనుకోండి. అప్పుడు దానికి ఏం అర్థం తీస్తారు? ప్రజలు రాష్ట్రవిభజనను వ్యతిరేకించారు, తామంతా కలిసే వుందామనుకున్నారు. తమని విడగొట్టాలని చూసిన మాయావతికి గుణపాఠం నేర్పారు అంటారు. దాంతో చిన్నరాష్ట్రాల గురించి ఉద్యమించేవారందరూ పునరాలోచనలో పడతారు. ఆ ఉద్యమాలను సమర్థించేవారు కూడా.. ! ఓట్లేసేవారు మేం యిందుకోసం మీకు ఓటేశాం, ఫలానా కారణంగా అలిగి అవతలివారికి ఓటేశాం అని చెప్పే అవకాశం లేదు కదా. అందువలన విశ్లేషకులు వాళ్లకు చిత్తం వచ్చినట్టు అర్థాలు తీస్తారు.

సినిమా ప్రేక్షకుల నాడిలాగే ప్రజల నాడి కూడా పట్టుకోవడం కష్టం. అందుకే ఎన్నికల ఫలితాలు వస్తూంటే సెఫాలజిస్టులు గడ్డం నిమురుకుంటూ విశ్లేషిస్తూ వుంటారు. ఉత్తరభారతంలో అయితే కులాలవారీ చీల్చేసి ఏవేవో అంకెలు చెప్పేస్తారు. అదే ఫార్ములాను దక్షిణాదికీ అప్లయి చేసి బోల్తా కొట్టేస్తారు. ఇవన్నీ వేడుకకోసం వినాలే తప్ప ఏదీ గాస్పెల్ ట్రూత్ కాదు. అన్ని రకాలూ వింటే మనకూ ఓ ఐడియా వస్తుంది. అది కూడా మన వ్యక్తిగత రాగద్వేషాలకు లోబడి ! ఎక్కువమంది విశ్లేషకులు ఏమంటే చివరకు అదే నిజమనుకుంటారు. దాన్నే వ్యాప్తి చేస్తారు.

విభజనను ఎన్నికల అంశం చేస్తున్నారు కాబట్టి, మాయావతి ఓడిపోతే అది తెలంగాణ ఉద్యమానికి కూడా దెబ్బగా పరిణమిస్తుంది. 75 జిల్లాల యుపి ప్రజలే కలిసి వుందామనుకోగా లేనిది 25 జిల్లాల తెలుగువాళ్లు కలిసి వుండలేమా? అన్న ఆలోచన కలగవచ్చు. తెలంగాణ ఉద్యమం నీరసించవచ్చు. ఎలా చూసినా మాయావతి చేసిన అసెంబ్లీ తీర్మానంలో తెలంగాణ ఉద్యమకారులు సంతోషించడానికి ఏమీ కనబడటం లేదు. మరి కెసియార్ సంతోషిస్తున్నారంటే కారణం ఏమిటంటారు?

తెలంగాణపై కాంగ్రెస్ ఏదీ తేల్చకపోవడం, కెసియార్‌కు లాభిస్తోంది. ఇప్పటికే ముగ్గురు కాంగ్రెస్‌నుండి తెరాసలోకి వచ్చారు. బుధవారం నాడు ఢిల్లీలో కెసియార్ మాట్లాడుతూ ఇంకా చాలామంది కాంగ్రెస్‌వారు తమ పార్టీలో చేరదామనుకుంటున్నారనీ, కానీ అందర్నీ చేర్చుకునే ఉద్దేశం లేదనీ, తాము సిద్ధంగా లేమనీ చెప్పారు. ఒకవేళ కాంగ్రెస్ తెలంగాణ యిచ్చేస్తాం అని ప్రకటించిందనుకోండి, యీ వలసలు ఆగిపోవూ? అందుకని ఆ ప్రకటన ఎంత ఆలస్యంగా వస్తే కెసియార్‌కు అంత లాభం.

ఒకవేళ కాంగ్రెస్ తెలంగాణ యివ్వం అని ప్రకటించదనుకోండి. అప్పుడు తెలంగాణ రావాలనుకున్నవారందరూ కెసియార్ వైపు వస్తారన్న ఆశ వుండవచ్చు. కానీ స్వంతబలంపై కెసియార్ తెలంగాణ తేగలరా లేదా అన్నది యింకా డౌటుగానే వుంది. బిజెపికి జాతీయస్థాయిలో బలం వుంది కానీ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలం నామమాత్రం. టిడిపితో పొత్తు పెట్టుకోవడం కల్ల. ఇక మిగిలినది కాంగ్రెస్. తెలంగాణ యివ్వనని చెప్పేసిన తర్వాత కాంగ్రెస్‌తో చేయి కలిపితే తెరాస అస్తిత్వానికే ప్రమాదం. అందువలన తెరాస ఒంటరిగా పోటీ చేయాలి. కాంగ్రెస్ తెలంగాణ యివ్వదని తేల్చి చెప్పాక దాన్ని వదిలేసి తెరాసలోకి దూకే కాంగ్రెస్‌వారు ఎందరుంటారు అన్నది చూడాలి.

ప్రత్యేక భావన చాలా బలంగా వున్న జిల్లాలలోనే (వరంగల్, కరీంనగర్ కనబడుతున్నాయి) అక్కడి కాంగ్రెస్‌వారు యీ సాహసం తలపెట్టవచ్చు. తక్కిన జిల్లాల కాంగ్రెస్‌వారు సంస్థాగత బలాన్ని వదులుకోవడానికి సిద్ధపడితేనే తెరాసవైపు దూకుతారు. అదీ కెసియార్ వ్యవహారశైలితో యిమడగలిగితేనే ! ఇలా యిరుపక్షాలూ విడిపోయి ఎదురుబొదురుగా మోహరిస్తే ఆ పోరాటంలో ఎవరు గెలుస్తారో ఎవరూ చెప్పలేరు. తెలంగాణ యిస్తే తెరాసకే గెలుపు అని అందరం అనుకుంటున్నా, పరిస్థితిలో క్రమేపీ మార్పు వస్తోంది. బుధవారం నాటి టి-జాక్‌లో సమావేశంలో తక్కినవారందరిదీ ఒక మాట, తెరాసది మరో బాట అయింది. 21 నుండి పాదయాత్రలు అదరగొట్టేస్తాం అన్నారు కానీ పెద్దగా అయినట్టు లేదు, కవరేజి కూడా ఏమీ రాలేదు. జనాలు రాలేదా? తెలియదు కానీ వాటి ప్రభావం పెద్దగా వున్నట్టు లేదు.

ముఖ్యంగా 'సకల'జనుల సమ్మె తర్వాత ఫాలో అప్ ఏమీ జరగలేదు. ఉద్యమాన్ని రాజకీయనాయకులకు అప్పగించి మేం ఉద్యోగాల్లో చేరుతున్నాం అన్నారు అవేళ స్వామిగౌడ్. పాపం యిప్పటిదాకా సమ్మె జీతం తాలూకు ఎడ్వాన్సులే యివ్వలేదట. సమ్మె సమయంలో కొందరు వచ్చి కొందరు రాకపోవడంతో ఎవరు ఎన్నాళ్లు గైర్ హాజరయ్యారో తెలియక గందరగోళంలో పడ్డారట. అది తేలేదాక ఎడ్వాన్సులు యివ్వరట. ఇటువంటి సవ్యమైన కారణాలు పెట్టుకుని మళ్లీ తెరాస ఉద్యమించి వుంటే బాగుండేది. అదీ జరగలేదు. ఇతర పార్టీలనుండి నాయకులను లాక్కునే కార్యక్రమం ఒక్కటే చురుగ్గా సాగుతోంది. ఇలాటి పరిస్థితిలో తెరాస ఒంటరి

పోరాటం చేసి తెలంగాణను ఏలగలదా?

అందువలన కాంగ్రెస్ ఏదీ తేల్చకుండా సందిగ్ధంలో వున్నంత కాలమే తెరాసకు అనువుగా వుంటుంది. ఇప్పుడు యుపి ఎన్నికలంటూ మార్చి దాకా ఏమీ తేల్చదు కాబట్టి కెసియార్ ఖుష్. ఆ ఉపద్రవాన్ని తెచ్చిపెట్టిన మాయావతి అంటే కెసియార్‌కు గౌరవం, అభిమానం, ప్రేమ. అందుకే ఆ ధన్యవాదాలు !**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

**నవంబరు 38 ఎమ్బీయస్ : ఈ చితి ఆరనివ్వరు...**

కిషన్‌జీ శవానికి అంత్యక్రియలు పూర్తయ్యాయి. కాస్సేపట్లో చితి ఆరుతుంది. కానీ మానవహక్కుల వీరులు ఎన్‌కౌంటర్ వివాదంపై చితి ఆరనివ్వరు. 'అది బూటకపు ఎన్‌కౌంటర్. ఎక్కడో పట్టుకుని కాల్చి యిక్కడ పడవేశారు' అంటారు. 'ఇది సరైన ఎన్‌కౌంటరే' అని వీళ్లు దేని గురించి అనగా నేను ఎప్పుడూ వినలేదు. ఎన్‌కౌంటర్ అనగానే దానికి విశేషణంగా 'బూటకపు' అనే మాటను కలిపే చెప్తారు. ఈ వ్యవస్థను తప్పుపడతారు. పోలీసుల జులుం అంటారు. ఇప్పుడు పోయినాయన పేరు సూర్యచంద్రాదులు వున్నంతకాలం వుంటుందంటారు. ఈయన స్ఫూర్తితో మరో లక్షమంది యిలాటివాళ్లు పుడతారంటారు. ఈయన త్యాగం జాతి మరవదంటారు. ఇవే మాటలు ఏ నక్సలైటు పోయినా వినబడతాయి. ఇక మీడియా కూడా ఆకాశానికి ఎత్తేస్తుంది. వాళ్ల ముసలితల్లిని చూపించి మనకు కన్నీరు కార్పిస్తుంది. ఇతనికే 50 ఏళ్లు దాటినప్పుడు తల్లిదండ్రులు ముసలివాళ్లు కాక పడుచుగా వుంటారా? ఆవిడ వయసు గురించి తెగ చెప్పి వాపోతారు.

30 ఏళ్లగా చూడలేదంటారు. తన బిడ్డడి రాకకోసం ఎదురు చూస్తోందంటారు. నిజానికి యితను బతికివున్నా ఆవిడ ఎదురుచూస్తూనే వుంటుంది. ఎందుకంటే యితను ఎప్పటికీ తిరిగిరాడు. వచ్చాడంటే కొంపమునిగిందే. అతని ఆచూకీ చెప్పమని పోలీసులు వీళ్ల దుంప తెంపుతారు. అందుకని బంధువుల మీద జాలితో ఏ మావోయిస్టు ఎప్పుడూ స్వంత వూరికి రాడు. బిడ్డకోసం ఎదురుచూపులు చూడడం తల్లికి పెద్ద భారం. పోలీసుల ధర్మమాని ఆవిడకు యిక ఆ భారం తప్పింది. ఇక రాడు అని తేలిపోయింది. మీడియా తల్లిదండ్రులే కాదు, ఎంత దూరపు బంధువైనా, కనీసం పాఠాలు చెప్పిన పంతులైనా దొరుకుతాడ్డేమోనని చూస్తుంది. దొరకగానే ప్రశ్నలు గుప్పిస్తుంది. అతను ఎలాటివాడు? అతని భావాలు ఎటువంటివో చెప్పండి అంటూ.

నిజానికి అతను మావోయిస్టు కావడానికి ముందు ఎలాటివాడో మాత్రమో వీళ్లు చెప్పగలరు. ఎందుకంటే మావోయిస్టు అయ్యాక అతని ఊహలు, ఆనుపానులు, జీవనసరళి, దాడులకై వేసిన పథకాలు, వాటి జయాపజయాలు – యివన్నీ చెప్పగలిగేవి అతని సహచర మావోయిస్టులు మాత్రమే. వాళ్లు బయటకు రారు. దొరకరు. దొరికినా చెప్పరు. ఉద్యమంలో వెళ్లడానికి ముందు అతను మీలాటి, నాలాటివాడే. స్కూలు రోజుల్లో, కాలేజీరోజుల్లో మీ అనుభవాలు చెప్పండి అని అతని క్లాస్‌మేట్ నడిగితే 'ఇద్దరం కలిసి క్లాసు ఎగ్గొట్టి "రౌడీరాణి" సినిమాకు వెళ్లాం, అసలు "ఆమె రాత్రులు" సినిమాకు వెళదామనుకున్నాం కానీ అక్కడ క్యూలో మా హెడ్‌మాస్టరు కనబడడంతో పక్కనున్న హాలుకి వెళ్లాల్సి వచ్చింది." అని చెప్పాలి. ఇక యిష్టాయిష్టాల గురించి తల్లి నడిగితే "వాడికి ఉల్లిపాయల పులుసు యిష్టం, ఊరచేపల యిగురు యిష్టం" అని చెప్పగలుగుతుంది కానీ దేశరాజ్యాంగం గురించి మావాడి భావాలు యివి అని చెప్పగలదా?

నేనిలా రాయడం చదివి "ఇంత నిర్దయగా రాయడానికి మనసెలా ఒప్పింది? అతని భావాలు ఏవైనా కానీ అతను ఒక మనిషి కదా, అతని ప్రాణం హరించబడింది కదా" అని మీరనుకుని నన్ను తిట్టినా నేను ఆశ్చర్యపడను. ఎందుకంటే గతంలో నేనూ యిలాగే అనుకునేవాణ్ని. అప్పట్లో నాకు నక్సలైట్లంటే మహా యిష్టంగా వుండేది. నక్సల్‌బరీ ఉద్యమం వచ్చిన కొత్తలో చాలామంది విద్యార్థులు నక్సలైట్లుగా మారారు. మేధావివర్గమంతా వారికి బాసటగా నిలిచింది. గిరిజనులను దోచుకుతింటున్న పెత్తందారీ వ్యవస్థను వీళ్లు అంతం చేస్తారని ఎందరమో నమ్మాం. నక్సలైట్లు పోలీసులను చంపుతూ వుంటే కేరింతలు కొట్టాం. పోలీసులు తిరగబడి వాళ్లని చంపితే వాపోయాం, ఖండించాం. నక్సలైట్లను అదుపు చేసినందుకు వెంగళరావును మనసారా ద్వేషించాను. జస్టిస్ తార్కుండే కమిషన్ రిపోర్టు చదివి రక్తం ఉడుకెత్తిపోయింది. అప్పట్లో తార్కుండేగారి నేతృత్వంలోనే మానవహక్కుల సంఘం ఓపీడియార్ (ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్స్ డెమోక్రాటిక్ రైట్స్ అని గుర్తు) ఏర్పడింది. మన దగ్గర జ్వాలాముఖి వాళ్లూ ముఖ్యసభ్యులు. వాళ్ల మీటింగులన్నిటికీ హాజరై జేజేలు కొట్టేవాణ్ని.

1978 ఎలక్షన్‌లో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో వెంగళరావుతో పోటీ పడడానికి కాళోజీ నామినేషన్ వేశారు. వెంగళరావు ఎంత గొప్ప ఎడ్మినిస్ట్రేటరయినా కావచ్చు, నక్సలైట్ల పాలిటి సింహస్వప్నం. అందుకే కాళోజీ అతన్ని ఎదిరించారు. హైదరాబాదులో కూడా మీటింగులు పెట్టి కాళోజీ ఎన్నికల ఖర్చుకోసం విరాళాలు సేకరించారు. నేనూ యిచ్చాను. (ఓ మీటింగులో ఓ యువనక్సలైటు ప్రసంగిస్తూ "వెంగళరావు అనే యీ 'టిన్‌పాట్ డిక్టేటర్'ను 'సత్తు'పల్లిలో ఓడించి తీరాలి" అని చేసిన చమత్కారం నాకు ఎంతోబాగా నచ్చి యిప్పటికీ గుర్తుండిపోయింది) అప్పట్లో కరీంనగర్ నుండి వచ్చిన మా మిత్రుడు "నక్సలైట్లు మీరనుకుంటున్నట్లు గొప్పవారేమీ కాదు. మా వైపు వాళ్లను పగటిదొంగలంటాం. రెండు భూస్వామి కుటుంబాలలో కక్షలుంటే అవి తీర్చుకోవడానికి ఓ కుటుంబంలోని కుర్రాడు నక్సలైట్లలో చేరి అవతలి కుటుంబం వాళ్లను చంపుతున్నారు." అని అంటూంటే అతన్ని 'కరడుగట్టిన

బూర్జువా'గా, తిరోగమనవాదిగా,  యింకా చాలా పేర్లతో దూషించేవాళ్లం.

నక్సలైట్లలో విభేదాలు వచ్చి చీలికలువాలికలు అయ్యి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ వుంటే అనేక విషయాలు బయటకు వచ్చి పోనుపోను ఆవేశం తగ్గి ఆలోచన పెరిగింది. మామూలు రాజకీయనాయకులకూ వీళ్లకూ తేడా లేదని అర్థమైంది. ఎటొచ్చీ వీళ్లు అవతలివాణ్ని 'ప్రజావిరోధి' అంటారు, కాల్చి చంపేస్తారు. మామూలు నాయకులు అలా అనరు. గిరిజన ప్రాంతాల్లో సారా అమ్మేవాళ్లని వీళ్లు దండిస్తే మహా ఆనందపడేవాణ్ని. ఆ ఆనందం కొన్ని రోజులే. ఎందుకంటే గిరిజనుల్లో తాగుడు వ్యసనం మాన్పించాలన్న ఉద్దేశం వీళ్లకు లేదు. సారా వేలం పాట వీళ్లు చెప్పినవాళ్లే పాడాలి. తక్కినవాళ్లు పాడకూడదు. పాడితే చంపుతారు. దీనిలో గిరిజనులకు ఒరిగే మేలేముంది? అక్కడ ఓ రోడ్డేద్దామన్నా, కరంటు తెప్పిద్దామన్నా, టెలిఫోను పెట్టిద్దామన్నా వీళ్లు అడ్డం పడతారు – వీళ్ల ఆనుపానులు తెలిసిపోతాయని. ఇక వాళ్లు ఎలా బాగుపడతారు? "అల్లూరి సీతారామరాజు" సినిమాలో విప్లవవీరులు టెలిఫోను తీగలు తెంపేస్తే చూసి కేరింతలు కొట్టాను, బ్రిటిషు వాళ్లకు వ్యతిరేకం కాబట్టి. కానీ స్వతంత్రం వచ్చాక కూడా గిరిజనులను యీ సౌకర్యాలు.. కాదు కనీసావసరాలకు దూరంగా ఎలా వుంచుతాం? అక్కడ బడి పెడితే, టీచర్లను తరిమేస్తారు. బాంకు పెట్టి ఎళీళీణాలిద్దామంటే బాంకు దోచుకుంటారు. మేనేజర్ కాళ్లు విరక్కొడతారు.

అంతెందుకు గిరిజనులు వీటితో విసిగి, ప్రజాస్వామ్యంవైపు మొగ్గుచూపి ఎన్నికలలో పాల్గొంటామంటే ఓటేసినవాడి చేతులు నరుకుతారు. ఇదెక్కడి న్యాయం? వాళ్లకంటూ ఒక అభిప్రాయం వుండకూడదా? తప్పో, రైటో వాడే తర్వాత తేల్చుకుంటాడు. నీలాగే వాళ్లకూ పంచేంద్రియాలన్నాయి, తెలివితేటలున్నాయి. ఓకే, నీకున్నంత చదువు వాళ్లకు లేదు, తద్వారా రాజకీయ అవగాహన లేదు. రైటో. అయితే వాళ్లకు చదువు రాకుండా నువ్వు అడ్డుపడుతున్నపుడు ఆ అవగాహన ఎలా వస్తుంది? అందువలన వాళ్ల బదులు నువ్వే ఆలోచించేసి, "నీకు ప్రజాస్వామ్యం పనికిరాదు, మాకు నిధులిచ్చినవాడి సారాయే తప్ప అన్యులమ్మే సారా నీ వంటికి పడదు." అని తీర్మానించడానికి నువ్వెవరు? అభిప్రాయభేదం వుండకూడదా? అసలు ఏ యిద్దరు మనుష్యులైనా – రక్తసంబంధీకులు గాని, ఆలుమగలు గానీ – ప్రతి విషయంపై ఒకే అభిప్రాయంతో వుంటారా? ఒకే నేపథ్యంతో పెరిగినా ఆలోచనాసరళిలో తేడా వస్తుంది. నీలం సంజీవరెడ్డిగారు కాంగ్రెస్ వాది అయితే ఆయన సోదరుడు కమ్యూనిస్టు !

మరి అలాటప్పుడు అవతలివాడు నీ మాట వినాలని పట్టుబట్టడం ఏం సబబు? "ఏకం సత్, విప్రాః బహుధా వదన్తి" అనే సూక్తి వుంది. ఇక్కడ విప్రుడు అంటే బ్రాహ్మణుడు అని కాదు, మేధావి అని అర్థం. ఉన్నదొకటే, కానీ మేధావులు పలురకాలుగా చెప్తారు. అని అర్థం. అంటే ఎవరి ఆలోచన వారిది, ఎవరి దర్శనం వారిది. తెలివితేటలు పెరిగిన కొద్దీ ఎవరి బాట వాళ్లది అవుతుంది. అందువల్లనే ఎన్నికలలో విద్యావంతులు తలోరకంగా ఓటేస్తారు. చదువురాని పేదలే మూకుమ్మడిగా ఓటేస్తారు. మన పాలనావిధానం ఎలా వుండాలి అన్న దానిపై విద్యావంతులు పలురకాలుగా ఆలోచించి పక్కవాళ్లని ఒప్పించడానికి చూస్తారు. నీ విధానం మంచిది కాదు, నేను చెప్పేది రైటు అని అనునయంగా, వాళ్ల తలకెక్కేట్లు చెప్పడం న్యాయమైన పని. నేనే చెప్పేదే రైటు, నువ్వు ఆలోచించకూడదు, ఆలోచిస్తే మెడమీదనుండి తలకాయ ఎగిరిపోతుంది అని అంటున్నావంటే అవతలివాడికి మాటకు విలువ లేదు, వాడి ప్రాణానికి విలువ లేదు అని నువ్వు తీర్మానిస్తున్నట్లేగా. నువ్వు అవతలివాడి ప్రాణానికి కట్టిన విలువే, పోలీసువాడూ నీ ప్రాణానికి కడుతున్నాడన్నమాట !

మావోయిస్టుల మరణాలపై కన్నీరు విడిచేవారు పోలీసుల చావులపై కూడా విడవాలంటాను. పోలీసుల చావులపైన రెండు బొట్లు కన్నీరు కారిస్తే, మావోయిస్టుల చేతిలో మరణించిన సామాన్యుల శవాలపై పదిరెట్లు ఎక్కువ కన్నీరు కార్చాలంటాను. కానీ యీ మానవహక్కుల ఉద్యమకారులకు ఆ చావులేవీ కనబడవు. వాళ్ల దృష్టిలో ఆ చావులు చావులే కావు. అలిపిరి ఘటనలో కోట్లాది ప్రజల ఆమోదాన్ని పొందిన చంద్రబాబు పోయి వుండినా, ఆయనతో బాటు సిన్సియర్‌గా పనిచేసే అధికారులు పోయినా, ఆ పక్కన కొండకి వెళ్లే సామాన్యభక్తులు పోయినా వీళ్లు ఖాతరు చేయరు. ఖండించరు. కానీ ఆ కేసులో ముద్దాయిగా మావోయిస్టులను కోర్టు బోనెక్కిస్తే వీళ్లంతా నల్లకోట్లు వేసుకుని రక్షించడానికి దిగిపోతారు. జైల్లో వాళ్లకు సన్నబియ్యం అన్నం పెట్టలేదని, పేపరు చదవనివ్వలేదనీ.. ఒకటే గోల. కితం ఏడాది మల్కాన్‌గిరిలో ప్రజల కెంతో మేలు చేసే కలక్టరును కిడ్నాప్ చేస్తే వీళ్లు మావోయిస్టు చర్యను ఖండించారా చెప్పండి. లేదు సరికదా, మావోయిస్టులను విడిపించడానికి మధ్యవర్తులుగా తయారయ్యారు.

ఇదేమిటి అన్యాయం అని ఎందరో అడిగారు. దానికి వాళ్ల దగ్గర ఒకటే సమాధానం – వ్యక్తులుగా వాళ్లు ఎంత హింస చేసినా ఫర్వాలేదు. కానీ రాజ్యం మాత్రం హింస చేయకూడదు. 'కన్నుకు కన్ను, పన్నుకు పన్ను' అని మనుష్యులు అనవచ్చు కానీ  వ్యవస్థ అనకూడదు. (వ్యవస్థ అంటే మనుష్యుల సముదాయమే కదా) మావోయిస్టులు కన్ను పొడిచేసినా వీళ్లు ఆయింట్‌మెంట్ రాసుకుని కూర్చోవాలి తప్ప వాళ్లనేమీ అనకూడదు. వెతికి, దొరికితే (!) కోర్టు కెక్కించి, ఏళ్ల తరబడి కేసు యీడ్చి, జైల్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

ఇక్కడ పెద్ద పేరడాక్స్ ఏమిటంటే మావోయిస్టులు కానీ, వారి సమర్థకులైన యీ హక్కులవాళ్లు కానీ వ్యవస్థను నిందిస్తూనే వుంటారు. గుర్తించం పొమ్మంటారు, కూలుస్తామని బెదిరిస్తారు. కానీ ఈ వ్యవస్థ, ఈ రాజ్యాంగం సమకూర్చే రక్షణలన్నీ డిమాండ్ చేస్తారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని వారూ, తమ ప్రాబల్యం చెల్లే ప్రాంతాల్లో తుపాకి చూపించి పౌరుల ప్రజాస్వామ్యపు హక్కులు హరించేవాళ్లూ తమకు ప్రజాస్వామ్యపు హక్కులు ఎలా కోరగలరో నాకు అర్థం కాదు. అసలు యీ మావోయిస్టులు కోరుకునే రాజ్యమే

కనుక వస్తే యిలా హక్కులు డిమాండ్ చేసేవాళ్లని పట్టుకుని కాల్చిపారేస్తారు.

ఇలా అంటున్నాను కదాని ప్రభుత్వం, పోలీసులు ఏం చేసినా తప్పులేదని నేను అంటున్నానని అనుకోకండి. ఎవరు శ్రుతిమించినా ఖండించాలి. రాజ్యాంగం తమకిచ్చిన అధికారాన్ని మించి పోలీసులు వ్యవహరిస్తే వాళ్లనీ ఖండించాలి. ఆ పని చేస్తూనే వున్నారు యీ హక్కుల కార్యకర్తలు. మరి మావోయిస్టుల హింస దగ్గరకు వచ్చేసరికి ఆ స్వరం మూగబోతుందేమోని నా ప్రశ్న. మావోయిస్టులు కానీ, పోలీసులు కానీ హింసను నమ్ముకున్నవారు. ఒకసారి వారిది పై చేయి, యింకోసారి వీళ్లది పై చేయి. వాళ్లల్లో వీరి యిన్‌ఫార్మర్లు వుంటారు, వీళ్లల్లో వారి యిన్‌ఫార్మర్లు వుంటారు.

కమల్‌హాసన్, అర్జున్‌ల "ద్రోహి" సినిమా చాలా చాలా బాగా తీశారు. ఎవరిదీ కరక్టని చూపలేదు. హింస హింసనే ప్రేరేపిస్తుందని, యిలాగే కొనసాగితే ఎప్పటికీ అంతం కాదనీ చూపారు. ఇప్పుడు ఎవరైనా మామూలుగా రోడ్డు మీద నడుస్తూ వెళుతూ, వెళుతూ ఎవరైనా గుద్దడం వలన పడిపోతే అయ్యో అనుకోవచ్చు. అదే సర్కస్‌లో సన్నటితాడు మీదనుండి పడిపోయినా అయ్యో అంటాం కానీ ఎమోషన్ తక్కువ వుంటుంది. ఎందుకంటే సన్నటితాడుపై నడిచేవాడికి పడిపోవడం అనే ఆక్యుపేషనల్ హజార్డ్ వుంటుందని మనకు తెలుసు. గుళ్లోకి వెళ్లి జేబులోంచి డబ్బు పోగొట్టుకున్నవాడిని చూసి అయ్యో అనడం వేరు, జూదంలో పోగొట్టుకున్నవాడిని చూసి అయ్యో అనడం వేరు.

మావోయిస్టులు, పోలీసులు యిద్దరూ చావుకు సిద్ధపడే తలపడుతున్నారు. ఆయుధాలతోనే ఆడుతున్నారు. ఎవరూ పోకుండా ఎందుకుంటారు? మావోయిస్టు అనే అనుమానంపై మిమ్మల్నో, నన్నో పట్టుకుపోయి కాల్చేస్తే అయ్యోపాపం అనుకుంటాం. కానీ భుజాన రెండు తుపాకులు వేసుకుని అడ్డు వచ్చినవాడినల్లా కాల్చేస్తూన్నవాణ్ని కాల్చేస్తే యిదే ఎమోషన్‌తో అయ్యో అనడం తప్పు. ఆజాద్‌తో బాటు పోయిన హేమచంద్ర పాండే నిజంగా జర్నలిస్టు మాత్రమే అయితే  అయ్యో అనుకుంటాం. అనుకుంటూనే జర్నలిస్టు మావోయిస్టు దగ్గరకు చేరినప్పుడు యీ రిస్కు వుంటుందని తెలియదా అనే స్పృహ కూడా మనకు కలుగుతుంది. రిస్కు తీసుకున్నపుడు ఓ సారి ఫలిస్తుంది, మరో సారి ఫెయిలవుతుంది. అందుకే దాన్ని రిస్కు అన్నారు.

ఇప్పుడు కిషన్‌జీ వున్నాడు. ఎన్నోసార్లు తప్పించుకున్నాడు. ఈ సారి దొరికిపోయాడు. ఇతనూ ఎంతోమందిని పొట్టన బెట్టుకున్నాడు. ఎంతో ప్రజాదరణ కలిగిన జ్యోతి బసుపై హత్యాయత్నం చేశాడు. ఏం అప్పుడు జ్యోతి బసుది ప్రాణం కాదా? అతని ప్రాణం తీసే హక్కు యితనికి ఎవరిచ్చారు? వీటిల్లో సెంటిమెంట్లకు తావు లేదని నా ఉద్దేశం. నిజంగా సెంటిమెంటు అంటూ చూపాలంటే పోలీసుల పట్ల చూపవచ్చు. ఎందుకంటే వాళ్లది ప్రతిహింస మాత్రమే. హింస ప్రారంభించినది మావోయిస్టులు. తమ సిద్ధాంతాలను ప్రజల్లో వ్యాప్తి చేసి అత్యధికులను తమ పక్షాన తిప్పుకునే ఓపిక లేక, తుపాకీ చూపించి ఎలాగోలా అధికారంలోకి వచ్చేద్దామని చూసే మావోయిస్టులు హింసనే మార్గంగా ఎంచుకున్నారు. వ్యవస్థకు ప్రతినిధులుగా పోలీసులు వాళ్లని ఎదుర్కొని మనకు రక్షణ కల్పిస్తున్నారు.

మావోయిస్టులకు సిద్ధాంతబలం వుంది. అదే వాళ్ల డ్రైవింగ్ ఫోర్స్. పోలీసులకు ఆ డ్రైవింగ్ ఫోర్స్ మిస్సింగ్ ! వాళ్లు ఆ వుద్యోగంలో చేరారు కాబట్టి చచ్చినట్టు వెళుతున్నారు. వాళ్లకు మావోయిస్టులపై వ్యక్తిగత కక్ష లేదు. వ్యవస్థ వాళ్లను అక్కడ పోస్టు చేసింది. ఫలానా విధంగా చేయమంది. చేస్తున్నారు. వాళ్లకు వీరప్పన్ అయినా ఒకటే, కిషన్‌జీ అయినా ఒకటే. సెంటిమెంటు ధారాళంగా చూపవలసిన వ్యక్తులెవరయా అంటే పోలీసులు, మావోయిస్టుల మధ్య నలుగుతున్నవారు. అనేక గిరిజన ప్రాంతాలలో మామూలు ప్రజలు రెండు సమాంతర ప్రభుత్వాల మధ్య ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పోలీసులకు అన్నం పెడితే మావోలు పీక పిసుకుతారు, మావోలకు నీళ్లిస్తే పోలీసులు చావగొడతారు. వాళ్ల ఆచూకీ చెప్పమని, వీళ్ల ఆనుపానులు చెప్పమని వాళ్లు హింసిస్తారు.

ఇలా నలిగేవాళ్లు గిరిజనులు మాత్రమే కాదు, ఆ ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు కూడా. నా బోటివాణ్ని నక్సల్ ప్రభావిత ప్రాంతంలో బ్యాంకు మేనేజర్‌గా వేశారనుకోండి. మేం చెప్పినవాళ్లకు రుణాలివ్వకపోతే కాలు తీస్తాం చెయ్యి తీస్తాం అని మావోయిస్టులు బెదిరిస్తే నేనేం చెయ్యాలి? నా గోడు యీ మానవహక్కుల వాళ్లకు వినబడదా? నేను మానవుణ్ని కానా? మావోయిస్టులే మానవులా? నా బ్యాంకులో పడి డాక్యుమెంట్లు తగలబెడితే రుణాల వసూళ్లు ఎలా జరుగుతాయి? మళ్లీ రుణాలు ఎలా యిస్తాం? ఎందుకిస్తాం?

ఇంట్లో పడక్కుర్చీలో కూర్చున్నవాళ్లు 'చేతకాని ప్రభుత్వమండీ, యీ మావోయిస్టు లందరినీ కాల్చిపారేయాలి' అని కాళ్లూపుకుంటూ చెప్పడం యీజీ. కాల్చిపారేయడం అంత యీజీయేం కాదు. ప్రభుత్వం ఎవరిద్వారా ఆ పని చేయగలదు చెప్పండి. నా బోటి అధికారుల ద్వారానే కదా. కానీ అక్కడికి పోస్ట్ చేయగానే నేను బదిలీకి ప్రయత్నిస్తాను కదా, మెడికల్ లీవ్ పెట్టి పారిపోతాను కదా. అక్కడి బళ్లకు టీచర్లు వెళ్లరు, ఆసుపత్రులకు డాక్టర్లు వెళ్లరు, రోడ్డు పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు వెళ్లరు. పోలీసులను వేస్తే సగానికి సగం మంది సిఫార్సులు చేయించుకుని తప్పించుకుంటారు.

ఇక ప్రభుత్వం ఏవిధంగా మావోయిస్టులను అదుపు చేయగలదు? ఇది చాలా కష్టసాధ్యమైన పని. దానికి ఎంతో పొలిటికల్ విల్, ఎడ్మినిస్ట్రేటివ్ కేపబిలిటీ, సమర్థులైన, నిజాయితీపరులైన అధికారగణం జతపడాలి. ఇది అనుకున్నంత, ఆశించినంత సులభం కాదు. అప్పటిదాకా మావోయిస్టుల మధ్య, పోలీసుల మధ్య పిల్లీ-ఎలుకా ఆట సాగుతూనే వుంటుంది. మావోయిస్టు ప్రముఖుడు పోయినప్పుడల్లా మీడియా అడావుడి చేస్తుంది. ఎందుకంటే మీడియాలో ముప్పాతిక మువ్వీసం మంది వామపక్షవాదులు, అతివాదులు వున్నారు. వాళ్లందరూ వ్యవస్థను తెగనాడుతూ, మావోయిస్టు రాజ్యం రావడానికి తమ వంతు కృషి తాము చేయాలని మహా కుతూహలంగా

వుంటుంది.

అలా అని వ్యవస్థ నుండి సకలవిధాలైన లాభాలు రాబట్టడానికి ఏ పాటి శంకా వీళ్లకు లేదు. ప్రభుత్వం నుండి ట్రావెల్ కన్సెషన్లు, యిళ్ల స్థలాలు, యింకా యిలాటి పెర్క్స్ తీసుకోవడానికి ఏ పాటి మొహమాటమూ వుండదు. వ్యవస్థ అంటే అంత రోత వున్నపుడు వాళ్ల దగ్గర్నుంచి ఏమైనా తీసుకోవడం ఏమిటి అసహ్యంగా.. అంటే మనల్ని చూసి నవ్వుతారు. మావోయిస్టులు అధికారంలోకి వచ్చాక యిలాటివి ఇవ్వరని వాళ్లకు ఎలాగూ తెలుసు. ఒక్క తుపాకీగుండుతో పోయేదానికి యిళ్లస్థలాలు వేస్ట్ చేయడం దేనికి? ఒక గ్రౌండ్ స్థలంలో ఇరవై జర్నలిస్టు శవాలు పాతి పెట్టవచ్చు హాయిగా !

నక్సలైట్లకు తెలంగాణ ఉద్యమానికి లింకు పెట్టి మావోయిస్టులకు మద్దతు పలికే ప్రత్యేకవాదులను చూస్తున్నాను. 1969 ఉద్యమం కారణంగానే నక్సల్ ఉద్యమం మన రాష్ట్రంలో వచ్చిందని ఈ మధ్య చాలామంది కూడా చరిత్రను మార్చేసి చెప్పేస్తున్నారు. 1969లో తెలంగాణ యివ్వకపోవడం వలననే తెలంగాణ యువకులందరూ నక్సలైట్లు అయిపోయారని, ఇప్పుడు కూడా యివ్వకపోతే మావోయిస్టులయిపోతారని, వారిని కాపాడుకోవడానికైనా తెలంగాణ యిచ్చేయాలనీ చాలామంది పెద్ద నాయకులే తెగ వాదించేస్తున్నారు. తెలంగాణ యిస్తే మావోయిస్టులను అదుపు చేయడం కష్టమవుతుందని ఛత్తీస్ గఢ్, జార?ండ్‌లను ఉదాహరణలుగా చూపి కొందరు విభజన వద్దంటున్నారు. తెలంగాణ యిస్తే మావోయిస్టులు పెరుగుతారని కొందరు, యివ్వకపోతే పెరుగుతారని కొందరూ వాదిస్తూ వుంటే అంతా గందరగోళమే. ఏది నిజం?

మావోయిస్టులు పెరగకుండా చూడాలంటే దోపిడీని అరికట్టాలి. ముఖ్యంగా గిరిజనప్రాంతాల్లో గిరిజనేతరులు వచ్చి దోచుకోకుండా చూడాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. అప్పుడే మావోయిజంకానీ మతపరమైన ఉగ్రవాద ఛాందసవాదంకానీ అదుపులోకి వస్తాయి. రాష్ట్రం సమైక్యంగా వున్నంత మాత్రాన మావోయిస్టులు పెరగకుండా మానేశారా? సాక్షాత్తూ ముఖ్యమంత్రిపై, హెూం మంత్రిపై, మాజీ ముఖ్యమంత్రిపై దాడి చేసేరే ! రాష్ట్రం చిన్నదా పెద్దదా అన్నది క్వశ్చన్ కాదు. అదుపు చేద్దామన్న పొలిటికల్ విల్ వుండాలి, స్ట్రాటజీ వుండాలి. సమైక్యవాదానికి, తెలంగాణవాదానికి నక్సలైట్ (మావోయిస్టు) ఉద్యమాలకు సంబంధం లేదని చెప్పడానికి, బెంగాల్‌లో నక్సల్-కాంగ్రెస్ నెక్సస్ గురించి చెప్పడానికి యిక్కడ నక్సల్ ఉద్యమం గురించి కాస్త చెపుతాను.

నక్సల్ ఉద్యమం వచ్చింది మే 1967లో, పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరీ గ్రామంలో. వెంటనే మనకూ పాకింది. శ్రీకాకుళంలో ఉధృతంగా సాగింది. భద్రాచలం అడవుల్లో కూడా (అది అప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో వుండేదని గుర్తు, తర్వాత ఖమ్మంకు మారింది) నడిచింది. ఆదిలాబాద్ అడవుల్లో కూడా. అప్పట్లో ఫోకస్ అంతా గిరిజనులపై వుండేది. ఎక్కడెక్కడ అడవులుంటే అక్కడ నక్సలైట్లు ప్రయత్నించి చూశారు. ఆ క్రమంలో అనేక జిల్లాలలో ఆ ఉద్యమం కాస్త కాస్త వ్యాపించి 1969 ఆఖరినాటికి తగ్గిపోయింది. ఆ ఉద్యమం తెలంగాణ జిల్లాలలో మాత్రమే సాగలేదు. అక్కడ కూడా సాగింది అని చెప్పుకోవాలంతే. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో, భద్రాచలంలో కంటె ఎక్కువగా శ్రీకాకుళంలోనే సాగింది. దానికి, తెలంగాణ ఉద్యమానికి సంబంధం ఎలా కడతాం?

ఆ మాటకొస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాలలో నక్సలైట్లు పెరిగినది - 1973 తర్వాత. అంటే 1972 జై ఆంధ్ర ఉద్యమం తర్వాత. ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఫెయిలయింది కాబట్టి తెలంగాణలో నక్సలైట్లు పెరిగారు అంటే ఎంత వింతగా వుంటుంది ! నక్సలైటు ఉద్యమం ఆర్థిక కారణాలపై మొలిచేది, ప్రాంతీయ సెంటిమెంటుపై కాదు. ఈ మధ్య తెలంగాణ ఉద్యమకారులు కొందరు యింకో వాదన మొదలెట్టారు - ఆంధ్రప్రాంతీయులు తమను ఎలా దోచుకుంటూ వచ్చారో ఉదాహరణలు యిస్తూ నక్సలైటు ఉద్యమాన్ని కూడా వాడుకున్నారు. నక్సలైటు నాయకులందరూ ఆంధ్రులట. క్యాడరంతా తెలంగాణ వారట. ఆంధ్రావాళ్లు తెలంగాణకు వచ్చి నక్సలైటు ఉద్యమం మొదలుపెట్టి తెలంగాణ యువకులను చంపిస్తున్నారట.

నక్సలైటు నాయకులకు ప్రాంతీయత రంగు పులిమి యిలా మాట్లాడడం విడ్డూరం. రేపు పొద్దున్న యింకెవరో వచ్చి వాళ్లకు కులం రంగు పులిమి అగ్రవర?స్తులు మా దళిత యువకులను తప్పుదారి పట్టించి చంపిస్తున్నారనవచ్చు. ఇక్కడ సిద్ధాంతంలో ఔచిత్యాలు పరిగణించాలి తప్ప వ్యక్తులను కాదు. ఆ రోజుల్లో నక్సలైట్ ఉద్యమాన్ని అణిచివేసినది వెంగళరావుగారు. బ్రహ్మానంద రెడ్డి కాబినెట్‌లో హెూం మినిస్టరుగా వున్నప్పుడే కాదు, ఆ తర్వాత కూడా నక్సలైట్ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేశారు. అప్పట్లో ఒక తెలంగాణ వ్యక్తి ఉత్తరాంధ్ర యువకులు పాల్గొన్న శ్రీకాకుళం విప్లవాన్ని అణిచివేశాడు అని ఎవరూ అనలేదు.

వెంగళరావును నక్సలైట్లు ఎప్పుడూ క్షమించలేదు. ఇప్పుడు వాళ్లు తెలంగాణ ఉద్యమంలో చొరబడ్డారు కాబట్టి వెంగళరావుపై కసి తీర్చుకోవడానికి అతను తెలంగాణ వాడే కాదు పొమ్మంటున్నారు. వెంగళరావు తన యావజ్జీవితాన్ని ధారపోసినది ఖమ్మం జిల్లాకే. ఆయన రాజకీయాలన్నీ అక్కడే నడిచాయి. రాష్ట్రమంతా దోచి ఖమ్మానికి పెట్టాడన్న పేరు తెచ్చుకున్నాడు. ఖమ్మం తెలంగాణలో భాగమైతే, వెంగళరావు కూడా తెలంగాణవాడే. కానీ నక్సలైట్ల ప్రభావంలో పడిన ఉద్యమకారులు వెంగళరావును తెలంగాణవాడు కాడంటున్నారు.

మావోయిస్టులు కూడా తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకుంటున్నారనేది బహిరంగ సత్యం. రేపు తెలంగాణ వస్తే 'మా వలననే వచ్చింది కాబట్టి మాకు ఏం చేస్తావని' డిమాండ్ చేసి సాధిస్తారేమోనని భయం ఒకటి వుంది. వైయస్‌ను 2004లో యిలాగే వంచారు. వాళ్లని శాంతి చర్చలంటూ పిలిచి వాళ్లకు పోలీసుల చేత కాఫీ కప్పులు మోయించారు. అయితే వైయస్ టక్కరి కాబట్టి యా

క్రమంలో వాళ్ల అనుపానులు పసిగట్టి వాళ్ల ఆట కట్టించేశాడు. తెలంగాణ ఏర్పడ్డాక వచ్చే నాయకులు కూడా యిలాగే కుటిలత్వంతో వ్యవహరిస్తారో, భయపడి వాళ్లు అడిగినవన్నీ యిచ్చేస్తారో తెలియదు.

అయినా ప్రత్యేకరాష్ట్రం యివ్వకపోతే యీనాటి యువకులందరూ నిరాశ చెంది మావోయిస్టులుగా మారిపోతారని చెప్పలేం. ఎందుకంటే 1967 నాటి యువకులు వేరు, యిప్పటి యువకులు వేరు. అప్పట్లో వాళ్లకు ఆదర్శాలున్నాయి, నిరుద్యోగం గురించిన భయం వుంది. ఇప్పటివాళ్లకు రెండూ లేవు. టెక్ మధు లొంగిపోయినప్పుడు అతను కొన్ని వాస్తవాలు చెప్పాడు. గ్లోబలైజేషన్ వలన భారతీయ యువకులందరం అడుక్కుతింటామని భయపడి మావోయిస్టు నయ్యానని అతను చెప్పాడు. కానీ తర్వాత పరిస్థితి అలా లేదని కూడా చెప్పాడు. గ్లోబలైజేషన్ తర్వాత రక్షణ విధానం పోతోంది. ఎవడికి టాలెంటు వుంటే వాడు వెలుగుతున్నాడు. అవకాశాలు వచ్చిపడుతున్నాయి. తెలివితేటలు, ధైర్యం వుండి, కష్టపడడానికి సిద్ధపడితే చాలు, ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్లి బతకవచ్చని తెలిసిపోయింది. దీనితోబాటు స్వార్థమూ పెరిగింది. నా బాగు నేను చూసుకుంటే చాలు, దేశం ఎలా పోతే నాకెందుకు అన్న భావనా వచ్చింది. అందుకే మావోయిస్టుల్లోనే కాదు, మిలటరీలో కూడా రిక్రూట్‌మెంట్ తగ్గింది.

కిషన్‌జీ గురించి మొదలుపెట్టి ఎక్కడెక్కడికో వెళ్లిపోతున్నానని అనుకోకండి. అసలు రెండే భాగాలు రాద్దామనుకున్నాను. కానీ పాఠకులు దీనికి సంబంధించినవే అనేక ప్రశ్నలు వేయడంతో చాలా విషయాలు చెపుతూ పోతున్నాను. కిషన్‌జీ చావు వెనక్కాల మమతా బెనర్జీ వుందని అందరికీ తెలుసు. ఆవిడా చెప్పింది. మొన్నటిదాకా దోస్తీ నెరపి యిప్పుడిలా చేసిందేమిటని ప్రశ్న. బెంగాల్‌లో యిది ఎప్పుడో జరిగింది. సిపిఎం వాళ్లను కొట్టడానికి శత్రువు శత్రువు మిత్రుడు అనే ప్రాతిపదికపై నక్సలైట్లు, కాంగ్రెస్ చేతులు కలిపారు. సిపిఎం వాళ్లను అణిచివేసిన తర్వాత కాంగ్రెస్ నక్సలైట్లను మట్టుపెట్టేసి బెంగాల్‌నుండి తరిమేసింది. మమతా బెనర్జీ తృణమూల్ అని తగిలించుకున్నా ఆమె కాంగ్రెస్‌వాదియే. కాంగ్రెస్ విధానాన్నే అమలు చేసింది. ఇలా చెప్పేస్తే మీరు ఒప్పుకోరని తెలుసు. అందుకని బెంగాల్ రాజకీయాలు కాస్త ముచ్చటిస్తాను.

బెంగాల్‌లో మొదట్లో కాంగ్రెస్ పరిపాలనలో వుండేది. 1966లో తిండిగింజల కరువును సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవడంతో దానిపై ప్రజలలో అసంతృప్తి పెరుగుతోందని గ్రహించి రాష్ట్ర కాంగ్రెస్‌నుండి 1967 ఎన్నికలకు ముందు కొందరు బయటకు వచ్చి బంగ్లా కాంగ్రెస్ పేర పార్టీ పెట్టుకున్నారు. దానికి నాయకుడు అజయ్ ముఖర్జీ. అంతకుముందే కమ్యూనిస్టు పార్టీ చీలింది 1920లో ఏర్పడిన భారతీయ కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంది. కార్మికుల పక్షాన, కర్షకుల పక్షాన నిలబడింది. ఎంతో ప్రజాదరణ పొందింది. అయితే కొన్ని స్వయంకృతాపరాధాల వలన వెనుకబడింది. దానికి తోడు వాళ్లు బ్రిటిషువాళ్లకు వ్యతిరేకంగా పోరాడినపుడు ప్రజల్లో వచ్చిన స్పందన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోట్లాడినప్పుడు రాలేదు. ఎందుకంటే జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ సోషలిస్టు విధానాలు కొన్నిటిని అమలు చేసింది. నెహ్రూని కూడా కమ్యూనిస్టులు తిడుతూ వుంటే "వీళ్లకు అందర్నీ తిట్టడమే పని" అని విసుక్కున్నారు జనం. పార్టీకి ఆదరణ తగ్గింది.

1955 ఎన్నికలలో ఆంధ్ర ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయం చవి చూడడంతో పార్టీలో సిద్ధాంతభేదాలు వచ్చాయి. బ్రిటిషు ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి గల తేడాను గుర్తించారు కొందరు. కాంగ్రెస్‌తో పోరాడుతూ కూర్చుంటే మనుగడకే ఎసరు అని భావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరీ అంత చెడ్డది కాదు, అది జాతీయబూర్జువా ప్రభుత్వం అనేవారు డాంగే (శ్రీపాద్ అమృత్ డాంగే అనే మహారాష్ట్రకు చెందిన కమ్యూనిస్టు లీడరు) నాయకత్వంలోని ఓ వర్గం. 1961లో విజయవాడలో జరిగిన పార్టీ మహాసభలో డాంగే వర్గం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని ప్రతిపాదించింది. శ్రామికవర్గాలకు మేలు జరగాలంటే కమ్యూనిస్టు సిద్ధాంతాల మడి కట్టుకుని కూర్చుంటే ఎటూ పనికిరాకుండా పోతామని, దానికి బదులుగా కాంగ్రెస్‌తో చేతులు కలుపుతూ, అవసరమైత్తే వారితో పాటు ప్రభుత్వంలో చేరైనా దాని విధానాలను సోషలిజం, కమ్యూనిజం వైపు మరల్చాలని వారి వాదన.

ఎందుకంటే కాంగ్రెస్‌లో అప్పట్లో నానాగోత్రాలూ వుండేవి. మతఛాందసులనుండీ, పెట్టుబడిదారీ విధానానికి అనుకూలురనుండి, సోషలిస్టుల వరకూ అన్ని రకాల వారూ కాంగ్రెస్ పతాకం క్రిందనే స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రజాదరణ పొంది వున్నారు. కమ్యూనిస్టులు బయటే వుండిపోతే పెట్టుబడిదారులు కాంగ్రెస్ విధానాలకు తమకు అనుకూలంగా మలచుకుని, ప్రభుత్వం చేత చట్టాలను ఆ విధంగా చేయించుకుని, శ్రామికులను అన్యాయం చేస్తారని వీళ్లు అభిప్రాయపడ్డారు. అయితే కమ్యూనిస్టుపార్టీలోని కొందరు పార్టీ స్వఛ్ఛగానే వుండాలని, యిలాటి ప్రయోగాలు చేస్తే అధికారం కోసం పాకులాడుతున్నామని ప్రజలు అనుకుంటారని వాదించారు. డాంగేవర్గాన్ని వాళ్లు రివిజనిస్టులు అని నిందించారు. ఈ వర్గంలో బెంగాల్, కేరళ యూనిట్‌వాళ్లు ఎక్కువగా వున్నారు.

1962 వచ్చేసరికి చైనా భారత్‌పై దాడి చేయడంతో కమ్యూనిస్టులు యిబ్బందిలో పడ్డారు. అప్పటిదాకా రష్యా, చైనాలు రెండూ కమ్యూనిస్టు దేశాలు. కమ్యూనిస్టులు మాటిమాటికి వాటి గురించి గొప్పగా చెప్పేవారు. అలాటిది సరిహద్దు వివాదంలో చైనా మన దేశంపై దాడి చేసి ఓడించడంతో ప్రజలకు కమ్యూనిస్టులపై కోపం వచ్చింది. దేశద్రోహులన్నారు. డాంగే వర్గం యీ పరిస్థితిని అనువుగా చేసుకుని తమతో విభేదించినవారిని 'చైనా అనుకూలురు' అని ప్రచారం చేసింది. దాంతో కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలింది.

డాంగే వర్గం ఒరిజినల్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ – ఎన్నికల గుర్తు కంకీ కొడవలి – వారి తెలుగు దినపత్రిక "విశాలాంధ్ర")గా వుండిపోగా విడిపోయిన వర్గం కమ్యూనిస్టు పార్టీ 1964 జులైలో తెనాలిలో ఓ సదస్సు జరుపుకుని మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతాలపై

కొత్త పార్టీ పెట్టాలని అనుకున్నారు. 1964 అక్టోబరు కలకత్తాలో మహాసభ పెట్టి పార్టీ ఏర్పరచారు. 1967 జనరల్ ఎన్నికల కోసం పార్టీ పేరును భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)గా మార్చారు. అదే సిపిఎం, ఎన్నికల గుర్తు సుత్తీ, కొడవలి, నక్షత్రం– వారి తెలుగు దినపత్రిక "ప్రజాశక్తి"). ఈ విధంగా సిద్ధాంత భేదాలతో పార్టీ రెండు ముక్కలైంది. అప్పట్లో సిపిఐను మితవాద కమ్యూనిస్టులు, రష్యాకు అనుకూలురు అనేవారు. సిపిఎంను అతివాద కమ్యూనిస్టులు, చైనాకు అనుకూలురు అనేవారు.

చీలిక తర్వాత చూస్తే సిపిఐలో ఎక్కువమంది వున్నారు. (క్రమేపీ సిపిఎం బలపడి సిపిఐ బలహీనపడింది) సిపిఎంలోకి కేరళ, బెంగాల్‌లలో చాలామంది, తమిళనాడులో సగం మంది చేరారు. బిహారులో, ఒడిశాలలో ఒకళ్లో యిద్దరో చేరారు. మన రాష్ట్రంలో సగం కంటె ఎక్కువమంది – చంద్ర రాజేశ్వరరావు, నీలం రాజశేఖరరెడ్డి వంటి నాయకులతో సహా – సిపిఐలోనే వుండిపోయారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య వంటివారు సిపిఎంలోకి వెళ్లారు. చీలిక అంటూ వచ్చింది కాబట్టి వాళ్ల ట్రేడ్ యూనియన్లలోనూ, స్టూడెంటు యూనియన్లలోనూ, మహిళా విభాగాల్లోనూ చీలిపోవడం మొదలై కొత్త కొత్త సంస్థలు వచ్చాయి. వాళ్లల్లో వాళ్లు తీవ్రంగా కలహించుకునేవారు. 1967 ఎన్నికలలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలో ఒకరితో ఒకరు తలపడి ఓడించుకున్నాయి. మధ్యలో తక్కినవాళ్లు బాగుపడ్డారు.

కమ్యూనిస్టులు యిలా కొట్టుమిట్లాడుతున్న పరిస్థితుల్లో 1964లో నెహ్రూ మరణించడం, లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని అయి రెండేళ్లు పాలించి మరణించడం జరిగాయి. సిండికేట్‌గా ఏర్పడిన కాంగ్రెస్ నాయకులు కొందరు నెహ్రూ కూతురు ఇందిరా గాంధీకి రాజకీయాలు ఏమీ తెలియవు కదాని పట్టుకుని వచ్చి 1966 లో ప్రధానిని చేశారు. ఆమెను తోలుబొమ్మలా ఆడించబోయారు. అప్పటిదాకా తిరుగులేని శక్తిగా వున్న కాంగ్రెస్‌కు 1967లో జరిగిన ఎన్నికలలో పార్లమెంటులో తక్కువ సీట్లు (283/520) వచ్చాయి, పైగా 17 రాష్ట్రాలలో 7 రాష్ట్రాలలో ప్రభుత్వం ఏర్పరచేటన్ని సీట్లు తెచ్చుకోలేకపోయింది. ప్రతిపక్షాలు కూటములుగా ఏర్పడి ఎక్కడికక్కడ ప్రభుత్వాలు ఏర్పరచేవారు, కానీ తమలో తాము పోట్లాడుకుని ప్రభుత్వాలను కూలదోసుకునేవారు. దేశమంతా అస్తవ్యస్తమైంది.

ఆ పరిస్థితుల్లో ఇందిరా గాంధీ దేశానికి బలమైన నాయకత్వం వుండాలని, అది ఏకోన్ముఖంగా వుండాలని, ఆ నాయకురాలు తనే కావాలని అనుకుంది. తను స్వంతంగా ఎదగడానికి ఆమె ప్రణాళికలు రచించింది. ప్రజలకు నచ్చేది సోషలిజం కాబట్టి ఆ పనులు చేపడితే ప్రజల్లోకి తన స్వంత ఇమేజి వెళుతుందనుకుంది. అంటే రాజభరణాల రద్దు, బాంకులు జాతీయకరణ వంటి సాహసోపేతమైన చర్యలు చేపడితే ప్రజలు తనను ఆరాధిస్తారు. కానీ తనను గద్దెపై కూర్చోబెట్టిన ఈ సిండికేట్ నాయకులందరూ పెట్టుబడిదారీ విధానాలకు అనుకూలురు. వాళ్లు చేయనీయరు. కాంగ్రెస్ పార్టీలో వాళ్లకు బలం చాలా వుంది. వాళ్లకు వ్యతిరేక విధానాలు అమలు చేసి, వాళ్లను బద్‌నామ్ చేస్తేనే తనకు వ్యక్తిగతంగా లాభం. కానీ యిది ఎలా సాధ్యం?

ఈ పరిస్థితిని సిపిఐ తనకు అనువుగా వినియోగించుకుంది. తమకు కావలసినది బాంకుల జాతీయకరణ వంటి సోషలిస్టు చర్యలు. అవి తమ ద్వారా జరిగితేనేం, కాంగ్రెస్ ద్వారా జరిగితేనేం? అందువలన మోహనకుమారమంగళం వంటి కొందరు సిపిఐ నాయకులు కాంగ్రెస్‌పార్టీలోకి మారిపోయారు. వాళ్లంతా ఇందిర చుట్టూ చేరి 'ఈ సిండికేట్ నాయకులను దెబ్బకొట్టు, మేమంతా నీ వెనక్కాల వున్నాం' అని ప్రోత్సహించారు. కాంగ్రెస్‌లోనే సోషలిస్టు గ్రూపుగా వున్న యంగ్ టర్క్‌లు కూడా ఇందిరకు మద్దతుగా నిలిచి సిండికేట్ నాయకులను విమర్శిస్తూ వాళ్ల పరువు తీస్తూండేవారు. బయటనుండి సిపిఐ పార్టీ మద్దతు యిచ్చేది. వీళ్ల బలం చూసుకుని ఇందిరా గాంధీ సిండికేట్ నాయకులను చిత్తు చేసింది. ఎలా చేసింది, తర్వాత ఎలా మారింది అనేది చాలా పెద్ద కథ. ఎప్పుడైనా ఇందిరా గాంధీ గురించి సీరియల్ రాసినపుడు చెపుతాను.

ప్రస్తుతానికి గ్రహించవలసినది ఏమిటంటే సిపిఐ ఇందిరా గాంధీకి తోకగా మారిపోయింది. సిపిఎంతో వైరం పూనింది. సిపిఎం కాంగ్రెస్‌పై కత్తి కట్టింది. ముఖ్యంగా బెంగాల్‌లో, కేరళలో. అక్కడ అధికారం కోసం యిద్దరూ తలపడ్డారు. మనం ప్రస్తుతం మాట్లాడుతున్నది నక్సలైట్ల గురించి కాబట్టి, అది ఉదభవించిన బెంగాల్ రాజకీయాల గురించే మాట్లాడతాను. పైగా కిషన్‌జీని చంపినది బెంగాల్‌లోనే కదా !

1967 ఎన్నికలలో అతివాద, మితవాద కమ్యూనిస్టు పార్టీల మధ్య పొత్తు కుదరలేదు. అక్కడ అధికబలం సిపిఎందే. జ్యోతి బసు, జ్యోతిర్మయి బసు, ప్రమోద్ దాస్‌గుప్తా వంటి హేమాహేమీలు అటే వున్నారు. సిపిఐ బంగ్లా కాంగ్రెస్‌తోను, ఫార్వర్డ్ బ్లాక్‌తోను (ఈ పార్టీ సుభాష్ చంద్ర బోసు స్థాపించారు. ఆయన కనుమరుగై పోయిన తర్వాత ఆయన అనుయాయులు పార్టీ నడుపుతున్నారు) ఫ్రంట్‌గా ఏర్పడింది. సిపిఎంతో యింకో ఆరు వామపక్షాలు ఫ్రంట్ కట్టాయి. కాంగ్రెస్ విడిగా పోటీ చేసింది. ఫలితాలు వచ్చాక చూస్తే 280 కాంగ్రెస్‌కు 127 సీట్లు వచ్చి సింపుల్ మెజారిటీ కూడా రాలేదు. సిపిఎం వున్న ఫ్రంట్‌కు 68 సీట్లు వస్తే, ఇంకో ఫ్రంట్‌కు 65 వచ్చాయి. ఉభయ కమ్యూనిస్టుల కలహాల వలన యితరులు లాభపడ్డారు.

రెండు ఫ్రంటులూ కలిసి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పరచారు. విడివిడిగా చూస్తే సిపిఎం పార్టీకి అందరి కంటె ఎక్కువగా 43 సీట్లు వచ్చాయి కాబట్టి, దాని లీడరు జ్యోతి బసు ముఖ్యమంత్రి కావాలి. కానీ బంగ్లా కాంగ్రెస్ లీడర్ అజయ్ ముఖర్జీ ఒప్పుకోలేదు. దాంతో ఆయన్ను ముఖ్యమంత్రి చేసి జ్యోతి బసు డిప్యూటీ సిఎం అయ్యారు. ఆ ప్రభుత్వం భూసంస్కరణలు తలపెట్టింది. అక్రమ భూ కమతాల జాబితాను, భూమిలేని పేదరైతుల జాబితాను తయారుచేయబోయారు. 2.38 లక్షల అదనపు భూమిని గుర్తించారు. ఇరిగేషన్ సౌకర్యాలు పెంచడానికి కమిషన్ వేశారు. కలకత్తాలోని ట్రామ్ వ్యవస్థను ప్రభుత్వపరం చేశారు.

దాంతో భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, కాంగ్రెస్‌వారూ కుమ్మక్కయ్యారు. కేంద్రం వారితో చేతులు కలిపి రాష్ట్రప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టడానికి తిండి గింజలు సరఫరా చేయలేదు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసింది. సిపిఎం, బంగ్లా కాంగ్రెస్ బహిరంగంగా కొట్లాడేవి. ఇందిరా గాంధీ బంగ్లా కాంగ్రెస్‌లోని పిసి ఘోష్‌ను దువ్వి బయటకు రప్పించింది. 17 మంది ఎమ్మెల్యేలతో అతను బయటకు వచ్చి గవర్నరుకు రాజీనామా యిచ్చాడు. గవర్నర్ ధర్మవీర్ కాంగ్రెస్ ఏజంటులా పనిచేశాడు. పిసి ఘోష్‌ను ముఖ్యమంత్రిగా చేశాడు. సిపిఎం ఆందోళన చేపట్టింది. పిసి ఘోష్ వర్గీయులతో నడివీధుల్లో పోరాటాలు జరిగాయి. చివరకు నాలుగు నెలల తర్వాత 1968 ఫిబ్రవరిలో గవర్నరు ఆ మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాడు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో యిలాటి ఎత్తుపైయెత్తులు సహజం. కానీ దీనివలన కొందరు సిపిఎం నాయకులకు ఈ ఎన్నికల వ్యవస్థపై నమ్మకం నశించింది. ఇలాటి పార్లమెంటరీ రాజకీయాల వలన సామాజిక విప్లవం ఎప్పటికీ రాదనీ, చైనాలోలా సాయుధపోరాటం చేపడితేనే వస్తుందని అనుకున్నారు. సిపిఎం వారు సిపిఐ వారిని మితవాదుల( రివిజనిస్టుల)నుకుంటే వీరు (తర్వాత సిపిఎంఎల్ – కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు–లెనినిస్టు) పార్టీగా ఏర్పడ్డారు) సిపిఎంవారిని రివిజనిస్టులనుకున్నారు. వీరిని మట్టుపెడితే తప్ప విప్లవం రాదనుకున్నారు. మొదట అందరూ చేతులు కలిపి పెట్టుబడిదారుల పని పట్టి, ఆ తర్వాత తమలో తాము తేల్చుకుందామని అనుకోలేదు. సిపిఎం వారే ప్రధాన శత్రువులు అనుకున్నారు.

అలా అనుకున్నవారిలో ప్రముఖులు చారు మజుందార్, కానూ సన్యాల్, జంగల్ సంతాల్. వాళ్లే 1967 మేలో ఆవిర్భవించిన నక్సల్‌బరీ ఉద్యమానికి ఆద్యులు. 1918లో సిలిగుడిలో (డార్జిలింగ్‌కు దగ్గరలో వుంది) ఒక భూస్వామి కుటుంబంలో పుట్టిన చారు మజుందార్ కాలేజీ చదువు మానేసి కాంగ్రెస్‌లో చేరి స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నాడు. మూడు నాలుగేళ్లలోనే కమ్యూనిస్టుగా మారి రైతుసమస్యలపై పోరాడాడు. 1946లో తెభాగా ఉద్యమంలో చేరి, చైనా పద్ధతిలో బెంగాల్‌ను కమ్యూనిస్టు దేశంగా తయారుచేయాలని కలలు కన్నాడు. 1948లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా మూడేళ్లు జైల్లో గడిపాడు. 1967లో నక్సల్‌బరీ అనే చిన్న గ్రామంలో ఒక గిరిజన యువకుడి భూమిని ఓ భూస్వామి ఆక్రమించబోయాడు. అతను కోర్టుకి వెళ్లి ఆర్డరు తెచ్చుకుని భూమి స్వాధీనం చేసుకోబోతే భూస్వామి గూండాలు అతనిపై పడి కొట్టారు. చారు మజుందార్, ఇంకో సిపిఎం లీడరైన కానూ సన్యాల్ (1931లో కుర్సాంగ్‌లో పుట్టాడు. తేయాకు వర్కర్ల హక్కులకై పోరాడాడు. 1970లో చైనా వెళ్లి మావోని కలిసి వచ్చాడు.) అక్కడకు చేరి ప్రయివేటు భూములు ఆక్రమించుకుని పంచిపెట్ట నారంభించారు.

పుచ్చలపల్లి సుందరయ్యగారు తన ఆత్మకథలో రాశారు – "అదే నక్సల్‌బరీలో 1200 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమి వుంది. ప్రయివేటు భూములను ఆక్రమించడానికి ముందు దాన్ని ఎందుకు ఆక్రమించుకుని పంచలేదు? అని కానూ సన్యాల్‌ని అడిగాను. 'ప్రభుత్వ భూమిని పంచితే తర్వాత ప్రభుత్వం దాన్ని ఆమోదించి (రాటిఫై చేసి) పట్టాలు యిచ్చేస్తుంది. దానితో ప్రజలు తృప్తిపడి తక్కిన పోరాటాలకు రారు. ప్రయివేటు భూమి పంచితేనే ఘర్షణ వస్తుంది. ఆ ఘర్షణనుండే విముక్తి పోరాటం ఆరంభించదలిచాం. ఇక్కడనుండి విముక్తి చేసుకుంటూ పోయి దేశాన్నంతటినీ జయిస్తాం' అని సమాధాన మిచ్చాడు." అని. ఇది విని సుందరయ్యగారు నవ్వుకుని వుంటారు. వీళ్లందరికీ చైనాలో మావో చేసిన లాంగ్ మార్చ్ ఉత్తేజాన్నిస్తుంది.

తెలంగాణలో 1949 పోలీసు చర్య తర్వాత కమ్యూనిస్టులు (పోరాట నాయకుల్లో సుందరయ్యగారు కూడా ఒకరు) సాయుధపోరాటం చేసేసి, తెలంగాణను విముక్తం చేసి, ఆ తర్వాత దేశాన్ని కూడా కమ్యూనిస్టు రాజ్యంగా మార్చేద్దామనుకున్నారు. రెండేళ్లపాటు పోరాటం జరిగి వేలాదిమంది కార్యకర్తలను పోగొట్టుకున్నారు కానీ, అంగుళం భూమిని కూడా సాధించలేకపోయారు. కేంద్రప్రభుత్వం సైన్యం సహాయంతో అణచివేసింది. నక్సల్‌బరీలో కూడా అదే జరుగుతుందని సుందరయ్యగారిలాటి వాళ్లు పూర్వానుభవంతో చెప్పినా కానూ సన్యాల్, చారు మజుందార్ వినలేదు. (45 సంవత్సరాల తర్వాత కూడా విముక్తి జరగలేదు)

రాష్ట్రంలో అలుముకున్న రాజకీయ గందరగోళ పరిస్థితి వలన విసిగిపోయిన బెంగాల్ యువతకు చారు మజుందార్ హీరో అయిపోయాడు. అందునా మజుందార్ వాళ్లను వ్యక్తిగత హింసకు ప్రోత్సహించాడు. విప్లవం గ్రామాల్లోనే కాదు, పట్టణాలకూ వ్యాపించాలన్నాడు. దాన్ని అడ్డుకునేవారిని అంటే భూస్వాములను, వ్యాపారస్తులను, యూనివర్శిటీ టీచర్లను, పోలీసువారిని, రాజకీయనాయకులను చంపి పారేయమన్నాడు. స్కూళ్లు మూతపడ్డాయి. జాదవ్‌పూర్ యూనివర్శిటీ, ప్రెసిడెన్సీ కాలేజీ అల్లర్లకు నెలవు అయ్యాయి. అస్తవ్యస్త పరిస్థితికి ప్రభుత్వంలో వున్నవారినే బాధ్యులను చేయడం సహజం. సిపిఎం కారణంగానే ప్రభుత్వ పాలన యిలా అఘోరిస్తోందని నూరిపోయడంతో వాళ్లంతా నక్సలైట్లుగా మారి సిపిఎం కార్యకర్తలను హత్యచేయసాగారు. (ఆ కాలపు నాటి బెంగాల్ పరిస్థితిని చూపించే సత్యజిత్ రాయ్, మృణాల్ సేన్ సినిమాలు చూస్తే బాగా తెలుస్తుంది)

ఈ నక్సలైట్లకు వెనుకనుండి మద్దతు యిచ్చినది ఇందిరా గాంధీ. అప్పట్లో స్టూడెంట్ లీడరుగా వున్న ప్రియరంజన్ దాస్‌మున్షీ, మమతా బెనర్జీ, సౌగతా రాయ్ (తర్వాత కేంద్రమంత్రులయ్యారు) సభ్యులుగా వుండే ఛాత్రపరిషద్ (కాంగ్రెస్‌వారి స్టూడెంట్స్ యూనియన్) ద్వారా సిపిఎం వారిని చంపించడం జరిగింది. చారు మజుందార్ ప్రచారం చేసే యీ వ్యక్తిగత హింసను కానూ సన్యాల్ వ్యతిరేకించాడు. 1969లో కలకత్తాలో లెనిన్ పుట్టినరోజునాడు సిపిఎంఎల్ పార్టీని స్థాపించాడు. చైనా చైర్మన్ మా చైర్మన్ అని నినదించాడు.

నక్సలైటు ఉద్యమం యింత భీకరంగా సాగుతూంటే పార్లమెంటరీ రాజకీయాలు ఎలా సాగుతున్నాయి? 1969 ఫిబ్రవరి వరకు, అంటే ఏడాదిపాటు రాష్ట్రపతి పాలన ముసుగులో కేంద్రంలోని కాంగ్రెస్ పాలన సాగింది. ఈ కాలంలో బెంగాల్‌ను పరోక్షంగా

పాలించినది సిద్ధార్థ శంకర్ రాయ్. ఇతను ప్రముఖ కాంగ్రెస్ స్వాతంత్ర్యయోధుడు చిత్తరంజన్ దాస్‌కు మనుమడు. బారిస్టరు. కాంగ్రెస్‌లో చేరి 1957లో బిసి రాయ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా వున్నపుడు ఆయన కాబినెట్‌లో న్యాయశాఖా మంత్రిగా పనిచేశాడు. బిసి రాయ్ అతన్ని తన వారసుడిగా తీర్చిదిద్దే సమయంలోనే అతుల్యఘోష్ (సిండికేట్ సభ్యుల్లో ఒకడు), పిసి సేన్‌లతో పేచీ వచ్చి సిద్ధార్థ రాజీనామా చేశాడు.

ఆ తర్వాత నాలుగేళ్లపాటు సిద్దార్థ జ్యోతి బసుకి, కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితంగా మెలిగాడు. నిజానికి సిద్ధార్థ, జ్యోతి బసు, ఇందిరా గాంధీ వ్యక్తిగతంగా మంచి మిత్రులు. (రాజకీయ సంక్షోభం అధిగమించడానికి ఎమర్జన్సీ విధించమని 1975లో ఇందిరా గాంధీకి సలహా యిచ్చినది సిద్దార్థే). చైనా దండయాత్ర తర్వాత సిద్ధార్థ కాంగ్రెస్‌కు తిరిగి వచ్చేశాడు. 1967లో ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినపుడు అతను అసెంబ్లీలో ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ తరఫున డిప్యూటీ లీడరు. రాష్ట్రపతి పాలన రోజుల్లో అతనే గవర్నరుకి సలహా లిచ్చేవాడు.

1969 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు బహిష్కరించమని నక్సలైట్లు పిలుపు నిచ్చినా 70% ఓటింగు జరిగింది. కాంగ్రెస్ ఒక వైపు, తక్కిన పక్షాలన్నీ కలిసి వేరొక వైపు నిలిచి పోరాడాయి. అసెంబ్లీలోని 280 సీట్లలో కాంగ్రెస్‌కు 55, సిపిఎంకు 83, బంగ్లా కాంగ్రెస్‌కు 33 సిపిఐకు 30, ఫార్వర్డ్ బ్లాకుకు 29 వచ్చాయి. సిపిఎంకు ఎక్కువ సీట్లు వచ్చినా బంగ్లా కాంగ్రెస్ నాయకుడు అజయ్ ముఖర్జీ తను సిఎంగా వుంటానని పట్టుబట్టారు. సిపిఐ కూడా వాళ్లనే సమర్థించింది. జ్యోతి బసు డిప్యూటీ సిఎం అయి హోం శాఖ తీసుకున్నారు. ఇక కాంగ్రెస్‌వారు, నక్సలైట్లు కలిసి రాష్ట్రమంతా అల్లర్లు చేశారు. హోం మంత్రిగా జ్యోతి బసు అసమర్థుడని ప్రకటించారు. పత్రికలు కూడా వారికి మద్దతు పలికాయి. ఇలా పది నెలలు గడిచేసరికి తన 'అనాగరిక' ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి నిరాహారదీక్షకు పూనుకున్నాడు. జ్యోతి బసును, సిపిఎంను విలన్లగా చిత్రీకరించడానికే యీ ప్రయత్నమంతా.

ఇంకో మూడు నెలలకు అజయ్ ముఖర్జీ రాజీనామా చేసేశాడు. బంగ్లా కాంగ్రెస్ లేకపోయినా తక్కినవారితో ప్రభుత్వం నడపగల సత్తా సిపిఎంకు వుంది. కానీ తక్కినవారు సిపిఎం నేతృత్వాన్ని అంగీకరించమన్నారు. దాంతో 1970 మార్చిలో మళ్లీ రాష్ట్రపతి పాలన విధించారు. అంటే సిద్ధార్థ శంకర్ రాయ్ పరిపాలన అన్నమాట. సిపిఎం నాయకులను, కార్యకర్తలను చంపసాగారు. ఒక ఏడాది కాలంలో 238 మంది సిపిఎం కామ్రేడ్స్ చనిపోయారు. 1970 మార్చిలో జ్యోతి బసుపై పాట్నా రైల్వే స్టేషనులో హత్యాయత్నం జరిగింది. కానీ తప్పిపోయింది. ఆయనపై కాల్చిన తుపాకీ పక్కన వున్నతనికి తగిలి చనిపోయాడు.

ఇంతలో బంగ్లాదేశ్ నుండి శరణార్థుల తరలి రాసాగారు. ఇందిరా గాంధీ వారికి పశ్చిమ బెంగాల్‌లో ఆవాసం కల్పించడం ద్వారా, దేశప్రజల నుండి నిధులు సేకరించి వారికై ఖర్చుపెట్టడం ద్వారా బెంగాల్ ప్రజల ఆదరాన్ని చూరగొన్నారు. ఇందాకా చెప్పిన బ్యాంకుల జాతీయకరణ వంటివి కూడా ఆమె యిమేజిని పెంచాయి. ఈ సమయంలో సిద్ధార్థ ఇందిరకు మరింత చేరువయ్యారు. ఎందుకంటే ఢాకాలో చీఫ్ జస్టిస్‌గా వుండి ముజిబుర్ రహమాన్‌కు సలహాదారుగా వున్న అబూ సయ్యద్ చౌధురి సిద్ధార్థకు కాలేజ్ మేట్. ఇద్దరూ సంప్రదించుకునేవారు. వాటిబట్టి సిద్ధార్థ ఇందిరకు సలహాలిచ్చేవాడు. సిద్ధార్థను యూనియన్ కాబినెట్‌లో మంత్రిగా తీసుకుని అతని ద్వారా బెంగాల్‌ను పరిపాలించింది ఇందిర. 1971 జనవరిలో జ్యోతి బసు కారుపై బాంబులు వేశారు. అయినా బతికాడు. అదే సమయంలో సిపిఎం రాజకీయ ప్రత్యర్థి ఐన ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు హేమంత బసు హత్య జరిగింది. అది సిపిఎం చేయించినదే అని ఆరోపించాడు సిద్ధార్థ.

భౌతికంగా, నైతికంగా సిపిఎంను పూర్తిగా దెబ్బ తీశాం అనుకున్న తర్వాత ఏడాది రాష్ట్రపతిపాలన తర్వాత అరాచకం యింకా తాండవిస్తూండగానే 1971 మార్చిలో మళ్లీ ఎన్నికలు పెట్టారు. 277 సీట్లకు సిపిఎం 111, దాని మిత్రపక్షాలు యింకో 12 గెలుచుకున్నాయి. కాంగ్రెస్‌కు 105 వచ్చాయి. లోకసభకు జరిగిన పోటీలో సిపిఎం 40 కు గాను 20 సీట్లు గెలుచుకుంది. అయినా గవర్నరు కాబినెట్ ఏర్పాటు చేయడానికి పెద్దపార్టీ ఐన సిపిఎంను పిలవలేదు. 5 గురు సభ్యులున్న అజయ్ ముఖర్జీని పిలిచాడు. ఆయనను కాంగ్రెస్, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాకులు బలపరిచాయి. ఈ అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా సిపిఎం ఆందోళన చేస్తున్నంత భయంతో రాష్ట్రమంతా 144 సెక్షన్ విధించారు. సిపిఎం కార్యకర్తలను తప్పుడు ఆరోపణలపై జైలుపాలు చేయడం, చంపడం సాగించారు. ఈ కాలంలో 101 మంది సిపిఎం కామ్రేడ్స్ చంపబడ్డారు. ఏం చేసినా పాలకపార్టీ మెజారిటీ సంపాదించలేకపోయింది. అందువలన కేంద్రం మంత్రివర్గాన్ని రద్దు చేసి, 1971 జూన్‌న శాసనసభను రద్దు చేసింది. ఈ సమయంలో సిద్ధార్థ డైరక్టుగా బెంగాల్‌ను పాలించసాగాడు.

1971 డిసెంబరులో బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం సాధించడంతో ఇందిర ప్రభ వెలిగిపోయింది. బెంగాల్ ఎన్నికలలో గెలవాలంటే యిదే మంచి తరుణం అనుకుంది. 1972 మార్చిలో ఎన్నికలు పెట్టించింది. ఈ లోపున హత్యాకాండ నిరాఘంటంగా సాగిపోయింది. 1971లో నక్సలైట్ల, సిపిఎం కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో 40 మంది చనిపోయారు. జ్యోతి బసు, హరికిషన్ సుర్జీత్ వెళ్లి ఇందిరా గాంధీని కలిసి బెంగాల్‌లో బీభత్స కాండ సాగుతోందంటే ఆమె 'అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారు' అని తీసిపారేసింది. ఎన్నికలు ఎలాగైనా గెల్చి తీరాలని పట్టుబట్టింది. సిపిఎం కార్యకర్తలను యిళ్లనుండి తరిమివేశారు. వాళ్లు ఓటర్లను కలుసుకోలేకపోయారు.

ఇక పోలింగు రోజునాడు కాంగ్రెస్, సిపిఐ, పోలీసు కలిసి ఘోరంగా రిగ్గింగుకి తలపడ్డారు. ఓటర్లను బూత్‌లకు రానివ్వకుండా

అడ్డుకున్నారు. కనీవిని ఎరుగని రీతిలో జ్యోతి బసు తన స్వంత నియోజకవర్గంలో ఓడిపోయారు. కాంగ్రెస్‌కు 216, దాని మిత్రపక్షమైన సిపిఐకు 35 రాగా, సిపిఎంకు 14 వచ్చాయి. దీన్ని బట్టే తెలుస్తుంది, రిగ్గింగ్ ఏ లెవెల్లో జరిగిందో ! దీని కంతటికీ దర్శకత్వం వహించిన సిద్ధార్థ శంకర్ రాయ్‌ను ఇందిరా గాంధీ ముఖ్యమంత్రిని చేసింది. ఇక ముఖ్యమంత్రిగా ఆయన చేసిన అరాచకాలు అన్నీ యిన్నీ కావు.

అధికారంలోకి రాకుండా సిపిఎంను కంట్రోలు చేయగలిగాం కదా, నక్సలైట్లతో పని అయిపోయింది యిక వాళ్లెందుకు అనుకున్నారు కాంగ్రెస్‌వారు. అక్టోబరు 1969 నుండే ఇందిరా గాంధీ మిలటరీని దించి నక్సలైట్ల ఆనుపానులు సేకరించి వుంచుకున్నారు. 1971 నుండి కాల్చివేయడం మొదలుపెట్టారు. 1971 చివరి వచ్చేసరికి నక్సలైట్లను బెంగాల్‌నుండి తుడిచి పెట్టేశారు. చారు మజుందార్ 1972 జులైలో పట్టుబడ్డాడు. అతన్ని పోలీసు స్టేషన్‌లో బంధించి 10 రోజుల పాటు వుంచి నానా హింసలూ పెట్టి అక్కడే చంపివేశారు. కస్టడీలో వుండగా ఎవర్నీ చూడనివ్వలేదు. అతని లాయరు కాదు, డాక్టరు కాదు – ఎవర్నీ చూడనివ్వలేదు ! చనిపోయాక దేహాన్ని కుటుంబానికి అప్పగించలేదు. పోలీసులే శ్మశానానికి తీసుకెళ్లి బంధువులెవరికీ చూపించకుండా కాల్చివేశారు. జంగల్ సంతాల్ కూడా చనిపోయాడు. వ్యక్తిగత హింసపై కానూ సన్యాల్‌ను 1970లో అరెస్టు చేశారు. 1977లో విడుదల చేశారు. 80 ఏళ్లు బతికి డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ తర్వాత 1975లో ఎమర్జన్సీ విధించాలని సిద్ధార్థ ఇందిరకు సలహా యిచ్చాడు. ఎమర్జన్సీ ఎత్తేసి 1977లో పార్లమెంటు ఎన్నికలు పెట్టినపుడు సిపిఎం జనతాపార్టీతో కలిసి పోటీ 42 సీట్లలో 22 సీట్లను గెలుచుకోగా, కాంగ్రెస్ 3 మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికలలో కూడా సిద్ధార్థ అక్రమాలకు పాల్పడ్డారు. 1977 జూన్‌లో సిపిఎం తక్కిన లెఫ్ట్ పార్టీలతో కలిసి (ఎమర్జన్సీ దెబ్బతో సిపిఐ కాంగ్రెస్‌ను వదిలిపెట్టి సిపిఎంతో చేరింది) 294కు 231 సీట్లు గెలుచుకుంది. సిపిఎం ఒక్కటే 178 సీట్లు గెలుచుకుంది. ఇక అప్పణ్నుంచి సిపిఎం పాలన అప్రతిహతంగా 2011 వరకు సాగింది. దాదాపు 35 ఏళ్ల పాలనలో సిపిఎం పొరబాట్లు చేసింది కాబట్టే ఓడిపోయింది. కానీ కాంగ్రెస్ ఎప్పటికప్పుడు సిపిఎంను దిగలాగుదామని చూస్తూనే వుంది. చివరకు కాంగ్రెస్ పార్టీ నుండే వచ్చి ఆ లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న మమతా బెనర్జీ ఆ పని చేయగలిగింది.

1969 నాటి సంఘటనలు విపులంగా చెప్పాను కాబట్టి యిటీవలి మమతా బెనర్జీ విన్యాసాలు మళ్లీ చెప్పటం లేదు. సిపిఎంను పడగొట్టడానికి సింగూరులో, నందిగ్రామ్‌లో మమతా మావోయిస్టులతో చేతులు కలిపిందని అందరికీ తెలుసు. మొన్న ఎన్నికలలో మావోయిస్టుల సాయం తీసుకుందని తెలుసు. సిపిఎంను ఓడించడం జరిగిపోయింది కాబట్టి గతంలో సిద్ధార్థ లాగానే మమతా కూడా మావోయిస్టులను వదిలించుకుంటోంది. ఆనాడు చారు మజుందార్ లాగానే యీనాడు కిషన్‌జీ. ఈ హత్యాకాండ యింతటితో ఆగదు. మావోయిస్టుల నందరినీ తుడిచి పెట్టి తనకు శత్రువన్నవాడు లేకుండా చూసుకునే వరకూ మమత ఎన్‌కౌంటర్లు సాగిస్తూనే వుంటుంది. బెంగాల్ రాజకీయాల్లో కొట్లాటలు, హత్యలు సర్వసాధారణం. మావోయిస్టులు బెంగాల్ విడిచి వేరే చోటకి వెళ్లవలసిన పరిస్థితి రావచ్చు. లేదా మమతా బెనర్జీని చంపివేయవచ్చు.

ఇదంతా చదివి మావోయిస్టులపై జాలి చూపవలసిన పని లేదు. ఎందుకంటే పార్లమెంటరీ రాజకీయాలంటే మండిపడే మావోయిస్టులు తామూ అదే బాట పడుతున్నారు. వాళ్లు రాజకీయనాయకులందరినీ దూరం పెడితే, ఎన్నికలను టోటల్‌గా బహిష్కరిస్తే అర్థం చేసుకోవచ్చు. కానీ వాళ్లు అపోజిషన్‌లో వున్న వాళ్లతో చేతులు కలిపి పదవిలో వున్నవాళ్లను దెబ్బ కొడదామని చూస్తారు. ఇక మామూలు పాలిటిక్స్‌కు, వీళ్ల 'సిద్ధాంతపరమైన' పాలిటిక్స్‌కు తేడా ఏముంది? వీళ్లు ఒకందుకు ప్రతిపక్షంతో చేతులు కలుపుతారు, వాళ్లు మరో అందుకు కలుపుతారు. అక్కర తీరాక యిద్దరూ తలపడతారు. ఎవరికి ఎక్కువ తెలివితేటలుంటే వాళ్లు గెలుస్తారు. ఈ రోజు తెలంగాణ ఉద్యమం ఏంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ కాబట్టి మావోయిస్టులు వత్తాసు పలుకుతున్నారు. ఉద్యమకారులు వారి సహాయం తీసుకుంటారు. తర్వాత అధికారంలోకి వచ్చాక వాళ్లు ఎస్టాబ్లిష్‌మెంట్ అవుతారు. వెంటనే మావోయిస్టులు ప్రతి దానికీ అడ్డు తగులుతారు. అప్పటి తెలంగాణ పాలకులు వూరుకుంటారా? ఈ రోజు మమతా బెనర్జీ చేసిందే వాళ్లూ చేస్తారు. ఈ గేమ్ నడుస్తూనే వుంటుంది. ప్రజలది ప్రేక్షకపాత్ర మాత్రమే. ప్రతి మనిషి ప్రాణం విలువైనదనీ వారూ,వీరూ గుర్తించేదాకా యిది సాగుతూనే వుంటుంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

**డిసెంబరు 03** **ఎమ్బీయస్ : కంఠశోషేనా..?**

చిదంబరంగారు నిన్న మళ్లీ కుండ బద్దలు కొట్టారు. డిసెంబరు నెలాఖరు తర్వాతనే అఖిలపక్ష సమావేశంట. ఆ లోపున నాలుగు పార్టీలు తమ అభిప్రాయాలు చెప్పాలట. అంటే గత వారం రోజులుగా రోజూ టి ఎంపీలు పార్లమెంటు స్తంభింపచేసినా, నినాదాలు యిచ్చినా అంతా కంఠశోషేనా? తెలంగాణ దిశగా ఒక్కడుగు కూడా ముందుకు పడలేదా? పడింది పడింది అంటారు కెసియార్. సోనియాగారు తమ పార్టీ సర్వేలు, ఇంటెలిజెన్సు సర్వేలు నమ్మకుండా ప్రయివేటు సర్వే చేయిస్తోందిట. అది చూసి తెలంగాణ యిచ్చేస్తుందట. ఆ సర్వే పార్టీని లగడపాటి కుదిరిస్తే మాత్రం కెసియార్ కంగు తినాల్సి వస్తుంది. సర్వే మాట నిజమైనా అబద్ధమైనా టిడిపి మాత్రం చిదంబరం గారి అఖిలపక్షం సమావేశానికి వెళ్లం పొమ్మంటోంది. టిడిపి లేకుండా యింకేం అఖిలపక్షం అని

చిదంబరంగారు యింకో ఆర్నెల్లు లాగించేస్తారేమో !

టికాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో తమ వాణి వినిపించారు. ప్లకార్డులు పట్టుకెళ్లి వూపారు. మీరా కుమార్‌ను చికాకు పెట్టారు. తమ పార్టీ పెద్ద తలకాయలను ధిక్కరించారు. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సవాళ్లు విసిరారు. ఇన్ని చేసినా హై కమాండ్ చెదరలేదు, బెదరలేదు. చిదంబరం చేత నెలాఖరు సమావేశంలో పాత పాటే పాడించారు. టికాంగ్రెస్ ఎంపీల పంథాలోనే టికాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రవర్తించాలని కోదండరాం సలహా యిచ్చారు. అక్కడ వాళ్లు విజయవంతం అయితే వీళ్లకీ యిన్‌స్పిరేషన్ కలిగేది. అక్కడ వాళ్లు సాధించిందేమీ లేదు, యిక్కడా అదే పని చేసి బావుకునేదేముంది? అనుకుంటే ఎవరూ ఏమీ చేయగలిగేది లేదు.

అసలు ఎసెంబ్లీ నడుస్తుందో లేదో ఎవరికీ తెలియదు. తెలంగాణపై తీర్మానం పెట్టకపోతే స్తంభింపచేస్తాం అంటోంది తెరాస. తీర్మానం పెట్టే సూచనలు కనుచూపు మేరలో లేవు. అందువలన స్తంభింపచేస్తారా? టికాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్లమెంటులో తమ సోదరుల తరహాలోనే సభాకార్యక్రమాలు జరగకుండా చేస్తారా? చేస్తే మాత్రం ఇదంతా – పార్లమెంటులో ప్రతిపక్షాలు ఆరోపించినట్టు – కాంగ్రెస్ కుట్రే అనుకోవాలి. కీలక అంశాలపై చర్చ జరగకుండా కాంగ్రెస్సే తమ టిఎంపీల చేత గొడవలు చేయిస్తోందని బిజెపికి మాచెడ్డ అనుమానంగా వుంది. తెలంగాణ భారాన్ని భుజాన వేసుకున్న సుష్మా స్వరాజ్ నచ్చచెప్పినా యీ సారి కెసియార్, విజయశాంతి వినడం లేదు. గత సెషన్‌లో యిద్దరూ ఆవిడ వెనక్కాలే బుద్ధిమంతులైన పిల్లల్లా నిల్చున్నారు. ఈ సారి నీతో పనేముందన్నట్టు విడిగా వెళ్లి నినాదాలు చేస్తున్నారు. ఇలా అయితే ఎన్‌డిఏ మీకు సాయపడదు అని శరద్ యాదవ్ బెదిరించినా పోవోయ్ అనేశారు. (కాంగ్రెస్‌తో బేరం కుదిరింది కాబట్టి ఇటీవల తెరాస బిజెపితో దూరం పాటిస్తోందా? అన్న డౌటు వస్తోంది) టికాంగ్రెస్ వాళ్లు సరేసరి. ఎవరు చెప్పినా వినటం లేదు.

ఇదంతా కాంగ్రెస్ కావాలని ఆడిస్తున్న నాటకం అని వాళ్లు అనుకోవడానికి కారణం ఏమిటంటే – ప్రణబ్ అరిచేశారు, కరవబోయారు అని వార్తలు బయటకు వస్తాయి కానీ అరవటమూ లేదు, కరవడమూ లేదు. ఎవరిమీదా యాక్షన్ తీసుకోలేదు. పోనీ అలాగని పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారా అంటే అదీ లేదు. మొన్నటిదాకా రెండో ఎస్సార్సీ వేస్తారని, ఈ లోగా ప్రాంతీయ కమిటీ వేస్తారని అనుకున్నారు. ఇంతలో రెండో ఎస్సార్సీ కూడా యుపి ఎన్నికల తర్వాతే ప్రకటించవచ్చని, దానికి కూడా యుపిఏలో తక్కిన భాగస్వామ్యపక్షాలు ఒప్పుకోకపోతే స్వంతబలంతో అధికారంలోకి వచ్చినపుడు చూసుకోవచ్చని కాంగ్రెస్ అనుకుంటోందని వార్తలు వచ్చాయి. ఇది టూ మచ్. ఇలా అయితే ఎప్పటికి తేలేను? మన టీవీ ఛానెల్స్ అప్పుడే కెసియార్ నిరాహారదీక్షకు రెండేళ్లు, ఈ రెండేళ్లలో సాధించినదేముంది? అంటూ చర్చలు మొదలుపెట్టి ఉద్యమ జయాపజయాలను తెలంగాణ ప్రజలకు గుర్తు చేస్తున్నారు.

సోనియా పుట్టినరోజు మామూలుగా అయితే ఎవడికీ గుర్తుండేది కాదు కానీ డిసెంబరు 9 ప్రకటన ధర్మమాని బర్త్‌డే కేక్ – రాష్ట్రం ఉపమానం వలన అందరికీ బాగా గుర్తుండిపోయింది. 2009 డిసెంబరు 9 కి, ఈ డిసెంబరు 9 కి సోనియాకు రెండేళ్ల వయసు పెరిగింది. తెలంగాణ విషయంలో మాత్రం ఒరగబెట్టినది ఏమీ లేదు. ఆవిడ పుట్టినరోజు సందర్భంగా యిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుని అంతర్జాతీయంగా కాంగ్రెస్‌కున్న ప్రతిష్టను కాపాడుకోమని పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేస్తూనే వున్నారు. (రేపు ఆయన తెరాసలోకి వెళ్లే మాటయితే అప్పుడు కూడా కాంగ్రెస్‌కు అంతర్జాతీయ ప్రతిష్ట వుందని ఒప్పుకుంటారో లేదో తెలియదనుకోండి) ఆవిడ పుట్టినరోజు వాగ్దానం 15 రోజులు తిరక్కుండా డిసెంబరు 23కే తూనాబొడ్డు అయిపోయిందన్న విషయం వీళ్లు అతి సౌకర్యంగా మర్చిపోతారెందుకో !

అదే పొన్నం ప్రభాకర్, ప్రణబ్ తమని నిల్చోబెట్టి తిట్టినపుడు బ్రహ్మాండమైన ప్రశ్న అడిగారట. నాకు చాలా ముచ్చట వేసింది ఆ ప్రశ్న విని. "తెలంగాణ యిచ్చే వుద్దేశం లేనప్పుడు డిసెంబరు 9 ప్రకటన ఎందుకు చేశారు? మా ప్రజల్లో ఎందుకు ఆశలు రేపి మమ్మల్ని యిరకాటంలో ఎందుకు పడేశారు?" అని. ఇది ఎవరైనా అడుగుతారు. కానీ ఆయన అంతకంటె యింకా మంచి ప్రశ్న అడిగాడు – "ఆ ప్రకటన చేసినపుడు మమ్మల్ని విశ్వాసంలోకి ఎందుకు తీసుకోలేదు? కనీసం గంట ముందైన మాతో ఎందుకు చెప్పలేదు?" అని. ఇది చాలా తెలివైన ప్రశ్న. కాంగ్రెస్ హై కమాండ్ వివేకాన్ని ప్రశ్నించే ప్రశ్న. వారి స్థానంలో ఎవరైనా వుంటే ఆ ప్రకటన వలన కలిగే లాభాన్ని తమ ఖాతాలో వేసుకోవడానికి ముందుగా తమ పార్టీ నాయకులకు లీక్ చేసేవారు. వాళ్లు ఆ ప్రకటనకు అనుగుణంగా తమ హై కమాండ్‌ను డిమాండ్ చేసేవారు. వారి కోరిక మేరకు, వారి అభ్యర్థన మన్నిస్తున్నాం అనే కలర్ యిస్తూ హై కమాండ్‌నుండి ప్రకటన వెలువడేది. 'కెసియార్ నిరాహారదీక్ష చేస్తే ఏమొచ్చింది? మేం అడగవలసిన తీరులో అడిగాం కాబట్టి వచ్చింది' అని వీళ్లు చెప్పుకోవడానికి అవకాశం వుండేది.

కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో వున్న రాష్ట్రాలలో కూడా కార్మికులు సమ్మె చేస్తూ వుంటారు. కార్మికపక్షపాతి అయిన పార్టీ ప్రభుత్వంలో వున్నపుడు సమ్మె ఎందుకు చేయాలి? అని నేను ఓ కమ్యూనిస్టు నాయకుణ్ని అడిగాను. "కార్మికుల్లో చైతన్యం నిరంతరంగా వుండాలంటే సమ్మె చేసే లక్షణాన్ని విడవకుండా సాధన చేయాలి. లేకపోతే రేపు మాకు అధికారం పోయి బూర్జువా పార్టీ గద్దె కెక్కితే అప్పుడు కూడా సమ్మె చేయలేరు. ఇన్నేళ్లుగా అలవర్చిన చైతన్యం అటకెక్కుతుంది. అందుకని జీతాలు పెంచాలని ప్రభుత్వం ముందే నిర?యం తీసుకున్నా, మా పార్టీ యూనియన్ ద్వారానే లాంఛనంగా సమ్మె చేయించి, మా పార్టీ ప్రభుత్వం ద్వారానే ఔననిపించి యిరువైపులా ప్రయోజనాలు కాపాడుకుంటాం. లేకపోతే కార్మిక నాయకత్వం మాకు వ్యతిరేకంగా వున్న యూనియన్ల చేతిలోకి

వెళ్లిపోతుంది.” అని వివరించాడాయన.

కాంగ్రెస్ హై కమాండ్ డిసెంబరు 9 నాడు ఒక తీవ్రమైన నిర?యం తీసుకుంది. దాని మంచిచెడ్డలు పక్కన పెట్టండి. కనీసం ఆ నిర?యం వలన కలిగే లాభాలు తమ పార్టీకి సమకూరాలన్న యింగితం కూడా లోపించింది వాళ్లకు. తమ పార్టీ శాసనసభా నాయకుడు, ముఖ్యమంత్రి రోశయ్యకు కూడా తెలియకుండా ఆ ప్రకటన చిదంబరం చేత చేయించారు. ఆయన్ను విమానం ఎక్కించి, కెసియార్‌తో మంతనాలు సాగించి, ప్రకటన చేశారు. రోశయ్య హైదరాబాదు వచ్చేలోపునే తెరాస సంబరాలు మొదలుపెట్టేసింది. కెసియార్ ప్రాణత్యాగానికి సిద్ధపడి తెలంగాణ సాధించిన వీరుడిగా చరిత్ర కెక్కేశారు. రోశయ్యతో సహా కాంగ్రెస్ నాయకులందరూ ప్రాన్పడిపోయారు. అప్పటిదాకా తెలంగాణ వచ్చేదా, చచ్చేదా అనుకున్నవారందరూ కదిలి వెళ్లిపోతున్న రైలు పట్టుకోవడానికి పరుగులు పెట్టారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ సోనియా ప్రత్యక్ష దైవం అయిపోయింది. వరాలిచ్చే దేవత అయిపోయింది. అయితే దానివలన ఆమె పార్టీ లాభపడలేదు – హై కమాండ్ నిర్వాకం వలన ! ఆ ప్రకటనను డీల్ చేసిన విధానం వలన !

ఇది గుర్తించిన టి కాంగ్రెస్ నాయకులు నష్టనివారణకు పూనుకున్నారు. ఇదంతా నా లాబీయింగ్ వలననే అని జైపాల్ రెడ్డి, కేకే చెప్పేసుకున్నారు. మధు యాష్కీ అంత డైరక్టుగా చెప్పుకోలేదు కానీ ఆయనకూ, రాహుల్ గాంధీకు వున్న సాన్నిహిత్యం చేతనే యిది సాధ్యపడిందని వార్తలు వచ్చేట్లు చూసుకున్నారు. ఏం చేసినా కెసియార్ వల్లనే ఆ ప్రకటన వచ్చిందని కలిగిన అభిప్రాయాన్ని ప్రజల హృదయాల్లోంచి తుడిపి వేయలేకపోయారు.

నిజానికి ఆ ప్రకటన వచ్చేట్లు చేయడానికి కేంద్రంలోని హెూం డిపార్టుమెంటు తన కింద పనిచేసే యింటెలిజెన్సు రిపోర్టులు తయారు చేయించింది. అక్కడ పిళ్లయ్ అనే ఆయన వుండేవాడు కదా. చిదంబరం సరేసరి. ఇద్దరూ కలిసి డిసెంబరు 10 నాటి చలో అసెంబ్లీలో వేలాదిమంది మావోయిస్టులు చొరబడి వేలాది మందిని పొట్టనపెట్టుకుంటారని రిపోర్టులు తయారుచేయించేశారు. అవన్నీ తప్పు, పరిస్థితి అంత ఘోరంగా లేదు, నేను హ్యాండిల్ చేస్తాను, బాధ్యత నాది, ఫెయిలయితే రిజైన్ చేస్తానని రోశయ్య మొత్తుకున్నా వాళ్లు వినలేదు. ఆయన మాట నమ్మకుండా వుండడానికే నిశ్చయించుకున్నారు. అంటే చిదంబరం మెదడులో విభజన కార్యక్రమం ఆల్‌రెడీ రెడీ అయిపోయినట్టే అనుకోవచ్చు.

అంత రెడీగా వున్నపుడు ఆయన తన పార్టీకి ఆ లాభం చేకూరడానికి కాస్త ప్లానింగ్ చేసి వుండాల్సింది. కెసియార్ నిరాహారదీక్ష విరమించి నిమ్మరసం తాగగానే ఓయూ విద్యార్థులు ఆయన దిష్టిబొమ్మ తగలేశారుకదా. వెంటనే ఓ కాంగ్రెస్ నాయకుణ్ని నిరాహారదీక్షకు కూర్చోబెట్టవలసినది. కెసియార్ దీక్ష మళ్లీ మొదలు పెట్టినా 'నాకు ఆయనపై నమ్మకం లేదు, తెలంగాణపై ప్రకటన వచ్చేవరకూ నేను లేవను' అని యీ కాంగ్రెస్ నాయకుడు కూర్చున్నాక మరో మూడు రోజులకు యీ ప్రకటన వెలువడి సాక్షాత్తూ సోనియమ్మే నిమ్మరసం యిచ్చి విరమింప చేసి వుంటే కాంగ్రెస్ పేరు తెలంగాణ అంతా మారుమ్రోగిపోయి వుండేది. 8 ఏళ్లగా కెసియార్ సాధించలేనిది, మూడు రోజుల్లో మేం సాధించాం అని కాంగ్రెస్‌వారు బోర విరుచుకుని తిరిగేవారు. రాష్ట్రం సాధించేవారా లేదా అంటే చెప్పలేం. ఎందుకంటే ఆ ప్రకటన తర్వాత జరిగిన సంఘటనలు వారి చేతిలో లేవు. కానీ ప్రకటనకు రావలసిన ఘనతంతా వారి ఖాతాలోనే పడేది కదా!

కానీ అలా జరగలేదు. మొత్తమంతా కెసియార్‌కు కట్టబెట్టింది హై కమాండ్. దీన్నే ప్రశ్నించారు పొన్నం. ఆ తర్వాత తమ పొరబాటు గ్రహించాక వెనకడుగు వేయడం మొదలెట్టారు. వెనక్కి వెనక్కి వెళ్లిపోతున్నారు. దానివలన వచ్చిన అప్రతిష్టంతా టికాంగ్రెస్ నాయకులు భరించవలసి వస్తోంది. అందుకే వాళ్లకు ఆక్రోశం. అప్పుడు పొరబాటు చేశారు కాబట్టి దానికి ఫిక్సయిపోండి అంటారు వాళ్లు. అబ్బే అలా ఎలా? ఇక్కడా పోయి, ఆంధ్రప్రాంతంలోనూ పోతే మేమేం చేయాలి అంటోంది హై కమాండ్. అక్కడ పోయినా యిక్కడైనా మీరు అగ్రస్థానంలో వున్నారా అంటే అదీ లేదు కదా అంటోంది. దానికి వీళ్ల దగ్గర సమాధానం లేదు. తెలంగాణ ప్రకటిస్తే మేమే నంబర్ వన్ అని అంటూనే వాళ్ల మాటలు వాళ్లకే విశ్వసనీయంగా తోచక, 'కెసియార్ మన పార్టీలో కలుస్తే…' అని చేరుస్తున్నారు. కలవాలంటే ఆయనెందుకు కలుస్తాడు? ఆయనేమైనా చిరంజీవా?

కెసియార్ చిరంజీవి కాదు, రాజకీయజీవి. హి కెన్ బ్లో హాట్ అండ్ హీ కెన్ బ్లో కోల్డ్. ఆయన దృష్టి తెలంగాణ తెచ్చిపెట్టడంపై కాదు, తెలంగాణను తెచ్చుకుని పాలించడంపై వుంది. తనకు బలం పెరిగేవరకూ ఈ సందిగ్ధం యిలాగే కొనసాగాలి. 2014 నాటికి రాజకీయలబ్ధి పొందాలి.

వీరతెలంగాణ వాది ఐన ఆంధ్రజ్యోతి ఎడిటర్ యీ మధ్య సంపాదకీయంలో రాశారు – 'ఇప్పట్లో తెలంగాణ యివ్వం అని మన్‌మోహన్ అంటే ఒక్క ఆత్మహత్యకూడా రిపోర్టు కాలేదు. అంతకంటె చిన్ననేతల మాటలకు కూడా నిస్పృహ తీవ్రస్థితికి వెళ్లిన ఉదంతాలున్నాయి. నిస్పృహ కూడా తెలియనంత షాక్‌లోకి, నిర్లిప్తతలోకి తెలంగాణ సమాజం వెళ్లిందాని అనుమానం వచ్చింది. ఈ వాతావరణంలో చంద్రబాబు తెలంగాణలో పర్యటిస్తున్నారు, తెలంగాణ గురించి సంజాయిషీ యిచ్చుకునే సందరరే కూడా ఎదురు కావడం లేదు. ఇందుకు కారణం – అన్ని అభిప్రాయాల వారినీ యథేఛగా సంచరించనివ్వాలన్న ప్రజాస్వామికస్ఫూర్తి కాకుండా, ఉద్యమగమనంలో ఎదురయిన నిర్వేదం, జడత్వం కారణం కావడం విచారకరం. మన్మోహన్ వ్యాఖ్యలకు కెసియార్ నుండి వచ్చిన స్పందన కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామనే శపథాలు మాత్రమే. వాటి అర్థం ప్రజా ఉద్యమం నుండి రాజకీయవ్యూహం దిశగా తెలంగాణ మార్గాన్ని మళ్లించడమే…' అని.

తెలంగాణపై నిర?యం ఆలస్యం కావాలని కెసియార్ భావిస్తున్నారని అర్థమవుతోంది. దీనికి తగ్గట్టు కాంగ్రెస్ కూడా వ్యవహరిస్తోంది. దారాన్ని చిక్కుముళ్లు వేసేసి యిప్పుడు విప్పాలని చూస్తోంది. ఇక్కడ విప్పితే దేశంలో మరో చోట ముడి పడుతుందని భయం. ఇలాగే కాలం నెట్టేద్దామని చూస్తోందనే తెలుస్తోంది. అందుకే పార్లమెంటులో టికాంగ్రెస్ ఎంపీలు ఎంత రగడ చేసినా ఏమీ చేయడం లేదు. వాళ్ల మాటా మన్నించదు, వాళ్లపై చర్యా తీసుకోదు. చర్య తీసుకుంటే వాళ్లను హీరోలను చేసినట్టు అవుతుంది కదా! కాంగ్రెస్‌నుండి బయటకు వెళ్లిన జూపల్లికి రేపు ఉపయెన్నికలో ఎన్ని ఓట్లు వచ్చాయో చూస్తే అప్పుడు వీళ్లూ హీరోలవుతారో లేదో తెలుస్తుంది. కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి విషయంలో కూడా అలాటి ప్రయోగం చేద్దామని హై కమాండ్ ముచ్చట పడింది కానీ రాజగోపాలరెడ్డి 'ఫౌల్, ఫౌల్' అని అరిచేశారు. తక్కినవాళ్ల రాజీనామాలు నిరాకరించి నాదెందుకు పెండింగ్‌లో పెట్టారు? అని స్పీకరు వద్ద వాపోయారు. ఆయన సోదరుడిపై కూడా ప్రయోగం చేసే అవకాశం వుంది. అప్పటిదాకా టికాంగ్రెస్ ఎంపీల పదవులు పదిలమే.

అసెంబ్లీలో టి కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేత కూడా యిలాటి విన్యాసాలు చేయించి అసెంబ్లీ ప్రొసీడింగ్స్ సాగకుండా చూడవచ్చు. అసెంబ్లీలో అవిశ్వాసతీర్మానంను ఎదుర్కొన గలిగే సత్తా వున్నపుడు కాంగ్రెస్‌కు యిలాటి ట్రిక్కులు వేయవలసిన పనేముంది? అన్న అనుమానం వస్తుంది కదా. అందునా జగన్ తరపు ఎమ్మెల్యేల సంఖ్య తగ్గిపోయింది అని నిరూపించే అవకాశం వచ్చినపుడు విడిచి పెడుతుందా? అని ఆశ్చర్యపడతాం కదా. నిజానికి కాంగ్రెస్‌వారు ప్రధానప్రతిపక్షమైన టిడిపి గురించి ఆలోచించాలి. కానీ టిడిపికి, కాంగ్రెస్‌కు చక్కటి అమరిక కుదిరింది. ఇద్దరికీ యిప్పట్లో ఎన్నికలు అక్కరలేదు. టిడిపికి యిమేజి పోకుండా వుండాలి. అందువలన అవిశ్వాసం పెట్టాలి, అది వీగిపోవాలి. కాంగ్రెస్సే అధికారంలో కొనసాగాలి. ఆ విధమైన పరిస్థితి వచ్చినపుడే వీరు అసెంబ్లీ ఏర్పరుస్తున్నారు, వారు అవిశ్వాసం పెడుతున్నారు.

అయితే మధ్యలో జగన్ గొడవ వచ్చింది. అవిశ్వాస తీర్మానంపై ఓటింగు పెడితే దానికి అనుకూలంగా ఓటేసే జగన్ వర్గీయులు (ఎంతమందైనా కానీయండి) వారిపై వేటు వేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కు వుంది. వేయకపోతే జగన్‌కు లోకువై పోయినట్టే. వేస్తే వాళ్ల స్థానాల్లో ఉపయెన్నికలు వస్తాయి. అలా ఉపయెన్నికలంటూ వస్తే ఎన్నిట్లో వస్తాయి? జగన్ తరఫున 20 ప్లస్ మంది వున్నారంటున్నారు. వారిలో 10 ప్లస్ మందో, కనీసం 5 ప్లస్ మందో విప్ ధిక్కరించారనుకుందాం. వారిని పార్టీలోంచి బహిష్కరించాలి కదా, ఉపయెన్నికలను ఎదుర్కోవాలి కదా. ఆ అయిదో, ఆరో స్థానాలు రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుండి వుండేట్లా జగన్ ప్లాను చేశారనుకోండి. పైగా కాండిడేట్స్ కూడా తప్పకుండా తిరిగి ఎన్నికయ్యే సత్తా వున్నవాళ్లనే ఎంపిక చేసి వాళ్లనే విప్‌కు వ్యతిరేకంగా ఓటేయమన్నారనుకోండి.

వాళ్లు ఉపయెన్నికలలో నెగ్గితే, అధమం వారిలో 75% మంది నెగ్గినా, కాంగ్రెస్ కొంప మునిగిందే. ఎందుకంటే తెలంగాణలో ఎలాగూ ఉపయెన్నికలు రాబోతున్నాయి. తెరాసలోకి వెళ్లిపోయిన వారి రాజీనామాలను స్పీరు ఆమోదించారు కదా. అవి పాత తెరాస స్థానాలు కాదు, కొత్త స్థానాలు. అక్కడ ప్రస్తుతం ఉద్యమం బలంగా వుండడం బట్టే ఆ ఎమ్మెల్యేలు అటు తిరిగి వుంటారు. అక్కడ వాళ్లు తెరాస టిక్కెట్టుపై మళ్లీ ఎన్నికవడం ఖాయం. మెజారిటీ అలాగే వుంటుందా, తగ్గుతుందా అన్నదే ఆలోచించాలి తప్ప గెలుపు నిశ్చయం.

ఉపయెన్నికలలో అటు తెలంగాణలో, యిటు కోస్తా, సీమల్లో కాంగ్రెస్ ఓడిపోయిందంటే కిరణ్ సీటు కదలడం సహజపరిణామం. కిరణ్ వ్యవహారశైలి వల్లనే యిలా జరిగిందని, ఆయన్ని అర్జంటుగా మార్చకపోతే కాంగ్రెస్ ఊడ్చిపెట్టుకుపోతుందని ఆశావహులు నానాయాగీ చేస్తారు. తమ పంతం చెల్లకపోతే జగన్‌వైపు వెళతామని బెదిరిస్తారు కూడా. తెలంగాణలో అయితే తెరాస, కోస్తా, సీమల్లో జగన్ తలుపులు బార్లా పెట్టుకుని కూర్చున్నారు. ఇందాకా అనుకున్నట్టు జగన్ అభ్యర్థులు పోటీ చేసిన స్థానాల్లో 75% గెలిచినా ప్రజలంతా అటు వున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. ఇప్పటిదాకా ఆ పార్టీ తరఫున జగన్, విజయమ్మ గెలిచారు. కానీ అది పెద్ద విశేషం కాదు. వాళ్లు గెలుస్తారని ఎలాగూ అనుకున్నారు. కానీ అంత మెజారిటీ వస్తుందని అనుకోలేదు. ఇప్పుడు నాలుగైదు స్థానాల్లో జగన్ కాండిడేట్స్ గెలిచారంటే జగన్‌వైపు వలసలు ప్రారంభమవుతాయి.

కిరణ్ కోణం లోంచి చూస్తే యిదంతా రిస్కుతో కూడుకున్న వ్యవహారం. అందువలన అవిశ్వాసంపై ఓటింగు లేకుండా చూడడానికే ఆయన ప్రయత్నించవచ్చు. ఒకవేళ ఓటింగు జరిగి, జగన్ వర్గీయులు విప్ ధిక్కరించినా వారిపై చర్య తీసుకోవాలని అనుకోకపోవచ్చు. కానీ మధ్యలో బొత్స వున్నారు. ఉపయెన్నికల భయం కిరణ్‌కు వుంది కానీ ఆయనకు లేదు. నిజానికి ఆయనకు కావలసినదే అది – వాళ్లపై చర్య తీసుకుందామని పట్టుబట్టవచ్చు.

కిరణ్ పద్ధతి బాగా లేని కారణంగా ఆయనతో విభేదిస్తున్నట్టు, కాబినెట్‌లో నిలదీసినట్టు పత్రికల్లో వార్తలు వచ్చేలా ఆయన చూసుకుంటున్నాడు. కిరణ్ ఫెయిల్యూర్స్ తనను అంటకుండా ముందే జాగ్రత్తపడుతున్నారు. ఉపయెన్నికలంటూ వస్తే కిరణ్ ఎదుర్కోలేడని బాగా ప్రచారం జరిగిపోతే యింత చేసినా బొత్సను ఎంపిక చేయకపోవచ్చు. ప్రత్యేక తెలంగాణ యివ్వనక్కరలేదని హై కమాండ్ అనుకుంటే దానికి ప్రత్యామ్నాయంగా తెలంగాణ పట్ల కొన్ని జెస్చర్స్ చూపవలసి వుంటుంది. దానికి గాను తెలంగాణ నాయకుణ్ని సిఎం చేయడం ఒకటి. అదే జరిగితే అటు కిరణ్, యిటు బొత్స యిద్దరూ ఘొల్లుమంటారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

రిటైల్ రంగంలో ఫారిన్ డైరక్ట్ యిన్వెస్ట్‌మెంట్స్ గురించి మీ 'టేక్' ఏమిటి అని నాకు చాలామంది లేఖలు రాస్తున్నారు. అపోజిషన్ వాళ్లే కాదు, రూలింగ్ పార్టీలో కొందరు కూడా దాన్ని వ్యతిరేకిస్తున్నప్పుడు దాన్ని సమర్థిస్తూ రాయడం కొంత దుస్సాహసమే. కానీ నేను సమర్థిస్తున్నాననే చెప్తున్నాను. అందరూ అన్నదానికి భిన్నంగా మాట్లాడితే ప్రత్యేకత వుంటుందన్న లెక్కలేవీ లేవిక్కడ. స్థిరమైన కన్విక్షన్‌తోనే రాస్తున్నాను. నా అభిప్రాయాలు నా పాఠకులకు చేరతాయి తప్ప నిర?యాలు తీసుకోవలసిన వారెవరూ యివి పట్టించుకోరు. వాళ్లకు యిప్పటికే ఏదో ఒక అభిప్రాయానికి వచ్చేసి వుంటారు. మన్‌మోహన్‌గారు అమెరికా ఒత్తిడికి లొంగారా, ఏకపక్షంగా నిర?యం తీసుకున్నారా, మిత్రపక్షాలను సంప్రదించలేదా వంటి ఫైనర్ పాయింట్స్ జోలికి నేను వెళ్లటం లేదు. కాబినెట్ నిర?యం అంటున్నపుడు దానిలో మిత్రపక్షాల మంత్రులు కూడా వుంటారు కదా, మరి వాళ్లకు తెలియకుండా నిర?యం తీసుకున్నారని ఎలా అంటారో నాకు తెలియదు. బిజెపివాళ్లు అప్పుడు సమ్మతించి, యిప్పుడు వ్యతిరేకించడం ఏమిటని అడగను. నేను బ్రాడ్‌గా మాట్లాడి వదిలేస్తాను.

విదేశీ పెట్టుబడులు మనం ఎందుకు వ్యతిరేకిస్తున్నాం? స్థానిక పరిశ్రమలకు, వ్యాపారాలకు దెబ్బ తగులుతుందన్న భయంతో ! గతంలో విదేశీయులు యిలాగే వ్యాపారం పేరుతో వచ్చి దేశాన్ని అక్రమించారు కాబట్టి, యిప్పుడు మళ్లీ ఆక్రమిస్తారు, మనవాళ్ల జీవికకు భంగం కలుగుతుంది అనే భయంతో వద్దంటున్నాం. దీన్నే స్థూలంగా ప్రొటెక్షనిజం అనుకుందాం. చిన్నవాళ్లను కాపాడుకోవడానికి ప్రభుత్వం పెద్దవాళ్లను రాకుండా అడ్డుకోవాలి అనే థియరీ ఇందిరా గాంధీ హయాం వరకు ముమ్మరంగా నడిచింది. అప్పుడు జరిగిందేమిటో ఒక్కసారి గుర్తు చేసుకుని చూడండి. అప్పటికీ యిప్పటికీ ప్రపంచంలో వచ్చిన మార్పులు చూడండి. అప్పట్లో ప్రభుత్వం కుటీరపరిశ్రమలకై (కాటేజి ఇండస్ట్రీస్) కొన్ని ఉత్పాదనలు, చిన్నతరహా పరిశ్రమలకై (స్మాల్ స్కేల్ యిండస్ట్రీస్) కొన్ని ఉత్పాదనలు రిజర్వ్ చేసి, భారీ పరిశ్రమల వాళ్లు వీటి జోలికి వెళ్లకూడదు అంది. అప్పుడు భారీ పారిశ్రామిక వేత్తలు పెద్ద గోల చేసేవారు. చిన్న పరిశ్రమలకు యిలా రక్షణలు కల్పించడం తప్పు, యింకేం ప్రజాస్వామ్యం అంటూ.

అంతలో విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తున్నాం అన్నారు – వాళ్లు వచ్చి ఇక్కడ పరిశ్రమలు పెట్టేస్తారేమోనన్న ఆశతో. జరిగిందేమిటంటే అమెరికావాడు, జర్మనీవాడు రాలేదు కానీ ఎన్నారై స్వరాజ్ పాల్ వచ్చి ఎస్కార్ట్స్ వంటి కంపెనీల షేర్లు భారీగా కొనిపారేసి, కంపెనీలను హస్తగతం చేసుకోబోయాడు. దాంతో యీ భారీపరిశ్రమల వాళ్లు మాకు రక్షణ కావాలీ అంటూ గోల మొదలుపెట్టారు. అంటే నీ చేయి పైన వున్నంతసేపు నువ్వు రిజర్వేషన్లు ఎందుకండీ అంటావు. నీ తలదన్నేవాడు రాగానే నాకు రిజర్వేషన్ కావాలి అంటావు. ఏమిటీ డబుల్ స్టాండర్డ్స్? పరిశ్రమల్లో విదేశీ పెట్టుబడులు ఆహ్వానించాలి అని కొన్ని పత్రికలు రాసేవి. సరే అయితే ప్రింటు మీడియాలో కూడా అనుమతిస్తాం అంటే వద్దు వద్దు అని గోలపెట్టేశాయి. దేశసార్వభౌమత్వానికి ముప్పు వచ్చేస్తుందట ! దేశసార్వభౌమత్వాన్ని పత్రికలే కాపాడుతున్నట్టు ! ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియాలో విదేశీ పెట్టుబడులు వచ్చేశాయి. కొత్తగా మునిగిన కొంపేముంది? ఎఫ్ టీవీ వంటి ఛానెల్స్ వలన అశ్లీలత పెరిగింది అంటారా, మన భారతీయ ఛానెల్స్ 'మిడ్‌నైట్ మసాలా' కార్యక్రమాలేమిటి? మన తెలుగు సినిమాలేమిటి? అశ్లీలత లేకుండా శుద్ధంగా వున్నాయా?

ఎంతవరకు రక్షణ కల్పించాలి అన్నది చాలా విస్తృతమైన అంశం. అందుకే మధ్యేమార్గంగా 51% అంటున్నారు మన్‌మోహన్. 26% అని బిజెపివారు గతంలో అన్నారట. ఏ రంగంలో ఎంత అనుమతించాలి అన్నది అందరూ కలిసి చర్చించి నిర?యించాలి. ప్రజలకు ఎంతో ముఖ్యమైన, ప్రాణాలు కాపాడే ఔషధరంగంలో 100% అనుమతించి స్వదేశీ కంపెనీలను గంపగుత్తగా కొనగలిగే అవకాశాన్ని విదేశీ కంపెనీలకు కల్పించి, కాలక్రమంలో ఔషధాల ధరలు పెరిగేందుకు దోహదపడినప్పుడు ప్రతిపక్షాలు ఎందుకు ఊరుకున్నాయి? అది డైరక్టుగా ఇవాల్టికి యివాళ ప్రజలను ప్రభావితం చేయడం లేదు కాబట్టి ! చిల్లర దుకాణం అంటే రోజూ పనిబడేది కాబట్టి ఆ రంగంలో పెట్టుబడి గురించి యింత పట్టుబడుతున్నారు. చిల్లర దుకాణాలు, చిల్లరగానే వుండాలా? పెద్దదవకూడదా?

ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి – 20 ఏళ్ల క్రితం చిల్లర దుకాణాలు తక్కువస్థాయిలోనే వుండేవి. ఏదైనా కొనడానికి వెళితే కనీసం పావుగంట పట్టేది. యజమాని గల్లాపెట్టె దగ్గర కూర్చుని, షాపులో కుర్రాళ్ల మీద కేకలు వేస్తూ వుండేవాడు. అడిగిన పదినిమిషాలకు వాడు పట్టుకుని వచ్చి సరిగ్గా తూచీ తూచక మొహాన్న పడేసేవాడు. షాపులో ఏ వస్తువుందో, ఏం లేదో, కొత్త తరహా ఉత్పాదనలు ఏమైనా వచ్చాయో లేదో తెలిసేది కాదు. పప్పుల్లో, ఆవాల్లో, రవ్వలో విపరీతమైన కల్తీ. నెలసరి వెచ్చాల గురించి వెళితే యించుమించు ఓ పూట పట్టేది.

ఆ తర్వాత సూపర్ మార్కెట్లు వచ్చాయి. వస్తువులు కొనడం సరదా అయిపోయింది. కిరాణా దుకాణానికి యింట్లో ఆడవాళ్లు వచ్చేవారు కారు, వెళ్లి పట్టుకుని రమ్మనమని ఆ తర్వాత వాటి క్వాలిటీ బాగా లేదని సాధించేవారు. సూపర్ మార్కెట్లు వచ్చాక వస్తువులన్నీ షోగ్గా అమర్చడంతో ఆడవాళ్లు కూడా రాసాగారు. మార్కెట్లో ఏమేమి వచ్చాయో తెలుసుకునేవారు. కొనుగోలు యిబ్బడిముబ్బడిగా పెరిగింది. అమ్మే వస్తువుల నాణ్యత బాగుపడింది. ఇంటికి తీసుకుని వచ్చి బాగుచేసుకునే శ్రమ తప్పింది.

చిల్లర దుకాణాలు, కిరాణా దుకాణాలు ఒక కులంవారి చేతిలో అధికంగా వుండేవి. తరతరాలుగా అదే వృత్తిలో వుండేవారు కాబట్టి పరపతి వుండేది. వారికి అరువుపై వస్తువులు దొరికేవి. ఈ దుకాణాల్లో లాభాలు వచ్చి డబ్బు బాగానే గడించేవారు. సూపర్

మార్కెట్ కాన్సెప్ట్ వచ్చినపుడు వాళ్లు దీన్ని అంది పుచ్చుకోలేదు.  అనేక కులాలవారు దీనిలో చొరబడ్డారు. కొత్తగా వచ్చారు కాబట్టి వాళ్లకి అరువుపై వస్తువులు దొరకడం కష్టమైంది. అయినా రిస్కు తీసుకుని పెట్టారు. డిస్‌ప్లే బాగుంటుందనే భావనతో వస్తువుల తయారీదారులు వీళ్లని ప్రోత్సహించారు. వెరైటీ వుంది, క్రెడిట్ కార్డు ఫెసిలిటీ వుంది కాబట్టి కన్స్యూమర్లు ఆదరించారు.

ఈ సూపర్ మార్కెట్‌వాళ్లల్లో కొందరు నిలదొక్కుకున్నారు, కొందరు పడిపోయారు. కానీ నిలదొక్కుకున్నవాళ్లని చూసి కిరాణా దుకాణాల వాళ్లు తిట్టుకున్నారు – మేం యింకా పావలా పప్పుబెల్లాల పొట్లాలు, 'అద్దరూపాయి' కిరసనాయిలు సీసాలు పట్టుకుని వేళ్లాడుతున్నాం. వాళ్లు లక్షలు లక్షలు గడించేస్తున్నారు అని. వీళ్ల దగ్గర డబ్బున్నా చొరవ, ఎంటర్‌ప్రైజ్ లేకపోయింది. అందుకని వాళ్లంతా కలిసి సూపర్ మార్కెట్లు పెట్టకూడదు అని ఆందోళన చేసి వున్నారనుకోండి, ఎలా వుండేది? అలాగే హైపర్‌మార్కెట్లు వచ్చినపుడు సూపర్‌మార్కెట్లు మూతపడతాయి అనుకున్నారు. పడ్డాయా? లేదే ! రేపు విదేశీ పెట్టుబడులతో నాలుగువీధులు పట్టేటంత షాపులు వచ్చాయనుకోండి, హైపర్ మార్కెట్లు మూతపడతాయా? పడవు.

ఎందుకంటే దేని మార్కెట్టు దానికి వుంటుంది. ఎక్కడ చూసినా సూపర్ మార్కెట్లే అనుకుంటాం – సిటీలో చూసి ! అలా అని కిరాణా దుకాణాలు మాయమయ్యాయా? గ్రామాల్లో, టౌన్లలోనే కాదు, సిటీల్లో కూడా కొత్తవి వస్తూనే వున్నాయి. వాటికి వెళ్లేవాళ్లు వాటికి వెళతారు. సూపర్ మార్కెట్లో క్వాలిటీ ఉత్పాదనలు దొరుకుతాయి, కానీ ఖరీదెక్కువ. కిరాణా దుకాణంలో పొట్లం కట్టి ఓ మాదిరి క్వాలిటీ ఉత్పాదన యిస్తాడు, తక్కువ ధరకు. నీకు టైముంటే తక్కువ ధరకు కిరాణా దుకాణంలో వస్తువు కొనుక్కుని యింట్లో బాగు చేసుకుంటావు. టైము లేదు కానీ డబ్బుందంటే సూపర్ మార్కెట్‌కి వెళతావు.

తిరుపతిలో దర్శనానికి టిక్కెట్టు వుండడం చూసి నా నార్త్ ఇండియన్ ఫ్రెండ్స్ వెక్కిరిస్తారు – దేవుడి దగ్గర అందరూ సమానమంటూనే యీ విధానం ఏమిటని. 'రైల్లో ఏం చేస్తున్నావ్? ఓపికుంటే స్లీపర్‌లో వెళతావు, లేకపోతే ఏసీలో వెళతావు. తిరుపతిలో నీకు టైముంటే ధర్మదర్శనానికి వెళ్లవచ్చు, డబ్బుంటే స్పెషల్ దర్శనానికి వెళ్లవచ్చు. రెండు ఆప్షన్లూ వున్నాయి. మీ వూళ్లో గుళ్లయితే డబ్బున్నా అందరితో బాటు తోసుకుంటూ చూడాల్సి వస్తుంది. అక్కడ ఆప్షన్ లేదు. దాని కంటె యిది బెటరు.' అని సమాధానం చెప్పేవాణ్ని. ధర్మదర్శనం మొత్తానికి కాన్సిల్ చేసినప్పుడు తప్పు పట్టాలి కానీ ఆప్షన్లు యిచ్చినపుడు బాధేమిటి?

కొత్త విధానం వలన ధరలు పెరిగిపోతాయంటారా? వెంటనే ప్రత్యామ్నాయాలు వస్తాయి. కుర్చీలు, బల్లలు, వెయిటర్లు, మెనూ కార్డులు వున్న హొటల్లో ధరలు పెరిగినపుడు దర్శిని హొటళ్లు అని వచ్చి సెల్ఫ్‌సర్వీసుతో నిల్చోబెట్టి టిఫెను తినిపించి పంపుతున్నాయి. ధర తక్కువ. స్వగృహ ఫుడ్స్ అని వచ్చాయి. కర్రీ పాయింట్లు వచ్చాయి. బ్రహ్మచార్లే కాదు, ఇద్దరూ ఉద్యోగం చేసేవాళ్లు కూడా యింట్లో అన్నం వుడకేసుకుని కర్రీ పాయింటునుండి కూర తెచ్చుకుని కాలక్షేపం చేసేస్తున్నారు. ధరలు పెరిగితే యిచ్చేయడానికి కన్స్యూమర్ అంత వెర్రివాడేమీ కాదు. ఈ ఫ్రెష్ అని, ఆ ఫ్రెష్ అనీ సూపర్‌మార్కెట్లలో ఏసి పెట్టెల్లో అమ్మే కూరగాయలు నచ్చకపోతే రైతుబజారుకి వెళ్లి కొనుక్కుంటున్నాడు. తమ దగ్గరకు వస్తున్నాడు కదాని రైతుబజారు వాళ్లు తూకంలో మోసం చేస్తే వాళ్ల గొయ్యి వాళ్లు తవ్వుకున్నట్టే. కిరాణా షాపుల వాళ్లు కూడా తూకం విషయంలో జాగ్రత్తగా వుండి, ఎమ్మార్పీలపై మార్జిన్ తగ్గించుకుని అమ్మితే అక్కడా కొంటాం.

సృష్టిలో ప్రతి జీవికి సర్వైవల్ యిన్‌స్టిన్క్ట్ వుంటుంది. చిన్నచేపను పెద్ద చేప మింగేస్తుంది. అంతమాత్రం చేత చిన్న చేప బతకటం లేదా? పెద్ద చేప తిమింగలం నుండి తనను తాను కాపాడుకోవడం లేదా? కప్పల్ని తినకూడదు, వెజిటేరియన్‌గా వుండు అని పాముల్ని ప్రకృతి శాసిస్తోందా? కప్పలు ఎలా బతకాలో కప్పలకే తెలుసు. ఊసరవెల్లికి రంగులు మార్చే లక్షణం ఎందుకు అబ్బింది? జిరాఫీలకు మెడ పొడుగ్గా ఎందుకైంది? అవసరం ! అవసరం అన్నీ నేర్పుతుంది. ప్యూపా దశలో గుడ్డు పగలకొట్టుకుని బయటకు రావడానికి కీటకం తన రెక్కలను విపరీతంగా కొట్టుకుంటుంది. అది పడే శ్రమ చూడలేక ఓ విద్యార్థి తనే ఆ గుడ్డు పగలకొట్టి కీటకాన్ని బయటకు తీసుకుని వచ్చాట్ట. అది కాస్సేపటిలోనే చచ్చిపోయిందట.

ఎందుకంటే అలా రెక్కలు కొట్టుకునే క్రమంలోనే అది బలాన్ని సంతరించుకుంటుంది. చిన్నపిల్లవాడు నడిస్తే పడిపోతాడని, ఎత్తుకు మోస్తే వాడి కాళ్లు చచ్చుపడిపోతాయి. వాడు పెద్దవాడయ్యాక హాస్టలుకి పంపితే చెడిపోతాడని యింట్లోనే వుంచుకుంటే లోకజ్ఞానం పెరగదు. అమెరికాకు పంపిస్తే తెల్లదొరసానిని తగులుకుంటాడన్న భయంతో ఉన్న ఊళ్లోనే వుంచేస్తే ఎదుగుదల అంతగా వుండదు. నడవడంలోగాని, సైకిల్ తొక్కడంలో గాని, హాస్టల్‌లో గాని, అమెరికాలో గాని రిస్కులు లేవా? తప్పకుండా వుంటాయి. దెబ్బ తినేవాళ్లూ వుంటారు, నిలదొక్కుకునేవాళ్లూ వుంటారు. కానీ ఆ పోరాట లక్షణమే లేకపోతే జీవితమే లేదు.

మామూలు క్రిమికీటకాలకే పోరాటలక్షణం వున్నపుడు మరి చిన్న వ్యాపారికి వుండదా!? సూపర్ మార్కెట్టు వాడు అరువుమీద సరుకులు యివ్వడు. కిరాణా కొట్టువాడు యిస్తాడు, మీరు ఆ కాలనీలోనే వుంటారు కాబట్టి. అసలు వాళ్లు అమ్మిన వస్తువులపై పన్నులు కట్టడానికి సిద్ధపడి క్రెడిట్ కార్డులు యాక్సెప్ట్ చేయడానికి సిద్ధపడితే వాళ్ల వ్యాపారం యింకా పెరుగుతుంది – హోం డెలివరీ సౌకర్యం కూడా అందిస్తాడు కాబట్టి ! కూరల ధరలు పెరిగిపోయాయంటున్నాం. కానీ కూలీనాలీ చేసుకునేవాళ్లు ఎలా బతుకుతున్నారు? ప్రతీ మార్కెట్టుకు ఓ చివర వాళ్లకు కూడా కొన్ని దుకాణాలుంటాయి. గోనెసంచిపై చిన్న చిన్న కుప్పలుగా కూరలు పెట్టి 5 రూ.లకు యీ కుప్ప, 10 రూ.లకు ఆ కుప్ప అని అమ్ముతారు.

అలాగే బట్టల విషయంలో కూడా. మీరు మూడు వేల రూపాయలు పెట్టి కొత్తరకం డిజైన్‌లో చీర కొన్నారనుకోండి. మూణ్నెళ్లు

_ తిరక్కుండా మీ పనిమనిషి అదే డిజైన్‌లో మూడు వందల రూపాయల్లో చీర కొని కట్టుకుని వస్తుంది. అది మూణ్నెళ్లే మన్నవచ్చు. కానీ యీ లోపున ఆమె మోజు తీరిపోతుంది. మూడు సార్లు కట్టేసరికి మీ మోజూ తీరిపోతుంది – పనిమనిషి కూడా కట్టుకుని వచ్చిన తర్వాత యీ చీర కట్టేం ప్రయోజనం అనే నిస్పృహతో ! అంటే మూడువేలలో మీరు పొందే కన్స్యూమర్ శాటిసాక్షనే, మూడు వందల్లో ఆమె కూడా పొందుతోందన్నమాట.

అలాగే షూస్, బ్రాండెడ్ చొక్కాలు, జీన్స్ – అన్నిటికీ యిమిటేషన్స్ వచ్చేస్తాయి. గుట్టలుగా పోసి పేవ్‌మెంట్ మీద అమ్మేస్తారు. ఇన్ని వున్నా డబ్బుండి దాన్ని ఖర్చుపెడదామనుకున్నవాడు యివి కొనడు. కస్టమర్లు తక్కువ, టక్ చేసుకున్న స్టాఫ్ ఎక్కువ వున్న కంపెనీ షోరూమ్‌కే వెళ్లి కొంటాడు. అక్కడ కొన్నామన్న స్పృహలో అతనికి ఆనందం. అక్కడ కొన్న చొక్కా పదేళ్లు వుండాలన్న బాధ అతనికేమీ లేదు. పదేళ్లు వున్నా చికాకే. అసలు యిప్పటి ట్రెండే అంత. హంబర్ సైకిల్ కొంటే ఓ తరం వెళ్లిపోతుందనేవారు. ఇప్పుడు అలా మార్కెట్ చేస్తే ఎవరూ కొనరు. లేటెస్ట్ ట్రెండ్ అని చెప్పాలి. ఏది ఏమైనా మార్పు సహజం అని, దానిని మనం ఆహ్వానిస్తూనే వుండాలని గ్రహించాలి.

కిరాణా దుకాణం వదిలేసి సూపర్ మార్కెట్ పెడదామన్న ఉత్సాహం మీకు వుండవచ్చు. కానీ మీ దగ్గర పెద్దగా డబ్బు లేదు, మార్కెట్‌లో పరపతి లేదు. మీరు అలాగే వుండిపోవాలా? మీ సత్తా గుర్తించి ఎవరైనా ముందుకు వచ్చి పెట్టుబడి పెడతానంటే వద్దు, రేపు నువ్వు మోసం చేస్తావ్ పొమ్మనాలా? ఇదెలా వుంటుందంటే డబ్బున్న ఓ పెద్దమనిషి వచ్చి ఓ తెలివైన కుర్రవాణ్ని మా పిల్లనిచ్చి పెళ్లిచేస్తా, ఇల్లరికం వుంటావా? అని అడిగినట్టు. స్ట్రింగ్స్ ఎటాచ్ చేయకుండా ఏ ఆఫరూ రాదు. మావగారు కలకాలం వుండడు లే, కాస్త డబ్బు వచ్చాక పేచీ పెట్టుకుని బయటకు వెళ్లిపోవచ్చులే అనే ధీమా వుంటే సరేననవచ్చు. ఎందుకంటే రేపటి మాట రేపు. నందో రాజా భవిష్యతి. నా తెలివితేటలతో రేపు నేనే నీకు పోటీగా అవుతానేమో అన్న ధైర్యం చూపాలి. ఇటలీలోని వెస్పా వారి సాంకేతిక పరిజ్ఞానంతో ఇండియాలో బజాజ్ తయారైంది. పోనుపోను వీళ్లు ఎంత టెక్నిక్ నేర్చారంటే, ఇటలీ వెళ్లి వెస్పా వాళ్లతో పోటీ పడ్డారు. మొదట్లో వెస్పా వారితో చేతులు కలపకపోతే ఆ పరిజ్ఞానం మనకు అబ్బేదా?

మనకు స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో నెహ్రూగారి యినీషియేటివ్‌తో మనం రష్యావారి నుండి టెక్నాలజీ నేర్చుకున్నాం. ప్రపంచంలో దాని కంటె మెరుగైనవి వుండవచ్చు. కానీ వాళ్లు మనని ఆమోదించలేదు. బొకారో స్టీల్ ఫ్యాక్టరీ వంటివి రష్యన్ సహకారంతోనే తయారయ్యాయి. ఈరోజు ఆ రంగంలో మనం చాలా ముందుకు వెళ్లాం. టాటావాళ్లు వెళ్లి కోరస్‌ను కొనేశారు. లక్ష్మీ మిత్తల్ బోల్డు కొనేశారు. మరి వాళ్లు కూడా మనల్ని చూసి భయపడి మీరు మమ్మల్ని కబళించేస్తారని భయపడితే..? కొంతమందికి విదేశీ.. అనగానే భయం. కమ్యూనిజం యిక్కడ పుట్టిన సిద్ధాంతం కాదు, మనకు నప్పదు అనేస్తారు. మరి హోమియోపతీ..? అల్లోపతీ..? చైనావాణ్ని నమ్మకూడదు. ఏభై ఏళ్ల క్రితం మనపై దాడి చేశాడు అంటారు. ఇది ట్రైబల్ మెంటాలిటీ. నాతో లేకపోతే నాకు వ్యతిరేకంగా వున్నావన్న అర్థం తీయడం లాటిది. మనం చూడవలసినది వర్తమానాన్ని, భవిష్యత్తుని. చరిత్ర తెలుసుకునేది ఎందుకంటే మనం జాగ్రత్తపడడానికి, భయపడి ముడుచుకుపోవడానికి కాదు.

మొదట్లో మనం చిన్నగా వున్నప్పుడు మనకు ఎవరో ఒకరు పుష్ యివ్వవలసిన అవసరం వుంటుంది. రాకెట్‌ను పంపించినప్పుడు తొలిదశలో చేయవలసినంత బ్లాస్ట్ మలిదశల్లో అక్కరలేదు. రాకెట్ తట్టుకోలేదేమోనని బ్లాస్ట్ తీవ్రత తగ్గిస్తే రాకెట్ ఎగరనే ఎగరదు. తొలిదశలో బ్లాస్ట్‌ను తట్టుకునేటంత సత్తా వుండేట్లా రాకెట్‌ను తయారుచేయాలి. కారు స్టార్ట్ చేసినపుడు ఫస్ట్ గేర్ కొద్ది సేపు వేసి ఇంజన్‌కు సత్తా యివ్వాలి. పెద్దవాడి సహాయం అనేది ఆ ఫస్ట్ గేర్ దశ లాటిదే. ఫస్ట్ గేర్‌లో వేయకుండా కారు నడిపేద్దామంటే కుదరదు. ఎవడైనా పెద్దవాడు వచ్చి మనకు సాయం యిస్తానంటే, మనకు పెట్టుబడి పెడతానంటే మనం అడిలి ఛస్తే ఎలా? వాడు మనకు ఏదైనా నేర్పిస్తున్నాడంటే ఎందుకు నేర్పిస్తున్నాడు? వాడి అవసరం బట్టి. శుక్రుడు కచుడికి మృతసంజీవనీ విద్య ఎప్పుడు నేర్పాడు? తన ప్రాణం మీదకు వచ్చాకనే కదా!

తర్వాత గుర్తించవలసినది – మన దగ్గర ఏదో ఒక సద్గుణం వుండబట్టే కదా వాడు వస్తున్నది ! కనబడిన ప్రతీవాణ్నీ వాడు పార్ట్‌నర్‌గా చేసుకోవడం లేదు కదా ! మీరు ప్రాధేయపడినంత కాలం వాడు మీ దగ్గరకు వచ్చాడా? మీకు పెట్టుబడి పెట్టాడా? లేదే ! ఇప్పుడు వచ్చాడు. అంటే మధ్యలో మీరు ఏదో ఒక విధంగా సత్తాను చాటుకున్నారన్నట్టేగా ! అంతేకాదు, మన దేశపు మార్కెట్టుపై కన్నుంది. ఎదుగుతున్న మధ్యతరగతిపై కన్నుంది. 'దేశం అప్పుల్లో మునిగిపోతోంది. వరల్డ్ బ్యాంక్ మనకు అప్పులిచ్చి చెడగొట్టేస్తోంది' అని వాపోతూ వుంటారు. మనకు క్రెడిట్ వర్దీనెస్ వుండకపోతే, అప్పు తిరిగి తీర్చే శక్తి లేకపోతే అవతలివాడు ఒక్క పైసా విదల్చడు. అది మనం మొదటగా గుర్తించాలి.

'నా మీద నాకు కంట్రోలు లేదు, అప్పు తీసుకున్నాక నేను ఒప్పుకున్న పనులు చేపట్టను, ఆ డబ్బుతో తాగి తందనాలాడతాను' అని అనుకుంటే అది నీ ఖర్మ. నీ మీద నీకు కంట్రోలు తెచ్చుకోకుండా వరల్డ్ బ్యాంకు అడ్డుపడడం లేదు. అప్పులు తీసుకోవడం ఎందుకు, తిరిగి కట్టడానికి అవస్థలెందుకు అనుకుంటే అంతకంటె మూర?త్వం లేదు. నీ ఆదాయంలో డబ్బు ఆదా చేసి అప్పుడు పనులు చేపడదామంటే దానికి ఏళ్లూ, పూళ్లూ పడతాయి. ఆ లోపున ప్రాజెక్టు వ్యయమూ పెరుగుతుంది. అందుకే ఎళీళీణం తీసుకోవడమూ అవసరమే, దాన్ని సక్రమంగా తీర్చడమూ అవసరమే.

గతంలో ఈ తెల్లవాళ్లు మనల్ని, మన తెలివితేటల్ని నమ్మారా? మనల్ని ఏబ్రాసుల్లా చూశారు. మా వరప్రసాద్ హెపటైటిస్–బి

వ్యాక్సిన్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌కై ఓ అమెరికన్ కంపెనీవాణ్ని అడిగితే ఓ గంటసేపు వెయిట్ చేయబెట్టి, గుండె బద్దలయ్యే రేటు చెప్పడంతో పాటు ఆ దొర గుండె కోసే మరో మాటన్నాడు – 'ఆ టెక్నాలజీ మీకిచ్చినా మీకేమీ వుపయోగపడదు. ఎందుకంటే దాన్ని అర్థం చేసుకోవడానికే మీ యిండియన్సుకి మరో పాతికేళ్లు పడుతుంది.' అని. నాలుగ్గేళ్లలో యీయన తెలుగు గడ్డ మీద స్వంత టెక్నాలజీతో, భారతీయ సైంటిస్టులతో, స్వంత ఫెసిలిటీలో వాళ్ల కంటె మెరుగైన వ్యాక్సిన్ డెవలప్ చేయించి వాళ్లమీదకే పోటీకి వెళ్లాడు. పదేళ్లు తిరిగేసరికి ఫారిన్ ఫార్మా కంపెనీలన్నీ యీయన కంపెనీలో వాటాలకు క్యూలు కట్టాయి. అంటే అర్థం ఏమిటన్నమాట? ఇఫ్ యూ ఆర్ ఏ నోబడీ, నో బడీ కేర్స్ యూ – ఇఫ్ యూ ఆర్ సమ్‌బడీ, ఎవ్రీబడీ కేర్స్ ఫర్ యూ. మన యిండియన్స్ ఇప్పుడు సమ్‌బడీల మయ్యాం. అది గుర్తించి వాళ్లు మన వెనక్కాల పడితే యిప్పుడు బెదిరిపోయి వాళ్లను తప్పించుకుని తిరిగితే ఎలా?
**(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 09** **ఎమ్బీయస్ : రిటైల్‌లో ఎఫ్‌డిఐ – 4/5**

వాళ్ల అవసరం ఏముంది, స్వశక్తితో మనంతట మనమే ఎదగవచ్చు కదా అంటారేమో. వరప్రసాద్ తనంతట తనే ఎదగడానికి చాలా కష్టపడవలసి వచ్చింది, చాలా టైము పట్టింది, అప్పుడు కూడా యింకో చిన్నస్థాయి విదేశీసాయం కావలసి వచ్చింది. అదే కనుక పెద్ద స్థాయిలో అందివుంటే ఎంతో మేలు జరిగి వుండేది. అలాటి అనేకమంది కృషి వలన యీ రోజు బ్రాండ్ ఇండియా ఏర్పడింది. మన మల్టీ టాస్కింగ్ ఎబిలిటీస్, బుద్ధిసూక్ష్మత పాశ్చాత్యులను ఆకర్షిస్తున్నాయి. మన వద్ద నిపుణులు కూడా తక్కువ ధరలకే లభిస్తారు. ప్రభుత్వపరంగా చాలా చిక్కులున్నా యిక్కడ వుండే ఎడ్వాంటేజెస్ యిక్కడున్నాయి. అవన్నీ పెట్టుబడి పెట్టేవాడు చూసుకుంటాడు. వచ్చిన అవకాశాన్ని ఎలా వినియోగించుకోవాలి అన్నది మనం చూసుకోవాలి.

ఏదైనా సరే చిన్నస్థాయిలో చేసినది చిన్నగానే వుంటుంది. కొన్నికొన్నిటికి భారీ పెట్టుబడులు అవసరం. చరఖాతో బట్టలు నేసి కట్టుకోవచ్చు. కానీ ఓడలు నిర్మించలేం కదా. సముద్రంలో పెట్రోలు అన్వేషించలేం కదా. నిజానికి మనకున్న సముద్రతీరం చాలా తక్కువదేశాలకుంది. వాళ్లంతా సముద్రాన్ని ఎన్నో విధాల ఉపయోగించుకుంటున్నారు. మనది సీ–ఫేరింగ్ నేషన్ కాదు. మనం నేర్చుకోవలసినది ఎంతో వుంది. సమకూర్చుకోవలసిన భారీయంత్రాలు ఎన్నో వున్నాయి. ఇప్పటికే ఆరితేరినవాళ్లతో చేతులు కలపకుండా చేతులు ముడుచుకుని కూర్చుంటే తెలివితక్కువే అవుతుంది.

ఎకనామిక్స్ చదివినవారికి తెలుస్తుంది, ఆపరేటింగ్ లెవెల్ అని ఒకటి వుంటుంది. ఆ స్థాయిలో చేస్తేనే వస్తువుల నాణ్యత మేన్‌టేన్ అవుతుంది, నిర్వహణ ఖర్చులు ఆదా అయ్యి ధరా తగ్గుతుంది. మీకు తెలుసా, క్వాలిటీ చెక్ చేసే యంత్రాలే చచ్చేటంత కాస్ట్‌లీగా వుంటాయి. అవి చిన్న ఫ్యాక్టరీ యజమానులు కొనలేరు. పర్యావరణాన్ని కాపాడవలసిన చర్యలు చేపట్టడం కూడా చిన్న పరిశ్రమలకు తలకు మించిన భారం. చిన్న స్థాయిలో మనుగడ కష్టం. మా "హాసం" పత్రికను ఏదైనా దినపత్రిక గ్రూపే టేకప్ చేసి వుంటే బతికి వుండేది. ఎందుకంటే దినపత్రిక వాళ్ల ప్రింటింగ్ మెషిన్‌కు రోజులో రెండు గంటలే పని. ఆ తర్వాత ఖాళీయే. ఆ స్పేర్ టైములో వీక్లీ అని, మంత్లీ అని, సినిమా పత్రిక అని, ఇంగ్లీషు వెర్షన్ అనీ బోల్డు కొట్టుకోవచ్చు. అన్నిటికీ కలిపి ఒకటే ఆఫీసు. మార్కెటింగ్, యాడ్ రెవెన్యూ పై ఖర్చులు అన్నిటిమీదా సర్దేస్తే ఓవర్‌హెడ్స్ తగ్గిపోతాయి. ఇవేమీ లేకుండా మనం లింగు లిటుకూ పత్రిక ఒకటి పెట్టుకుని బతుకుదామని చూస్తే మన బతుకు గుడుగుడుగుంచమే. పిట్టను కొట్టా – పొయ్యిలో పెట్టా అన్నట్టు వుంటుంది.

మేం గుడుగుడుగుంచంగానే బతుకుతాం, మాకు పోటీ లేకుండా చేయవలసిన బాధ్యత మీది అని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ఫన్నీగా వుంటుంది. ఈ మధ్య మన సినిమానిర్మాతలు చూడండి – డబ్బింగు సినిమాలపై పన్నులు పెంచేసి జనాలను చూడకుండా చేసేయాలిట. "మీరు తీసే దిక్కుమాలిన సినిమాలే ఆడిస్తే మేం థియేటర్లు మూసుకోవాలి. డబ్బింగ్ వాటివలనే బతుకుతున్నాం" అంటున్నారు సినిమాహాలు వాళ్లు. అంటే మనవాళ్లు తమ సినిమాలను ఒళ్లు దగ్గరపెట్టుకుని తీయడం మానేసి క్వాలిటీ గురించి పట్టించుకోకుండా డబ్బింగు సినిమాల మీద పడి ఏడుస్తున్నారన్నమాట.

వాళ్ల గోడు మనకు వినిపించే టీవీ ఛానెల్స్ కూడా డబ్బింగు సీరియల్స్‌ని ప్రోత్సహించేవే. డబ్బింగ్ సీరియల్స్ కూడా బ్యాన్ చేస్తే మన టీవీ ఆర్టిస్టులకు అవకాశాలు పెరుగుతాయిగా ! వాటి గురించి మాట్లాడరు. అంటే తమకు డబ్బింగ్ సీరియల్స్ అవసరం వుంది, కానీ డబ్బింగ్ సినిమాలు చూసే అవకాశం ప్రేక్షకులకు వుండకూడదన్నమాట. ఇదెక్కడి న్యాయం? డబ్బింగ్ అనుమతిస్తే మరి మన చిత్రపరిశ్రమ బతకడం అంటారా? పెద్ద సినిమాలు క్వాలిటీ పెంచుకోవాలి. చిన్న సినిమాలకు ఏసీ సౌకర్యం లేని, తక్కువ ధర టిక్కెట్లతో సినిమాలు చూపే వేరే రకమైన థియేటర్లు వుండాలి. అప్పుడు అన్ని రకాల సినిమాలూ మనగలుగుతాయి. మన యాక్టర్లు యితరభాషా చిత్రాలలో వేస్తున్నారంటే చంకలు గుద్దుకుంటూ, యితరులు మన సినిమాల్లో వేస్తే బాధపడడం దేనికి? పోటీని ఆపలేమని గ్రహించినప్పుడే మనం క్వాలిటీపై దృష్టి పెడతాం.

కేవలం ప్రభుత్వరంగంలోనే వున్నపుడు పరిశ్రమలు తెల్ల ఏనుగుల్లా ఎలా నడిచాయో చూశాం. అలా అని అంతా ప్రయివేటు రంగానికి కట్టబెట్టమని కాదు. మిక్సెడ్ ఎకానమీ వుండాలి. ప్రయివేటు, ప్రభుత్వరంగాలు పోటీ పడాలి. కలిసి ప్రాజెక్టులు చేయాలి.

ఎందుకంటే ప్రభుత్వం వద్ద పెట్టుబడి వుంది, ప్రయివేటు వద్ద యినీషియేటివ్ వుంది. పిపిపి పద్ధతి లేకపోతే మనకు యిన్ని హైవేలు ఏర్పడేవా? అంతెందుకు ఎఫ్‌డిఐలు వ్యతిరేకించే పత్రికలు మాత్రం ఫారిన్ న్యూస్ పేపర్లతో, సిండికేట్లతో టై అప్ పెట్టుకోవా? రాయిటర్స్ వంటి వార్తా సంస్థలలో సభ్యత్వం తీసుకోవా? మనవాళ్ల ప్రింటింగ్ క్వాలిటీ పెరగడంతో ఫారిన్ మేగజైన్స్ మన దగ్గర ప్రింటు చేయిస్తున్నారు. ఔట్‌లుక్‌కు, న్యూస్‌వీక్‌కు ఏదో ఒప్పందం కుదిరినట్టుంది.

ఇలాటివి యింకా పెరగాలంటే మనలో నిజాయితీ పెరగాలి. క్వాలిటీ కాన్షస్‌నెస్ పెరగాలి. ఎగుమతులు పెరిగితే దేశానికి మంచిదని ప్రభుత్వం రాయితీలు యిస్తే యిక్కడ తయారుచేయడం మానేసి, వేరే చోట నుండి దిగుమతి చేసుకుని స్క్రూ డ్రైవర్‌తో ఆ కంపెనీ లోగో పీకేసి మనది అంటించేసి ఎగుమతులు చేసే స్క్రూ డ్రైవర్ కంపెనీలు చాలా వున్నాయి. మొదటి కన్‌సైన్‌మెంట్ బాగా పంపించి, తర్వాత చెత్త పంపించి ఇండియా యిమేజ్ దెబ్బతీసే కంపెనీలూ వున్నాయి. అవే వస్తువులను అటూ యిటూ తిప్పుతూ ఉత్తుత్తి టర్నోవర్ చూపుతూ కస్టమ్స్‌లో రాయితీలు కొట్టేసే కైట్ ఫ్లయింగ్ కంపెనీలున్నాయి. వీళ్లందరినీ కఠినంగా శిక్షించి మన యిమేజి కాపాడాలి.

ఇవన్నీ మనవల్ల కాదు కాబట్టే, బయటవాణ్ని రానీయకుండా జాగ్రత్తపడదాం. ఇవాళ 51% వాటా అంటారు, అవసరమైతే పెంచవచ్చు అని చిన్న క్లాజు పెట్టి రేపు ఇంకా పెంచుతారు, ఎందుకొచ్చిన గొడవ యిదంతా, పొమ్మంటే పోలా అనే వాదన కరక్టు కాదు. ఇంట్లో పందికొక్కులున్నాయి, తలుపులు తీయవద్దు అంటే ఎలా? తలుపులు తీయాలి, గాలి, వెలుతురు రానివ్వాలి, పందికొక్కులను తరమాలి. లేకపోతే చీకటి వాతావరణంలో పందికొక్కులు మరింత పెరుగుతాయి. ఎక్కడా మోనోపలీ అనుమతించకుండా, చిన్నవాడు కూడా పోటీ చేయగల వాతావరణం సృష్టిస్తే చాలు.

ఈ భయాలు మనకే కాదు, అమెరికా వాడికీ వున్నాయి. వాళ్లూ ప్రొటెక్షనిజంతో రైతులను కాపాడుకుంటున్నారు. కానీ ఎంతకాలం? వాళ్ల పేటెంటు రెజిమ్‌లో మన ఫార్మావాళ్లు లూప్‌హోల్స్ కనిపెట్టి మార్కెట్‌లోకి దిగిపోయారు కదా. గ్లోబలైజేషన్ ప్రారంభించినపుడు వాళ్లు యితరుల యిళ్లలోకి వెళ్లిపోవచ్చనుకున్నారు పాపం. ఇది టూ–వే గేట్. ఇప్పుడు యితరులతో పోటీ పడలేక చేతులెత్తేస్తున్నారు. వాళ్లూ ఓటుబ్యాంకు రాజకీయాల్లో పడి కొట్టుకుంటున్నారు. అందుకే ఆర్థికవ్యవస్థ చితికిపోతోంది. ఐదు పదేళ్ల తర్వాత పరిస్థితి ఏమవుతుందో చూడాలి.

కోకోకోలాను అనుమతించారు. ధర తగ్గించి చిన్నవాటి నన్నిటినీ పడగొట్టేసింది. కబళించివేసింది. ఇప్పుడు ధర పెంచేసింది. ఇప్పుడు మళ్లీ సైకిల్ ప్రారంభమవుతుంది. ఏ వూరికి ఆ వూరికి తక్కువ ధరలో కూల్‌డ్రింక్స్ తయారుచేసే కంపెనీలు రావాలి. కోకోకోలా కంటె తక్కువ ధరలో యివ్వగలగాలి. చిన్న తరహా పేపర్‌మిల్స్, చిన్న తరహా పవర్ ప్రాజెక్టులు వచ్చినట్టే చిన్న తరహా కన్స్యూమర్ గూడ్స్ కూడా తయారవ్వాలి. క్వాలిటీ మేన్‌టేన్ చేస్తే కన్స్యూమర్ వాటిని ఆదరిస్తాడు.

రిటైల్ రంగంలో ఎఫ్‌డిఐలను అనుమతిస్తే చాలామంది జీవనభృతి పోగొట్టుకుని వాటిలో ఉద్యోగులుగా మారతారు అంటున్నారు. ఎందుకు పోతాయి? వాళ్లు అన్ని వస్తువులూ ఫారిన్ నుంచే తయారుచేసి పట్టుకురారు – కిట్టుబాటు కాదు కాబట్టి ! స్థానికంగానే సేకరిస్తారు. వీళ్లు వాళ్లకి యాన్సిలరీ యూనిట్లుగా మారతారు. జనాలకు నచ్చేవిధంగా ఎలా తయారుచేయాలో వాళ్లు వీళ్లకు నేర్పుతారు. మనకు కావలసినది ఆగ్రోప్రోడక్ట్సు. నిజానికి డబ్బు చలామణీ పెరిగిన తర్వాత తిండిపదార్థాలపై ఎంతో ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతున్నాం. క్వాలిటీ ఫుడ్ గురించి వెతుకుతున్నాం.

పల్లెటూళ్లు మళ్లీ పచ్చగా మారాలంటే కావలసినది ఉత్పత్తి పెంచడమూ కాదు, మద్దతు ధరా కాదు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ చేయడం ఎలాగో నేర్వాలి. అమూల్ విజయానికి కారణం అదే. పల్లెటూళ్లలో ప్రాసెసింగ్ యూనిట్స్ పెట్టి అక్కడ పండేవాటిని కొత్తరకమైన వంటకాలుగా మార్కెట్ చేయగలిగితే అర్బనైజేషన్ ఆటోమెటిక్‌గా తగ్గుతుంది. స్వగృహ ఫుడ్స్ వచ్చాక కొన్ని జిల్లాలకే పరిమితమైన కొన్ని వంటకాలకు అదుతేమైన మార్కెట్ వచ్చిపడింది. ఉలవచారు అలాటిదే. ఇప్పుడు హైదరాబాదులో ఉలవచారు లేకుండా ఏ కేటరరూ మెనూ తయారుచేయడం లేదు. పూతరేకులూ, మామిడి తాండ్రలూ, చిల్డ్ కొబ్బరినీళ్లు మార్కెట్ అవుతున్నాయి. ఓట్స్ బిస్కట్స్‌లాగ రేపు తెలగపిండి బిస్కట్లు కూడా తయారుకావచ్చు.

ఇదివరకు కాఫీ అంటే ఒకే ఐటమ్. ఈ రోజు కాఫీ డేకు వెళ్లి చూస్తే పదిరకాల కాఫీలు దొరుకుతాయి. డబ్బు ఖర్చు పెట్టడానికి జనాలు సిద్ధంగా వున్నపుడు వాళ్లని ఆకర్షించడానికి పలుమార్గాలున్నాయి. విదేశీయులతో సంపర్కం వలన మనకు ఆ ట్రిక్స్ తెలుస్తాయి. అప్పుడు మనమే వాళ్ల దేశాల్లో వెళ్లి షాపులు పెట్టవచ్చు. ఇప్పటికే అనేక దేశాల్లో ఇండియన్ రెస్టారెంట్లు పెట్టి అక్కడి స్థానికులను కూడా ఆకర్షిస్తున్నాం.

కొత్త టెక్నాలజీ వచ్చినపుడు అడ్డుకుంటే మనం నష్టపోతాం. ఒకప్పుడు కాసెట్స్ మాత్రమే వుండేటప్పుడు సోనీ పేర ఎన్నో నకిలీ కాసెట్లు వచ్చేవి. వీడియో కాసెట్లు వచ్చాయి. మంచివీ వచ్చాయి, చెత్తవీ వచ్చాయి. అవి చుట్టుకుపోతూ వుండేవి. ఇప్పుడు సిడిలు వచ్చాయి. మోసర్ బేర్ వంటి కంపెనీ మంచి క్వాలిటీతో అతి చౌకగా సిడిలు యివ్వడంతో నకిలీ సిడిల, పైరేటెడ్ సిడిల బెడద తప్పింది. అలాగే కెమెరాలు.. మన భారతీయులకు సృజనాత్మకత వుంది. దానికి టెక్నాలజీ మేళవించగలిగితే ప్రపంచ మార్కెట్‌లో అనేకానేక దేశాల్లో అవకాశాలు మనం అందిపుచ్చుకోవచ్చు.

రిటైల్ మార్కెటింగ్ టెక్నాలజీ కాదు కదా అనవద్దు. దీనిలో ఫుడ్ టెక్నాలజీ వుంటుంది. కొత్తదాన్ని దేన్నీ అడ్డుకోవద్దు. కానీ మన

రక్షణకు మనం జాగ్రత్తలు తీసుకోవాలి. సాహసాలు చేస్తేనే సర్కస్ ఆర్టిస్టుకు పొట్టగడుస్తుంది. అయితే దానికి తగ్గ జాగ్రత్తలు అతను తీసుకుంటాడు. నెట్ కట్టుకోవడం ఎందుకు, ట్రెపీజ్ విన్యాసాలు చేయడం దేనికి అనుకుంటే అతను సర్కస్‌కు పనికిరాడు, సర్కస్ బయట పల్లీలు అమ్ముకు బతకాల్సిందే. మనం పల్లీలు అమ్ముకుందామా? జీవితమే ఓ సర్కస్ అనుకుని బతుకుదామా?

చైనా ఎందుకు ఈ రోజు యీ స్థానంలో వుంది? మాన్యుఫాక్చరింగ్‌లో టాప్‌లో వుంది కాబట్టి ! యుద్ధానంతరం జపాన్ వేగంగా ఎందుకు పుంజుకుంది? కాటేజీ యిండస్ట్రీస్ వలన. మనం యిప్పటిదాకా ఐటీరంగంలో సేవలందించి పబ్బం గడుపుకుని వస్తున్నాం. ఇంకో ఐదేళ్లలో చైనావాళ్లు మనకంటె చౌకగా సేవలందిస్తే మన నోట్లో కరక్కాయే. మనం మాన్యుఫేక్చరింగ్‌వైపు మళ్లాలి. ఇంటింటా స్మాల్ యూనిట్లు రావాలి. వాటికి పని కల్పించే ఒక భారీ యూనిట్ వుండాలి. ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలో మనకు చాలా అవకాశాలున్నాయి. మనదేశంలో వున్నంత బయోడైవర్సిటీ చాలా తక్కువదేశాల్లో వుంది. మన దగ్గర దొరికే పూలు, పళ్లు, చేపలు – అన్నిటినీ ఫుడ్ ఐటమ్స్‌గా మార్చి సర్వదేశాలకూ ఎగుమతి చేయవచ్చు. అయితే ఎలా మార్చాలో మనకు టెక్నిక్ తెలియాలి. భారీగా పెట్టుబడి కావాలి. రిటైల్ రంగంలో ఎఫ్‌డిఐలు అనుమతించడం ద్వారా అది సాధ్యం కావచ్చు.

ఎఫ్‌డిఐలను అడ్డుకోవాలంటే నా ఉద్దేశంలో షేర్‌మార్కెట్లో అడ్డుకోవాలి. వాళ్లు ఎప్పుడు పెడతారో, ఎప్పుడు తీస్తారో తెలియదు. వాటివలన షేర్ల ధరలు పల్టీ కొట్టి మధ్యతరగతి జనమంతా హాహాకారాలు చేస్తున్నారు. షేర్‌మార్కెట్ కార్యకలాపాల వలన డబ్బు అటూ యిటూ చేతులు మారడం తప్ప ఒక్క వస్తువు కొత్తగా తయారవదు. షేర్ మార్కెట్‌లో ఫ్యూచర్స్ నిషేధిస్తే ఆహారధాన్యాల ధరలు తగ్గుతాయి. అసలు ఓ కంపెనీ షేరు కానీ, ఓ స్థలం కానీ కొన్న తర్వాత ఏడాది దాకా అమ్మడానికి వీల్లేదని రూలు పెట్టినా, ఎంతో మేలు జరుగుతుంది. దానిలో తిరిగే డబ్బంతా బ్లాక్ మనీయే. అక్కడ స్క్రూ బిగిస్తే ఆ డబ్బంతా మాన్యుఫేక్చరింగ్ రంగానికి మళ్లుతుంది. అదే మనం బాగుపడడానికి రాచబాట. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 14** **ఎమ్బీయస్ : విశ్వాసం నెగ్గిన జగన్**

హెడింగ్‌లో అచ్చుతప్పు లేదు. కిరణ్ కాదు, జగనే ! ఎందుకంటే కిరణ్ విశ్వాసం నెగ్గుతారని అందరికీ ఎప్పుడో తెలుసు. చిరంజీవి ఎమ్మెల్యేలు బెట్టు చూపించినపుడు, వారి వెనకాల బొత్స వున్నారని వార్తలు వచ్చినపుడు ఓ నిమిషం పాటు సందేహం ఎవరికైనా కలిగిందేమోకానీ, లేకపోతే అవిశ్వాస తీర్మానం ఓడిపోతుందని చిన్నపిల్లలకు కూడా తెలుసు. అవిశ్వాసం ప్రకటిస్తే పడిపోయిన ప్రభుత్వాలను లెక్కించడానికి ఒక చేతి వేళ్లు సరిపోతాయి. ఫలితం ముందే తెలుసు కాబట్టి ఆ ఉపన్యాసాలు, ఆ గణాంకాలు ఎవడూ వినడు. వ్యక్తిగతంగా ఏమైనా తిట్టుకుంటారేమో విందామన్న ఆశతో కాస్సేపు చూస్తారు. అలాటిది నిన్న అర్ధరాత్రివరకు ఓపిగ్గా టీవీ చూశామంటే దానికి కారణం జగన్‌కి వెనుక ఎంతమంది నిలుస్తారో చూద్దామనే !

జగన్ అనుయాయులకు యిది అగ్నిపరీక్షే. పెట్టినది కిరణ్ ప్లస్ చంద్రబాబు. చంద్రబాబు టైమింగ్ పెర్‌ఫెక్ట్‌గా చూసుకుని మరీ పెట్టారు. వైయస్ యూఫోరియా బాగా చల్లబడ్డాక, జగన్‌పై సింపతీ ఆవిరయ్యాక పెట్టారు. ప్రభుత్వం పడిపోకూడదు, వారితో కుమ్మక్కయి అవిశ్వాసం పెట్టలేదన్న చెడ్డపేరు తనకు రాకూడదు. అంతేకాదు, జగన్ గాలి తీసేయాలి. కిరణ్‌కు కావలసినది అదే ! వచ్చే ఎన్నికలపాటికి కాంగ్రెస్ ఓట్లను వైయస్ పేరు పెట్టుకుని జగన్ చీల్చుకోకూడదు. కాంగ్రెస్ ఓట్లు 5–10% పోయినా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు. బాబుకి అదే భయం – కాంగ్రెస్ ఓట్లు చీల్చుకుంటాడని కాదు, కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు చీల్చుకుంటాడని. కేంద్రంలోను, రాష్ట్రంలోను కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం ఘోరంగా అఘోరిస్తోంది కాబట్టి యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఓట్లు పుష్కలంగా వుండేట్టున్నాయి. అవి ప్రధాన ప్రతిపక్షానికి పడితేనే యిన్నాళ్లూ ప్రతిపక్షంలో వున్నందుకు టిడిపి ఫలం దక్కినట్టవుతుంది. అలాటిది ఆఖరి నిమిషంలో ఎవరో వచ్చి వాటిల్లో వాటా అడిగితే ఎలా?

2009 ఎన్నికల్లో యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఓట్లను పీఆర్పీ, లోకసత్తా చీల్చడం వలననే టిడిపి ఓడిపోయిందని బాబుగారు ఎన్నోసార్లు చెప్పారు. అప్పటికీ ఆయన తెరాస, లెఫ్ట్‌తో 'మహా'కూటమి కట్టారు. రేదర్ కూటమి కట్టాననుకున్నారు. కానీ లెఫ్ట్‌వాళ్లు, తెరాస వాళ్లు రకరకాలుగా హింస పెట్టి మహా కూటమిని ఓ జోక్‌గా మార్చేశారు. అందుకని యీ సారి టిడిపి తెరాసతో కాదు కదా, లెఫ్ట్‌తో కూడా జట్టుకట్టేట్టు లేదు. ఇలాటి పరిస్థితిలో జగన్ వచ్చి 10% ఓట్లు పట్టుకుపోయినా టిడిపి మళ్లీ అపోజిషన్‌లోనే కూర్చోవాలి. అందువలన జగన్ దుకాణం యీలోగానే మూయించేయాలి. జగన్‌వి వట్టి ప్రగలాభాలే తప్ప అతని వెనక్కాల ఎవరూ లేరని, యిప్పుడున్నా రేపు వుండరనీ లోకానికి చూపాలి. కిరణ్‌కు కావలసినదీ అదే. అందుకనే జగన్‌ను మార్జినలైజ్ చేయడానికే అవిశ్వాస తీర్మానానికి సిద్ధపడ్డారు.

లేస్తే మనిషిని కానట్టు వుండాలి తప్ప లేచి చూపించకూడదనకూడదని సామెత. కానీ కిరణ్ లేవడానికే నిశ్చయించుకున్నారు. అవిశ్వాసంపై ఓటింగు జరుగుతుందని జరిగేదాకా ఎవరికీ నమ్మకం చిక్కలేదు. నాకు కూడా ! కానీ కిరణ్ ధైర్యంగా వాస్తవాలను ఎదుర్కోవడానికి సిద్ధపడ్డారు. అందుకు అభినందించాలి. జగన్ వెనక్కాల వున్న ఎమ్మెల్యేలు యిప్పటిదాకా రెండిందాలా లాభం పొందుతున్నారు. అత్తతో అమ్మి, కోడలితో కొన్నట్టు జగన్ యాత్రల్లో, దీక్షల్లో పాల్గొంటున్నారు. కిరణ్ వద్దకు వెళ్లి నియోజకవర్గంలో పనులు చేయించుకుంటున్నారు. వీళ్ల సంగతి తేలిపోతే మంచిదని కిరణ్ అనుకున్నారులాగుంది. అందుకని అమీ, తుమీ తేల్చుకోవడానికి

ఓటింగు పెట్టించేశారు. ఓటింగు కారణంగా డిస్‌క్వాలిఫై అయ్యేవారు జగన్ ఎమ్మెల్యేలే కాబట్టి వేరే పార్టీవాళ్లెవరికీ యిబ్బంది లేదు.

డిస్‌క్వాలిఫై అవడానికి సిద్ధపడిన కాంగ్రెస్‌వారు 16 మంది. పీఆర్పీకూడా యిప్పుడు కాంగ్రెస్‌లో భాగమే కాబట్టి శోభా నాగిరెడ్డిని కలిపితే 17 మంది. వీళ్లే నికరంగా జగన్ వెంట నడిచే కాంగ్రెస్‌వాళ్లు. ఇది చాలా తక్కువనీ, జ'గన్' పేలలేదని జ్యోతివాళ్లు ఏకంగా హెడ్‌లైన్సే పెట్టేశారు. నా దయాదాక్షిణ్యాలపై ప్రభుత్వం వుందని, తలచుకుంటే పడేయగలననీ జగన్ గతంలో అన్నదాన్ని గుర్తు చేసి ఏమైంది యిప్పుడు? అని ఎద్దేవా చేస్తున్నారు. జగన్ వెనక్కాల 40 మంది వున్నారని, అది త్వరలో 70 అయిపోతోందని జగన్ అనుచరులు ప్రగలాలు పలికేరని యిప్పుడు తీరా చూస్తే 18కే తేలారని నవ్వుతున్నారు.

నా మట్టుకు నాకు జగన్ అలా చెప్పుకోవడం వింతగా తోచలేదు. ఏ నాయకుడైనా అలాగే చెప్తాడు. తెలంగాణలో అన్ని అసెంబ్లీ సీట్లు, పార్లమెంటు సీట్లు మావే అంటారు కెసియార్. రాష్ట్రంలో 294 సీట్లు మావే అని మహాకూటమి చెప్పుకుంది. 2014 ఎన్నికలలో కూడా ప్రజల విశ్వాసం పొందుతాం అని కిరణ్ అంటారు. వాస్తవ పరిస్థితి తెలిసినా ఒక్కో నాయకుడూ యిలా ఎందుకు చెప్తారని మనం ఆశ్చర్యపడడం అనవసరం. ఎన్టీయార్‌ను ఎన్నికలలో ఎదిరిస్తూ జలగం వెంగళరావు "ఫుట్‌బాల్‌లా తంతే వెళ్లి మద్రాసులో పడతాడు" అనేవారు. "మీలాటి పెద్దమనిషి హుందాతనం లేకుండా అలా మాట్లాడవచ్చా?" అని అడిగారు. "కార్యకర్తలను హుషారు చేయాలంటే అలా మాట్లాడక తప్పదు" అని అనేవారాయన.

ఇవే అవసరాలు జగన్‌వి కావా..? వీళ్లంతా మేం ఎన్నికల్లో ఓడిపోతాం అని ముందే చెప్తారా? సింగిల్ డిజిట్ సీట్లు తెచ్చుకునే లెఫ్ట్ సైతం తమతో పొత్తు పెట్టుకునే పార్టీతో 50 సీట్లు యివ్వాలంటూ బేరం మొదలుపెడుతుంది. అదీకాక ఆర్నెల్లక్రితం 70 మంది వస్తారంటే యిప్పుడూ అందరు వస్తారని అర్థం కాదు కదా. ఈలోపుగా అవతలివాళ్లు జాగ్రత్తపడితే అంకె మారదా? కిరణ్‌కాక రోశయ్య వుంటే..? బొత్స కాక డియస్ వుంటే..? ప్రభుత్వపక్షాన యింత చురుకుతనం వుండేది కాదేమో ! ఫిజిక్స్‌లో ఏదైనా రిజల్ట్ చూసినప్పుడు ఎంత రూమ్ టెంపరేచర్ వద్ద, ఎంత ప్రెషర్ వద్ద అని చూస్తారు. అవి మారితే యివీ మారతాయి.

నాకెందుకు యీ గొడవలన్నీ, నేను దారినపోయే దానయ్యని, దిగమంటే హాయిగా దిగిపోతా అనుకునే ముఖ్యమంత్రి అప్లయి చేసే ప్రెషర్ వేరు, ఇంకా పాతికేళ్ల రాజకీయజీవితం వుంది, అడిగి పదవి తెచ్చుకున్నాం, ఏదో ఒకటి చేసి చూపించకపోతే మాటపడతాం అనుకునే ముఖ్యమంత్రి అప్లయి చేసే ప్రెషర్ వేరే వుంటుంది. ప్రెషర్ బట్టే రిజల్ట్ వుంటుంది. నిజానికి బొత్స, కిరణ్ చివరి నిమిషం వరకూ విశ్వప్రయత్నాలు చేశారు. వారి కృషిని అభినందించాలి. డబ్బు యివ్వచూపారా, బెదిరించారా, టిక్కెట్టు ఆశ చూపారా? ఇవన్నీ చర్చించడం అనవసరం. అందరూ యిదే చేస్తారు. అలా చేయడంలో ఎవరు కృతకృత్యులయ్యారు అన్నదే పాయింటు. జగన్ పక్షాన వున్న కొందరు యిదే అదనని కొన్ని కొన్ని సాధించుకున్నారు. జయసుధ భుజాలమీదనుండి మేయరు బండను దించుకోవడంతో తృప్తిపడ్డారట. పీఆర్పీ వాళ్లకు ఏ గ్రహశాంతి చేశారో కొద్దిరోజుల్లో తెలుస్తుంది. ఇవన్నీ పాలిటిక్స్‌లో పెర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్.

అందువలన జగన్ వెంట ఎమ్మెల్యేలు 28 మంది లేరని ఆశ్చర్యపడేదాని కన్నా 18 మంది వున్నారని ఆశ్చర్యపడడం కరక్టు. నిజానికి యిప్పుడు జగన్ దగ్గర ఏముంది? వైయస్ పోయిన వెంటనే అయితే పరిస్థితి వేరు. ఇప్పుడు వైయస్ అకృత్యాలన్నీ కాంగ్రెస్‌వారే బయట పడేసి ఉతికి ఆరేస్తూంటే యిక వైయస్ ఓట్ బ్యాంకు ఎంత మిగిలి వుంటుంది? హై కమాండ్ జగన్‌ను వెనక్కి రప్పిస్తుందేమో, అప్పటిదాకా జగన్‌తో తిరిగి అతనికి సన్నిహితుడిగా మెలగి, ఆ తర్వాత కాంగ్రెస్ ఛత్రఛాయల్లోకి వచ్చేస్తే ఉభయతారకంగా వుంటుందన్న ఆశ ఏదైనా వుంటే అది అడుగంటినట్టే. తెలంగాణ సమస్యపై ఏమీ తేల్చకపోయినా, జగన్ సంగతి మాత్రం తేల్చి అవతలపడేయాలని హై కమాండ్ అనుకుంటోందని తేటతెల్లమై పోయింది. అందువలన జగన్‌తోనే యిక ములగానాం, తేలానాం అనుకోవాలి.

జగన్ యిమేజి కూడా ఏమంత బాగా లేదు. సిబిఐ ఎంక్వయిరీ నడుస్తోంది. అతనితో సంబంధం పెట్టుకున్న వారందరినీ సిబిఐ విచారిస్తోంది. ఇన్‌కమ్‌టాక్స్ రెయిడ్స్ జరుగుతున్నాయి. ఏ క్షణాన్నయినా జగన్ జైలుకి వెళతాడంటున్నారు. ఈ విషయం తెలిసే విజయమ్మగారిని జగన్ ముందుకు తీసుకుని వచ్చాడంటున్నారు. జగన్ వ్యాపారాలలో యిన్వెస్ట్ చేసిన ఏ ఒక్కరు అప్రూవర్‌గా మారినా జగన్ పుట్టి మునగవచ్చు. ఇప్పుడు ఐయేయస్ ఆఫీసర్లపై సిబిఐ పడింది. వారి ద్వారా మంత్రుల పేర్లు చెప్పించి, మంత్రుల ద్వారా వైయస్ పేరు చెప్పిస్తే జగన్ యిక ఎవరిపేరు చెప్పుకుని ఓట్లు సంపాదించుకుంటాడు? బాబుకైనా, కాంగ్రెస్‌కైనా చెప్పుకోవడానికి గతం వుంది. జగన్‌కి గతం లేదు. ఉన్నదంతా భవిష్యత్తే. అది అంధకారకూపమా, అధికారపీఠమా అన్నది కాలమే చెప్పాలి. ప్రస్తుతానికి పూర్తిగా రిస్కే !

అలా రిస్కు తీసుకునే అనుచరులు 18 మంది వున్నారంటే జగన్ గొప్పగా చెప్పుకోవచ్చు. అంటే బాగుండదేమో కానీ బళ్లారి ఉపయెన్నికల ఫలితం వారిని యిటువైపు మొగ్గేట్టు చేసిందని నా డౌటు. గాలి జనార్దనరెడ్డి అవినీతిపై యింత ప్రచారం జరుగుతున్నా అతని అనుచరుడు బ్రహ్మాండమైన మెజారిటీతో నెగ్గాడంటే అర్థం ఏమిటి? ప్రజలు అవినీతి ఆరోపణలకి చలించడం మానేశారు అనే కదా. తమకు ఏదోలా లాభం కలిగితే చాలు అనే జనాలు చూస్తారని తేలింది. అందువలన జగన్‌పై సిబిఐ ఎన్ని ఆరోపణలు చేసినా రేపు యిక్కడా యిదే జరుగుతుంది. ఈ పార్టీలో టిక్కెట్టు గ్యారంటీ. జగన్ అయితే టిక్కెట్లు తనే యిస్తాడు. కాంగ్రెస్‌లో దేశ్సేవ చేస్తాననేవారి రద్దీ ఎక్కువ. టిక్కెట్టు దొరకకపోవచ్చు.

నేను తలచుకుంటే ప్రభుత్వాన్ని పడగొట్టగలను అని జగన్ అంటూనే మాకు బలం లేదు, టిడిపి అవిశ్వాసం పెడితే వాళ్లకు

సపోర్టు చేసి వాళ్ల సహాయంతో పడగొడతాను అని కూడా అన్నారు. నిజానికి ఏదైనా పార్టీలో చీలిక వచ్చినపుడు ప్రతిపక్షం అదే అదనుగా వాళ్లకు సాయం చేసి ప్రభుత్వాన్ని పడగొడుతుంది. 1983లో టిడిపిని నాదెండ్ల చీల్చినపుడు కాంగ్రెస్ సాయపడింది. కానీ యిక్కడ పార్టీలోంచి బయటకు వచ్చిన జగన్‌కు టిడిపి సహాయపడటం లేదు. కాంగ్రెస్‌ను మించిన శత్రువుగా చూస్తోంది. జగన్‌కూడా అదే ధోరణిలో టిడిపిని ఎండగడుతున్నాడు – కాంగ్రెస్ స్థానాన్ని ఆక్రమిద్దామనే యోచనతో.

జగన్ వెనక్కాల 18 మందే ఎందుకున్నారు? దాదాపు 10 మంది ఎందుకు వెనక్కి తగ్గారు? దీనిలో చిదంబర రహస్యం ఏమీ లేదు. ప్రతివాడూ గెలిచేవైపే వుందామనుకుంటారు. 1983లో టీడిపిలో చీలిక వచ్చినపుడు నాదెండ్లకు మెజారిటీ వుందని గవర్నరు అనడంతో చాలామంది అటు మొగ్గారు. ఎన్టీయార్ జనంలోకి వెళ్లడంతో ఆయనకు వచ్చిన స్పందన చూశాక అటు వెళ్లిన ఎమ్మెల్యేలు యిటు రావడం మొదలెట్టారు.

బాబు విషయంలో కూడా అదే జరిగింది. మొదట్లో మెజారిటీ ఎమ్మెల్యేలు ఆయనతో వెళ్లలేదు. కానీ ఈనాడు ఆయన బలాన్ని ఎక్కువచేసి చూపడంతో ఎమ్మెల్యేలు అటు దూకి ఆ అతిశయోక్తిని యథార్థం చేశారు. దానికి తోడు ఎన్టీయార్ మళ్లీ ఎన్నికలకు వెళతాం అనడంతో గోడమీద వున్నవాళ్లు కూడా బెదిరిపోయారు, ఇంతలోనే ఎన్నికలా అని. బాబు పక్షాన చేరితే ఎన్నికల గోల వుండదు కదా అనుకున్నారు. ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే జగన్‌తో నిలిస్తే రేపటి మాట ఎలా వున్నా యివాళ మాత్రం చిక్కులే అనుకున్నవాళ్లు తప్పుకున్నారు.

ఇప్పుడు వచ్చినవాళ్లు వెనక్కి వెళ్లకూడదని జగన్ ఆశ. అందుకే వాళ్లపై క్రమశిక్షణ చర్య తీసుకోండి అని డిమాండ్ చేస్తున్నారు. గతంలో కవచాలు చేయించినపుడు వీపుకి కవర్ లేకుండా చేయించేవారట. యుద్ధంలో సైనికులు వెనుదిరిగి పారిపోతే వాళ్లకే రిస్కు సుమా అని చెప్పేవారు. వెన్నుచూపితే బాణం గుచ్చుకుంటుంది. అందువలన చచ్చినట్టు ముందుకే వెళ్లాలి. అలాగే యూరోప్‌లో సైనికులు వంతెన దాటిన తర్వాత సైనికాధికారులు వంతెనను కూలగొట్టించేవారట. అంటే వెనక్కి పారిపోయే ఛాన్సు లేకుండా చేశారన్నమాట. జగన్ తన అనుచరులు కాంగ్రెస్ వంతెనను కాల్చేయాలని కోరుతున్నారు. కానీ కాంగ్రెస్‌వాళ్లు జగన్ రూల్సు ప్రకారం ఆట ఎందుకు ఆడతారు?

జగన్ వర్గీయులందరూ గాంధీభవన్‌లో కనబడి తనకు సలాంలు కొట్టాలని హుంకరించిన బొత్స యిప్పుడు డిస్‌క్వాలిఫికేషన్ విషయం కిరణ్ చూసుకుంటారంటున్నారు. పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడు కిరణా? ఇది పార్టీ వ్యవహారం కాబట్టి బొత్స మాత్రమే డీల్ చేయాలి. కానీ ఆయన వీళ్లమీద వాళ్లమీద పెట్టి ఆలస్యం చేస్తున్నాడు. ఎందుకు? ఆ 18 మంది మనసు మార్చుకుంటారేమోనన్న ఆశ. (కొందరైనా మార్చుకోవచ్చు) ఇంచుమించు 10% స్థానాల్లో ఉపయెన్నికలను ఎదుర్కోవడం మాటలేమీ కాదు. పైగా జగన్ వర్గీయులు మూడు ప్రాంతాల్లోనూ వున్నారు. మూడు చోట్లా కాసిన్ని కాసిన్ని సీట్లు నెగ్గినా ప్రభుత్వం మోరేల్ దెబ్బతింటుంది. అందువలన డిస్‌క్వాలిఫికేషన్ యిప్పట్లో చేపట్టకపోయినా ఆశ్చర్యపడనక్కరలేదు.

మరి జగన్ వెనక్కాల నాయకులు తగ్గిపోయారని తెలిస్తే ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారు? ప్రజలకు యివేమీ పట్టవు. టిడిపి పెట్టినపుడు ఎన్టీయార్ వెనుక నాదెండ్ల కాకుండా మరో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చి పార్టీలో చేరారు. మూణ్నెళ్లల్లో వాళ్లు వెనక్కి వెళ్లిపోయారు. దానివలన ఎన్టీయార్‌కు ఓటేద్దామనుకున్న జనాలు ప్రభావితం కాలేదు. జనాలు వేరే, నాయకులు వేరే. నాయకులు చేరారు కదాని జనాలు చేరరు. జనాలున్నారంటే నాయకులే పరిగెత్తుకుని వస్తారు. మరి జగన్ వెనుక నాయకులు తక్కువగానే వున్నట్టు తేలింది. జనాల మాట..? ఉపయెన్నికలలోనో, స్థానిక ఎన్నికలలోనో అదీ తేలిపోతుంది ! ప్రస్తుతానికైతే 18 మంది నాయకులను తన వెనుక నింపుకుని జగన్ వారి విశ్వాసం పొందాడు. అది గుర్తిద్దాం.**– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 16** **ఎమ్బీయస్ : విద్రోహదినం ఏది? 9 లేదా 23..?**

ఇవాళ డిసెంబరు 9 ని తెలంగాణ ఉద్యమకారులు ఆత్మగౌరవదినంగా, 23 ను విద్రోహదినంగా జరుపుతున్నారు. డిసెంబరు 9 విద్రోహదినం ఎందుకు కాదో నాకు అర్థం కావటం లేదు. తెలంగాణపై ఎటూ తేల్చకుండా, మనసులో మాట చెప్పకుండా నాటకం ఆడుతూ రాష్ట్రప్రజలను విభజించి పాలిస్తున్న సోనియా గాంధీ పుట్టినరోజు అది. అంతేకాదు, తెలంగాణపై అతి ముఖ్యమైన ప్రకటన చేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిన రోజది. ఒక వివాదాస్పద నిర?యాన్ని అంతకంటె వివాదాస్పద విధానంలో ప్రకటించి తటస్థులు కూడా దాన్ని వ్యతిరేకించేట్లు, తద్వారా రాష్ట్రవిభజనకు విముఖులు అయ్యేట్లు చేసిన రోజది. ఒక విధాన నిర?యం తీసుకునేటప్పుడు రాష్ట్రంలో అన్ని వర్గాలవారినీ, కేంద్రంలోని మిశ్రమ ప్రభుత్వంలోని భాగస్వామ్యపక్షాలను, ప్రధానిని, రాష్ట్రముఖ్యమంత్రిని విశ్వాసంలోకి తీసుకుని నిర?యం తీసుకుని వుంటే అది నిలిచేది. అలాటి ప్రక్రియ ఏదీ జరపకుండా ఆదరాబాదరాగా కెసియార్‌చే దీక్ష మాన్పించడానికి ప్రకటన యిచ్చిన రోజది.

ఏ పార్టీ ఐనా తన పార్టీవాళ్లతో ముందుగా క్షుణ?ంగా చర్చించి, ఒక నిర?యానికి వచ్చాక వారికి విషయాన్ని లీక్ చేసి, ఆ బెనిఫిట్ వారికి అందేట్లా చూశాక చేయాల్సిన ప్రకటనను వేరే పార్టీ వాళ్లతో సంప్రదించి, తన పార్టీ క్యేడర్‌కు ద్రోహం చేసిన రోజది.

ఆ వేరే పార్టీ వాళ్లు కూడా ఎవరు? సిగ్గుమాలినవాళ్లు అంటూ తమను అనునిత్యం తిట్టేవాళ్లు. కొన్ని నెలల క్రితమే ఎన్నికలలో ప్రత్యర్థులతో చేతులు కలిపి మహాకూటమిగా ఏర్పడి ఓడించడానికి చూసినవాళ్లు. కేంద్రంలో తమను గద్దె దించాలని తీవ్రంగా ప్రయత్నించిన బిజెపితో కుమ్మక్కయినవాళ్లు. వాళ్లతో డైరక్టుగా చర్చలు జరుపుతూ వాళ్ల గైడ్ జయశంకర్ డిక్టేట్ చేసిన విధంగా కాంగ్రెస్ ప్రకటన చేసిన దినం అది. డిసెంబరు 23 నాటి ప్రకటన డిసెంబరు 9 నాడు చేసి వుంటే ముప్పు వచ్చేది కాదు. అలా ప్రకటనలు తారుమారు చేసి తప్పుడు ప్రకటనతో తెలంగాణ ప్రజలను ఘోరంగా మోసపుచ్చిన రోజు డిసెంబరు 9.

డిసెంబరు 9 న సోనియమ్మ మా తెలంగాణ మాకు యిచ్చేసింది అంటూ అందరిచేతా అనిపించుకోవడానికైనా దాన్ని సవ్యంగా ప్రకటించాలిగా, లేదే ! 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రారంభిస్తున్నాం' అని ఊరుకుందా? లేదే ! తగిన అసెంబ్లీ తీర్మానం చేశాక.. అంటూ మెలిక ఎందుకు పెట్టారు. అసలు అసెంబ్లీ తీర్మానం ఆరోవేలు లాటిదని, అది ఒక లాంఛనం మాత్రమేనని వారికి తెలియదా? నిర?యం తీసుకోవలసినది, ఫైలు కదల వలసినది కేంద్ర హోం శాఖ నుండి, అక్కడ నుండి రాష్ట్రపతికి, ఆ తర్వాత అసెంబ్లీ పిక్చర్‌లోకి వస్తుంది. అసెంబ్లీ నిర?యం ఏమైనా అది కేంద్రానికి ఒక సూచనగానే పనికి వస్తుంది. ఇప్పుడు యుపి అసెంబ్లీ విభజన కోరుతూ తీర్మానం చేసింది. కేంద్రం 'వల్లె, అవశ్యము' అంటూ రాష్ట్రం విడగొట్టేస్తోందా? అటువంటప్పుడు అసెంబ్లీ తీర్మానాన్ని ఆనాటి ప్రకటనలో చేర్చడం దేనికి?

చేర్చారనుకోండి, అసెంబ్లీ తీర్మానం పాస్ చేయించడానికి కృషి చేయలేదెందుకు? రోశయ్యగారు అడ్డుపడ్డారు కాబట్టి అంటారు తెరాసవాళ్లు. సోనియా గాంధీ మాటకు అడ్డుపడేటంత ధైర్యం మీకుంది అని రోశయ్యగారికి చెపితే బాబోయ్ అని ఆయన గుండె కొట్టుకోవడం మానేస్తుంది. వాళ్లు ఎక్కమన్నపుడు కుర్చీ ఎక్కారు, దిగమన్నప్పుడు దిగిపోయారు. అసెంబ్లీ తీర్మానం చేయించలేను మొర్రో అని ఆయన స్పష్టంగా చెప్పాక కూడా వాళ్లు డిసెంబరు 9 ప్రకటన చేశారు. తీర్మానం చేయిస్తావా, దిగిపోతావా అని రోశయ్యను బెదిరించలేదు. పోనీ ఆ పని వేరే వారికి అప్పగించలేదు. అంటే తామే కావాలని ఆ అడ్డంకిని కల్పించి, దాన్ని అడ్డు పెట్టుకుని తమ ప్రకటన అమలు కాకుండా తామే చూశారన్నమాట. ఇదంతా కుట్ర కాదా? ఏమార్చే ప్రయత్నం కాదా?

కాంగ్రెస్ మాట తప్పింది, మాట తప్పింది అని తెలంగాణ ఉద్యమకారులే కాదు, అందరూ అంటున్నారు కదా. ఎప్పటి మాట తప్పింది అంటే, డిసెంబరు 9 నాటి మాట ! మరి ఉత్తుత్తి వాగ్దానం చేసిన ఆ రోజు విద్రోహదినం కాదా? కాదు, వాగ్దానం నుండి వెనక్కి వెళ్లిన రోజునే విద్రోహదినం అనాలి అంటే అవి చాలా రోజులు వుంటాయి. 2009 డిసెంబరు 23 నుండి, 2010 జనవరి 5 నుండి మొన్నటికి మొన్న మాతృరాష్ట్రంలో కాన్సెన్సస్ (బహుళాభిప్రాయం) వుండనిదే కొత్త రాష్ట్రాలు ఏర్పాటు కావు అని రాతపూర్వకంగా యిచ్చిన రోజు వరకు అన్నిటినీ విద్రోహదినాలే అనుకోవాలి. మధ్యలో కృష? కమిటీ నియమించిన రోజు, రిపోర్టు యిచ్చిన రోజు, చిదంబరం బక్రీద్ తర్వాత కదులుతాం అని ప్రకటించిన రోజు, ఇప్పట్లో కాదు అని ఆజాద్ చెప్పిన రోజు, తెలంగాణ యిస్తే పెనం మీదనుండి పొయ్యిలో పడ్డట్టే అని మన్‌మోహన్ అన్న రోజు.. ఇలా ఎన్నో తేలతాయి. ఎన్నని చేస్తారు?

నిజానికి 2009 డిసెంబరులో హోం శాఖ మొత్తం అంశాన్ని వివాదాస్పదం చేసేసింది. చలో అసెంబ్లీ పూర్తిగా రక్తసిక్తమై పోతుందంటూ, తప్పుడు యింటెలెజెన్సు రిపోర్టులు తెప్పించి, సోనియాను ఒప్పించి, ప్రధాని దేశంలో లేనివేళ, కాబినెట్ సహచరులకు కూడా చూపించకుండా ఆదరాబాదరాగా వ్యవహారం ముగించి దీనిలో కాంగ్రెస్‌కేదో బెనిఫిట్ వుంది అనే అనుమానాన్ని రగిలించింది. తెలంగాణకు దోచి పెడుతున్నారన్న అభిప్రాయాన్ని రగిలించి, విభజనను వ్యతిరేకించేవారిని సమైక్యం అయ్యేట్టు చేసింది. ఆ ప్రకటన అమలు కాకుండా చేసింది.

అంతేకాదు, తెలంగాణ నిజంగా వచ్చేస్తుందేమోనన్న ఆలోచనను తెలంగాణవారిలో రగిలించి, తెలంగాణ నాయకులను ఉసిగొల్పింది. దానితో వారందరూ తెలంగాణ బస్సెక్కడానికి ప్రయత్నిస్తూ, పక్కవాళ్లను బస్సులోంచి లాగేయసాగారు. తెలంగాణ నాయకుల మధ్య విభేదాలు రచ్చకెక్కడానికే ఆ ప్రకటన ఉపయోగపడింది. అందుకనే డిసెంబరు 9 ప్రకటన ద్వారా హోం శాఖ తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసినట్టే కదా. ఈ కారణాల వలన డిసెంబరు 9 నే విద్రోహదినంగా పాటించాలి. ఆత్మగౌరవదినంగా పాటించడం దేనికి? ఆ రోజున తెలంగాణ నాయకులు తమ రాష్ట్రం కోసం రాజీనామాలు చేసారా? ధర్నాలు చేసారా? లేదే ! అవన్నీ డిసెంబరు 23 న జరిగాయి. నోటికాడ కూడు లాగేసుకున్నారు, మా గౌరవానికి విఘాతం కలిగింది అంటూ ఉద్యమం మొదలు పెట్టింది ఆరోజునే. తెలంగాణ పేరుతో అన్ని పార్టీలవాళ్లూ ఒకటై నిలిచినది ఆ రోజే. ఆ రోజు విద్రోహదినం ఎందుకైంది పాపం ?

కాదూ కూడదూ డిసెంబరు 23నే విద్రోహదినంగా పాటించాలి, ఆ రోజునే ఆంధ్రప్రాంత నాయకులు ఒక్కటిగా నిలిచి కేంద్రం నుండి డిసెంబరు 9 ప్రకటనను వెనక్కి మళ్లించారు అంటారేమో ! అలా అయితే ఆంధ్రప్రాంత ఎమ్మెల్యేలు తమ బలం చూపించడానికి రిజైన్ చేసిన తొలిరోజును విద్రోహదినం అనవచ్చు. డిసెంబరు 23 కు వారం, పదిరోజులకు ముందే ఆంధ్రప్రాంతపు ఎమ్మెల్యేలందరూ రిజైన్ చేసేశారు. ఇక అప్పుడు కొత్తగా చేసిన విద్రోహం ఏముంది? వాళ్ల వేడికోలు కేంద్రం విని సవరణ ప్రకటన డిసెంబరు 23 న చేసింది కాబట్టి ఆనాడే విద్రోహదినం అంటారేమో ! అంటే కేంద్రం తెలంగాణ ప్రజల పట్ల చేసిన విద్రోహం అనుకోవాలా? మరి అలా అయితే మధ్యలో కోస్తా, సీమ నాయకులపై కదుపుమంట దేనికి? తెలంగాణను మోసం చేస్తున్నది కేంద్రం అని ఒప్పుకునేమాటయితే మధ్యలో 'సీమాంధ్రుల' పై పడి ఏడవడం దేనికి? వాళ్ల డబ్బు సంచులతో కేంద్ర నిర?యాన్ని మార్చేశారు అంటున్నారు.

అదే నిజమైతే, యింకో మాట ఎక్కువ పడేసి, ''తెలంగాణ చచ్చినా యివ్వం'' అని ప్రకటన చేయమని డిమాండ్

చేయించలేకపోయారా? తెలంగాణ పేరు చెప్పి హఫ్తాలు డిమాండ్ చేసేవారిని మేపడం కంటె, వాళ్ల పేపర్లకీ, టీవీలకి యాడ్స్ యివ్వడం కంటె అది చౌక పడుతుంది కదా! ఇలా అనగానే నేను తెలంగాణ ఉద్యమకారుల గురించి హీనంగా మాట్లాడాను అని నాపై విరుచుకు పడకండి. తెలంగాణ ఉద్యమం కోస్తా, సీమల విరాళాలతో నడుస్తోందని సాక్షాత్తూ ఈటెల రాజేందరే టీవీ ఇంటర్వ్యూలో అన్నారు. ఎబియన్ ఆంధ్రజ్యోతిలో రాధాక ృష? రాజేందర్‌ను అడిగారు – 'మీ నాయకులు సీమాంధ్రులతో కలిసి వ్యాపారాలు చేస్తున్నారు, మీ ఉద్యమానికి సీమాంధ్రులు ఆర్థికసహాయం చేస్తున్నారు. మీ పార్టీ పత్రికలకు, టీవీలకు సీమాంధ్రుల నుండి యాడ్స్ ద్వారా ఆదాయం సంపాదిస్తున్నారు. ఇది భావ్యమేనా?' అని.

అప్పుడు రాజేందర్ – ''ఏం చేస్తాం సార్? డబ్బు వాళ్ల దగ్గరే వుంది. పరిశ్రమలు వాళ్ల దగ్గరే వున్నాయి. మా తెలంగాణ వాళ్ల దగ్గర పైసలేమున్నాయి? ఇప్పుడు కోమటిరెడ్డి దీక్ష చేస్తున్నాడు కదా, పాపం ఆ బ్రదర్స్ దగ్గర కూడా ఏమంత డబ్బు లేదు. ఉద్యమం నడిపేదానికి ఆంధ్రోళ్ల దగ్గర డబ్బు తీసుకొనక తప్పటం లేదు, తీసుకోవడంలో తప్పు లేదు." అని.

అంటే ఆంధ్రప్రాంతీయులు తమకు వ్యతిరేకంగా జరిగే ప్రచారానికి తామే నిధులు సమకూరుస్తున్నారన్నమాట. తమను తమ తమ పరిశ్రమల నుండి, తమ తమ నివాసాలనుండి వెళ్లగొట్టడానికి తామే డబ్బిచ్చి సహాయపడుతున్నారన్నమాట. ఆంధ్రుల వస్తువుల జాబితా వెలువరిస్తాం, వాటి వినియోగాన్ని బహిష్కరించండి అని కోదండరాం పిలుపు నిచ్చారు కదా, అవే వస్తువులు వాడమని నమస్తే తెలంగాణ, టీ ఛానెల్ ల ద్వారా ఆంధ్రప్రాంతీయులు యాడ్స్ యిస్తే వాటిని స్వీకరిస్తున్నారన్నమాట. తమను నిరంతరం దూషించేవారు ఆర్థికంగా బలపడడానికి వారితో వ్యాపారబంధాలు పెట్టుకుని లాభాలు పంచుకుంటున్నారన్నమాట. ఎంత విడ్డూరం !

ఇలా జరుగుతోందంటే దానికి అర్థం ఏమిటన్నమాట? ఆంధ్రప్రాంతీయుల విరాళాలతో తెలంగాణ ఉద్యమం నడుస్తోందంటే అది వారి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని నమ్మగలమా? ఆంధ్రప్రాంతపు వ్యాపారస్తుల యాడ్స్‌తో ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన పత్రిక, టీవీలు నడుస్తున్నాయంటే వారిని తరిమివేసే లక్ష్యంతో ఉద్యమం నడుస్తోందని అనుకోగలమా? ఇవన్నీ పైపై కబుర్లని అనుమానం రాదూ? అయినా ఉద్యమానికి తెలంగాణ ఎన్నారైలు పుష్కలంగా డబ్బు యిస్తున్నారని వింటూనే వున్నాం. అది సరిపోవటం లేదా? ప్రజలంతా స్వఛ్ఛందంగా పాల్గొనే ఉద్యమానికి ఎంత ఖర్చవుతుంది? ఈ వంటా–వార్పూ సమయాల్లోను, మహాసభ ఏర్పాటు చేసినప్పుడు తప్ప భారీగా ఖర్చయే సందరాలేమున్నాయి? అప్పుడు కెసియార్ ఎలాగూ కూలీపని చేసి రోజుకి పది, ఇరవై లక్షలు సంపాదించి పెడుతున్నారు. ఇంకా ఆంధ్రప్రాంతీయులనుండి విరాళాలెందుకో నాకు అర్థం కాదు.

కేంద్రం మంచిది, కాంగ్రెస్ యింకా మంచిది, సోనియమ్మ మరీమరీ మంచిది, ఇదిగో యీ సీమాంధ్ర నాయకుల లొల్లి కారణంగానే కాస్త తటపటాయిస్తోంది అని చెప్తూ 'సీమాంధ్రుల'ను విలన్లను చేయడానికే డిసెంబరు 23 ని విద్రోహదినం అంటున్నారు. నిజానికి ఆ పాటికే వాళ్లు రాజీనామాలు యిచ్చేశారు. ఆ రోజు జరిగినదేమిటంటే డిసెంబరు 9 ప్రకటన కేంద్రం వెనక్కి వెళ్లింది. దానికి కారణం కోస్తా, సీమ వాసుల ఒత్తిడే. కానీ ఆ ఒత్తిడికి ఫలానా రోజంటూ దేన్నీ ఫిక్స్ చేయలేం.

డిసెంబరు 23 ను విద్రోహదినంగా ప్రకటించి తీరాలని ఉద్యమకారులు అంటే దానిలో కూడా నేను ఒక ఔచిత్యం చూస్తున్నాను. ఎందుకంటే అది తెలంగాణ ప్రజల పాలిట తెలంగాణ నాయకుల విద్రోహదినం. తెలంగాణకోసం వ్యక్తిగత ఎజెండాలను, జెండాలను పక్కకు పెట్టి భుజంభుజం కలిపి, చేతులు పైకెత్తి బాహుమూల ప్రదర్శన చేసి పోరాడుతాం అంటూ వాగ్దానాలు చేసి, జెఎసి అర్జంటుగా ఏర్పరచి, తెలంగాణ ప్రజల మనసుల్లో ఆశలు రేపి, చివరకు ఎవరికి వారే యమునాతీరే అయిపోయి, తెలంగాణ ప్రజలను మోసగించిన దినం అది. జెఎసి తర్వాత విఛిన్నం అయింది కానీ ఆ రోజున ఏర్పడింది కాబట్టి విద్రోహదినం ఎలా అయింది అంటారేమో.. ఉత్తుత్తి జెఎసి ఏర్పాటు చేసి ప్రజలను ఏమార్చిన దినం కాబట్టి విద్రోహదినమే. డిసెంబరు 9 ఉత్తుత్తి తెలంగాణ ఏర్పాటు ప్రకటన దినం అయితే, డిసెంబరు 23 ఉత్తుత్తి ఐక్యతా దినం.

ఇక వీటిలో ఆత్మగౌరవదినం ఏది? 'మేం అమాయకులం, డబ్బులేనివాళ్లం, ఏమారిపోతాం, అందరూ మమ్మల్ని మోసం చేసేవాళ్లే, మాకు స్వయంపరిపాలన లేదు, మా ప్రజాప్రతినిథులు ఆంధ్ర ముఖ్యమంత్రులంటే అడిలి ఛస్తారు, వాళ్లకు పదవులే ముఖ్యం తప్ప తమ ప్రాంతాల అభివ ృద్ధి ముఖ్యం కాదు, మేమంతా ఏళ్ల తరబడి ఇంకోరు నెత్తిమీద సవారీ చేస్తూంటే చూస్తూ వూరుకున్నాం, మమ్మల్ని ఎవరైనా వచ్చి దోపిడీ చేసినా కిక్కురుమనం, మేం తెలంగాణవాళ్లం కాబట్టి అసెంబ్లీలో మా మైకు లాక్కున్నారు, స్వంతరాష్ట్రంలో మేము ద్వితీయశ్రేణి పౌరులం.. అని అంటూ తమను తామే కించపరుచుకోవడం మానేసి, ఆత్మనింద కట్టిపెట్టి, సెల్ఫ్‌పిటీని పెట్టెలో పెట్టి తాళం వేసినపుడు మాత్రమే ఆత్మగౌరవాన్ని ప్రకటించుకున్నట్టు అవుతుంది. అప్పుడే ఆత్మగౌరవదినం జరుపుకోవాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 24** **ఎమ్బీయస్ : కుంభకరు?దు ఉరేసుకుంటాడా?**

ఈ మోత్కుపల్లి వ్యవహారం నాకేం అర్థం కావటం లేదు. సినిమా టైటిల్స్ విని విని 'ఉరేసుకుందాం, రా' అని కెసియార్‌ను ఆహ్వానించారు. అలా అంటూనే కెసియార్‌ను కుంభకరు?దన్నారు. రెండూ తప్పే !

యువతలో, రైతుల్లో, చేనేత కార్మికులలో ఆత్మహత్య చేసుకునే లక్షణం పెరుగుతోందని అందరం బాధపడుతున్నాం. పదికాలాల పాటు బతకమనే పెద్దలూ అంటారు, శాస్త్రాలూ అంటాయి. చస్తాను, చద్దాం, చంపుతాను యివన్నీ తిట్ల కిందే లెక్క. అలాటిది ఆత్మహత్యలు ఓ పెద్ద ఫ్యాషన్‌గా తయారుచేస్తున్నారు యీ నాయకులు. బలవంతంగా ప్రాణాలు తీసుకున్న ప్రతివాడూ పిరికివాడే (భగత్ సింగ్‌లను వదిలేయండి) ! వాణ్ని అమరవీరుడంటూ కీర్తించడం ఒకటి. మేం కూడా అమరులమవుతాం అంటూ నాటకాలొకటి.

నా అవినీతి నిరూపిస్తే ఉరేసుకుంటా, (ఉరేసుకోవడం దేనికి, తిన్న డబ్బు కక్కి, జైలుకెళ్లి కూర్చో), నా ఆరోపణలు అబద్ధమని తేలితే ఉరేసుకుంటా (ఉరెందుకు, సిగ్గు పడి లెంపలేసుకుని, నోరు మూసుకుని ఓ మూల కూర్చో) నేననడిగినది యివ్వకపోతే పార్లమెంటులోనే విషం తాగి ఛస్తా (విషం దేనికి, మ్రొక్కిన వరమీయని వేల్పును గ్రక్కున విడు అన్నట్టు అధినాయకురాలికి గుడ్‌బై చెప్పి వేరే పార్టీలోకి వెళ్లిపో).. యిలా ఆత్మహత్య థాట్‌ను రోజుకి పదిసార్లు మన మెదళ్లలో ప్రవేశపెడుతున్నారు యీ దుర్మార్గులు. ఆత్మహత్య మతరీత్యా పాపం, చట్టరీత్యా నేరం. దానికి ప్రేరేపించినవాడు కూడా పాపే, శిక్షార్హుడే. అందువలన మొదట యీ ప్రలాపాలు పలికేవారందరినీ జైలుపాలు చేస్తే అయినదానికీ కానిదానికీ¯ఆత్మహత్యలు చేసుకోవడం ఆగుతాయి. మోత్కుపల్లి తను ఛస్తాననడమే కాక, ఇంకోర్ని కూడా చావమంటున్నారు. అవతలాయన చచ్చుడో చచ్చుడో అంటూ పదేళ్లగా చెప్పే కాండిడేట్ అయినా సరే, అది డబుల్ తప్పు. శిక్షాకాలం రెట్టింపు చేయాలి.

ఇక కుంభకరు?డి పోలిక – అదీ తప్పే! కుంభకరు?డు ఆర్నెల్లు నిద్రపోతాడు. లేచి ఎదుట వున్నది గబగబా తినేస్తాడు. కెసియార్ కూడా అలాగే అన్నారు మోత్కుపల్లి. ఆర్నెల్లు నిద్రపోయాక కుంభకరు?డు ఆర్నెల్లపాటు యాక్టివ్‌గా వుంటాడు. కెసియార్ అలా వుండరు కదా ! ఈయన ఆర్నెల్లకోసారి లేచి రెండు మూడు రోజులు అటూ యిటూ తిరిగి మళ్లీ నిద్ర కుపక్రమిస్తారు. యుద్ధం లాటి ఉపద్రవాలొచ్చి లేపితే కుంభకరు?డు తిట్టుకుంటూనైనా లేస్తాడు. చెప్పదలచిన హితవు అన్నగారికి చెప్పేసి, యుద్ధరంగానికి వెళ్లి వీరోచితంగా పోరాడతాడు.

మరి కెసియార్? – తెలంగాణ విమోచనదినాలు, ఆత్మగౌరవదినాలు, విద్రోహదినాలు, పార్లమెంటు సమావేశాలు – ఏమొచ్చినా లేవరు. అంతేకాదు, కుంభకరు?డు ఎంత మహాకాయుడైనా, కేవలం డిప్యూటీ లీడర్లలో ఒకడు. రావణుడు ఏం చెప్తే అది చేయవలసినవాడు. అందువలన ఆర్నెల్లపాటు పడి నిద్రపోయినా కోయీ ఫరక్ నహీ అల్‌బత్తా. అందుకే హాయిగా పడుక్కున్నాడు. కానీ కెసియార్? ఆయనే రాజాధిరాజు. ఉద్యమసారథి. ఫీల్డ్‌మార్షల్. అయినా నిశ్చింతగా పడుక్కోగలుగుతున్నాడు. అదీ గొప్ప ! అలాటివాణ్ని కుంభకరు?డితో పోల్చడమేమిటి, ఇన్సల్ట్ !

మోత్కుపల్లి యీ రెండు తప్పులతో బాటు మరో తప్పు కూడా చేశారు. ఉరితాడుగా పసుపుతాడు తేవడం. పాత్రికేయ అనే పాఠకుడు మెయిల్ రాశారు – "చూసారా, మోత్కుపల్లి పసుపురంగు తాడు తెచ్చారు" అంటూ. చావులో కూడా టిడిపికి కాన్వాస్ చేస్తూ పోదామని మోత్కుపల్లి ప్లానేమో తెలియదు. వరకట్నమరణాల్లో 'పసుపుతాడు ఉరితాడాయెనా?' అంటూ మనవాళ్లు సంపాదకీయాల్లో వాపోతారు. మోత్కుపల్లి కేసులో 'ఉరితాడు పసుపుతాడాయెనా?' అని పాడాలి. "తెలంగాణ వాడివై వుండి పసుపు రంగు టిడిపి పార్టీలో వుంటే ఉరితాడు తప్ప దిక్కేముంది అని మోత్కుపల్లి ఒప్పుకున్నట్టయింది." అని తెరాస వాళ్లు వెక్కిరించడానికి ఆస్కారం యిచ్చారు.

ఆ మధ్య తనికెళ్ల భరణి "కీ" అని ఓ సినిమా తీశారు. అందులో హీరో పుట్టినరోజునాడే ఆత్మహత్య చేసుకుందామనుకుంటాడు. ఉరితాడు కొత్తగా కొనుక్కుని వచ్చాడు, కొత్త బట్ట కదానుకుని దానికి పసుపుబొట్లు పెడతాడు. మోత్కుపల్లి కూడా అలాటి ప్రయత్నమే చేశారేమో, పసుపుబొట్లు పెట్టరా అంటే అత్యుత్సాహవంతుడైన ఆయన కార్యకర్త ఏకంగా పసుపు పూసేశాడేమో !ఉరికొయ్యకు ఏం పూద్దామని అనుకున్నారో తెలియదు. గన్‌పార్క్‌లో ఉరికొయ్య ఏర్పాట్లు ఏమీ చేసినట్టు లేదు. రెండు శవాలు ఏకకాలంలో వేలాడడానికి రెండు కొయ్యలుండాల్సింది. కనీసం ఒకదానికి కూడా ఏర్పాటు చేయలేదు.

కెసియార్ యిలాటి ఛోటామోటా లీడర్ల ఛాలెంజ్‌లకు చలించరని నేను ముందే ఊహించాను కాబట్టి ఆ టైముకి టీవీ దగ్గర కూర్చోలేదు కానీ లేకపోతే జంట ఆత్మహత్యల సీను చూడడానికి కూర్చునేవాణ్నే. ఎందుకంటే "పున్నగై మన్నన్" సినిమా ఆరంభద ృశ్యంలో కమలహాసన్, అతని ప్రేయసి ఆత్మహత్య చేసుకుందామని నిశ్చయించుకుని కొండమీదనుండి దుముకుతారు. అమ్మాయి ఠంచన్‌గా చచ్చిపోతుంది కానీ కమల హాసన్ మాత్రం చెట్టుకొమ్మల్లో యిరుక్కుని చావకుండా బతికిపోతాడు.

మన జంట ఉరి సీనులో కూడా కెసియార్ వంటి బక్కపలచ మనిషి ప్రయత్నం సఫలమై, మోత్కుపల్లి వంటి దిట్టమైన మనిషి ప్రయత్నం విఫలమైతే..ఈ థీమ్ మీద మరో బాలచందర్ ఎవరైనా సినిమా తీయవచ్చు కదా.. ! అనుకున్నాను. ఆ సినిమాలో వాళు ్ల ఒంటరిగా ఆత్మహత్యాప్రయత్నం చేస్తారు. ఇది బహిరంగప్రయత్నం. తెరాస విద్యార్థి సంఘం, ఉస్మానియా విద్యార్థి సంఘం, టిడిపి కార్యకర్తలు వంటి సపోర్టింగ్ కారెక్టర్లు చాలా వున్నాయి. వాటికీ యాక్టివ్ రోల్ వుందని వూహిస్తే, దాని కంటె రసవత్తరమైన కథ తయారయ్యేది.

పోన్లెండి, పోతే పోయింది కథ ! మోత్కుపల్లి, కెసియార్ యిద్దరూ క్షేమంగా వున్నారు. మనకు అదే కావాలి. పదికాలాలపాటు బతకమనండి. ఉత్తుత్తి బెదిరింపులతో మనల్ని చంపవద్దనండి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

కెసియార్‌ని 'గోడకు తగిలించిన తుపాకీ'గా అభివరి?ంచారు వాళ్లబ్బాయి కెటియార్. ప్రఖ్యాత కథకుడు చెకోవ్ అంటాడు – కథ రాసేటప్పుడు కథకుడు పరిసరాలు వరి?స్తూ గోడమీద తుపాకీ గురించి రాస్తే, కథ ముగిసేలోపున ఆ తుపాకీ పేలి తీరాల్సిందే అని. (కథకుడు అనవసర వర?నలు చేయకూడదని భావం) అలాగ యీ తుపాకీ కూడా ఎప్పుడో ఒకప్పుడు పేలి తీరుతుంది అని కెటియార్ భావం. అది ఎప్పుడో ఆయనకూ తెలియదు. 'సరైన సమయంలో సరైన నిర?యం' అందామంటే దాని మీద పేటెంటు కాంగ్రెస్‌వాళ్లు తీసేసుకున్నారు. 'వ్యూహాత్మక మౌనం' అనేది తెరాస పేటెంటు. కెసియార్ ఉలుకూ, పలుకూ లేకుండా కూర్చున్నప్పుడల్లా ఆ పదం వాడుతున్నారు ఆయన అనుయాయులు – 'మౌనమే నీ భాష' అని వాళ్ల నాయకుణ్ని స్తుతిస్తూ. నాయకుడి వ్యూహం సంగతి వాళ్లకీ తెలియదు. ఆయన ఏం చేసినా తెలంగాణ కోసమే అని మాత్రం గాఢంగా నమ్మి కూర్చున్నారు.

గోడమీద తుపాకీ అనగానే "అతడు" సినిమా గుర్తుకు వస్తోంది. దానిలో కూడా గోడమీదనున్న తుపాకీ అలాగే పడివుండి పిల్లలకు ఆటవస్తువుగా మారిపోతే తాతగారికి ఒళ్లు మండిపోతుంది. ఆ తుపాకీ ప్రత్యేకత చెప్తాడు – ఏదైనా అడ్డుపడితే గుండు వెనక్కి తంతుందని. కెసియార్ కూడా అలాగే వెనక్కి తన్నుకుని వచ్చి ప్రయోగించిన వాడి ప్రాణాలే తీస్తారేమో ! ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ చేతిలోని ఆయుధం అని టిడిపి వారి ఆరోపణ. కెసియార్‌ను అడ్డుపెట్టుకుని తమని సాధిస్తోందని, తమను తెలంగాణలో నామరూపాలు చేయాలని చూస్తోందని వాళ్లకు మాచెడ్డ అనుమానం. కెసియార్ కాంగ్రెస్ వాళ్లు చెప్పినట్టుగా చేస్తూనే మధ్యలో ఒక్కసారి వెనక్కి దూసుకుని వచ్చి వాళ్లను చంపి బిజెపితో చేతులు కలపగలరేమో!

ఇంతకీ కెసియార్ మార్క్ తుపాకీ ఏ గోడకు తగిలించినట్టు? మెదక్ ఫామ్‌హౌస్ తాలూకు గోడ అంటోంది ఆంధ్రజ్యోతి. దాని ఫోటో కూడా వేసింది. 35 ఎకరాల్లో ఆయన కట్టించుకున్నాడట. అది కెసియార్‌ది కాదు, ఎవరో స్నేహితులది అనే ఖండన కూడా తెరాస వారు చేయవచ్చు. రాజం (నమస్తే తెలంగాణ ఫేమ్) వంటి స్నేహితులకు కొదవ లేదు కదా. 'తెలంగాణ కోసం మేం పేపరు పెట్టాం, టీవీ పెట్టాం' అని కెసియార్ అంటూంటే అంతా ఆయనదే అనుకున్నాను కానీ కాదని తర్వాత తెలిసింది. కెసియారూ, ఆయన స్నేహితులూ అని అర్థంట. అలాటి స్నేహితులదే ఈ ఫామ్‌హౌస్ కావచ్చు. లేకపోతే కెసియార్‌దీ కావచ్చు. మొన్నమొన్న రాజకీయాల్లోకి వచ్చినవాళ్లే మహళ్లు కట్టగా లేనిది పాతికేళ్లగా రాజకీయాల్లో నలుగుతున్న కెసియార్ ఓ ఫామ్‌హౌస్ కట్టుకోలేరా? పైగా ఆయన పుట్టడమే రెండు ఎకరాల యింట్లో పుట్టారట. (బాబు యావదాస్తీ రెండు ఎకరాలు వున్న రోజుల్లో నేను రెండు ఎకరాల యింట్లో పుట్టాను అని కెసియారే చెప్పుకున్నారు). ఆ యిల్లు వర్ధిల్లి పిల్లల్ని పెట్టదా?

కెసియార్ ఫామ్‌హౌస్ ఫోటో వేయడంలో ఆంధ్రజ్యోతి ఉద్దేశం ఏమిటైనా ఆయనను ఒక నీరోగా (ఓ పక్క రోమ్ తగలబడుతూంటే తను హాయిగా ఫిడేలు వాయిస్తూ కూచున్నాడంటారు) భావించే ప్రమాదం వుంది. ఇలాటి ఫోటోలు ఎన్ని వేసినా తెలంగాణ ప్రజలు తనను విడిచిపెట్టరనే నమ్మకం కెసియార్‌కు వుంది. ఆ నమ్మకమే ఆయనను నిద్రపుచ్చుతోంది. విశ్రాంతి తీసుకోమంటోంది. ఆయన ఎన్నో పాదయాత్రలు, బస్సుయాత్రలు, పల్లెనిద్రలు, తెలంగాణతల్లి విగ్రహస్థాపనలు ఎనౌన్సు చేశారు. దేనినీ అమలు చేయలేదు. రిప్ వాన్ వింకిల్‌లా ఏళ్ల తరబడి నిద్రపోయి లేచి ఓ సారి నలుగుర్నీ దద్దమ్మలు, చవటలు అని తిట్టేసి మళ్లీ నిద్రకు ఉపక్రమిస్తారు. ఎన్నికల్లో ఓడిపోతే మూడు నాలుగు రోజులపాటు ఎవరికీ మొహం చూపించకుండా మాయమై పోయిన నాయకుడాయన. అయినా తెలంగాణ పేరుతో ఆయనకు నిధులు వస్తూనే వుంటాయి. ఓట్లు పడుతూనే వుంటాయి. ఇతర పార్టీ నాయకులు ఆయన పార్టీలో చేరడానికి క్యూ కడుతూనే వుంటారు. ఇంతకంటె మహర్జాతకం వేరే ఎవరికి వుంటుంది చెప్పండి.

ఈ జాతకం ఆయన రాసుకున్నదే. ఆయన ఎన్నికల గుర్తే ఆయన కథను సూచిస్తుంది. తెలంగాణ కారు 1969 తర్వాత తుప్పుపట్టి ఓ మూల పడి వుంది. 40 ఏళ్లగా నడవకుండా వున్న బండిని ఆయన తోయాల్సి వచ్చింది. స్టార్టింగ్ ట్రబుల్ వల్ల ఓ పట్టాన కదలలేదు. కష్టపడి తోసి, తోసి స్టార్ట్ చేశారు. ఆయనతో బాటు కొందరు చేయి వేశారు. బండి నడవడం మొదలెట్టాక ఈయన ఎక్కి కూర్చుంటే వాళ్లూ ఎక్కారు. ఈయన వాళ్లను బయటకు తోసేసి తనొక్కడే నడపసాగాడు. ఈ బండి నడిచేట్టు వుందనిపించగానే తక్కినవాళ్లు కూడా తలో చేయి వేసి, దాని వేగం పెంచారు. ఇప్పుడు ఆయన హాయిగా కారులో కూర్చుని షికారు కొడుతున్నారు. బండి లాగవలసిన భారం తక్కినవాళ్లదైంది. ఈయన మధ్యమధ్యలో తలకాయ బయటకు పెట్టి తొయ్యనివాళ్లంతా ఆంధ్రావాళ్ల తొత్తులు అని తిట్టేసి మళ్లీ సీట్లో వెనక్కి వాలతారు. ఆ కారుకి పెట్రోలు సప్లయి అంతా యితరులదే.

తెలంగాణ ఉద్యమకారుల్లో కెసియార్ వీరభక్తుల సంఖ్య క్రమంగా తగ్గిపోసాగింది. కెసియార్ చేష్టలకు సంజాయిషీ చెప్పుకుంటూ పోవడం వాళ్ల అలవికాని పని. అందువలన మరీ గట్టిగా ఎవరైనా ప్రశ్నిస్తే 'తెలంగాణ అంటే కెసియార్ ఒక్కరే కాదు. ప్రత్యేక తెలంగాణ యిచ్చి చూడండి. మేం ఎవర్ని ఎన్నుకుంటామో మీకు అనవసరం' అనసాగారు. 'ఇస్తే మీకు నాయకత్వం వహించి, మిమ్మల్ని యింతకంటె ఉద్ధరించేవారెవరు?' అని అడిగితే 'ఎవరో ఒకరు వస్తారు..' అని ఆశాభావం వ్యక్తం చేస్తారు. మనతో అలా అంటారు కానీ వాళ్లకీ తెలుసు – 'ఇప్పుడున్న గుంపంతా పాతికేళ్లగా తెలంగాణను 'ఉద్ధరించేస్తున్నవారేన'ని. వీళ్లు సరిగ్గా లేరనే కదా అసంతృప్తి !

కాంగ్రెస్, టిడిపిలలో కెసియార్‌లా తెలంగాణకు మాత్రమే అంకితమైన నాయకుడు ఎవరూ లేరు. అందరూ అవకాశవాదులే.

అందుకే తెలంగాణ అంశమంతా కెసియార్ చుట్టూనే తిరుగుతోంది. ఎన్టీయార్ లాగ, చిరంజీవి లాగ కొత్త వాళ్లెవరైనా రాజకీయాల్లోకి వచ్చి తెలంగాణలో ప్రభంజనం లేవదీస్తే తప్ప కెసియార్‌కు యిప్పట్లో ముప్పు లేదు. ఆ విషయం అందరికంటె ఎక్కువగా కెసియార్‌కి తెలుసు. అందుకే గోడమీద తుపాకిలా విశ్రాంతి తీసుకుంటున్నారు.

కానీ తుపాకీ పేలకుండా అలాగే గోడకు కరిచిపెట్టుకుని వుండిపోతే ఎలా? అప్పుడు దాన్ని బొమ్మ తుపాకీ అనుకుంటారు. లేదా కావాలని నోరు మూసుకున్న తుపాకీ అనుకుంటారు. టిడిపివాళ్ల దృష్టిలో కెసియార్ ''అతడు'' మార్క్ తుపాకీ కాదు, తుప్పుపట్టిన తుపాకీ, గుళ్లు లేని తుపాకీ. ఇలా అంటూనే వుంటారు, మళ్లీ తెలంగాణలో ఉపయెన్నికలంటే అడిలిపోతూ వుంటారు. అయితే యింతకీ ఆయన్ను గోడ ఎక్కించిన వారెవరు? అదీ ప్రశ్న. వాళ్లు ఎక్కిస్తే మాత్రం యీయన ఎందుకు ఎక్కారు? ఒక ఉద్యమనాయకుడు యిలా యింత తరచుగా విశ్రాంతికి ఉపక్రమిస్తూంటే ఉద్యమం చెట్టెక్కుతుందని ఆయనకు తెలియదా?

కెసియార్ ప్రధానంగా ఉద్యమనాయకుడు. అడ్మినిస్ట్రేటర్ అనడానికి లేదు. ఆయన రాష్ట్రమంత్రిగా వున్నపుడు, కేంద్రమంత్రిగా వున్నపుడు ఆయన నిర్వహించిన శాఖలు అద్భుతంగా నడిచాయని ఎవరూ చెప్పుకోగా వినలేదు. ఆయనా దాని గురించి పెద్దగా చెప్పుకోరు. కేంద్ర కార్మిక మంత్రిగా వుండగా తెలంగాణకు ఏమీ చేయలేదని విమర్శకులు అంటూనే వున్నారు. ఆ సమయంలో జరిగిన నియామకాల్లో కూడా తెలంగాణ వారికి ఏమీ ఒరగబెట్టలేదని యిప్పుడు మోత్కుపల్లి అంటున్నారు. రేపు తెలంగాణ ఏర్పడితే కెసియార్ లెక్కప్రకారం ఆయనే సిఎం కావాలి. కానీ ఆయన దళితుణ్ని సిఎం, ముస్లింను డిప్యూటీ సిఎం చేస్తానంటున్నారు. కెటియార్, హరీష్‌లను ఏం చేస్తారో మరి ! బాల థాకరేలా తను రిమోట్ చేతిలో పెట్టుకుని కథ నడపాలని ఆయన అనుకున్నా ఆయన అభిమానులు కెసియార్ కనీసం ఓ ఏడాదైనా తెలంగాణకు సిఎం కావాలని వాంఛిస్తారు. ఇవన్నీ తెలంగాణ ఏర్పడ్డాక చెప్పుకోవలసిన ముచ్చట్లు.

అది వచ్చేవరకు ఆయన ఉద్యమనాయకుడి పాత్రే వేస్తున్నారు. దాన్నయినా సమర్థవంతంగా వేయకపోతే ఎలా? అన్నది ప్రశ్న. జాక్ ఒకటి సృష్టించి కోదండరాం చేతికి యిచ్చేశాం కదా అనుకుంటే పొరబాటు. కోదండరాం స్వతహాగా గ్లామర్ లేని మనిషి. ఆయన ప్రసంగం కూడా ఏ మాత్రం ఉత్తేజకరంగా వుండదు. మాటలు పేర్చుకుంటూ మాట్లాడినట్లు వుంటుంది. ఏ ఎమోషనూ పలకదు. ఆయన పాఠాలు చెప్పేటప్పుడు సగం మంది విద్యార్థులు నిద్రపోయేవారని ఎవరైనా చెప్పినా నేను ఆశ్చర్యపడను. కెసియార్‌కు ఆయన ఏ విధంగానూ సాటి రాడు. కెసియార్ నిరంతరం చురుగ్గా వుండి నడిపిస్తేనే తెలంగాణ ఉద్యమం ముందుకు సాగుతుంది. ఆయన ఎప్పుడు ఏ బాణం వేస్తాడో అని ప్రత్యర్థులు ఉగ్గబట్టుకుని చూస్తారు. ప్రత్యేక తెలంగాణ కోసం శ్రమించేందుకు విభిన్నవర్గాల మేధావులు, కార్యకర్తలు తనను కలుసుకోగలిగే వీలు కల్పించినపుడు కెసియార్ వారిలో స్ఫూర్తి నింపగలుగుతారు. ఆయన ఎవరికీ దొరక్కుండా వుంటే ఎలా?

గాంధీ, పెరియార్, అణ్నాదురై, యిప్పుడు అన్నా హజారే... వీళ్లందరూ జనాలలోనే తిరిగారు కదా. వాళ్లను స్వయంగా కలిస్తే, షేక్ హ్యాండ్ యిస్తే యిన్‌స్పయిరై పోయే యువకులు ఎంతమందో ! కెసియార్ జనంలో తిరిగిన కొద్దీ ఆయన బలం పెరుగుతుంది. అనుయాయులు పెరుగుతారు. ఆయనకు బయటకు తిరిగేటంత ఓపిక లేకపోతే కనీసం బాల థాకరే లాగ తన పత్రికలో సంపాదకీయాలు, వ్యాసాలు రాయవచ్చు. దేశంలో అనేక విషయాలపై పత్రికాముఖంగా స్పందిస్తూ తనకంటూ ఓ సైన్యం ఏర్పాటు చేసుకోవచ్చు. కెసియార్‌కు యిప్పుడు నమస్తే తెలంగాణ దినపత్రికా వుంది. టి ఛానెల్ వుంది. వాటిలో నిత్యం వ్యాసాలు రాయవచ్చు. టీవీ ఛానెల్‌లో వారం వారం ముఖాముఖీగా ప్రజలతో మాట్లాడవచ్చు. అవే మాటలు డాఎ శ్రవణ్ చెపితే మనం పట్టించుకోకపోవచ్చు. కానీ కెసియార్ చెపితే ఉత్ప్రేరకరంగా వుంటుంది.

ఇవన్నీ నాకే తెలిసినపుడు కెసియార్‌కు తెలియదా? తెలుసు. అయినా గోడను అంటిపెట్టుకుని వుండడానికే నిశ్చయించుకున్నారు. ఉద్యమం 'కీలకదశ' చేరిన యీ సమయంలో కూడా ! ఎవరో చెప్పి వుంటారు – 'నీ పాత్ర యింకా రాలేదు. నువ్వు వింగ్స్‌లో రెస్టు తీసుకుంటూ వుండు. పిలిచినపుడు వచ్చి రంగప్రవేశం చేద్దువుగాని' అని. ఎవరు వారు? సకల జనుల సమ్మె ఎటూ కాకుండా ముగిసిన తర్వాత కెసియార్ నిస్తేజంగా వుండడానికి కారణం ఢిల్లీలో ఆయన కుదుర్చుకున్న ఒప్పందమే అంటున్నారు టిడిపి వారు. వారి పట్ల సానుభూతి వున్న కొండా లక్ష్మణ్ బాపూజీ కూడా కెసియార్‌ను నిందిస్తున్నారు. పోలవరం కాంట్రాక్టర్ భాగస్వామి, కెసియార్ భాగస్వామి ఒకరే కావడం టిడిపికి కలిసి వచ్చింది. చంద్రబాబు యీ మధ్య కెసియార్‌పై ప్రత్యక్ష ఆరోపణలు చేస్తున్నారు. వీటన్నిటినీ కెసియార్ ప్రతిభావంతంగా తిప్పి కొట్టడం లేదు. ఎప్పుడో మూణ్నెల్ల తర్వాత 'వెకిలి మాటలకు నేను సమాధానం చెప్పనక్కరలేదు' అనేస్తే సరిపోదు. నాయకుడికి విశ్వసనీయతే ముఖ్యం.

ఇటీవలి కాలంలో యితర పార్టీ నాయకుల నుండి తెరాసకు వలసలను ఆహ్వానిస్తుండడం చూస్తే కెసియార్ ఉద్యమకారుడిగా స్తబ్ధత పొంది, రాజకీయనాయకుడిగా వుందామనుకున్నా రనిపిస్తుంది. ఆయన యిటీవల 2014 ఎన్నికల గురించే ఎక్కువ మాట్లాడుతున్నారు. అన్ని సీట్లూ మనం సంపాదిస్తే అవతలివాళ్లు చచ్చినట్టు దిగి వస్తారని చెప్తున్నారు. అంటే ఆయన లక్ష్యం తెలంగాణలోని మొత్తం అసెంబ్లీ, పార్లమెంటు సీట్లను తన చేతిలోకి తెచ్చుకోవడం. పార్టీ అంటూ పెట్టాక ఆ మాత్రం ఆశలుండడం తప్పు కాదు, రేదర్ వుండాలి కూడా.

అయితే తెరాసకు వెన్నెముక తెలంగాణ ఉద్యమం. కెసియార్ ఒక్కరే తెలంగాణపై రాజీపడని నాయకుడన్న పేరు తెచ్చుకోవడం.

ప్రత్యేక తెలంగాణ రావాలని బలంగా కోరుకునే నియోజకవర్గాలలో అదే ఓట్లు కురిపిస్తుంది. మొన్న బాన్సువాడ ఉపయెన్నికలో అది కురిపించాల్సిన ఓట్లను కురిపించలేదంటేనే కెసియార్ క్రెడిబిలిటీకి కాస్త విఘాతం తగిలినట్టు అనిపించింది. అయినా ఆ తర్వాత కూడా నాయకుల వలసలు కొనసాగాయి. అంటే నాయకులలో కెసియార్‌పై క్రెడిబిలిటీ అలాగే వుందన్నమాట. కానీ రాబోయే ఉపయెన్నికలలో ఓటర్లు కెసియార్ పట్ల తమ విశ్వాసం సడలిందని ప్రదర్శిస్తే నాయకులూ తటపటాయిస్తారు. ఈ విషయాన్ని గోడకున్న తుపాకీ గ్రహించాలి. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 27** **ఎమ్బీయస్ : తెలంగాణ ఆత్మహత్యలపై ప్రశ్నలూ, ఓ కథా**

కుంభకర్ణుడు మేల్కొన్నాడు. తుపాకీ పేలింది. మాటల తూటాలు పేలాయి. ఇదే సరైన సమయం అనుకున్నారేమో ! సరైన వేదికగా ఆయన భావించినది – తెలంగాణ లెక్చరర్స్ ఫోరం వారి క్యాలండర్ ఆవిష్కరణ ! ఆ వేదిక మీదనుండే బాబును తిట్టారు, (అన్నా హజారేకు మేనమామ అనుకుంటున్నాడు) మన్‌మోహన్‌ను తిట్టారు (చప్రాసీల కున్నపాటి జ్ఞానం కూడా లేదు), టిటిడిపి వాళ్లను తొట్టి గ్యాంగ్ అన్నారు, కుక్కల కంటె హీనంగా అరుస్తున్నారన్నారు. అన్నీ అని ' కెసియార్ మాట్లాడినా వార్తే, మాట్లాడకపోయినా వార్తే' అని సెల్ఫ్ డిక్లరేషన్ యిచ్చుకుని, సంక్రాంతి తర్వాత మళ్లీ ఉద్యమాన్ని వేడెక్కించి, (ఈ పండగ ముహూర్తాలేమిటో బాబూ అని కమ్యూనిస్టు నారాయణ గారి గోల, లెనిన్ పుట్టినరోజున, స్టాలిన్ చచ్చిన రోజున అంటే సంతోషించేవారేమో) పార్లమెంటు బజెట్ సమావేశం టైములో దీక్ష చేస్తానని ప్రకటించారు. ఇన్నాళ్లూ ఊరికే వుండడానికి కారణం చెప్పారు. 'కొంత సమయం కావాలని వాళు ్లు అడిగారు. ఇచ్చాం.' అని ! ఎవర్నడిగి యిచ్చారో మరి! ఆలస్యమైనా ధర్మం గెలుస్తుందని అంటూ తెలంగాణ రావడానికి ఆలస్యమవుతుందని చెప్పకనే చెప్పారు. మోత్కుపల్లి ఛాలెంజ్ స్వీకరించి ఉరేసుకోవడానికి గన్‌పార్కుకి ఎందుకు రాలేదని విలేకరులు అడిగినట్టు లేదు. పేపర్లలో ఏమీ రాలేదు. మరొకరెవరైనా అయితే విలేకరులు యిలాటివి అడుగుతారు కానీ కెసియార్ అంటే వాళ్లకు భయభక్తులున్నాయి. అడగరు.

కానీ మోత్కుపల్లికే భయం లేదు. కెసియార్‌ను ఏకంగా హంతకుడనేశారు. తెలంగాణకై చేసుకున్నవి ఆత్మహత్యలు కావు, హత్యలు అన్నారు. ఉద్యమం కారణంగా విద్యార్థుల, యువత భవిత నాశనమైందని వాపోతూనే ఈ హత్యలకు కారణం కెసియార్ అన్నారు. ఇవాళ పొద్దుటినుండి ఇక దానిమీద చర్చలే చర్చలు. మోత్కుపల్లిపై తెరాసవారు కారాలూ, మిరియాలూ నూరుతున్నారు. మధ్యాహ్నానికల్లా యర్రబెల్లి దయాకరరావు తన పార్టీ సహచరుడి మాటల్నే ఖండించవలసి వచ్చింది. ఎందుకంటే యిన్నాళ్లూ ఈ టిటిడిపివారు తెలంగాణకోసం 700 మంది బలిదానాలనీ, వీళ్లందరినీ ఆంధ్రావాళ్లే పొట్టన పెట్టుకున్నారనీ తిడుతూ వచ్చారు. అబ్బే అవి ఆత్మహత్యలు కావు, వెనుకబడిన వర్గాలకు ఆశ చూపి చేసిన హత్యలు అని ఈయన అనడంతో తబ్బిబ్బు పడిపోయారు. ఇప్పుడు ప్లేటు ఫిరాయిస్తే బాగుండదు మరి.

ఢిల్లీలో ఒకబ్బాయి ఉరి వేసుకున్నపుడు హత్యలా? ఆత్మహత్యలా? అని గతంలోనే నేను వ్యాసం రాశాను. అనేక ప్రశ్నలు లేవనెత్తాను. (ఆత్మహత్య వుత్తరం గురించి ఢిల్లీ పోలీసు కూపీ లాగుతున్నారన్నారు. వాళ్ల ఫైండింగ్స్ ఏమిటో బయటకు రాలేదు. రాష్ట్రపోలీసులు కూపీ లాగే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. అది ఎక్కడికి దారి తీస్తుందోనన్న భయం వారిది.) మాదిగ పోరాట సమితి గాంధీభవన్‌పై చేసిన దాడి సందర్భంగా చనిపోయిన కార్యకర్త తండ్రి మంద కృష్ణపై చేసిన ఆరోపణలను కూడా ప్రస్తావించాను. నేను యీ ఆత్మహత్యల గురించి అడిగేది ఎప్పుడూ ఒకటే – అంత ధైర్యంగా ప్రాణం తీసుకునేవాడు చాటుమాటుగా చావడమేల అని. 'నేను ఒక వివాహితుణ్ని ప్రేమించాను. వాడు నాకు కడుపు చేశాడు. వాడు నన్ను రెండో పెళ్లాంగా స్వీకరించేవరకూ నేను దిగిరాను, ఇక్కణ్నుంచి దుమికేస్తాను' అని యువతులు సిగ్గు విడిచి ఊళ్లో వాటర్ ట్యాంక్ ఎక్కి అల్లరి చేసే రోజులివి. అలాటిది రాష్ట్రసాధన అనే ఒక నోబుల్ కాజ్ కోసం చనిపోవడానికి సిద్ధపడినవాడు బహిరంగంగానే చనిపోతాడు తప్ప అర్ధరాత్రి, తెల్లవారు ఝామున చనిపోవడమేమిటి?

పైగా వీళ్లంతా యువకులు, విద్యార్థులు. బ్లాగుల్లోనే బోల్డంత రాయగల ఘనులు. కాలేజీ క్యాంపస్‌లో ఆవేశంగా మాట్లాడగల వక్తలు. అలాటి వాళ్ల సూసైడ్ నోట్స్ చూడండి, ఎంత పేలవంగా వుంటున్నాయో ! చాలామంది ఒకటి రెండు లైన్లు రాసి వూరుకుంటున్నారు. 'తెలంగాణ రాదన్న నిరాశతో చనిపోతున్నాను' అనే అనేకమంది రాశారు. సంఘం గురించి, సమాజం గురించి, రాజకీయ నాయకుల గురించి ఓ నాలుగు తిడుతూ రాసినా ఓ పద్ధతిగా వుండేది. అసలు ఈ తెలంగాణ ఆత్మహత్యల గురించి సోషల్ సైంటిస్టులు పరిశోధన చేస్తే చాలా విషయాలు బయటకు వస్తాయి. మండల్ కమిషన్ టైములో చేసుకున్న ఆత్మహత్యల గురించి ఓ అధ్యయనం జరిగింది. అప్పుడు చేసుకున్నవారు పబ్లిసిటీ గురించే చేసుకున్నారని తేల్చారు. ఏ లెవెల్లో కాల్చుకుంటే మరణం సంభవిస్తుందో, లేక మరణం అంచుల దాకా వెళ్లి తిరిగి రావచ్చో వాళ్లకు తెలియదు. క్లాసులో నేర్పరు కదా.

పక్కనున్న వాళ్ల హామీలు ఎంతవరకు నమ్మాలో తెలియదు. 'నువ్వు కిరోసిన్ చల్లుకుని నిప్పు ముట్టించుకో, మేం యీ క్యాన్‌లో వున్న చన్నీళ్లతో ఆర్పివేస్తాం' అని వాళ్లను ముందుకు తోయవచ్చు. తీరా చూస్తే ఆ క్యాన్‌లో పెట్రోలు పెట్టుకుని వుండవచ్చు. నీళ్లున్నా గలభాలో పోయలేకపోవచ్చు. నాకు గుర్తున్నంతవరకు శ్రీకాంతాచారి కూడా తను బతుకుతాడనే, రాజకీయ నాయకుడిగా ఎదుగుతానని

అనుకుని యింట్లో అలా చెప్పి వెళ్లాడు. పాపం అతను అనుకున్నట్టు జరగలేదు. తర్వాత మూణ్నాలుగు రోజుల తర్వాత హాస్పటల్‌లో చనిపోతూ యిచ్చిన మరణవాఙ్మూలంలో తెలంగాణ కోసమే చనిపోయానని యిచ్చాట్ట. అప్పుడున్న ఎమోషనల్ కండిషన్ ఎలా వుందో, చుట్టూ ఎవరున్నారో, ఏం చెప్పారో ఏమీ తెలియదు. గతంలో వరకట్న చావుల్లో అత్తవారి చేత కాల్చబడినవారు సైతం చనిపోతూ పోతూ 'గ్యాస్ సిలిండరు పేలిందనే' చెప్పేవారు. అలా చెప్పకపోతే మీ పుట్టింటివారి పనిబడతామని అత్తవారు బెదిరించేవారట.

ఇప్పుడు ఆ మరణవాఙ్మూలం పెట్టుకునే తెరాసవారు మోత్కుపల్లిని ఖండిస్తున్నారు. మోత్కుపల్లి వంటి సీనియర్ నాయకుడికి యిలా జరుగుతుందని ముందే తెలిసి వుంటుంది. సరిగ్గా చంద్రబాబు ఉద్యమానికి పుట్టినిల్లయిన కరీంనగర్ జిల్లాకు యాత్ర వెళ్లినప్పుడే అనడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. అయినా ఆయన ధైర్యంగా ఆ చావుల్ని చర్చకు పెట్టారు. అందుకు అభినందించాలి.

ప్రత్యేక తెలంగాణ గురించి ఉద్రేకం తగ్గి, ఆలోచన పెరుగుతోంది. అందుకే సకలజనుల సమ్మె క్రమేపీ నీరుకారింది. విద్యార్థులకు చదువు పోవడం గురించి అందరూ చర్చించసాగారు. దెబ్బకి టీచర్లు, లెక్చరర్లు దిగి వచ్చి సమ్మె విరమించారు. ప్రభుత్వం కఠిన వైఖరి చూపడంతో ఆర్టీసీవారూ వెనక్కి తగ్గారు. వెనక్కి తగ్గిన ఆర్టీసీ యూనియన్ మట్టికొట్టుకు పోతుందనుకున్నారు. మొన్న వాళ్ల క్రెడిట్ కోపరేటివ్‌కి ఎన్నికలు జరిగితే వాళ్లవే మెజారిటీ సీట్లు. ప్రభుత్వోద్యోగులు కూడా చేతులెత్తేశారు. ఓడిపోయి కాదు, మనం సమ్మె చేసి ప్రయోజనం లేదు, రాజకీయ నాయకులు మనల్ని పావులుగా చేసి ఆడుకుంటున్నారని వాళ్లు గుర్తించారు. అవిశ్వాస తీర్మానం టైములో చూడండి, తెలంగాణ కాంగ్రెస్ నాయకులందరూ ప్రభుత్వానికి అండగా నిలిచారు. తెలంగాణ ఎంపీలు కూడా పార్లమెంటులో గొడవ మానేశారు. అంటే ఏం చేసినా తమ పార్టీ చట్రంలోనుండి బయటకు రావడం లేదన్నమాట!

ముఖ్యంగా అందర్నీ ఆకట్టుకున్న పాయింటు ఒకటుంది – ఉద్యమంలో నాయకుల పిల్లలు ఎందుకు చావటం లేదు అని ! ఎవర్నీ చావాలని మనం కోరుకోకూడదు. కానీ నాయకుల పిల్లలు విలాసజీవితంలో భాగంగా యాక్సిడెంట్లలో పోతున్నారు తప్ప ఉద్యమంలో చావటం లేదు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ కోసం ఉద్యమంలో భాగంగా 'ఆమరణ' నిరాహారదీక్ష చేసి బతికారు. కొడుకు పాపం పోయాడు – దీక్షలు చేస్తూ కాదు, వేగంగా కారు నడుపుతూ..! ఈ నాయకులు బీదపిల్లలలో నిరాశనింపి వాళ్ల చావుకి కారణమవుతున్నారు, మరో పక్క స్వంతపిల్లలకు విలాసాలు మప్పి వాళ్ల చావుకీ కారణమవుతున్నారు. ఇవి సామాన్యప్రజలకు తేటతెల్లం అవుతున్నాయి లాగుంది. వాతావరణంలో మార్పు గమనించే మోత్కుపల్లి వీటి గురించి చర్చ ప్రారంభించారు.

ఏది ఏమైనా తెలంగాణకై జరిగిన అన్ని చావులనూ ఒకే గాటికి కట్టలేం. అన్నీ ఆత్మహత్యలు కాకపోవచ్చు, అలాగే అన్నీ హత్యలు కాకపోవచ్చు. యువతను రెచ్చగొడితే వాళ్లకు మతిపోయి, ఏమైనా చేయగలరు. ఆవేశంలో ఉసురు తీసుకున్నవాళ్లను ఆకాశానికి ఎత్తేయడం మానేస్తే 90% చావులు ఆటోమెటిక్‌గా ఆగిపోతాయి. కానీ యీ నాయకులు ఆకాశానికి ఎత్తేయడం మానటం లేదు. ఎందుకంటే వాళ్లకు ఆ అంకెలే కావాలి. కృష్ణ కమిటీ స్టాటిస్టిక్స్ బయటకు వచ్చాక 'తెలంగాణ వెనకబడి వుంది కాబట్టి ప్రత్యేకరాష్ట్రం కావాలి' అనడం లేదు. 'తెలంగాణ కోసం 700 మంది చనిపోయినా తోలుమందం ప్రభుత్వం చలించలేదు, రాష్ట్రం యింకా యివ్వలేదు. వెంటనే యివ్వాలి..' యిలాగే మాట్లాడుతున్నారు. పబ్లిక్ మీటింగుల్లోనే కాదు, పార్లమెంటులో కూడా యిలాటి ధోరణే ! ఈ సమాధులపై తమ రాజకీయ పునాదులు ఏర్పరచుకోవడం అత్యంత హేయనీయం !

మోత్కుపల్లి వద్ద ఆధారాలుంటే ఆయన కోర్టుకి వెళ్లవచ్చు, ఫిర్యాదు చేయవచ్చు. చేస్తారని నాకు నమ్మకం లేదు. శ్రీకాంతాచారి తల్లి ఆయన్ని తిడుతోంది. వాళ్లు అమరవీరులుగా చెలామణీ అయితేనే వాళ్ల కుటుంబాలకూ గుర్తింపు. కానీ యీ గుర్తింపు ఎంతకాలం? మరొకడు చనిపోయేదాకానే కదా ! అయితే ఆ పుత్రశోకం మాత్రం జీవించి వున్నంతకాలం వెంటాడుతూనే వుంటుంది. పగవాడికి కూడా ఆ బాధ వద్దు. శ్రీకాంతాచారి తల్లికి తన తనయుడు ఉద్యమం కోసమే చనిపోయాడని నమ్ముతోంది కాబట్టి ఆవిడకు ఎంతో కొంత వూరట. పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పిస్తున్న కొడుకు ఏ కారణం చేత చనిపోయాడో తెలియని తలిదండ్రుల మాట ఏమిటి? పేపరు వార్తలు నమ్మాలా? నమ్మి వూరుకోవాలా? అటువంటి తండ్రిని వ్యవస్థను నిలదీస్తే ఏమవుతుంది? మధ్యలో మీడియా ఎటువంటి పాత్ర పోషిస్తుంది? అన్న వూహతో నేను రాసిన కథ చదవండి –

## ఒక చావు – ఇద్దరు తండ్రులు

"...అయితే ఏమంటారు? మీ అబ్బాయిది ఆత్మహత్య కాదంటారు, హత్యే నంటారు. పావుగంట నుంచి అదే పాట. .. గట్టిగా అడిగితే అనుమానం అంటారు.. ఆధారాలేవంటే అబ్బే లేవంటారు..." సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహీధర్ విసుక్కున్నాడు.

"..ఇన్వెస్టిగేట్ చేసి ఆధారాలు కనిపెట్టడం పోలీసుల పని అనుకుంటున్నాను.." నెమ్మదిగానే అన్నా దృఢంగా అన్నాడు రాజారాం.

మహీధర్ మండిపడ్డాడు. "ఏమిటి వెటకారమా..? తెలంగాణాకోసమంటూ యిప్పటిదాకా నాలుగువందలమంది స్టూడెంట్సు, యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాళ్లలో మీవాడు ఒకడు. నాకు ఆత్మహత్యగానే తోచింది. కేసు అలాగే ఫైల్ చేశాం. కాదని అంటున్నది మీరు. ఎందుకు కాదో, దానికి రుజువేమిటో చెప్పాల్సింది మీరు, నేను కాదు.."

"...మా వాడిది ఆత్మహత్య చేసుకునే స్వభావం కాదండి...బాగా చదువుకుని పైకి వద్దామనుకునే కుర్రాడు.."

"..ప్రతీ తండ్రీ అదే చెప్తాడు. వాడు కాలేజీ కెళ్లి ఏం చేస్తున్నాడో, ఎటువంటి మెంటాలిటీ వున్నవాళ్లతో తిరుగుతున్నాడో మీకేం

తెలుసు? మీరైతే హాస్టల్‌లో పడేశారు కూడా. అక్కడ రూమ్‌మేట్స్ ఏం రెచ్చగొట్టారో ఏమో. చిన్నవయసు. అమరవీరుడై పోదామన్న ఆవేశం.. ఐ యామ్ సారీ... చాలామంది యిదే కేసు..”

‘‘.. మేం వరంగల్‌లో వుంటాం. మా వాడికి ఉస్మానియాలో సీటు వచ్చింది కాబట్టి, హాస్టల్లో..”

మహీధర్ ఫక్కున నవ్వాడు. ‘‘..వరంగల్.. పోరాటాల పురిటిగడ్డ.. యింకేం.. మీ వాడికి అక్కడే ట్రైనింగ్ అయిపోయి వుంటుంది... బాగా ఎక్కించేసి వుంటారు– ‘నువ్వు చావరా, ఛస్తే తెలంగాణా వచ్చేస్తుంది. మీ అమ్మకో, నాన్నకో టిక్కెట్టిచ్చేస్తారు... వాళ్లు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిపోతారు’...అని”

రాజారాం చివ్వున కుర్చీలోంచి లేచాడు “మీరు చాలా హేళనగా, అన్యాయంగా మాట్లాడుతున్నారు. మాకు ఎమ్మెల్యే ఎంపీ పోస్టులు అక్కర్లేదండి. అసలు మావాడికి అలాటి ఆలోచనలే లేవంటే నమ్మరేం? తెలంగాణా రాదనే భయంతో ఆత్మహత్యలు చేసుకునేవారి గురించి నిరసనగా మాట్లాడేవాడు..”

‘‘..అలా మాట్లాడేవాళ్లు కూడా తమదాకా వచ్చేసరికి ఆవేశానికి లోనవుతారు. మీ వాడి ఉత్తరంలోకూడా వుందిగా – తెలంగాణా రాదన్న భయంతో చేసుకుంటున్నానని..”

‘‘..అసలా ఉత్తరమే బోగస్సండి. మా వాడు తెలుగులో అంత యిదిగా రాయలేడు. ఎప్పుడూ ఇంగ్లీషే. అయినా ఆత్మహత్య చేసుకునేవాడు పదిమందిని పిలిచి అందరికీ చెప్పి ఏ టవర్‌మీదనుండో ఉరికేస్తాడు తప్ప యిలా చాటుగా తెల్లవారుఝామున జాగింగ్ చేస్తూ పెట్రోలు పోసుకుని కాల్చుకోడండి.. ప్లీజ్ అప్లయ్ యువర్ మైండ్..” ఆవేశపడుతున్నాడు రాజారాం.

మహీధర్ బింకంగా మునగదీసుకుని కుర్చీలో కూర్చున్నాడు “చాలామంది అలా చేసుకుంటున్నారు..”

‘‘..అయితే వాళ్లవీ హత్యలేనేమో..చంపేసి పక్కన ఓ ఉత్తరం పడేస్తున్నారేమో..”

“గ్రేట్ ఇమాజినేషన్! కానీ వాళ్ల పేరెంట్సు ఎవరూ వచ్చి యిలా గోల చేయడం లేదు...”

“గోల చేసినా ఏం లాభం వుంది? మీరు యిప్పటిదాకా నా వెర్షన్ రికార్డు చేయడం లేదు..”

“నేనెందుకు చేయడం? టీవీ ఛానెల్స్ రికార్డు చేశాయిగా..” కచ్చగా అన్నాడు మహీధర్.

రాజారాం మహీధర్ కేసి దీర్ఘంగా చూసి నిట్టూర్చాడు. కుర్చీలో కూలబడి “అర్థమైంది. టీవీలో మాట్లాడేనని మీ కోపం. అందుకని కేసు రీ ఓపెన్ చేయనంటున్నారు. ఓకే.. బట్ వన్ థింగ్.. యాజే పేరెంట్ నేనెంత బాధపడుతున్నానో నాకు తెలుసు. రాజకీయంగా ఒత్తిడి తేవడానికి కొన్ని శక్తులు మావాడి లాటి వారిని బలిపశువుల్ని చేస్తున్నారు. తెలంగాణా వచ్చినా రాకపోయినా మా వాడికి వర్రీ ఎందుకండి? వాడు బ్రైట్ స్టూడెంట్. యుఎస్ వెళ్లిపోయే కాండిడేట్...”

‘‘..ఇలాటివాళ్లు వాళ్ల స్వార్థం కోసం చూసుకోరండి. ప్రత్యేకరాష్ట్రం వస్తే మీకు లాభం వుండవచ్చు, మీ ఫ్యామిలీకి పొలిటికల్‌గా లాభం వుండవచ్చు...మీరు టీవీ వాళ్లకు అవేమీ చెప్పరుగా.. ఓకే యిప్పుడు చెప్పండి..మీ వాణ్ని బలిపశువు చేసినవాళ్లెవరు? కమాన్.. ఔట్ విత్ ద నేమ్.. రాసి యివ్వండి.. వాళ్లని పట్టుకుని వచ్చి మీ ఎదురుగా కటకటాల వెనక్కు తోస్తాను..”

రాజారాం నిస్సహాయంగా చూశాడు. “నాకేం తెలుస్తుందండి. ఎవరిమీదనని చెప్తాం? అనేక స్టూడెంట్స్ యూనియన్లున్నాయి. యూనివర్శిటీ కాంపస్‌లో మావోయిస్టులు కూడా వున్నారన్నారు. స్టూడెంట్స్ కానివాళ్లు కూడా చొరబడుతున్నారు. నాగం గారి యిన్సిడెంట్‌లో అతను లాయరుట కదా..”

మహీధర్ వెక్కిరించాడు “ఎవరి మీదా చెప్పలేరు కానీ పోలీసులు ఏమీ చేయటం లేదని మాత్రం టీవీ వాళ్లకు చెప్పడంవచ్చు..”

రాజారాం బిక్కమొహం వేశాడు. “ఆ మాట నేను అందామని అనుకోలేదండి. టీవీ వాళ్లే రొక్కించి రొక్కించి అడిగారు ‘పోలీసులు ఎవరినైనా అరెస్టు చేశారా?’ అని. లేదని చెప్పానండి. ‘పోలీసుల నిరాసక్తత – అమరవీరుని కన్నతండ్రి ఆక్రోశం’ అని స్క్రోలింగ్స్ వచ్చేశాయండి.”

“ఓహో, మీదేం తప్పు లేదంటారు.. అయితే వెళ్లి యింకో స్టేటుమెంటు యివ్వండి. మా అబ్బాయిది ఆత్మహత్యే అని నమ్ముతున్నాను అని..”

“అలా ఎలా యిస్తానండి? మా వాడిది ముమ్మాటికీ హత్యే. అసలు మావాడు ఆత్మహత్య చేసుకునే రకం కాదు.”

బల్లమీద అరచేత్తో బాదుతూ మహీధర్ సర్రున లేచాడు. “మళ్లీ మొదటికి వచ్చాడు...హత్యట హత్య.. ఎవర్ని అనుమానిస్తున్నావంటే చెప్పడు. అసలు నువ్వే ఎంకరేజ్ చేశావేమో.. ఇలాటి ఆరోపణ చేసి మీడియా ద్వారా గుర్తింపు తెచ్చుకుని రేపు ఓ పెద్ద లీడరువి అయిపోతావ్... ఆల్ ఎట్ ది కాస్ట్ ఆఫ్ ది పోలీస్.. గెటౌట్ ..యూ బ్లడీ..” బలవంతాన మాట మింగేసి చేతిని గుమ్మంవైపు చూపాడు.

ముఖం తుడుచుకుంటూ పోలీసు స్టేషన్ బయటకు వస్తూన్న రాజారాంను వన్‌టూత్రీ టీవీ ఛానెల్ స్టాఫ్ చూశారు. “నిన్న స్టేటుమెంటు యిచ్చినది యీయనే, పట్టుకో శేఖర్! వేరే ఛానెల్ వాళ్లు ఎవరూ లేరు. మంచి ఎక్స్‌క్లూజివ్ అవుతుంది.”

శేఖర్ అడుగుతున్న కొద్దీ రాజారాం మహీధర్‌పై తన ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు. మంచీ మర్యాదా లేకుండా మాట్లాడాడన్నాడు. తన పుత్రశోకం అర్థం చేసుకోకుండా హేళన చేశాడన్నాడు. తనపై చేసిన ఆరోపణ చెప్పాడు. శేఖర్ అతన్ని అనేక ప్రశ్నలు వేశాడు. పోలీసు వ్యవస్థపై అతని అభిప్రాయాలు తెలుసుకున్నాడు. చనిపోయిన కిరణ్ గుణగణాలు చెప్పించాడు. చివర్లో “సిఐ మహీధర్

యిలా ప్రవర్తించడానికి కారణం ఏమిటనుకుంటున్నారు? మీరు వరంగల్ వారనా?" అని అడిగాడు.

రాజారాం కన్ఫ్యూజ్ అయ్యాడు. "వరంగల్ అయినా, హనుమకొండ అయినా ఒకటే. పెద్దమనుష్యులతో ఎలా ప్రవర్తించాలో పోలీసులకు ప్రత్యేకంగా ట్రెయినింగ్ యిప్పించాలని నేను సూచిస్తున్నాను.."అంటూ ఏదో చెప్పబోయాడు.

శేఖర్ అతన్ని కట్ చేసి "ఆయనకు ఉద్యమాల పట్ల సదభిప్రాయం లేదని మీ మాటల వలన తెలుస్తోంది. నేను అడిగేది ఏమిటంటే – ఆయన యిక్కడివారు కారు కాబట్టే మీ పట్ల నిర్దయగా ప్రవర్తించారన్న అనుమానం మీకు కలిగిందా?"

"ఇక్కడివారో ఎక్కడివారో.. అసలు ఒక బాధితుడి పట్ల.." రాజారాం చెప్పబోయాడు.

శేఖర్ మళ్లీ అడ్డుకున్నాడు. "ఆయన భాష, యాస చూస్తే తెలంగాణావారనిపిస్తోందా? లేక సీమాంధ్ర ప్రాంతం నుండి వచ్చినవారనిపిస్తోందా?"

"ఏమోనండి. భాష అంటే... మనందరం మాట్లాడినట్టే ఆయనా మాట్లాడుతున్నాడు. చదువుకున్నవాళ్లందరమూ ఒకేలా మాట్లాడతాం కదా. అది యిస్యూ కాదండి. ఇట్ యీజ్ ద క్వశ్చన్ ఆఫ్ బిహేవియర్.."

శేఖర్ "ఇక చాలండి. లాస్ట్‌లో మా పంచ్‌లైన్ చెప్పండి. 'టీవీ వన్ టూ త్రీ – కాస్త పూలు, బోల్డు పత్రీ"

రాజారాం తెల్లబోయాడు. "అదేమిటి?"

"కొత్త ఛానెల్ కదండి. ఇంటర్వ్యూ చేసినవాళ్ల చేత పంచ్‌లైన్ చెప్పిస్తాం. ఇవన్నీ కలిపి బైట్స్‌గా వాడుకుంటాం..."

"పత్రేమిటి మధ్యలో?"

"వినాయకుడికి పూలతో బాటు పత్రి కూడా వేస్తాం కదా. అలాగ కాస్త న్యూస్‌తో బాటు కొంత మసాలా కూడా వుంటుందని సజెషనండి..త్వరగా చెప్పేయండి. లేకపోతే యింటర్వ్యూ టెలికాస్ట్ కాదు."

ఇంకో పావుగంటకల్లా రాజారాం యింటర్వ్యూ, స్క్రోలింగ్స్ వచ్చేశాయి.

– 'వరంగల్ వారికి పోలీసు సాయం అందదా?'

– 'తెలంగాణాలో పుట్టడమే పాపమా?'

– 'సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహీధర్ సీమాంధ్రుడేమో!? : రాజారాం'

– 'తెలంగాణా బలిదానాలపై పోలీసుదళాల వెక్కిరింత',

– 'ప్రశ్నించిన నేరానికి దూషణకు గురైన కన్నతండ్రి ఘోష'

– 'అమరవీరులకు ఆత్మగౌరవం సైతం దక్కనివ్వని సీమాంధ్ర పోలీసులు'

మరో పావుగంటలో యింకో ఛానెల్‌లో చర్చ ప్రారంభమైంది. 'సీమాంధ్ర ఉద్యోగుల హయాంలో బాధితులకు ఊరట దక్కేనా?' అని. ఆ చర్చలో పాల్గొన్నవారిలో ఒకరు మహీధర్ తెలంగాణావాడై వుండవచ్చు కదా అని అడిగారు. తెలంగాణా వారెవరూ సాటి తెలంగాణావాడిపై యింత అసహనంతో మాట్లాడరు కాబట్టి ఆయన సీమాంధ్రుడే అయి వుంటాడని మరొకాయన అన్నారు. తెలంగాణాలో యావన్మందీ ఉద్యమంపై సానుభూతి కలవారే కాబట్టి యీయన సెటిలర్ అయి వుండాలని మూడో ఆయన అన్నారు. అతి త్వరలోనే వాళ్ల స్వరాలు పెరిగాయి.

ముగ్గురు ఒకేసారి మాట్లాడడంతో వాళ్లను ఆపడానికి మోడరేటర్ ఫోన్ కాలర్‌ను ఆహ్వానించారు. అతను అసందర్భంగా జగన్‌పై సోనియా కచ్చ గురించి మాట్లాడాడు. వరంగల్ స్టూడియోలో వున్నామె దీన్ని ఖండించి కిరణ్ పరిపాలనను మెచ్చుకుంది. ఈ లోపున స్టూడియోలో వున్నవారి స్వరాలతో బాటు చేతులు కూడా లేవడంతో ప్రోగ్రాం అర్ధాంతరంగా ముగిసింది.

మహీధర్ ఎపాయింట్‌మెంట్ రికార్డు వెలికి తీయాలని, దానిలో అతను తెలంగాణావాడని వుంటే ఆ డాక్యుమెంట్లు నిజనిర్ధారణ కమిటీకి పంపాలని కాంగ్రెస్ సీనియర్లు డిమాండ్ చేశారు. తెలంగాణా ఏర్పడ్డాక యిటువంటివారిని తరిమి కొడతామని ఒక విద్యార్థిసంఘం ప్రతిజ్ఞ చేసింది. ఇటువంటివారి పీడ తెలంగాణాకు వదిలిపోవాలని కోరుతూ దగ్గర్లో వున్న విగ్రహాన్ని పాలతో కడిగారు యువకులు కొందరు. మహీధర్‌ను డిస్మిస్ చేయాలా? లేక సస్పెండ్ చేయాలా? తేల్చమని కోరుతూ ఓ ఛానెల్ ఎస్సెమ్మెస్‌లు పంపమంది.

వరంగల్ బస్సులో వున్న రాజారాంకు తన యింటర్వ్యూ లేపిన కలవరం తెలియదు. ఇల్లు చేరేసరికి అర్ధరాత్రి దాటింది. భార్య చెప్పినది నిద్రమత్తులో బుర్ర కెక్కలేదు. మర్నాడు పొద్దున్న కర్మకాండ చేయించడానికి బ్రాహ్మడు వచ్చేదాకా నిద్రపోతూనే వున్నాడు.

కర్మ ప్రారంభించబోతూండగానే పోలీసులు దిగబడ్డారు. వచ్చిన యిన్‌స్పెక్టరు కాస్త దురుసుగానే వున్నాడు. "కొడుకు పోయినోడివి ఏడ్చుకుంటూ కూచోక పోలీసులతో పెట్టుకుంటావేం?" అని అడిగాడు.

"నేనేం పెట్టుకోలేదు. టీవీ వాళ్లు అడిగారు. చెప్పాను. నా దు:ఖం నాది. నా కష్టం నాది. అయినా మీరెందుకు వచ్చారు?" అని అడిగాడు రాజారాం కోపంగా.

"మాకు ఇన్‌ఫర్మేషన్ వచ్చింది. ఇల్లు సెర్చ్ చేయాలి. మీ పూజ పని మీరు చేసుకోండి. మా పని మేం చేసుకుంటాం." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీ పనేంటి యిక్కడ? ఇన్‌ఫర్మేషన్ ఏమిటి? నన్నేదైనా కేసులో యిరికిద్దామనుకుంటున్నారేమో! నేను చేతకానివాణ్ని కాను.

ఛానెల్ వన్ టూ త్రీ వాళ్లని పిలుస్తా." రాజారాం అరిచాడు.

ఇన్‌స్పెక్టర్ నవ్వాడు. "లోకల్ రిపోర్టరుతో మాట్లాడే వచ్చినా. బ్లాక్‌మెయిలింగ్ కేసులో మొన్ననే బుక్కయి బెయిల్‌మీద బయటకు వచ్చిండు. నేనున్నానంటే రాడు. మరో ఛానెల్‌వాణ్ని చూడు."

రాజారాంకు అర్థమైంది. తను పిలిచినా రిపోర్టర్లు ఎవరూ పలకకుండా ఏర్పాట్లు జరిగిపోయాయని. మొహం వేలాడేసి "నేనేం చేశానని యీ హెరాస్‌మెంట్?" అన్నాడు.

"మా మహీధర్ సార్ ఏం చేసిండని నువ్వు హెరాస్ చేస్తున్నవ్? హత్య అనేదానికి ఆధారాలు లేవని మంచిగ చెప్పాడు. అయినా నువ్వు వినక మీడియాకి ఎక్కినవ్. అసలు నీ కతేమిటో తెలుసుకోమని సార్ పంపిండు."

"నా కథేముంది? ఆర్ కె మిల్స్‌లో పనిచేస్తున్నాను. అంతకుముందు ఇండోర్‌లో పనిచేసేవాణ్ని. ఇక్కడ ఆఫర్ వస్తే వచ్చాను..."

"ఇండోర్‌కుముందు ఎక్కడ పనిచేశావ్? అసలు ఏ వూరు?"

"అంతకుముందు మా వూళ్లోనే పని చేశా. మాది కృష్ణాజిల్లాలో..."

"...అమ్మ నా కొడకా, నువ్వు ఆంధ్రోడివా? మరి యీ తెలంగాణా బిల్డప్పేంటి?"

రాజారాంకు చిరాకు వేసింది. "బిల్డప్పేమిటి? నేను తెలంగాణావాణ్నని చెప్పలేదే! ఊరు వరంగల్ అని చెప్పానంతే... ఆంధ్రా, తెలంగాణా యిస్యూ కాదని చెప్పాను. సివిలియన్స్‌తో పోలీసులు ఎలా బిహేవ్ చేయాలన్నదానిమీద ఫైట్ చేస్తున్నాను.."

ఇన్‌స్పెక్టర్‌కు అరికాలిమంట నెత్తికెక్కింది. "ఫైట్ చేస్తావా, ఫైట్.. టీవీలో, పేపర్లో అంతా తెలంగాణావాణ్నని చెప్పుకుని సింపతీ కొట్టేసి, సార్‌ను బద్‌నామ్ చేసి... నా కొడకా.. ఉండు" అంటూ కానిస్టేబుల్ కేసి తిరిగి "ఊఁ" అన్నాడు.

కానిస్టేబుల్ ప్యాడ్‌తో సిద్ధంగా వున్నాడు. 'సైన్ చేయి" అన్నాడు రాజారాంకు ప్యాడ్ అందిస్తూ.

"ఏమిటిది?"

".... మావోయిస్టు లిటరేచర్ మీ యింట్లో దొరికిందని ఒప్పుకుంటున్నట్టు.." ఇన్‌స్పెక్టర్ చెప్పాడు వికటంగా నవ్వుతూ.

"అన్యాయం.. ఐ విల్ కంప్లెయిన్. నన్ను తక్కువగా అంచనా వేయకండి. మా ఎండీకి హోం మినిస్టర్ తెలుసు." అని అరిచాడు రాజారాం.

ఇన్‌స్పెక్టర్ చాచి లెంపకాయ కొట్టాడు. రాజారాం కూలబడిపోయాడు. అప్పటిదాకా కళ్లప్పగించి చూస్తున్న రాజారాం భార్య, కూతురు అతని దగ్గరకు పరిగెట్టారు. బ్రాహ్మడు వెనక గుమ్మంలోంచి బయటకు జారుకున్నాడు.

ఆ తర్వాత పావుగంటసేపు రాజారాం కళ్లనీళ్లతో యిన్‌స్పెక్టర్ను వేడుకున్నాడు. కొడుకు పోయిన తనపై కనికరం చూపించమన్నాడు. కొడుకుది హత్య అయినా, ఆత్మహత్య అయినా తిరిగి రాడు కదా అని మనసు దిటవు పరచు కుంటానన్నాడు. క్షణికావేశంతో టీవీ వాళ్లతో మాట్లాడడం తప్పేనన్నాడు. తనలాటి క్షోభ యిక ఏ తండ్రికీ కలగకూడదన్న వుద్దేశంతో యీ తరహా వింత ఆత్మహత్యలు ఆగాలనే భావనతో పబ్లిక్‌లో మాట్లాడాను తప్ప పోలీసులపై తనకు అపనమ్మకం లేదన్నాడు. కేసుల్లో యిరుక్కుంటే తన పరువు పోతుందన్నాడు. కూతురికి పెళ్లి చేయడం కష్టమన్నాడు.

ఇన్‌స్పెక్టరు అంతా ఓపిగ్గా విన్నాడు. ఇవన్నీ మీడియాకు ఎక్కడానికి ముందు ఆలోచించాల్సింది అన్నాడు. ఇప్పుడు తను జాలిపడి విడిచేసినా, తను వీపు తిప్పగానే రాజారాం మళ్లీ హైదరాబాదు వెళ్లి మీడియాను పిలిచి మాట్లాడతాడని తనకు బాగా తెలుసన్నాడు. ఏదో ఒక కేసులో యిరికించందే తనకు పైనుండి మాట వస్తుందని తన యిబ్బంది చెప్పాడు.

ఈ సంభాషణ జరుగుతూండగానే రాజారాం కూతురు లోపలకి వెళ్లి తన సెల్‌లోంచి పత్రికల వాళ్లందరికీ ఫోన్ చేసింది. ఎవరూ రామని అన్నారు. ఒకతను మాత్రం "మీరు సెటిలర్ అంటున్నారు కాబట్టి సెటిలర్స్ సమితి అనే పేరుతో ఓ సంస్థ నడుస్తోంది. వాళ్లకు ఫోన్ చేయండి." అని నంబర్ యిచ్చాడు. ఆ సమితి అతను తను వచ్చి 'సెటిల్' చేస్తానని ధైర్యం చెప్పాడు. ఈ విషయం తండ్రికి ఎలా చెప్పాలా అని ఆమె ఆలోచిస్తూండగానే యింట్లోకి ఒకాయన వచ్చాడు.

వచ్చినాయన మహీధర్ తండ్రి వెంకటేశం. ఆయనెవరో తెలియగానే ఇన్‌స్పెక్టర్ మర్యాద చూపించాడు. 'నువ్వు ఒక్క పావుగంట బయటకు వెళితే సమస్య పరిష్కరిస్తా' అని అతన్ని బయటకు పంపి రాజారాంతో వెంకటేశం సంభాషణ మొదలు పెట్టబోయాడు. "ఎందుకు వచ్చిన గొడవండీ యిదంతా?" అని.

"ఆ మాట మీ అబ్బాయిని అడగండి. నేనేం చేశానని నా మీద తప్పుడు కేసులు బనాయిస్తున్నాడు?"

"మీరు చేసినది మాత్రం బాగుందా? అసలు మావాడు ఆంధ్రావాడని ఎందుకు చెప్పారు? మేం పక్కా తెలంగాణా వాళ్లం." వెంకటేశం విసుగ్గా అడిగాడు.

"అసలు ఆంధ్రా తెలంగాణా గొడవ నేనెందుకు తెస్తాను? మేం ఆంధ్రావాళ్లం. ఉద్యోగరీత్యా యిక్కడకు వచ్చాం. రేపు యింకో మంచి వుద్యోగం వస్తే యింకో చోటికి పోతాం. తెలంగాణా వస్తే మాకేమిటి? రాకపోతే మాకేమిటి? అలాటప్పుడు మా అబ్బాయి ప్రత్యేక తెలంగాణా కోసం ఆత్మహత్య చేసుకున్నాడని నన్ను నమ్మమంటాడు మీ సుపుత్రుడు. కాదు, యిది హత్యే అంటే బూతులు తిడుతున్నాడు. విషయం యిదీ అని టీవీలో చెపితే మమ్మల్ని మావోయిస్టు సింపతైజర్స్ అంటూ కేసులో బుక్ చేయిస్తున్నాడు..."

వెంకటేశం నుదురు కొట్టుకున్నాడు. "అనవసరమైన మిస్‌అండర్‌స్టాండింగ్. మిమ్మల్ని తెలంగాణా అనుకున్నారు, మమ్మల్ని

ఆంధ్రా అనుకున్నారు. వచ్చి అడిగినవాడు ఎవడూ లేడు. ఎవడి ఊహాగానాలు వాళ్లవి. నిన్నంతా అయింది... ఇవాళ పొద్దుటినుంచి మళ్లీ టీవీలో యివే చర్చలు.."

ఇంతలోనే సెటిలర్ సమితి తరఫు లాయరుట.. వచ్చాడు. పోలీసులు ఏమీ చేయలేరు, మీరు ఎక్కడా సంతకం పెట్టకండి అని రాజారాంకు ధైర్యం చెప్పాడు. పనిలో పనిగా మహీధర్‌పై కేసు పెట్టే అవకాశం వుందా అని లాయర్ని అడిగాడు రాజారాం.

అప్పటిదాకా సంభాషణ వింటూ కూర్చున్న వెంకటేశం ఉలిక్కిపడ్డాడు. "వాడేం చేశాడని వాడిమీద కేసు? ఈ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి మీమీద కేసు రాకుండా నేను చూస్తాను. ఈ లాయరు మాటల్లో పడకండి. ఇక్కడితో దీన్ని వదిలేద్దాం." అంటూ ప్రతిపాదించాడు.

"మనం వదిలేసినా మీడియావాళ్లు వదలరు." అన్నాడు లాయరు వెక్కిరిస్తూ.

"ఈలోగా యింకో అమాయకుడు ఆత్మహత్య చేసుకుంటాడు, మీడియా ఫోకసంతా అటుపోతుంది" అన్నాడు వెంకటేశం. అంటూనే రాజారాం మొహం చూసి సిగ్గుపడ్డాడు. "సారీ..., వెరీ సారీ. వచ్చినదగ్గర్నుంచి ఏదేదో మాట్లాడుతున్నాం. మీ అబ్బాయి పోయినందుకు.. మై సింపతీస్ ఆర్ విత్ యూ.." అంటూ రాజారాం చెయ్యి పట్టుకోబోయాడు.

రాజారాం చెయ్యి అందుకోలేదు. "మీ అబ్బాయిలాగే మీదీ లిప్ సింపతీ. మీ వాడికి – పోయిన మా అబ్బాయిమీదా జాలి లేదు, బతికున్న నా మీదా లేదు. నేనే ప్రేరేపించానంటున్నాడు. నా మీద ఏదో కసి పెట్టుకున్నట్లు మాట్లాడాడు. ఒక రకమైన సినికల్ ఏటిట్యూడ్. నేను అతనికి చేసిన అన్యాయం ఏమిటి చెప్పండి. సహాయం చేయకపోతే మానె, కనీసం.. మానవత్వం కూడా ప్రదర్శించకపోతే ఎలా?"

వెంకటేశం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "మీ మీద కాదు వాడి కసి, నా మీద. ప్రత్యేకరాష్ట్రం అంటూ 1969లో మేం చేసిన ఉద్యమం అంటే కోపం. నేను గవర్నమెంటు ఎంప్లాయీని. నాన్-ముల్కీలు వెళ్లిపోతే ప్రమోషన్లు వస్తాయన్న ఆశ మాది. నేను ఎన్జీవో సంఘం నాయకుణ్ని. అప్పుడు మా వాడు హైస్కూల్లో చదువుతున్నాడు. 'చదువుపోతోంది, ఆంధ్రాలో ఎక్కడైనా స్కూల్లో చేర్పించు' అన్నాడు. లీడర్ని .. రిజైన్ చేసి పాలిటిక్స్‌లో వెళదామనుకున్నానులే.. నేనే అట్లా చేస్తే బద్నామ్ అవుతానని నేను ఒప్పుకోలేదు. వాడిది ఏడాది చదువు నాశనం... ఇంట్రస్టు పోయింది... అత్తెసరు మార్కులతో పాసయి కానిస్టేబుల్‌గా చేరి యిన్నాళ్లకు సర్కిల్ అయ్యాడు. 'అంతా నీ వల్లనే.. ఎస్పీ కావల్సినోణ్ని' అంటాడు. 'మీ ఉద్యోగుల స్వార్థానికి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు, యింకా ఆడుకుంటున్నారు' అంటాడు. మీరూ నా లాటివాళ్లే అనుకున్నాడు. పోయిన కొడుకు పేరు చెప్పుకుని ఎలక్షన్‌లో నిలబడతారనుకున్నాడు..అందుకే ఆ ద్వేషం..."

గద్గదమై పోయిన గొంతు సవరించుకుని "మీకు యివన్నీ తెలియవు కదా. టీవీలో జరుగుతున్న గొడవ చూసి తక్షణం మా వాడితో చెప్పకుండా హైదరాబాదునుండి బయలుదేరి వచ్చాను. వాడివి మోటు పద్ధతులు. ఇలా చేసి పీకల మీదకు తెచ్చుకుంటున్నాడు. దీన్ని యిక్కడితో ఆపండి. నా కొడుకు మీద జాలిపడి కాపాడండి.' చేతులు జోడించాడు వెంకటేశంలోని తండ్రి.

కుర్చీలోంచి మెల్లగా లేచిన రాజారాం మరో తండ్రిని గుండెలకు హత్తుకుని ఓదార్చాడు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 32** **ఎమ్బీయస్ : బోనులో న్యాయవ్యవస్థ**

ఈ రోజు "సాక్షి"లో ఓ హైకోర్టు న్యాయమూర్తి గురించి కథనం వచ్చింది. దాని ప్రకారం – ఒకాయన 1981లో యూనివర్శిటీలో స్టూడెంటుగా వుండగా తన స్నేహితులతో కలిసి ఓ బస్సుపై రాళ్లు రువ్వి మారణాయుధాలతో దాడి చేసి, దానిలోని ప్రయాణికులను గాయపరచారు. మంగళగిరి పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు దాఖలైంది. స్థానిక కోర్టు వారంట్లు జారీ చేసినా పోలీసులు వారంట్లను అమలు చేయలేదు. కేసు మాత్రం పెండింగులో వుండిపోయింది. తర్వాత ఈయన హైకోర్టులో లాయరయ్యాడు. అప్పటి ప్రభుత్వాధినేత (ఇంకెవరు? చంద్రబాబు)కు ఆప్తుడయ్యారు. 2000 సంఎరంలో ఈయన పేరును హైకోర్టు న్యాయమూర్తిగా సిఫార్సు చేశారు.

ఈయన తన మీద కేసున్న విషయం రూలు ప్రకారం స్వచ్ఛందంగా తెలియపరచాలి. తెలియపరచలేదు. రాష్ట్రప్రభుత్వం సమాచారం సేకరించి కేంద్రానికి, దాని ద్వారా సుప్రీంకోర్టుకి తెలపాలి. వాళ్లూ కేసు విషయం తెలపలేదు. దాంతో సుప్రీంకోర్టు సరేననేసింది. ఈయన హైకోర్టు జడ్జి అయిపోయారు. అప్పుడు ప్రభుత్వం యీయన పాత రికార్డు చెరిపేయ దలచుకుంది. నియామకం అయిన ఏడాదిన్నరకు డిసెంబరు 2001లో ఆయనపై కేసును ఉపసంహరించుకుంటూ జీవో జారీ చేసింది. దాని ఆధారంగా కలక్టరు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను పురమాయించారు. 20 ఏళ్లగా పెండింగులో వున్న కేసును స్థానిక కోర్టు వెంటనే ఉత్తర్వులు జారీ చేసేసింది. ఇప్పుడు ఆ హైకోర్టు న్యాయమూర్తి చక్కగా ఏ కేసులూ లేకుండా వున్నారు. కొద్ది రోజుల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా అయితే కావచ్చు.

ఈ కథనానికి ఖండన మండనలు రేపో మాపో రావచ్చు కానీ యీ లోపునే సాక్షి ఇంకో రెండు మాటలు కూడా రాసేసింది – "బాబు, ఆయన సన్నిహితులకు సంబంధించిన వ్యవహారాలన్నిటినీ యిప్పటికీ ఆయనే తెర వెనుకనించి పర్యవేక్షిస్తుంటారు" అని.

రెండు వారాల క్రితం ఆంధ్రభూమిలో "సాక్షి" పేరుతో 'వీక్ పాయింట్' రాసే ఎమ్వీయార్ శాస్త్రిగారు "నాట్ బిఫోర్ బాబు" అని

వ్యంగ్యంగా రాస్తూ – "చంద్రబాబు మంచి పనిమంతుడు. దీపం వుండగానే యిల్లు చక్కబెట్టుకోవాలన్న పాలసీతో ఏ క్షేత్రానికా క్షేత్రంలో పనికొచ్చే విత్తనాలను చల్లాడు. అవే యిప్పుడు విరగపండి ఏ రంగానికారంగంలో అవసరానికి ఆదుకుంటున్నాయి. సుప్రీం కోర్టు స్టే యిస్తుందో లేదో సందిగ్ధం కనుక ఎందుకైనా మంచిదని తెర వెనకే వుండి కథ నడిపించిన బాబు, హైకోర్టుకు పోవచ్చని అక్కడ సెలవయ్యేసరికి ఈలవేస్తూ ముందుకు వచ్చాడు. వాటమెరిగి పావులు కదిపాడు. న్యాయరంగంలో ఆయన ముందుజాగ్రత్తతో వెలిగించిన జ్యోతులూ సమయానికి అక్కరకొచ్చి కాగల కార్యాన్ని తిరుగులేని వ్యూహం ప్రకారం తీర్చాయి" అని రాశారు. అది చదివి వార్నీ అనుకున్నాను. ఇప్పుడు యీ "సాక్షి" ఓ ఉదాహరణ చూపించింది.

ఇక రేపణ్నుంచి ఆ న్యాయమూర్తి ఎవరు? వారి కులం ఏమిటి? అన్నదానిపై చర్చ ప్రారంభమవుతుంది. ఇది అత్యంత దురద ృష్టకరం. గతంలో న్యాయమూర్తుల గురించి యిలాటి వివాదాలు వచ్చేవి కావు. లెఫ్టిస్టు అనీ, రైటిస్టు అనీ వారి భావజాలం గురించి గుసగుసలుండేవి తప్ప వారి కులాన్ని ఎవరూ చర్చించేవారు కారు. ఇప్పుడు సిబిఐ డైరక్టరు కులం ఏమిటి, నిందితులకు బెయిల్ దక్కడంలో కులం కార్డు పని చేసిందా, ఫలానా కేసు విచారించే న్యాయమూర్తి కులం ఏమిటి, ఎవరి కాలంలో నియమించబడ్డారు అని బహిరంగ చర్చలు జరుగుతున్నాయి.

ఫలానావారి కాలంలో నియమించబడినంత మాత్రాన తీర్పులన్నీ వారి పక్షానే యిస్తారా? అలా అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ 30 ఏళ్లపాటు పాలించింది. న్యాయమూర్తులను వాళ్లే నియమించి వుంటారుగా ! ఆ లెక్కన ఆ కాలంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క తీర్పు రాకూడదు మరి. వచ్చాయిగా. ఈ మాట అడిగితే "ఆ రోజులు వేరండి" అంటారు. ఈ రోజులు వేరేలా ఎందుకయ్యాయి? ఎందుకంటే రాజకీయం, కులతత్వం అన్నిట్లోకి పాకినట్లే, న్యాయవ్యవస్థలో కూడా పాకింది.

బాబు, ఆయన మిత్రులు తమ కేసు జస్టిస్ రోహిణి, జస్టిస్ అశుతోష్ మొహంతాల బెంచ్‌లో జరగాలని చూస్తున్నారని, వైయస్ విజయ ఆ కేసు జస్టిస్ నూతి రామమోహనరావు, జస్టిస్ గులాం మహ్మద్‌ల బెంచ్‌లో జరగాలని చూస్తున్నారనీ అందరికీ తేటతెల్లమయిపోయింది. వైయస్ విజయగారు బాబుపై సిబిఐ విచారణ మాత్రమే కోరితే మొదటి బెంచ్ సిబిఐ, పోలీసు డిజి, హోం, ఇడిలతో విచారణ ఆదేశించింది. ఇక రెండో బెంచ్ బాబుపై విచారణకు స్టే యిచ్చేసి కూచుంది. వాదనలు వినేశారు కాబట్టి తీర్పు యిచ్చేయవచ్చు కానీ యివ్వటం లేదు. వాళ్లు ఎందుకిలా చేశారు, వీళ్లు యిలా ఎందుకు చేయలేదు అని అడిగే హక్కు మనకు లేదు. కానీ తనకు అనుకూలమైన్ బెంచ్‌కు కేసు రావడానికి బాబు, మిత్రులు అనుసరించిన వ్యూహం గురించే చర్చ జరుగుతోంది.

హన్స్ ఇండియాలో కె రామచంద్రమూర్తిగారు రాశారు – 'బాబు తన తొమ్మిదేళ్ల పాలనలో న్యాయమూర్తులను లగ్జరీ కార్లతో, కానుకలతో గుప్పిట్లో పెట్టుకున్నారు. కాకతాళీయమే అయినా టిడిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నమోదైన కేసుల్లో అధికశాతం ఆ కాలంలోనే బుట్టదాఖలయ్యాయి' అని. జస్టిస్ రోహిణి బాబు హయాంలో నియమితురాలయ్యారని ఆ వ్యాసంలో గుర్తు చేశారు. ఆంధ్రజ్యోతి డిసెంబరు 17 సంచికలో రాధాకృష్ణగారు దీనిపై చాలా వాదనలు చేశారు. – జస్టిస్ రోహిణి లాగే జస్టిస్ గులాం మహమ్మద్ కూడా బాబు హయాంలోనే నియమితులయ్యారు. అయినా బాబుకి వ్యతిరేకంగా తీర్పు యివ్వలేదా? అని అడిగారు. జస్టిస్ నూతి రామ్మోహనరావు వైయస్ హయాంలో నియమితులయ్యారని గుర్తు చేశారు.

ఏది ఏమైనా కేసు వేసిన/ఎదుర్కొంటున్న కక్షిదారులు కొన్ని బెంచ్‌లు తమకు అనుకూలమని, తమ కేసులు అక్కడికే రావాలనీ కోరుకుంటున్నారనేది స్పష్టం. దీనికి వాళ్లు అవలంబించిన మార్గం – 'నాట్ బిఫోర్'. ఒక మంచి ఆదర్శంతో పెట్టిన యీ విధానాన్ని మన తెలుగువాళ్లు భ్రష్టు పట్టించారనే పేపర్లు రాస్తున్నాయి. దీని గురించి కాస్త రాస్తాను.

లాయర్‌గా కొంతకాలం పనిచేశాకనే న్యాయమూర్తులవుతారు. తాము ప్రాక్టీసు చేసిన కాలంలో వాళ్లకు సీనియర్లు, జూనియర్లు వుంటారు కదా. వీళ్లు న్యాయమూర్తులుగా కూర్చున్నపుడు ఆ సీనియరో, జూనియరో వచ్చి వాదిస్తూంటే వీళ్లకు యిబ్బంది కదా ! నిష్పక్షపాతంగా వ్యవహరించినా, కేసు పోయినవాళ్లు పక్షపాతంతో వ్యవహరించారని ఆరోపణలు చేయవచ్చు కదా. అందుకని అలాటి పరిస్థితుల్లో 'నాట్ బిఫోర్' వెసులుబాటు కల్పించారు పెద్దలు. 'ఈ కేసు నా ముందుకు తీసుకురావద్దు' అని న్యాయమూర్తి అనవచ్చు. అలాగే ఒక్కోప్పుడు తమ బంధువులు కేసులో కక్షిదారులుగా వున్నా దీన్ని వుపయోగించుకోవచ్చు. వాదన సందర్భంగా లాయర్లు, న్యాయమూర్తులను విమర్శిస్తూ మాట్లాడుతూనే వుంటారు. ఒక్కోప్పుడు హద్దుమీరి దుర్భాషలాడితే నొచ్చుకున్న న్యాయమూర్తులు "ఈ న్యాయవాది చేపట్టిన కేసులు నా ముందుకు తేవద్దు, నాట్ బిఫోర్ మీ" అనడం మొదలుపెట్టారు.

న్యాయవాదులు దీన్ని ఒక ఆయుధంగా చేసుకున్నారు. కఠినంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించే న్యాయవాదులను కావాలని తిట్టడం, 'నాట్ బిఫోర్' అనిపించుకోవడం, ఒక టెక్నిక్‌గా వాడుకోసాగారు. ఇప్పుడు నా మీద ఎవరో కేసు పెట్టారు. అది ఓ నిజాయితీపరుడైన న్యాయమూర్తి వున్న బెంచ్‌కు పోస్టు అయిందనుకోండి. అప్పుడు నేనేం చేస్తానంటే ఆ న్యాయమూర్తి బహిష్కరించిన 'నాట్ బిఫోర్ మీ' న్యాయవాది ఎవరో కనుక్కుని అతన్ని నాకు ప్లీడరుగా పెట్టుకుంటాను. శిఖండిని చూడగానే భీష్ముడు అస్త్రసన్యాసం చేసినట్టు, ఆ న్యాయమూర్తి తన బెంచ్ నుండి నా కేసును బదిలీ చేయమంటాడు.

ఇంకో బెంచ్‌కి వెళ్లిన తర్వాత ఈ న్యాయవాది అక్కడికి వచ్చి వాదించకపోవచ్చు. శిఖండి పాత్ర పోషించినందుకు నా దగ్గర ఫీజు తీసుకుని వేరే లాయరుకి అప్పగించవచ్చు. ఈ విధానాన్ని 'ఫోరం పర్చేజ్' అంటారుట. వైయస్ విజయమ్మ తరఫున వాదించిన సుప్రీం కోర్టు న్యాయవాది సుశీల్ కుమార్ ఈ 'ఫోరం పర్చేజ్' విధానాన్ని దుయ్యబట్టారట. మన రాష్ట్రంలో తప్ప వేరే ఏ రాష్ట్రంలోనూ

యిది ప్రాచుర్యం లేదట. మురళీమోహన్, సిఎం రమేష్, నాగరాజనాయుడు ఎవరెవర్ని లాయర్లగా పెట్టుకుని 'నాట్ బిఫోర్' టెక్నిక్ అవలంబించారో రామచంద్రమూర్తిగారి వ్యాసంలో విపులంగా వుంది. రాధాకృష్ణగారు తన వ్యాసంలో జగన్ కూడా యిదే సౌకర్యాన్ని గతంలో వాడుకున్నారని రాశారు.

బాబు, మిత్రులపై విజయమ్మ వేసిన కేసు ద్వారా 'నాట్ బిఫోర్' క్లాజ్ ఫోకస్‌లోకి వచ్చింది. దీనికి తెర తీసినది చీఫ్ జస్టిస్ గారే. ఆయన చెప్పిన కారణం నా మట్టుకు నాకు చాలా చిత్రంగా తోచింది. అసలు కేసులో రిలయన్సు తనంతట తాను ఇంప్లీడ్ అయింది. ఆ తర్వాత రిలయన్సు యీ కేసులో వుంది కాబట్టి 'నాట్ బిఫోర్' అనేశారు చీఫ్ జస్టిస్. ఎందుకట? ఆయనకు రిలయన్సు షేర్లు వున్నాయట. అది ఓ గొప్ప సంగతా? కోట్లాది మందికి ఆ షేర్లు వున్నాయి. షేర్లు వున్నాయి కదాని వాళ్లకు అనుకూలంగా తీర్పు చెప్పారు అని ఎవరైనా ఆరోపించగలరా? ఈ తీర్పు వలన తన వద్దనున్న షేరు వాల్యూ పడిపోతుందేమోనన్న భయంతో న్యాయమూర్తి పక్షపాత బుద్ధితో వ్యవహరించారని ఎవరైనా అనగలరా? షేర్ వేల్యూ ఎందుకు పెరుగుతుందో, ఎందుకు తరుగుతుందో ఎవరైనా చెప్పగలరా? కంపెనీ అన్నాక కేసులే వుండవా?

ఈ లెక్కన చూస్తే కంపెనీ షేర్లున్న ఏ న్యాయమూర్తీ కార్పొరేట్స్ యిన్‌వాల్వ్ అయిన ఏ కేసూ వాదించకూడదు. ఆయన పేరునే కాదు, ఆయన భార్య, పిల్లలు, బంధువులు – ఎవరి పేర షేర్లు వున్నా కేసులు చేపట్టకూడదు. షేర్లు లేని గుజరాతీలు, మార్వాడీలు నాకు యిప్పటిదాకా తారసిల్లలేదు. దీని ప్రకారం ఆ కమ్యూనిటీలనుండి న్యాయమూర్తులు వుండడానికే అవకాశం లేదు. ఇవాళ షేరు లేకపోయినా, కేసు నడిచే అయిదారేళ్లలో కొనకూడదని ఏముంది? అందువలన కంపెనీ కేసులు నాకు వద్దు అని పక్కకు నెట్టేయవచ్చు. బ్యాంకింగ్‌లో యీ 'నాట్ బిఫోర్' ప్రొవిజన్ వుంటే ఎంత బాగుండేది. లోను అడగడానికి వచ్చిన ప్రతీవాణ్నీ 'నాట్ బిఫోర్ మీ, పక్క బ్యాంకుకి వెళ్లు. డిపాజిట్ కైతే నా వద్దకు రా' అనేసేవాళ్లం. హాయిగా రిస్కు లేకుండా ఉద్యోగం చేసేవాళ్లం.

చీఫ్ జస్టిస్‌గారు 'నాట్..' అనగానే ఈశ్వరయ్యగారి బెంచ్‌కు వెళ్లింది. అప్పుడు విజయమ్మగారే 'నాట్ బిఫోర్' అన్నారు. ఎందుకంటే ఈశ్వరయ్యగారి భార్య టిడిపి  తరఫున జెడ్‌పిటిసి చైర్మన్ చేశారట. ఆయనా తప్పుకున్నారు. ఆ తర్వాత త్రో బాల్ లాగ కేసును నెట్టేస్తూ, నెట్టేస్తూ వుంటే అది ప్రస్తుతమున్న బెంచ్‌కు వచ్చి స్టే తీసుకుని విశ్రమించింది. ఎమ్వీయార్ శాస్త్రిగారి మాటల్లో చెప్పాలంటే – 'బాబు అండ్ కో ఏ 'నాట్ బిఫోర్' శిఖండిని అడ్డం పెడితే ఏ బెంచి చేతులెత్తేస్తుందో ముందే గ్రహించి, ఆయా శిఖండులను ఆయా సమయాలకు రెడీ చేసి, అనుమానపు బెంచిలను పక్కకు తప్పించి, ప్రాప్తమున్న తీరానికి కేసు పడవను ఝామ్మంటూ లాక్కుపోయారు. మొత్తానికి కార్యం సాధించారు.' ఈ తెలివితేటలు జగన్‌కి లేవని ఎద్దేవా చేసి 'అందుకే జగనబ్బాయి, నీ ఆటలు 'నాట్ బిఫోర్' బాబు! అని ముగించారు శాస్త్రిగారు.

స్టే రాగానే బాబు క్యాంప్‌లో విజయోత్సవాలు జరిగాయి. 'బాబు ధర్మాన్ని కాపాడారు కాబట్టి, ధర్మం బాబుని కాపాడింది' అని మర్మం విప్పి చెప్పారు టిడిపి ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌గారు. ఒట్టి స్టే యే కదా, దానికి యిన్ని సంబరాలా? అని విస్తుపోయాను కానీ, ఆ తర్వాత కేసులో కదలిక లేకపోవడంతో యిది నిజంగా బాబుకి విజయమే అనుకున్నాను. పైగా రిలయన్సువారి లాయరు బెంచ్‌ముందు చాలా బలమైన వాదన ఒకటి వినిపించారు – 'ఈ కేసులో రిలయన్సుని దోషిగా నిలబెడితే కంపెనీకి చెడ్డపేరు వచ్చి, భారత పారిశ్రామిక రంగమంతా అతలాకుతలం అయిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోతుంది' అని. రేపు అంబానీ సోదరులు హత్య చేసినా మనం కేసులు పెట్టకూడదన్నమాట. న్యాయమూర్తులు అదిరిపోయి వుంటారు యీ వాదనతో !

బాబు బృందం విజయం సాధించారు కానీ యీ మొత్తం ఎపిసోడ్‌లో న్యాయవ్యవస్థ బోనులో నిలబడవలసి వచ్చింది. ప్రజల దృష్టిలో చులకన అయింది. మనం న్యాయమూర్తులకు ఎంతో విలువ నిస్తాం. వాళ్లు చెప్పినది వేదవాక్కుగా స్వీకరిస్తాం. వాళ్ల మూలాలలోకి వెళుతూ, వాళ్లని శంకిస్తూ పోతే ఎక్కడికి తేలతాం? **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**

**డిసెంబరు 41** **ఎమ్బీయస్ :'సెటిలర్' తెలంగాణ అధినేత కాకూడదా?**

ఎదుటివాణ్ని తిట్టడానికి 'సెటిలర్' అనీ, 'సమైక్యవాది' అని తిట్టే కెసియార్ కూడా 'సెటిలర్' అని తేలింది. ఆయన స్వంతవూరిని ఆంధ్రప్రాంతపు టిడిపి నాయకులు వెతికి పట్టారు. మీడియాను తీసుకెళ్లి చూపించారు. 'మా ఆంధ్రావాడు తెలంగాణను నడిపిస్తున్నందుకు గర్వంగా వుంది' అన్నారు టిడిపి ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ వ్యంగ్యంగా. కెసియార్ విజయనగరం వారనీ, శ్రీకాకుళం వారనీ అంటూ వచ్చారు తప్ప ఎన్నేళ్ల క్రితం తరలివచ్చారో యిప్పటిదాకా ఎవరూ చెప్పలేదు. ఇప్పుడు చెప్తున్నదానిప్రకారం విజయనగరం జిల్లాలోని బుడ్డిపేట గ్రామంలో కెసియార్ పూర్వీకుల యిల్లు ఉంది. ఆ యింటిని 30 ఏళ్ల క్రితం వేరేవాళ్లు కొన్నారుట. ఆ సేల్‌డీడ్ చూస్తే అమ్మినవారి పేర్లలో కల్వకుంట్లవారుంటే వాళ్లు చెప్పినది నిజమేననుకోవాలి. కెసియార్ తాత చిన్నతనంలో ముత్తాత  తెలంగాణకు వలసపోయారని చెప్పారట. ముత్తాత పేరు రామారావు.

కెటియార్ పేరులోని తారకరామారావు పేరు ఎన్టీయార్‌దని కెసియార్ అంటూ వుండగా, అదేం కాదని కెటియార్ అంటూ వచ్చారు. ముత్తాత పేరు రామారావు కాబట్టి ఆ పేరు పెట్టారేమో! పేరు కలిసివస్తుందని తారక చేర్చి కెసియార్ తన కొడుక్కి పెట్టారేమో ! ఏది ఏమైనా తెలుగుతనం అంటే పడిచచ్చే, సమైక్యవాదమే ఊపిరిగా బతికిన ఎన్‌టిఆర్ ఆయనకు ఆదర్శపురుషుడని

అందరికీ తెలుసు, ఆయనే చెప్పుకున్నారు కూడా. టిడిపిలో అంచెలంచెలుగా పైకి వచ్చారు. 610 జీవో కారణంగా సరైన నియామకాలు చేయలేకపోతున్నామని, దాన్ని సవరించాలని ప్రతిపాదించారు కూడా. జయశంకర్ లాటి వాళ్లు ఎప్పుడూ విభజనవాదులే. కెసియార్ అలాగ కాదు, 20 ఏళ్లు సమైక్యవాది. చంద్రబాబు మంత్రిపదవి యిచ్చివుంటే యిప్పటికీ టిడిపిలోనే వుండేవారేమో. ఇవ్వకపోవడంతో మూలనున్న తెలంగాణ రథాన్ని బూజు దులిపి అధిరోహించారు. తెరాస స్థాపించి, నడపడం మొదలుపెట్టాక, తెలంగాణ యాసలో ప్రసంగాలు కూడా ప్రాక్టీసు చేశారు.

నిజానికి కెసియార్ అసెంబ్లీలో ఉపన్యాసాలు యిచ్చినపుడు మామూలు, శిష్ట వ్యావహారిక తెలుగులో చాలా చక్కగా మాట్లాడేవారు. ఇప్పటికీ అనేక వేదికలపై అలాగే మాట్లాడతారు. కానీ యిటీవలి కాలంలో కావాలని తెలంగాణ యాసలో మాట్లాడడం మొదలుపెట్టారు. ఎం సత్యనారాయణరావు, వి హనుమంతరావు, నాయిని నర్సింహారెడ్డి – వీళ్లందరూ ఎప్పుడూ ఒకేలా మాట్లాడతారు. రెండు యాసలు రావు వాళ్లకు. మిమిక్రీ ఆర్టిస్టులు, నాటకాలలో పాత్రధారులు మాత్రమే రెండు, మూడు రకాలుగా మాట్లాడతారు. రాజకీయనాయకుడు అలా మాట్లాడుతున్నాడంటే దాని అర్థం – తనది కాని పాత్ర పోషిస్తున్నారని! కొత్త వైష్ణవుడు పంగనామాలు మరీ దిట్టంగా పెడతాడన్నట్లు, తన మూలాలపై అనుమానం రాకుండా కెసియార్ వీరతెలంగాణ యాస మాట్లాడుతున్నారా అన్న సందేహం వస్తుంది. మళ్లీ కెటియార్‌లో అలాటి వైరుధ్యం లేదు. ఆయన యాస లేకుండా చక్కటి తెలుగు మాట్లాడతారు.

పైకి ఏం చెప్పినా కెసియార్‌కి ఆంధ్రప్రాంతం వాళ్లతో లింకులు తెగిపోలేదు. మా మరదల్ని అక్కడే యిచ్చాం అని ఆయనే చెప్పారు. ఆయన పిల్లలు, మనుమలు ఆంధ్రావాళ్ల కాలేజీల్లోనే చదివారు, చదువుతున్నారు. తెలంగాణ ప్రాంతీయుడైన ఆలె నరేంద్రను దూరం చేసుకుని, ఆంధ్రప్రాంతంలోనే పుట్టారని అంటున్న, ఆంధ్రప్రాంతీయుణ్ని పెళ్లాడిన విజయశాంతిని చెల్లెలిగా చేసుకుని ఆ స్థానాన్ని కట్టబెట్టారు. ఆయన కుమారుడికి ఆంధ్రప్రాంతీయులతో వ్యాపారబంధాలున్నాయి. మలుపు తిరిగితే తెలంగాణ వచ్చేస్తోందని కెసియార్ ప్రకటించినప్పుడల్లా ఆంధ్రప్రాంతంలో స్థలాల రేట్లు పెరగడంతో, అక్కడి రియల్ ఎస్టేటు వ్యాపారస్తులకు, కెసియార్‌కు ఒప్పందాలున్నాయన్న పుకార్లు వచ్చాయి.

ఇవన్నీ ఎప్పటినుండో వున్న సంగతులే అయినా కెసియార్ మూలాలను టిడిపి యిప్పుడే ఎందుకు వెతికి పట్టుకుంది? ప్రస్తుతం తెరాస, టిడిపి ముఖాముఖీ తలపడుతున్నాయి. బాబు పర్యటనను తెరాస అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడం, అయినా బాబు ఏదోలా టూర్లు చేయగలగడంతో టిడిపికి ధైర్యం వచ్చింది. ఉద్యమ ఉధృతి తగ్గిన యీ వేళలోనే కెసియార్‌ను దెబ్బకొట్టాలనే ప్లానుతో టిడిపి కదులుతోందనుకోవాలి. దీనిపై కెసియార్ స్పందించకపోవచ్చు. పిచ్చికుక్కలు వాగితే నేను సమాధానం చెప్పాలా? అని తలాయించవచ్చు. మీడియా వారు ఆయన్ను యిబ్బందికర ప్రశ్నలు అడగకపోవచ్చు. ఆంధ్రమూలాలున్న కారణం చేత తెలంగాణ ఉద్యమాన్ని నడపడానికి కెసియార్ అనర్హుడు అంటే ఎవరన్నా నేను ఒప్పుకోను. తమిళనాడు లీడర్లలో చాలామంది తమిళేతరులే. (వివరాలకు నా 'తమిళ రాజకీయాలు' చదవండి.) అయినా తమిళ భాషావ్యాప్తి గురించి వారందరూ శ్రమించటం లేదా? తమిళులు వారిని ఆమోదించలేదా?

అయితే అక్కడికీ, యిక్కడికీ తేడా ఏమిటంటే వాళ్లంతా తమిళాన్ని కీర్తిస్తారు తప్ప, తెలుగుని తిట్టరు. తెలుగువాళ్ల గురించి నీచంగా మాట్లాడరు. ఆ పని యిక్కడ కెసియార్ చేస్తున్నారు. 'ఆంధ్రోళ్లు దొంగలు' దగ్గర మొదలుపెట్టి తనను వ్యతిరేకిస్తున్నవారిని 'ఆంధ్రోళ్ల చెప్పులు నాకేవారు' అని తిడతారు. తెలంగాణ ఉద్యమకారులందరూ 'అన్నదమ్ముల్లా విడిపోదాం' అని ప్రతిపాదిస్తూ వుంటారు. ఓ పక్క యిలా తిడుతూంటే యిక సహోదరత్వం ఎక్కడ మిగులుతుంది? కుటుంబం పెద్దదయ్యాక అన్నదమ్ములు విడిపోవడం సహజం. ఇద్దరూ కూర్చుని వాటాలు వేసుకునేటప్పుడు, కాస్త మనస్పర్థలు రావడమూ సహజమే. కానీ మధ్యలో పెద్దలు కలగజేసుకుని చెపితే వింటారు. విననివాళ్లు కోర్టుల కెక్కుతారు. ఇన్నేసి తిట్లు తిడుతూ వుంటే అవతలివాళ్లకి పంతం వచ్చి వ్యవహారం మరింత బిగుస్తుంది. కెసియార్‌కు అదే కావాలా? అన్న అనుమానం వస్తుంది కూడా.

మొన్నటికి మొన్న ఆయన 'సెటిలర్ల'ను బెదిరించారు. "బాన్సువాడ ఉపయెన్నికలో వాళ్ల బుద్ధి చూపించుకున్నారు. జాగ్రత్త" అంటూ. ఇక 'సెటిలర్లు' ఆయనపై, ఆయన పార్టీపై అభిమానం చూపుతారా? వారందరినీ వ్యతిరేకం చేసుకున్నట్టే కదా ! ఆంధ్రప్రాంతం నుండి తెలంగాణకు వచ్చి స్థిరపడడం శతాబ్దాలుగా సాగుతోంది. వారందరినీ కలిపి 'సెటిలర్లు' అంటే వారి జనాభా కోటికి దగ్గరగా వున్నా ఆశ్చర్యం లేదు. వాళ్లంతా కట్టకట్టుకుని తెరాసకు వ్యతిరేకం అయితే 2014లో తెరాస వంద సీట్లు గెలవగలదా? ఇవన్నీ కెసియార్‌కి తెలియదా?

జర్మనీ జర్మనీ అంటూ రంకెలేసిన హిట్లర్ జర్మన్ కాదు. ఆస్ట్రియా దేశంలో పుట్టాడు. గుర్తుంచుకోండి, ఆస్ట్రియాలో! జర్మనీలో కాదు. అయినా జర్మనీని పాలించాడు. అంతేకాదు, జర్మనీ పాలకుడిగా ఆస్ట్రియాపైకి దండెత్తాడు కూడా. జర్మన్‌లంటే అసలైన ఆర్యులని అంటూ సెమటిక్ జాతులను నాశనం చేశాడు. అయితే అతని రక్తంలో యూదురక్తం కలిసివుందన్న పుకార్లు వున్నాయి. అవి నిజం అయినా కాకపోయినా, హిట్లర్ తన గతాన్ని పాతి పెట్టడానికి చాలా శ్రమే పడ్డాడు. తన తండ్రి వూరిని పెకలించి పడేసి, అక్కడ విలువిద్యాకేంద్రం స్థాపించాడు.

అతడు నియంత కాబట్టి అవన్నీ చెల్లాయి. కెసియార్ ప్రజాస్వామ్యంలో వున్నారు. తన మూలాలు చెరిపివేయలేరు. కెసియార్ తెలంగాణకోసం నిజాయితీగా పనిచేస్తున్నారన్న విశ్వాసం వున్నంతకాలం తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు ఆయన మూలాల

జోలికి వెళ్లరు. కానీ ఆయన ఉద్యమాన్ని సరిగ్గా నడిపించకపోతే మాత్రం యివన్నీ ముందుకు వస్తాయి. రాబోయే తెలంగాణ ఉపయెన్నికలలో తెరాస ఆధిక్యతను తగ్గించడానికి కాంగ్రెస్ యిప్పటికే తెలంగాణ ఉద్యమాన్ని నీరుకార్చింది. ఇక కెసియార్‌ను చక్రబంధంలో యిరికించడం మిగిలింది. మూలాలు వెతికేపని టిడిపికి అప్పగించింది. వారు దీన్ని ప్రచారం చేస్తూ పోవచ్చు. ఇక ఆర్థికపరమైన కేసులు పెట్టడానికి సిబిఐ ఎలాగూ వుంది. కెసియార్ ఆస్తుల విచారణ అంటూ మొదలెడితే చాలు, నిజానిజాలు బయటకు వచ్చేలోగా ఉపయెన్నికలయిపోతాయి. ఇవన్నీ గమనంలో పెట్టుకుని కెసియార్ జాగ్రత్తగా మసలుకోవాలి. ఆయన ఇప్పటికైనా 'సెటిలర్' పదం వాడడం మానేస్తే అంతే చాలు. లేకపోతే 'సెటిలర్స్ సమితి' వారు తమ సంస్థకు అధ్యక్షుడిగా వుండమని కెసియార్‌ను కోరే ప్రమాదం వుంది ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**